# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

## OFFICIAL REPORT

శుక్రవారం, మార్చి 15, 2013

13 వ శా. స. XII సమావేశం, వాల్యూం -- I నంబరు -- 2

శక సంవత్సరం – 1934, ఫాల్గుణం –24

## FRIDAY, THE 15th MARCH, 2013

**13 L.A. XII SESSION, VOL— I No. - 2**

**24 - Phalgun, 1934 - S.E.**

#


శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీ ఆర్.వి. సుజయ కృష్ణ రంగారావు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారాం |
| ఉప కార్యదర్శులు | : | శ్రీమతి వి.గిరిజాసుందరి<br>శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ జి. వెంకటకృష్ణ<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ జె. రామలింగేశ్వర రావు<br>శ్రీ హెచ్. ఎ. షఫీ<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్<br>శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సూరజ్ బహదూర్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీ ఎస్. రామ నరసింహం<br>శ్రీమతి టి. సత్యవేద కుమారి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ బి.ప్రభాకర్ రావు |

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

**( 13వ శాసన సభ )**

**(12వ సమావేశం : రెండవ రోజు)**

**శుక్రవారం, మార్చి 15, 2013**

**సభ ఉ. గం.9.00 లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

# విషయ సూచిక

**1. సభా కార్యక్రమం**
**వాయిదా తీర్మానాల అనుమతించుట గురించి**
2. సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు
3. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించుట గురించి
4. ప్రభుత్వంపై ప్రవేశపెట్టబడిన అవిశ్వాస తీర్మానంపై – చర్చ
5. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్

**&&&&&&&&&**

ఉ.9.00

**ఆంధ్రప్రదేశ్ శాసన సభ**

**శుక్రవారం, మార్చి 15, 2013**

***

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతించుట గురించి

(తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్పీకర్ పోడియం వద్దకు చేరుకున్నారు).

(పోడియం వద్దనున్న తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు "జై తెలంగాణా జై తెలంగాణా" అంటూ నినాదాలు చేయసాగారు)

(అంతరాయం)

MR. SPEAKER: I have received adjournment motions.

1. Adjournment Motion given notice of by :-

Sri S. Venkata Veeraiah Garu and others regarding the need to discuss scarcity of drinking water in rural areas is disallowed.

2. Adjournment Motion given notice of by:-

Sri Etala Rajender Garu and others and
Dr. Nagam Janardhan Reddy Garu regarding the need to adopt a resolution for formation of separate Telangana State is disallowed.

3. Adjournment Motion given notice of by :-

Sri D. Krishna Das Garu and others,
Sri E. Lakshminarayana Garu
Sri Julakanti Ranga Reddy Garu regarding the need to discuss power situation in the State is disallowed.

4. Adjournment Motion given notice of by :-

Sri Akbaruddin Owaisi Garu and others regarding need to discuss scarcity of drinking water particularly in GHMC area is disallowed.

5. Adjournment Motion given notice of by :-

Sri G. Mallesh Garu and others regarding the need to sanction funds to Nakkalagandi reservoir is disallowed.

(పోడియం వద్దనున్న తెలుగుదేశం పార్టీ సభ్యులు "పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి, విద్యుత్ కోతలను ఎత్తివేయాలి, గ్రామాల్లో మంచి నీటి ఎద్దడిని నివారించాలి, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి" అని నినాదాలు చేయసాగారు).

(పోడియం వద్దనున్న తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం "విద్యార్థులు, యువకులు బలిదానాలు చేసుకుంటున్నారు", "రోల్ బ్యాక్.. రోల్ బ్యాక్.." అనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ "జై తెలంగాణా జై తెలంగాణా" అంటూ నినాదాలు చేయసాగారు)

మిష్టర్ స్పీకర్ః దయచేసి సహకరించండి. గౌరవ సభ్యులు ప్రజా సమస్యలపై సభలో చర్చించాలి. Please go back to your seats.

(పోడియం వద్దనున్న తెలుగుదేశం పార్టీ సభ్యులు "పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి, విద్యుత్ కోతలను ఎత్తివేయాలి, గ్రామాల్లో మంచి నీటి ఎద్దడిని నివారించాలి, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి" అని పదే పదే నినాదాలు చేయసాగారు).

మిష్టర్ స్పీకర్ః దయచేసి సహకరించండి.

(పోడియం వద్దనున్న తెలుగుదేశం పార్టీ సభ్యులు "గుక్కెడు మంచినీళ్లు – ఇవ్వాలి", "గుక్కెడు మంచినీళ్లు – ఇవ్వాలి" అనే నినాదాలు చేయసాగారు).

(ఇంతలో ఎంఐఎం పార్టీకి చెందిన సభ్యులు వెల్‌లోకి ప్రవేశించారు).

మిష్టర్ స్పీకర్ః మీకు మాట్లాడే అవకాశం ఇస్తాను. దయచేసి మీ స్థానాల్లో మీరు కూర్చోండి (ఎంఐఎం సభ్యుల నుద్దేశించి). Please go back to your seats. Let us go on with question hour.ప్రధానమైన సమస్యల మీద చర్చించండి. దయచేసి సహకరించండి.

(అంతరాయం)

Minister for Legislative Affairs..

శ్రీ డి. శ్రీధర్‌బాబు (శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి)ః అధ్యక్షా, చాలా రోజుల తర్వాత బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. ప్రజలకు సంబంధించిన అనేక సమస్యల విషయంలో ప్రతిపక్ష పార్టీల సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇస్తుంది. వారిలో కొంత మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టమని కోరుతున్నారు. ఆ విషయంపై కూడా వారికి శ్రద్ధ లేదనుకుంటా. వారికి ప్రజా బలం, సంఖ్యా బలం, విశ్వాసం లేకుండా ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానం పెట్టమని అడగటం ఏమిటి అధ్యక్షా? సభా కార్యక్రమాలకు కావాలని అంతరాయం కలిగిస్తూ ప్రజా సమస్యల మీద చర్చ జరగనీయకుండా చేస్తున్నారు. అధ్యక్షా, విద్యుత్ సమస్యపై సుదీర్ఘమైన చర్చ చేపడుతుందని ప్రభుత్వం సభకు హామీ ఇస్తున్నది. ప్రతిపక్ష నాయకులకు ప్రజా సమస్యల మీద ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా సభలో చర్చకు సిద్ధంగా ఉండాలని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః దయచేసి సహకరించండి. ప్రశ్నోత్తరాల సమయంలోకి వెళదాం. సభా సమయాన్ని వృథా చేసుకోకండి. Please cooperate. దయచేసి మీ స్థానాల్లో మీరు కూర్చోండి. దయచేసి సహకరించండి.

(పోడియం వద్దనున్న తెలుగుదేశం పార్టీ సభ్యులు "మద్యం ఫుల్లు – మంచి నీళ్ల నిల్లు" అంటూ నినాదాలు చేయసాగారు)

మిస్టర్ స్పీకర్ః మీరు (వెల్‌లో నిలబడి ఉన్న ఎంఐఎం సభ్యులను ఉద్దేశిస్తూ) దయచేసి మీ స్థానాల్లో కూర్చోండి.

(పోడియం వద్దనున్న తెలుగుదేశం పార్టీ సభ్యులు "మద్యం ఫుల్లు – మంచి నీళ్ల నిల్లు" అంటూ పదే పదే నినాదాలు చేయసాగారు)

(అదే సమయంలో పోడియం వద్దనున్న తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు "జై తెలంగాణా జై తెలంగాణా – ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర తీర్మానం – ప్రవేశ పెట్టాలి" అని నినాదాలు చేయసాగారు)

మిస్టర్ స్పీకర్ః ముఖ్యమైన ప్రశ్నల మీద ఈ రోజు సభలో చర్చించాలనుకున్నాం. వాటి మీద సభ్యులు మాట్లాడండి. దయచేసి పోడియం, వెల్‌లో ఉన్న సభ్యులందరూ వారి వారి స్థానాల్లోకి వెళ్లండి. దయచేసి సహకరించండి.

(అంతరాయం)

ఇది చాలా బాధాకరం. గౌరవ సభ్యులు దయచేసి సభా సమయాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కొరకు వినియోగించుకోండి. సభను సజావుగా జరగనీయండి. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత సభ్యులు చర్చలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.

(అంతరాయం)

దయచేసి మీ స్థానాలకు వెళ్లండి.

(తిరిగి అంతరాయం)

The house is adjourned to 10.00 am.

(Then the House, at 9-09 am, adjourned to meet again at 10-00 am.)

ఉ.10.00

(The House re-assembled at 10.05 A.M of the Clock of the House and the Hon'ble Speaker was in the Chair.)

(No sooner the House re-assembled than the Hon'ble Members belonging to Telugu Desam Party, YSR Congress Party and the TRS Party rushed towards the Well of the House and began raising slogans.)

MR. SPEAKER: Yes. All the Questions are postponed. All the Papers are deemed to have been laid on the Table of the House.

## సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు

1. 42nd Annual Report of the A.P. State Agro Industries Dev. Corpn., Ltd., for the year ended 31st March, 2011:

   "A copy of the 42nd Annual Report of the Andhra Pradesh State Agro Industries
   Development Corporation Limited for the year ended 31st March, 2011 as required under Section 619-A (2) of the Companies Act, 1956."

2. 35th Annual Report of A.P. Meat Development Corpn., Ltd., for 2011-2012:

   "A copy of the Thirty Fifth Annual Report of the Andhra Pradesh Meat Development Corporation Limited for the year 2011-2012 as required under Section 619-A of the Companies Act, 1956."

3. 35th Annual Report of A.P. State Civil Supplies Corpn., Ltd., for the year 2009-2010:

   "A copy of the 35th Annual Report of the Andhra Pradesh State Civil Supplies Corporation Limited for the year 2009-2010 as required under Section 619-A of the Companies Act, 1956."

4. 38th Annual Report of the A.P. Industrial Infrastructure Corpn., Ltd., for 2010-11:

   "A copy of the 38th Annual Report of the Andhra Pradesh Industrial Infrastructure Corporation Limited for the year 2010-11, as required under Section 619-A of the Companies Act, 1956."

(Interruptions)

MR. SPEAKER: I request you to co-operate. Please go back to your seats. I have got an announcement to make. Please go back to your seats. దయచేసి మీ మీ సీట్లలోకి వెళ్లి కూర్చోండి.

Please go back to your seats. I have got an announcement to make. Please go back to your seats.

(At that point of time the Hon'ble Members standing in the Well of the House went back to their seats.)

SRI P. ASHOK GAJAPATHI RAJU (Vizianagaram): Mr. Speaker, Sir, you have already disallowed the adjournment motions.

(అంతరాయం)

MR. SPEAKER: I emphasize your feelings, Ashok Gajapathi Raju garu. I have already disallowed the adjournment motions. దయచేసి సభ్యులందరూ సహకరించండి. Yes. గౌరవ సభ్యులందరిని కూర్చోమని కోరుతున్నాను. I request the Members to resume their seats. దయచేసి మీ మీ సీట్లలో కూర్చోండి.

(At that point of time the Hon'ble Members standing in the Well of the House went back to their seats.)

## ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించుట గురించి

Reg: Admission of No-Confidence Motion.

MR. SPEAKER: I have received two Notices of Motions of No-Confidence expressing No-Confidence in the Council of Ministers under Rule 75 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly viz., one from Sri E. Rajender and another from Smt. B. Sobha Nagi Reddy requesting to grant leave to move Motion of No-Confidence in the Council of Ministers. Both the Notices are in order and as per the practice and the precedents of this House I will take up first the Notice given notice of by Sri E. Rajender. I request Sri E. Rajender to move the motion of No-Confidence for leave of the House under Rule 75 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly.

SRI E. RAJENDER: Mr. Speaker, Sir, I beg to move:

> "That leave be granted to move the Motion of No-Confidence under Rule 75 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly expressing No Confidence in the Council of the Ministers."

MR. SPEAKER: Motion moved. I request the Members who are in favour of granting for leave to rise in their seats.

(At that juncture the Hon'ble Members belonging to the Parties of YSR Congress, TRS, BJP, CPI and CPI (M) were standing in their seats. At that time some of the Hon'ble Members were moving from their seats.)

I request you to co-operate. Please do not move from your seats. Please co-operate. The Secretary, Legislature is directed to start the counting.

(Interruptions)

ఉ.10.10

I request the Members to exercise some restraint. Please start counting. I request the Members to co-operate. Let the counting go on.

(At that stage counting of the Hon'ble Members who were in favour of the No-Confidence Motion began)

(Interruptions)

I have advised all the Members to co-operate and to show restraint. I have advised all the Members. Please show some restraint.

I request the Members to please resume their seats. The question is:

> "That leave be granted to move the Motion of No-Confidence under Rule 75 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly expressing No Confidence in the Council of the Ministers."

(At that juncture the counting was completed.)

Since 45 Members are in favour of grant of the leave of the House which number is more than $1/10^{th}$ of the total strength of the House the leave is granted.

I adjourn the House for half-an-hour to enable the Business Advisory Committee to meet.

(The House then adjourned at 10.14 A.M)

**ఉ.11.40**

**(విరామానంతరం సభ ఉదయం 11.40 గంటలకు మరల సమావేశమైనది. గౌరవ సభా పతి అధ్యక్ష స్థానంలో వున్నారు.)**

శ్రీ టి.హరీశ్ రావు (సిద్ధిపేట) (మైకు లేకుండా ): సార్, అవిశ్వాస తీర్మానంపై చర్చ ప్రారంభించే సమయంలో గౌరవ ముఖ్యమంత్రి తదితర ముఖ్యమైన వారే సభలోలేరు.

MR. SPEAKER: Now, I will request Sri Rajender Garu to move the Motion of No-Confidence.

SRI E. RAJENDER: Sir, I beg to move:

"That under Rule-75 of the Rules of Procedure and Conduct of Business of Andhra Pradesh Legislative Assembly:

"That the House expresses No-Confidence in the Council of Ministers."

MR. SPEAKER: Motion moved. Now, we will proceed with the discussion on the motion. Rajender Garu, kindly speak on the motion.

SRI E. RAJENDER: Sir, Sri Harish Rao will initiate the discussion.

## ప్రభుత్వంపై ప్రవేశపెట్టబడిన అవిశ్వాస తీర్మానంపై – చర్చ

శ్రీ టి.హరీశ్ రావుః థాంక్యూ సర్. ముందుగా నాకు మాట్లాడడానికి అవకాశమిచ్చినందుకు స్పీకర్ గారికి, మా సభా పక్ష నాయకులు శ్రీ టి.రాజేందర్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ పి.అశోక్ గజపతి రాజుః సర్,

MR. SPEAKER: Ashok Gajapathi Raju garu, with regard to the point raised by you, I will announce it in the BAC meeting. If you want, I can also announce it in the House. I will also circulate a copy to you.

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, ప్రజాస్వామ్య విధానం ప్రకారం మనం ఐదు సంవత్సరాల పాలన కొరకు ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకోగా ఐదు సంవత్సరాలు పూర్తి కాకముందే ఈ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టవలసి రావడం నిజంగా బాధాకరం. అంటే ఈ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను పూర్తిగా మరిచిపోయింది. రాష్ట్రంలో ఈ రోజున ప్రజలు ఎప్పుడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితి వున్నది.

(అధికార పక్ష సభ్యుల నుంచి అంతరాయం )

సార్, నేను మాట్లాడుతున్నప్పుడు అవతలివైపు నుంచి రన్నింగ్ కామెంటరీ చేయడం ఆపితే బాగుంటుంది. అలా రన్నింగ్ కామెంటరీ కనుక చేస్తే నేను ఒకటికి నాలుగు మాట్లాడవలసి వస్తుంది. నేను మాట్లాడేటప్పుడు ఇంటరప్షన్స్ లేకుండా కంట్రోల్ చేయవలసిన బాధ్యత చైర్‌ది. కనుక తమరు మాట్లాడమంటే మాట్లాడతాను. లేదూ కూర్చోమంటే కూర్చుంటాను. నేను చెప్పవలసిన విషయాలు చాలా వున్నాయి. నేను ఇంకా ప్రారంభించక ముందే గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లుగా వాళ్లెవరు చెప్పేది?

(అధికార పక్ష సభ్యుల నుంచి అంతరాయం )

మిస్టర్ స్పీకర్: షో సమ్ రెస్ట్రెయిన్..... దయచేసి సహకరించండి.

శ్రీ టి.హరీశ్ రావు: సార్, రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేనంత సంక్షోభాన్ని ఈ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ఆకాంక్ష నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాళ తెలంగాణా ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ వుంటే, మరొకవైపు ఈ ప్రభుత్వం యొక్క నిర్వాహకాల కారణంగా రాష్ట్ర ప్రజల సమస్యలు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. ప్రజల జీవితాలు దుర్భరంగా మారిపోయిన పరిస్థితులున్నాయి. ఇటువంటి సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి యుద్ధ ప్రాదిపదికన చర్యలు తీసుకోవలసిన ఈ ప్రభుత్వం చేష్టలుడిగిపోయింది. అసలు ఎప్పుడు ఏ ఎమ్మెల్యే ఈ పార్టీలో వుంటాడో, ఏ ఎమ్మెల్యే బయటికి వెళ్లిపోతాడో అర్థం కాని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం కొనసాగుతున్నది. ఇవ్వాళ ఈ ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్రమైన అసహనం, అవిశ్వాసం పెరిగిపోతున్న సందర్భంలో ప్రజల ఆకాంక్షల కోసం ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యత కలిగిన ఒక రాజకీయ పార్టీగా ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేము ఈ రోజు ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవలసి వచ్చింది.

(ఆ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీకి చెందిన సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, ముఖ్యంగా మా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పుట్టిందే తెలంగాణా కోసం. మేం ఈ సభలోకి వచ్చిందే తెలంగాణా రాష్ట్రం కోసం. మేం వేసే ప్రతి అడుగు, మా ప్రతి మాట, మా లక్ష్యం, మా గమ్యం తెలంగాణా రా ష్ట్రం.

(అంతరాయం )

మిస్టర్ స్పీకర్: ప్లీజ్ డోన్ట్ ఇంటరప్ట్ ది మెంబర్.........

శ్రీ టి.హరీశ్ రావు: అధ్యక్షా, కొంత మంది మాట్లాడుతున్నట్లు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు డిమాండు అన్నది ఒక పొలిటికల్ డిమాండు కాదు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు డిమాండు వెనుక ఒక సామాజిక, ఆర్థిక, ఆత్మగౌరవ సమస్యలున్నాయి. ఈ ప్రాంత ప్రజలు తరతరాలుగా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పోరాడుతున్న పోరాటమే ఇవ్వాళ ఈ తెలంగాణా ఉద్యమం. చాలా రోజుల నుంచి ఈ ఉద్యమం కొనసాగుతున్నది. ఇది ఒక ఎడతెగని పోరాటం. ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా, ఎంత మంది ఎన్ని వెన్నుపోట్లు పొడవాలని ప్రయత్నం చేసినా ఈ ఉద్యమం ముందుకు కొనసాగుతున్నదంటే ప్రజలలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పట్ల కలిగిన ప్రగాఢమైన ఆకాంక్ష అని చెప్పకతప్పదు.

సమైక్య రాష్ట్రంలో జరుగుతున్న వివక్ష, దోపిడి, అవమానాలు ఒక ఎత్తయితే, హామీలు, ఒప్పందాలు, జీవోలూ, చట్టాలు, వాటి ఉల్లంఘనలూ, తీర్మానాలు, కమిటీలూ, కాలయాపనలూ ఇవన్నీ ఇంకొక ఎత్తు. ముఖ్యంగా ఇవ్వాళ తెలంగాణా ప్రజలు అధికారిక వ్యవస్థలో తమకు న్యాయం జరగదనే అభిప్రాయానికి వచ్చారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తెలంగాణా ప్రాంత ప్రజలకు న్యాయం జరగడం లేదనే పరిస్థితికి వచ్చారు. స్వరాష్ట్రం కోసం, స్వాభిమానం కోసం ఇవ్వాళ తెలంగాణా ప్రజలు రాజీలేని పోరాటాన్ని చేస్తున్నారు. ఒక కవి అన్నట్లు పక్షి ఎప్పుడూ చెట్టు కొమ్మలను నమ్ముకోదు. తన రెక్కలను నమ్ముకుంటుంది. తెలంగాణా ప్రజలు కూడా ఇవ్వాళ ప్రభుత్వ వ్యవస్థల మీద కన్నా తమ పోరాటాల మీదనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారు. అందుకనే మేం మా పోరాటాలను, ఉద్యమాలను ఉధృతం చేస్తూ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాము. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ఈ ప్రాంత ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ రోజు మేం ప్రయత్నం చేయడం జరుగుతున్నది. ముఖ్యంగా తెలంగాణా ప్రజల పోరాటం ఈనాటిది కాదు. ఆనాటి నిజాం నవాబు మీద మీద ముల్కీ రూల్స్ కోసం పోరాడిన చరిత్ర తెలంగాణా ఉద్యమానికుంది. ఆనాటి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో కూడా ప్రాణాలొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణా ప్రజలది. ఈ రోజున కూడా ఆంధ్ర వలసదారుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగుతున్నాయి. 1956లోనే ఈ తెలంగాణా రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేయడాన్ని తెలంగాణా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ రాష్ట్రాన్ని ఆంధ్రంలో కలపొద్దని జరిపిన పోరాటంలో కూడా ఇదే హైదరాబాదు నగరంలోని సిటీ కాలేజీ దగ్గర జరిగిన ఫైరింగ్‌లో ఇద్దరు యువకులు పోలీసు తూటాలకు తమ ప్రాణాలను సైతం బలి ఇచ్చారు. ఆనాడు తెలంగాణా ప్రజలు ఏ భయాలు, సందేహాలు, అనుమానాలు వ్యక్తం చేశారో అవన్నీ ఈనాడు నిజంగా జరుగుతున్న పరిస్థితులున్నాయి. ఈ రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా, ఎవరు ప్రతిపక్షంలో వున్నా తెలంగాణా ప్రాంతం మాత్రం నిరాటంకంగా దోపిడీకి గురవుతూనే వున్నది. నిజం చెప్పాలంటే నేను చాలా సార్లు ఇదే సభలో మాట్లాడాను. తెలంగాణాకు జరుగుతున్న అనేకమైన అన్యాయాలను లెక్కలతో, ఆధారాలతో, జీవోలతో, సంఖ్యలతో చాలా స్పష్టంగా చెప్పాము. ఎంత చెప్పినా అరణ్య రోదన, కంఠ శోష తప్ప ఈ ప్రాంతానికి న్యాయం జరిగిన పరిస్థితి ఎప్పుడూ లేదు. తెలంగాణా ప్రాంతానికి జరిగిన అన్యాయం గురించి రాస్తే రామాయణమంత, చెపితే భారతమంత అవుతుందని ఎన్నో సార్లు చెప్పాను. ఎంత చెప్పినా తీరనంత బాధ, దుఃఖం ఈ రోజు తెలంగాణా ప్రాంతంలో వుంది.

అసలు నిజంగా చెప్పాలంటే ద్రోహం ముందు పుట్టిందా కాంగ్రెస్ ముందు పుట్టిందా అని చెప్పాల్సివస్తే ద్రోహం కంటే కాంగ్రెసే ముందు పుట్టిందేమో అనిపిస్తుంది. ఎందుకంటే తెలంగాణా ఉద్యమానికి మొదటి నుంచి కూడా ద్రోహం చేస్తూ వస్తున్నటువంటి పార్టీ, ప్రజలకు అన్యాయం చేస్తున్నటువంటి పార్టీ ఇవ్వాళ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణా ప్రజలకు అన్యాయం చేస్తున్న పార్టీ ఇవ్వాళ కాంగ్రెస్ పార్టీ. ఎన్ని ద్రోహాలు, ఎన్ని ధోకాలో చెప్పాలంటే చాంతాడంత అవుతుంది. ఎంత చెప్పినా తీరనంత ద్రోహాలు, ధోకాలు అవుతాయి. ముఖ్యంగా చెప్పాలంటే ఇవ్వాళ తెలంగాణా ఉద్యమానికి ఎన్ని దశాబ్దాల చరిత్ర వుందో కాంగ్రెస్ చేస్తూ వస్తున్న ద్రోహాలకు కూడా అంతే చరిత్ర వుంది. తెలంగాణా ప్రజల మనోభావాలకు భిన్నంగా ఆ రోజున ఫజల్ అలీ కమిటీ చేసిన సిఫార్సులకు విరుద్ధంగా తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్రాలో విలీనం చేసింది కాంగ్రెస్ పార్టీ. రాష్ట్రానికి పేరు పెట్టేటప్పుడు కూడా ధోకా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఆ రోజు రాష్ట్రాన్ని విలీనం చేసేటప్పుడు సెలెక్ట్ కమిటీ తెలంగాణా ఆంధ్ర రాష్ట్రంగా పేరు నిర్ణయించడం జరిగింది. కాని పార్లమెంటులో దానిని బిల్లు రూపంలో తెచ్చేటప్పుడు తెలంగాణా ఆంధ్ర రాష్ట్రం కాస్తా ఆంధ్రప్రదేశ్‌గా మార్చి వేసి ఆనాడే తెలంగాణా అస్థిత్వాన్ని పోగొట్టింది కాంగ్రెస్ పార్టీ.

ఉ.11.50

పెద్ద మనుషుల ఒప్పందాన్ని తుంగలో తొక్కారు. శ్రీ పి.వి. నరసింహా రావు గారు ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు జీ.ఓ.నం. 36 ను జారీ చేశారు. తెలంగాణా ప్రాంతానికి రావలసిన ఉద్యోగాలు రాలేదు. ముల్కీ నిబంధనలను అమలు చేయలేదు. ఆ జోవోను అమలు చేయాలని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా చెప్పింది. దానిని కాలగర్భంలో కలిపారు. రాజ్యాంగాన్ని మార్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉంది. జీ.ఓ.నం. 36 ను అమలు చేయలేదు. ఎన్.టి. రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 1985 డిసెంబర్, 30 న జారీ చేసిన జీ.ఓ.నం. 610 ను ఇప్పటికీ అమలుపరచలేదు. ముగ్గురు ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లతో కమిటీ వేశారు. యాభై తొమ్మిది వేల పైచిలుకు మంది తెలంగాణా బిడ్డలకు దక్కవలసిన ఉద్యోగాలు సీమాంధ్ర వారు చేస్తున్నారు. వారిని తిరిగి పంపించి తెలంగాణా ప్రాంతం వారికి సదరు ఉద్యోగాలివ్వాలని జీవో జారీ చేస్తే, ఈరోజు వరకూ ఆ జీవోను అమలుచేయలేదంటే, ఈ రాష్ట్రంలో మాకు న్యాయం జరుగుతుందా అని అడుగుతున్నాను. జీవోలను అమలుచేయకుండా మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ముల్కీ నిబంధనలను ముంచి, రాష్ట్రపతి ఉత్తర్వులకు విలువ లేకుండా చేసి తెలంగాణా ప్రజల ఉసురు పోసుకున్నది కాంగ్రెస్ పార్టీ. 1969 పోరాటాన్ని రక్తసిక్తం చేసి, 369 మందిని కాల్చి చంపిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణా పోలీసులు, ఈ రాష్ట్ర పోలీసులు ఉద్యమం చేస్తున్న యువకులను చంపరేమోనని కేరళ రాష్ట్రం నుండి మలబార్ పోలీసులను రప్పించి యువకులను కాల్చి చంపించిన ఘనత కాంగ్రెస్ పార్టీది.

అధ్యక్షా, తెలంగణా ప్రజా సమితిని ఆరోజు మర్రి చెన్నారెడ్డి గారు ప్రారంభించారు. అప్పుడు ఇందిరాగాంధీ హవా నడిచింది. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. తెలంగాణా ప్రజలు ముక్తకంఠంతో, తెలంగాణా రాష్ట్రం కావాలని, తెలంగాణా ప్రజా సమితిని ఆ రోజు పూర్తి స్థాయిలో గెలిపించడం జరిగింది. ఈ కాంగ్రెస్ పార్టీ ఆనాడు తెలంగాణా ప్రజా సమితిని ప్రలోభాలకు, ఒత్తిడికి గురి చేసి ప్రజల ఆకాంక్షలను కాలరాసే విధంగా చేసి, ఆ పార్టీని కాంగ్రెస్ పార్టీలో కలుపుకున్నది. ప్రజలిచ్చిన తీర్పును కాలరాసింది కాంగ్రెస్ పార్టీ. వారి ద్రోహాల చిట్టా చదువుతున్నాను. మలి దశ ఉద్యమంలో కేసిఆర్ గారు తెలంగాణా రాష్ట్ర సమితిని ప్రారంభించినప్పుడు, ఇదే సభలో డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రతిపక్షనాయకుడిగా ఉన్నారు, సి.ఎల్.పి కార్యదర్శిగా చిన్నారెడ్డి గారున్నారు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమన్నారు. రాజశేఖర రెడ్డి గారి నాయకత్వంలో ఉన్నటువంటి తెలంగాణా కాంగ్రెస్ లెజిస్లేటర్స్ ఫోరమ్, 42 మంది ఎం.ఎల్.ఏలతో ఢిల్లీకి వెళ్లారు. వారిలో ఇప్పుడు మంత్రులుగా ఉన్నవారు కూడా ఉన్నారు. ఢిల్లీకి వెళ్లి , మాకు తెలంగాణా రాష్ట్రమివ్వాలని సోనియా గాంధీ గారికి మెమోరాండం ఇచ్చారు. అప్పుడు తెలంగాణా రాష్ట్రం తప్ప ఇంకొకటి లేదని చెప్పారు. అప్పుడే టి.ఆర్.ఎస్ పార్టీ పెద్ద ఉద్యమాన్ని సృష్టించింది. గులాంనబీ ఆజాద్ స్వయంగా కేసిఆర్ ఇంటికి వచ్చి మాతో పొత్తుపెట్టుకుంటే తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని నమ్మించారు. తెలంగాణా ఉద్యమాన్ని వాడుకొని, అధికారంలోకి వచ్చి మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ. అధ్యక్షా, స్వయంగా సోనియా గాంధి గారు, కరీంనగర్ బహిరంగసభలో టి.ఆర్.ఎస్ పార్టీ గులాబి కండువాను కప్పుకొని మేము అధికారంలోకి వస్తే తెలంగాణా ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని స్వయంగా గొప్పగా చెప్పుకొని, హామీ ఇచ్చి మాట తప్పారు. యు.పి.ఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో కన్సల్టేషన్స్ ద్వారా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని పెట్టారు. కన్సల్టేషన్స్ జరిగాయి. దాదాపు దేశంలో ఉన్న 36 రాజకీయ పార్టీలు తెలంగాణాకు అనుకూలమని లేఖలిచ్చారు. ఆ లేఖలను స్వర్గీయ జయశంకర్ గారు పుస్తకంలో పొందుపరిచారు. 36 రాజకీయ పార్టీలు అనుకూలంగా చెప్పారు, ఏకాభిప్రాయం వచ్చింది. కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో పెట్టారు, ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించినప్పుడు వారితో చెప్పించారు, ప్రధాన మంత్రి గారు చెప్పారు, ఈ విధంగా మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ. ప్రణబ్‌ముఖర్జీ

కమిటీని వేశారు.  ఆరు వారాల్లో ఆ కమిటీ రిపోర్ట్ ఇస్తుంది, ప్రత్యేక  తెలంగాణా రాష్ట్రం పై నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆరు సంవత్సరాలైనా  ఆ కమిటీ రిపోర్ట్ బయటకి రాలేదు.

(ట్రెజరీ బెంచీల నుండి అంతరాయం)

మిమ్మల్ని నమ్మితే, నమ్మకద్రోహానికి పాల్పడిన చరిత్ర మీది.  నమ్మి మోసపోయాము.  ఎంత దారుణమంటే,  పొత్తు పెట్టుకున్న పార్టీనే  చీల్చే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ పార్టీ.  గెలిచి పొత్తుపెట్టుకుంటే, మా శాసనసభ్యులను ప్రలోభాలకు గురిచేసి, పార్టీని చీల్చే ప్రయత్నం చేసి,  ఉద్యమాన్ని దెబ్బతీసే విధంగా  చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉంది.  2009 ఎన్నికల ముందు రోశయ్య కమిటీని వేశారు.  ఆ కమిటీ ఇంతవరకూ ఒక మీటింగ్‌ని కూడా పెట్టలేదు.  ఆ కమిటీ ఉందో, లేదో తెలియదు.

అధ్యక్షా, మా నాయకుడు కేసిఆర్ గారు 2009 లో  తెలంగాణా రాష్ట్రాన్ని సాధించాలని, తన ప్రాణాన్నే పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షకు పాల్పడ్డారు.  ఆనాడు ఇదే సభలో మాట్లాడుకున్నాము, ఈ సభ ఆరోజు తీర్మానం చేసింది. అప్పటి ముఖ్యమంత్రి అయిన రోశయ్య గారు  అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, నివేదికను కేంద్రానికి పంపించారు.  రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చారు అందులో భాగంగా ఉస్మానియా యునివర్శిటీ విద్యార్థులు, యువకులు అందరూ వచ్చారు. అప్పుడు యు.పి.ఏ ప్రభుత్వం తలవంచి  డిసెంబర్ 9న అర్థరాత్రి ఒక ప్రకటన చేసింది.  ఇప్పటికైనా కాంగ్రెస్ సోయకు వచ్చిందేమో, కాంగ్రెస్ తన  పాపాలను కడుక్కుందని మేము కూడా సంతోషించాము.   కాని, డిసెంబర్, 23న “యూ” టర్న్ తీసుకుంది.  మళ్లీ ప్రకటన చేసి  మోసం చేసింది. జస్టిస్ శ్రీ కృష్ణ కమిటీ అన్నారు.  దాని గురించి హైకోర్టే చెప్పింది. ఇంక నేనేం చెప్పాలి. ఆ వివరాలలోకి వెళ్లడం లేదు.  బోగస్ కమిటీ,  ఏ రకంగా సీక్రెట్ రిపోర్ట్ ఇచ్చిందో దానికి సంబంధించిన కథ, నీతి గురించి  హైకోర్టే చెప్పింది.  కమిటీ రిపోర్ట్ వచ్చింది. అయినా నిర్ణయం లేదు. మళ్లీ  అదే కాల్చివేత, దాటవేత. చివరికి ఒక గొప్ప పోరాటమైన సకల జనుల సమ్మె జరిగింది.  భారత స్వాతంత్ర పోరాటాన్ని  గుర్తించే విధంగా ఆ సమ్మె జరిగింది.  కోట్ల మంది తెలంగాణా ప్రజలు, ఉద్యోగులు, యువకులు, కార్మికులు, ఒక్కరేంటి  మొత్తం తెలంగాణా మహిళా లోకం కూడా రోడ్లపైకి వచ్చి సమ్మెను నిర్వహించారు.  ఆ సమ్మె భారత పార్లమెంట్‌ను కూడా కుదిపేసింది. చివరికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి కూడా జీతం రానటువంటి పరిస్థితి వచ్చిందంటే ఎంత గొప్పగా ఆ సమ్మె జరిగిందో గుర్తుచేసుకోవాలి.  ప్రధానమంత్రి గారు పిలిచారు, హామీ ఇచ్చారు.  డెలిగేషన్‌లో భాగంగా  మేము కూడా వెళ్లాము.  మీరు సమ్మె విరమించండి, ప్రశాంత వాతావరణంలో తప్పకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు.  సమ్మె విరమించాము. మేము ఆశించాము, కాని జరగలేదు. ఎన్నో డెడ్‌లైన్లు. దసరా, బక్రీద్, దీపావళి, రంజాన్  ఈ విధంగా పూటకొక మాట చెబుతూ  మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ.

మ.12.00

అధ్యక్షా, చివరికి ఎఫ్‌డిఐల మీద పార్లమెంట్‌లో ఓటింగ్ జరిగే సమయంలో తెలంగాణా కాంగ్రెస్ ఎంపీలు " మేం ఓటు వేయం. మేం ఒక నిర్ణయం తీసుకుంటాము." అని కేసీఆర్ గారితో చర్చలు జరిపే సమయంలో, తిరిగి అప్పటికప్పుడు మేనేజ్ చేశారు. "లేదు, లేదు. మేం అఖిల పక్షాన్ని మీటింగ్‌కు పిలవబోతున్నాం, మేం నిర్ణయం తీసుకోబోతున్నాం" అని చెప్పి అఖిలపక్షాన్ని ఢిల్లీకి పిలిచారు. అఖిలపక్షాన్ని సమావేశానికి పిలిచి షిండే గారు నెల రోజుల్లో నిర్ణయం తీసుకోబోతున్నామని స్పష్టంగా చెప్పారు. ఆ రోజున చెప్పడమే కాదు. మధ్యమధ్యలో రెండుసార్లు రీఇటరేట్ చేయడం కూడా జరిగింది. కానీ, దురదృష్టమేమంటే... ఈ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్  అయిన గులాంనబీ ఆజాద్ గారు అంటారు – నెలంటే నెలే కాదు, వారమంటే

వారమే కాదు అని అన్నారు. పార్టీ అంటే కాంగ్రెస్ పార్టీ కాదని ఎకసెక్కాలు మేం కూడా మాట్లాడొచ్చు. ఇది ఎంత అన్యాయం అధ్యక్షా? నెలంటే నెల కాదు, వారమంటే వారం కాదని ఒక కొత్త నిర్వచనాన్ని చెప్పి, మళ్లీ ఒక్కసారి తెలంగాణా ప్రజలను మోసం చేసే విధంగా, హేళన చేసే విధంగా మాట్లాడింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పొచ్చు. ఎన్నని చెప్పాలి. ఇవాళ కొత్తగా చెప్పేది కాదు. ఆనాడు డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఇక్కడ ముఖ్యమంత్రిగా వుండి మాట్లాడేవారు. వంద కోట్ల మంది ఒప్పుకుంటేనే తెలంగాణా రాష్ట్రం వస్తుందని మాట్లాడేవారు. తెలంగాణాలో ఎన్నికలు ముగిసిన తరువాత, నంద్యాలకు వెళ్లి అక్కడి సీమాంధ్ర ప్రజలను రెచ్చగొట్టే విధంగా హైదరాబాదుకు పోవాలంటే పాస్‌పోర్టు కావాలి, వీసా కావాలని తెలంగాణా ప్రజలను అవమానపరిచే విధంగా, హేళన చేసే విధంగా మాట్లాడింది రాజశేఖర్ రెడ్డి గారు.

శ్రీ దానం నాగేందర్ః అధ్యక్షా... అధ్యక్షా....

శ్రీ టి. హరీష్‌రావుః మేం ఎవ్వరినీ వదిలిపెట్టం భాయీసాబ్...

میں کانگریس، ٹی۔ڈی۔پی، وائی ایس آر کانگریس پارٹی، کسی کو نہیں چھوڑوں گا۔

తెలంగాణాకు ద్రోహం చేసిన వారు ఎవ్వరైనా మాకు ఒక్కటే. చంద్రబాబు నాయుడైనా, రాజశేఖర్ రెడ్డి అయినా, కిరణ్ కుమార్ రెడ్డి గారైనా అందరూ మాకు ఒక్కటే.

میں کسی کو چھوڑنے والا نہیں ہوں، سب کے بارے میں بولوں گا۔

తొందరపడకుండి.

جلدی کچھ بھی نہیں ہے، مجھے دو گھنٹے بات کرنا ہے، میں سب کے بارے میں پورا نکالوں گا۔

Don't worry.

مجھے بہت ساری باتیں بولنا ہے۔

ఓపిక వుంటే 11 గంటల దాకా మాట్లాడతాను. అంత ఓపిక వుంది. ఇదిగో... సబ్జెక్టంతా పట్టుకుని వచ్చాను. మీరు స్పీకర్ గారికి చెప్పి టైం ఇప్పించండి. చరిత్ర మొత్తం చెబుతాను. మీరు నాలుగు గంటలు సమయం ఇప్పించండి. నాకు మాట్లాడే శక్తి వుంది.

అధ్యక్షా, ఒక నాయకుడు మాట్లాడుతూ తెలంగాణా అంటే బీడీనా, సిగరెట్టా ఇవ్వడానికి అంటాడు. మరొక నాయకుడు మాట్లాడుతూ తెలంగాణా ఇన్‌స్టంట్ కాఫీనా అంటాడు. ఇంకొక నాయకుడు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఇన్‌స్టంట్ దోశా! అని అంటాడు. ఏమిటి సార్ ఇది? తెలంగాణా ఉద్యమం, తెలంగాణా ఆత్మగౌరవ పోరాటం మీకు ఇడ్లీలతోనో, దోశెలతోనో, కాఫీలతోనో పోల్చే విధంగా వుందా? అంటే ఇవాళ ఈ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణా ఉద్యమం పట్ల గాని, ప్రజల పట్ల గాని వుండే దృక్పథం ఇదేనా అని, మాట్లాడే విధానమిదేనా అని అడుగుతున్నాను. ఒక కేంద్ర మంత్రి, ఒక బాధ్యతాయుతమైన స్థానంలో వుండి ఒక నిర్ణయం తీసుకోవాల్సిన మనిషి ఇడ్లీలతోనో, దోశెలతోనో, కాఫీలతోనో, సిగరెట్, బీడీలతోనో తెలంగాణా ఉద్యమాన్ని పోల్చి, తెలంగాణా ప్రజల హృదయాలను గాయపర్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పక తప్పదు. పార్లమెంట్‌లో కూడా మనం చూశాము. ఒక రైల్ యాక్సిడెంట్ జరిగితే భారత పార్లమెంట్ స్పందించి...

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుః అధ్యక్షా.... అధ్యక్షా....

MR.SPEAKER: I will give you the mike. Let him conclude.

శ్రీ టి. హరీష్‌రావుః అధ్యక్షా, ఒక రైల్ యాక్సిడెంట్ జరిగితే దేశంలోని ప్రజానీకమంతా బాధపడి పార్లమెంట్‌లో కూడా రైల్ యాక్సిడెంట్లో చనిపోయిన వాళ్లకు సంతాపం తెలిపారు. దేశంలో ఏ చిన్న ప్రాంతంలో యాక్సిడెంట్ జరిగినా భారత పార్లమెంట్ సంతాపం తెలిపే సాంప్రదాయం మన దేశంలో వుంది. మొన్న కూడా టెర్రరిస్టులు బాంబ్ బ్లాస్టులు జరిపితే సంతాపం తెలిపాము. ఎందుకు బాధ కలుగుతోందంటే... తెలంగాణా ఉద్యమంలో, తెలంగాణా ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకునే క్రమంలో వెయ్యి మంది యువకులు పెట్రోలు పోసుకుని జై తెలంగాణా అంటూ ప్రాణాలు అర్పించారు. కరెంటు తీగలు పట్టుకుని విలవిలా కొట్టుకుంటుంటే జై తెలంగాణా అంటూ ప్రాణాలు అర్పించారు. వంద కిలోమీటర్ల వేగంతో వచ్చే రైలు ముందుకు దుమికి తునాతునకలౌతూ జై తెలంగాణా అంటూ చనిపోయినటువంటి ఒక బాధ తెలంగాణా ఉద్యమంలో వుంది. అలాంటి సందర్భంలో వెయ్యి మంది యువకులు తెలంగాణా ఉద్యమంలో చనిపోతే కనీసం సంతాపం కూడా ఈ సభ తెలపదా? ఏం మేం ఈ రాష్ట్ర పౌరులం కాదా? ఎందుకూ మేం పనికిరామా? ఇవాళ ఈ దేశమంతా, ప్రపంచమంతా సంతాపం చెబుతారు. అలాంటిది ఈ సభలో మేం ఎన్నోసార్లు అడిగాము. తెలంగాణా ఉద్యమంలో అమరులైన వారికి సంతాపం చెబుదాం. ఎవ్వరూ చనిపోవద్దూ అని ఒక ప్రకటన చేద్దాం, వారికి అప్పీలు చేద్దామంటే కూడా ఈ సభ ముందుకు రావడం లేదు.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డిః అధ్యక్షా...

మిస్టర్ స్పీకర్ః ఒక్క నిమిషమండీ... .హరీష్‌రావు గారూ....

శ్రీ టి. హరీష్‌రావుః గండ్ర వెంకట రమణా రెడ్డి గారూ... మధ్యలో ఎందుకు డిస్ట్రబ్ చేస్తారు?

మిస్టర్ స్పీకర్ః గండ్ర వెంకటరమణా రెడ్డి గారూ..

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి (భూపాలపల్లి)ః అధ్యక్షా... గౌరవ సభ్యులు తెలంగాణా ఉద్యమంలో చనిపోయిన యువకుల గురించి సభలో సంతాపం తెలపలేదని చెప్పడం సత్యదూరం. ఈ సభలో గౌరవ ముఖ్యమంత్రి గారు గాని, అందరం కూడా అప్పీల్ చేయడం జరిగింది. చనిపోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని, ఎవ్వరూ ఆత్మహత్యలు చేసుకోరాదని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కూడా ఈ సభ కోరింది. కాంగ్రెస్ పార్టీని కేవలం విమర్శించడానికే వారు ప్రయత్నం చేస్తున్నారు. ఎప్పుడూ లేనటువంటి విషయాలు చెబుతున్నారు. ఎప్పటి నుంచో చరిత్రను కూడా చెబుతున్నారు. వారు చెప్పదల్చుకుంది ఈనాటి ప్రభుత్వం గురించి. 2004 నుండి 2014 వరకు జరిగిన/జరుగుతున్న విషయాలేమైనా వుంటే వాటిని సభ దృష్టికి తీసుకువస్తే బాగుంటుంది. కానీ, లేనటువంటి విషయాలు, పని గట్టుకుని ఎప్పుడో జరిగిన సంఘటనలను గుర్తు చేస్తూ మాట్లాడటం చాలా బాధాకరం. ఒక్క విషయం అడుగుతున్నాను. ఈ రోజు తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే అధికారం ఈ శాసన సభకు వుందా? ఈ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఒకవేళ కేంద్రం నిర్ణయం తీసుకుంటే, దాన్ని బలపరచాలన్నా కూడా ఈ సభ మనుగడలో వుండాలి. మరి ఈ సభ పోయేందుకు అవిశ్వాస తీర్మానం పెట్టి, ఈ విధంగా విమర్శలు చేయడం సరైంది కాదు. దయచేసి సత్యదూరమైన మాటలు మాట్లాడకూడదని కోరుతున్నాను.

శ్రీ టి. హరీష్ రావుః సార్, మా చీఫ్ విప్ గారు సత్య దూరమైన మాటలు మాట్లాడుతున్నారు. ఆయన మంత్రి కావాలని తన్నుకులాడుతున్నాడు. నిన్ననే ముఖ్యమంత్రి గారు కూడా ప్రకటన చేసినట్లు వున్నారు.

MR.SPEAKER: Let's not go into anything personal.

శ్రీ టి. హరీష్‌రావుః మంత్రి పదవి తీసుకో, ఫర్వాలేదు. తెలంగాణా వాళ్లు మంత్రులైతే మేం కూడా సంతోషపడతాం. కానీ వారు ఏమన్నారు? ఎప్పుడో జరిగింది చెప్పడం కాదు అని అంటున్నారు. మరి ఇప్పుడు జరిగింది కూడా చెబుతాను. ఇప్పుడే చెబుతున్నాను. కిరణ్ కుమార్ రెడ్డి గారు వచ్చిన తరువాత కూడా ఏం జరిగిందనేది చెబుతాను. కొంచెం విను.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డిః అధ్యక్షా... వ్యక్తిగతంగా నేను .. మా ముఖ్యమంత్రి గారు....

మిస్టర్ స్పీకర్ః దయచేసి కూర్చోండి. Let him conclude.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డిః అధ్యక్షా, ఈ సభలో మంత్రి కావాలంటే కనీసం ఎమ్మెల్యే కావాలి. ఇక్కడ సభ్యుడు కావాలి. సభ్యుడు కాకుండా, పెద్దలు కేసీఆర్ గారి ఆశీర్వాదంతో, ఆ రోజున కాంగ్రెస్ పార్టీలోని ముఖ్యమంత్రి గారి సహకారంతో వారైతే మంత్రి అయ్యారు. నేను ప్రస్తుతం ఎమ్మెల్యేను. గతంలో ఎంఎల్‌సి గా పని చేశాను. పార్టీలో చాలా ఏళ్లు పని చేశాను. ముఖ్యమంత్రి గారు అనుకుంటే నేను మంత్రిని కాగలను. అంతే గానీ, మంత్రి కావాలని ఇట్లా మాట్లాడుతున్నాడని అనడం మాత్రం బాధాకరం, అలా మాట్లాడటం మంచి పద్ధతి కాదు.

MR.SPEAKER: Let's avoid anything personal.

శ్రీ టి. హరీష్‌రావు ః అధ్యక్షా, నేను వెంకట రమణా రెడ్డి గారికి ఒక్క విషయం చెప్పదలుచుకున్నాను. తెలంగాణా ఉద్యమం వుంది కాబట్టే ఆ చీఫ్ విప్ పదవి మీకు దొరికింది రమణన్నా! ఎందుకంటే, మేం ఈ అంశాన్ని లేవనెత్తాం. ఈ రాష్ట్రంలో ౽౽౽***

MR.SPEAKER: Harish Rao Garu.. you must withdraw your words.

శ్రీ టి. హరీష్ రావుః నేనేం తప్పు చెప్పాను సార్. తప్పు చెబితే చెప్పండి. If I am wrong, ౽౽౽ తెలంగాణా వారికి ఏం పదవులిచ్చారని మేము ప్రశ్నిస్తే, తప్పని సరి పరిస్థితుల్లో చీఫ్ విప్ పదవి మీకు వచ్చింది. ౽౽౽

మిస్టర్ స్పీకర్ః ఒక్క నిమిషం కూర్చోండి. That is not correct. ముఖ్యమంత్రి గారూ...

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి (ముఖ్యమంత్రి)ః అధ్యక్షా, టిఆర్ఎస్ వాళ్లు నో కాన్ఫిడెన్స్ మోషన్ పెట్టారు. దాని గురించి మాట్లాడమనండి. వ్యక్తిగత విషయాల్లోకి వెళితే చాలా కష్టం. ఇక్కడ ఎవ్వరూ కూడా మీ దయాదాక్షిణ్యాల వల్ల మంత్రులు కాలేదు. నేను ముఖ్యమంత్రి అయ్యానంటే కాంగ్రెస్ పార్టీ వల్ల... మా సభ్యులున్నాం కాబట్టి అయ్యాం. అక్కడ కూర్చున్న స్పీకర్ గారు ఎన్నుకోబడ్డ స్పీకరు. మీ దయాదాక్షిణ్యాల వల్ల

*** Expunged as ordered by the Chair.

స్పీకర్ కాలేదు. పీసీసీ అధ్యక్షుడిని మా పార్టీ డిసైడ్ చేస్తుంది. మా దయాదాక్షిణ్యాల వల్లే నువ్వు మంత్రి అయ్యావు, రాజకీయాల్లోకి వచ్చావు. నీకు భిక్షం పెట్టాము. అందుకనే నువ్వు మంత్రి అయ్యావు. అది మర్చిపోవద్దు. నేరుగా మీరు నో కాన్ఫిడెన్స్ మోషన్‌పైన మాట్లాడండి. ఎంత వరకైనా మాట్లాడండి. మేం సమాధానం చెబుతాము. ఇక్కడ జరగాల్సిన అంశంపైన, లేక ప్రభుత్వంపైన పెట్టిన నో కాన్ఫిడెన్స్ మోషన్‌పైన జరిగే చర్చలో మీరడిగే అన్ని ప్రశ్నలకు జవాబిచ్చేందుకు మేం సిద్ధంగా వున్నాము. మీరు ఏమేం చేశారో అది కూడా చెప్పేందుకు సిద్ధంగా వున్నాము.

మ.12.10

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, నేను డీవియేట్ కావడం లేదు. రమణారెడ్డి గారు లేచి మా ముఖ్యమంత్రి గారి దయ ఉంటే నేను మంత్రి అవుతానన్నారు. అన్నా, మీరు తెలంగాణ దయవల్ల తెలంగాణ ఉద్యమం వల్ల, మేం తెలంగాణ గురించి ప్రశ్నించడం వల్ల నీవు చీఫ్ విప్ అయ్యావని చెప్పాను. అది వాస్తవం. ఇవాళ తెలంగాణ ఉద్యమం ప్రశ్నించింది గనుకనే డిప్యూటీ ముఖ్యమంత్రి పదవి అయినా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఇచ్చారు. ఇన్ని సంవత్సరాల నుంచి ఎపుడైనా తెలంగాణాకు డిప్యూటీ ముఖ్యమంత్రి పదవి తెలంగాణవారికి ఇచ్చారా? ఇవాళ ***[•••] ప్రాంతానికే ఇచ్చారు.

MR.SPEAKER: You leave it at that.

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, నేను ఇపుడు చెప్పిన దాంట్లో తప్పు ఉంటే మీరు తొలగించండి. Am I wrong? నేను తప్పు మాట్లాడితే చెప్పండి. ముఖ్యమంత్రి గారు అంటున్నారు..........

MR.SPEAKER: I have already told to expunge them. You can't cast aspersions on the Chair. I have already expunged.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తిని దేశానికి ప్రధానమంత్రిని చేసింది. అది మరచిపోకండి. దేశానికి ప్రధానమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉంది.

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, పాపం మాజీ ప్రధానమంత్రి గారికి కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో బొంద పెట్టడానికి గజం జాగా కూడా కేటాయించని చరిత్ర ఉంది. మాజీ ప్రధానమంత్రి శవాన్ని హైదరాబాదుకు తీసుకొచ్చి ఇక్కడ కాలిస్తే ఆ శవం కూడా బాధతో సగమే కాలింది. మాజీ ప్రధానమంత్రి తెలంగాణ బిడ్డ కనుక మీ కాంగ్రెస్ పార్టీ వారికి ఇచ్చిన గౌరవం ఏమిటంటే వారి శవాన్ని ఢిల్లీలో తగలపెట్టడానికి అవకాశం కూడా ఇవ్వని చరిత్ర మీ కాంగ్రెస్ పార్టీకి ఉంది.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః అధ్యక్షా, పి.వి.నరసింహారావు గారి కుటుంబంతో మాట్లాడిన తర్వాత మాత్రమే వారి మృతదేహానికి ఇక్కడ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయడం జరిగింది. వారి కుటుంబంతో మాట్లాడిన తర్వాతే చర్యలు చేపట్టాం. తెలంగాణ ప్రాంతానికి చెందిన స్వర్గీయ పి.వి.నరసింహారావు గారి మీద ప్రస్తుతం అసెంబ్లీలో మాట్లాడం చూస్తుంటే వారు వారి పట్ల చూపించే గౌరవం తెలుస్తుంది. వారిపై మీకున్న గౌరవం ఇదేనా? వారికి ఎవరిని ఎలా గౌరవించాలో తెలియదు, నోటికి ఏది వస్తే అది మాట్లాడం వారికి అలవాటు

[•••] Expunged as ordered by the Chair.

అయింది. పివి నరసింహారావు గారిని తెలంగాణ నుంచి దేశానికి ప్రధానమంత్రిని కాంగ్రెస్ పార్టీ చేస్తే వారి గురించి చులకనగా ఇపుడు సభలో ఇలా మాట్లాడే హక్కు మీకుందా అని అడుగుతున్నాను.

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, ఇపుడు ఎవరు నా ప్రసంగానికి అంతరాయం కలిగించినా నేను అందుకు సమాధానం చెప్పాల్సిన అవసరముంది. వారు మధ్యలో జోక్యం చేసుకొని ఒకటి అంటే నేను రెండు చెప్పాల్సిన అవసరముంది. మీరు నన్ను చెప్పనివ్వాలి. పి.వి.నరసింహారావు గారు మా తెలంగాణ బిడ్డ కనుకనే వారి గురించి గర్వంగా చెబుతున్నాను. ఈ సభలో ఒక విషయం చెప్పాలి. ఆ రోజు కూడా చెప్పాం. మా పి.వి.నరసింహారావు గారిని అవమానపరచిన రోజునే చెప్పాం. ముఖ్యమంత్రి గారిని ఒకటే అడుగుతున్నాను. వారి పట్ల మీకు నిజంగా ప్రేమ ఉంటే, చనిపోయిన మాజీ ప్రధానులకు ఢిల్లీలో ఘాట్లు నిర్మించినట్లుగా పి.వి.నరసింహారావు గారికి కనీసం గుంటెడు జాగా అయినా ఢిల్లీలో కేటాయించారా? కనీసం ఘాట్ అయినా నిర్మించారా? ఆయనకు మీరిచ్చే గౌరవం ఇదేనా? ఇటీవల పి.వి.నరసింహారావు గారి జయంతి జరిగిందనుకుంటాను. ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే ఒక ప్రైవేట్ పత్రికా సంస్థ ఒక కార్యక్రమం నిర్వహించి ఆహ్వానిస్తే మీరు వెళ్లారు. వారి జయంతి రోజును కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మరచిపోయింది. వారి మీద గౌరవం ఉంటే గాంధీభవన్‌లో చిన్న కార్యక్రమమైనా చేయలేదు. కానీ ఒక పత్రికా సంస్థ వారి జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తే అక్కడికి వెళ్లి దండ వేసిన పరిస్థితి. కాబట్టి మా తెలంగాణకు చెందిన వ్యక్తి అయిన పి.వి.నరసింహారావు గారిపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవం ఏ పాటిదో అర్థమవుతుంది. ఇంతకు ముందు ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వ దయాదాక్షిణ్యాల వల్ల నేను మంత్రినయ్యానని అన్నారు. తెలంగాణ ఉద్యమంవలన, తెలంగాణ ప్రజల దయాదాక్షిణ్యాలవల్ల కాంగ్రెస్ పార్టీకి మేం జీవం పోశాం. ఆ రోజు తెలుగుదేశం పార్టీ చేతిలో చావుచచ్చి రెండు సార్లు ఓడిపోయి దిక్కులేని పరిస్థితుల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జీవం పోసింది తెలంగాణ ఉద్యమం, తెలంగాణ ప్రజలు తప్ప మీరు కాదని మనవి చేస్తున్నాను.

(అంతరాయం)

MR.SPEAKER: Please show some restraint.

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు మా ప్రాంతానికి చెందిన విద్యార్థులు, యువకులు చనిపోతే కనీసం ఈ సభ సంతాపం చెప్పలేదు, తీర్మానం చేయలేదు. ఇప్పటికైనా నేను మనవిచేస్తున్నాను. వారిని గౌరవించాలంటే ఒక తీర్మానం చేద్దాం, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేద్దామని మరొకసారి కోరుతున్నాను. అదే విధంగా ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. మన రాష్ట్రం ఒకటే, ప్రభుత్వం ఒకటే, ముఖ్యమంత్రిగారు కూడా ఒకరే. ఈ రాష్ట్ర పౌరులందరి ప్రాణాలకు ఒకే విలువ ఉండాలి. కానీ సింగరేణి కాలరీస్‌లోని బొగ్గు బావిలో ఒక కార్మికుడు చనిపోతే అయిదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్‌లో కార్మికుడు చనిపోతే ఇరవై లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నారు. రాష్ట్రం ఒకటే, ప్రభుత్వం ఒకటే, ముఖ్యమంత్రి ఒకరే అయినపుడు చనిపోయినవాడు కార్మికుడే అయినపుడు ఆంధ్ర ప్రాంతంలో కార్మికుడు చనిపోతే ఇరవై లక్షల ఎక్స్‌గ్రేషియా, తెలంగాణ ప్రాంతంలో సింగరేణి సంస్థలో కార్మికుడు చనిపోతే అయిదు లక్షల రూపాయలా? ఏమిటి సార్ ఇది?

శ్రీ డి.నాగేందర్ (కార్మిక శాఖా మంత్రి)ః అధ్యక్షా, హరీశ్ రావు గారికి ఒక విషయం చెబుతాను. నేను కూడా కొన్ని కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా ఉన్నారు. సంస్థలలో ప్రమాదాలలో, అనుకోని పరిస్థితుల్లో కార్మికులు చనిపోయినపుడు కార్మికశాఖ చట్టాలలోని క్లాజుల ప్రకారం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చే సంప్రదాయం ఉంది. అది ఆనవాయితీగా వస్తుంది. అవసరాలకు అనుగుణంగా చట్టాలకు సవరణలు

చేసిన సందర్భాలు శాసనసభలో చాలా ఉన్నాయి.  చట్ట పరిధిలో ఉన్నంతవరకు పరిహారం అందిస్తారు తప్ప ప్రాంతాలను బట్టి ఎక్స్‌గ్రేషియా ఇవ్వరు.  ఆయా కంపెనీల ప్రొఫైల్ చూసి, ఆ కంపెనీలో ఉన్న పెట్టుబడులను, ఆ సంస్థ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని చనిపోయిన కార్మికుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా వస్తుంది.  ప్రధానంగా ఆయన మాట్లాడుతూ చాలా విషయాలు చెప్పారు.  ఆ విషయాలలోకి నేను తర్వాత పోతాను.

(శ్రీ టి.హరీశ్ రావు నుంచి అంతరాయం)

I am not deviating.  వారి పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును ఒకసారి చూస్తే తెలంగాణ గురించి ఒక మాట కూడా లేదు.  శాసనసభ్యుడిగా ఆయనకు ఆ హక్కు ఉంది.  ఆయన ఇచ్చిన మోషన్ చూస్తే "This House expresses no confidence in the council of Ministers" అని ఇచ్చారు.  అవిశ్వాస తీర్మానం ఇచ్చినపుడు తెలంగాణ గురించి అందులో ఎక్కడా కూడా ప్రస్తావించలేదు.  మాట్లాడేటప్పుడు మాత్రం తెలంగాణ గురించి మాట్లాడుతున్నారు.  వారిది రెండు నాల్కల ధోరణి.  అవిశ్వాస తీర్మానం మీద ఒకటి ఉంటుంది, ఈ సభలో మాట్లాడుతూ ఇంకొకటి చెబుతున్నారు.  జరిగిన సంఘటనల గురించి చాలా చెబుతారు.  నేను తరవాత సరైన సమయంలో వాటి గురించి  చెబుతాను.  అపుడు మాకు అవకాశం ఇవ్వాలి.

శ్రీ టి.హరీశ్ రావు: అధ్యక్షా, వారు మాట్లాడిన ప్రతి విషయానికి నేను సమాధానం చెబుతాను.  చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా విషయానికొస్తే వైజాగ్‌లోని స్టీల్ ప్లాంట్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, సింగరేణి సంస్థ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ.  రెండూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే. రెండు సంస్థల్లో ప్రభుత్వ భాగస్వామ్యం ఉంది.  అక్కడ కార్మికుడు చనిపోతే ఎక్స్‌గ్రేషియా ఇరవై లక్షల రూపాయలు, ఇక్కడ కార్మికుడు చనిపోతే అయిదు రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నందుకు వారికి కూడా ఎక్స్‌గ్రేషియా ఇరవై లక్షల రూపాయలు ఇవ్వమనడం తప్పా? మా తెలంగాణలో సింగరేణి బొగ్గు బావిలో కార్మికులు ప్రాణాలకు తెగించి బొగ్గు వెలికితీస్తే విద్యుదుత్పత్తి జరిగి మనం ఎ.సి.లు, ఫ్యాన్లు వేసుకొని కూర్చుంటున్నాం, ఈ దేశానికి అన్నం దొరుకుతుంది.  బొగ్గు బావి కార్మికులకు ఎందుకు అన్యాయం చేస్తారు?  వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఇచ్చినట్లుగా సింగరేణి కార్మికులు ప్రమాదంలో చనిపోతే ఇరవై లక్షలు ఇస్తామని నాగేందర్ గారు చెప్పి ఉంటే కృతజ్ఞతలు చెప్పేవాడిని.  కానీ ఇలా అడ్డంగా మాట్లాడతారని నేను అనుకోలేదు.   కార్మిక శాఖ మంత్రి కార్మికుల పక్షాన మాట్లాడాలి కానీ నన్ను దారి తప్పించే విధంగా, నన్ను కౌంటర్ చేసే విధంగా నాగేందర్ గారు మాట్లాడడం బాధాకరం.  ఇప్పటికైనా మీరు సింగరేణి కార్మికులు ప్రమాదాల్లో చనిపోతే ఇరవై లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెబితే మీకు  హుందాతనం పెరుగుతుంది తప్ప తగ్గదు.

మ.12.20

అధ్యక్షా, రెండవ విషయం. ఇవాళ మీరు అవిశ్వాస తీర్మానంలో తెలంగాణ గురించి ఇవ్వలేదు అని అంటున్నారు. అసలు టిఆర్ఎస్ పార్టీ తరఫున కేసీఆర్ గారు గాని, మేం గాని ఎక్కడన్నా లేచి నిలబడ్డామంటే తెలంగాణా కోసమేననేది మేం చెప్పుకోవాల్సిన అవసరం లేదు. మేం మాట్లాడితే తెలంగాణా, నిలబడితే తెలంగాణా, కూర్చుంటే తెలంగాణా. మేం ఏం చేసినా తెలంగాణానే. మేం ఏం చేసినా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. అధ్యక్షా, ఇది గత చరిత్ర. తెలంగాణాకు సంబంధించి జరిగిన చరిత్ర.

మా  దానం నాగేందర్ గారు అన్నారు. మొత్తం తెలంగాణా గురించే చెప్పావు... జర వేరే కూడా చెప్పన్నా అని అన్నాడు. అది కూడా చెబుతాను. ఆనాడు 2008లో ఇదే సభలో అప్పుడు స్పీకర్‌గా సురేష్ రెడ్డి గారు ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణా ఇవ్వనందుకు నిరసనగా, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సభ

నుండి బయటకు వెళ్లాలనుకున్నాము. ఆ రోజున నాకు మాట్లాడేందుకు అవకాశమిస్తే, ఇదే సభలో గంటసేపు తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని గురించి, తెలంగాణా ప్రాంతానికి జరుగుతున్న వివక్షతను గురించి చెప్పాము. అయితే, ఆ రోజుకు, ఈ రోజుకు తేడా ఏం లేదు. ఆ రోజున రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కడప జిల్లా పులివెందులలో ఒక మెడికల్ కాలేజీ, కడప జిల్లాలో యోగి వేమన యూనివర్సిటీ, పులివెందులలో ట్రిబుల్ ఐటీకి చెందిన యూనివర్సిటీని పెట్టారు. పులివెందులకు నాలుగు లేన్ల రహదారిని కూడా వేశారు. చివరికి హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌ని కూడా పులివెందులలో పెట్టారు. శిల్పారామం కూడా అక్కడికి తీసుకుపోయారు. రాజశేఖర్ రెడ్డి గారి పరిపాలనలో కడప జిల్లాను పండించాలి, కడుపు నింపాలన్నది ఆ రోజున జరిగింది. ఈ రోజున కిరణ్ కుమార్ రెడ్డి గారు చేస్తున్నది కూడా అంతే.. ముఖ్యమంత్రులు మారినా, వారి ఆలోచనలో మార్పు లేదు. అంటే మనుషులు మారుతున్నారు తప్పితే, ఈ దోపిడీ మాత్రం ఆగడం లేదు. కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత జీఓ నెం.27, తేదీ.29.12.2012 న ఇచ్చారు. ముఖ్యమంత్రి గారికి ఈపాటికే అర్థమయ్యుంటుంది. ఎందుకంటే ఆ జీఓని వారే ఇచ్చారు. మంచి నీళ్ల త్రాగడం కోసం చిత్తూరు జిల్లాకు రూ.7,390 కోట్లు ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో వుండే ప్రతి గ్రామానికి మంచినీరు త్రాగిస్తానని చెప్పి సింగిల్ స్ట్రోక్‌లో రూ.7,390 కోట్లు చిత్తూరు జిల్లాకు ఇచ్చారు. నేనేమంటున్నానంటే....

శ్రీ దానం నాగేందర్ః అందులో తప్పేముంది....

శ్రీ టి. హరీష్‌రావుః అందులో తప్పేముంది అని మా నాగేందర్ అన్న అంటున్నాడు. మధ్యలో వస్తే నేను చాలా విషయాలు చెప్పాల్సి వుంటుంది. మా సునీతక్క ఇక్కడుంది. మా కిష్టారెడ్డి సాబ్ కూడా వున్నాడు. 2008లో రాజశేఖర్ రెడ్డి గారు మెదక్ జిల్లాకు వచ్చి, నాలుగు నియోజకవర్గాల్లోని 900 గ్రామాలకు మంచినీరు ఇస్తానని చెప్పి కొబ్బరికాయ కొట్టాడు. 2008 నుండి ఇప్పటికి ఐదేళ్లు అయిపోయింది. ముఖ్యమంత్రి గారు మా జిల్లాకు రాగానే మా అక్క గాని, కిష్టారెడ్డి అన్న గాని, మా మంత్రులు గాని దండం పెడతారు. అన్నా! మాకు మంచినీళ్లు వస్తల్లేవే... 900 ఊర్లే. మంజీరాకు పక్కపొంటినే వుంది మెదక్ జిల్లాలో. జర ఏమన్నా పైసలియ్యంటే రూ.10 కోట్లిస్తరు. రూ.20 కోట్లు, రూ.50 కోట్లిస్తరు. ఇట్లా మొత్తం ఎంతిచ్చిర్రయ్యా అంటే రూ.180 కోట్లు. రఫ్లీ రూ.200 కోట్లిచ్చిను. ముగ్గురు ముఖ్యమంత్రులు మారి, ముప్పై సార్లు దండం పెట్టుకుని అడిగితే తేపకి రూ.10 కోట్లు ఏదో భిచ్చమేసినట్లు ఇస్తారు. కానీ, అదే కిరణ్ కుమార్ రెడ్డి గారు రూ.7,390 కోట్లు కేటాయిస్తూ, ఫేజ్-1 క్రింద రూ.5990 కోట్లు, ఫేజ్-2 లో రూ.1490 కోట్లు కేటాయించారు. దీన్ని అర్జంట్‌గా నిర్మాణం చేయాలని ఏం చేశారంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ డిపార్టుమెంటు ద్వారా పనులు చేయించారు. ప్రత్యేకంగా చట్టాలన్నీ కూడా పోయి... పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ అందర్ని కలుపుకుపోయారు. చిత్తూరు జిల్లాకు మీరు సేవ చేయండి. సంతోషం. నేనేం వ్యతిరేకం కాదు. రాజశేఖర్ రెడ్డి గారు వున్నంతకాలం కడపను పండించి కడుపు నింపి, మరి నువ్వున్నంత కాలం చిత్తూరు జిల్లాను పండించి నీ పనులు నువ్వు చేసుకుంటే, తెలంగాణా ఏమై పోవాలి? మా బ్రతుకులేమై పోవాలి? మా జిల్లాలేమై పోవాలి? తెలంగాణాలో మేం నీరు త్రాగడానికి మాత్రం పది, పది రూపాయలు మీరు బిచ్చమేస్తారు. మీరేమో వేల కోట్ల రూపాయలతో జీఓలు తీసుకుంటారు. కాబట్టి, మా తెలంగాణా ఎమ్మెల్యేలు ఇప్పుడు మాట్లాడాలి. తెలంగాణా అక్కలు, అన్నలు, మంత్రులు జర మాట్లాడితే మేం సంతోషపడతం.

శ్రీ తూర్పు జయప్రకాశ్ రెడ్డిః అధ్యక్షా...

మిస్టర్ స్పీకర్ః మైకిస్తానండీ. I will give you an opportunity. దయచేసి కూర్చోండి.

SRI. T. HARISH RAO: Sir, I am not yielding. జీఓ నెం.1197, తేదీ.06.10.2012. ఈ జీఓలో ఆర్ అండ్ బి డిపార్టుమెంటు ద్వారా రూ.147 కోట్లు ముఖ్యమంత్రి గారు చిత్తూరు జిల్లాలో....

శ్రీ తూర్పు జయప్రకాశ్ రెడ్డిః అధ్యక్షా.... అధ్యక్షా...

MR. SPEAKER: One second. I will give you an opportunity again. Please resume your seat.

SRI. T. HARISH RAO: Sir, I am not yielding.... I am not yielding... This is not the way. అవిశ్వాస తీర్మానం మీద నోటీసు ఇచ్చిన పార్టీకి ఇన్నిసార్లు ఇంటరప్షన్సా సార్? ఇదేం పద్ధతి సార్. అవిశ్వాస తీర్మానం మీద మాట్లాడే పార్టీకి...

MR. SPEAKER: I will give you an opportunity again. Please resume your seat.

శ్రీ టి. హరీష్‌రావుః సార్, జీఓ నెం.1197, తేదీ.06.10.2012....

శ్రీ తూర్పు జయప్రకాశ్ రెడ్డిః అధ్యక్షా.... అధ్యక్షా...

మిస్టర్ స్పీకర్ః నేను మీకు అవకాశం ఇస్తాను. దయచేసి కూర్చోండి. Definitely, I will give you an opportunity. Please resume your seat.

శ్రీ టి. హరీష్‌రావుః సార్, జీఓ నెం.1197, తేదీ.06.10.2012 ద్వారా ముఖ్యమంత్రి గారు చిత్తూరు జిల్లా ఉత్సవాలు జరిపారు. మా కాకతీయ ఉత్సవాలు వరంగల్‌లో జరుపుతామంటే డబ్బులు ఇవ్వడానికి మనస్సు రాదు. కానీ, చిత్తూరు జిల్లా ఉత్సవాల ముగింపు సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి గారు రూ.6000 కోట్ల వరాలు ప్రకటించారు. ఎందుకంటే మంత్ర దండం వారి చేతిలో వుంది కదా! ఆ విధంగా ప్రకటించి... వారికింకా ప్రేమేమంటే మా ముద్దుకృష్ణమ నాయుడు గారున్నారు, మా గోపాల కృష్ణారెడ్డి గారున్నారు, చంద్ర బాబు నాయుడు గారు కూడా అక్కడే వున్నారు. వారి గొప్పతనమేమంటే ప్రతిపక్షాలను కూడా కలుపుకుని పోతారు. అందరికీ ఇస్తారు. కానీ, ఒక్క తెలంగాణాకు మాత్రం ఇవ్వరు. ఆ జీఓలో రూ.140 కోట్లిస్తే, 14 నియోజకవర్గాలుంటే, ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్లకు స్పెషల్ జీఓలు కేవలం రోడ్లకోసం ఇచ్చారు. రేణిగుంట-నాయుడు పేటను జాతీయ రహదారిగా మార్చుకున్నారు. రాయచోటి-అంగల్లును జాతీయ రహదారిగా మార్చుకున్నారు. మా తెలంగాణాలో జాతీయ రహదారులకు దరఖాస్తులు పెడితే మాత్రం మా ఎంపీలు తన్నుకులాడినా, అవి మాత్రం కదిలాడనివ్వరు. తరువాత, రాజశేఖర్ రెడ్డి గారున్నప్పుడు జెఎన్‌టియు కాలేజీని తీసుకెళ్లి కడపలో పెట్టుకున్నారు. వీరు (శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి) రూ.198 కోట్లతో కలికిరికి ఒక జెఎన్‌టియు కాలేజీని తీసుకెళ్లారు. అయితే, ఇక్కడ నేనేమంటున్నానంటే మీరు కాలేజీలు తీసుకుపొండి సంతోషమే. కానీ, నేను అడిగేదేమంటే రాయలసీమలో నాలుగు జిల్లాలుంటే, అక్కడ మూడు జెఎన్‌టియులు వున్నాయి. అలాగే, తెలంగాణాలో పది జిల్లాలుంటే మాక్కూడా 8 జెఎన్‌టియులుండాలి కదా అంటున్నాను.

శ్రీ కె. పార్థసారధిః మెదక్‌లో ఐఐటి వుంది కదా?

శ్రీ టి. హరీష్‌రావుః మాక్కూడా 8 జెఎన్‌టియులు వుండాలంటున్నాను. మెదక్‌లో వుండటం కాదు. ఐఐటిలో అడ్మిషన్ మనకు దొరకదు. ఐఐటిలో ఉద్యోగం దొరకదు, అడ్మిషన్ దొరకదు. అక్కడ నేషనల్ లెవల్‌లో రిక్రూట్‌మెంట్, సెలక్షన్ వుంటుంది. అదే జెఎన్‌టియు మా ప్రాంతంలో వస్తే మా పిల్లలకు ఉద్యోగాలు దొరుకుతాయి, చదువుకోవడానికి సీట్లు దొరుకుతాయి. రాయలసీమలో మూడు జెఎన్‌టియులున్నాయి. అనంతపూర్‌లో ఒకటి వుంది. రాజశేఖర్ రెడ్డి గారు ఒకటి కడపలో పెట్టుకున్నారు, కిరణ్ కుమార్ రెడ్డి గారు ఒకటి చిత్తూరులో పెట్టుకున్నారు. మా తెలంగాణా పది జిల్లాల్లో రెండే జెఎన్‌టియులున్నాయి. ఒకటి హైదరాబాదులో, మరొకటి మా డిప్యూటీ సీఎం గారు హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు చూశారు కనుక ఒకటి మాకు వచ్చిందని అనుకుంటాను. నేనేమంటున్నానంటే నాలుగు జిల్లాలుండే రాయలసీమలో మూడు జెఎన్‌టియు కాలేజీలు వుంటే, పది జిల్లాలుండే తెలంగాణాలో ఎనిమిది జెఎన్‌టియు కాలేజీలు వుండాలని అడుగుతున్నాను. ఆ విధంగా ఎనిమిది జెఎన్‌టియు కాలేజీలు ఎందుకివ్వలేదని నేను అడుగుతున్నాను.

శ్రీ తూర్పు జయప్రకాశ్ రెడ్డిః అధ్యక్షా...

మిస్టర్ స్పీకర్ః దయచేసి ఒక్క నిమిషం కూర్చోండి.

శ్రీ టి. హరీష్‌రావుః అధ్యక్షా, I am not yielding. I am not yielding... ఇది సాంప్రదాయం కాదు. నేను మాట్లాడిన తరువాత వారికి ఎంత సేపైనా ఇచ్చుకోండి. ఇది మంచి సాంప్రదాయం కాదు.

మిస్టర్ స్పీకర్ః దయచేసి ఒక్క నిమిషం కూర్చోండి.

శ్రీ టి. హరీష్ రావుః మీరు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. I am sorry to say this.

మిస్టర్ స్పీకర్ఃతూర్పు జయప్రకాశ్ రెడ్డి గారూ... మాట్లాడండి.

శ్రీ తూర్పు జయప్రకాశ్ రెడ్డి (సంగారెడ్డి)ః అధ్యక్షా, వీళ్లు మొదటి నుండి కూడా... టిఆర్‌ఎస్ పార్టీకి సంబంధించి కేసీఆర్ గారు కాని, వాళ్ల కుటుంబ సభ్యులు కాని మాటలు ఎక్కువ, పని తక్కువ. మాటల గారడీతోనే తెలంగాణా ప్రజలను మోసం చేస్తున్నారు. తెలంగాణా ప్రజలను మోసం చేసి బ్రతుకుతున్న పార్టీ అది. నేనేమంటున్నానంటే....

శ్రీ టి. హరీష్ రావుః అధ్యక్షా....

శ్రీ తూర్పు జయప్రకాశ్ రెడ్డి ః కూర్చోవయ్యా.... సార్, మెదక్ జిల్లా గురించి వారు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి, ముఖ్యమంత్రి గారి గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ గారు కేంద్రంలో లేబర్ మినిస్టర్‌గా వున్నారు. టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా వున్నప్పుడు, నేను కేసీఆర్ గారితో అన్నాను. లేబర్ మినిస్టర్‌గా తెలంగాణా ప్రాంతంలో వున్న ఇండస్ట్రీలన్నింటికీ తిరగండి. కార్మికులకు న్యాయం చేయండి అని కోరాను. బీడీ కార్మికులకే కాదు, బిహెచ్ఇఎల్, ఇక్రిశాట్ లేదా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ.. ఇలా వర్క్ లోడ్ మీద కార్మికులకు ఉద్యోగాలు వస్తాయి. యాక్టును మార్చండి అని కోరాను. తెలంగాణా ప్రాంత నాయకుడు అయిన కేసీఆర్ లేబర్ మినిస్టర్‌గా వున్న రోజున, ఒక్క రోజైనా తెలంగాణాలో వున్న ఒక్క ఇండస్ట్రీలో అయినా పర్యటన చేయలేదు. ఇంతకన్నా దురదృష్టం ఏముంటుంది?

మ.12.30

అధ్యక్షా నేనేమంటున్నానంటే ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు వచ్చిన తరువాత మెదక్ జిల్లాకు ఇరిగేషన్ మీద ఉప ముఖ్యమంత్రి గారు, మంత్రులు, ఎంఎల్ఏలం అందరం కలిసి చెరువులు, కుంటల కోసం రూ.5,000 కోట్ల ప్యాకేజీ ఇవ్వమనంటే ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించారు. అక్కడ పనులు కూడా నడుస్తున్నాయి. సార్, మెదక్ జిల్లా గురించి టిఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారు. ఆరోజు ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఐఐటి ఇస్తే మెదక్ జిల్లాకు వద్దు అని చెప్పిన చరిత్ర ఇదే కెసిఆర్, కెసిఆర్ అండ్ ఫ్యామిలీకి ఉంది.

శ్రీ ఈటెల రాజేందర్ (హుజూరాబాద్): అధ్యక్షా, మేము మాట్లాడుతున్నది మీరిచ్చిన జీఓల గురించి. అవి వాస్తవమా, కాదా చెప్పమనండి. సభలో లేని వాళ్ల గురించి ప్రస్తావించడం సంస్కారమా అని నేను ప్రశ్నిస్తున్నాను. రెండవ విషయం.....

(ట్రెజరీ బెంచెస్ నుంచి గౌరవ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

మిస్టర్ స్పీకర్: మెంబర్స్ స్పెసిఫిక్‌గా నేమ్ చేసినప్పుడు అవకాశం ఇవ్వాల్సి వస్తున్నది. Let us not deviate.

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, కెసిఆర్ గారు లేబర్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు ఈ రాష్ట్రంలో ఉన్న బీడీ కార్మికుల కోసం 45,000 ఇళ్లు తెచ్చిన ఘనత ఆయనది. మరచిపోకూడదు. అదే కెసిఆర్ గారున్నప్పుడు ఈఎస్ఐ హాస్పిటల్ వచ్చింది. ఆ హాస్పిటల్‌లో ఎవరు వెళ్లినా చేర్చుకోవడానికి ఆస్కారం ఉంటుంది. అధ్యక్షా, ప్రావిడెంట్ ఫండ్ ఆఫీసును కరీంనగర్‌కు తెచ్చిన ఘనత కెసిఆర్‌ది. కెసిఆర్ గారు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లాలో మొట్ట మొదటి సారిగా ఆడబిడ్డలు వేరే చోటకు వెళ్లకుండా ఇంటింటికీ నీళ్లిచ్చిన చరిత్ర కెసిఆర్ గారిది. ప్రజల కష్టాల గురించి, ప్రజల సమస్యల గురించి కన్‌సర్న్ ఉన్నది మీకు కాదు, మాకు. అది మరచి పోకూడదు. ఈ రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా ఇంటింటికి నీళ్లిచ్చిన ఘనత కెసిఆర్ గారిది అనే విషయం మరచి పోకండి.

శ్రీ సి.దామోదర్ రాజ నర్సింహ (ఉప ముఖ్యమంత్రి): అధ్యక్షా, గత 9 సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలన ప్రధానంగా సంక్షేమం, అభివృద్ధి అనే అంశంపైనే దృష్టి కేంద్రీకరించింది. మిత్రుడు హరీష్ రావు గారు మెదక్ జిల్లా గురించి ప్రస్తావించారు. మెదక్ జిల్లా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా సాంకేతిక విద్య పట్ల సానుకూల దృక్పథంతో, వ్యవసాయ రంగానికి సంబంధించి మొట్ట మొదటి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజీ తెలంగాణా ప్రాంతంలోని మెదక్ జిల్లాలో స్థాపించడం జరిగింది. రూ.345 కోట్లతో జెఎన్‌టియు కాలేజీని మెదక్ జిల్లాలో, అంథోల్ నియోజక వర్గంలోని సుల్తాన్‌కూరులో స్థాపించడం జరిగింది. తెలంగాణాలోని గ్రామీణ ప్రాంతంలో మొట్ట మొదటి సారిగా మహిళా పాలిటెక్నిక్ కాలేజీని స్థాపించడం జరిగింది. అక్కడ జనరల్ పాలిటెక్నిక్ కాలేజీతో బాటు మహిళా పాలిటెక్నిక్ కాలేజీని స్థాపించడం జరిగింది. దానికి తోడు ఈ మధ్యనే సింగూరు దగ్గర ట్రిపుల్ ఐటీని స్థాపించడానికి గౌరవ ముఖ్యమంత్రి గారు అంగీకరించారు. ఈ రకంగా వివక్షత లేకుండా ఏ ప్రాంతంలో, ఏ జిల్లాలో ఏది అవసరముందో దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తున్నది. ఈ మధ్యనే రూ.19 కోట్లతో మెదక్ జిల్లాలోని సిద్ధిపేటలో పీజీ కాలేజీని మంజూరు చేయడం జరిగింది. ప్రాంతాలు, జిల్లాలతో నిమిత్తం లేకుండా ఎక్కడ ఏ అవసరముందో, ఆ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవహరిస్తున్న విషయాన్ని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను.

శ్రీ టి.హరీష్ రావుః సార్, మా డిప్యూటీ సిఎమ్ గారు బాగా చెప్పారు. నేనేమంటున్నానంటే లెక్క ఎంత వచ్చింది? నాలుగు జిల్లాలు ఉన్న రాయలసీమలో మూడు గవర్నమెంటు జెఎన్‌టియులు ఉన్నప్పుడు పది జిల్లాలు ఉండే తెలంగాణాకు ఎనిమిది జెఎన్‌టియులు కావాలని నేను అడిగాను. వద్దంటారేమో మా దామోదర్ రాజ నర్సింహ గారిని చెప్పమనండి. నేను అడిగిన దాంట్లో తప్పుంటే నేను కూర్చుంటాను. నాలుగు జిల్లాలు ఉన్నటువంటి రాయలసీమలో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. పది జిల్లాలు ఉండే తెలంగాణాలో మూడు జిల్లాల్లోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. మనకు కూడా పది రావాలని అంటున్నాను. వద్దంటారేమో మా డిప్యూటీ సిఎమ్ గారిని చెప్పమనండి. అధ్యక్షా, హైదరాబాద్‌లో ఉన్నవన్నీ ప్రైవేటు మెడికల్ కాలేజీలు. గవర్నమెంటు మెడికల్ కాలేజీ వస్తే 2,000 మందికి ఉద్యోగాలొస్తాయి. పేద ప్రజలకు ఆ ప్రాంతంలో కార్పోరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుంది. ఆ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. నాలుగు జిల్లాలు ఉండే సీమలో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, తొమ్మిది జిల్లాలుండే ఆంధ్ర ప్రాంతంలో విశాఖపట్టణం, కాకినాడ, శ్రీకాకుళం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరులలో మెడికల్ కాలేజీలున్నాయి. కానీ మా తెలంగాణా విషయానికొస్తే హైదరాబాద్‌లో రెండు మెడికల్ కాలేజీలున్నాయి. అవి కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం పెట్టలేదు. ఎప్పుడో 1935 సంవత్సరంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ వచ్చింది. 1955వ సంవత్సరంలో గాంధీ మెడికల్ కాలేజీ వచ్చింది.

ఈరోజు నేనంటున్నది, సమైక్య రాష్ట్రంలో తెలంగాణాకు దక్కింది ఒకే ఒక్కటి అదిలాబాద్ జిల్లా మెడికల్ కాలేజీ మాత్రమే. కాకతీయ మెడికల్ కాలేజీ కూడా సమైక్య రాష్ట్రంలో రాలేదు. కాకతీయ మెడికల్ కాలేజీ– అక్కడుండే కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులందరూ ఇంటింటా డబ్బులు వేసుకుని కాలేజీ పెట్టుకుంటే తరువాత ప్రభుత్వం తీసుకున్నది.  సమైక్య రాష్ట్రంలో తెలంగాణాకు దక్కింది ఒక్కటే అదిలాబాద్ జిల్లా మెడికల్ కాలేజీ. నిజామాబాద్ మెడికల్ కాలేజీకి ఇంకా అనుమతి రాలేదు. ఆ కాలేజీ విషయంలో తెలంగాణా ఉద్యమం మిమ్మల్ని అసెంబ్లీలో పట్టుకుని ప్రశ్నిస్తే ఆ ఫైలు కదిలింది. బయట ఛ • నిలదీస్తే, అసెంబ్లీలో ప్రశ్నిస్తే తెలంగాణాలో నిజామాబాద్ కాలేజీ ఇప్పుడు రాబోతున్నది.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః సార్, ఆయన భాషను మార్చుకోమనండి. ఆయనకు భయపడి ఎవరూ ఇవ్వడం లేదు. తెలంగాణా ప్రాంతంలో అవసరముందని ఇస్తున్నాము. ఆయన ప్రాంతంలో కూడా రూ.19 కోట్లు ఇచ్చింది అక్కడ అవసరం ఉందని. ఆయన ఛ ఇచ్చామంటే..... ఆయనేమన్నా ఛఛ •• ఏమిటి ఈ భాష? గవర్నమెంటులో ఉన్నప్పుడు ఏ ప్రాంతానికి ఏది అవసరమో చూసి ఇస్తాము. అది మీకు భయపడి మేము ఇస్తామనుకుంటే ఛఛ

(ఈ సందర్భంలో టిఆర్ఎస్ సభ్యులు తమ స్థానాల ముందు నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయసాగారు – శ్రీ ఈటెల రాజేందర్ మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

MR.SPEAKER: Leave it at that. కూర్చోండి.

• Withdran by the Member

•• Withdran by the Chief Minister

మ.12.40

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, మా సభ్యులను ఉద్దేశించి ౣౣ •• అని గౌరవ ముఖ్యమంత్రి గారు అన్నారు. వారి ఒక్క నియోజకవర్గం ప్రజలు ఓట్లు వేస్తేనే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారా అధ్యక్షా? లెక్కలతో సహా.. ప్రజాస్వామ్యంలో ప్రజా జాగిరి ఇది. ఇవి ప్రజల పైసలు. మనం కేవలం వాటిని చూసేటువంటి సేవకులం మాత్రమే అనే విషయాన్ని మార్చిపోవద్దు. మనం సేవకులం మాత్రమే అధికారులం కాదు. మన చేతిలో ఏమిలేదు. ఆ విషయాన్ని మార్చిపోవద్దని ముఖ్యమంత్రి గారికి తెలియజేస్తున్నాను. ఈ రోజు 70 శాతం పన్నులను కట్టేది తెలంగాణా ప్రాంతమని మీ రికార్డుల్లో ఉంది. మీ దయాదాక్షిణ్యాల మీద మేము బ్రతకడం లేదు – మా దయాదాక్షిణ్యాల మీద – మా ప్రజల పన్నుల మీద – మా ప్రజల డబ్బుతో మీరు సోకులు చేస్తున్నారు. సొమ్ము తెలంగాణా ప్రజానీకానిది సోకులు మీవని తెలియజేస్తున్నాను.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు వెల్‌లోకి వచ్చి ౣౣ అనే మాటను విత్‌డ్రా చేసుకోవాలి, ముఖ్యమంత్రి గారు సభకు క్షమాపణ చెప్పాలి అంటూ అంతరాయం కలిగించసాగారు)

MR.SPEAKER: Please go back to your seats.

( సభలో అంతరాయం )

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, we are not rulers, just we are serving the people. రాగద్వేషాలు లేకుండా ప్రాంతాలకు, కులాలకు అతీతంగా నేను ప్రజలకు సేవ చేస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి గారు, తెలంగాణా ప్రాంతానికి ఒక్క పైసా కూడా ఇవ్వనని ప్రకటించే అధికారం వారికి ఉన్నదా అని అడుగుతున్నాను. తక్షణమే క్షమాపణ చెప్పాలి. మా శాసన సభ్యులను పట్టుకొని ౣౣ అని మాట్లాడతారు. మేము డబ్బులు ఇవ్వమని ప్రకటిస్తారు. ఆ మాటలను తక్షణమే వాపస్ తీసుకోవాలి. ఈ సభకు క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి గారిని డిమాండ్ చేస్తున్నాను.

(అంతరాయం)

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి : అప్పుడు సబ్జెక్ట్ ఏమి జరుగుతోంది అధ్యక్షా . ఆదిలాబాద్‌కి ఒక మెడికల్ కాలేజ్ ఇచ్చాము. నిజామాబాద్‌కి ఇస్తే కాలర్ పట్టుకొని ఇప్పించాం అన్నారు. కాలర్ పట్టుకుంటే, భయపడి ఈ ప్రభుత్వం పని చేస్తుందనుకుంటున్నారా? అందుకనే నేను చెప్పిందేమంటే.. కాలర్ పట్టుకొని బలవంతం చేస్తే ఇచ్చారనేది పొరపాటు, ౣౣ మాదిరిగా మాట్లాడొద్దు, మీరు ఆ విధంగా మాట్లాడారు కాబట్టి, మేము భయపడి ఇస్తున్నామనే అభిప్రాయం మీకు ఉంటే, మీకు ఒక్క రూపాయి కూడా ఇవ్వము ఏమి చేస్తారని అని ఆ విధంగా చెప్పాను.

నేను కూడా హైదరాబాద్ గడ్డ మీద పుట్టాను. హైదరాబాద్ గడ్డ మీద చదివాను. హైదరాబాద్ గడ్డ మీద పెరిగాను. నన్ను బెదిరించే ౣౣౣ ••• నీ దగ్గర లేదు. భయపడే వాడ్ని కాదు. తెలంగాణా ప్రాంతం మీద ప్రేమతో.. ఇక్కడ వెనుకబాటుతనం ఉన్నదని దానిని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకొని పని చేస్తున్నాను.

•• Withdran by the Chief Minister

••• Expunged as ordered by the Chair.

నేను వచ్చిన తర్వాత ఎన్ని వేల కోట్లను మెదక్ ప్రాంతానికి ఇచ్చామో, మహబూబ్ నగర్ ప్రాంతానికి ఇచ్చామో, ఖమ్మం ప్రాంతానికి ఇచ్చామో చెబుతాను. దయచేసి మాటలు సక్రమంగా మాట్లాడండి. తెలంగాణా జిల్లాల్లో ఎన్ని సార్లు పర్యటించానో ఒక్కసారి ఆలోచించండి. వెనుకబడిన ప్రాంతానికి, పేద ప్రజలకు సహాయం చేయాలి, అట్టడుగున ఉన్న ప్రజానీకాన్ని ముందుకు తీసుకురావాలని నేను ప్రయత్నం చేస్తున్నాను. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన మంత్రులు ఎమ్మెల్యేలతో కలిపి మాకు తెలంగాణా నుంచి 50 మంది పైన ఉన్నారు. మీకు 10 మంది ఉన్నారు. అది కూడా అలయన్స్ లేకుండా ఎప్పుడూ గెలవలేదు. We are the true representatives of Telangana. తెలంగాణా ప్రాంతానికి మా సభ్యులు అసలైన శాసన సభ్యులు వారికి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు. వారిని అభివృద్ధి చేయడం మా కర్తవ్యం. తప్పకుండా అభివృద్ధి చేస్తాం. ఈ ప్రభుత్వంలో మొదటి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజీని మెదక్ ప్రాంతానికి ఇచ్చాము. ఆ రోజు ప్రభుత్వంలో మెదక్ ప్రాంతానికి ఐఐటిని ఇచ్చాము. మెదక్ ప్రాంతానికి జెఎన్‌టియుని కూడా ఇచ్చాము. సాగు నీరు, త్రాగు నీటిని ఇస్తున్నాం. అదే విధంగా చిత్తూరు జిల్లాలో గుక్కెడు త్రాగు నీటికి ఇబ్బందికరంగా ఉందని నీరిస్తే పొరపాటా? చిత్తూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లేదా? చిత్తూరు జిల్లాలో త్రాగు నీటికి ఎంత ఇబ్బంది పడుతున్నారో ఒక్కసారి చూస్తే మీకు తెలుస్తుంది. సాగు నీరు గురించి మాట్లాడలేదు. కేవలం త్రాగు నీరు గురించే మాట్లాడుతున్నాను. వేల కోట్ల రూపాయలను సాగు నీరు కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణా ప్రాంతంలో ఖర్చు పెడుతుంది. త్రాగు నీటికి కూడా ఖర్చు పెడుతున్నాం. ఇవన్నీ ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నాం తప్ప, ఎక్కడైనా వివక్షత గానీ లేక ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనగానీ మాకు లేదు. కొన్ని ఇబ్బందులు ఉన్న పరిస్థితుల వల్ల, రాయలసీమ ప్రాంతం చదువు పైన ఆధారపడి ఉన్నది. వేరే ఆస్తులు మాకు లేవు. రాయలసీమలో మేము కేవలం చదువులతోనే బ్రతుకుతున్నాము.

మ.12.50

అన్ని ప్రాంతాలకంటే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలే చాలా వెనుకబడి ఉన్నాయని, తెలంగాణ ప్రాంతం చాలా అభివృద్ది చెందిందని శ్రీకృష్ణ కమిటీ చెప్పింది కాబట్టి శ్రీ కృష్ణ కమిటీ రిపోర్ట్ గురించి మీరు మాట్లాడరు. ఎప్పుడైనా తెలంగాణ ప్రాంతానికి అన్యాయం చేసే పరిస్థితులు ఉండవు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి గత ముప్పై సంవత్సరాల నుంచి మన రాష్ట్రం ఏ ఇతర రాష్ట్రంతో అగ్రిమెంట్ కాలేదు. అటువంటిది మహారాష్ట్రతో అగ్రిమెంట్ కుదుర్చుకొని పదహారు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నాం. తెలంగాణ నాయకులు వారు చేసే ఉద్యమాల వల్ల తెలంగాణలో పుట్టిన పిల్లలకు చదువు రాకుండా చేస్తున్నారు.

(టి.ఆర్.ఎస్ సభ్యుల నుంచి అంతరాయం)

MR.SPEAKER: I am giving mike to Mr.Rajender. Please sit down. I am giving mike to him only. Pease sit down. Yes, Rajender Garu.

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, ముఖ్యమంత్రి గారిని వారి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడం తప్పని మేం అనడం లేదు కానీ సమైక్య రాష్ట్రంలో సమ ధర్మం పాటిస్తారా లేదా అని మాత్రమే అడుగుతున్నాం. అంతే కాకుండా ముఖ్యమంత్రి గారు గుర్తు పెట్టుకోవలసిన విషయమేమిటంటే ప్రతిపక్షాలకు సంబంధించి ఎవరు మాట్లాడినా, సూచనలు, సలహాలు చేసినా అంతిమంగా నిర్ణయం తీసుకొని చేయవలసిన బాధ్యత ప్రభుత్వాల మీదనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం వల్ల ఉద్యోగాలు కోల్పోయారని అంటున్నారు. తెలంగాణ ఉద్యమం వల్ల ఉద్యోగాలు కోల్పోతే మీరు అధికారంలో ఉండి ఎట్లా అనుమతించారని అడుగుతున్నాను.

తెలంగాణ ఉద్యమం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే విషయాన్ని చెప్పినప్పటికీ, ఎవరి దయాదాక్షిణ్యాల మీద మేం బ్రతకాల్సిన అవసరం లేదు, మా తెలంగాణ మాకిస్తే మా పిల్లలకు మేమే చదువు చెప్పుకుంటాం, మా పంట పొలాలలో మేమే పంటలు పండించుకుంటామని ప్రజలే అంటున్నారు. యాభై ఆరు సంవత్సరాల చరిత్రలో తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు ముఖ్యమంత్రులుగా రాష్ట్రాన్ని పరిపాలించింది కేవలం ఆరు సంవత్సరాల మూడు నెలలు మాత్రమే. జలగం వెంగళరావును పక్కకు పెడితే ప్రతి ముఖ్యమంత్రిని ప్రతి సందర్భంలో మత కలహాలు సృష్టించింది కాంగ్రెస్ పార్టీకి చెందిన సీమాంధ్రులు కాబట్టే యాభై ఆరు సంవత్సరాల చరిత్రలో యాభై సంవత్సరాలు పరిపాలించింది సీమాంధ్రులే. కిరణ్ కుమార్‌రెడ్డి గారు సీమాంధ్రకు చెందిన వారు కాబట్టే రూ.7,500/- కోట్లు కేటాయించుకున్నారు. గతంలో సీమాంధ్రకు చెందిన వారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వచ్చింది. మా తెలంగాణ ప్రాంతాన్ని ఎండబెట్టి మీరు పోలవరాన్ని ఎందుకు కడుతున్నారంటే సీమాంధ్రకు చెందిన ముఖ్యమంత్రి ఉన్నారు. రాయలసీమ, కోస్తా ప్రాంతాలలో తట్టెడు బొగ్గు కూడా దొరకదనే ఉద్దేశంతో ఆర్.టి.పి.పి. పెట్టుకున్నారంటే సొమ్ము మాది సోకులు మాత్రం మీవని అర్థం అవుతున్నది కాబట్టే మీ ఆధిపత్యాన్ని, మీ అహంకారాన్ని భరించలేకనే మా తెలంగాణ మాకివ్వమని ఉద్యమం చేస్తున్నాం. నేను గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నదేమిటంటే వారు మాట్లాడిన పదాలను వెంటనే విత్‌డ్రా చేసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

MR.SPEAKER: Yes, Harish Rao Garu.

శ్రీ టి. హరీశ్ రావు: అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు బ్లాక్‌మెయిల్ చేసే విధంగా మాట్లాడారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మంచివి కావు. వారు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాబట్టి చాలా హుందాగా వ్యవహరించాలి తప్ప తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించననే విధంగా మాట్లాడం సరైంది కాదు కాబట్టి ఆ వ్యాఖ్యలను వెంటనే రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరమున్నది. నేను మాట్లాడేటప్పుడు ఏమన్నానంటే తెలంగాణ ఉద్యమం బయట కాలర్ పట్టుకొని నిలదీస్తుంటే ఈ ప్రభుత్వం తలవంచుకునే పరిస్థితి ఉన్నదని మాత్రమే చెప్పాను తప్ప నేను కాలర్ పట్టుకుంటానని మాత్రం అనలేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి గారు తెలంగాణ వాదులు ఈ విధంగా మాట్లాడితే తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించమని అన్నారు. అంటే తెలంగాణ ప్రజల అంతు చూస్తామనే ధోరణి ముఖ్యమంత్రి గారి మాటలను బట్టి అర్థమవుతున్నది. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇటువంటి మాటలు మాట్లాడటం సరైన పద్ధతి కాదు. అందువల్లనే వారు తెలంగాణ ఉద్యమాన్ని తెలంగాణ విద్యార్థులు చేసే పోరాటాన్ని అవమానపరచే విధంగా ఈ రోజు మాట్లాడారు. ముఖ్యమంత్రి గారు తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడిన మాటలను ముందు విత్‌డ్రా చేసుకోవాలని నేను మీ ద్వారా డిమాండ్ చేస్తున్నాను.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి: అధ్యక్షా, నేను భయపడే వాడిని కాదు, బెదిరిస్తే పారిపోయేవాడిని అంతకంటే కాదు. తెలంగాణ వాదులు ఎంత గట్టిగా భయపెట్టడానికి ప్రయత్నిస్తే అంతకంటే గట్టిగా ఉంటాను, మేం ఎవర్ని చూసి భయపడాల్సిన అవసరం లేదు. వెనుకబాటుతనం తెలంగాణలో ఉన్నది కాబట్టి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పాం తప్ప మమ్మల్ని భయపెట్టించడానికి మేం డబ్బు ఇచ్చామని అంటే అటువంటి భయాందోళనలకు నేను లొంగకపోవడంతోబాటు నేను ఒక్క రూపాయి కూడా ఇవ్వనని మాత్రమే అన్నాను. అది కూడా నేను కేవలం హరీశ్ రావు గురించి మాత్రమే మాట్లాడాను. మా ప్రభుత్వం మెదక్ జిల్లాలో రూ.350 కోట్లు వెచ్చించి లక్ష ట్రాక్టర్లను మ్యాన్యుఫ్యాక్చరింగ్ చేసే యూనిట్‌కు రెండు సంవత్సరాల క్రితమే ఫౌండేషన్ వేశారు. రెండు సంవత్సరాల తర్వాత ఈ మధ్యనే దానిని ప్రారంభించడం జరిగింది. చిత్తూరు జిల్లాలో రూ.1500 కోట్లు వెచ్చించి లక్ష కార్లను మ్యాన్యుఫ్యాక్చర్ చేసే యూనిట్‌ను ఈరోజు మిత్సుబిషి కంపెనీతో

ఇంకొక పదిహేను నిమిషాలలో  అగ్రిమెంట్ ఎంటర్ అవుతున్నదని సభాముఖంగా సభ్యులకు తెలియజేస్తున్నాను.

అంతే కాకుండా ఎయిర్‌పోర్టు పక్కన విమానాలలో ఉపయోగించే వింగ్‌లను  తయారు చేసే యూనిట్‌ను కూడా ప్రారంభం చేశాం. రంగారెడ్డి జిల్లాలో హెలికాప్టర్లను తయారుచేసే యూనిట్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. మేం అన్ని ప్రాంతాల అభివృద్ధిని  దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ఏ కంపెనీ పెట్టడానికి అనువుగా ఉన్నదనేది దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేయడం జరుగుతున్నది. మొట్ట మొదటిసారిగా కార్ల మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఈ రాష్ట్రంలో స్థాపించడానికి మిత్సుబిషి కంపెనీ అగ్రిమెంట్ కుదుర్చుకుంటుందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

మ.1.00

మిస్టర్ స్పీకర్: హరీష్ రావు గారు మీరు మాట్లాడండి.

శ్రీ ఇ.దయాకర్ రావు: సార్, మాకు అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్: ఇస్తానండి. I will give you. He is just completing, I will give you an opportunity Dayakar Rao garu. Yes, Harish Rao garu please continue.

శ్రీ టి.హరీష్ రావు: సార్, ముఖ్యమంత్రి గారు ఆ మాటలను విత్‌డ్రా చేసుకోవాలి.

MR.SPEAKER: I will examine the records. No, I will examine the records.

SRI N.KIRAN KUMAR REDDY: I have already said. నేను ఇంతకు ముందే చెప్పాను. నా భావనంతా హరీష్ రావు గారి పైనే  ఉంది. ఎందుకంటే, మేం కాలర్ పట్టుకొని పనులు చేయించామని మాట్లాడారు. ఆ మాటలను ఆయన  వ్యక్తిగతం వరకే  నేను ఆ విధంగా  చెప్పడం జరిగింది. If Harish Rao is hurt, I will withdraw it. నేనేమి పట్టింపులకు పోయే వాడిని కాను. దయచేసి  సభా సాంప్రదాయాలను గౌరవించుకుని మనం మాట్లాడుకుంటే బాగుంటుందని మరొకసారి వారికి తెలియజేస్తున్నాను. అలాగాకుండా మర్యాద కోల్పోయి మాట్లాడితే, అది సమంజసం కాదు. సభలో హుందాగా మాట్లాడుకోవాల్సిన అవసరం గౌరవ సభ్యులందరికీ ఉందని మరొకసారి తెలియజేస్తున్నాను.

(అంతరాయం)

MR.SPEAKER: Let us go into the debate.

(అంతరాయం)

MR.SPEAKER: I am assuring the House that I will go through the records and if anything is found objectionable, I will sit with the Member and make necessary deletions. Yes, now leave it at that. హరీష్ రావు గారు మీరు మాట్లాడండి.

శ్రీ టి.హరీష్ రావు: సార్, నేను ఇప్పటి వరకు కేవలం 20% మాత్రమే మాట్లాడాను. ఇంకా 80% వరకు మాట్లాడాల్సి ఉంది. ఈ విధంగా నేను మాట్లాడే సమయంలో డిస్టర్బ్ చేస్తే మాట్లాడాల్సిన సమయం పెరుగుతుంది. ప్రాధాన్యత క్రమంలో కేటాయింపులు జరుగుతున్నాయని, చిత్తూరు జిల్లాకు మంచినీళ్లు తీసుకుపోతే అది తప్పా అని ముఖ్యమంత్రి గారు మాట్లాడారు.

సార్, నేను ఏమంటున్నానంటే, రూ.7,390 కోట్లు చిత్తూరు జిల్లాకు ఖర్చు చేసి, మా నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య వల్ల తాగునీరు లేక, ప్రజలు గుడ్డి వాళ్లై పోతున్నారు, కుంటి వాళ్లై పోతున్నారు, అవిటి వాళ్లై పోతున్నారు, కాళ్లు, చేతులు వంకరైపోతున్నాయి, కేటాయింపుల్లో పదవ వంతైనా నల్లగొండ జిల్లాకు ఖర్చు పెట్టొచ్చు కదా! కేటాయింపుల్లో పదో శాతమైనా మెదక్ జిల్లాకు ఖర్చు చేయొచ్చు కదా! ప్రతి సంవత్సరం వర్షా కాలంలో ఆదిలాబాద్ జిల్లాలో అంటువ్యాధుల బారినపడి, సురక్షితమైన త్రాగునీరు అందక పోవడం వల్ల వందలాది మంది ప్రజలు చనిపోతున్నటువంటి పరిస్థితి ఉంది. ఆ విషయాల్ని నేను సభలో ప్రస్తావిస్తుంటే, ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, మేం అట్లానే నిధుల్ని తీసుకుపోతాం, మీరేమి చేసుకుంటారో చేసుకోండి, మా పద్ధతింతే అనే ధోరణితో వారు మాట్లాడుతున్నారు. ఆ విధానం ఎంత వరకు సమంజసమో వారే ఆలోచించాలి. ముఖ్యమంత్రి గారు ఆ విధంగా వ్యాఖ్యానించడం నిజంగా ఈ రోజు దురదృష్టకరం. ఆ విధంగా మాట్లాడుకోవాలంటే మా దగ్గర కూడా చాలా మాటలు ఉన్నాయి.

ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ "ప్రాధాన్యతా క్రమం" అని అన్నారు.

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి: గౌరవ ముఖ్యమంత్రి గారు హుందాగా మాట్లాడారు. వారు మాట్లాడిన మాటలు బాధగా అనిపిస్తే, విత్‌డ్రా చేసుకున్నట్టుగా కూడా చెప్పడం జరిగింది. ఆ విధంగా హరీష్ రావు గారిని కూడా చెప్పమని చెప్పండి సార్.

(అంతరాయం)

శ్రీ టి. హరీష్ రావు: వెంకట రమణా రెడ్డి గారు, నేనేమి వ్యక్తిగతంగా మాట్లాడలేదు. "తెలంగాణ ఉద్యమం" బయట కాలర్ పట్టుకొని ప్రశ్నించగా, ప్రభుత్వం నిధుల్ని కేటాయించిందని నేను అన్నాను. తెలంగాణ ఉద్యమం అడిగింది తప్ప, వ్యక్తిగతంగా నేనేమి చెప్పలేదు. అయినప్పటికీ మీకు బాధనిపిస్తే, I don't mind to withdraw.

ప్రాధాన్యతా క్రమంలో నిధుల కేటాయింపు అని ముఖ్యమంత్రి గారు అన్నారు. రాష్ట్రంలో రెండవ సైనిక్ స్కూలు వచ్చింది. మొదటి సైనిక్ స్కూల్ ఆంధ్ర ప్రాంతంలోని విజయనగరం జిల్లా కోరుకొండ నందు ఉన్నది. రెండవ సైనిక్ స్కూల్ రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రాధాన్యత క్రమంలో ఎక్కడుండాలి? వెనుకబడిన ప్రాంతమైన తెలంగాణలో ఉండాలి. తెలంగాణ ప్రాంతంలో పిల్లలు చదువుకోలేదు, రాష్ట్రంలోని 23 జిల్లాల్లోని ఐదు జిల్లాలు నిరక్షరాస్యతలో వెనుకబడి ఉంటే, మరల ఆ ఐదు జిల్లాల్లో నాలుగు తెలంగాణ జిల్లాలే ఉన్నాయి. అలాంటప్పుడు ప్రాధాన్యత క్రమం ఎక్కడుండాలి. తెలంగాణలో ఉండాలి, హైదరాబాద్‌లో ప్రాధాన్యత క్రమం అనేది ఉండాలి. కానీ, మన ముఖ్యమంత్రి గారు రెండవ సైనిక్ స్కూల్‌ను చిత్తూరు జిల్లా కలికిరి ప్రాంతానికి తీసుకుపోవడం జరిగింది. ఆ విధంగా మాట్లాడుకుంటూ పోతే, మాట్లాడాల్సిన విషయాలు చాలా ఉన్నాయి.

స్వర్గీయ డా.వైఎస్. రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఐ.జి. కార్లని చెప్పి, "Indira Gandhi Centre for Advance Research in Llivestock" అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, రూ.200 ఖర్చు చేసి పెద్ద, పెద్ద భవనాలను నిర్మించారు. కానీ, అక్కడ

ప్రస్తుతం ఏమి జరగడం లేదు. కేవలం తొండలు గుడ్లు పెట్టడం తప్ప, ఏ విధమైన పురోగతి అక్కడ జరగడం లేదు. ఇప్పటి వరకు దాదాపు రూ.300 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది. కానీ, ఏ మాత్రం లాభం చేకూరలేదు. ప్రస్తుతం ఈ ముఖ్యమంత్రి గారు ఏమి చేశారంటే, సంకరజాతి పాడి పశువుల శిక్షణా కేంద్రాన్ని తీసుకుపోయి, చిత్తూరు జిల్లా కలికిరిలో పెట్టారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ తదితర తెలంగాణ ప్రాంత జిల్లాల నుండి ఎవరైనా శిక్షణకు పోవాల్సివస్తే, చిత్తూరు జిల్లా కలికిరి ప్రాంతానికి శిక్షణ నిమిత్తం వెళ్లాలని చెబుతున్నారు. ఆ విధంగా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి.

అదే కోవలో నల్లగొండ జిల్లా బీబీనగర్ నందు నిమ్స్ ఆసుపత్రి ఉన్నది. ఎన్ని రోజుల క్రింద ఆ ఆసుపత్రిని ఏర్పాటు చేశారనే విషయం అందరికీ తెలిసిందే. ఆ ఆసుపత్రి గురించి ఆ ప్రాంత పార్లమెంట్ సభ్యులు అప్పుడప్పుడు దినపత్రికల్లో మాట్లాడినటువంటి కథనాలు మనకు కనిపిస్తున్నాయి ఏమిటంటే, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ వాళ్లు పోరాటం జరిపారనే విధంగా పార్లమెంట్ సభ్యులు అప్పుడప్పుడు మాట్లాడుతుంటారు. కానీ, ఆ ఆసుపత్రి అభివృద్ధికి మాత్రం నిధుల్ని కేటాయించడం లేదు. భవనాలు నిర్మించారు కానీ, ఎక్కడికక్కడ ఆ నిర్మించిన భవనాలు శిథిలమవుతున్నాయి. రూ.100 కోట్ల రూపాయలు ఆ ఆసుపత్రి కొరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. కానీ, అక్కడ డాక్టర్లు, సిబ్బంది నియామకం మాత్రం ప్రభుత్వం చేపట్టలేదు. రోగులకు అవసరమైన వైద్యం ఆ నిమ్స్ ఆసుపత్రి నందు లభించడం లేదు. ఆ ఆసుపత్రి నందు ఆ యా సమస్యల పరిష్కారం గురించి గత మూడు రోజులుగా ధర్నా కార్యక్రమం జరుగుతోంది.

అధ్యక్షా, ఇలాంటి సమస్యలు చాలా ఉన్నాయి. మేం గతంలో కూడా కోరడం జరిగింది. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 2008వ సంవత్సరంలో ఇదే సభలో నేను వారిని అడగడం జరిగింది. ఏమిటంటే, గుంటూరు జిల్లాలో 26, కృష్ణా జిల్లాలో 24, కడప జిల్లాలో 26 గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలున్నాయి, కానీ, తెలంగాణ ప్రాంతంలోని కరీం నగర్ జిల్లాలో 7, వరంగల్ జిల్లాలో 8, మెదక్ జిల్లాలో 7 గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలున్నాయని, అయితే, రంగారెడ్డి జిల్లాలో మాత్రం కేవలం ఒక్కటంటే, ఒక్క గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లేదనే విషయాన్ని ఆనాడు తెలంగాణ ఉద్యమం తరఫున ఇదే సభలో ప్రశ్నిస్తే, మేం ప్రశ్నించిన కారణంగా మూడు నెలల్లో ప్రభుత్వం జి.వో.లను విడుదల చేసింది. తద్వారా తెలంగాణ ప్రాంతంలో 40 నుండి 50 వరకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీల స్థాపన జరిగింది. ఆ జి.వో.లు కేవలం తెలంగాణ ఉద్యమం ప్రశ్నించడం వల్ల మాత్రమే వచ్చాయి. ఆ విషయం మా సబిత అక్కకు కూడా తెలుసు. ఆనాడు సబిత అక్కకు కూడా చెప్పడం జరిగింది. ఏమిటంటే, రాజశేఖర్ రెడ్డి గారు ఏమి మాట్లాడినా చేవెళ్ల చెల్లమ్మ అని అంటారు, రంగారెడ్డి జిల్లాలోడిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయించమని అడగమని వారిని అనేక పర్యాయాలు మేం కోరడం జరిగింది. కానీ, ఏ విధంగా పురోగతి కనిపించలేదు. కేవలం తెలంగాణ ఉద్యమం ఆ అంశాన్ని ప్రశ్నించడం వల్లే తెలంగాణ ప్రాంతంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజీల ఏర్పాటు జరిగింది. అయితే, కాలేజీల ఏర్పాటు జరిగింది కానీ, ఎక్కడ కూడా సొంత భవనాలు డిగ్రీ కాలేజీలకు లేవు, సిబ్బంది లేదు. ఇష్టం లేకే కాలేజీల ఏర్పాటు తెలంగాణ ప్రాంతంలో జరిగింది. తెలంగాణ ఉద్యమం బలంగా ఉంది కాబట్టే మొక్కుబడిగా ప్రభుత్వం కాలేజీల ఏర్పాటుకు జి.వో.లను విడుదల చేసింది. కేవలం కాంట్రాక్ట్ లెక్చరర్లతో ఆ కాలేజీల్లో విద్యా బోధన జరుగుతోంది తప్ప, ఎక్కడ కూడా రెగ్యులర్ లెక్చరర్లు పనిచేస్తున్న దాఖలాలు లేవు. ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ ఒక మాట అన్నారు. ఏమిటంటే, మీరు అడిగితే నిధులు ఇస్తామని చెప్పారు. అవును, అడిగి సాధించుకున్నది తెలంగాణ ఉద్యమం. తెలంగాణ ఉద్యమ రూపంలో ఈ సభలో మేం సభ్యులుగా వచ్చాం కనుక, తెలంగాణ ప్రజలు సభకు పంపారు కనుకనే మేం మా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం, పోరాడుతున్నాం, సాధిస్తున్నామనే విషయాన్ని మరొకసారి సభ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంపై చూపిస్తున్న వివక్ష గురించి చెప్పాను. ఆనాడు ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పినదేమిటంటే, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మరొకసారి అధికారం చేపడితే, ఒక రూపాయి కూడా విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపమని చెప్పడం జరిగింది. ఆ విధంగా చెప్పడమే గాకుండా ఇంకో మాట కూడా కాంగ్రెస్ పార్టీ చెప్పింది. ఏమిటంటే, "the State will be in a position to provide 24X7 electrical power throughout the State besides supplying power to the farming sector for nine hours per day from 1st June, 2009". అంటే, రైతులకు రోజుకు తొమ్మిది గంటల కరెంటు అందిస్తాం, అదే విధంగా రాష్ట్రమంతటా 24 గంటల కరెంటును అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పడం జరిగింది. 2009, జూన్ మాసం మొదటి నుండి విద్యుత్‌ను రాష్ట్రమంతటా అందిస్తామని చెప్పారు, ఒక రూపాయి కూడా కరెంటు చార్జీలను పెంచమని కాంగ్రెస్ పార్టీ ఆనాడు చెప్పడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆ విధంగా మోసపూరిత వాగ్దానం చేసి అధికారంలోకి రావడం జరిగింది. కానీ, ఆ అంశంలో చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఎక్కడ ఉందో, వారే చెప్పాల్సిన అవసరముంది.

శ్రీ బొత్స సత్యనారాయణ: వాగ్ధానం ప్రకారం ఇస్తున్నాం కదా!

శ్రీ టి.హరీష్ రావు: కేవలం మాటల్లో చెప్పినారు. చేతల్లో కాదు. అధికారంలోకి వచ్చినట్లైతే, విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పారు. ఇప్పుడు చెప్పండి, రాష్ట్రంలో ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తొమ్మిది గంటలు విద్యుత్‌ను సరఫరా చేస్తోందా? పోనీ, ఇస్తున్నట్టుగా చెబుతున్న ఏడు గంటల విద్యుత్ రాష్ట్రంలో ఎక్కడైనా సక్రమంగా సరఫరా అవుతోందా? 24 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతుందనే విధంగా ప్రజలకు వాగ్ధానం చేశారు. అధికారంలోకి వచ్చాక 24 గంటల విద్యుత్ కాదు కదా, ఉదయం 6.00 గంటలకు కరెంటు పోతే, మళ్లీ రాత్రి 6.00 గంటల వరకు కరెంటు రానటువంటి పరిస్థితి రాష్ట్రంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాపురించింది. "వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియదు" అనే నానుడి ఉండేది. కానీ, ఈ ప్రభుత్వం యొక్క తీరులో పరిస్థితి ఏ విధంగా ఉందంటే, "కరెంటు రాకడ, ప్రజలకు ప్రాణం పోకడ ఎప్పుడు వస్తుందో" తెలియనటువంటి పరిస్థితి దాపురించింది. అందుకు కారణం ప్రభుత్వం అవలంభిస్తోన్న దోరణి మాత్రమే.

అదే విధంగా ముఖ్యమంత్రి గారు "రాజీవ్ యువ కిరణాలు" అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నా పేరులోనే యువ కిరణాలు ఉన్నాయని ముఖ్యమంత్రి గారు అంటున్నారు కానీ, ప్రజల జీవితాలపై కనీసం లైటు కిరణాలు కూడా పడనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉంది.

అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంటే, 2008-09వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు రూ.34,540 కోట్ల మేరకు విద్యుత్ చార్జీల రూపంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపింది. అది సర్‌చార్జీల రూపంలో గానీ, విద్యుత్ చార్జీల పెంపుదల రూపంలో కావచ్చు. కానీ, ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపైన మోపిన భారం మాత్రం రూ.34,540.00 కోట్లు. గతంలో సామాన్యుడు చనిపోవాలనుకుంటే విద్యుత్ తీగలను పట్టుకోవాల్సి ఉండేది, కానీ ప్రస్తుతం విద్యుత్ బిల్లును పట్టుకుంటేనే ప్రాణం పోయేటటువంటి పరిస్థితిని, గుండెపోటు వచ్చేటటువంటి పరిస్థితిని ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు కల్పించింది. అంత దారుణంగా విద్యుత్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే. అన్నీ రంగాల్లో అవినీతి పేరుకుపోయింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల్లో ఏన్నో ఇబ్బందులున్నాయి. కానీ, వాటినన్నింటినీ వదిలి, ప్రజలపై చార్జీలను మోపడం, ఆ దోచిన మొత్తాన్ని కార్పొరేట్ సంస్థలకు, కంపెనీలకు దోచిపెట్టడమనేటటువంటి దోరణిని ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంభిస్తోంది. ఆ విధంగా పన్నుల రూపంలో, చార్జీల పెంపు రూపంలో ప్రజలపై ప్రభుత్వం భారం వేస్తుంటే, సామాన్య ప్రజలు ఏ విధంగా ఎక్కడి నుండి పెంచిన మొత్తాన్ని చెల్లించాలో ఒకసారి ఆలోచన చేయాల్సి ఉంది. పెంచిన చార్జీలు కూడా చాలా దారుణంగా ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పెంపులో పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలను వదిలి

పెట్టామనే విధంగా ప్రభుత్వం చెబుతోంది. విద్యుత్ బిల్లుల విషయంలో ప్రభుత్వం ఏమి చేసిందంటే, telescopic నుండి non-telescopic వైపుకు పయనించింది. ఆ విధానంలో 50 యూనిట్ల విద్యుత్‌ను కాలిస్తే వచ్చే బిల్లు రూ.72.50 పైసలు, 51 యూనిట్ విద్యుత్ కాలిస్తే, అతను రూ.132.60 పైసల విద్యుత్ బిల్లును చెల్లించాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. అంటే కేవలం ఒక యూనిట్ విద్యుత్‌కు 60 రూపాయల భారాన్ని పేదవాడిపైన వేస్తోంది ఈ ప్రభుత్వం.

మ.1.10.

రూ.60/-ల భారాన్ని పేదవాడి మీద వేస్తున్నారు. అదే విధంగా విద్యుత్ చార్జీలు100 నుండి 200 యూనిట్లు వినియోగించుకుంటున్న వారికి 100 యూనిట్ల వరకు యూనిట్‌కు చెల్లించాల్సింది, రూ.2.60 పైసలు, చొప్పున కాగా,100 యూనిట్లు దాటి ఒక్క యూనిట్ అనగా,101 యూనిట్లు వినియాగించుకున్న వారు కూడా, వారు చెల్లించాల్సిన బిల్లు గరిష్టంగా రూ.570/-ల వరకు ఉంటుంది. అనగా 200, ఆపై 201 యూనిట్లు వినియోగించుకున్న వినియోగదారుని మీద వేస్తున్న అదనపు విద్యుత్ భారం రూ.310/- గా పేద, మధ్య తరగతి వారి మీద పడుతుంది. దీని ద్వారా ఉదయాన్నే దేవుణ్ణిలా ప్రార్థించుకుంటామో, అలాగే విద్యుత్ వినియోగ దార్లందరూ, ప్రతిరోజూ విద్యుత్ మీటర్ రీడింగ్‌ను కూడా గమనించాల్సి ఉంటుంది. అదే విధంగా 200 నుండి 300 యూనిట్లు వినియోగించుకుంటున్న వినియోగదార్లందరికి ఒక్కో యూనిట్‌కి రూ.1236/-గా ఉంది. అంటే దాదాపు ఈ ప్రభుత్వ నూరు శాతం విద్యుత్ బిల్లులు పెంచి పేద వారి మీద భారం మోపి పేద ప్రజల రక్త మాంసం తీసుకుంటుందని తెలియజేసుకుంటున్నాను.

కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో కస్తూరిబా అనే ఎస్‌సి. కాలనీ వాసులు విద్యుత్ బిల్లులు చెల్లించనందున 18 రోజుల పాటు ట్రాన్స్‌ఫార్మర్ నుండి కస్తురిబా కాలనీకి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చివరకు కాలనీ వాసులందరికీ త్రాగడానికి మంచినీళ్లు దొరకలేదు, రాత్రి వేళల్లో వీధిలైట్లు, గృహ విద్యుత్ సరఫరా లేక చీకటితో గడిపారు. ఇందిరమ్మ రాజ్యం అంటున్నారు, ఆనాటి ఇందిరాగాంధి పరిపాలనలో ఎస్‌సి/ఎస్టీ లకు, ఒక్క కరెంట్ బల్బు కలిగిన గృహస్తులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసింది, కానీ నేటి ఇందిరమ్మ రాజ్యంలో విద్యుత్ బిల్లులు చెల్లించని నెపంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసి, వీధిలైట్లును సైతం రద్దుపరచడంతో ప్రజలకు త్రాగునీరు దొరకని పరిస్థితి ఈనాటి ఇందిరమ్మ రాజ్యంలో కనిపిస్తోంది.

విద్యుత్ సరఫరాలో కూడా తెలంగాణాకు అన్యాయం చేస్తున్నారు, విద్యుత్ మంత్రిగారున్నారో లేరో ఎవరైనా నోట్ చేసుకొని సమాధానం తెలియపరచినా నేను సంతోషిస్తాను. ఈరోజు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు విద్యుత్ పంపిణీ సంస్థలున్నాయి, పక్కా ఉత్తర తెలంగాణాకు ఉండేది ఎన్‌పిడిసిఎల్, ఐదు తెలంగాణా జిల్లాలకు చెంది ఉంది. అదే విధంగా ఆంధ్రరాష్ట్రంలోని మిగిలిన జిల్లాలకు ఇపిడిసిఎల్ కూడా ఉంది. ఎన్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా ఎలా ఉంది, ఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా ఎలా ఉందో నేను తెలుపుతున్నాను ఈరోజు ''ప్రభుత్వ విద్యుత్ వెబ్‌సైట్ " లోని సమాచారం మాత్రమే చెప్పదలుచుకున్నాను. తేది.24 ఫిబ్రవరి 2013 నాటి వెబ్‌సైట్ సమాచారం ఉదాహరణకు తీసుకుంటే, విశాఖపట్నం ఆధారంగా పనిచేస్తున్న ఇపిడిసిఎల్ లో రైతులకు 7 గంటల విద్యుత్ సరఫరా చేసే విషయమై 1135 ఫీడర్స్ అక్కడ ఉంటే 7గంటలకంటె తక్కువగా విద్యుత్ సరఫరా చేసిన ఫీడర్స్ అంటూ ఏమీ లేవు. ఏడు గంటలపాటు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసినవి 364 ఫీడర్స్. 586 ఫీడర్స్‌కు టూ ఫేజ్ , 185 ఫీడర్స్ తగ్గకుండా త్రీ ఫేజ్ ఉన్నవి.

అదేవిధంగా ఎన్‌పిడిసిఎల్‌కు వస్తే వరంగల్ జిల్లాలో 2687 ఫీడర్స్ ఉండగా అందులో రోజులో 7 గంటలకన్నా తక్కువగా విద్యుత్ సరఫరా చేసిన ఫీడర్స్ 2684. మిగిలిన మూడు (3) ఫీడర్స్‌కు మాత్రమే 7గంటల పాటు విద్యుత్ సరఫరా జరిగింది. 2684 ఫీడర్లకు 7 గంటల విద్యుత్ సరఫరా జరగలేదనే విషయాన్ని అధికారికంగా ముఖ్యమంత్రి గారు పెట్టిన వెబ్ సైట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.

7 గంటల విద్యుత్ సరఫరాకు సంబంధించి గత సంవత్సరం మార్చినెలకు సంబంధించిన చార్టును మేము తయారుచేస్తే, సీమాంధ్ర జిల్లాలకు సంబంధించి మొత్తం ఫీడర్స్ 4851 అందులో 7 గంటలకన్నా తక్కువుగా విద్యుత్ సరఫరా అందుతున్న ఫీడర్స్ 175. అంటే 3.6 శాతం. తెలంగాణా 10 జిల్లాల్లో ఉండేటువంటి ఫీడర్స్ 4995. అందులో ఏడు గంటల కన్నా తక్కువుగా విద్యుత్ సరఫరా అందుతున్నవి 2921 58శాతం ఫీడర్స్ ఏడు గంటల కన్నా తక్కువగా విద్యుత్ సరఫరా జరుగుతోందన్న విషయాన్ని ప్రభుత్వమే తమ వెబ్‌సైట్‌లో ఉంచింది. రాష్ట్రం ఒక్కటే, ప్రభుత్వం ఒక్కటే, ముఖ్యమంత్రి ఒక్కరే అయ్యివుండి, ఆంధ్రాప్రాంతానికేమో, రోజుకు ఏడు గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు, తెలంగాణా ప్రాంత రైతుకు కేవలం నాలుగైదు గంటల పాటైనా విద్యుత్ సరఫరా జరుగకపోతే ఇది వివక్ష అనాలనా, మరేమనాలని నేను అడుగుతున్నాను అధ్యక్షా,

మా తెలంగాణాలో ప్రాజెక్టులు మీరు నిర్మించలేదు, మేము బ్రతికేది విద్యుత్ మీదనే. ఐతే ఆ విద్యుత్‌ను కూడా రోజుకు కనీసం నాలుగైదు గంటలపాటైనా సరఫరా చేయకపోతే ఎట్లా, ఈరోజు తెలంగాణా జిల్లాల కాంగ్రెస్ శాసనసభ్యులను గుండెలమీద చెయ్యి ఉంచుకొని చెప్పమనండి, ఈరోజు విద్యుత్ అంతరాయంతో కంట కన్నీళ్లు పెట్టని తెలంగాణా రైతే లేరు. ప్రభుత్వం రైతాంగానికి ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలియపర్చుకుంటున్నాను. రోజుకొక రైతు చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నాడు. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వం యొక్క వైఫల్యమే కారణం. ప్రభుత్వం రైతులకు విద్యుత్ సరఫరా చేయడంలో విఫలం అయ్యిందని ఈరోజు చెప్పక తప్పని పరిస్థితి ఉంది. రాజీవ్ యువకిరణాల పేరుమీద ఉద్యోగాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి గారంటున్నారు. అయ్యా , మీ కొత్త ఉద్యోగాల కల్పనలేమో గానీ, మీరు నిరంతం విద్యుత్ సరఫరా కల్పించనందున చిన్న తరహా, కుటీర, భారీ, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని మూతపడి పోయి లక్షలాది మంది ఉద్యోగులు నిరుద్యోగులుగా మారిపోయారు. అందుచే ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టిన ఘనత ముఖ్యమంత్రి గారికే దక్కుతుందని చెప్పక తప్పదు.

కరెంట్ పరిస్థితి చూస్తే ఈ విధంగా ఉండగా అధ్య క్షా, ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయం చూస్తే తెలంగాణా చాలా వెనుకబడి ఉన్నది. దివంగత ముఖ్యమంత్రి గారు ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభిస్తూ, నాలుగు సంవత్సరాల్లో పూర్తిచేస్తామన్నారు. ఇప్పటికీ 10 శాతం పనులు కూడా పూర్తికాలేదు. మీరు జరుపుతున్న తీరు చూస్తే మరో 30 సంవత్సరాలకైనా పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు. ఈ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకు రావటంలో ప్రభుత్వం విఫలమయింది. తెలంగాణా ప్రాంతంలో అతి ప్రధానమైన ఈ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది.

బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపడంలోనూ, ప్రాజెక్టు నిర్మాణంతో మన రాష్ట్రానికి జరిగే నష్టాల విషయంలో సుప్రింకోర్టులో సరైన వాదనలు వినిపించడంలోనూ, ఈ ప్రభుత్వం విఫలమయ్యింది. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ –2 కాని, దేవాదులు ప్రాజెక్టుల ద్వారా తెలంగాణా ప్రాంతానికి నీరందాలంటే, తెలంగాణా ప్రాంతానికి లాభం జరగాలంటే, వెంటనే ''కాంతానపల్లి'' ప్రాజెక్టును నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎస్ఆర్ఎస్పీ తర్వాత ప్రాణహిత నదీ గోదావరి నదిలో కాళేశ్వరం దగ్గర కలుస్తుంది. అదేవిదంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి వస్తున్న

ఇంద్రావతి నదీ వరంగల్ జిల్లాలో గోదావరిలో కలుస్తుంది, దాదాపు అక్కడ 650 టిఎంసీల నీళ్లున్నందున కాంతాన పల్లి ప్రాజెక్టును నిర్మించినట్లైతే ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ –2 కి కానీ, దేవాదులకు కానీ 7.50 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశం ఉంది. మన ముఖ్యమంత్రి గారు, ప్రాధాన్యతల క్రమమంటున్నారు, ఆ క్రమమెక్కడుందాని నేను అడుగుతున్నాను.

ఆయకట్టు స్థిరీకరణ, మూడవ పంటకు నీరందించుట కోసం, పోలవరం టెండర్లు పిలుస్తున్నారు, తెలంగాణాలో ఒక్క పంటకైనా నీళ్లు లేవు, రైతులు ఆత్మహత్యల బాట పడుతున్నారు, వెనుక బడ్డ తెలంగాణా, వరంగల్ జిల్లా ''కాంతానపల్లి'' ప్రాజెక్టు నిర్మాణంలో మీరెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నేనడుగుతున్నాను. ఈ కాంతానపల్లి ప్రాజెక్టు నిర్మాణ ఫైలు మాత్రం ఫైనాన్స్ డిపార్ట్మెంట్కు, ముఖ్యమంత్రి కార్యాలయానికి దాదాపు 20 సార్లు వెళ్లింది. ఐనప్పటికీ ముఖ్యమంత్రిగారి ఆమోదానికి ఆ ఫైలు నోచుకోలేదనే విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. పోలవరం ప్రాజెక్టుకు అర్థరాత్రి పూట టెండర్లు పిలిచి, అగ్రిమెంట్లు చేసి సీమాంధ్ర పక్షపాతిగా నిలిచారనడానికి ఇది ఒక ఉదహరణ చాలదా అని ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను అధ్యక్షా.

వ్యవసాయ రంగంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుంది. దేశంలోనే అత్యధిక రైతు ఆత్మహత్యలు ఒక్క తెలంగాణా ప్రాంతంలో జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం మీద 1998 నుండి 2013 వ సంవత్సరం వరకు 5572 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ఒక్క తెలంగాణా ప్రాంతంలో 3424 మంది రైతులు ఉన్నారు. దాదాపు 61.5 శాతం మంది రైతులు తెలంగాణా ప్రాంతంలోనే ఆత్మహత్యలు చేసుకున్నారు, దీనికి కారణం ఈ ప్రభుత్వాలు కాదాని నేను అడుగుతున్నాను. దీనికి బాధ్యత ఈ ప్రభుత్వం వహించాల్సిన అవసరం లేదా, ఈ రోజు అందుకోసమే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వస్తుంది.

2000 సంవత్సరం నుండి 2009వ సంవత్సరం వరకు రూ.2561/– కోట్లు పంటల బీమా క్రింద ఈ ప్రభుత్వం అందజేస్తే , అందులో తెలంగాణా ప్రాంతానికి ఇచ్చింది రూ.169/– కోట్లు. అంటే 6.6 శాతం మాత్రమే. 93.4 శాతం మిగిలిన రాష్ట్రానికిస్తే, కేవలం 6.6 శాతం మాత్రమే తెలంగాణా ప్రాంతానికి చెందింది. ఈ విషయం అడిగితే నీకు నిధులియ్యను, నీ సంగతి చూస్తానని ప్రశ్నిస్తే ఎంత అన్యాయం అధ్యక్షా.

మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.896/– కోట్లు ఇన్పుట్ సబ్సీడీ విడుదల చేయగా 2011–12 సంవత్సరంలో, తెలంగాణా 10 జిల్లాలకు కరువు మండలాలుగా ప్రకటించగా, అందులో కేవలం రూ.97కోట్లు మాత్రమే అంటే 11 శాతం మాత్రమే తెలంగాణా జిల్లాలకు ఇచ్చారు. అదేవిధంగా వ్యవసాయ రైతులకిచ్చే విత్తనాల సబ్సీడీ 2011వ సంవంత్సరంలో రూ.167 కోట్లు ఈ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయగా, అందులో కేవలం రూ.44 కోట్లు అంటే కేవలం 26 శాతం మాత్రమే తెలంగాణా ప్రాంతానికి ఇచ్చారు.

మ.1.20

శ్రీ టి. హరీశ్ రావు : విత్తనాల సబ్సిడీ విషయంలో, 2011వ సంవత్సరంలో రాష్ట్రంలోని రైతులకు రూ.167 కోట్ల సబ్సిడీని ప్రకటించగా, అందులో తెలంగాణా ప్రాంతానికి రూ.44 కోట్లు కేటాయించారు, అది కేవలం 26 శాతం మాత్రమే. 2010వ సంత్సరంలో రూ.156 కోట్లు ప్రకటించగా తెలంగాణా ప్రాంతానికిరూ.38 కోట్లు కేటాయించారు, అది 24 శాతం మాత్రమే. అదేవిధంగా 2009వ సంవత్సరంలో ఖరీఫ్, రబీలకు రూ.312 కోట్లు ప్రకటించగా, తెలంగాణా ప్రాంతానికి రూ.104 కోట్లు కేటాయించారు, అది 33 శాతం మాత్రమే. తెలంగాణా ప్రాంతంలోని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిసి కూడా ఈ రకమైన కేటాయింపులు చేసి తెలంగాణా ప్రాంతానికి ప్రభుత్వం అన్యాయం చేస్తూనే ఉంది. తెలంగాణా ప్రాంతంలో

వడగండ్ల వానలు 2011, 2012 సంవత్సరాలలో మరియు 2013 సంవత్సరంలో కూడా కురిసాయి. తెలంగాణా ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్రతీసారీ తెలంగాణా ప్రజలు నష్టపోతున్నారు. మూడు సంవత్సరాలనుంచి ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం క్రింద రైతాంగానికి అందించలేదు. 'నీలం తుఫాను' సంభవించినప్పుడు ప్రభుత్వం ఆఘుగమేఘాలమీద కదిలి తక్షణ సహాయ చర్యలు చేపట్టి సీమాంధ్ర ప్రాంతాలలోని ప్రజలపై ప్రేమ చూపిన ప్రభుత్వం తెలంగాణా ప్రాంత ప్రజలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపింది కనుకనే ఈ రోజు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టవలసిన పరిస్థితి వచ్చింది.

వేరుశనగ విషయంలో కూడా ఇలాగే అన్యాయం జరిగింది. సోదరుడు రఘువీరారెడ్డి నవ్వుతున్నారు, అనంతపురం జిల్లాలో వేరుశనగ పంట విపరీతంగా పండిస్తారని వేరుశనగ విత్తనాలకి చాలా వరకు సబ్సిడీ ఇస్తారు. తెలంగాణాలో రబీ పంట కాలంలో వేరుశనగ పండిస్తే దాన్ని ప్రొక్యూర్ చేసి, తీసుకెళ్లి అనంతపురం జిల్లాలో డంప్ చేశారు. అనంతపురం వంటి కరువు బాధిత పేద జిల్లాకు ఇచ్చినందుకు మాకు బాధలేదు. అదేవిధంగా తెలంగాణా ప్రాంతంలో పత్తి పంటను ఎక్కువగా పండిస్తారు, మరి పత్తి విత్తనాలకు సబ్సిడీ ఎందుకు ఇవ్వరు? పత్తి విత్తనాల కోసం తెలంగాణాలోని రైతులు ప్రతి సంవత్సరం కుస్తీలు పట్టి, పోలీస్ స్టేషన్లలో క్యూలు కట్టి లాఠీ దెబ్బలు తింటేనే తప్ప ఎరువులు, విత్తనాలు దొరికే పరిస్థితి లేదు. ప్రభుత్వం వేరుశనగ విషయంలో అనంతపురం రైతులపై చూపిన ప్రేమ, తెలంగాణా ప్రాంత రైతులపై పత్తి విత్తనాలను అందించడంలో చూపక నిర్లక్ష్యం చూపింది కనుకనే ఈ రోజు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టవలసిన పరిస్థితి వచ్చింది. చివరకు కరువు మండలాల ప్రకటనలో కూడా తెలంగాణా ప్రాంతానికి అన్యాయం జరిగింది. తెలంగాణా ప్రాంతంలో బోర్లు ఎండిపోయి ప్రజలు త్రాగునీటి కొరకు కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. సీమాంధ్ర ప్రాంతంలో 218 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా, తెలంగాణా ప్రాంతంలో కేవలం 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి తెలంగాణా ప్రాంత రైతులను, ప్రజలను చిన్నచూపు చూశారు కనుకనే ఈ రోజు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టవలసిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రం నుంచి అనేక మంది యం.పిలు ఎన్నికైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టడంలో కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విఫలమయింది. కేంద్ర ప్రభుత్వం ఏడు రాష్ట్రాలకు కరువు సహాయంగా రూ. 2892 కోట్లు ప్రకటించగా, మహారాష్ట్రకు రూ.1207 కోట్లు కేటాయించారు, బిజేపి అధికారంలో ఉన్న గుజరాత్ రాష్ట్రం రూ.864 కోట్లు దక్కించుకోగా, కేంద్రంలోను, రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం రూ.417 కోట్లను మాత్రమే కరువు సహాయంగా పొందగలిగింది. మహారాష్ట్ర రాష్ట్రం కరువు క్రింద నష్టపోయిన వారికి ఇంకా అదనపు సహాయాన్ని కూడా ప్రకటిస్తామని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 'నీలం తుఫాను' క్రింద కేంద్ర ప్రభుత్వాన్ని అడిగింది ఎంత, వారు ఇచ్చింది ఎంత? కరువు మండలాలను ప్రకటించడంలో వివక్ష చూపి నిధులు రాబట్టడంలో విఫలమైంది కనుకనే ఈ రోజు ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది.

గవర్నర్ గారి ప్రసంగం చివరి బడ్జెట్ ప్రసంగం కాగా 2009వ సంవత్సరం ఎన్నికల మానిఫెస్టోలో చెప్పిన హామీలను నిలబెట్టుకునే విధంగా ఉంటుందని ఆశించాం, కానీ గడచిన సంవత్సరాలలో ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెలవేర్చలేకపోయింది. 2009వ సంవత్సరం ఎన్నికల మానిఫెస్టో ప్రకారం తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుపై రోశయ్య కమిటీ వేయడం జరిగిందన్నారు. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ద్వారా ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పడం జరుగుతుందన్నారు. కానీ ఇప్పుడు ఆ కమిటీ ఉందా, లేదా ఏమైపోయిందో తెలియడం లేదు. అదే కాంగ్రెస్ పార్టీ చెప్పింది. It is proposed to increase the quantity of rice for white card holders from 4 Kgs. to 6 Kgs. నాలుగేళ్లు గడిచినా ఇంతవరకు పేద ప్రజలకు బియ్యాన్ని పెంచలేక పోయింది, అది ఎప్పుడు చేస్తారో తెలియదు.

శ్రీ డి. శ్రీధర్ బాబు : పేద ప్రజానీకానికి ఆహార భద్రత ఇవ్వాలనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ప్రధాన ఉద్దేశంతోనే రెండు సంవత్సరాల క్రితం కిలో బియ్యం రెండు రూపాయల నుంచి ఒక్క రూపాయికి తగ్గించారు. అదే విధంగా నాలుగు కిలోల నుంచి ఆరు కిలోల బియ్యాన్ని పెంచాలనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం కుడా అదే దిశలో ఆహార భద్రత చట్టాన్ని 2014 సంవత్సరం లోపల తీసుకొని రావడానికి ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రానికి సంబంధించిన ఎన్నికల మానిఫెస్టోని కూడా దృష్టిలో పెట్టుకొని పేద ప్రజానీకానికి ఆహార భద్రత కల్పించాలని ఒక్క రూపాయికే కిలో బియ్యం ఇవ్వాలనే ప్రధాన నిర్ణయం తీసుకున్నది. ఇది బాధ్యతను విస్మరించే ప్రభుత్వం కాదు, ప్రజలకు ఆహార భద్రత అందించే ఉద్దేశంతోనే చర్యలు తీసుకుంటున్నది. మానిఫెస్టోకు సంబంధించి 2014వ సంత్సరంలో రాబోయే ఎన్నిల సమయంలో అడగండి అప్పుడు చెపుతాం.

శ్రీ మండవ వెంకటేశ్వర రావు (నిజామాబాద్-రూరల్) : సార్, మంత్రి గారు సమాధానం చెప్పారు కాబట్టి మాట్లాడుతున్నాను. ప్రతి వ్యక్తికి పది కిలోల బియ్యం అవసరమౌతాయి. రెండు రూపాయలు ఉన్న కిలో బియ్యాన్ని ఒక్క రూపాయికి తగ్గించి నాలుగు రూపాయలను తగ్గించిన విషయం వాస్తవం. కానీ ప్రస్తుతం పది కిలోల బియ్యాన్ని 7, 8 రూపాయలతో కొన్నా ఎనభై రూపాయలు భారం పెరిగితే, మంత్రిగారు తగ్గిచ్చింది నాలుగు రూపాయలే మహానుభావా అని గుర్తు చేస్తున్నాను.

శ్రీ డి. శ్రీధర్ బాబు : సార్, పెద్దలు అనుభవంతో మాట్లాడుతున్నారు. I definitely respect it. బయట దొరికే సన్న రకాల బియ్యం వేరు, హరీశ్ రావు గారు పిడియస్ ద్వారా సరఫరా అయ్యే బియ్యం నాలుగు కిలోల నుంచి ఆరు కిలోలకు పెంచడం గురించి మాట్లాడిన సందర్భం వేరు. పిడియస్ ద్వారా సరఫరా అయ్యే బియ్యం ధర తగ్గించడమనేది మంచి కార్యక్రమమని వారూ ఒప్పుకున్నారు, అందుకు సంతోషంగా ఉంది. సన్న రకాల బియ్యం విషయంలో కూడా డిమాండుకు సప్లైకి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ రాష్ట్రంలో తీసుకోనటువంటి నిర్ణయాన్ని తీసుకొని రాష్ట్రంలో ప్రస్తుతం రూ.1500/- మద్దతు ధరను ప్రకటిస్తూ సన్నరకాల బియ్యం సేద్యం చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. Whatever positive suggestions are there, we are here to implement the same for the benefit of poor consumers.

శ్రీ టి. హరీశ్ రావు : మంత్రిగారు ఒక్క రూపాయికి కిలో బియ్యం ఇచ్చాము అని అంటున్నారు. కానీ నాలుగు కిలోల మీద తగ్గించింది నాలుగు రూపాయలే. ఎన్నికల మానిఫెస్టో ప్రకారం ఆరు కిలోలు ఇచ్చి ఉంటే ఒక కుటుంబంలో, ఒక వ్యక్తి మీద రూ.98/- మిగిలేది. ఎందుకంటే ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.50/-లు ఉంది. కనుక మంత్రిగారు పేదలకు ఎడమ చేతితో ఇచ్చింది రూ.4/- అయితే, కుడి చేతితో భారం పెంచింది రూ.98/-. గవర్నర్ గారి చివరి బడ్జెట్ ప్రసంగంలోనైనా ప్రస్తుత సంవత్సరం నుండి పేదలకు ఇచ్చే బియ్యం సరఫరాను నాలుగు కిలోల నుంచి ఆరు కిలోల వరకు పెంచుతారేమోనని ఆశించాం, కానీ గవర్నర్ గారి ప్రసంగంలో ఆ అంశం ఎక్కడా కనపడలేదు.

మ.1.30

శ్రీ డి.శ్రీధర్‌బాబు: కార్పోరేషన్ కార్డు షీట్‌లో, ఎఫ్‌సిఐ కార్డు షీట్‌లో ప్రభుత్వం సేకరించే బియ్యం కేజి ధర ఇరవై అయిదు రూపాయలు ఉండగా, ప్రభుత్వం దాన్ని ఒక్క రూపాయికే అందజేస్తోంది. అంటే ప్రభుత్వం ఒక కేజీ బియ్యానికి ఇరవై నాలుగు రూపాయల సబ్సిడీని ఇస్తోంది. ఒక కుటుంబానికి ఇరవై కేజిల బియ్యం

అందచేస్తున్నాం. పేద వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఇస్తున్నాయి. వాటికి సంబంధించిన గణాంకాలను పరిశీలించుకోవాలని హరీష్‌రావు గారిని కోరుతున్నాను.

శ్రీ టి.హరీష్‌రావు: నేను ఒక వ్యక్తి గురించి మాట్లాడుతున్నాను. గౌరవ మంత్రి గారు కుటుంబం గురించి మాట్లాడుతున్నారు. కుటుంబంలో 5 గురు సభ్యులున్నటువంటి వారికి 20 కేజీల బియ్యం ఇస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడిస్తున్న 4 కేజీల బియ్యాన్ని 6 కేజీలకు పెంచితే దాదాపు ప్రతి కుటుంబానికి 10 కేజీల బియ్యం అదనంగా వస్తుంది. తద్వారా సదరు కుటుంబానికి రూ.490/-లు ఆదా అవుతుంది. ఈ రోజున బహిరంగ మార్కెట్‌లో మంచి బియ్యం ఒక కేజీ 45 రూపాయల నుంచి 50 రూపాయల వరకు ఉంది. ప్రతి కుటుంబానికి అదనంగా 10 కేజీల బియ్యం వస్తే ఆ కుటుంబంలోని వారందరూ కడుపు నిండా తినగలుగుతారు.

శ్రీ డి.శ్రీధర్‌బాబు: పేద ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ని అమలుజరిపారు. ఈ రోజున ప్రతి కుటుంబానికి నెలకు 40 కేజీల బియ్యం అవసరమవుతుంది కనుక కుటుంబంలోని ప్రతి వ్యక్తికి నాలుగు కేజీల చొప్పున నలుగురు సభ్యులున్న కుటుంబానికి సగటున 20 కేజీల బియ్యాన్ని ఆ రోజున ప్రభుత్వం పేద ప్రజలకు సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. పేద ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతితో ఫుడ్ సెక్యూరిటీ యాక్టును తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పేద వారి కొరకు అలాంటి ప్రధానమైన కార్యక్రమం చేపట్టబోతోందనే విషయాన్ని శ్రీ హరీష్ రావ్ గారికి తమరి ద్వారా తెలియచేస్తున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు: ప్రతి ఒక్కరికి నిత్యావసరంగా మారిన విద్యుత్, పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఉప్పు, పప్పు, బస్ చార్జీలే కాకుండా అన్ని రకాలైన వస్తువుల ధరలను తరచుగా పెంచుతూ ప్రతి ఒక్కరి పైనా భారం మోపుతోంది. పౌర సరఫరాల శాఖ మంత్రి గారూ, మీరెప్పుడైనా పేద వాడు కడుపు నిండా అన్నం తినగలిగే పరిస్థితులను రాష్ట్రంలో ఏర్పరిచారా?

(అంతరాయం)

MR. SPEAKER: Leave it at that.

శ్రీ డి.శ్రీధర్‌బాబు: అంతర్జాతీయ స్థాయిలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18వ తేదీన ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో 'ప్రతి పేద కుటుంబానికి ఆరు రకాలైన వస్తువులను పౌర సరఫరాల శాఖ ద్వారా అందచేయబోతోందని తెలియచేస్తున్నాను'. ఆ విషయంలో సభ్యులు ప్రభుత్వానికి మంచి సలహాలు ఇస్తే వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు: 2009 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చలేకపోయింది. ఇంకెప్పుడు నెరవేరుస్తారని ప్రభుత్వాన్ని తమరి ద్వారా అడుగుతున్నాను. 2009 ఎన్నికల మేనిఫెస్టోకి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసింది. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని మరచిపోయింది. రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చలేక విఫలమయ్యింది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 6 కేజీల బియ్యం ఇస్తామని చెప్పి, మాట తప్పింది. It is also proposed to saturate the requirement of

Gas Cylinders for cooking, there will be no household activity in the State without Gas connection at the end of the Fourth year. నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. గ్యాస్ కనెక్షన్ లేని ఇళ్లు రాష్ట్రంలో ఎన్ని ఉన్నాయో? గడిచిన నాలుగు సంవత్సరాలలో ఎన్ని గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేశారో గౌరవ మంత్రిగారు సమాధానం చెప్పాలి. ఎక్కడ కూడా గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చిన దాఖలాలు లేవు. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమయినట్లా? కానట్లా? అని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ప్రభుత్వం అవసరానికి తగ్గట్టుగా గ్యాస్ సరఫరా చేయలేకపోయింది. రాష్ట్రంలో ఇప్పటికీ కూడా గ్యాస్ కనెక్షన్‌లు లేని కుటుంబాలు అనేకం ఉన్నాయి. There will be no household activity without Electrical connection or a Sanitary Toilet by the end of the next Five Years time. ఇంకొక ఆరు మాసాలతో ఇచ్చిన వాగ్దానం గడువు ముగుస్తుంది. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లను విద్యుదీకరణ చేశారని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ఇప్పటికీ తండాలు, గిరిజన గూడెంలు, దళిత వాడలు విద్యుత్ సదుపాయం లేకుండా ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి, ఇప్పుడు ఉన్న కనెక్షన్‌లను కూడా తొలగించేస్తున్నారు అధ్యక్షా. తండాల్లో, గిరిజన, దళిత వాడల్లో విద్యుత్ లేక, మంచినీటి వసతులు లేకుండా పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2009 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన వాగ్దానాలలో ఏ ఒక్కటి కూడా ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది కాబట్టే, ఈ రోజున మేము ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది.

అధ్యక్షా, రాష్ట్రంలో ఇన్ని రాజకీయ పరిణామాలు జరుగుతూ ఉంటే తెలంగాణ ప్రాంత ఎంఎల్ఏలు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం. ఈ విషయంలో తెలంగాణ ప్రాంత సభ్యులందరు కూడా ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. వారి ప్రవర్తన చూస్తుంటే చిలక కథ చెప్పాలనిపిస్తోంది.

ఒక ఊర్లో పెద్ద మనిషి ఇంటికి కావలసిన వస్తువులు కొనుగోలు చేసే నిమిత్తం మార్కెట్‌కి వెళ్లాడు. అక్కడ చిలుకలు అమ్మే వ్యక్తిని ఒక మంచి చిలుకను ఇవ్వమని కోరగా, అతను ఒక చిలుకను చూపించి దీన్ని తీసుకోండి ఇది మాట్లాడే చిలుకని చెప్పాడు. సరే అని, ఆ పెద్ద మనిషి డబ్బులు చెల్లించి మాట్లాడే చిలుకను కొనుగోలు చేసి ఇంటికొచ్చి అతని భార్యకి కొనుగోలు చేసిన వస్తువులు, చిలుకను ఇచ్చి హడావుడిలో ఆఫీసుకి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చిన భర్తకి అతని భార్య భోజనంలో మాంసాహారం వడ్డించింది. మాంసాహారం ఎక్కడ తెచ్చినావు అని అడిగిన ప్రశ్నకు మీరు ఉదయం తెచ్చిన చిలుకను కోసి వండి పెట్టినా అని చెప్పిందంట. అంతట భర్త అయ్యో పిచ్చిదానా! ఆ చిలుక మాట్లాడే చిలుక కదా! ఆ చిలుకను ఎట్లా కోసినావని అడిగాడట. అంతట అతని భార్య అరె, చిలుక మెడ మీద కత్తి పెట్టినప్పుడైనా చిలుక మాట్లాడినట్లైతే నేను కోసి ఉండేదాన్ని కాదు కదా అని అన్నదట.

ఈ రోజున సీమాంధ్ర ప్రాంత నాయకులు తెలంగాణా నాయకుల మెడ మీద కత్తి పెట్టి తెలంగాణ రాకుండా అడ్డుపడుతుంటే ఇప్పుడు కూడా సదరు సభ్యులు మాట్లాడకపోతే రేపు ప్రజా క్షేత్రంలో తెలంగాణ ప్రజలు మీకు కూడా అలాంటి పరిస్థితి వచ్చేలా చేస్తారు, దయచేసి ఆలోచన చేయండని ఈ సందర్భంగా వారిని నేను కోరుతున్నాను.

MR. SPEAKER: Please conclude.

శ్రీ టి. హరీష్‌రావు: బహుశా ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ చరిత్రలో ..

(అంతరాయం)

శ్రీ డి.శ్రీధర్‌బాబుః అధ్యక్షా, వారిదొక ఉద్యమ పార్టీ. నేను కాదనడం లేదు. తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు మాట్లాడే విషయాలు తెలంగాణ ప్రాంత ప్రజలందరూ చెప్పినట్లుగా వారు చెబుతున్నారు. దానికి నేను కాదనను.

మ.1.40

అధ్యక్షా, ఒకరి గురించి మాట్లాడడం అంటే, అది వ్యక్తిగతం కాదు. ఒక శాసన సభ్యుడిని అనడం అంటే, వారిని ఎన్నుకున్న ప్రజలను అన్నట్లే అవుతుంది. ఆ విధంగానే వారు మాట్లాడుతున్నారు. కించపరచే విధంగా మాట్లాడుతున్నారు. వారు మాట్లాడే ప్రతీ పదం వేదం. మేము మాట్లాడే ప్రతీ పదము అసభ్యపదజాలంగా చిత్రీకరించడాన్ని ఖండించవలసిన అవసరం ఉంది. మా శాసన సభ్యులందరికి ఎన్ని ఇబ్బందులున్నా, 2009వ సంవత్సరంలో వారి మ్యానిఫెస్టోలో ఏమి ఉన్నా కూడా ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని జాతీయ పార్టీగా మేము ఉన్నాము. వారి స్థాయిలో ప్రతిపక్షానికి సంబంధించి ప్రజలలోకి వెళ్లి వారు మాట్లాడుతున్నారు. మా నాయకత్వం ముందు మేము కూడా ప్రజాస్వామ్యంగా అడుగుతున్నాము. డిమాండ్ చేస్తున్నాము. ఈ రోజు దీనికి సంబంధించి ఇక్కడ వరకూ వచ్చిందంటే అదంతా మాకు మా నాయకత్వం మీద నమ్మకం ఉందనే తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఆ నమ్మకంతోనే మేము పోరాడుతున్నాము. ఈ రోజు మేము కూడా చెబుతున్నాము. ప్రజా క్షేత్రంలో ఎవరయినా ప్రజలు ఇచ్చే తీర్పుకు లోబడి ఉండాలి. దానిని కాదనడం లేదు. మా ప్రాంతానికి సంబంధించిన ఒక ప్రాంతీయ పార్టీకి సంబంధించిన వారు చెప్పింది మేము వినాలంటే అది ఏమిటి? మాది కాంగ్రెస్ పార్టీ, జాతీయ పార్టీ. మా శాసన సభ్యులం, సహచర మంత్రులు అందరమూ ఆలోచన చేస్తూ, ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లడం జరుగుతుంది. మాకు చిలక కథలు చెప్పవలసిన అవసరం లేదు. మా నెత్తి మీద ఎవరూ కత్తి పెట్ట లేదు. మా నాయకత్వం ఎప్పుడూ కత్తి పెట్టదనే నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మా ప్రాంత ప్రజల నమ్మకాన్ని ముందుకు తీసుకువెళుతున్నాము. సమిష్టి కార్యక్రమంతో మంచి నాయకత్వంతో ముందుకు పోతున్నాము.

( అంతరాయం )

శ్రీ టి. హరీష్ రావు ః అధ్యక్షా, శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ, వారు తమకూ బాధ్యత ఉందని అన్నారు. వారి మెడ మీద ఎవరూ కత్తి పెట్టలేదని అంటున్నారు. వచ్చిన తెలంగాణాను, అంటే నోటికాడికొచ్చిన బుక్కను డిసెంబరు నెల 9వ తేదీ తరువాత ఎలా జారవిడిచారో అందరికి తెలుసు. దానికి ఈ సభే సాక్ష్యం. ఒకే రోజున పార్టీ సిద్ధాంతాలను అందరూ ఒక్కటై రాజీనామా చేసి ఎలా నోటికాడి బుక్కను తీసారో అందరూ చూస్తున్నాము. వారు చేసిందంతా తెలంగాణా ప్రజలకు తెలుసు. ఈ రోజు కలిసి ముందుకుపోయి తెలంగాణాను సాధించకపోతే మనలను ఎన్నుకొన్న ప్రజలకు మనమే ద్రోహం చేసినవారమవుతాము. నాలుగు సంవత్సరాలు మేము ప్రయత్నం చేయలేదా? ఎక్కని కొండ, మొక్కని బండ ఉందా? అందరిని కలిసాము.

చిట్టచివరకూ ఈ తెలంగాణాను ప్రభుత్వం ఇవ్వలేదు. 1000 మంది ప్రాణాలు బలిగొన్నారు. పట్టించుకోలేదు. రోజు రోజూ ప్రజా జీవనం దుర్భరం అయ్యిందనే ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టాము. తమ ద్వారా ప్రధాన ప్రతిపక్షమయిన తెలుగు దేశం పార్టీకి తెలియచేసుకున్నాము. గతంలో అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు వారు అడగకపోయినా వారితో కలిసి వెళ్లాము. కాంగ్రెస్ పార్టీ తెలంగాణా ఇవ్వలేదని, మోసం చేసిందని అవిశ్వాస తీర్మానం పెడితే వారితో కలిసాము. 2009వ సంవత్సరంలో పొత్తు పెట్టుకున్నాము. ఈ రోజు తెలంగాణా ఇవ్వని ఈ ప్రభుత్వాన్ని దించేయాలంటే అవిశ్వాస తీర్మానం పెట్టాము. ఈ

రోజు తెలుగు దేశం పార్టీ వారిని అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ముందుకు రావలసిందిగా అప్పీలు చేస్తున్నాము. వారి నాయకుడు చంద్రబాబునాయుడు గారు పాద యాత్ర చేసేటప్పుడు ప్రతీ రోజూ వారు చెప్పిన రెండు, మూడు పేపర్ స్టేట్‌మెంట్స్ నేను చదివి వినిపిస్తాను. ఫిబ్రవరి నెల 8వ తేదీ 2013న పెద్దకాకానిలో ఇచ్చిన ఇంటర్వ్యూ ఏమంటే, **' ముఖ్యమంత్రి ౽౽౽** •••

మిస్టర్ స్పీకర్ : సభలో పేపర్ స్టేట్‌మెంట్ చదవకూడదు. That will not go on record.

శ్రీ టి. హరీష్ రావు : అధ్యక్షా, నేను చెప్పేదేమంటే, కాంగ్రెస్ సర్కారు అంతమే పరిష్కారమని చంద్రబాబునాయుడుగారు పాదయాత్రలో చెప్పారు. కాంగ్రెస్ పార్టీని అంతం చేయండని స్వయంగా చంద్రబాబునాయుడుగారు మాట్లాడినది. కాంగ్రెస్ పార్టీని అంతమొందిస్తే, అవినీతి అంతమవుతుందని చంద్రబాబునాయుడుగారు మాట్లాడారు. గుంటూరు, మహబూబ్ నగర్, కోయలకుంట్లలో చాలా సందర్భాలలో మాట్లాడారు.

( అంతరాయం )

మిస్టర్ స్పీకర్ : మీరు చదవడానికి వీలు లేదు.

శ్రీ టి. హరీష్ రావు : అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఒక్క రోజు కూడా కొనసాగడానికి వీలు లేదు, ప్రభుత్వం అంతమయినప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని వారు చెప్పారు. మన మధ్య బేషజాలు అవసరం లేదు. ఈ విధంగా ఎప్పుడూ జరగలేదు. ప్రధాన ప్రతిపక్షం కాదని విపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టిన సందర్భం జరుగుతున్న పరిస్థితి నేడు చూస్తున్నాము. మాటలేమో కోటలు దాటుతున్నాయి, దయచేసి మాటలకు కట్టుబడి ఉండండి. అందరూ కలిసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపే ప్రయత్నం చేద్దాము. అందరూ కలిసి పోరాడదామని విజ్ఞప్తి చేసాము. మా అవిశ్వాస తీర్మానానికి మద్ధతు తెలిపిన భాగస్వామ్య పార్టీలకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. తెలంగాణా ఇవ్వకపోతే అందరూ కలిసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో కలిసిరావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకుగాను కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణా.

శ్రీ పి కిష్టారెడ్డి (నారాయణఖేడ్) : అధ్యక్షా, ఈ రోజు మిత్రులు మా హరీష్‌రావుగారు మాట్లాడుతూ, మెదక్ జిల్లా గురించి మాట్లాడారు. తెలంగాణాకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏలు పాలు పంచుకోవడం లేదని అన్నారు. తెలంగాణా గురించి ప్రస్తావించడం లేదన్నారు. శ్రీధర్‌బాబుగారు కూడా మాట్లాడారు. హరీష్‌రావుగారు పుట్టకముందు నుండే తెలంగాణా కోసం ఎన్నో ఉద్యమాలు చేసి జైలుకి వెళ్లి శిక్ష అనుభవించి వచ్చాను. మాది జాతీయ పార్టీ. ఈ రోజు కాంగ్రెస్ పార్టీలో గత 48 సంవత్సరాల నుండి ఎప్పటి అవసరాన్నిబట్టి అప్పుడు మా ప్రాంత అభివృద్ధి గురించి, ప్రజల సంక్షేమం గురించి పోరాడుతూనే ఉన్నాను.

మ.1.50

రాజీనామా చేయాల్సిన అవసరం వచ్చినప్పుడు మా తెలంగాణా ఎమ్.ఎల్.ఏ.లం రాజీనామా చేశాం. మాకు హై కమాండ్ ఉంది. హై కమాండ్‌కు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత మా కాంగ్రెస్ వారిపైన ఉంది. తెలంగాణా ఇస్తుందనే విశ్వాసం మాకు పూర్తిగా ఉంది. కాబట్టే మేము అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. అందుకే, తెలంగాణా సాధించడానికి మా పద్ధతిలో మేము ప్రయత్నాలు చేస్తున్నాం.

••• Expunged as ordered by the Chair

హరీష్‌రావు గారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గారు చిత్తూరు జిల్లాకు రూ.7,000 కోట్లను ఇచ్చుకొన్నారని చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి గారు త్రాగునీటి నిమిత్తం ఈ పర్యాయం అడగ్గానే రూ.180 కోట్లు ఇచ్చారు. మంజీరా నుండి మంచి నీటిని తీసుకొనే నిమిత్తం రూ. 100 కోట్లను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారికే దక్కుతుంది. వారిది ప్రాంతీయ పార్టీ. ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం, కాంగ్రెస్ పార్టీని తిట్టడం తప్ప వారికి వేరే ఎజెండా లేదు. మాకు చిత్తశుద్ధి ఉంది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోనే తెలంగాణా సాధించగల్గుతామన్న విశ్వాసం నాకు ఉంది. మా నాయకురాలు సోనియా గాంధీ గారు తప్పకుండా ఎప్పుడైనా చెపుతారని నేను తెలియజేస్తున్నాను.

శ్రీ జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్): అధ్యక్షా, మంత్రి గారు మాట్లాడుతూ, తెలంగాణా సాధిస్తామని, ఢిల్లీలో వారి వంతు పాత్రను పోషిస్తామని చెపుతున్నారు. అసెంబ్లీలో తీర్మానం చేయండని గతంలోనే ఢిల్లీ వారు చాలా స్పష్టంగా చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, తెలంగాణాపై తీర్మానాన్ని శాసనసభలో పెట్టే ప్రసక్తే లేదని ఛాలెంజ్ విసురుతున్నారు. శాసనసభలో 294 మంది ఉంటే, సి.పి.ఎమ్. పార్టీ వారు తప్ప మిగిలిన అన్ని పార్టీల వారూ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. తెలంగాణాపై తీర్మానం చేయడమన్నది ఇక్కడ మీ చేతుల్లో ఉన్న అధికారం. మీరు ఒక్క కనుసైగ చేస్తే, తెలంగాణా మంత్రులు, ఎమ్.ఎల్.ఏ.లు ఒక్క మాట చెపితే, మీ మాటకు కట్టుబడే పరిస్థితి ఈ శాసనసభలో ఉంది. మీ చేతుల్లో ఉన్న తీర్మానాన్ని మీరు చేయకుండా, ఢిల్లీలో ఉండి మేం పొడిచి తీసుకువస్తామంటే, ఇది ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమం కాక మరేంటని అడుగుతున్నాను. మీకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తెలంగాణా కావాలని అడగండి. తెలంగాణాను ఇచ్చేది ఢిల్లీ వారే. కానీ, తెలంగాణా కావాలని అడిగే చిత్తశుద్ధి, నిజాయితీ మీకు లేకుండా ఏదో ఒకటి చేస్తామని అంటే ఈ రోజు తెలంగాణా ప్రజానీకం నమ్మడానికి సిద్ధంగా లేరని తెలియజేస్తున్నాను. మీ చిత్తశుద్ధిని మీరు నిరూపించుకోండి. మీరు తెలంగాణా గురించి అడగండి. అడిగే ధైర్యమే మీకు లేదు.

(అంతరాయం)

శ్రీమతి వై.ఎస్.విజయమ్మ (పులివెందుల): అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ నిబంధన 75 ప్రకారం మంత్రి మండలిపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై జరుగుతున్న చర్చపై మాట్లాడ్డానికి అవకాశం ఇచ్చినందుకు మొట్టమొదటగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారు తెచ్చిన ఈ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి నాకు చాలా చాలా బాధగా ఉంది. ఆయన మాటలకు, ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలకు ఈనాడు ఈ ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. 2009 ఎన్నికల సందర్భంగా ఆయన రెండు మాటలు చెప్పారు. పేదవారికి 30 కి.లోల బియ్యం ఇస్తామన్నారు. రైతులకు నిరంతరాయంగా తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. వారు మ్యానిఫెస్టోలో పెట్టకపోయినా, అంతకు ముందు ఐదు సంవత్సరాలు ఏ విధంగా అయితే కరెంటు ఛార్జీలను పెంచలేదో అదే విధంగా వచ్చే ఐదు సంవత్సరాలు ప్రభుత్వం కరెంటు ఛార్జీలను పెంచదని ఆయన చెప్పడం జరిగింది. ఈనాడు ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఏవీ లేవు. ఆయన శాచురేషన్ విధానం అంటూ ఒక విధానాన్ని తీసుకురావడం జరిగింది. ఆయన ఒక్క పైసా కూడా వేటి మీదా పెంచలేదు. ఈ రోజు ఈ అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడమన్నది చాలా దురదృష్టకరం. 'ఈ రాష్ట్రంలో ప్రభుత్వమే లేదని, ఈ ప్రభుత్వం ఒక్క రోజు కూడా కొనసాగడానికి వీల్లేదని, కొడవళ్లతో ఈ ప్రభుత్వం వెంట పడాలని' ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ అధినేత రకరకాలైన ప్రసంగాలు చేస్తున్నారు. ఆయన రెండు వేల కి.మీలకు పైగా పాదయాత్ర చేశారుట. ప్రజల్లో తిరుతున్నారట. మరి ఆయన చేతుల్లో ఉన్న ఆయుధాలను ఆయన

ఉపయోగించకపోవడంలో అంతరార్థం ఏమిటో ఎవరికీ అంతుపట్టకుండా ఉంది. ఈనాడు అధికార పక్షం, ప్రధాన ప్రతిపక్షం రెండూ కుమ్మక్కు అయిపోయాయి. కాబట్టి ప్రజా పక్షంలో ఉండే రాజకీయ పార్టీలు ....

(అంతరాయం)

శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్: అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డర్.

(గౌరవ ఉప సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : నరేంద్ర కుమార్ గారు ఏమిటి మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్?

శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ (పొన్నూరు) : అధ్యక్షా, ఈ ప్రభుత్వంపై వారు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతోంది. వారు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చారా? లేక తెలుగుదేశం పార్టీపై అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చారా? వారి యొక్క బెయిల్ కోసమో, లేక ఎమ్.ఎల్.ఏ.ల కొనుగోళ్ల కోసమో వారు అవిశ్వాస తీర్మానం పెడితే మేము మద్దతు పలకం అని చెప్పాం. తెలుగుదేశం పార్టీ నుండి గెలిచిన శాసనసభ్యులు వారి కండువాలను కప్పుకొని, వారి ప్రక్కన తిప్పుకొంటే వారా మా గురించి మాట్లాడేది? చంద్రబాబునాయుడు గారు ప్రజల మధ్య ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేసి ఎమ్.ఎల్.ఏలను గెలిపించారు..

(మైక్ కట్ చేయబడింది.)

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : విజయలక్ష్మి గారు మీకు అవకాశం ఇస్తున్నాను మీరు మాట్లాడండి.

(అంతరాయం)

నరేంద్ర గారు మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటో చెప్పండి.

శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ : అధ్యక్షా, ఈ రోజు వారి ఇన్ని మాటలు చెపుతున్నారు. మా దగ్గర ప్రత్తిపాడులో ఎన్నికలు జరిగాయి. అక్కడకు శ్రీమతి విజయమ్మ గారు, షర్మిల గారు వచ్చారు.' రాజశేఖరరెడ్డి గారి మరణానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం, సోనియా గాంధీ గారే' అని చెప్పారు. ఈ రోజు అదే ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో వారు ఎట్లా ఓట్లు వేస్తారు సార్.

(మైక్ కట్ చేయబడింది.)
(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : విజయమ్మ గారు మీరు మాట్లాడండి.

**మ.2.00**

శ్రీమతి వై.ఎస్.విజయమ్మ : అయినప్పటికీ ఆయన తన చేతిలో వున్న ఆయుధాన్ని వుపయోగించకపోవటంలో అంతరార్థమేమిటన్నది ఎవరికీ అంతు పట్టటం లేదు. ఇప్పుడు అధికార పక్షం, ప్రధాన ప్రతిపక్షం రెండూ కుమ్మక్కైపోయాయి కాబట్టి ప్రజా పక్షంలో వుండే రాజకీయ పార్టీలు ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టవలసి వచ్చింది. ప్రధాన ప్రతిపక్షంగా వుండి, ప్రతిపక్షనాయకుడుగా సభలో వున్న వ్యక్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోజూ మాట్లాడుతూ కూడా దానికి వ్యతిరేకంగా ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టనని, వేరే పార్టీలు పెట్టినా దానికి మద్దతు ఇవ్వకూడదని విప్ జారీ చేసిన వైనం మన రాష్ట్రంలో, మన దేశంలో బహుశా మొత్తం ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఎక్కడా వుండబోదేమో!

( తెలుగుదేశం సభ్యులు మరియు వైఎస్ఆర్‌సిపి సభ్యులచే తీవ్ర అంతరాయం )

అధ్యక్షా, ఈ రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం గురించి మాట్లాడుకుంటున్నాము. 1956లో రాష్ట్రావతరణ జరిగిన అనంతరం ఈ 56 ఏళ్ల కాలంలో ఏనాడూ కనీవినీ ఎరుగని విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విద్యుత్ కోతను ఎదుర్కొంటున్నది. విద్యుత్ కోతలనేవి పరిశ్రమలు, గృహావసరాలపై ఒకే విధంగా దారుణ దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం అధికారికంగా నెలకు 12 రోజుల పాటు విద్యుత్ కోతను విధిస్తే వాస్తవానికి 15 రోజుల పాటు కోతను అమలు చేస్తున్నారు. ఈ విద్యుత్ కోతల వల్ల దాదాపుగా 1.80 లక్షల కుటీర పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న 20 లక్షల కుటుంబాల వారి జీవనోపాధి ప్రశ్నార్థకమైంది. వారి జీవితాలు ఈ రోజున ప్రమాదంలో పడ్డాయి. ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్న వారు ఇప్పటికే రోడ్డున పడ్డారు. ప్రభుత్వంలో ఏ ఒక్కరికి కూడా వారి సమస్యలు వినే తీరిక కూడా లేకుండా పోయింది. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం వారు తీసుకున్న రుణాలు, వడ్డీ వసూళ్లను వాయిదా వేయవలసిన అవసరముంది. మన రాష్ట్రంలో విద్యుత్ కొరత తీవ్రంగా వున్న నేపథ్యంలో మన రాష్ట్రానికి ఎన్న దగిన ఏ ఒక్క పారిశ్రామిక సంస్థ రాకుండా పోవటమే కాకుండా ఇక్కడున్నవి కూడా పక్క రాష్ట్రాల బాట పడుతున్నాయంటే ఆశ్చర్యమేమీ లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రం మొత్తం ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయింది.

(అధికార పక్ష సభ్యులచే అంతరాయం )

ఈ రోజు చిన్నచిన్న పరిశ్రమలు పెట్టుకున్న వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఈ రాష్ట్రంలో వుంది. వ్యవసాయ పనులు జోరుగా సాగే సమయంలో ఇవ్వాళ విద్యుత్ కోతలు జోరుగా సాగడం వల్ల రైతులకు కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక వ్యసాయం పూర్తిగా దెబ్బతింది. ఇళ్లకు కూడా కరెంటు ఎప్పుడు ఇస్తారో, ఎప్పుడు తీస్తారో తెలియని వాతావరణం వుంది. ఎంత దురదృష్టకరమైన పరిస్థితి ఇవ్వాళ మనకుంది? ఉచిత విద్యుత్ కూడా ఇవ్వాళ మనకు పనికిరావటం లేదు. అధికారికంగా ఆరేడు గంటలు, అనధికారికంగా పన్నెండు గంటల విద్యుత్ కోతల వల్ల ఇవ్వాళ పల్లెల్లో చీకట్లు కమ్ముకున్నాయి. తాగు నీరు కూడా అందని పరిస్థితి ఇవ్వాళ వుంది. ఆ రోజున ఒక బల్బు ఒక ఫ్యాన్ వున్న వారికి రాజశేఖర రెడ్డి గారు ఉచిత విద్యుత్ ఇస్తే ఇవ్వాళ వారికి కూడా వేలకు వేల చొప్పున బిల్లులొస్తున్నాయి. నెలకు 300 యూనిట్ల లోపు వినియోగించుకునే చిన్న , మధ్యతరహా కుటుంబాల వారికి ఈ ప్రభుత్వం వారు 116 శాతం వరకు విద్యుత్ ఛార్జీలను పెంచితే 500 యూనిట్లకు పైగా వినియోగించుకునే పెద్ద పెద్ద కుటుంబాల వారికి 33 శాతం వరకు మాత్రమే విద్యుత్ ఛార్జీలు పెంచుతారట! బీదవారంటే మీకు ఎందుకు కోపం? మీరు చేస్తున్న దాని వల్ల వున్న వాళ్లకే మేలు జరుగుతున్నది. టెలిస్కోపిక్ విధానం తీసివేయటం వల్ల బీద వారికి అన్యాయం జరుగుతోంది. చాలా ప్రాబ్లమ్స్ వారు ఎదుర్కోవలసి వస్తుందని ఈ ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

శ్రీ కన్నా లక్ష్మి నారాయణః అధ్యక్షా, నేను మీ ద్వారా శ్రీమతి విజయమ్మ గారిని ఒకటి అడుగుతున్నాను. అసలు రాజశేఖర రెడ్డి గారు ఏ పార్టీ? మీరు ఏ పార్టీ అని? 2004లో........

(వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం )

ప్రజాస్వామ్యంలో వ్యక్తులు కాదు పొలిటికల్ పార్టీలు ప్రధానం . ఇప్పుడు విజయమ్మ గారు ఏ పార్టీ నుండి రెప్రజెంట్ చేస్తున్నారు? రాజశేఖర రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ. మీరే పార్టీ?

(వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం )

రాజశేఖర రెడ్డి గారు మా నాయకుడు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు. మీదే పార్టీ? 2004లో సంక్షేమ కార్యక్రమాలన్నీ కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాము. అప్పట్లో డి.శ్రీనివాస్ గారు పిసిసి ప్రెసిడెంటుగా వున్నారు. రాజశేఖర రెడ్డి గారు సిఎల్పి నాయకుడుగా వున్నారు. గులామ్ నబీ ఆజాద్ గారు మా పార్టీ కి సంబంధించి ఈ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా వున్నారు. ఎలక్షన్ మ్యానిఫెస్టో అనేది మా నాయకురాలు సోనియా గాంధీ గారి అప్రూవల్‌తో ఇవ్వడం జరిగింది. అది మా పార్టీ మ్యానిఫెస్టో. రాజ శేఖర రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీలో నాయకుడు. మీ పార్టీలో కాదు. అది క్లారిఫై చేసుకొని చెప్పమని చెబుతున్నాను.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం )

శ్రీమతి వై.విజయమ్మః వీటన్నింటి గురించి ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం చెబుతున్న సమాధానాలు విస్తు గొలుపుతున్నాయి. బొగ్గు లేదంటున్నారు. గ్యాస్ లేదంటున్నారు. ప్రాజెక్టుల్లో నీరు లేదంటున్నారు. ఇవేవీ లేవు కాబట్టి మమ్మల్నేమి చెయ్యమంటారన్నట్టుంది ప్రభుత్వ సమాధానం. ప్రజలు వాళ్ల తిప్పలేవో వాళ్లే పడాల్సిన వాతావరణమున్నట్టుంది. నేను ప్రభుత్వాన్ని విద్యుత్ గురించి నాలుగు ప్రశ్నలు వేస్తున్నాను. దానికి సమాధానాలు కోరుతున్నాను. గడచిన రెండేళ్లుగా మన రాష్ట్రంలో గ్యాస్ ఉత్పత్తి క్రమేపీ క్షీణిస్తున్న విషయాన్ని, మన రాష్ట్రంలో గ్యాస్ ఆధారంగా పని చేసే విద్యు త్ ప్రాజెక్టులు తమ సామర్థ్యం మేరకు పని చేయటం లేదన్న వాస్తవాన్ని ఈ ప్రభుత్వం గమనించిందా అని అడుగుతున్నాను. గడచిన నాలుగేళ్లుగా బొగ్గు ఉత్పత్తికి, దాని డిమాండుకు మధ్య తీవ్ర అంతరం పెరిగిపోతున్న విషయాన్ని గమనించి వుంటే బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటన్న విషయాన్ని ఆలోచన చేసి ప్రణాళిక ప్రకారం బొగ్గు దిగుమతిని పెంచుకునేది. అది జరగలేదు. గడచిన 15 ఏళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే అందులో గత పదేళ్ల కాలంలో కృష్ణానదిలో నీరు నిండని కారణంగా విద్యుదుత్పత్తి తీవ్రంగా దెబ్బతింది. కనీసం ఈ విషయాన్నైనా ప్రభుత్వం ఆలోచించాలి కదా? ఉత్తరాదిన, దక్షిణాదిన వున్న గ్రిడ్స్ సామర్థ్యాలను 2014 లో మాత్రమే పెంచే అవకాశముందని, విద్యుత్‌ను ఈలోగా కొనాలనుకుంటే దానికి ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఈ ప్రభుత్వానికి ఎందుకు అనిపించలేదు? గత సంవత్సరం ట్రాన్స్‌కో ముందుగానే అనుమతి సంపాదించుకోవాలని, ఇప్పుడున్న గ్రిడ్ ద్వారా 1100 మిలియన్ యూనిట్లు దిగుమతి చేసుకోవాలని ముందే చెప్పడం జరిగినప్పటికీ ఈ ప్రభుత్వం మాత్రం స్పందించినట్లు లేదు. కాని కర్నాటక ప్రభుత్వం అంతలోనే 800 మిలియన్ యూనిట్లు కేటాయింపు చేసుకోగలిగింది. కాని మన ప్రభుత్వం కేవలం 230 మిలియన్ యూనిట్లు మాత్రమే తెచ్చుకోగలిగింది. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవలసిన అంశాలు కాదా లేక వేరే వాళ్లు చూసుకోవలసిన అంశాలా అని ఈ ప్రభుత్వాన్ని నేను అడుగుతున్నాను. ఇంత స్పష్టంగా కనపడుతున్న అంశాల మీద ఈ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టకుండా, ఉరుముతున్న సమస్యలను పట్టించుకోకుండా, ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఇలా ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడం న్యాయమా? అది నేరం కాదా అని మీద్వారా

అడుగుతున్నాను. మరొకవంక చూస్తే కేంద్రం నుంచి మనకు రావలసిన బొగ్గు, ఎల్‌పీజీ, విద్యుత్, గ్యాస్ మొదలైన వాటికి ముందుగా అనుమతులు సాధించకపోవటమన్నది ఈ రాష్ట్ర ప్రభుత్వం నుంచి జరిగిన మహాపరాధం కాదా అని నేను మీ ద్వారా అడుగుతున్నాను. మన రాష్ట్రంలో 2000 మెగావాట్ల వరకు గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు నిరుపయోగంగా వున్నాయి. వీటికి గ్యాస్ అందించి వుంటే రోజుకు 48 మిలియన్ యూనిట్ల వరకు మనకు విద్యుత్ లభించి వుండేది. రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఈ విషయంలో ఒప్పందాలు కుదుర్చుకుని వుంటే ఈ రోజున మన రాష్ట్రంలో ఏ గ్రామంలోనూ, ఏ ప్రాంతంలోనూ విద్యుత్ కోతను విధించాల్సిన అవసరమే వుండేది కాదు. ఏ పరిశ్రమ కూడా కరెంటు కోత వల్ల మూత పడి వుండేది కాదు. ఏ ఒక్కరు కూడా కరెంటు కోత వల్ల ఉద్యోగం, లేదా ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదు. మరి ప్రభుత్వం ఈ పనులు ఎందుకు చేయలేకపోయిందని నేను మీ ద్వారా అడుగుతున్నాను. తగిన ప్రణాళిక లేకపోవటం వల్ల ప్రజలను ఇలా గాలిలో దీపాల్లా మార్చేసే హక్కు, వాళ్ల జీవితాలతో ఆడుకునే హక్కు ఈ ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందని నేను మీ ద్వారా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. ఇంతకూ ఇది ప్రకృతి వైపరీత్యమా లేక ఊహించగలిగి, నివారించగలిగి వుండి కూడా ఈ ప్రభుత్వం పట్టించుకోకుండా నిద్రపోవటం వల్ల వచ్చిన వైపరీత్యమా అని నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్న రోజుల్లో ఏ రోజున కూడా పరిశ్రమ, వ్యవసాయరంగం, గృహావసరం ఇలా ఏ ఒక్క వర్గ వినియోగదారులపైన కూడా ఒక్క పైసా చార్జీ కూడా పెంచలేదు. దేశ చరిత్రలోనే అది ఒక రికార్డు.

మ.2.10

రైతులకు ఏటా 1500 కోట్ల యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇచ్చి కూడా ఆ రోజుల్లో మిగతా ఏ వర్గాల వినియోగదారుల మీదా భారం మోపలేదు. ఈ ప్రభుత్వం ఛార్జీలు దారుణంగా పెంచడమే కాకుండా మునుపటి సంవత్సరాల్లో వాడుకున్న విద్యుత్‌కు కూడా ఫ్యూయల్ ఎడ్జెస్ట్‌మెంట్ ఛార్జీల పేరిట వసూలుకు దిగి కూడా కరెంటు ఎందుకు ఇవ్వలేకపోతుందని నేను అడుగుతున్నాను. వైఎస్‌గారి హయాంలో ఛార్జీలను పెంచకుండానే విద్యుత్ ఇచ్చారు. మరి ఈ ప్రభుత్వం ఛార్జీల మోత మోగించి కూడా ఎందుకు విద్యుత్ ఇవ్వలేకపోతోంది? ఎక్కువ బిల్లు, తక్కువ కరెంటు ఇదేమి దౌర్భాగ్యం . 2004-09 మధ్య పూర్తిగా అయిదేళ్లలో ఏ ఒక్క తరగతి విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ కోతా లేకుండా ఎలాంటి ఛార్జీల పెంపు లేకుండా పరిపాలన సాగిన విషయాన్ని ఈ రాష్ట్ర ప్రజలు ఎలా మరువగలరు? ఆ రోజుల్లోనే పారిశ్రామిక రంగానికి సరఫరా చేస్తున్న విద్యుత్ మీద యూనిట్‌కు 75 పైసల వంతున ఛార్జీ తగ్గించడం కూడా నిజం కాదా? అలా పారిశ్రామిక సంస్థలు 2009లో కూడా, 2004తో పోలిస్తే యూనిట్‌కు 75 పైసల చొప్పున తక్కువ చెల్లించిన విషయం వారు మరువగలరా? అందుకే వైఎస్ఆర్ పార్టీకి అంత బలం ఉండేది.

ఈరోజున రాష్ట్రంలో ఉన్న పరిస్థితులలో ఏ పల్లెకు వెళ్లినా, ఏ పట్టణానికి వెళ్లి చూసినా భయానక వాతావరణం నెలకొంది. ప్రతి పదిహేను రోజులకూ ఒకసారి డీజిల్ ధరలు, పెట్రోల్ ధరలు పెంచుతున్నారు. గ్యాస్ ధర సామాన్యులు అందుకోలేనంతగా పెరిగిపోయింది. నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమన్నాయి. ఇంకో వంక రైతన్నలు నిర్వేదంలో కూరుకుపోయారు. పంట పండించడానికి అయ్యే ఖర్చులు భగ్గు మంటుంటే, మద్దతు ధరలు భూమిలోనే ఉండిపోయాయి. కేవలం ఎరువుల ధరల్ని తీసుకుంటే రెండేళ్లలోనే 250 శాతం పెరగడమంటే ఇంతకు మించిన దారుణమైన వాతావరణం ఉంటుందా అని అడుగుతున్నాను. రాబోయే రోజుల్లో మనందరికీ ఆహారభద్రత, రైతుల జీవితం ఏమి కాబోతోందోనని తీవ్ర ఆందోళన కలుగుతోంది. ప్రకటించిన మద్దతు ధర అసలే తక్కువ అనుకుంటే అది కూడా లభించక రైతులు విలవిలలాడుతున్నారు. పత్తి, మిరప రైతుల బాధలు వర్ణనాతీతం . గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో రైతుల పరిస్థితి అటు కేంద్ర ప్రభుత్వం

పెంచుతున్న ఎరువుల ధరల కారణం వల్ల అయితేనేమి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిరాదరణ వల్ల అయితేనేమి రైతాంగం తేరుకోలేనంతగా దెబ్బతిన్నారు. 2009-10లో 50 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తికి పడిపోయి, అంతకు ముందు సంవత్సరం సంపాదించుకున్న డబ్బుతో కలిపి సర్వస్వం కోల్పోయే పరిస్థితికి వచ్చారు. ప్రభుత్వం తరపున ఇన్‌పుట్ సబ్సిడీ రూపంగా పది శాతం కూడా దక్కలేదు. వడ్డీయే మాఫీ చేయనప్పుడు ఇక రుణమాఫీ సంగతి దేవుడికి ఎరుక. తరువాతి సంవత్సరంలో దిగుబడి బాగున్నా రైతులు తీవ్రమైన నష్టానికి గురయ్యారు. ఎందుకంటే అటు ఫుడ్ కార్పోరేషన్‌గాని ఇటు రాష్ట్రప్రభుత్వం కాని ఆదుకునే పరిస్థితి లేకపోవడం వల్ల దిగుబడి పెరిగినా క్వింటాలు కనీస మద్దతు ధరకు రూ.300ల వరకు తక్కువకు అమ్ముకునే పరిస్థితి కల్పించారు. పోయిన సంవత్సరం నీలం తుఫానులో రైతులు నష్టపోయింది దాదాపు రూ.3560 కోట్లు అని స్వయంగా గవర్నరు నివేదికలో ఉంది. నీలం తుఫాను వచ్చి నాలుగు నెలలైంది . ఇప్పటి వరకు ఎంత డబ్బు విడుదలైంది? ఎంతమందిని ఆదుకున్నారు? అకాల వర్షాల వల్ల ఇటీవల ఆరున్నర లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గత రెండు మూడేళ్లలో పత్తి, మిరప రైతుల బాధలు వర్ణనాతీతం . అకాల వర్షాల వల్ల రైతులు మరింతగా దెబ్బతిన్నారు. చెప్పడానికి బీమాలు ఉన్నా దానివల్ల ఎవరికి లాభం చేకూరిందంటే సమాధానం రావడం లేదు. ఆరోజు చంద్రబాబు పరిపాలనలో 160 లక్షల టన్నులతో మొదలై 106 లక్షల టన్నులకు పడిపోయిన దానిని వైఎస్ఆర్ హయాంలో 204 లక్షల టన్నులు ఆహారధాన్యాల వరకు దిగుబడి రావడం జరిగింది. అది నిజం కాదా అని అడుగుతున్నాను.

అలాగే ఈ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని అంటున్నారు. పంట రుణాలు ఆంధ్రప్రదేశ్‌లో రూ.60,000 కోట్లున్నాయి వడ్డీ రాయితీ సుమారు రూ.2400 కోట్లు రావలసి ఉంటే బడ్జెట్‌లో కేవలం రూ.600 కోట్లు మాత్రమే కేటాయించారు. మరి దీని అర్థమేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. ఇదంతా చూస్తుంటే 70 శాతం మంది ఆధారపడ్డ వ్యవసాయరంగం సర్వ నాశనం అయిపోయింది, పల్లెలు కళా విహీనం అయ్యాయి. ఏడు గంటల విద్యుత్ కాస్తా మూడు గంటలకు పడిపోయింది. అది కూడా కొన్ని చోట్ల ఇవ్వడం లేదంటున్నారు . 70 లక్షల ఎకరాలు బోర్ల మీద ఆధారపడిన వ్యవసాయానికి మీ ప్రభుత్వం ఇవ్వవలసిన సాయం ఏమిటని అడుగుతున్నాను. ఇవన్నీ చూస్తుంటే రాష్ట్రం రెండు రకాల విపత్తుల్ని ఎదుర్కొంటోంది. కొన్ని ప్రకృతి సృష్టించినవి, కొన్ని ప్రభుత్వం సృష్టించినవి.

సామాన్యుడి ప్రయాణ వాహనమైన ఆర్‌టిసిని కూడా వదలకుండా ఛార్జీలు పెంచారు. మున్సిపల్ పన్నులు నీటి ఛార్జీలు పెంచారు. వ్యాట్ ఛార్జీలు విపరీతంగా పెంచారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్‌లో కోతలు పెట్టి మిగిలిన దానిని తల్లిదండ్రులే కట్టుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కనీసం నీరు కూడా లభ్యం కావడం లేదు. పన్నెండు గంటలు అధికారికంగా విద్యుత్ కోత, అనధికారికంగా మరో ఆరేడు గంటలు కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు. ఉన్న ఉద్యోగాలు నిలబడతాయా లేదా అన్న ఆందోళన కలుగుతోంది. బలహీన వర్గాల కోసం వైఎస్ఆర్ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తే ఇప్పుడు వాటి పరిస్థితి ఏమిటన్నది వివరించేందుకు సైతం ప్రభుత్వానికి మొహం చెల్లడం లేదు. ఆరోగ్యశ్రీ, 104, 108లు ఎలా నడుస్తున్నాయో ఏ మూలన ఉన్న ప్రజలను అడిగినా చెబుతున్నారు. మూడున్నర ఏళ్ల క్రితం వరకు అన్నపూర్ణలా ఉన్న రాష్ట్రాన్ని, మిగతా రాష్ట్రాలు అసూయపడేలా అన్నదాతను అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని, ఈ రోజున భవిష్యత్తు లేని రాష్ట్రంగా అంధకార ప్రదేశ్‌గా మార్చి వేశారని చెప్పడానికి ఎంతో బాధ కలుగుతోంది.

శాంతి భద్రతల విషయానికి వస్తే ఉగ్రవాదం అన్నది మానవాళికే మచ్చ. దానిని నిర్మూలించడంలో ప్రభుత్వాలు ఏ మాత్రం ఉపేక్ష వహించకూడదని రాజకీయాలకు అతీతంగా అందరం అంగీకరిస్తాము. ఉగ్రవాదులు దొంగదెబ్బ తీయడం వల్ల ప్రాణాలు బలైపోవడం చూస్తున్నాము. దిల్‌సుఖ్‌నగర్‌లో ఉగ్రవాదులు దుర్మార్గానికి పాల్పడిన సందర్భంలో వెంటనే కేంద్రహోమ్ మంత్రి చేసిన ప్రకటన దిగ్భ్రాంతి కలిగించింది. తాము ముందుగా హెచ్చరించినా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అన్నారు.

రాష్ట్రంలో గత సంవత్సరం ఏడు శాతం జిఎస్‌డిపి రేటు ఉంది. ఈ సంవత్సరం అది ఆరు శాతానికి పడిపోతుందని అందరికీ తెలుసు. కేంద్ర ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో వచ్చే రెండేళ్లలో బొగ్గుగానీ, గ్యాస్‌గానీ లభించదన్నారు. అదనంగా 185 మిలియన్ టన్నుల బొగ్గును వచ్చే సంవత్సరం దిగుమతి చేసుకుంటే తప్ప మన విద్యుత్ కేంద్రాలు నడిచే అవకాశం లేదని అన్నారు. జిడిపిలో ఐదు శాతం విదేశీ మారక లోటు ఉందని చెప్పారు. ఒక వంక విదేశీ మారక ద్రవ్యం లేకుండా, ఇంకో వంక పోర్టుల సౌకర్యాలు లేకుండా భారత దేశం ఎలా బొగ్గు దిగుమతులు చేసుకోగలుగుతుంది? దిగుమతి చేసుకున్న బొగ్గు దేశంలో రైల్వేల ద్వారా మిగతా ప్రాంతాలకు ఎలా చేర్చగలుగుతారు? వాటికి అంత సామర్థ్యం ఎక్కడిది? దిగుమతి చేసుకున్న బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తే 200 శాతం, దిగుమతి చేసుకున్న గ్యాస్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తే 300 శాతం ఎక్కువ ఖర్చు అవుతుంది. మొత్తం మీద చూస్తే వచ్చే రెండు సంవత్సరాలలో బొగ్గు, గ్యాస్ లభించదు. అంటే పారిశ్రామికంగా కాని, ఆర్థిక వ్యవస్థ పరంగా గానీ అభివృద్ధి ఉండదని అర్థం .

వ్యవసాయం దాని అనుబంధ రంగాల వృద్ధి రేటు 1.96 శాతానికి పడిపోయిందని గవర్నర్ గారే చెప్పారు. వ్యవసాయం సరిగా లేక, పారిశ్రామిక రంగం కోలుకునే పరిస్థితులు లేక వచ్చే రెండు మూడేళ్లలో ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల ప్రజలకు కడగండ్లు తప్పని పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

ఇంకొక ఆశ్చర్యకరమైన ప్రకటన ఏమిటంటే, రాజీవ్ యువ కిరణాల ద్వారా 15 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఒక రోజున ముఖ్యమంత్రిగారు అన్నారు. తరువాత రోజున దానిని సవరించి 15 లక్షలు కాదు, 35 లక్షలు అని అన్నారు. ఆ ఉద్యోగాలు ఇచ్చిన తరువాతే ఎన్నికలకు వెళతామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం 2.77 లక్షల ఉద్యోగాలు మాత్రమే ప్రయివేటు రంగంలో ఇచ్చామని అధికారికంగా ప్రకటించింది. ఆ విధంగా ఎలా చెబుతారని అడుగుతున్నాను.

స్మాల్ అండ్ మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్ వారు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారు. చిన్న పరిశ్రమలు, చిన్న కార్ఖానాలు పెట్టుకొని తాము ఉపాధి కల్పించుకోవడమే కాకుండా మరి కొందరికి కూడా ఉద్యోగాలు కల్పిస్తున్నారు. అలాంటి వారు లక్షల మంది ఉన్నారు. ఆ విధంగా చిన్న చిన్న పరిశ్రమలు నిర్వహించుకునే వ్యక్తులకు తమిళనాడులాంటి చోట్ల ప్రభుత్వాలు వారి కోసం చర్యలు తీసుకుంటుంటే మన ప్రభుత్వం వారిని పవర్‌కట్స్‌కు బలి చేయడమే కాకుండా, వారు కొనుగోలు చేసే జనరేటర్ల మీద వ్యాట్‌ను 5 శాతం నుండి ఇటీవల 11 శాతానికి పెంచిందంటే ఈ ప్రభుత్వాన్ని ఏమనాలి?

గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం నడుస్తున్నట్లు కనపడుతోంది. గతంలో 9 సంవత్సరాలు అధికారంలో ఉన్నవారు క్రమం తప్పకుండా ఏటా భాగస్వామ్య

సదస్సులు, పార్ట్‌నర్‌షిప్ సమిట్లు అనేవి పెట్టడం, లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులకు ఒప్పందాలు, ఎమ్‌ఒయూలు కుదిరాయని చెప్పడం అప్పట్లో ఆనవాయితీగా ఉండేది. తొమ్మిదేళ్ల తరువాత చూస్తే ఒక్క వంద కోట్ల రూపాయల పెట్టుబడితో వచ్చిన మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఒక్కటంటే ఒక్కటి కూడా కనపడలేదు.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి (వనపర్తి): అధ్యక్షా, నేను రూల్ 342 ప్రకారం పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడిగాను. రూల్ 75 ప్రకారం ప్రభుత్వం మీద మాట్లాడాలి. రెండు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాను. సబ్జక్టుకు కన్‌ఫైన్ కావాలి. రెండవది పార్లమెంట్‌లో వ్రాతపూర్వక స్పీచెస్ ఉంటే టేబుల్ మీద ప్లేస్ చేస్తారు. మనం ఉపన్యాసం చదవడం సాంప్రదాయం కాదు. స్క్రిప్ట్ రైటర్సుకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. సబ్జక్ట్‌కు కన్‌ఫైన్ అయి స్క్రిప్ట్ వ్రాస్తే బాగుంటుంది.

శ్రీమతి వై.ఎస్. విజయమ్మ: మరల 8 సంవత్సరాల తరువాత కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం కూడా భాగస్వామ్య సదస్సులని పెట్టి రూ.6.5 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరిపోయాయని అట్టహాసంగా ప్రకటించారు. ఆ మాట విని యావత్ భారతదేశం నిర్ఘాంతపోయింది. పార్ట్‌నర్‌షిప్ సమిట్‌కు సంబంధించి ఎస్ఐపిబిలో రూ.1.32 లక్షల కోట్ల ప్రతిపాదనల్ని ఆమోదించామని అన్నారు. ఇప్పటికి ఒక్క యూనిట్ కూడా రాలేదు, ఒక్క ఉద్యోగం కూడా రాలేదని తెలియ చేస్తున్నాను.

రాష్ట్రంలో 2004 నుండి 2009 కాలంలో ఏ రోజు కూడా ఒక్క పైసా పన్ను పెంచలేదు, ఒక్క పైసా విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ఒక్కపైసా ఆర్‌టీసీ ఛార్జీలు పెంచలేదు. రైతు కుటుంబంలో పిల్లల చదువు, వృద్ధుల ఫించన్, పక్కా ఇల్లు, ఆహారభద్రత, ఆరోగ్య భద్రత లభించిన ఐదేళ్ల కాలం అది. అలాగే సమాజంలోని అన్ని వర్గాల వారికీ నచ్చిన పరిపాలన అందిన రోజులవి. ముఖ్యంగా రైతన్నకు, నేతన్నకు మంచి రోజులవి. కాబట్టే రాజశేఖర్ రెడ్డిగారి మరణాన్ని రాష్ట్రంలో తట్టుకోలేక కొన్ని వందల మంది మరణించారు. కానీ ఈ రోజున మళ్లీ రైతన్నల ఆత్మహత్యల వార్తలు వింటున్నాము. వ్యవసాయంతోపాటు పరిశ్రమ అంపశయ్య మీదకు చేరింది. అయినా ఈ ప్రభుత్వానికి మనసు లేదని తెలుస్తోంది. అన్ని ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రతిపక్షాన్ని, ప్రభుత్వాన్ని కదిలించలేకపోయింది. ఈ ప్రభుత్వం ఎవరికి ప్రతినిధి? చంద్రబాబుగారికా? ప్రజానీకానికా? కిరణ్ కుమార్ రెడ్డిగారికా? లేక రైతులు, కూలీలు, పేదలు అణగారిన వర్గాలు, మైనారిటీలకా? ఈ ప్రభుత్వం ఎవరిని రక్షిస్తోంది చంద్రబాబుగారినా లేక పేదలనా?

(ఈ దశలో టిడిపి నుండి అంతరాయం)

ఈ ప్రభుత్వం సాధించిన విజయం ఏమిటంటే కోపరేటివ్ ఎన్నికలలో గెలిచామని అంటున్నారు. అధికార దుర్వినియోగానికి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి, రైతులని అపహాస్యం చేయడానికి ఈ ప్రభుత్వం ఎన్నికలలో ఎంతకు తెగించిందో అందరికీ తెలిసి వచ్చింది. ప్రజల మనసు గెలుచుకోలేని ఈ ప్రభుత్వం చివరికి ఎన్నికల్లో ఎంతటి అక్రమాలకు అయినా తెగించే పరిస్థితికి వచ్చింది. ఇన్ని విధాలుగా విఫలం అయిన ఈ ప్రభుత్వానికి ఒక్క క్షణం కూడా ప్రభుత్వంలో కొనసాగే హక్కు లేదని మేము భావిస్తున్నాము.

క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, మిల్క్ హాలిడేలని అన్ని హాలిడేలు ప్రకటించే పరిస్థితిని ఈ ప్రభుత్వం కల్పిస్తుంటే రాబోయే కాలంలో ప్రజలు ఈ ప్రభుత్వానికి హాలిడే ప్రకటిస్తారని తెలుపుతూ, ఈ అవకాశమిచ్చినందుకు తమకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

శ్రీ డి. నాగేందర్‌: అధ్యక్షా, గౌరవనీయులు విజయమ్మగారన్నా, వైఎస్‌ఆర్ గారన్నా మాకు ఎంతో అభిమానము. నిజంగా రాష్ట్ర చరిత్రలో , శాసనసభ చరిత్రలో టిఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన నో కాన్ఫిడెన్స్ మోషన్‌ను సపోర్టు చేస్తారని మేము ఎప్పుడూ ఊహించలేదు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరిగే సమయంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ప్రాంతాలకు అతీతంగా, రాగద్వేషాలకు అతీతంగా ముందుకు పోవాలని వై.ఎస్ రాజశేఖర్ రెడ్డిగారు అనేవారు. కొన్ని పార్టీల వారికి సపోర్టు చేసినట్లయితే, మీరు హైదరాబాదు వెళ్లాలంటే పాస్‌పోర్ట్ తీసుకోవలసిన పరిస్థితి వస్తుందని వారు అన్నమాటను మరచిపోయారేమో తెలియదు కాని మేము మరచిపోలేదు. టిఆర్‌ఎస్ ప్రవేశ పెట్టిన నో కాన్ఫిడెన్స్ మోషన్‌ను వారు సమర్థించడం వల్ల వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి ఆత్మ ఘోషిస్తుందని గుర్తు చేసుకోవాలి. వారు చాలా స్కీమ్స్ గురించి చెప్పారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని సమస్యలు వచ్చినా ఎన్నికల ప్రణాళికలో పెట్టిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా పెట్టిన ఘనత సోనియాగాంధీ గారి నాయకత్వంలో వైఎస్‌ఆర్‌గారు పాటించారు. ఆ కార్యక్రమాలు పూర్తి చేస్తూ వైఎస్‌ఆర్‌గారు మొదలు పెట్టిన స్కీమ్స్‌ను తీసివేసి కొత్త స్కీమ్స్‌ను పెట్టకుండా పాత స్కీమ్స్‌నే కొనసాగిస్తామని అన్నారు. వైఎస్‌ఆర్‌గారు ప్రవేశ పెట్టిన ఏ స్కీమ్‌ను అయినా ఈ ప్రభుత్వం తుంగలో తొక్కిందా అనే విషయం చెప్పలేదు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ హౌసింగ్ స్కీమ్స్, రెండు రూపాయలకు కిలో బియ్యం మొదలైన పథకాలలో ఆర్థిక భారం ఎంతో పడింది. వైఎస్‌ఆర్‌గారి మరణానంతరం కిరణ్ కుమార్ రెడ్డిగారు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత ఒకే ఒక సంతకంతో రు.900 కోట్లు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, కిరణ్ కుమార్ రెడ్డిగారికే దక్కింది. నేను వారిని విమర్శించడానికి మాట్లాడడం లేదు. వారి అభిప్రాయం వారు చెప్పారు. నేను కాదనడం లేదు. నేను రాజశేఖర్ రెడ్డిగారి అభిమానిని. వారు ప్రవేశ పెట్టిన ...........

(అంతరాయం)

మ.2.30

అధ్యక్షా, నేనేమైనా కాంట్రవర్సీగా మాట్లాడితే you can always withdraw me the mike facility. నేనొక సూచన చేస్తున్నాను. రాజశేఖర్ రెడ్డి గారిని అభిమానించే వారు చాలా మంది ఈ సభలో ఉన్నారు. కానీ ఆయన మీద మాకు అంత అభిమానం ఉంది కాబట్టే మేం బాధపడుతున్నాం. ఎందుకంటే శాసనసభ చరిత్రలో ఈ రోజును బ్లాక్ డేగా పరిగణించాల్సి వస్తుంది. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రవేశపెట్టిటిన అవిశ్వాస తీర్మానానికి వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపినందుకు బ్లాక్ డేగా పరిగణించాలి. అందుకని నేను చెబుతున్నాను. రాజశేఖరరెడ్డి గారి ఆత్మ ఘోషించే విధంగా మీరు వ్యవహరించవద్దు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులు చూసింది. కొన్ని సార్లు అధికారంలో ఉంది, కొన్ని సార్లు అధికారంలో లేదు. అధికారమే కాంగ్రెస్ పార్టీ క్రైటీరియా కాదని మీ ద్వారా మనవి చేస్తున్నాను. రాజశేఖర రెడ్డి గారు........

(మైక్ కట్ చేయబడింది)

(వైఎస్సార్‌సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ కె.తారక రామారావు (సిరిసిల్ల): అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు దానం నాగేందర్ గారు ఇటీవలే చాలా గర్వంగా, ఘనంగా చెప్పారు. ఒక దశలో మా పార్టీ నుంచి కొన్ని విమర్శలు వారిపై వచ్చినపుడు చాలా ధైర్యంగా ఆయన చెప్పారు. మీ పార్టీ పుట్టక ముందు నుంచే 92 మంది శాసనసభ్యులను తెలంగాణ కోసం ఢిల్లీకి తీసుకువెళ్లానని చెప్పారు. అక్కడ సమర్పించిన వినతిపత్రంలో మొదటి సంతకం తనదేనని మంత్రి దానం నాగేందర్ గారు చెప్పారు. ఆనాడు విపక్షంలో ఉన్నారు కాబట్టి సంతకాలు పెట్టారు, సోనియాగాంధీ గారి

దగ్గరకు వెళ్లారు, తెలంగాణ కావాలని కోరారు. కానీ మంత్రి పదవి రాగానే హంగూ, మందీ మార్బలం వచ్చింది కాబట్టే తెలంగాణ వద్దు అన్న చందాన మాట్లాడుతున్నారు. అలా మాట్లాడడం నిజంగా చాలా సిగ్గు చేటు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో లేనపుడు ఒక మాట మాట్లాడడం మంచిది కాదు. ఒకసారి వారే స్వయంగా ఒక విషయం చెప్పారు. ఆయన మరిచిపోయారేమో అడగండి. ఆ విషయం ఇపుడు చెప్పవచ్చో, చెప్పకూడదో కానీ చెబుతున్నాను. నా భార్య కూడా నన్ను తెలంగాణ గురించి ఎందుకు మాట్లాడడం లేదని అడుగుతుందని నాతో వారే చెప్పారు. అటువంటి వ్యక్తి తెలంగాణ గురించి ఇపుడు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఒకప్పుడు తొలి సంతకం తెలంగాణ కోసం నాదేనని చెప్పారు. ఇపుడు ఎందుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు? దయచేసి రోజుకొక మాట మార్చినందుకు నియోజకవర్గ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను.

శ్రీ దానం నాగేందర్: అధ్యక్షా, నేను తారకరామారావు గారి లాగా విదేశాల నుంచి సరదాగా నేను తెలంగాణ కావాలని ఆ రోజు సంతకం పెట్టలేదు. ఆ రోజు ఉన్నటువంటి........

MR.DEPUTY SPEAKER: Kindly don't resort to personal allegations.

శ్రీ దానం నాగేందర్: అధ్యక్షా, ఆయన నా మీద వ్యక్తిగత ఆరోపణ చేశారు. He has named me. Therefore, I should clarify the things. ఇపుడు నేనొకటే చెబుతాను. ఆ రోజు 92 మంది శాసనసభ్యులతో అప్పటి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా ఉన్న రాజశేఖరరెడ్డి గారిని కలిశాను. తెలంగాణ కోసం మేమంతా ఒక ఫోరం ఏర్పాటు చేసుకొన్నప్పుడు ఆయన మీ సెంటిమెంట్‌ను గౌరవిస్తానని, తప్పకుండా మీ అభిప్రాయాలు చెప్పమని చెప్పారు. నేను ఆ రోజు I was first person to organize a meeting. అపుడు వీరు ఎక్కడ ఉన్నారు? అపుడు వారికి అడ్రస్ లేదు. ఈ రోజు కేటీఆర్, కేసీఆర్, హరీశ్‌రావు మొత్తం కుటుంబం అంతా పార్టీని నడిపిస్తుంది. ప్రత్యేకంగా సామాజిక తెలంగాణ గురించి ఎన్ని సార్లు చెప్పినా వీరికి దాని గురించి మాట్లాడే దమ్ము ఉందా? కానీ ఇపుడు మాట్లాడుతూ నాకు ఇపుడు మంత్రి పదవి వచ్చింది కాబట్టి మందీ మార్బలం అంటున్నారు.

بابو! حیدرآباد میں پیدا ہوا میں۔ دم ہے تو کبھی بھی، کہیں بھی، کوئی بھی چوراستہ پر چیلنج ہے میرا آپ سے---

నాకు మంత్రి పదవి రాగానే హంగూ, మందీమార్బలం వచ్చిందంటున్నారు. నేను పుట్టక ముందే మా కుటుంబం మొత్తం రాజకీయాల్లో ఉంది. మా నాన్న గారు స్వాతంత్ర్య సమరయోధులు, మా పెద నాన్న హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్. నేను హైదరాబాద్ నగరంలో పుట్టి పెరిగాను. సొంత రాజకీయాల కోసం తెలంగాణ అంశాన్ని తీసుకువచ్చిన చరిత్ర వీరికి ఉంది. వీరి మనుగడ కాపాడుకోవడం కోసం

(మైక్ కట్ చేయబడింది)

( సభ్యులు శ్రీ టి.హరీశ్ రావు నుంచి అంతరాయం)

MR.DEPUTY SPEAKER: I will give you an opportunity. మీరు కూర్చోండి. I will give you an opportunity.

( సభ్యులు శ్రీ టి.హరీశ్ రావు నుంచి అంతరాయం)

(వైఎస్సార్‌సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: అధ్యక్షా, ఇంతకు ముందు వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు మాట్లాడుతూ రెండు అంశాలు చెప్పారు. ఒకటి, చంద్రబాబు నాయుడు గారి పేరు ప్రస్తావించి ప్రభుత్వం ఆయనను రక్షిస్తుందని మాట్లాడారు. చంద్రబాబు నాయుడు గారి మీద సుప్రీంకోర్టులో మీరు కేసులు ఎందుకు వేశారు? ఆయన జైలులో లేరు, బెయిల్ అవసరం లేదు. వారికి ఎవరితో లాలూచీ పడాల్సిన అవసరం కానీ, ఖర్మ కానీ వారికి లేదు.

(ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుంచి చప్పట్లు)

మేడం గారు మాట్లాడుతూ ప్రజల కష్టాలు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని కదిలించలేకపోయాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా మేమేమి చేశామన్న దానికి 28.5.2011 నాడు

(మైక్ కట్ చేయబడింది)

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR.DEPUTY SPEAKER: I will give you chance. నేను నర్సింహులు గారికి మైక్ ఇస్తాను. అపుడు మాట్లాడండి. దయచేసి అర్థం చేసుకోవాలి. Please sit down.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: అధ్యక్షా, 28.5.2011 నాడు సాక్షి దినపత్రికలో జగన్మోహన్ రెడ్డి గారు ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. చంద్రబాబు నాయుడు గారూ, మీరు అవిశ్వాస తీర్మానం పెట్టండి, ప్రభుత్వాన్ని పడగొట్టే బాధ్యత నాది అని స్టేట్‌మెంట్ ఇచ్చారు. మేం డిసెంబర్ 5వ తేదీన అవిశ్వాసం పెట్టాం. ఏమి జరిగింది? మీ కొనుగోలు శక్తి మీద ఆధారపడి మేం అవిశ్వాస తీర్మానాలు పెట్టాలా? మేం మిమ్మల్ని అడుగుతున్నాను సూటిగా సమాధానం చెప్పండి.

(వైఎస్సార్‌సీపీ సభ్యులు శ్రీ కాపు రామచంద్రారెడ్డిచే అంతరాయం)

శ్రీ టి.హరీశ్ రావు: అధ్యక్షా, ఇంతకు ముందు మంత్రి దానం నాగేందర్ గారు మాట్లాడుతూ నా పేరు ప్రస్తావించారు.

MR.DEPUTY SPEAKER: Don't get into personal things.

శ్రీ టి.హరీశ్ రావు: అధ్యక్షా, నా పేరు ప్రస్తావించినపుడు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకుంది. నేను నాగేందర్ గారి లాగా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోతే తెలుగుదేశం పార్టీలో చేరడం, తెలుగుదేశం అధికారంలోకి రాకపోతే ఆ పార్టీకి రాజీనామా చేసి రాజశేఖర రెడ్డి గారి పక్షాన చేరలేదు. తెలంగాణ కోసం త్యాగాలకు సిద్ధపడ్డ కుటుంబం మాది. మా నాయకుడు పార్టీ పెట్టక ముందే మంత్రి పదవికి రాజీనామా చేశారు. మేం కూడా తెలంగాణ కోసం మంత్రి పదవులకు రాజీనామా చేశాం, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశాం. మా నాయకుడు తెలంగాణ కోసం 11 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి చావు నోట్లోకి వెళ్లి వచ్చారు. వారు తెలంగాణ ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి. తెలంగాణ కోసం పోరాడుతున్నది మా పార్టీ మాత్రమే. మేం మీ లాగా అధికారం కోసం బట్టలు మార్చినట్లు పార్టీలు మార్చలేదు.

(మైక్ కట్ చేయబడింది)

MR. DEPUTY SPEAKER: Please leave it there. మీరు మాట్లాడాల్సింది మాట్లాడారు. దయచేసి అంతటితో వదలివేయండి. హరీశ్ రావు గారూ, సభను సజావుగా నడవనీయండి.

శ్రీమతి బి.శోభా నాగిరెడ్డి (ఆళ్లగడ్డ)ః అధ్యక్షా, ఇంతకు ముందు దానం నాగేందర్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మేం మద్దతు తెలపడం బాధాకరంగా ఉందని చెప్పారు. మేం ముందే చెప్పాం. ప్రజా సమస్యల మీద ఎవరు ముందుకు వచ్చి అవిశ్వాస తీర్మానం పెట్టినా మేం మద్దతు ఇస్తామని ముందే చెప్పాం. సిపిఐ, సిపిఐ(ఎం), తెలుగుదేశం పార్టీలలో ఏ పార్టీ అవిశ్వాస తీర్మానం పెట్టినా కూడా మేం మద్దతు ఇస్తామని చెప్పాం. అందుకు కట్టుబడి ఈ రోజు ఏక వాక్యంతో తెలంగాణ రాష్ట్ర సమితి వారు ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి ప్రజా సమస్యల మీద ప్రభుత్వానికి శ్రద్ధ లేదు కాబట్టి మేం ముందుకు వచ్చి మద్దతు ఇచ్చాం. ఆ తీర్మానానికి మా పార్టీ ఒక్కటే కాదు, తెలుగుదేశం పార్టీ మినహా ఈ సభలోని భారతీయ జనతా పార్టీ, సిపిఐ, సిపిఐ(ఎం), లోక్‌సత్తా పార్టీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపాయి.

మ.2.40

(వైఎస్ఆర్‌సిపి సభ్యురాలు శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి మైకు ఇవ్వమని కోరసాగారు)

(అంతరాయం)

(సభ్యులు శ్రీ టి.హరీష్ రావు మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు – మరో వైపు అధికార పక్ష సభ్యులు శ్రీ దానం నాగేందర్ మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

(సభకు తీవ్ర అంతరాయం)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః శోభా నాగిరెడ్డి గారూ దయచేసి కూర్చోండి. హరీష్ రావు గారు మీకు ఇంతకు ముందే మైకు ఇచ్చాను, దయచేసి కూర్చోండి.

శ్రీ దానం నాగేందర్ః అధ్యక్షా,

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః నాగేందర్ గారు మీరు గౌరవ మంత్రి, దయచేసి కూర్చోండి. I have to run the House. You can't do like this. Please sit down. శోభా నాగిరెడ్డి గారూ మీరు చెప్పాల్సింది చెప్పారు దయచేసి కూర్చోండి. నరసింహులు గారూ మాట్లాడండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులుః అధ్యక్షా,

(అంతరాయం)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః దయచేసి అందరూ కూర్చోండి.

శ్రీ దానం నాగేందర్‌: అధ్యక్షా,

MR.DEPUTY SPEAKER: I have given you enough time. Nagender garu, don't get into personal allegations.

శ్రీ దానం నాగేందర్‌: సార్, నేను పర్సనల్ ఎలిగేషన్స్ చేయదలచుకోలేదు. నేను ఎవరి గురించీ పర్సనల్‌గా మాట్లాడలేదు. నేను ఒకటే చెప్పాను. ఇప్పుడు శోభా నాగిరెడ్డి గారు చెప్పిన విషయంలో కూడా నేను ఎక్కడా కాంట్రోవర్సీగా చెప్పలేదు. మధ్యలో కెటిఆర్ గారు మాట్లాడారు. శోభా నాగిరెడ్డి గారు ఇప్పుడేమన్నారు, సింగిల్ లైన్ రెజల్యూషన్ ఇచ్చారని చెప్పారు. నేనందుకే ఆ రిజల్యూషన్‌ని సభలో చదివాను. సార్, వాళ్లు ఈ ప్రభుత్వం మీద, ప్రభుత్వంలో ఉన్న మంత్రుల మీద నో కాన్ఫిడెన్సు మోషన్ అని రిజల్యూషన్‌లో ఇచ్చారు. అయితే హరీష్ రావు గారు మొత్తం ఎజెండా తెలంగాణా అంశం మీద తీసుకున్నారు. మీరు ఇచ్చిన నో కాన్ఫిడెన్స్ మోషన్‌కి, మీరు మాట్లాడే దానికి కాంట్రాడిక్టరీగా ఉందా, లేదా? మీరు రియలైజ్ కావలసిన అవసరం ఉందా, లేదా అనే విషయం నేను చెప్పాను. అది మీ ఇంగిత జ్ఞానానికే వదిలేస్తున్నాను. I am not dictating any terms. నా అభిప్రాయం చెప్పాను. తరువాత మీ ఇష్టం (శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి నుద్దేశించి). అందుకనే నేను రాజశేఖర్ రెడ్డి గారి ఆత్మ ఘోషిస్తుందని చెప్పాను. హరీష్ రావు గారు ఒక మాట చెప్పారు. ఏమన్నారంటే నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీలోకి వచ్చానని చెప్పారు. సార్, మేము ఆ పొజిషన్‌లో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్‌గా కెసిఆర్ గారు ఉన్నారు. రోజూ మాకు గవర్నర్ గారి ప్రసంగం మీద ఈ విధంగా మాట్లాడండి, ఎందుకంటే నాకు మంత్రి పదవి రాలేదని చెప్పారు. మంత్రి పదవి రాకపోవడం వలన ఆయన పక్కకు వెళ్లారు. తరువాత కొత్త పార్టీ పెట్టారు. కెసిఆర్ గారికి ఆరోజు మంత్రి పదవి ఇచ్చి ఉంటే పార్టీ పెట్టేవాళ్లా? సభలో ఆ విషయం చెప్పాల్సిన అవసరం ఉంది. నా జీవితంలో సగ భాగం నా భార్య. She has every right to tell me. ఆమె చెప్పిన దాంట్లో తప్పేముంది. కానీ మీలాగా నేను కపట నాటకం ఆడటం లేదు. నేను చేయాలనుకున్నది స్ట్రెయిట్‌గా చేస్తాను(శ్రీ టి.హరీష్ రావు నుద్దేశించి).

శ్రీమతి భూమా శోభా నాగిరెడ్డి: సార్, దానం నాగేందర్ గారు మా గురించి మాట్లాడారు. ఈరోజు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా మేము నిలబడిన తరువాత.... ఒక్కో పార్టీకి ఒక్కో ఎజెండా ఉంటుంది. అందరికీ ఫైనల్‌గా ప్రభుత్వం మీద నమ్మకం కోల్పోయిందన్న విషయం మీదనే మేమంతా సంతకాలు పెట్టి ఈరోజు అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చాము. విజయమ్మ గారు ప్రజా సమస్యల మీద మాట్లాడారు..అన్ని ప్రాంతాల సమస్యల మీద విజయమ్మ గారు చర్చించడం జరిగింది. మా ఎజెండా ఏమిటో మాకు తెలుసు. మాకు మీరు (శ్రీ దానం నాగేందర్ నుద్దేశించి) చెప్పాల్సిన అవసరం లేదు. ఈరోజు టిడిపి వాళ్లు మాట్లాడుతున్నారు. కానీ ఆరోజు టిడిపి అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు ప్రతిపక్షంగా ఉన్న మా పార్టీని ఓటు వేయమని అడగకపోయినా, వాళ్లు ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టి జగన్మోహన్ రెడ్డి గారిని, రాజశేఖర్ రెడ్డి గారిని రెండు గంటలు తిట్టినా ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండాలని మేము ఆరోజు 18 మంది ఎంఎల్ఏలం మా పదవులు పోతాయని తెలిసినా మేము ధైర్యంగా ముందుకు వచ్చి అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేసి మళ్లీ ప్రజల్లోకి వెళ్లి గెలిచి ఎంఎల్ఏలుగా వచ్చాం. మా నిజాయితీ గురించి ప్రశ్నించే హక్కు మీకు లేదు.

(మైకు కట్ చేయబడింది)

(వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ స్థానాల ముందు నిలబడి శ్రీమతి బి.శోభానాగిరెడ్డికి మైకు ఇవ్వమని కోరసాగారు)

MR.DEPUTY SPEAKER: Please sit down. What all that she wanted to clarify, she has clarified. How long does she take the Mike? నర్సింహులు గారూ మాట్లాడండి.

(అంతరాయం)

శ్రీ కె.తారక రామారావు ః అధ్యక్షా,

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః కెటిఆర్ గారూ, మీకు అడిగిన దాని కంటే ఎక్కువ సమయమిచ్చాను. Please take your seat.

(టిఆర్ఎస్, వైఎస్ఆర్సిపి సభ్యులచే సభకు అంతరాయం)

హరీష్ రావు గారూ, దయచేసి కూర్చోండి. We have to run the House. నర్సింహులు గారూ మాట్లాడండి.

మ.2.50

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ జాతీయ భావాలతో కూడిన ప్రాంతీయ పార్టీ.

(అంతరాయం)

ఏమి పుట్టిందయ్యా వీళ్లకి? కాంగ్రెస్ పార్టీ అవినీతికి, దోపిడి విధానానికి వ్యతిరేకంగా పుట్టడమే కాదు, పోరాటం చేసి, 9 నెలల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత మా ఎన్.టి.రామారావు గారిది. భారతదేశంలో కాంగ్రెస్ పార్టీని ప్రాంతీయ పార్టీగా తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీది. మీ అడ్రెస్ నేషనల్ కాంగ్రెస్ కాదు. ఈ రాష్ట్రంలో 1104 మండలాలను ఏర్పాటు చేసి, సామాజిక న్యాయం కల్పించడం జరిగింది. బడుగు బలహీన వర్గాల వారు గొంతెత్తి మాట్లాడే విధంగా రాష్ట్రంలో నూతన అధ్యాయాన్ని సృష్టించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. ఈ దేశ ప్రజలకు ఒక కుటుంబ పరిపాలన ఉండకూడదని, వీళ్లు చేసిన [illegible] ••• పోరాటం చేయాలని ముందుకు వచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలియజేస్తున్నాను.

(ట్రెజరీ బెంచీల నుండి అంతరాయం)

వాళ్లు కొంచెం ఓపికతో వింటే మంచిది. ఈరోజు విజయమ్మ గారిని చూస్తే జాలేసింది. స్క్రిప్ట్ తీసుకొచ్చిచారు. ఆమె పడుతున్న బాధ చూస్తే ఎవరికైనా ఇబ్బందిగా ఉంటుంది. ఈ రాష్ట్రం [illegible] గురి కావడానికి కారణం రాజశేఖర రెడ్డి అవునా కాదా అని అడుగుతున్నాను.

శ్రీ కాపు రామచంద్రారెడ్డి (రాయదుర్గం): అధ్యక్షా, ఈ రోజు సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడుతున్నారు. వాళ్ల కుమ్మక్కులు బయట పడతాయని, ప్రతిక్షణం ప్రజలను పక్కదోవ పట్టిస్తుంది వాళ్లు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పుడు చంద్రబాబు నాయడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి ఎం.ఎల్.ఏగా పోటీ చేయడం జరిగింది. ఆ తెలుగుదేశం పార్టీ వేరు, ఈ తెలుగుదేశం పార్టీ వేరు. వాళ్లు ఈ రోజు మాట్లాడుతున్నారు. రాజశేఖర రెడ్డి గారు భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఒక గొప్ప నాయకుడు.

••• Expunged as ordered by the Chair

వీళ్లు చేసిన దోపిడీని కప్పిపుచ్చడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈరోజు వాళ్లు బయట తిరుగుతున్నారంటే, వాళ్లు జైలుకు వెళ్లలేదంటే .......................

(తెలుగుదేశం పార్టీ సభ్యుల చే తీవ్ర అంతరాయం)

శ్రీ పి. కేశవ్ (ఉరవకొండ): అధ్యక్షా, చంద్రబాబు నాయుడు గారిపై కాంగ్రెస్ పార్టీ కోర్టు కేసులు వేసి విత్‌డ్రా చేసుకున్నారు. అవే కేసులు విజయమ్మ గారు వేస్తే, సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసింది. చంద్రబాబు నాయుడు గారికి క్లీన్‌చిట్ ఇచ్చింది. ******** అటు జగన్మోహన రెడ్డి గారు, ఇటు గాలి జనార్ధనరెడ్డి గారు జైల్లో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు జైల్లో లేరు. ఆ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. అవిశ్వాస తీర్మానంపై మాట్లాడమంటే, తెలుగుదేశం పార్టీ గురించి మాట్లాడుతున్నారు. తెలుగుదేశం పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదు. తెలుగుదేశం పార్టీ చేసిన పోరాటం వల్ల వాళ్లు జైల్లో ఉన్నారు.

(వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే తీవ్ర అంతరాయం)

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : అధ్యక్షా , ఈ రాష్ట్ర ఖజానా మొత్తం ...........

(వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే తిరిగి అంతరాయం)

*** రాజశేఖర రెడ్డి గారు. ఆయా కంపెనీలలో వాటాలున్నటువంటి తమ్ముళ్లు అంత మాత్రం మాట్లాడకపోతే బాగుండదు కదా.

(వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే తిరిగి అంతరాయం)

ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించి రామచంద్రారెడ్డి గారు కూడా ఒక డైరెక్టర్. ***

(అంతరాయం)

మీరు తరువాత మాట్లాడండి. మీరు మాట్లాడేటప్పుడు ఏమన్నారు, కాంగ్రెస్ పార్టీతో తెలుగుదేశం పార్టీ కుమ్మక్కయిందన్నారు. అది బుద్ధిలేనితనం కాదా?

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : నర్సింహులు గారూ, మీరు ఇటు చూసి మాట్లాడండి. Don't deviate.

3.00

శ్రీ డి.శ్రీధర్‌బాబు : అధ్యక్షా, సభాసాంప్రదాయాల ప్రకారం సభలో లేని వ్యక్తుల గురించి, వారి పేర్లను ప్రస్తావించడం సముచితం కాదని మేము అప్పీల్ చేస్తున్నాం. ప్రభుత్వం పరంగా వారేదైనా విషయం చెప్పదల్చుకుంటే చెప్పండి దానికి ధీటుగా జవాబును చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాము. సభ సజావుగా జరగడానికి అవకాశం ఇవ్వమని గౌరవ సభ్యులను కోరుతున్నాను.

*** Expunged as ordered by the Chair

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు (తుంగతుర్తి) ః అధ్యక్షా, నిజానిజాలు ఏమిటనేది ఫైనల్‌గా ప్రజలు తీర్పునిస్తారు. మీరు ఓపిక పట్టండి. (వైఎస్ఆర్‌సిపి సభ్యులను ఉద్దేశించి) అప్పుడే మీరు, ౙౙౙ ••• అంటే వినడానికి మేము ఇక్కడ కూర్చున్నామా? మీరిద్దరు ౙౙౙ

(ౙౙౙ అనే పదాలను విత్‌డ్రా చేసుకోవాల్సిందిగా కోరుతూ వైఎస్ఆర్‌సిపి సభ్యులు పోడియం దగ్గరకు వచ్చి అంతరాయం కలిగించారు)

మీరిద్దరూ ౙౙౙ ముఖ్యమంత్రి పదవిని ఇవ్వలేదని పార్టీ నుంచి ప్రక్కకు తొలగి పార్టీని పెట్టిన వాడవు నువ్వు. రేపైనా ఎల్లుండైనా నేను కాంగ్రెస్‌లోనే కలుస్తా.. అని రోజు చెప్పుకోవడం లేదా మీరు.

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః నర్సింహులు గారు మీరు దయచేసి సబ్జెక్ట్ మీద మాట్లాడండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు ః అధ్యక్షా, నాకు విజయమ్మ గారి పట్ల సంపూర్ణమైన సానుభూతి ఉంది. పాపం ఆమెను తీసుకువచ్చి వీళ్లు బలి చేస్తున్నారనేది నా బాధ. ఈ ౙౙౙ ఒక్క మాటలో చెప్పాలంటే.. ఒక అమాయకురాలిని ఈ సభకు తీసుకువచ్చి ..

(ౙౙౙ అనే మాటను విత్‌డ్రా చేసుకోవాల్సిందిగా కోరుతూ వైఎస్ఆర్‌సిపి సభ్యులు పోడియం దగ్గరకు వచ్చి అంతరాయం కలిగించారు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః చీఫ్ విప్ గారూ.. Can you appeal the Members?

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి ః అధ్యక్షా, టిఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల వాళ్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అయితే వాళ్లు మాట్లాడినప్పుడు ప్రతి దానికి అంతరాయాలను కలిగించుకుంటున్నారు. మేము ప్రభుత్వం తరఫున సమాధానం చెప్పాలంటే, వారు చెప్పింది మేము వినాలి కదా! సభను ప్రతిసారి నడవకుండా అడ్డుపడటం మంచి పద్ధతి కాదు. దయచేసి ఇరు వర్గాలు అందరం కూడా సహనంతో ఉందాము. ఎందుకంటే ఈ సభ పట్ల మొత్తం యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ ఆసక్తితో చూస్తున్నారు. ఈ సభలో ఏ విధమైన ప్రజా సమస్యల గురించి చర్చిస్తారు? ప్రభుత్వ వైఫల్యాలు ఏమిటి? ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందో వినాలనే ఆతృతతో వారు ఉన్నారు. దయచేసి అందరూ కూడా సహనంతో ఉండి ప్రభుత్వం ద్వారా సమాధానాన్ని రాబట్టాలి.

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి)ః అధ్యక్షా, అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది దేని గురించి అని ఇంతకు ముందు మాట్లాడారు. వీళ్లు ఏ ఒప్పందాలు చేసుకున్నారో తెలియదు గానీ అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన ఓటింగులో పాల్గొనమన్నారు. ఇప్పుడు ఓటింగ్ కొరకు వచ్చి, మేము ప్రజల కోసం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పైన చర్చ జరగకుండా, వారు చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఎదురు దాడి

••• Expunged as ordered by the Chair

చేస్తున్నారు. ఒక సీనియర్ శాసన సభ్యుడుగా ఉండి సహచర సభ్యులైన మమ్ములను ౭౭౭ ••• మా వైపు వేలు చూపిస్తాడా సార్. ఏం మాట్లాడుతున్నాడు సార్ ఆయన. వెంటనే ఆ మాటలను ఉపసంహరించుకొని సభకు క్షమాపణ చెప్పాలి. లేకపోతే సభాసాంప్రదాయాలకు విఘాతం కలుగుతుంది. అతడు వాడిన పదాలకు క్షమాపణ చెప్పాలి. క్షమాపణ చెప్పి ఆ పదాలను రికార్డుల నుండి తొలగించాలి.

(వైఎస్ఆర్‌సిపి పార్టీ సభ్యులు లేచి నిలబడి సభ్యులు శ్రీ ఎం.నర్సింహులు క్షమాపణ చెప్పాలని కోరసాగారు)

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : అధ్యక్షా, ఈ లేచి నిలబడిన వారిలో ౭౭౭ ఎవరైనా ఉన్నారా? ఎవడి సొమ్మని వీళ్ల ఒక్కొక్కరి దగ్గరకు ౭౭౭ వచ్చాయి? ఇక్కడ లేచి నిలబడిన వాళ్లందరూ.. నేను తక్కువ చెబుతున్నాను.. వీరిలో ౭౭౭ ఒక్కరైనా ఉన్నారా? ఎవడి సొమ్ము అది? ప్రజల సొమ్మును దోపిడీ చేసి, ౭౭౭ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మేము మద్ధతు పలకాలా? మేము వీళ్లకు తోడుగా రావాలా? మేము ఇప్పటికి మూడు సార్లు అవిశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశ పెట్టాము.

(అంతరాయం)

మ. 3.10

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: శ్రీకాంత్‌రెడ్డి గారూ, దయచేసి కూర్చోండి. Let me speak. Please sit down. దయచేసి నన్ను మాట్లాడనివ్వండి. దయచేసి కూర్చోండి.

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి (మైకు లేకుండా): అధ్యక్షా, మీపైన గౌరవంతో మేం పోడియం దగ్గరి నుంచి మా స్థానాలకు రావడం జరిగింది.

(శ్రీ కాపు రాంచంద్రారెడ్డిచే అంతరాయం )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: రాంచంద్రారెడ్డి గారూ, మీరు ఎవరినీ మాట్లాడినివ్వకుండా అంతరాయం కలిగిస్తే ఎలాగండీ? రాంచంద్రారెడ్డి గారూ, శ్రీకాంత్‌రెడ్డి గారూ దయచేసి కూర్చోండి. నర్సింహులు గారు గౌరవ సభ్యులు మీరు వాడిన పదజాలాన్ని గురించి అప్పీల్ చేశారు. I have appealed to you not to use that particular word.

(ఈ దశలో తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: మీరు నన్ను మాట్లాడనివ్వండి. He has appealed to you not to use that particular word. If you want to say anything on that please say. నర్సింహులు గారూ మాట్లాడండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: అధ్యక్షా, నేను చెప్పిన మాటలు నా నోటి మాటలైతే నేను తప్పనిసరిగా విత్‌డ్రా చేసుకుంటాను. సి.బి.ఐ ఎంక్వైరీలోనే వారు (వై.కా.పా నుద్దేశించి ) రూ. 43,000 కోట్లు దోచుకున్నారని రిపోర్ట్ ఇస్తే దానికి నేనేం చేస్తాను. దీనికి సంబంధించిన వ్యక్తులను అందుకే జైల్లో పెట్టారు.

••• Expunged as ordered by the Chair

జైల్లో పెట్టిన వ్యక్తికి మమ్మల్ని మద్దతివ్వమని అంటారు. ఇది ఎలా సాధ్యమవుతుంది. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు వ్యతిరేకమైన పార్టీ. ఈ రెండు పార్టీలను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడానికి ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమవుతుంది. ఇద్దరూ ******** ఇద్దరూ ఒకే చెట్టుకు కొమ్మలు. తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ ఎప్పుడు కలుసుకుంటాయో ఎవ్వరికీ తెలియదు. మా పార్టీని వీళ్ల పాపాలలో భాగస్వాములు కమ్మంటే ఇదెంతవరకు సమంజసం? సి.బి.ఐ ఎంక్వైరీలో రూ. 43,000 కోట్లు జగన్ దోపిడీ చేశాడని చార్జ్‌షీట్ వేశారు. జగన్ ఎందుకు జైల్లో ఉండాల్సి వచ్చింది? కీ.శే. రాజశేఖర్ రెడ్డి గారి పేరు కూడా ఈ చార్జ్‌షీట్‌లో ఉన్నది. వారు బ్రతికుంటే వారు కూడా జైల్లోనే ఉండేవారు. బైబిల్‌లో ఒక మాట ఉన్నది. ఇది విజయమ్మ గారికి బాగా తెలుసనుకుంటాను. విషయమేమిటంటే "ఒకడు సమస్థమును సంపాదించుకొని ఏం తీసుకొని పోయెను " ఇది నేను చెప్పిన మాట కాదు బైబిల్‌లోనే ఉన్నది.

(ఈ దశలో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు పోడియం దగ్గరికి వచ్చి అంతరాయం కలిగించసాగారు)

MR.DY.SPEAKER: Yes, Gade Venkat Reddy Garu.

శ్రీ గాదె వెంకట్ రెడ్డి (బాపట్ల): అధ్యక్షా, సభ సజావుగా నడవడానవికి నేను కొన్ని సూచనవలు, సలహాలు చేస్తున్నాను. నా సూచనలను ఉభయ పార్టీల సభ్యులు పాటిస్తారని ఆశిస్తున్నాను. వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు పోడియం దగ్గరి నుంచి వారి వారి స్థానాలకు దయచేసి వెళ్లండి. ఈ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టాలని టి.ఆర్.ఎస్ పార్టీ, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సెపరేట్‌గా తీర్మానాలను ప్రవేశపెడితే, ఆ తీర్మానాల్ని అడ్మిట్ చేస్తూ ఉభయ పార్టీల వారు కోరిందేమిటంటే ఈ తీర్మానం మీద సభలో చర్చ జరిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని వారు దృష్టిలో పెట్టుకొని చేయడం జరిగింది. ఉభయ పార్టీలు ఎందుకు కలిశారు, ఎలా కలిశారనే విషయాలను నేను ప్రస్తావించదల్చుకోలేదు. ఎవరి మీదైనా వ్యక్తిగత దూషణలు చేయాలనే అభిప్రాయం ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి వ్యక్తిగత దూషణలు చేయాల్సి ఉంటుంది. నర్సింహులు గారు అమోఘమైన శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు కలిగిన వ్యక్తి. వారికి సభా సాంప్రదాయాల గురించి కూడా బాగా తెలుసు. ఒక పార్టీలోని వ్యక్తుల గురించి రూ.100 కోట్లు సంపాదించుకున్న ******** పదజాలాన్ని వాడటం మంచి పద్దతి కాదన్నది నా అభిప్రాయం. ఆ విధంగా మాట్లాడితే సంతోషించే వారు కూడా చాలా మంది ఉన్నారు, నేను కాదనడం లేదు. ఏది ఏమైనా పరస్పర దూషణలు లేకుండా, వ్యక్తిగతమైన ఆరోపణలు లేకుండా ఈ సభలో అవిశ్వాస తీర్మానంపైన చర్చ జరగాలని నేను కోరుతున్నాను. నర్సింహులు గారు మాట్లాడేటప్పుడు వై.ఎస్.ఆర్ పార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సభ్యులు ******** అనడం మంచి సాంప్రదాయం కాదు. సభలో మాట్లాడే మాటలను ప్రజలు వింటున్నారనేది దృష్టిలో పెట్టుకొని ఒకరినొకరు దూషించుకోకుండా సభ సజావుగా జరిగే విధంగా సహకరించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలకు సమాధానాలు చెప్పడానికి ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉన్నది. ఎట్టి పరిస్థితులలోనూ ఈ ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఉండదు.

మ.3.20

శ్రీ గాదె వెంకట రెడ్డి: సభలో వ్యక్తిగత దూషణలు చేయాలనే అభిప్రాయం ఎవరికైతే ఉంటుందో, వారు ముందుగా నోటీస్ ఇచ్చిన తరువాతనే చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ, వారు ఆలోచించో, మంచి ఉద్దేశంతో మాట్లాడుతున్నారో లేక చెడు ఉద్దేశంతో మాట్లాడుతున్నారనే విషయాల్లోకి నేను పోదలచుకోలేదు.

*** Expunged as ordered by the Chair

ఒక పార్టీలోని వ్యక్తుల గురించి ఞఞఞ ••• విధంగా మాట్లాడడమనేటటువంటి పదజాలం నా దృష్టిలో మాత్రం మంచిది కాదనే విషయాన్ని నేను చెప్పదలచుకున్నాను. ఆ విధంగా మాట్లాడితే సంతోషించేవారు కూడా సభలో ఉన్నారు. నేను ఆ విషయం కాదనడం కూడా లేదు. కానీ, ఎవరైనా సరే పరస్పర దూషణలు లేకుండా, వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు లేకుండా సభలో మాట్లాడుకుంటే హుందాగా ఉంటుందనేదే నా అభిమతం. సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినటువంటి అన్ని పార్టీల నాయకులను కోరుతున్నదేమిటంటే, సభను హుందాగా నడిపించండి. అదే విధంగా కొన్ని పార్టీల సభ్యులు మాట్లాడుతున్నారు, ఏమిటంటే, వైఎస్ఆర్‌సిపీ మరియు కాంగ్రెస్ పార్టీ వారు ఞఞఞ విధంగా సంబోధిస్తున్నారు. అది కూడా మంచి పద్ధతి, సాంప్రదాయం కాదని కూడా మాట్లాడుతున్నటువంటి సభ్యులకు మరొకసారి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. గౌరవ ఉప సభాపతి గారు కూడా సభను సజావుగా నడిపేందుకు కృషి చేస్తున్నారు. దాన్ని కూడా నేను కాదనడం లేదు. అవిశ్వాస తీర్మానం గెలుస్తుందో, వీగిపోతుందనేది సభలోనే తెలుస్తుంది. సభలో జరిగే వ్యవహారాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు. సభలో మాట్లాడే మాట వల్ల ప్రజల్లో విశ్వాసం కల్గుతుందనే భ్రమలో కొన్ని పార్టీలున్నాయి. కానీ, ఆ భ్రమ మాత్రం నిజం కాదు. వ్యక్తిగత దూషణలు లేకుండా ప్రభుత్వం పైన ఆరోపణలు చేయొచ్చు, అందులో తప్పులేదు. ప్రభుత్వం కూడా అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితిలోనే ఉంది. అందులో ఎటువంటి అనుమానం లేదు. ప్రభుత్వం కూడా పడిపోయే పరిస్థితిలో లేదు. ఞఞఞ ప్రభుత్వమని, ఞఞఞ ప్రభుత్వమని కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నాయి. అన్ని విషయాలకు సమాధానం చెప్పడానికి ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. సభలో శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు చాలా బాగా మాట్లాడారు, అదే విధంగా మాట్లాడి మంచి పేరు తెచ్చుకోండి. సబ్జెక్టు పరంగా, విషయ పరిజ్ఞానంతో, నిజాలే మాట్లాడారు. అందులో ఎటువంటి అనుమానం లేదు. నేను చెప్పే విషయాన్ని గమనించి, అర్థం చేసుకొని మాట్లాడగల్గితే మాట్లాడండి, లేదంటే లేదు, అది మీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. కేవలం నేను సూచన, సలహా మాత్రమే చేశాను. ఆచరిస్తే ఆచరించండి, లేదంటే లేదు. సభలో ఇంతకు ముందు మాట్లాడిన మాటలను విత్‌డ్రా చేయమంటే మాట్లాడిన వాళ్లు ప్రిస్టేజ్‌గా ఫీలవుతారు, క్షమాపణలు చెప్పకపోతే ఇటువైపు వాళ్లు ఒప్పుకోరు కాబట్టి నేను గౌరవ ఉప సభాపతి గారికి విజ్ఞప్తి చేసేదేమిటంటే, వ్యక్తిగత దూషణలు, ఆరోపణలను రికార్డులను పరిశీలించి వాటిల్లో నుండి ఆ పదజాలాన్ని తొలగించవల్సిందిగా కోరుతున్నాను. తొలగించినట్లైతే సభ సజావుగా జరగడానికి అవకాశం ఉంటుందనేదే నా అభిప్రాయం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: జూలకంటి రంగారెడ్డి గారు మీరు మాట్లాడండి. Straightaway come to the point. చెప్పండి మీ అభిప్రాయం.

శ్రీ జూలకంటి రంగారెడ్డి: అధ్యక్షా, నిన్నటి రోజున కూడా సభలో ఏ అంశం గురించి ప్రస్తావించకుండానే సమయం వృధా అయింది. ఈ రోజున అవిశ్వాస తీర్మానం పైన సభలో చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే ప్రభుత్వం పైన ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడమనేది జరిగింది. ఆ సబ్జెక్ట్ వరకే సభలో పరిమితమై, సభలో ప్రస్తుతం లేనటువంటి వాళ్ల పేర్లను ప్రస్తావించకుండా మాట్లాడగల్గితే బాగుంటుంది. అదే విధంగా సభలో గౌరవం కూడా ఉంటుంది. అనవసర విషయాల గురించి వారు గానీ, వీరు గానీ మాట్లాడి సభా సమయాన్ని వృధా చేయడమనేది మంచి పద్ధతి కాదు.

(అంతరాయం)

••• Expunged as ordered by the Chair

నేను ఏ ఒక్కరి గురించి మాట్లాడడం లేదు. తెలుగుదేశం పార్టీ వారు గానీ, వైఎస్ఆర్‌సిపీ వారు గానీ ఒకరిపై ఒకరి గురించి మాట్లాడారు. శ్రీమతి విజయమ్మ గారు కూడా శ్రీ చంద్రబాబు నాయుడు గారి గురించి మాట్లాడారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ వాళ్లు కూడా సభలో లేనటువంటి వ్యక్తుల గురించి మాట్లాడారు. ఇంతవరకు బయట ఒకరిని ఒకరు తిట్టుకొని సభకు వచ్చారు. ఇప్పటికీ బయట తిట్ల పురాణం కొనసాగుతూనే ఉంది. కానీ, నేను చెప్పేదేమిటంటే, సభలో సబ్జెక్టు వరకే పరిమితమై హుందాగా గౌరవంగా మాట్లాడుకుంటే అందరికీ మంచిది. నేను అన్ని పార్టీల సభ్యులకు తెలియజేస్తున్నాను. బయట ప్రజలంతా కూడా సభలో జరిగే వ్యవహారాలను చూస్తూనే ఉన్నారు. సభా మర్యాదను కాపాడవల్సిన అవసరం అందరికీ ఉంది. సభలో పరస్పర ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటుంటే బాగోదు. ప్రజలు గమనిస్తున్నారు. మంచి విషయాలపై మాట్లాడుకుంటే అందులో ఏమి తప్పులేదు. కానీ, సబ్జెక్టు వరకే పరిమితమై మాట్లాడుకోవాల్సిన అవసరముంది. ఆ విధంగా సభలోని గౌరవ సభ్యులందరూ ప్రవర్తించాలని నేను మీ ద్వారా అందరినీ కోరుతున్నాను.

(అంతరాయం)

శ్రీ ఇ.దయాకర్ రావు: సార్, ఒక నిమిషం నాకు అవకాశం ఇవ్వండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయాకర్ రావు గారు మీకు నేను తరువాత అవకాశం ఇస్తాను, అప్పుడు మాట్లాడండి. శ్రీమతి శోభానాగిరెడ్డి గారు, మీరు మాట్లాడండి.

శ్రీమతి బి.శోభానాగిరెడ్డి: సార్, సభలో లేనటువంటి వ్యక్తుల గురించి, అంతే కాదు, వారు వచ్చి సమాధానం కూడా చెప్పుకోలేనటువంటి వ్యక్తి గురించి, అసలు ఈ లోకంలోనే లేనటువంటి వ్యక్తి గురించి సభలో మాట్లాడుకోవడమనేది చాలా హేయమైనటువంటి సందర్భం, సంఘటన. శ్రీమతి విజయమ్మ గారు మాట్లాడిన సందర్భంలో శ్రీ చంద్రబాబు నాయుడు గారి గురించి వ్యక్తిగతంగా ఎటువంటి ఆరోపణలు, దూషణలు చేయలేదు. కానీ, వారి హయాంలో జరిగిన పాలసీల గురించి మాత్రమే ప్రస్తావించారు. శ్రీ చంద్రబాబునాయుడి గారి సంపాదన గురించి వారి ప్రస్తావనలో ఎక్కడ కూడా లేదు. సభలో లేనటువంటి వ్యక్తుల గురించి మాట్లాడకుండా, ముందస్తు నోటీస్ ఇవ్వకుండా గౌరవ సభ్యులు ప్రస్తావించడమనేది దురదృష్టకరమైన పరిణామం. ఆ విధంగా భవిష్యత్తులో మాట్లాడకుండా సభలో ఒక రూలింగ్ ఇవ్వాలని కూడా గౌరవ ఉప సభాపతి గారిని మా పార్టీ తరఫున నేను గట్టిగా కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయాకర్ రావు గారు మీరు మాట్లాడండి.

శ్రీ ఇ.దయాకర్ రావు (పాలకుర్తి): స్పీకర్ సార్, శ్రీమతి శోభానాగిరెడ్డి గారు, పెద్దలు శ్రీ గాదె వెంకట రెడ్డి గారు మరియు శ్రీ జూలకంటి రంగారెడ్డి గారు మంచి సూచనలు, సలహాలు ఇచ్చారు. కానీ, శ్రీమతి విజయమ్మ గారు మాట్లాడినటువంటి మాటలను మీరు తెప్పించుకొని పరిశీలించండి. ఇప్పుడు శ్రీ చంద్రబాబు నాయుడు గారు సభలో లేరు. శ్రీ ఎన్.టి.రామారావు గారు కూడ స్వర్గస్తులైనారు. శ్రీమతి విజయమ్మ మాట్లాడినటువంటి మాటలను తెప్పించి పరిశీలించండి. శ్రీ చంద్రబాబు నాయుడు గారు అక్రమంగా సంపాదించినట్లైతే మీ పార్టీ వారు వదిలేవారు కాదు. గతంలో కూడా వారిపైన ఏ విధంగా దుమ్మెత్తిపోశారనే విషయం కూడా అందరికీ తెలిసింది. శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు కేవలం సి.బి.ఐ. రిపోర్ట్‌లోని అంశాలపైనే మాట్లాడారు. ఆ విషయాల్ని ప్రస్తావిస్తుంటే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారికి వచ్చిన ఇబ్బంది ఏమిటి? అందరూ కలిసి కోట్లు కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించుకున్న వారే బాధ్యులవుతారు. సంపాదించుకోని వారికి ఎందుకు అంత ఉలుకు.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సర్వ శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి, ఎ.అమర్‌నాథ్ రెడ్డి, బి.కరుణాకర్ రెడ్డి, శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి, జి.గుర్నాథరెడ్డి తదితరులు వారి వారి స్థానాల్లో నుంచి నిల్చొని సభకు అంతరాయం కల్గించారు)

శ్రీ ఇ.దయాకర్ రావు: దోపిడి చేసిన వాళ్లైతే భయపడాలి. మీరు దోపిడి చేయకుంటే భయపడకండి. సి.బి.ఐ. రిపోర్ట్‌లో ఉన్నటువంటి అంశాలపైన శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు ప్రస్తావించారు. మీకేమి అభ్యంతరం. వందల కోట్లు తిన్నారనే విషయాన్ని మాత్రమే శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు ప్రస్తావించారు. ఫలానా వ్యక్తి అని వారు సంబోధించలేదు కదా! అటువంటప్పుడు మీకేమి ఇబ్బంది కల్గుతుందో చెప్పండి. మీరెందుకు భుజాలు తడుముకుంటున్నారో చెప్పండి.

(అంతరాయం)

స్పీకర్ సార్, శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు ఎవరి పేర్లను వారి మాటాల్లో ప్రస్తావించలేదు. శ్రీమతి విజయమ్మ గారి వెనుక ఉండి ౚౚౚ ••• నడిపిస్తున్నారనే విధంగా శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు ప్రస్తావించారు. వీరు ౚౚౚ ఆమె గురించి శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు సమంజసంగానే ప్రస్తావించారు. సి.బి.ఐ. విచారణ రిపోర్టును సభలో శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు చదివి వినిపించారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయాకర్ రావు గారు దయచేసి కూర్చోండి. నేను రికార్డును పరిశీలిస్తాను. అభ్యంతరకరమైన మాటలుంటే రికార్డుల్లోనుండి తొలగించడం జరుగుతుంది. మోత్కుపల్లి నర్సింహులు గారు మీరు మాట్లాడండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: సార్, నేను ఒక్క మాటను కూడా కల్పితంగా గానీ, స్వంతంగా గానీ ప్రస్తావించలేదు. మనమంతా ప్రజాప్రతినిధులం. నేను ఒక విషయం ప్రస్తావించదలచుకున్నాను. మనమంతా కూడా కాలాతీతులం. ప్రజలకు మనం జవాబుదారీగా ఉండాల్సిన అవసరముంది. అవసరమైతే త్యాగాలు చేయాలి తప్ప, కాలువలకు కాలువలు ఈ విధంగా ౚౚౚ ఎట్లా? ఇదేమి విధానం, పద్ధతి. మనమంతా కూడా ప్రజాప్రతినిధులం. ప్రజల కోసం త్యాగాలు చేయాల్సిన అవసరముంది, ప్రజల కోసం బతకాల్సిన అవసరముంది, ఏ త్యాగమైనా సరే ప్రజల కోసమే చేయాల్సిన అవసరం ప్రజాప్రతినిధులకంతా కూడా ఉంది. కానీ, ఈ భూమి మీద ఉన్నటువంటి సర్వ జనానికి అన్యాయం చేసే పని చేస్తే, చూస్తూ మౌనంగా ఉంటూ, ఒక మాట కూడా ప్రజాప్రతినిధులమై ఉండి, సభలో ప్రస్తావించకుండా ఉండాలంటే ఎట్లా? అది ఏ విధంగా సాధ్యమవుతుంది. తప్పుడు మార్గం, దుర్మార్గమైనటువంటి చర్యలకు పాల్పడినటువంటి వ్యక్తుల గురించి మాట్లాడకుండా ఎలా ఉండమంటారో మీరే చెప్పండి.

అటువంటి చర్యలకు పాల్పడినటువంటి వ్యక్తుల గురించి సి.బి.ఐ. విచారణ నివేదికలో ఏ విధంగా చెప్పారో ఒకసారి చదివి వినిపిస్తాను వినండి. "This is the kick back money paid to Y.S.Jagan Mohan Reddy. He has exercising his personal influence by his father and benefited them at the cost of the public exchequer".

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

••• Expunged as ordered by the Chair

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: ఈ మాటల్ని నేను చెప్పానా అధ్యక్షా, ఇదెక్కడి గోలండి. సి.బి.ఐ. విచారణ రిపోర్ట్ గురించి సభలో నేను ప్రస్తావిస్తే కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల కడుపుల్లో మంట మండుతుంటే ఎట్లా సార్. సి.బి.ఐ. విచారణ నివేదికలోని అంశాలనే నేను పదే, పదే ప్రస్తావించదలచాను. మీకేమి అభ్యంతరమో చెప్పండి.

(అంతరాయం)

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సర్వ శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి, ఎ.అమర్‌నాథ్ రెడ్డి, బి.కరుణాకర్ రెడ్డి, శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి, జి.గుర్నాథరెడ్డి తదితరులు వారి స్థానాల నుంచి పోడియం వద్దకు చేరి సభకు అంతరాయం కల్గించారు).

మ.3.30

వైఎస్ఆర్ పార్టీ సభ్యులు స్పీకర్ పోడియం వద్ద చేరి సభ్యులు శ్రీ మోత్కుపల్లి నర్శింహులు గారు వారు మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోవాలి. '' ఉయ్ వాంట్ జస్టిస్, ఉయ్ వాంట్ జస్టిస్ " అంటు నినాదాలు చేసాగారు.

శ్రీమతి భూమా శోభా నాగిరెడ్డి: (మైక్ లేకుండా) (పోడియం వద్ద) సభలో లేని వారి గురించి, కోర్టు పరిధిలో ఉన్న విషయంపై మాట్లాడుతున్నారు. మీరు రూలింగ్ ఇవ్వాలి సార్.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: దయచేసి సహకరించండి . ద్రోణం రాజు శ్రీనివాస్ గారు,

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస్ (విశాఖపట్నం – సౌత్): అధ్యక్షా, ఇక్కడున్నటువంటి తెలంగాణా రాష్ట్ర సమితి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రెండు పార్టీలు కూడా ఈ శాసనసభలో బలం లేకపోయినా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం కోరారు. తరువాత, ఈ ప్రభుత్వం మీద, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలమీద ముఖ్యమంత్రి మీద దుమ్మెత్తిపోస్తూ మాట్లాడుతున్నారు. అంటే ఈ మూడు సంవత్సరాల్లో ముఖ్యంగా కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏమీ లేవు, రేషన్‌కార్డులు,పెన్షన్స్, ఫీజు తిరిగి చెల్లింపులు ఇవ్వటంలేదు ఆరోగ్య శ్రీ పథకం అమలు జరపడంలేదని ఆరోపణలు చేశారు, ఆఖరకు ఈ రాష్ట్రంలో కరెంట్ లేదు అంధకారంలో ఉందంటున్నారు.

ఈ ముఖ్యమంత్రి, ప్రభుత్వం పనిచేయటం లేదని ఆరోపణలు చేశారు. రాష్ట్రం ఎంతో ఆర్థిక భారంతో ఉన్నా అనేక సంక్షేమ, ఆర్థిక కార్యక్రమాలు చేపడుతున్నది. ప్రభుత్వం మీ ఆరోపణలకు జవాబు చెప్పాల్సి ఉంది. వాళ్ల వాళ్ల కొట్టుకోవడం కాదు. ఎవరు కాంగ్రెస్ పార్టీలో ఉండి పెరిగి,పెద్దవాళ్లై తల్లిపాలు త్రాగి తల్లి రొమ్ము గుద్దేరో వారు చరిత్రలో మిగిలి పోతారు. అలాగే ఎవరు గతంలోఎనిమిది సంవత్సరాలు పరిపాలన చేశారో వారి అనుభవం చూసే, మరలా ప్రజలు మాకు 2004,2009వ సంవత్సరంలో అధికారం కట్టబెట్టారు. టిఆర్ఎస్ నాయకులు కూడా సమైక్య ఆంధ్రా లోనే తెలంగాణా అభివృద్ధి జరగలేదనీ పెద్ద ఎత్తున అవిశ్వాస తీర్మానం కోరారు. తెలంగాణా అభివృద్ధి చేసిన గణాంకాలు మాదగ్గరున్నాయి. మేము సమాధానం చెబుతాము. మాకు అవకాశం ఇవ్వండి. అంతే కాని వాళ్ల వాళ్ల తన్నుకుంటే సరిపోదు. మీరు సభను సజావుగా నడిపేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాను.

(వైఎస్ఆర్ పార్టీ సభ్యులచే, వెల్‌లో '' ఉయ్ వాంట్ జస్టిస్ ఉయ్ వాంట్ జస్టిస్ **" అని నినాదాలు**)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: ప్లీజ్ గోబ్యాక్ వెల్ లోపలికి వచ్చి స్లోగన్స్ ఇవ్వడం సభా సాంప్రదాయాల్లో ఎక్కడా లేవు. ఇది కరెక్ట్ కాదు, ఇది సభా సాంప్రదాయం కాదు. సభా సాంప్రదాయాలను గౌరవించాలి. దయచేసి కూర్చోండి, మీకు మైకు ఇచ్చాము సమయం ఇచ్చాము. ప్లీజ్ గో బ్యాక్ టు యువర్ సీట్. సభ్యులు నాగేందర్ గారు, మాట్లాడండి. I am appealing to you. Please go back to your seats.

శ్రీ దానం నాగేందర్: సార్ ప్రత్యేకంగా నేనిచ్చే సలహా irrespective of any political party ముఖ్యంగా నర్సింహులుగారికి చెబుతున్నాను. రాజశేఖరరెడ్డిగారు నేటికీ మానాయకుడే. రాజశేఖరరెడ్డిగారిపై పర్సనల్‌గా ఎలిగేషన్ చేసేది ఉంటే మీరు రాజశేఖరరెడ్డిగారి దగ్గరకు వెళ్లి చెప్పండి. గతంలో కూడా తెలిపాము, ఈ సభలో లేని వారి గురించి మాట్లాడటం సబబు కాదు, సభను తప్పుదారి పట్టించే విధంగా మాట్లాడటం కరెక్ట్ గాదు. ఈ ప్రభుత్వంలో ఏమైన తప్పులుంటే సరిదిద్దుకొనేందుకు నిర్మాణాత్మకమైన చర్చను చేపట్టేందుకు, ఈరోజు ఏదైతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారో ఆ మేరకు వారి సంఖ్యాబలం ప్రూవ్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఆరోపణలు ప్రత్యారోపణలు ద్వారా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఈ సభను సజావుగా నడిపించేందుకు మీరందరూ, సహకరించండి. సభా సమయాన్ని వృధా చేయవద్దని నేను కోరుకుంటున్నాను.

శ్రీ డి.శ్రీధర్‌బాబు, అధ్యక్షా I request the Chair to expunge if anything is derogatory or defamatory. Let us resume our business. I am appealing before the Chair.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: డిఫమేటరీ, డెరొగేటరీ అన్ పార్లమెంటరీ భాష ఏమున్నా కానీ అవి రికార్డుల నుంచి తీసివేయబడుతుంది.

( వైఎస్ఆర్‌కాంగ్రెస్ సభ్యుల నుంచి అంతరాయం )

మ.3.40

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ≈≈≈ ••• అన్న పదాలు వెనక్కి తీసుకోవలసిందిగా పోడియం వద్దకు చేరి నినాదాలు చేయసాగారు.)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః నర్సింహులు గారూ, unparliamentary, defamatory, derogatory మాటలు ఏమున్నా కానీ అవి రికార్డుల నుంచి తొలగించబడతాయి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు ః నేను అన్న మాటలు అన్‌పార్లమెంటరీ అయితే వాటిని రికార్డులనుంచి తొలగిస్తే నాకేమీ అభ్యంతరం లేదు.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి ః≈≈≈ పోల్చడం అన్‌పార్లమెంటరీ కాదా?

••• Expunged as ordered by the Chair

(మైకు లేకుండా శ్రీకాంత్ రెడ్డి మరికొంత మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు 'మీ చేతకానితనం వల్లే మీరు ఇలా ఉన్నారని' తెలుగుదేశం పార్టీ సభ్యులను ఉద్దేశించి అన్నారు).

శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ : ఎవరికయ్యా చేతకానిది, మీ దగ్గర నేర్చుకోవాలా?

( ఆ దశలో సభలో తెలుగుదేశం పార్టీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వాగ్వివాదాలతో సభలో గందరగోళం చెలరేగింది.)

MR.DEPUTY SPEAKER: Please go back to your seats.

(Interruptions continued)

The House is adjourned for five minutes.

**(The House then adjourned at 3.41 p.m.)**

మ.3.50

(స్వల్ప విరామానంతరం సభ సా.3.50 ని.లకు సమావేశమైంది. ఉప సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

***

మిస్టర్ డిప్యూటి స్పీకర్: నర్సింహులుగారు..

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: మనం ఒక్కసారి ఆలోచన చేయాలి. రాష్ట్ర ప్రజలు కూడా చూడాలి. వీళ్ల మీద చిన్న మాటంటే వాళ్లు లేస్తున్నారు. వాళ్ల మీద చిన్న మాటంటే వీళ్లు లేస్తున్నారు.

MR. DEPUTY SPEAKER: Please address the chair and get into subject.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: ఈ సందర్భంగా ఒక విషయం తెలియచేస్తున్నా అధ్యక్షా. 1984వ సంవత్సరంలో ఇందిరా గాంధీని కూడా ఎదిరించి తిరిగి అధికారాన్ని దక్కించుకున్న ఘనత తెలుగుదేశం పార్టీది. ఆ ఘనత దివంగత ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు గారికి దక్కుతుంది. ఆ నాడు ఇందిరా గాంధీని కూడా ఎదిరించి నెల రోజుల పాటు అధికారాన్ని తీసేస్తే, ప్రజా ఉద్యమం చేత కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తిరిగి అధికారాన్ని తెచ్చుకున్న పార్టీ తెలుగుదేశం పార్టీయేనని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఆవిర్భవించిందే తెలుగుదేశం పార్టీ అనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. 1989వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధాన మంత్రిగా ఉన్నటువంటి స్వర్గీయ రాజీవ్ గాంధీ భోఫోర్స్ కేసులో రూ.60,000 కోట్లు దోపిడీ చేసినప్పుడు

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: వారికి వ్యతిరేకంగా 104 మంది ఎంపిల చేత రాజీనామా చేయించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టిన ఘనత తెలుగుదేశం పార్టీది.

మిస్టర్ డిప్యూటి స్పీకర్: చీఫ్ విప్..

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, మాట్లాడదలచుకుంటే ఈ ప్రభుత్వ వైఫల్యాలు ఏమయినా ఉంటే చెప్పమనండి. ఈ రోజు భోఫోర్సు గురించి మాట్లాడుతున్నారు. భోఫోర్స్‌లో వారు ఎవరి పేరైతే పరోక్షంగా ప్రస్తావిస్తున్నారో ఆయన చనిపోయిన తర్వాత వారిని కోర్టు నిర్దోషని తీర్పు వెలువరించిందనే విషయాన్ని సభకు గుర్తు చేస్తున్నాను.

శ్రీ గాలి ముద్దు కృష్ణమనాయుడు (మైకు లేకుండా): లేదు. చెప్పలేదు.

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి: చెప్పింది. చెప్పకపోతే ఊరుకోండి గాలి ముద్దు కృష్ణమనాయుడు. కూర్చోండి. మీరు గాలి మాటలు మాట్లాడకండి. గాలి మాటలు మాట్లాడొద్దిక్కడ. ఈ రోజున అవిశ్వాస తీర్మానం పెట్టారు. కానీ, వారు మాట్లాడేదేమిటి అధ్యక్షా. దయచేసి సబ్జెక్టు నుంచి డీవియేట్ కాకుండా సబ్జెక్టుకు సంబంధం లేని విషయాలు మాట్లాడటం మంచి పద్ధతి కాదు అధ్యక్షా. దయచేసి సభలో ప్రభుత్వం గురించి ఏమైనా చెప్పదలిస్తే చెప్పమనండి అధ్యక్షా.

MR. DEPUTY SPEAKER: Narasimhumulu garu, please try to get into the subject and speak.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులుః అధ్యక్షా, దయచేసి ఈ సోదరుడు నాగేందర్ ... ' నన్ను రాజశేఖర్ రెడ్డి గారి దగ్గర దాకా పోయి చెప్పమని అన్నాడు'. (శ్రీ దానం నాగేందర్‌ని ఉద్దేశించి) నువ్వాయన శిష్యుడవని నాకు తెలుసు. కానీ నీవు ఆయన శిష్యుడిగా ఉంటే, మీరిద్దరు ఒకటై ఉంటే, మీరింకేదయినా మాట్లాడుకోవాలి కానీ, సభలో కొచ్చి మేము కుమ్మక్కయినట్లు మాట్లాడుతుంటే దానికి మీరు మాట్లాడరా? కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేసే పార్టీని పట్టుకుని, 30 సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో అట్టడుగు వర్గాల కోసం, అణగారిన వర్గాల కోసం, ఈ వ్యవస్థను మార్చి వాళ్ల కోసం బ్రతుకుతున్న పార్టీ తెలుగుదేశం పార్టీ. అధ్యక్షా, అంతే కాదు విజయమ్మగారు ... సార్, మంత్రివర్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణగారు బాగా చెప్పారు. " విజయమ్మగారు, మీరే పార్టీలో వున్నా, ఇద్దరిది ఒకటే పార్టీ – వైయస్ రాజశేఖర్ రెడ్డిగారి పార్టీ" అని చెప్పాడా లేదా? దీన్నయినా కనీసం అర్థం చేసుకోండి మీరు.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

మీరు మమ్మల్ని పట్టుకుని సపోర్ట్ చేయమంటారు. అధ్యక్షా, వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు 1600 వందల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. సభకి వచ్చారు. మరి నో కాన్ఫిడెన్స్ మోషన్ పెట్టారా? క్షణం ఉండకూడదు తెలుగుదేశం పార్టీ అని ప్రసంగాలు చేశాడు. నిలువునా ఈ ప్రభుత్వాన్ని కూల్చాలని చెప్పాడు. నేనొస్తే స్వర్గాన్ని చూపిస్తానని చెప్పాడు.

(స్వర్గం చూపించాడు కదా! అని వైయస్ఆర్ పార్టీ సభ్యుల నుంచి వినిపించింది)

ఏమయింది అధ్యక్షా? ఏమయింది. మరి ఆ రోజు వారు చంద్రబాబునాయుడిగారి ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టారా అని అడుగుతున్నాను. లేదంటే ఆ నాడు ఎన్‌టి రామారావు గారి మీద పెట్టారా అని అడుగుతున్నాను. అంటే ఆ నాడు కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీతో కుమ్మక్కయినట్లా అని గౌరవ సభ్యులను తమరి ద్వారా అడుగుతున్నాను. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించి, రాజకీయ లబ్ధి కోసం తెలుగుదేశం పార్టీని దోషిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసమని, ఎంత వరకు న్యాయమని అడుగుతున్నాను.

(వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం).

నేనొక మాట చెబుతాను. నేను హృదయం లేని వాడిని కాదు. నేనేదో ఒకరిని బట్టి మాట్లాడవలసిన అవసరం నాకు లేదు. చరిత్ర చెబుతున్నాను. ఒక్క మాటలో చెప్పాలంటే విజయమ్మకు కడుపుకోత ఉన్నది. కాబట్టి ఎటువంటి పరిస్థితుల్లోనైనా కొడుకును బయటకు తీసుకురావాలని, రాష్ట్రపతిని కలిసి ఏ రకమైన ఒప్పందం చేసుకువచ్చారని అడుగుతున్నాను.

(వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం).

కొడుకు ఀఀఀ[•••] ఏ తల్లి అయినా కాపాడుకునే ప్రయత్నం చేస్తుంది. నేను కాదనడం లేదు. కన్న కొడుకు జైల్లో ఉంటే అలా మాట్లాడటం తప్పనుకోవడం లేదు. బెయిలు కోసం ప్రయత్నం చేస్తున్నారు.

(ఈ సమయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమ తమ స్థానాలను వదలి, సభని నడిపించే విధానం ఇదేనా అంటూ పోడియం వద్దకు రాసాగారు)

శ్రీ మోత్కుపల్లి నర్సింహులుః భవిష్యత్ ఎన్నికలలో గెలిచినా కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తామని చెబుతున్నారు. యుపిఏ ప్రభుత్వానికి మేము సపోర్టు చేస్తామని చెబుతున్నారు.

సా.4.00

ఇటువంటి వ్యకులకు అవిశ్వాస తీర్మానంలో తెలుగుదేశం పార్టీ ఏ విధంగా సపోర్ట్ చేస్తుందనేది అర్ధం చేసుకోవాలి. ఇలా అనుకోవడం అన్యాయం, అక్రమం. రేపో, మాపో వారితో కలిసి చె ట్టాపట్టాలేసుకొని వెళ్లే వీరిని, వీరి మాటలను ఏ విధంగా నమ్మాలని ఈ సందర్భంగా అడుగుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః వ్యక్తిగత ఆరోపణలలోకి వెళ్లకండి. మీ మీ స్థానాలను చేరుకోండి.
( పోడియం వద్ద ఉన్న సభ్యులు తమ తమ స్థానాలను చేరుకున్నారు )

శ్రీమతి వై.ఎస్. విజయమ్మ ః అధ్యక్షా, అవిశ్వాసం ఎందుకు పెట్టవలసి వచ్చిందో నేను స్పష్టంగా చెప్పాను. నేను చంద్రబాబునాయుడుగారిని వ్యక్తిగతంగా ఏమీ విమర్శించలేదు. ఆయన మీద కేసులు ఉన్నాయి. తెహల్కా డాట్ కామ్ మొదలైన వాటి గురించి మాట్లాడాలంటే చాలా మాట్లాడాలి. కానీ నేను మాట్లాడలేదు. నేను మాట్లాడాలంటే చీకట్లో చిదంబరాన్ని కలిసినది మాట్లాడాలి. చాలా చాలా మాట్లాడాలి. నేను ఏదీ మాట్లాడలేదు. మాకు సభ్యత, సంస్కారం ఉంది. నా బైబిల్ గురించి పొద్దస్తమానం మాట్లాడతారు. దేవుడి గురించి ఎందుకు మాట్లాడతారు? మీరు చూస్తూనే ఉన్నారు అధ్యక్షా. దేవుడిని గురించి ఎందుకు మాట్లాడతారు? నేను ఏమి మాట్లాడాను అధ్యక్షా? వారి గురించి ఏమైనా మాట్లాడానా? ఇప్పుడు మాట్లాడుతున్నాను. నేను ఏమి మాట్లాడానో కావాలంటే రికార్డులు చూడండి. మీరు విన్నారుకదా. నేను ఏమయినా చంద్రబాబునాయుడు గురించి వ్యక్తిగతంగా మాట్లాడానా? ఆయన పాలసీ గురించి మాట్లాడాను. ఎందుకు అవిశ్వాస తీర్మానానికి మద్ధతుగా రాలేదని మాత్రమే మాట్లాడాను. ఆ విషయం గురించే మాట్లాడమనండి. ఈ రోజు కోర్ట్‌లో ఉండే విషయాల గురించి నేను మాట్లాడ లేదు. చంద్రబాబు నాయుడుగారిని ఏ కోర్ట్, ఏవరూ కూడా నిర్ధోషి అని చెప్పలేదు. జగన్ బాబును దోషి అని చెప్పలేదు. రాజశేఖర రెడ్డిగారిని ఏ కోర్ట్ ఈ రోజు దోషి అని చెప్పలేదు. ఈ రోజు సిబిఐ రిపోర్ట్‌అని ఎందుకు చదువుతున్నారు? కోర్ట్‌లో ఉండే విషయాలను మీరు మాట్లాడనిస్తున్నారా చెప్పండి? ఏ కోర్ట్ జగన్ బాబుని, రాజశేఖర రెడ్డిగారిని దోషి అని చెప్పింది. మేము కూడా మాట్లాడాలంటే చాలా చాలా మాట్లాడవచ్చు. సభ్యత, సంస్కారం మాకూ ఉన్నాయి. తమరు కూడా మాట్లాడనిస్తున్నారు. నాకు చాలా చాలా బాధగా ఉంది. నేను చాలా బాధపడుతున్నాను.

శ్రీ ఎం. నర్సింహులు ః గౌరవనీయురాలు విజయమ్మగారు మాట్లాడారు. Just wait .
( అంతరాయం )

[•••] Expunged as ordered by the Chair

మిస్టర్ డెప్యూటీస్పీకర్ ః వ్యక్తిగత ఆరోపణలు వద్దు.

( అంతరాయం )

శ్రీ ఎం. నర్సింహులు ః అధ్యక్షుల వారికి ఒక విన్నపం ఏమంటే, బైబిల్ వారిదే అయితే, బైబిల్ నేను కూడా చదువుతాను. బైబిల్ విషయం గురించి ఎవరూ తప్పు పట్టడం లేదు. దానిలో ఉన్న ఒక వాక్యాన్ని చదివి వినిపించాను. ఒక్కడు సమస్తం సంపాదించుకున్నా ఏమీ తిరిగి తీసుకొనివెళ్లడు అని ఉంది. అందులో చదివింది చెబుతున్నాను. ప్రజా ప్రతినిధులు సంపాదనకన్నా ప్రజలకు సేవ చేసే విషయంలో ముందు ఉండాలని చెబుతున్నాను. సంపాదన అనేది కాదు. ఈ రాష్ట్ర ప్రజలను నిలువునా దోపిడీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం, రాజశేఖర రెడ్డిగారు. రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేశారు. దాని గురించి చెబుతున్నాను. ఆ ఒక్క విషయం గమనించాలి.

( వైఎస్ఆర్ పార్టీ సభ్యులు పోడియం వద్దకు చేరుకొని మాట్లాడసాగారు )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః మీకు మాట్లాడడానికి సమయం ఉంది. మీకు అవకాశం ఇస్తాను. మీ మీ సీట్లలోకి వెళ్లండి.

( అంతరాయం )

శ్రీ డి. నాగేందర్ ః అధ్యక్షా, తమ ద్వారా అక్కడ ఉన్న వారందరిని తమ తమ స్థానాలకు వెళ్లవలసిందిగా కోరుతున్నాను.

( అంతరాయం )

ఇరు వైపుల సభ్యులకు చెబుతూ ఉన్నాము. ప్రత్యేకంగా నర్సింహులు గారికి ఇంతకుముందు చెప్పడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ దోచుకుందని వారన్నారు. ఈ రాష్ట్రంలోనే కాదు, దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు భారతదేశ చరిత్రలో ఏ పార్టీ కూడా చేయలేదు. చేయబోదు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరువాత ఇందిరా గాంధి, రాజీవ్ గాంధి, సోనియా గాంధి త్యాగాలు చేసిన కాంగ్రెస్ పార్టీని మరవరాదు. సభలో లేని వ్యక్తుల గురించి పదే పదే చెప్పడం వారికి ఆనవాయితీగా మారింది. రాజశేఖర రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అని ఏదో అన్నారు. వారి గురించి చెప్పాలంటే అక్కడకు పోయి చెప్పండి. ఇక్కడ కాదు చెప్పేది. సభలో మాట్లాడడం ధర్మం కాదు. మానవత్వం మరచిపోయి ప్రవర్తించడం మంచిది కాదు. కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ లేదు, ఉండదు. కాంగ్రెస్ పార్టీ త్యాగాలతో పుట్టింది. స్వాతంత్ర్యం రాకముందు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ భారతదేశంలో ఏదయినా పార్టీ త్యాగాలు చేసింది అంటే, అది కాంగ్రెస్ పార్టీ అని సభాముఖంగా తెలియచేస్తున్నాను.

( అంతరాయం )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః దయచేసి వినండి. అన్‌పార్లమెంటరీ పదాలు ఏమయినా ఉంటే వాటిని తొలగించాలని చెప్పాను.

( అంతరాయం )

సా.4.10

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : దయచేసి వినండి. ఇప్పటికే అన్ పార్లమెంటరీ భాష ఏదైనా మాట్లాడి ఉంటే వాటిని తొలగించాల్సిందిగా చెప్పాను. మీరు దయచేసి కూర్చోండి.

(అంతరాయం)

I appeal the Members to please listen to me.

డా. ఎస్. శైలజానాథ్ (ప్రాధమిక విద్యాశాఖా మంత్రి): అధ్యక్షా, మీ ద్వారా సభ్యులకు తెలియజేసేదేమంటే, వారు చెయిర్‌ని అలా డిక్‌టేట్ చేయడం మంచిది కాదు. మీరు కొత్తగా సభకి వచ్చారు. మీరు డిమాండ్ చేయవచ్చు కానీ Do not dictate terms to the Hon'ble Deputy Speaker.

(అంతరాయం)

MR.DEPUTY SPEAKER: What do you want the Chair to do? I will give you the mike. Then you can appeal to me.

(Interruptions)

You cannot dictate me give a ruling. I know what to do.

(Interruptions)

You cannot dictate me the terms and conditions.

శ్రీమతి బి. శోభానాగిరెడ్డి : అందరి హక్కులను స్పీకర్ గారు కాపాడాలి.

(అంతరాయం)

డా. ఎస్. శైలజానాథ్ : నేను ఇంకా ఆ విషయం గురించి మాట్లాడలేదు. నేను మాట్లాడితే కళ్ల నీళ్లు పెట్టుకొంటుంది. మీరు నాతో మాట్లాడించే ప్రయత్నం చేయబోకండి. మళ్లీ కన్నీళ్లు పెట్టుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే స్పీకర్ గారి ముందు వేలు చూపిస్తున్నారు.

(అంతరాయం)

స్పీకర్ గారూ మీరొక నిర్ణయం తీసుకోవాలి. ఇప్పటికే సమయం వృధా అవుతోంది. అర్ధంలేని పరిస్థితిలో, అర్ధం లేని కాలంలో వారు అవిశ్వాస తీర్మానం పెడుతున్నారు. తోక లాంటి టి.ఆర్.ఎస్. పార్టీ వెంట వీరు వెళ్లారు తప్పితే, వీరికి ఆలోచన కూడా లేదు. ఒక ఆలోచనతో నిర్ణయం తీసుకోండి. ఎవరెవరం, ఏ విధంగా చేశామన్నది ఈ రాష్ట్ర ప్రజానీకానికి తెలుసు. సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు.

(అంతరాయం)

అధ్యక్షా, వారిపై నాకు జాలేస్తోంది. దేని కోసం వారు మొదలుపెట్టి దేన్ని అడ్డుకొంటున్నారో అర్థం కాని పరిస్థితి వారికి కనిపిస్తోంది. ప్రతి దానికి లేవడం, కూర్చోవడం కాకుండా ఈటెల రాజేందర్ గారు అవిశ్వాస తీర్మానం పెడితే, ఎటువంటి ఆలోచన లేకుండానే వారు ఈ రోజు లేచి సపోర్ట్ చేశారు. వారు తెలంగాణాకు అనుకూలంగా మాట్లాడారు. అంటే ఈ రోజున వీరంతా తెలంగాణాకు అనుకూలంగా తీర్మానిస్తున్నారా? కనుక, ఆలోచన లేకుండా పనిచేయమాకండి. వీర్ని చూసి నేను జాలి పడుతున్నాను. బాధ పడుతున్నాను.

(అంతరాయం)

మీ ద్వారా బాబూరావు గార్కి తెలియజేసేదేమంటే, వారికి అడిగే హక్కు ఉంది. మాకు మీ ద్వారా చెప్పే హక్కూ ఉంది. ఎవరు ౘౘౘ ••• దేశానికి తెలుసు. స్పీకర్ గారి దగ్గరెందుకు మన ప్రతాపాలు. అక్కడుండి మాట్లాడిన వారని గురించి మాత్రమే చెప్పాను తప్పితే, ఎవరు ౘౘౘ న్యాయ నిర్ణయం చేయడానికి నేను సిద్ధంగా లేను. ఆ విషయాన్ని ప్రజలు నిర్ణయిస్తారు. గౌరవ శాసనసభ్యులకు మీ ద్వారా మరో మారు అప్పీల్ చేస్తున్నాను. మీరు ఏరి కోరి, బయట చాలా మాటలు మాట్లాడి, అవిశ్వాస తీర్మానాన్ని మా ప్రభుత్వంపై పెట్టారు. రండి, మాట్లాడండి. కన్విన్స్ చేయండి. గెలుపో ఓటమో చూసుకోండి. గత రెండు నెలల కాలంగా ప్రజల్లో మాట్లాడి, మాట్లాడి, విధానమే లేకుండా ప్రత్యేక తెలంగాణా కావాలనుకొనే పార్టీతో కలసి అవిశ్వాస తీర్మానం పెట్టిందే కాక, ఏదో డీవియేట్ అయేట్లు మాట్లాడుతున్నారు. రండి, అవిశ్వాస తీర్మానంపై మాట్లాడండి. మేము కూడా సమాధానం చెపుతాం. మాకు ఆ నమ్మకం ఉంది. We will bulldoze you. నెట్టి ప్రక్కకు పడేస్తాం. మీ దగ్గర మాట్లాడ్డానికేమీ లేదు.

మిస్టర్ డెప్యుటీ స్పీకర్ : సభ సజావుగా సాగడానికి అప్పీల్ ఏమైనా చేయదలిస్తే చేయండి.

శ్రీ డి. మాణిక్య వరప్రసాద్ రావు (గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి): అధ్యక్షా, తమ ద్వారా సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను. మనం మాట్లాడే ప్రతి మాటను, ప్రవర్తిస్తున్న తీరును రాష్ట్ర ప్రజానీకం యావత్తూ గమనిస్తోంది. తమరితోబాటు మేమంతా రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వహిస్తున్నాం. కాబట్టి, మనందరం చాలా సంయమనంతో ఉండాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ సభ్యులు మాట్లాడినా, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడినా, ల్యాంగ్వేజిలో బ్యాలెన్స్ ఉండాలని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు సంయమనంతో సభను నడుపుతున్నారు. అన్‌పార్లమెంటరీ ల్యాంగ్వేజ్ సభ్యులు వాడినట్లైతే వాటిని తొలగిస్తామని స్పీకర్ గారు చెపుతున్నారు. స్పీకర్‌గా అంతకంటే వారు చేయగల్గిందేమీ లేదు. సభ్యులుగా మనం సంయమనం పాటించాలి. తమరు ఇచ్చే రూలింగ్‌ని మేమందరం పాటించాలి. గౌరవ సభ్యులు లేవనెత్తిన అబ్జక్షన్స్‌ని మీరు అర్థం చేసుకొన్నారు. 'ఏదైనా అన్‌పార్లమెంటరీ ల్యాంగ్వేజిని సభ్యులు వాడినట్లైతే దాన్ని రికార్డ్స్ నుండి తొలగిస్తాం' అని చెప్పారు. స్పీకర్‌గా మీరు అంతకంటే ఏమి చేస్తారు. స్పీకర్ గారు ఏదైతే రూలింగ్ ఇచ్చారో అదే రికార్డ్స్‌లో ప్రివేలౌతుంది. మీరు నో కాన్ఫిడెన్స్ మోషన్ తెచ్చారు. అది చిన్న విషయమా? అది ప్రజాస్వామ్యంలో చాలా అరుదుగా ఉపయోగించే ఆయుధం. చీటికీ మాటికి నో కాన్ఫిడెన్స్ అంటున్నారు. ఆరు మాసాల క్రితం నో కాన్ఫిడెన్స్ మోషన్‌ని తెచ్చారు. అది ఏమైందో అందరికీ తెలిసింది. అలాగే మొన్న జరిగిన సమావేశాల్లో ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ విషయంలో ఓటింగ్‌కి వెళ్లారు. అప్పుడేమైందో కూడా అందరికీ తెలుసు. మీరు స్పీకర్ గార్కి ఈ రూలింగ్ ప్రకారంగా, ఈ విధంగా చేయండని చెప్పండి. లేకపోతే, నర్సింహులుగారు చేసే ప్రసంగాన్ని ఈ విధంగా చేయించమని ఏదైనా రూలింగ్ ఉంటే మీరు చెప్పండి. అది చెప్పకుండా, కాన్‌స్టిట్యూషనల్ ప్రొవిజన్ చెప్పకుండా మీరు స్పీకర్‌ని డిక్‌టేట్ చేయడం మంచి పద్ధతి కాదు. ధర్మం కాదు, ప్రొసీజర్ కాదు. మీరు అర్థం

••• Expunged as ordered by the Chair

చేసుకోండి. నేను సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. నర్సింహులు గార్కి కూడా అప్పీల్ చేస్తున్నాను. నర్సింహులు గారు మీరు మాట్లాడే మాటలకు వారు హర్ట్ అవుతున్న విషయాన్ని అర్థం చేసుకోండి. పదే పదే మీరు రిపీట్ చేయబోకండి. నేను స్పీకర్ గారి ద్వారా గౌరవ నర్సింహులు గార్కి కూడా విజ్ఞప్తి చేస్తున్నాను.

MR. DY.SPEAKR : I request the Members to please go back to their seats. I am appealing the Members to resume their respective seats.

(INTERRUPTIONS)

**సా.4.20**

( స్పీకర్ పోడియం వద్ద వున్న వైఎస్ఆర్‌సీపి సభ్యులు '' సభా మర్యాదలు కాపాడాలని", వుయ్ వాంట్ జస్టిస్, వుయ్ వాంట్ జస్టిస్" అని గట్టిగా నినాదాలు చేస్తూ సభలో లేని వ్యక్తి మీద మాట్లాడిన మాటలను ఎక్స్‌పంజ్ చేయాలని, సభలో లేని వ్యక్తి మీద ఆరోపణలు చేయకుండా రూలింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంతరాయం కలిగించసాగారు.)

శ్రీ ద్రోణం రాజు శ్రీనివాస రావుః అధ్యక్షా, వారు అనేకమైన ఆరోపణలు చేసినప్పుడు ఈ ప్రభుత్వం వాటిపై జవాబు చెప్పవలసిన అవసరముంది. మా మంత్రులందరు కూడా అందుకోసం తయారుగా వున్నారు. ఎందుకంటే వాళ్లు ఇరిగేషన్ మీద, వ్యవసాయం మీద, విద్య మీద, ఆరోగ్యం మీద మిగతా అనేక సమస్యల మీద అనవసరమైన అబద్దాల పుట్టతో కూడుకున్న అనేకమైన ఆరోపణలు చేశారు. అందులో నిజం లేదు. అవన్నీ అబద్దాలు అని చెప్పాల్సిన బాధ్యత మా మంత్రులపైన వుంది. మా ప్రభుత్వం పైన వుంది. కాబట్టి ఎవరైతే ఈ సభలో అవిశ్వాసం పెట్టి సభకు ఆటంకం కలిగిస్తున్నారో అట్లాంటి వారికి ఈ అవిశ్వాస తీర్మానం మీద నమ్మకం లేకపోతే, ప్రజా సమస్యల పరిష్కారం మీద నమ్మకం లేకపోతే అట్లాంటి వారిని ఈ సభ నుండి బయటికి పంపించండి. సభను నడిపించండి.

MR.DEPUTY SPEAKER: Please go back to your seats. ఈ హౌస్‌ను ఆర్డర్‌లో పెట్టడం కోసం అపీల్ చేయాల్సిందిగా నేను జి. మల్లేశ్ గారిని అడుగుతున్నాను.

శ్రీ జి.మల్లేశ్ (బెల్లంపల్లి)ః అధ్యక్షా, ఈ 13వ శాసన సభలో మూడవ సారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టబడింది. ఎట్లాగూ ఇంకొక సంవత్సరం లోపల ఈ ప్రభుత్వం పడిపోయే అవకాశముంది. ఇక ఆగేదేమీ లేదు. అది ఎవరు ఆపినా ఆగదు. సంవత్సరం తరువాత ఎవరు ఆపినా ఆగదు.

(అధికార పక్ష సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః మల్లేశ్ గారూ, మీరు సీనియర్ మెంబర్ కాబట్టి, I thought you will appeal.

శ్రీ జి.మల్లేశ్ః సార్, నేను తమరికి మనవి చేసేదేమంటే ఇంతటి దానికి మనలో మనం ఆవేశాలను, ఆందోళనలను పెంచుకొని భావోద్వేగాలను పెంచుకొనే ప్రసంగాలను చేసుకొని శాసన సభను నడవకుండా చేయడం సముచితం కాదు. నేను మనవి చేసేదేమంటే సభ్యులను రెచ్చగొట్టే మాటలను తగ్గించి ప్రభుత్వం మీద ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మీదనే తమ ప్రసంగాలను కేంద్రీకరించి మాట్లాడి దానిని కంక్లూడ్ చేయడం మంచిది. మా మిత్రులైనటువంటి రాజశేఖర రెడ్డి గారికి సంబంధించిన జగన్ పార్టీ సభ్యులను తమ

సీట్లలో కూర్చోవాలని శాసన సభ ప్రొసీడింగ్స్ కొనసాగించేలా చూడాలని, అన్‌పార్లమెంటరీ సంభాషణలు ఎవరు మాట్లాడినా వాటిని రికార్డుల నుంచి తొలగించాలని తమరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

MR.DEPUTY SPEAKER: Please go back to your seats. I will give Ruling please go back to your seats.

( పోడియం వద్ద వున్న వైఎస్‌ఆర్‌సిపి సభ్యులు పోడియం వద్ద నుంచి వెళ్లిపోయారు )

శ్రీ పి.కేశవ్‌: స్పీకర్ సర్, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం ఎవరు ప్రవేశపెట్టినా రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలు....... ఒక వైపు విద్యుత్ కోత, మరొకవైపు విద్యుత్ కొరత, తాగునీటి సమస్య, గ్రామాల్లో చేనేత కార్మికుల , చేతివృత్తుల వారి పరిస్థితి, తాగునీటి పథకాలు, స్కాలర్‌షిప్పుల మంజూరు, స్థానిక సంస్థల ఎన్నికలు, బాబ్లీ సమస్యలు, ఇవన్నింటి మీదా మాట్లాడాలని మా ఉప నాయకుడు నర్సింహులు గారు మూడు రోజుల నుంచి మా మెడలు వంచి కూర్చోబెట్టి ఒక్కొక్కరిని ఒక్కొక్క సబ్జెక్ట్ మీద డీటెయిల్డ్‌గా ప్రిపేర్ చేయించి తీసుకొచ్చారు. కాకపోతే సభలోకి అడుగు పెట్టాక మేమేం ఈ రోజు కొత్త విషయాలు చెప్పడం లేదు. ఎప్పుడో 2008వ సంవత్సరంలో రాజశేఖర రెడ్డి గారు బతికున్న రోజుల్లో రాజా ఆఫ్ కరప్షన్స్ ఛార్జెస్ పేరుతో ఒక పుస్తకం వేశాము. అవి నిజమవుతున్నాయని ఈ సభ దృష్టికి మేం ఎప్పుడు తీసుకొచ్చాం సర్? మాకు మాట్లాడాలని లేదు సర్. మేం కేవలం ప్రజా సమస్యల మీద ఈ దుర్మార్గపు కాంగ్రెస్ పార్టీని నిలదీయడానికే మేమిక్కడ వున్నాము. 500 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల చావుకు కారణమైనటువంటి, శాసన సభ్యుడు పరిటాల రవీంద్ర చావుకు కారణమైనటువంటి ఈ కాంగ్రెస్ పార్టీతో కలిసే ప్రసక్తి ఈ తెలుగుదేశం పార్టీకి ఎక్కడ నుంచి వస్తుంది సర్? అయి తే మాకు కూడా బాధ వేస్తుంది సర్. మేం కూడా మనుషులమే. ఈ కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా పుట్టిన తెలుగుదేశం పార్టీలో.....

MR.DEPUTY SPEAKER: Please go back to your seats.

శ్రీ పి. కేశవ్‌: సర్, ఒక్క రెండు నిమిషాలు సార్........ కాంగ్రెస్ మీద పోరాడుతున్న చంద్ర బాబు నాయుడు గారిని........ ఎప్పుడో తొమ్మిది సంవత్సరాల క్రితం చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగాచేస్తే ఈ రోజు చంద్రబాబు నాయుడు గారి పాలన మీద అవిశ్వాసం పెట్టినట్లుగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వారు పదే పదే పదేపదే చంద్ర బాబు నాయుడు గారిని గుర్తు చేయడమంటే మా గుండెల్లో గునపాలు దించినట్లనిపిస్తుంది సర్. మాకు కూడా బాధ కలుగుతుంది సార్. ఈ దుర్మార్గపు కాంగ్రెస్‌తో జత కట్టామని చెబితే ఏం సమాధానం చెప్పుకుంటాము సార్? తప్పకుండా తెలుగుదేశం పార్టీ పుట్టింది కాంగ్రెస్ వ్యతిరేక పునాదుల మీద. నేను ఒక్కటే కోరుతున్నాను సార్.

(మైకు ఆపు చేయబడింది.)

MR.DEPUTY SPEAKER: Please go back to your seats. నర్సింహులు గారూ, మాట్లాడండి.

శ్రీ పి.కేశవ్‌: మా ప్రజా సమస్యల్ని చెప్పుకోవాలి, ఈ ప్రభుత్వాన్ని ప్రజల మధ్య ఎండగట్టాలి అనే ఆలోచనతో మేం ఈ శాసన సభలో అడుగుపెట్టాము. అయితే పదే పదే మా గుండెల్లో గునపాలు గుచ్చినట్లుగా కాంగ్రెస్‌తో కుమ్మక్కైనారని అటు బయటా ఇటు లోపలా చెబుతుంటే మేం మౌన ప్రేక్షకులం కావాలా సార్? ఈ

దుర్మార్గపు కాంగ్రెస్‌ను అడుగడుగునా ఎండగడతాం. వాళ్లకు మా విజ్ఞప్తి ఒక్కటే. మా ఆవేదనను, ప్రజల కష్టాల్ని కన్నీళ్లను నర్సింహులు గారు చెప్పేంత వరకు మీరు ఓపిక పట్టండి. మీరు మాట్లాడిన దానికి సమాధానం చెప్పుకోవలసిన అవసరం నర్సింహులు గారికుంది. మీరిచ్చిన అవిశ్వాస తీర్మానానికి మా మద్దతు ఎందుకివ్వలేకపోయామ ని చెప్పుకునే ప్రక్రియలో కూడా వాళ్లను మాట్లాడనివ్వకపోవడం బాధాకరం. దయచేసి వాళ్లను సహకరించమని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: నర్సింహులు గారూ, అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్ కానీ, డెరొగేటరీ భాషను కాని దయచేసి వాడవద్దు. అటువంటివి వాడితే తప్పనిసరిగా వాటిని రికార్డుల నుండి తొలగించడం జరుగుతుంది. మీరు కోట్ చేసే డాక్యుమెంట్ ఏదైతే వుందో వాటీజిట్?

శ్రీ ఎమ్.నర్సింహులు : అది మీకిస్తాము సార్..... సార్ నేను ఒక్క మాట చెబుతాను సర్. ఒక చిన్న విషయం......

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి: అధ్యక్షా, పయ్యావుల కేశవ్ గారు ఒక పెద్ద మనిషిగా అపీల్ చేస్తారని మీరు మైకు ఇచ్చారు. వారు ఈ సభ సజావుగా నడవడానికి ఏవైనా సూచనలిస్తారనుకున్నాను. కాని ఆయన దుర్మార్గం దుర్మార్గం అనే మాట మాట్లాడుతున్నారు. ఆయన దుర్మార్గం అనే ప్రతిపక్షంలో కూర్చున్నారు. ఆ స్థానం కూడా దక్కుతుందో లేదో తెలియదు. ఎందుకు వూరికే అట్లా మాట్లాడతారు సార్? అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలేమైనా వుంటే మాట్లాడమనండి. మేం దానికి సమాధానాలు చెబుతాము. అంతే కాని పొద్దస్తమానం ఈ ప్రభుత్వాన్ని, ఈ పార్టీని తిట్టడానికే పుట్టినట్లు మాట్లాడతారేమిటి సార్?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: నర్సింహులు గారూ మాట్లాడండి.......

సా.4.30

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: అధ్యక్షా, నేను ఒకటే అప్పీల్ చేస్తున్నాను. నేను మాట్లాడిన తరువాత ఏవైనా అబ్జక్షన్సు ఉంటే వారు మాట్లాడవచ్చు. ప్రజాస్వామ్యంలో అందరికీ మాట్లాడే హక్కు ఉంది. 60 సంవత్సరాల భారతదేశంలో పేదవాడు ఒక్క పూట కూడా అన్నం తినలేని పరిస్థితిలో ఉన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో, భారతదేశంలో ***••• చూస్తూ ఎవరూ మాట్లాడకుండా ఉండే పరిస్థితి మంచిదంటారా? అది ఎంతవరకు న్యాయం? మీకు మనసుంటే, మనసున్న వాడు పశ్చాత్తాపం చెందాలి. పశ్చాత్తాపం చెందిన వాడే పరలోక ప్రవేశం పొందడానికి వీలుంది. *** ఇంట్లో పెట్టుకొని మేము ఏమీ చేయలేదంటే దేవుడు క్షమిస్తాడా? పేద ప్రజల కోసం ఉండవలసిన ప్రభుత్వాలు 6 సంవత్సరాల కాలంలో ..........

(అంతరాయం )

ఎవరి గురించి మాట్లాడాలో మీరే చెప్పండి. ఈ ప్రభుత్వం ఎక్కడ ఫెయిల్ అయిందో చెబుతున్నాను. ఒక్క నిమిషం ఓపిక పట్టండి. 6 సంవత్సరాలు ప్రభుత్వం నడిపిన వ్యక్తి ఎవరు? 2004-2009వరకు ప్రభుత్వాన్ని నడిపిన కాంగ్రెస్ నాయకుడు ఎవరు? ఏ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి? కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాదా? రాజశేఖర్ రెడ్డిగారి గురించి మాట్లాడడానికి వీలు లేదన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు పెట్టినందుకు మీరు

••• Expunged as ordered by the Chair

రాజీనామాలు చేశారు. ఆ విషయం ఎఫ్ఐఆర్‌లో, సిబిఐ ఎంక్వైరీలో వచ్చింది. రాజశేఖర్ రెడ్డిగారు చేసిన తప్పు వదిలి పెట్టి మాట్లాడాలా? ఎవరు తప్పు చేస్తే వారి గురించి మాట్లాడుతాము. కిరణ్ కుమార్‌గారు తప్పు చేస్తే ఆయన గురించి మాట్లాడుతాము. మీ పార్టీలో ఒకరే ముఖ్యమంత్రి అయితే మాట్లాడవచ్చు. వైఎస్ఆర్‌గారు, రోశయ్యగారు ముఖ్యమంత్రిగా పని చేశారు. ప్రస్తుతం కిరణ్‌కుమార్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎవరి మీద మాట్లాడాలి అధ్యక్షా? వాన్‌పిక్ భూముల ఇష్యూ ఎవరి టైమ్‌లో జరిగింది? ఎమ్ఆర్ భూములు ఎవరికి అప్పనంగా అప్పచెప్పారో చెప్పండి. సెజ్ భూములు, పేదల భూములు, రైతుల భూములు దోపిడీ చేసి పెట్టుబడిదారులకు ఇచ్చి వారి నుండి డబ్బు లాక్కున్నారు. ఎవరు తప్పు చేస్తే వారి గురించి మాట్లాడవలసిన అవసరం ఉంది. సిబిఐ ఇన్‌వెస్టిగేషన్‌లో, ఛార్జిషీట్‌లో ఫైల్ చేసి కోర్టుకు ఇచ్చిన డాక్యుమెంట్, ప్రజల డాక్యుమెంట్. ప్రజల ముందున్న డాక్యుమెంట్. దేని నుండి తప్పించుకుంటారు? రూ.43,000 వేల కోట్లు రాజశేఖర్ రెడ్డిగారు, ఆయన కొడుకు ఈఈఈ••• ఉంది.

శ్రీ బాలినేని శ్రీనివాస్ రెడ్డిః రాజశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి అని ఎన్నిసార్లు మాట్లాడుతారు?

(ఈ దశలో వైఎస్ఆర్‌సిపి సభ్యులు పోడియం వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేయసాగారు.)

శ్రీ మోత్కుపల్లి నర్సింహులుః నీతిమంతుల్లాగా చెబుతారేమిటి? మీరు నీతి మంతులా?

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డిః నేను సభకు వ్యక్తిగత ఎజెండాతో .............

(అంతరాయం )

ఎదురుదాడి చేయాలనే ఉద్దేశ్యముతో వారు అలా మాట్లాడుతున్నారు. ప్రజలు నవ్వుతున్నారనే ఉద్దేశ్యముతో ఎదురుదాడి చేస్తున్నారు. పేద ప్రజల కోసం పెట్టిన పార్టీ అని అంటున్నారు. పేద ప్రజలకు ఏమి చేశారు?

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ప్లీజ్ గో బ్యాక్ టు యువర్ సీట్స్. నేను మైకు ఇస్తాను. మీ పార్టీ సభ్యునికి రెండు సార్లు మైకు ఇచ్చాను. మీ సభ్యుడు మాట్లాడితే కూడా వినకపోతే ఎలా?

(ఆ దశలో పోడియం వద్దనున్న వైఎస్ఆర్‌సిపి సభ్యులు సభా మర్యాదను కాపాడాలి, వి వాంట్ జస్టిస్ అని నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు. )

శ్రీ డి. శ్రీధర్‌బాబుః అధ్యక్షా, మీరు ఆల్‌రెడీ రూలింగ్ ఇవ్వడం జరిగింది. If anything unparliamentary should be expunged from the records. If any Member feels anything unparliamentarily he can seek mike and speak. లెజిస్లేటివ్ అఫైర్స్ మినిస్టర్‌గా మీకు అప్పీల్ చేస్తున్నాను. మేము ఏమి చేస్తున్నామంటే, టిఆర్ఎస్, వైసిపికి సంబంధించిన వారు ప్రధానమైన అంశాలతో వస్తారు. వారు ఈ రోజు నో కాన్ఫిడెన్స్ మోషన్ మూవ్ చేశారు. కాబట్టి దానికి సరైన సమాధానం చెప్పాలనే అభిప్రాయంతో ఉన్నాము.

••• Expunged as ordered by the Chair

సా.4.40

సబ్జెక్ట్ వారి దగ్గర ఉందని అనుకున్నాను. దానికి సమాధానం చెప్పాలని ఆలోచిసున్నాము. ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయించిన సమయంలో, నర్సింహులు గారు ఏవైతే అభియోగాలు చేశారు. అది పబ్లిక్ డాక్యుమెంట్ అవుతుందో లేదో చూడాలి. ఆ అంశంపై I am seeking clarification from the Chair. దానికి సంబంధించి మనం డిస్కస్ చెయ్యొచ్చా లేదా? Can we make a reference out of it? Sub judice అవుతుందో లేదో ఒక రూలింగ్ ఇవ్వండి. తదుపరి ఎవరైనా మాట్లాడే అవకాశం ఉంది.

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : మీరు వెళ్లి కూర్చోండి. I have something to request the Members.

(ఈ సందర్భంగా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు పోడియం వద్దనే ఉండి "we want justice" అంటూ నినాదాలు చేయసాగారు)

SRI D. SRIDHAR BABU: I am once again appealing sir. వారికి ఇంట్రస్ట్ లేనప్పుడు సభాసమయాన్ని ఎందుకు వేస్ట్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. మేము రిప్లై ఇస్తాము తరువాత ఓటింగ్ పెట్టండి. సబ్జెక్ట్‌ని క్లోజ్ చేద్దాము.

MR. DEPUTY SPEAKER: I request all the Members not to refer to any matter which is sub judice and not to make any allegations which are defamatory or incriminatory. And at the same time I request all the Members that మీరు రిఫర్ చేయదలచుకునే పుస్తకాలుంటే , దయచేసి ఆ సమాచారం ఇవ్వండి. Please go back to your seats.

(వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు పోడియం వద్ద నుండి తమ తమ స్థానాలకు వెళ్లారు)

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : అధ్యక్షా, ఇది చాలా విచిత్రంగా ఉంది. ఇప్పుడు ఏమి మాట్లాడాలో అర్థం కావడం లేదు. 6 సంవత్సరాలు పరిపాలించిన నాయకుడి గురించి మాట్లాడాలా? రోశయ్య గారి గురించి మాట్లాడాలా? కిరణ్‌కుమార్ రెడ్డి గారి గురించి మాట్లాడాలా? ఆనాడున్న ప్రభుత్వంలో అప్పుడున్న నాయకుడు, ఇంటిని అమ్ముకునే స్థితిలో ఉన్నాడు. తరువాత బెంగళూరులో ముప్పై ఎకరాలలో అద్దాల మేడ కట్టుకున్నాడంటే డబ్బు ఎక్కడ నుండి వచ్చింది? హైదరాబాదులోని లోటస్‌పాండ్‌లో 1,20,000 చ.అ. ఇల్లు కట్టుకున్నాడు. పది లిఫ్టులున్నాయి. అది అద్దాల మేడ, ఇంద్రభవనం. భారతదేశంలో ఎవరికీ లేనటువంటి అందమైన భవనాన్ని కట్టుకోవడానికి డబ్బు ఎక్కడ నుండి వచ్చిందో చెప్పవలసిన అవసరం ఉంది. వీళ్లు అవిశ్వాసం పెడితే మేము మద్దత్తివ్వాలా? వీళ్లతో కలసి వెళ్లాలా? ఇది ఎంతవరకూ న్యాయం? వాళ్లు, వీళ్లు ెెె••• మమ్మల్ని అనడం ఎంతవరకూ న్యాయం? చంద్రబాబు నాయుడు గారిని, మీ తల్లి కడుపున ఎట్లా పుట్టావు అన్న సందర్భం మాకు తెలుసు సార్. 9 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి గురించి ఎంత అవమానకరంగా మాట్లాడారో మాకు తెలియనిది కాదు. రాష్ట్ర ప్రజల కోసం బతకడమే తెలుగుదేశం పార్టీ ముఖ్యోద్దేశం. ఇప్పటికి 2,000 కిలోమీటర్లు నడిచారు. నేను చెప్పడం కాదు. సాక్షి టీవీ, సాక్షి పేపర్‌లో చూసుకోవమ్మా. మే నెలలో పాదయాత్ర పూర్తయితే ఖచ్చితంగా అవిశ్వాసం పెడతాము. ఈ ప్రభుత్వ

••• Expunged as ordered by the Chair

పనితీరు, ప్రజా దోపిడీని ఎండగట్టి తీరతాము. అవిశ్వాస తీర్మానం పెట్టేముందు ఒక్క మాట ప్రతిపక్ష నాయకుడితో మాట్లాడి పెట్టుకోవలసి ఉందని టి.ఆర్.ఎస్ పార్టీ సభ్యులని అడుగుతున్నాను. 63 సంవత్సరాల పెద్ద మనిషికి అనేక రకాల ఇబ్బందులున్నా సరే, శారీరక సమస్యలున్నా రాష్ట్ర ప్రజలకు పట్టిన పీడను తొలగించడానికి పాదయాత్ర చేస్తున్నారని తెలియజేస్తున్నాను. రాష్ట్ర ప్రగతి కుంటుపడింది, పేద ప్రజలకు న్యాయం జరగడం లేదు. ప్రజల మధ్య బతుకుతున్న నాయకుడు వచ్చే దాకా ఆగలేరా? అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడల్లా సంఖ్యా బలం ఉన్న ప్రభుత్వాలను కూలగొట్టారా? గతంలో, మీరు అవిశ్వాస తీర్మానం పెట్టండి, మేము చూసుకుంటామన్నారు. 50 మంది వస్తామన్నారు కాని రిజైన్ చేసిన వాళ్లే వచ్చారు. ప్రజల కోసం బతుకున్నది మేమా మీరా? అవినీతి పునాదుల మీద బతుకుతున్న పార్టీ మీది, మీతో జతకట్టవలసిన అవసరం మాకు లేదు. ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న పార్టీ, 30 సంవత్సరాలుగా రాష్ట్రంలో అనేక సమస్యలను పరిష్కరించి , బడుగు, బలహీన వర్గాల హృదయాలలో గూడుకట్టుకున్న పార్టీ తెలుగుదేశం పార్టీ. రాజశేఖర రెడ్డి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. తప్పుడు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. తొమ్మిది గంటలు కరెంట్ ఇస్తామన్నారు. ముప్పై కేజీల బియ్యం, పెన్షన్స్ రూ.500/- పెంచుతామన్నారు. ఒక్క రైతు చావడానికి వీలు లేదు, హెల్ప్‌లైన్ పెడతామన్నారు. ఏది హెల్ప్‌లైన్? 22,000 మంది రైతులు చనిపోయారు. మీ కుటుంబం బాగుపడింది తప్ప, రాష్ట్రంలో ఒక్క క్రైస్తవుడు, దళితుడు, పేదవాడు కూడా బాగుపడలేదు. ఒకే సామాజిక వర్గానికి చెందిన 30 మంది ఎం.ఎల్.ఏలు బాగుపడ్డారు. చంద్రబాబు నాయుడి గారి మీద ఆనాడు రాజశేఖర రెడ్డి గారు అనేక ఎంక్వైరీలు వేయించారు. ఏమయ్యింది? రాష్ట్రంలో నీతి, నిజాయితీ కోసం నిలబడే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు గారు. ఒకొక్కసారి ౣౣౣ••• కూడా నమ్మవలసిన పరిస్థితి వస్తుంది. అలా నమ్మి ఈ రాష్ట్ర ప్రజలు మోసపోయారు.

సా.4.50

ఈ రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వచ్చాయంటే రాజశేఖర రెడ్డి గారే కారణమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

(వైఎస్సార్ సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

వీరు చాలా ఎక్కువ మాట్లాడుతున్నారు. కరెంట్ కష్టాలు ఎవరి వల్ల ఈ రాష్ట్రంలో వచ్చాయి? కేవలం వైఎస్సార్ వల్ల వచ్చాయి. విటిపిఎస్‌లో 500 మె.వాట్లు కానీ, భూపాలపల్లి పవర్ ప్లాంటు విషయంలో ఏ రకంగా అల్లుడికి వాటా పెట్టుకున్నారో, ఏ విధంగా తన అనుచరుల కోసం పనిచేసి ఆ పవర్ ప్లాంటును నడవనీయకుండా చేసిన ఘనత వారికే దక్కుతుంది.

(వైఎస్సార్ సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

బయ్యారం గనుల విషయానికొస్తే, 1.50 లక్షల ఎకరాల భూమిని అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా రాజశేఖర రెడ్డి గారు పేద ప్రజల భూములను తన అల్లుడికి దానం చేసిన ఘనత కూడా వారికే దక్కింది. ఇలా నలుగురు ముఖ్యమంత్రులుంటే ఈ దేశం బ్రహ్మాండంగా బాగుపడుతుంది. ఏమిటందీ ఇది? ఒక విషయాన్ని మనం గమనించాలి. మేం మూడు సంవత్సరాలు.........

(వైఎస్సార్ సీపీ సభ్యులు శ్రీ గొల్ల బాబూరావు నుంచి అంతరాయం)

••• Expunged as ordered by the Chair

మేం అవిశ్వాస తీర్మానం గత ఆరు నెలల కిందటే పెట్టాం. మీరు ఆనాడు ప్రగల్భాలు పలికారు. కానీ మీరు 50 మంది వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కూలుస్తామని చెప్పారు. సోనియాగాంధీ రాజశేఖర రెడ్డి గారిని చంపించిందని ఆనాడు చెప్పిన అక్క విజయలక్ష్మి గారు ఇవాళ ఒక్క మాట ఆ విషయం గురించి మాట్లాడడం లేదు. ఎవరు ఎవరితో కుమ్ముక్కు అయినట్లు? జగన్మోహన్ రెడ్డి గారు రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు. వారు జైలు నుంచి ఎందుకు వచ్చినట్టు? ఎవరు ఎవరితో కుమ్ముక్కైనట్లని ఈ సందర్భంగా అడుగుతున్నాను. కాబట్టి ఇప్పటి పరిస్థితుల్లో ఒక విషయాన్ని మీరందరూ గమనించాలి. మమ్మల్ని పట్టుకొని మీరు కుమ్ముక్కయ్యారని, మీరు కుమ్ముక్కయ్యారని అన్నారు. కానీ మీరిద్దరూ ఒకటే. కిరణ్‌కుమార్ రెడ్డి గారు, రోశయ్య గారు........

(వైఎస్సార్ సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

ఈ రాష్ట్రంలో ఏ రకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారో చెప్పడానికి కూడా పలు ఆధారాలున్నాయని తెలియజేస్తున్నాను. ఏది ఏమైనా కచ్చితంగా ప్రజల పక్షాన మాత్రమే తెలుగుదేశం పార్టీ ఉందని తెలియజేస్తున్నాను. ఆనాడు రాజశేఖర రెడ్డి గారి మీద, అప్పటి సభాపతి మీద, ఆరు నెలల కిందట కిరణ్‌కుమార్ రెడ్డి గారి మీద మేం అవిశ్వాస తీర్మానం పెట్టాం. మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారు పాదయాత్రలో ఉన్నారు కనుక వారి పాదయాత్ర పూర్తయిన తరవాత కచ్చితంగా రాబోయే అసెంబ్లీ సమావేశంలో ఎపుడైనా సరే అవసరమైనపుడు తప్పకుండా అవిశ్వాస తీర్మానం ఈ ప్రభుత్వంపై పెడతాం. మిమ్మల్ని అడిగి అవిశ్వాస తీర్మానం పెడతామా? ప్రభుత్వాన్ని ఎండగట్టడానికి మేం అవిశ్వాస తీర్మానం పెడతాం. ప్రభుత్వాన్ని కూలదోయాలంటే మా దగ్గర తగినంత సంఖ్యాబలం లేదు. మా దగ్గర సంఖ్యా బలం ఉంటే మా పార్టీదే అధికారం. దొడ్డిదారిన వచ్చినా, ఏ దారిన వచ్చినా అయిదేళ్లు ప్రభుత్వాన్ని ఏమీ చేయలేం. ఇది లేవలేని ప్రభుత్వమా, చేతగాని ప్రభుత్వమా అనేది ప్రజలు చూసుకుంటారు. ప్రజల పక్షాన అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఇంకొక ఆరు నెలల సమయం పడుతుంది. జలయజ్ఞం పేరు మీద ధనయజ్ఞం చేసి తవ్విన కాలువలున్నాయి. ఈ ప్రభుత్వాన్ని తీసుకెళ్లి ఖచ్చితంగా ఆ కాల్వల్లో పెడేస్తామని తెలియజేస్తున్నాను. ఆ కాలువల్లో పూడ్చేస్తారు ఈ ప్రభుత్వాన్ని. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద రూ.600 కోట్లు వెచ్చించి కాలువలు తవ్వారు. కాలువల్లో ముండ్ల కంప చెట్లు పెరిగి నిరుపయోగంగా ఉన్నాయి. ఆయకట్టుకు నికర జలాలు లేవు. నల్గొండ జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన తుంగతుర్తి నియోజకవర్గంలో తాగు, సాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. కాంట్రాక్టర్ల కోసం రూ.600 కోట్లు దోచుకున్నారు. ఈ ధనయజ్ఞానికి కారకులైన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారికే దక్కింది.

(ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యులు షేమ్, షేమ్ అని అన్నారు)

నేనొక మాట చెబుతాను. పాపం సోదరీమణి, ఐఏఎస్ అధికారిణి శ్రీమతి శ్రీలక్ష్మిని చూస్తే నాకు దుఃఖం వస్తుంది. ఆమె ఒక దళితుడిని కులాంతర వివాహం చేసుకున్నదని నాకు తెలిసింది. ఆమె పరిస్థితి, పడుతున్న బాధలు చూస్తుంటే నాకు కళ్లలో నీరు వస్తుంది. ఆమె జీవితం మొత్తాన్ని నాశనం చేసింది రాజశేఖర రెడ్డి గారే, వారే ఆమెను బలి చేశారు. ఇపుడు అనాథగా జైలులో మూలుగుతున్నదంటే అందుకు కారణం రాజశేఖర రెడ్డి గారే. కాదా? ఐఏఎస్ అధికారి బి.పి.ఆచార్య పరిస్థితి కూడా అలాగే ఉంది. గొర్రె కసాయివాడిని నమ్మినట్లు కొంత మంది ఐఏఎస్ అధికారులు నాయకుడిగా రాజశేఖర రెడ్డి గారిని నమ్మారు. అలాగే రాజశేఖర రెడ్డిగారిని నమ్మిన ఐఏఎస్ అధికారులు గజగజ వణుకుతున్నారు. ఎపుడు జైలుకు వెళ్లాల్సి వస్తుందో అని ఐఏఎస్

అధికారులు వణికి చస్తున్నారంటే అందుకు కారణం ప్రజాప్రతినిధులు మంచివారు కాకపోవడం. రాజశేఖర రెడ్డి గారు దుర్మార్గుడు కావడం వల్ల ఐఎఎస్ అధికారులు బలైపోయారు.

(వైఎస్సార్ సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

(వైఎస్ఆర్‌సిపి పార్టీ సభ్యులు శ్రీ బాలినేని శ్రీనివాస రెడ్డి స్పీకర్ పోడియం వద్దకు వెళ్లారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః సభలో లేనివారి గురించి మాట్లాడకండి.

(వైఎస్సార్ సీపీ సభ్యులు సర్వశ్రీ కాపు రామచంద్రారెడ్డి, గొల్ల బాబూరావు, ఎన్.ప్రసన్నకుమార్ రెడ్డి, ఎ.అమరనాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, జి.శ్రీకాంత్ రెడ్డి, శ్రీమతి శోభా నాగిరెడ్డి, బి.గురునాథరెడ్డి పోడియం వద్దకు చేరి సభకు అంతరాయం కలిగించసాగారు)

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుః అధ్యక్షా, ఈ డ్రామా అంతా ఏమిటి సార్? గౌరవసభ్యులు, గౌరవ మంత్రులు వారి వారి శాఖల గురించి, ఈ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల గురించి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వారిలో వారు తిట్టుకొనేందుకు కాదు కదా! నెహ్రూ గారి నుంచి శ్రీమతి ఇందిరా గాంధీ గారి నుంచి కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేసింది. గరీబీ హఠావో నినాదం ఇచ్చి, బ్యాంకుల జాతీయకరణ చేసి సామాన్య ప్రజలకు ఎన్నో ముఖ్యమైన కార్యక్రమాలు చేసింది. కాంగ్రెస్ పార్టీలోని వ్యక్తులు తప్పు చేసి ఉండవచ్చు కానీ కాంగ్రెస్ పార్టీ ఎపుడూ తప్పు చేయలేదు. ప్రభుత్వం నుంచి తమ తమ శాఖల్లో గత మూడు సంవత్సరాల నుంచి, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారి నాయకత్వంలో తాము చేపట్టిన కార్యక్రమాల గురించి చెప్పడానికి వారు సిద్ధంగా ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ఎందుకోసం పెట్టారో దానికే పరిమితమై మాట్లాడకుండా, ప్రతిపక్ష పార్టీలు వారిలో వారు కొట్లాడుకుంటూ ఉంటే వారిని బయటికి పంపించండి. మంత్రులు, ముఖ్యమంత్రి గారు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. తదుపరి సభ ముగించండి.

సా.5.00

శ్రీ ఎస్.వెంకట వీరయ్య(మైకు లేకుండా) ః సార్ ఒక దళిత ఎంఎల్ఏ మీద మైకు విసిరారు.

(టిడిపి సభ్యులు తమ స్థానాల ముందు నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

MR.DEPUTY SPEAKER: Please maintain decorum and dignity of the House.

(పోడియం వద్దనున్న వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ స్థానాల్లో కూర్చున్నారు)

శ్రీ ఎస్.వెంకట వీరయ్య(మైకు లేకుండా)ః సార్, ఒక దళిత ఎంఎల్ఏ మీద మైకు విసిరేసారు. నాకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వండి.

(టిడిపి సభ్యులచే సభకు అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Please sit down. I will give you the mike. Please resume your seats. (టిడిపి సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చున్నారు) I only request the entire House to kindly maintain some decency, decorum and dignity. రాష్ట్ర వ్యాప్తంగా మనమంతా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై వచ్చిన ప్రజా ప్రతినిధులం. రాష్ట్రం యావత్తూ మనం మాట్లాడుతున్న విషయాలను, మన ప్రవర్తనను అందరూ గమనిస్తున్నారు. మనం చాలా హుందాగా ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి రాష్ట్రంలో ఉన్న ప్రజల సమస్యలను చర్చించడానికి ప్రతి నిమిషాన్ని, ప్రతీ క్షణాన్ని వినియోగించే విధంగా మన ప్రవర్తన ఉండాలి. ఇక్కడెవరూ కూడా సభా మర్యాదను గానీ, సభా హుందాతనాన్ని గానీ నష్టపరిచే విధంగా ప్రవర్తిస్తే అది ప్రజాస్వామ్యానికే పెను విఘాతం. దయచేసి దీన్ని అర్థం చేసుకుంటారని, సభలో ఉన్నటువంటి అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన గౌరవ సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి సభా మర్యాదలను పాటిస్తూ ఎక్కడా కూడా వ్యక్తిగతమైన ధూషణలకు పోకుండా సభను నడపడం కోసం హుందాగా ప్రవర్తించాలని పదే పదే మిమ్మల్ని అందర్నీ విజ్ఞప్తి చేయడం జరుగుతున్నది. దీనికి సహకరిస్తారని ఆశిస్తున్నాను. దయచేసి అందరూ సహకరించాలని మరొక్కసారి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పటికే నేను అనేక సార్లు విజ్ఞప్తి చేసాను. వ్యక్తిగత ధూషణలు గానీ, అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్  గానీ వాడవద్దని దాన్ని తప్పనిసరిగా పాటిస్తారని భావిస్తున్నాను.

శ్రీ ఎస్.వెంకట వీరయ్యః అధ్యక్షా,

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః నర్సింహులు గారూ మాట్లాడండి.

శ్రీ ఎస్.వెంకట వీరయ్య ః అధ్యక్షా,

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ ః వీరయ్య గారూ దయచేసి పర్సనల్ ఎలిగేషన్‌లోకి పోకుండా మాట్లాడండి.

శ్రీ ఎస్.వెంకట వీరయ్య ః సార్, నేను రెండు విషయాల గురించి మాట్లాడుతున్నాను. ఈ సభలో ఎవరు మాట్లాడినా మీ వైపు చూస్తూ మాట్లాడాలి. మా నర్సింహులు గారు మాట్లాడిన దాని మీద వారికి(వైఎస్ఆర్‌సిపి సభ్యుల నుద్దేశించి) అభ్యంతరం ఉంటే వారు మైకులో చెప్పుకోవచ్చు. కానీ ఒక దళిత నాయకుడిగా గత 30 సంవత్సరాలుగా దళితుల హక్కుల కోసం పోరాడుతున్న మా నాయకుడి మీద అత్యంత దుర్మార్గంగా అక్కడ నుంచి హ్యాండ్ మైకులు విసిరేసుకుంటూ రావడం జరిగింది. దానికి క్షమాపణ చెప్పిన తరువాతనే మీరు సభను నడపాలి. ఎందుకంటే మేము మాట్లాడిన దాంట్లో వారికేమన్నా అభ్యంతరం ఉంటే మీరు మాట్లాడటానికి వారికి అవకాశం ఇస్తున్నారు. వాళ్లు కూడా అదే పద్ధతిలో మాట్లాడవలసిన అవసరం ఉండగా.... ఇద్దరు సభ్యులు నేను పేర్లు చెప్పకూడదు, దురహంకారంతో ఏ విధంగా పెత్తందారీ పోకడతో వ్యవహరిస్తూ అక్కడ నుంచి హ్యాండ్ మైకులను విసిరేసుకుంటూ రావడం జరిగింది. దాని మీద  ఆ సభ్యుల చేత  క్షమాపణ చెప్పించాల్సిన బాధ్యత మీ పైన ఉందని విజ్ఞప్తి చేస్తున్నాను. దళితుల యొక్క ఆత్మ గౌరవాన్ని కాపాడవలసిన అవసరం ఉన్నది. ఇప్పటికే ఆత్మ గౌరవం దెబ్బ తిన్నదని మేము మాట్లాడుతున్న క్రమంలో ప్రతీ ఒక్కళ్లు దళితుల పేరు మీద రాజకీయం చేస్తూ,  ఒక దళిత నాయకుడి మీద మైకులు విసురుకుంటూ వచ్చారు. అవి మీ ముందు కూడా పడ్డాయి. కాబట్టి ఆ సభ్యులు క్షమాపణ చెప్పిన తరువాతనే వాళ్లకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలి. వాళ్లు మీ అనుమతితో మైకులో మాట్లాడవలసిన అవసరం ఉంది గానీ అక్కడ నుంచి మైకులు విసిరేసుకుంటూ వ్యవహరించడమనేది మంచి పద్ధతి కాదు. దాని మీద ముందు మాట్లాడిన తరువాతనే మీరు వారికి అవకాశం ఇవ్వాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కె. శ్రీనివాసులుః అధ్యక్షా, నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. సభలో మేము మాకు కేటాయించిన సీట్లలో కూర్చుని చూస్తున్నాం. మేము చదువుకున్న వ్యక్తులుగా సభా మర్యాదలు పాటిస్తూ, సభా మర్యాదలను కాపాడుతున్న వ్యక్తులుగా ఇక్కడనే కూర్చున్నాం. ఒకవైపు అధికార పక్ష సభ్యులు మాట్లాడుతున్నారు. మా పార్టీ నాయకురాలు విజయమ్మ గారు మాట్లాడారు. చాలా మంది గౌరవ సభ్యులు మాట్లాడారు. మేము వింటున్నాం కూడా. కానీ చనిపోయి సమాధి చేయబడిన వ్యక్తి గురించి పదే పదే వాళ్లు మాట్లాడుతున్నారు. చనిపోయి సమాధి కాబడిన వ్యక్తి తిరిగి వచ్చి సమాధానం చెబుతారా? పదే పదే తోటి శాసన సభ్యులను మీరు దొంగలు, మీరు ద్రోహులు, దుర్మార్గులు అంటున్నారు. ఏమిటి అధ్యక్షా ఇది? మనం ఎక్కడకు పోతున్నాం. This is a democratic country. ఈరోజు ఎనిమిది కోట్ల మంది ప్రజలు టి.వి.ల్లో చూస్తున్నారు. మనం ఏమేమి శాసనాలు చేస్తున్నాం, ఏమేమి మాట్లాడుతున్నాం అని చూస్తున్నారు. ఈరోజు ప్రధానమైన ఎజెండాగా రైతుల సమస్యల పైన నో కాన్ఫిడెన్స్ మోషన్ పెట్టాం. మీరు అవిశ్వాసానికి మద్దతిస్తారా, లేదా అనేది మీ తీరును బట్టి ప్రజలు డిసైడ్ చేస్తారు (టిడిపి సభ్యుల నుద్దేశించి).

మేము మొదటి నుంచీ చెబుతున్నాం. నర్సింహులు గారు చాలా సీనియర్ నాయకులు. ఆయన మీద మాకు గౌరవమున్నది. ఆయన్ని చూసి కూడా మేము చాలా నేర్చుకున్నాం. కానీ పదే పదే ఆయన ఇంటరప్ట్ చేసి తోటి శాసన సభ్యులను తిట్టడం వలన బాధేస్తున్నది. పైగా మా దివంగత నాయకుడి గురించి పదే పదే మాట్లాడుతుంటే, తల్లి లాంటి విజయమ్మ గారు సభలో ఉన్నారు. పదే పదే కవ్వింపు చేస్తున్నట్లు మాట్లాడుతుంటే ఎంత అవమానం? ఎనిమిది కోట్ల మంది ప్రజలు టీ.వీ.లు చూస్తున్నారు. వాళ్లు(టిడిపి సభ్యుల నుద్దేశించి) రౌడీల్లాగా ఆధిపత్య పోరు చేస్తుంటే చాలా బాధేస్తున్నది. నేను కూడా ఒక దళిత శాసన సభ్యుణ్ణి. ఆయన ఒక సీనియర్ నాయకుడిగా పదే పదే ఆ విధంగా మాట్లాడటం వలన చాలా బాధేస్తున్నది. ఒక సీనియర్ శాసన సభ్యుడిగా మాకు ఆయన మీద గౌరవం ఉంది. ఆయన మాట్లాడుతున్నప్పుడు మీకు మేము అప్పీల్ చేసుకుంటున్నాం. ఎందుకంటే కోర్టులో ఉన్న విషయాల గురించి మాట్లాడటం సబ్జ్యుడీస్ క్రిందకు వస్తుంది కాబట్టి సభా మర్యాదలు పాటించమని మీరు గౌరవ సభ్యులకు చెప్పాలని మా ఆవేదన, మా బాధ. దయచేసి మా శాసన సభ్యుల ఆవేదనను అర్థం చేసుకుని అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్‌ను మీరు అనుమతించ వద్దని మీకు సభా పూర్వకంగా తెలియచేసుకుంటున్నాను.

సా.5.10

శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద రావు (మాధ్యమిక విద్యా శాఖా మంత్రి): అధ్యక్షా, సభ చాలా హుందాగా జరగాలనేది తమ ఆశయం, తమ ఆలోచన. దానికి తగ్గట్టుగా సభ్యులంతా మాట్లాడుతున్నారు. ఇందాక సభ్యులు వెంకట వీరయ్య గారు గాని, వీళ్లు చెప్పిన కారణం... మోత్కుపల్లి నర్సింహులు గారి గురించి మనందరికీ తెలుసు. చదువుకునే రోజుల్నించి ఆయన్ని చూస్తున్నాము. మంచి సీనియర్ శాసన సభ్యులు. వారు చాలా సేపటి నుండి మాట్లాడుతున్నారు. వారు మాట్లాడుతున్నప్పుడు మీరు పదే పదే చెప్పారు. అన్‌పార్లమెంటరీ ఏమన్నా వుంటే రికార్డుల నుండి తొలగిస్తామని చెప్పారు. వారికేందంటే పిచ్ కుదిరింది కదా అని కొడుతూ వున్నాడు. వారిని నేను కూడా రిక్వెస్ట్ చేస్తున్నాను. రాజశేఖర్ రెడ్డి గారు దివంగత నేత, కాంగ్రెస్ పార్టీ నేత.

(ఈ సందర్భంలో పిచ్చా! అని కొందరు తెలుగుదేశం పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

నా ఉద్దేశంలో పిచ్ అంటే క్రికెట్ గ్రౌండ్... రాజశేఖర్ రెడ్డి గారు అనంటే నర్సింహులు గారి ఉద్దేశం బహుశా వైఎస్సార్ పార్టీని ఉద్దేశించి అని అనుకుంటున్నాను. కానీ, రాజశేఖర్ రెడ్డి గారి విషయంలో మేమందరం చాలా ఫీల్ అవుతాము.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడుః అధ్యక్షా...

శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద రావుః దయచేసి చెప్పనివ్వండి. రాజశేఖర్ రెడ్డి గారు అకాల మరణం చెందడం, రాష్ట్రమంతా బాధపడిన విషయం అందరికీ తెలుసు. చాలా వరకు ఆయన మాట్లాడారు. దాన్ని కొంచెం తగ్గించి, స్పీచ్ కొనసాగించి నో కాన్ఫిడెన్స్ మోషన్ మీద మాట్లాడమని కోరుతున్నాను.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడుః అధ్యక్షా.... అధ్యక్షా....

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ముద్దు కృష్ణమ నాయుడు గారూ... ప్లీజ్ లీవ్ ఇట్. I have come to your rescue. నర్సింహులు గారూ.. మీరు మాట్లాడండి.

శ్రీ డి. నరేంద్ర కుమార్ః సార్, సభా గౌరవాన్ని మీరు కాపాడాలి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ముద్దు కృష్ణమ నాయుడు గారూ... No personal allegations. Please make an appeal.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు (నగరి)ః అధ్యక్షా, ఇక్కడ వాళ్లు పదే పదే ఏమంటున్నారంటే, ఈ సభలో లేని వాళ్ల గురించి, చనిపోయిన వారి గురించి మాట్లాడుతున్నామని అంటున్నారు. విజయమ్మ గారి స్పీచ్ అంతా కూడా ఆయన గొప్పతనం గురించి, ఆయనేదో చేసినట్లు, మిగతావాళ్లేమీ చేయనట్టు చెప్పింది. దానికి సంబంధించి ఆయన చేసిన అవినీతి గురించి, దోపిడీ గురించి కూడా మేము చెప్పాలి కదా సార్? లక్ష కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్నారు. అది కూడా వుంటే బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుండొచ్చు అని చెప్పాల్సిన బాధ్యత మా మీద లేదా? ఇది మేము కొత్తగా చెప్పింది కాదు. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడే ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఏ బ్యాంకు నుండి, ఎంత మనీ ల్యాండరింగ్‌లో వచ్చింది, మారిషస్ నుండి ఎంత డబ్బు వచ్చింది, సింగపూర్ నుండి ఎంత డబ్బు వచ్చిందనేది పుస్తకాలు ప్రింట్ చేసి, సైన్ పెట్టి చంద్రబాబు నాయుడు గారు పుస్తకాలిచ్చారు. ఆయన సంతకం చేసారు కాబట్టి కోర్టుకు పోయి ఆయన మీద పరువు నష్టం దావా వేసి వుండొచ్చు. ఆయన అన్నింటినీ ఒప్పుకున్నాడు. Raja of corruption అని వుంది. ఇది చూడండి. (పుస్తకాన్ని సభలో చూపించారు) Every page in this Book was signed by Sri. N. Chandra Babu Naidu. ఇదంతా కూడా తప్పని అనుకుంటే ఆయన (వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి) కోర్టుకు వెళ్లి పరువు నష్టం దావా వేసి వుండొచ్చు. ఆయన చనిపోయిన తరువాత గొప్పలు చెప్పుకోవచ్చు.

మాణిక్య వరప్రసాదరావు గారు పదే పదే మా నాయకుడు, మా నాయకుడు అంటున్నారు. మరి మీ నాయకుడు లక్ష కోట్లు దోచుకున్నాడు. దానికి వారసత్వం వహిస్తారా మీరు? సిబిఐ కేసుల విషయం చెప్పింది. దానికి వారసత్వం వహిస్తారా మీరు? మీరు ఆ అవినీతిని వారసత్వంగా తీసుకుని పరిపాలన చేస్తారా? ధర్మాన ప్రసాద రావుతో సహా ఆరుమంది మంత్రులు జైలుకు వెళ్లాలని చెప్పారు. మీ కోసం చాలా మంది ఆఫీసర్లు బలైపోయారు. ఆరు మందిని కాపాడుతున్నారు. మీ క్యాబినెట్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న

మంత్రులకి మేం న్యాయ సహాయాన్ని అందిస్తామంటారు. సిబిఐ పర్మిషన్ ఇవ్వదంటారు. ఇంకా మీరు ఈ అవినీతిని ప్రోత్సహిస్తున్నారంటే అవినీతి నాయకుడిని మీరు మెచ్చుకుంటున్నారంటే ప్రజలు మిమ్మల్ని చూసి నవ్వుకుంటున్నారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: నర్సింహులు గారూ....

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు: ఈ ముఖ్యమంత్రి గాని, ఏసీబీ గాని ఎందుకుంది? మీకు హక్కు లేదా? ఆ డబ్బులు వసూలు చేసి, 35 ఎకరాల స్థలంలో కట్టిన ఆ ఇంటిని స్వాధీనం చేసుకోండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ప్లీజ్ సిట్ డౌన్. I will give you an opportunity. Muddu Krishnama Naidu Garu... Please sit down. You are the senior most member of this House. Please resume your seat.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు: కంప్లీట్ చేయనివ్వండి సార్.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ధర్మాన ప్రసాద రావు గారూ....

శ్రీ ధర్మాన ప్రసాద రావు: అధ్యక్షా, నో కాన్ఫిడెన్స్ మోషన్‌పై డిస్కషన్ జరుగుతోంది, మేం ఆన్సర్ చెప్పాలని చూస్తున్నాం. ఎంత సేపు డిబేట్ జరిగితే అంతవరకు మాట్లాడతాము. మధ్యమధ్యలో లేచి ఇలాంటి పాసింగ్ రిమార్క్స్ చేస్తే, చాలా డీటెయిల్డుగా జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మాకు వుంటుంది. ధర్మాన ప్రసాదరావు అని ఒక్క మాటతో అంటే పోదు. ఎందుకంటే నేను చెప్పాలంటే నాకు మళ్లీ చాలా టైం అవసరం పడుతుంది. నేను చెప్పాల్సి వస్తుంది.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులు చెప్పు... చెప్పు... అని అనసాగారు)

చెప్పడానికి నాకేమీ అభ్యంతరం లేదు. మీరు మాట్లాడిన తరువాత నాకు ఒక ఆపర్ట్యూనిటీ ఇస్తే ఆ కేసుకు సంబంధించిన వివరాలు చెబుతాను. చెప్పిన సందర్భంలో కంపారిజన్స్ చెప్పాల్సి వుంటుంది. ఆ కంపారిజన్స్ అన్నీ మీరు భరిస్తానంటే నాకేమీ అభ్యంతరం లేదు. మెయిన్ ఆబ్జెక్టు దెబ్బతింటుందనే ఉద్దేశంతో ఊరుకుంటున్నానే తప్ప, ఒక్క విషయాన్ని నేను ప్రస్తావన చేస్తే మీరు సభ నుండి లేచి పారిపోవాలి. అవన్నీ దృష్టిలో పెట్టుకోండి.

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు: అధ్యక్షా...

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ఒక్క నిమిషం ముద్దు కృష్ణమ నాయుడు గారూ... దయచేసి వినండి. నర్సింహులు గారు మాట్లాడి పూర్తి చేసిన తరువాత మీరు అవకాశం తీసుకుందురు గాని. Narsimhulu garu, please conclude.

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు: అధ్యక్షా...

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః నర్సింహులు గారిని కంక్లూడ్ చేయనివ్వండి. ఆయన మాట్లాడటం పూర్తి చేసిన తరువాత మీరు మాట్లాడుదురు గాని.

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడుః అధ్యక్షా...ధర్మాన ప్రసాదరావు గారు చెప్పారు. 26 జీఓల విషయంలో... సీబిఐ ఎంక్వైరీ చేసిన తరువాత ఇంకా ఈ ప్రభుత్వం లక్ష కోట్లు సంపాదించుకున్న రాజశేఖర్ రెడ్డి గారి నుండి డబ్బులు రాబట్టదు. జగన్మోహన్‌రెడ్డి నుండి డబ్బులు రాబట్టదు. భారతి సిమెంట్ ఫ్యాక్టరీని మీరు కాన్ఫిస్కేట్ చేయరు. వారి పవర్ ప్లాంట్‌ని కాన్ఫిస్కేట్ చేయరు. ఇది ప్రజల సొమ్ము. దాన్ని కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద వుందా, లేదా సార్? దాన్నంతా కూడా రాబట్టి, ప్రజలకు న్యాయం చేయాల్సిన అవసరముందా, లేదా? కరెంటు లేక, గిట్టుబాటు ధర లేకుండా రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే, ఫీజు రీఇంబర్స్‌మెంట్ లేక, పెన్షన్లు లేక, ఇళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే ఆ డబ్బులు కాన్ఫిస్కేట్ చేసే పని ఎవరు చేయాలి? కోర్టులు చేస్తాయా? మీరు గవర్నమెంట్ తరఫున రాబట్టాలి. కోర్టులు జడ్జిమెంట్‌లు ఇస్తాయి. అదంతా కూడా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద వుంది. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు ౠౠౠ ••• కాపాడుతున్నారు. ౠౠౠ మీద ఈ ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలి. దోపిడీదారులు, అవినీతిపరులు ....

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః పితాని సత్యనారాయణ గారూ...

శ్రీ దానం నాగేందర్ః అధ్యక్షా, ఒక్క నిమిషం అవకాశమివ్వండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః దానం నాగేందర్ గారూ...

శ్రీ దానం నాగేందర్ః అధ్యక్షా, చాలా మంది సభ్యులు పదే పదే ఎవరైతే మీ ద్వారా ఈ నో కాన్ఫిడెన్స్ మోషన్ మూవ్ చేశారో వాళ్లకు సంబంధించిన విషయాలు వాళ్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ తరఫున ఈ రాష్ట్ర ప్రభుత్వం పని మంచిగా చేస్తోందా, లేదా అనే విషయంలో వాళ్ల అభిప్రాయాలు చెప్పమని చెప్పాం. ఇప్పుడే ధర్మాన ప్రసాదరావు గారు చెప్పినట్లుగా ఒక అపోజిషన్ పార్టీ నుండి నిర్మాణాత్మకమైన సలహాలు వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తుంటాము. కానీ, ఇప్పుడు జరుగుతున్న నో కాన్ఫిడెన్స్ మోషన్ మీద చర్చ ఏం జరుగుతోందన్నది ప్రజలందరూ ఉత్కంఠతో చూస్తున్నారు. దాని మీద యాంగ్జైయిటీతో మాకు సంబంధించిన మంత్రులందరు గాని, సభ్యులు గాని రిప్లై చెప్పి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేసినటువంటి పనులు గురించి చెప్పాలనే యాంగ్జయిటీతో మేం కూడా వున్నాము. కానీ, దురదృష్టమేమంటే ప్రతిసారీ సబ్జెక్టు డీవియేట్ అయిపోయి వీళ్లకు సబ్జెక్టు లేదు, వాళ్లకు సబ్జెక్టు లేదు. అల్టిమేట్‌గా చెప్పేదేమంటే... ముద్దు కృష్ణమ నాయుడు గారు చెప్పిందేమంటే ముఖ్యమంత్రి గారు ౠౠౠ నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. మీ ౠౠౠ ఇక్కడ నుండి తప్పించుకుని తిరుగుతున్నాడు. మీరు మాట్లాడటం ఎట్లా వుంది? నువ్వు ఇప్పుడే ఒక బుక్కు చూపించావు. ఆ బుక్కు చూపించినప్పుడు నువ్వు ఎక్కడున్నావు? ఆ బుక్కు చూపించావు. ఆ బుక్కులో నీ సంతకం వుందా? మాట్లాడేటప్పుడు నైతిక విలువలు వుండే విధంగా మాట్లాడు. ఇప్పుడొక మాట, అప్పుడొక మాట మాట్లాడే తీరు మార్చుకొని, ఎప్పుడూ ఒకే తీరుగా మాట్లాడే అలవాటు నువ్వు నేర్చుకో. అందుకే నర్సింహులు గారికి కూడా మేం చెప్పాం.

(మైకు కట్ చేయబడింది)

••• Expunged as ordered by the Chair

శ్రీ ఎం. నర్సింహులు ః అధ్యక్షా, ఇక్కడ సమస్య ఏమంటే.. మా తెలుగుదేశం పార్టీని ఉద్దేశించి, మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారిని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కయ్యారంటే వదిలేయమంటారా? ఏ విధంగా అది కరెక్ట్? ఈ మాట మాట్లాడటానికి ఎంత ధైర్యం ఉండాలి. దాని కోసం మాట్లాడుతున్నాను. ఇంకొక విషయం ఏమంటే, మన ముఖ్యమంత్రి గారు.. సరే ఆయన వచ్చి రెండు సంవత్సరాలు అయ్యింది. ఇప్పుడు వారు సభలో కూడా లేరు. ఈ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఇంత పెద్ద దోపిడీకి గురైన సమస్య మీద.. ఈ రాష్ట్రంలో ఏమేమి జరుగుతుందో చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. మరి ముఖ్యమంత్రి గారు ఇక్కడ సభలో లేరు. ముఖ్యమంత్రి గారు దయచేసి మీకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో జరిగిన దోపిడీలు, అన్యాయాలు, సెజ్ భూములు, వాన్‌పిక్ భూములు, ఎంఆర్ భూములు, ఈ రాష్ట్రంలో ఉన్న పవర్ ప్లాంట్లన్నింటినీ దోచుకొని తిన్నటువంటి ఆ నాయకులందరి ఆస్తులను ప్రభుత్వం ఖచ్చితంగా స్వాధీనం చేసుకుంటుందా లేదా? అని మిమ్మల్ని అడుగుతున్నాను. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయి? ఎవరు చేశారో చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి గారి మీద ఉన్నది. నేను ఒక్కటే ఈ సందర్భంగా అడుగుతున్నాను. ఓబుళాపురం గనులు అనంతపురం జిల్లా, లక్షల టన్నుల ఇనుప ఖనిజం..

(అంతరాయం)

మూడు నాలుగు పాయింట్స్ చెప్పి వదిలేస్తాను. అంటే.. ఎంత చెప్పినా అంతులేని తప్పులను, పాపాలను చేశారు. ఆ తప్పులు విపరీతంగా ఉన్నాయి. కొన్ని మాత్రమే చెబుతున్నాను. ఎన్ని తప్పులు చేసినా కొన్నింటి గురించే చెబుతున్నాను. ముఖ్యమంత్రి గారు దయచేసి దీనికి సమాధానం చెప్పాలి, ఖచ్చితంగా వీటన్నింటినీ రాబట్టాలి. ఓబులాపురం గనులు అనంతపురం జిల్లా, గాలి జనార్ధన్ రెడ్డి, వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, లక్షల టన్నుల ఇనుప ఖనిజం అక్రమ రవాణా. పది వేల కోట్ల అక్రమ ఆర్జన.. అవునా కాదా? ముఖ్యమంత్రి గారు చెప్పాలి. అదే విధంగా ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉన్న లక్షా నలభై వేల ఎకరాల గనుల అక్రమ కేటాయింపు, వై.ఎస్ అల్లుడు బ్రదర్ అనీల్ కుమార్‌కు ధారదత్తం చేసిన విషయం అవునా కాదా? ముఖ్యమంత్రి గారు చెప్పాలి. అదే విధంగా కడప జిల్లా మంగంపేట బెరైటీస్ గనులను వై.ఎస్ బంధువు జస్వంత్‌రెడ్డికి అప్పగించారా లేదా ముఖ్యమంత్రి గారు సమాధానం చెప్పాలి. అదే విధంగా ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ త్రవ్వకాలను ఆనాడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రి గారు ఎవరికి ఇచ్చారో చెప్పాలి. పేరు చెప్పకపోయినా కనీసం అది ఎప్పుడు జరిగిందో, ఎవరు చేశారో చెప్పండి? ఈ ముఖ్యమంత్రి గారికి ఏ మాత్రం బాధ్యత ఉన్నా మేము మాట్లాడిన అంశాలన్నింటి పైన ఖచ్చితంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

నీతినిజాయితీలను ఎప్పుడూ కూడా పాపాత్ములు భరించలేరు. మేము మాట్లాడే మాటలను కూడా కొంత మంది భరించలేరు. అందుకనే మైకులు తీసుకొని కొడుతున్నారు. ఏమ్.. నీ సంగతి చూస్తాం అంటున్నారు. ఏం చూస్తావయ్యా నాకు 60 ఏళ్ల వయస్సు వచ్చింది. గత 35 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్నాను. ఇక నువ్వు నన్ను చూసేది ఏమిటి? ఆనాడు వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ఉన్నప్పుడు కూడా నేను ఎమ్మెల్యేగా ఉన్నాను. ఎంత మంది ముఖ్యమంత్రులను నేను చూడలేదు. ఈరోజు ఇక్కడకి పరిగెత్తుకొని వచ్చి నీ అహంకొద్ది నా మీద మైకు విసిరేస్తే తప్పులు ఒప్పులు అవుతాయా? మీరు చేసిన పాపాలను ప్రజలు మర్చిపోతారా? మీరు డబ్బులతో రాజకీయాలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పరిస్థితుల నుండి ప్రజలను రక్షించడానికే నేను మాట్లాడుతున్నాను తప్ప వేరే ఉద్దేశం కాదు. చాలా మంది దళిత క్రైస్తవులు, దళితులు పేదవాళ్లుగా ఉన్నారు. ఏ ఒక్క వ్యక్తి కూడా ఈ రోజు కనీసం భోజనం చేసే పరిస్థితుల్లో లేరు. మీరు మాత్రం లక్షల కోట్లను దండుకొని ఉండగలిగారు. ఆ డబ్బు ఏ విధంగా వచ్చింది? దేవుడు ఎట్లా మీకు ఇచ్చాడో నాకు

అర్థం కావడం లేదు. వీళ్ల మనస్సు మార్చమని నేను ఆ యేసుక్రీస్తును ప్రార్థిస్తున్నాను. ఏ వ్యక్తి అయినా సరే ఏదో ఒక రోజు ఒప్పుకుంటాడు. ఏమనంటే మేము ఈ తప్పులు చేశాము ఈ తప్పులు చేయలేదని. తింటే తిన్నాం లేకపోతే లేదని చెప్పుకుంటారు. ఆ చెప్పుకునే సాహసం కూడా మీకు లేదంటే ఎంత అన్యాయం. అవును ఇంత మంది అంటున్నారు. అవునా కాదా పోనీ ఎన్ని సంపాదించారు? దాని లెక్కెంత మీరు చెప్పలేదు. ఎందుకు మీరు ౙౙౙ *** దాచుకుంటారు? ఇల్లు కట్టింది నిజం కాదా? మేడలు కట్టింది నిజం కాదా? దోపిడి చేస్తే చెప్పాల్సిన అవసరం మీ మీద లేదా? ఈ రోజు సాక్షి పేపర్‌ని గానీ, టివిని గానీ ఎక్కడ నుండి వచ్చిన డబ్బుతో పెట్టారో మీరు చెప్పాలి కదా! భారతి సిమెంట్ గురించి చెప్పాలి. అలాగే రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌కి నీళ్లు ఇవ్వకుండా ఆ నీళ్లన్నింటినీ గాలి జనార్థన్‌రెడ్డి పవర్ ప్లాంట్ బ్రాహ్మణి స్టీల్స్‌కి మీరు ధారాదత్తం చేయలేదా? దాని వల్ల మన రాష్ట్రానికి కరెంట్ కొరత ఏర్పడలేదా? దాని వల్ల ఈ రాష్ట్రం అంధకారంలోకి వెళ్లలేదా? కాబట్టి నేను ఒక పేద వర్గానికి సంబంధంచిన వ్యక్తిగా 30 సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో ఒక దళితుడిగా ఒక ప్రజాప్రతినిధిగా ఉంటూ.. వాస్తవాలను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. నేను మాట్లాడే మాటలు ఏ ఒక్కటి తప్పయినా.. భగవంతుడు చూస్తున్నాడు. పేదలకి అన్యాయం జరిగింది. పేదల భూములను పెత్తందార్లు దోపిడి చేశారనేది నా బాధ. ఎస్సీలు పొందవలసిన భూములను పెత్తందార్లకు, బడా భూస్వాములకు మీరు అప్పగించారనేది నా బాధ. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క జిల్లాలో కూడా అయిదు గజాల స్థలాన్ని కూడా మీరు ఇళ్ల స్థలం నిమిత్తం ఇవ్వకుండా, పెట్టుబడి దారుల దగ్గర డబ్బు తీసుకొని వారికి ధారదత్తం చేయడం ద్వారా మా కడుపు కొట్టారు. అదే నా బాధ. అంతకంటే వాళ్ల మీద మాకేమి కోపం. వాళ్లు బిజినెస్ చేసుకొని సంపాదించుకుంటే మేము ఒద్దన్నామా? ఏ బిజినెస్ చేస్తే ఇన్ని డబ్బులు వస్తాయో చెప్పాల్సిన బాధ్యత వారికి లేదా? ఈ ప్రభుత్వానికి లేదా అని అడుగుతున్నాను. సరే.. ఎవరైతే సోదరుడు నా మీద మైకు విసిరేశాడో నేను వారిని ఏమి అనదల్చుకోలేదు. అయినా.. ఆ భగవంతుడే చూసుకుంటాడు.

ఇకపోతే విద్యుత్.. ఈ రాష్ట్రంలో విద్యుత్ ఉందా అధ్యక్షా . ఈ ప్రభుత్వాన్ని నేను అడుగుతున్నాను విద్యుత్ ఉందా? ఎన్ని గంటలు మీరు ఇస్తామన్నారు? ఎన్నికల్లో తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు గంటలు ఇస్తామన్నారు. ఏడు గంటలు కాదు ఈరోజున మూడు గంటలు కూడా రావడం లేదు. మీలో ఎవరికైనా దమ్ముంటే కలిసిపోదాం రండి. ఏ ఊరికెళదామో ఎక్కడికి పోదామో మీరు రండని ఈ సందర్భంగా నేను కోరుతున్నాను. ఈరోజు రైతులు పెట్టుబడులు పెట్టి, దుక్కిదున్ని వరినాట్లు వేస్తే మొత్తం ఎండిపోయాయి. దానికి మీరు బాధ్యులు కారా అని అడుగుతున్నాను. మూడు గంటల విద్యుత్ సరఫరా కూడా లేక ఏ టైంలో వస్తుందో తెలియక తెల్లవార్లు పొలాల్లో బోర్ల దగ్గర పండుకోవడం వలన పాము కాటుకు గురై మీ యొక్క దుర్మార్గమైన పరిపాలన వలన 5000 మంది రైతులు ఈ రాష్ట్రంలో చనిపోయారు. రైతు కుటుంబాలు కాపురాలు కూడా చేసుకోవాల్సిన పరిస్థితి లేకుండా ఈ ప్రభుత్వం చేస్తోంది. ఈ ప్రభుత్వం విధానాల వలన 22000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు అని మీరు చెబుతున్నారే.. అక్కడ కరెంటు లేకపోతే మరి ముఖ్యమంత్రి గారి ఇంట్లో కరెంటు లేదా? మంత్రుల ఇంట్లో కరెంటు లేదా? ప్రజాప్రతినిధుల ఇంట్లో కరెంటు లేదా? మన ఇళ్లలో కరెంటు ఎందుకు ఉండాలి? గ్రామాల్లో కరెంటు ఎందుకు ఉండకూడదని అడుగుతున్నాను

మీరు ఏమి చెప్పారు? ఇరవై నాలుగు గంటలు కరెంటు ఇస్తామని చెప్పారు. ఈ రోజు గంట సేపు కూడా కరెంటు ఉండటం లేదు. ఫ్యాన్లు తిరగడం లేదు. అంతెందుకు గ్రామాల్లో ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయితే ఆ నాడు తెలుగుదేశం హయాంలో ఇరవై నాలుగు గంటల్లో సప్లై అయ్యేది. ఈ ప్రభుత్వ హయాంలో

*** Expunged as ordered by the Chair

వారం రోజులైనా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదనే విషయాన్ని తెలియజేస్తున్నాను. అంతేకాదు, కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ఏమి చేయాలో తెలియక, ఉక్కపోసి కొవ్వొత్తులను పెట్టుకొని బయట చదువుకుందామనుకుంటే దోమలు కరిచి డెంగూ, మలేరియా వంటి వ్యాధులు సోకడం వలన చచ్చిపోయే కాలం మీ పరిపాలనలో వచ్చిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

సా. 5.30

ఈ రాష్ట్రంలో అసలు కరెంట్ లేదు. రాష్ట్రంలో పరిశ్రమలన్నీ మూతపడినందున వాటిల్లో పనిచేసే ముప్పై లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

MR.DY.SPEAKER: Please conclude Narsimhulu Garu.

శ్రీ ఎం. నర్సింహులు : పరిశ్రమలకు పవర్ హాలిడే అని పెట్టకుండా అసలు పవర్‌కే హాలిడే ప్రకటించినా ప్రస్తుతానికి మిమ్మల్ని అడిగేవారు లేకపోయినప్పటికీ ఆరు నెలల తర్వాత జరిగే ఎన్నికల ద్వారా మీ సంగతి చెప్పడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. నేను చెప్పాలంటే ఇంకా చాలా విషయాలు ఉన్నాయి కానీ చాలా మంది సభ్యులు కూర్చొని వినడానికే ఇబ్బంది పడుతున్నారు. సర్‌చార్జీలు చెల్లించడానికి ఒక్కరోజు ఆలస్యమైనా రూ.25/-పెనాల్టీ వసూలు చేస్తున్నారు. ఎన్.టి.రామారావు గారి హయాంలో ఇంటింటికి కరెంట్ సప్లై ఇచ్చిన ఘనత కేవలం తెలుగుదేశం పార్టీకే దక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత కరెంట్‌నిస్తామని చెప్పి ఉన్న కరెంట్‌నే ఊడబీకబోతున్నారు.

(శ్రీ దానం నాగేందర్ గారి నుంచి అంతరాయం)

దానం నాగేందర్ గారూ, మీరు పట్టణంలో ఉన్నారు కాబట్టి మీకు కరెంట్ కష్టాల గురించి తెలియదు, గ్రామాలకు వచ్చి చూస్తేనే పరిస్థితి తెలుస్తుంది. గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయి పది రోజులైనా పట్టించుకునే నాథుడే లేడు. గ్రామాలలో ఎదుర్కొంటున్న కష్టాల గురించి మంత్రులకు చెబుదామంటే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు ఇప్పుడున్న మంత్రులందరినీ జైళ్లకు పంపే పనులు చేశారు. ఈ రాష్ట్రంలో కరెంట్ లేనే లేదు. ఈ ప్రభుత్వం అవినీతికి ఇస్తున్న ప్రాధాన్యత రైతాంగానికి ఇవ్వడం లేదు కాబట్టి ఖచ్చితంగా పేదలకు, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వం వ్యతిరేక ప్రభుత్వమని తెలియజేస్తున్నాను. గ్రామాలలో నివసించేది పేద ప్రజలు. పెద్దోళ్లు, పెత్తందార్లు నివసించేది పట్టణాలలో.

మండల కేంద్రాలలోని ఒక హాస్పటల్‌కి ఒక నిండు గర్భిణి నొప్పులొచ్చి వెళితే ఆమెకు ఆపరేషన్ చేయడానికి చేసే ప్రయత్నం చేస్తుండగా సగం ఆపరేషన్ చేసిన తర్వాత కరెంట్ పోయిందట. ఈ విధంగా ఆపరేషన్ మధ్యలో కరెంట్ పోవడం మూలంగా తల్లీ, పిల్ల ఇద్దరూ చనిపోవడం జరిగింది. దీనికి ఎవరు బాధ్యులని నేను మీ ద్వారా అడుగుతున్నాను. ప్రభుత్వ హాస్పటళ్లలో ఇన్‌క్యుబేటర్లు, వెంటిలేటర్లు లేనందున గ్రామాలలో వైద్యం అందక పేద ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.

MR.DY.SPEAKER: Please conclude Narsimhulu Garu.

శ్రీ ఎం. నర్సింహులు : అధ్యక్షా, మీరు తొందర పెడుతున్నారు కాబట్టి కొన్ని విషయాలను మాత్రమే చెబుతాను. ఏది ఏమైనప్పటికీ ఈ రాష్ట్రంలో పేద ప్రజలకు అన్ని విధాలుగా అన్యాయం, నష్టం జరుగుతున్నది.

ఈ మధ్యనే హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో జంట బాంబు పేలుళ్లు జరిగాయి. బాంబు పేలుళ్ల గురించి కేంద్ర ప్రభుత్వం ముందుగానే రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు చేసినప్పటికీ వాటి గురించి సేఫ్టీ మెజర్స్ తీసుకోలేదంటే ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏ విధంగా ఉందనేది ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే చెప్పిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఈ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్లలో పదిహేడు మంది మృతి చెందితే దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన అవసరం లేదా అని అడుగుతున్నాను.

శ్రీ ఇ. ప్రతాప్‌రెడ్డి (న్యాయ శాఖా మంత్రి) (మైకు లేకుండా ): 2003 సంవత్సరంలో మీ నాయకుడు అధికారంలో ఉన్నప్పుడు అలిపిరి దగ్గర బాంబు బ్లాస్ట్ జరిగినప్పుడు మీ నాయకుడు కూడా గాయపడ్డారు కదా ?

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: ప్రతాప్‌రెడ్డి గారూ మీరు మంచివారు. నేను ఎవరినీ నొప్పించే ఉద్దేశంతో మాట్లాడటం లేదు. కేవలం జరిగిన అన్యాయాల గురించి మాత్రమే చెబుతున్నాను. దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్లలో పదిహేడు మంది మృతి చెందితే, గతంలో గోకుల్ చాట్, లుంబినీ పార్క్, మక్కా మసీదులలో జరిగిన బాంబు పేలుళ్లలో సుమారు డెబ్బై అయిదు మంది చనిపోగా 220 మంది గాయాలపాలయ్యారు. దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్లలో బీటెక్ చదివే అమ్మాయి కాలు పోయి ఆమె జీవితం అంధకారమైంది. బాంబు పేలుళ్లలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియాగా క్షతగాత్రులకు యాభై వేలు, లక్ష రూపాయల వరకు వైద్య ఖర్చుల నిమిత్తం చెల్లించామని చెబుతున్నారు. అంతే కాకుండా వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇస్తామని ఈ ప్రభుత్వం భరోసా ఇచ్చినట్టున్నది కాబట్టి కచ్చితంగా ఉద్యోగావకాశం కల్పించాలని కోరుతున్నాను. అంతే కాకుండా క్షతగాత్రులుగా ఉన్నవారు బ్రతికి కూడా ఉపయోగం లేకుండా ఉన్నది కాబట్టి కచ్చితంగా ఆ కుటుంబాలకు ఉద్యోగావకాశం కల్పించడంతోబాటు వారికి శాశ్వతంగా సహకరించాలని మీ ద్వారా డిమాండ్ చేస్తున్నాను.

త్రాగునీటికి సంబంధించి నాకున్న సమాచారం ప్రకారం ఈ రాష్ట్రంలో 55,000 మంచినీటి పథకాలున్నప్పటికీ ఏ ఒక్క పథకం కూడా అమలులో లేనందున చివరికి పాత బావుల నుంచి నీటిని తెచ్చుకొని తాగితే పేద ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నందున వారు త్రాగు నీటిని కూడా కొనుక్కొని తాగవలసిన పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయి. ఈ రాష్ట్రంలో బెల్ట్ షాపులలో మందు దొరుకుతున్నది కానీ దాహం తీర్చుకునేందుకు మంచి నీరు మాత్రం దొరకడం లేదు. ఈ ప్రభుత్వానికి నైతిక విలువలు ఉంటే అధికారంలో కొనసాగాలా వద్దా అనేది ఆలోచించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. చాలా జిల్లాలలో కరవు ఉన్నది కాబట్టి ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలను ఆదుకోవడానికి అన్ని జిల్లాలలో మంచినీటి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని ఈ సందర్భంగా నేను డిమాండ్ చేస్తున్నాను.

బాబ్లీ విషయానికొస్తే ముఖ్యంగా తెలంగాణలోని అయిదు జిల్లాలలో రాబోయే కాలంలో సాగునీరు అందే పరిస్థితులు లేవు. మహారాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి రావలసిన నీటి వాటాను దోపిడీ చేసుకొని వారి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునే ప్రయత్నం చేస్తున్నది.

సా.5.40

బాబ్లీ ప్రాజెక్టును మహారాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్ర సరిహద్దుల్లో ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో అక్రమంగా నిర్మాణం చేస్తుంటే కూడా ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. ప్రజల కోసం బాధ్యత వహించే పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లేదు కాబట్టే ఈనాడు మహారాష్ట్ర ప్రభుత్వం మనకొచ్చే నీళ్లను బాబ్లీ అక్రమ ప్రాజెక్టు నిర్మాణం చేయడం ద్వారా దోపిడికి పాల్పడుతోందని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కేంద్రంలో యు.పి.ఏ. ప్రభుత్వం అధికారంలో ఉండి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా మహారాష్ట్ర నీటి దోపిడిని ప్రభుత్వాలు అరికట్టలేకపోతున్నాయి. బాబ్లీ ప్రాజెక్ట్ అక్రమ నిర్మాణంపై తెలుగుదేశం పార్టీ రాజీలేని పోరాటం చేయడానికి గాను క్షేత్ర స్థాయికి వెళ్లి, అక్కడే ధర్నా చేసిన సందర్భంలో మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారితో సహా మా సహచర సభ్యులను, పార్టీ కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించి, అరెస్ట్ చేసి, ఆహారం అందించకుండా ఉంటే కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సరిగా ఆనాడు స్పందించలేదు. మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నీటి దోపిడి చేస్తుంటే కూడా చూస్తూ ఊరుకోవడమనే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ చర్య అన్యాయం, అక్రమం అదే విధంగా ప్రభుత్వ బాధ్యతారాహిత్యమని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆ విషయమై ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఖచ్చితంగా నైతికంగా ఆలోచన చేసుకోవాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ఆ అక్రమ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణ ప్రాంతంలోని ఐదు జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ మరియు నల్లగొండ జిల్లాలు పూర్తిగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. నల్లగొండ జిల్లాలోని మారుమూల నియోజకవర్గమైన తుంగతుర్తి నా నియోజకవర్గం. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు తాగునీటికి నోచుకోలేనటువంటి దుస్థితికి కారణం ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: నర్సింహులు గారు మీరు త్వరగా ముగించండి. Please conclude.

శ్రీ దానం నాగేందర్: సార్...........

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: దానం నాగేందర్ గారు దయచేసి కూర్చోండి. నేను మాట్లాడినాక గంట సమయం తీసుకొని మాట్లాడు. గౌరవ ఉప సభాపతి గారు సమయం కేటాయిస్తారు. ఎందుకు నా ప్రస్తావనకు అనవసరంగా అడ్డం తగులుతున్నావు.

అధ్యక్షా, మన దళిత వర్గాలకు సంబంధించినటువంటి ఉప ప్రణాళిక గురించి మాట్లాడుకోవాలి. ఈ దళిత ఉప ప్రణాళిక విషయంలో మనం ఒకసారి ఆలోచన చేసుకొని మాట్లాడుకోవాల్సిన అవసరం ఉంది. దళితుల్లో మొత్తం 59 ఉప కులాలున్నాయి. ఉన్నటువంటి 59 ఉప కులాలకు సమాన న్యాయం చేయమని కోరుకుంటున్నాం. ఏ ఒక కులానికి అన్యాయం చేయమని మనం అనుకోవడం లేదు. కులాలకు సంబంధించిన ఎ, బి, సి, డి వర్గీకరణ విషయంలో, క్యాటగిరైజేషన్ విషయంలో కూడా కచ్చితంగా ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన అవసరముంది. 2000వ సంవత్సరం నుంచి 2004వ సంవత్సరం వరకు కూడా ఖచ్చితంగా క్యాటగిరైజేషన్ జరిగింది. ముఖ్యంగా మాదిగలు, మాదిగ ఉప కులాలకు సంబంధించిన క్యాటగిరైజేషన్ జరిగింది. ఆ యా కులాలకు న్యాయం జరిగింది. మెడికల్ సీట్లల్లో గానీ, ఇంజనీరింగ్ సీట్లల్లో గానీ, ఉద్యోగ కల్పన విషయంలో గానీ అదే విధంగా ఆర్థికపరమైనటువంటి సమానత్వంలో గానీ ఆ యా వర్గాల ప్రజలకు తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో సముచితమైన న్యాయం జరిగింది. కానీ, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఈ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోంది. కానీ అది మంచి పద్ధతి కాదు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజానీకానికి సమాన న్యాయం

జరగాలి. జనాభా ప్రాతిపదిక పైన అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం జరగాలనేది తెలుగుదేశం పార్టీ ఉద్దేశం తప్ప, ఏ వర్గానికి గానీ, ఏ ఒక ఉప కులాన్ని కూడా చిన్న చూపు చూసే పరిస్థితి, ఉద్దేశం మా పార్టీకి లేదు. ఒకవేళ ఏ వర్గాన్నైనా, కులాన్నైనా చిన్న చూపు చూడాలనుకుంటే మాత్రం మోత్కుపల్లి నర్సింహులు గారే ముందుండి పోరాటం చేస్తాడనే విషయాన్ని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

మీరు ఒక విషయం గమనించండి. 2004-05వ సంవత్సరపు రాష్ట్ర ప్రణాళిక మొత్తం రూ.13,291.00 కోట్లు. దాంట్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన మొత్తం రూ.11,081.00 కోట్లు. ఆ మొత్తంలో కూడా సుమారు రూ.160.00 కోట్లు దారి మళ్లాయి. 2004-05వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు అంటే ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆ విధంగా సుమారు రూ.21,421.00 కోట్లు ఉప ప్రణాళిక క్రింద ప్రభుత్వం ఖర్చు చేసి, ముఖ్యంగా మొత్తం కేటాయింపులైన రూ.35,032.00 కోట్లల్లో నుంచి ఖర్చు చేసినటువంటి మొత్తం రూ.21,421.00 కోట్లు తీసివేయగా మిగిలిన మొత్తం రూ. 14,775.00 కోట్లు దారి మళ్లాయి.

అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక మొత్తాన్ని ఆ యా వర్గాల ప్రజల అభ్యున్నతికే ఖర్చు చేయాలనేటటువంటి నిబంధనను కేంద్ర ప్రణాళికా సంఘం గైడ్‌లైన్స్ రూపంలో ఇచ్చింది. కానీ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఉప ప్రణాళిక క్రింద వచ్చినటువంటి నిధుల్ని అక్రమంగా, అన్యాయంగా దారి మళ్లించి, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల నోట్లో మట్టికొట్టే విధానమనేది మంచిది కాదని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. దారి మళ్లించిన నిధుల్ని ప్రభుత్వం ఏమి చేస్తుందనేది తెలియాల్సి ఉంది. ఏ విధంగా దారిమళ్లిన నిధుల్ని ఖర్చు చేస్తున్నారనే విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరముంది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక క్రింద ఉన్నటువంటి నిధుల్ని సక్రమంగా వినియోగించాలి. అలా గాకుండా ఆ నిధుల్ని పాఠశాలల్లో కంప్యూటర్స్ కొనుగోలుకు గానీ, పార్కుల అభివృద్ధికి గానీ, హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకు గానీ, రింగ్ రోడ్ల నిర్మాణానికి గానీ ఖర్చు చేయడం పరిపాటిగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఉంది. కానీ, దళితులుకు అవి అవసరం ఉండదు. దళితులు మారుమూల ప్రాంతాల్లో మట్టిరోడ్లపైన తిరిగేవారు. పిడికెడు తిండి కోరుకునే వాళ్లు మా దళితులు. మారుమూల ప్రాంతాల్లో వారికి అవసరమైన మౌలిక సదుపాయాలైన కూడు, గుడ్డ, వసతి, కరెంటు తదితర సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేసినట్లైతే ప్రయోజనం ఉంటుంది. గ్రామాల్లో వీధి లైట్లు, రోడ్లు వేసినట్లైతే ప్రయోజనం ఉంటుంది. అదే విధంగా హరిజన, గిరిజన విద్యార్థుల కొరకు ఉన్నటువంటి వసతి గృహాల్లో ఏర్పాట్లను అభివృద్ధి చేసినట్లైతే ప్రయోజనం ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లోని దళితులకు కావల్సిన ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి అంటు వ్యాధుల బారిన పడినటువంటి వారికి మంచి వైద్య సౌకర్యం కల్పించండి. దళితులు, గిరిజనులకు ప్రత్యక్షంగా మేళ్లు చేసేందుకు గాను ఆ యా ప్రభుత్వ శాఖలు ఏ యే రంగాల్లో ఏ విధంగా ఉప ప్రణాళిక క్రింద నిధులను ఖర్చు చేయాలనే విషయాన్ని సూచిస్తూ సంక్షేమ శాఖ ప్రత్యేకంగా గైడ్ లైన్స్ ఇచ్చి చెప్పడం జరిగింది. అందులో భాగంగా రూ.3,359.00 కోట్లతో ఒక ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. తద్వారా ప్రభుత్వ శాఖలు నిధుల్ని సేకరించి, నోడల్ ఏజెన్సీకి అప్పజెబితే, దళితులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతామని చెప్పింది. కానీ, అందులో 135 హాస్టళ్లు, 600 కాలేజీ హాస్టళ్లు, 1,765 హాస్టల్స్ భవనాలు, మరుగుదొడ్లు, 452 సమీకృత హాస్టళ్లు అదే విధంగా 500 కమ్యూనిటీ హాస్టళ్ల భవనాలు, జిల్లాల్లో అంబేద్కర్ భవనాలు, 10 ఆశ్రమ పాఠశాలలు, 118 అనాథ ఆశ్రమ పాఠశాలల్లో డార్మెటరీ గదుల నిర్మాణం, 160 ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు దళితుల కొరకు భూములను కొనుగోలు చేసి వారికి పంపిణీ చేయాలని నోడల్ ఏజెన్సీ చెబితే, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసినదేమిలేదు. ప్రభుత్వ శాఖల నుండి ఉప ప్రణాళిక పద్దు క్రింద ఒక పైసా సొమ్ము కూడా అందలేదు. అది ఎంత వరకు న్యాయమో ఈ సందర్భంగా నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

2011-12వ సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రభుత్వ శాఖలు ఉప ప్రణాళిక క్రింద మళ్లించకుండా ఏ విధంగా దారి మళ్లించాయో తెలియజేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికకు గాను ఏదో చట్టం తెచ్చినట్టుగా చెబుతోంది. ఆ చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు సముచిత న్యాయం చేస్తామని చెబుతున్నారు. కానీ, ఏ ప్రభుత్వ శాఖ కూడా అందుకు స్పందించడం లేదు. దళిత ప్రజానీకాన్ని ఈ ప్రభుత్వం మోసం చేస్తోంది. ప్రభుత్వం దళితుల నోట్లో మట్టి కొడుతోంది. దళితుల కొరకు ఖర్చు చేయాల్సిన డబ్బును, కేంద్ర ప్రణాళికా సంఘం చేసినటువంటి సూచనకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రణాళికా సంఘం ఇచ్చిన సూచన ప్రకారం, దళితులకు ప్రత్యక్షంగా మేళ్లు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక క్రింద ఖర్చు చేయాల్సిన నిధులతో ఎస్సీ, ఎస్టీ వాడల్లో మౌలిక సదుపాయాల కల్పన, సరైన వైద్యం, ఆ యా వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య కొరకు వినియోగించాలి. వినియోగించాల్సిన మొత్తం కూడా ఎ, బి, సి, డి వర్గీకరణకు అనుగుణంగానే జరగాలి. అన్ని కులాలకు సముచిత న్యాయం చేసేందుకు మీరు కూడా సహకరించి ఆ యా వర్గాలకు న్యాయం చేకూర్చాలని నేను ఈ సందర్భంగా కోరుతున్నాను ఎందుకంటే, మీరు కూడా ఒక దళిత వర్గానికి చెందినటువంటి గౌరవ ఉప సభాపతి గారు కాబట్టి. ఒక దళితునికి ఆ హోదా దక్కినందుకు నేను ఎంతో గర్విస్తున్నాను. సహకరించి సహాయం చేస్తారని నేను అనుకొంటున్నాను. దయచేసి అందుకు అనుగుణంగా మీరు ప్రభుత్వానికి సూచనలు చేయాల్సిన అవసరం ఉంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: నర్సింహులు గారు దయచేసి ప్రసంగాన్ని త్వరగా ముగించండి. చాలా మంది సభ్యులు మాట్లాడాల్సి ఉంది. చాలా సమయాన్ని మీరు ప్రసంగానికి ఉపయోగించుకున్నారు. దయచేసి త్వరగా ముగించండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు: నేను పేదవాళ్ల గురించే మాట్లాడుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు "మన బియ్యం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నీ మన బియ్యమే. కేవలం కిలో బియ్యం ఒక రూపాయకే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తోంది. కానీ, బియ్యం మాత్రమే ఇస్తే పేదవాడి కడుపు నిండుతుందా? చింతపండు, పప్పు, నూనె, కూరగాయలు, ఉల్లిగడ్డ, ఉప్పు తదితర విషయాల మాటేమిటి? ఆ విషయం గురించి ప్రభుత్వం మాట్లాడదు. కేవలం "మన బియ్యం" అని మాత్రమే చెబుతోందీ ప్రభుత్వం. అదెక్కడి న్యాయం అధ్యక్షా.

శ్రీ డి.శ్రీధర్ బాబు: అధ్యక్షా.............

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: సివిల్ సప్లైస్ మినిస్టర్ గారు మాట్లాడతారు, దయచేసి కూర్చోండి నర్సింహులు గారు.

శ్రీ డి.శ్రీధర్ బాబు: అధ్యక్షా, మోత్కుపల్లి నర్సింహులు గారు చాలా సమయం తీసుకొని మాట్లాడుతున్నారు. దయచేసి సమయం ఫిక్స్ చేయండి. ఆ ప్రకారంగా వారు మాట్లాడుతారు. అలా కాకుండా వారికున్నటువంటి 35 సంవత్సరాల అపారమైన రాజకీయ అనుభవాలన్నీ ప్రస్తావిస్తూ, మాపైన చూపుతున్నారు.

సార్, నిజానికి మేమంతా కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసినటువంటి శ్రీ కొత్తపల్లి సుబ్బరాయుడి గారి రాక గురించి ఎదురుచూస్తున్నాం. శ్రీ సుబ్బరాయుడు గారు

గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా తెలుగు దేశం పార్టీ ప్రభుత్వంలో పనిచేశారు. కానీ, వారు చాలా మంచి వారు. ఆ కాలంలో ప్రతి నిత్యం వారితో అసత్య మాటలు మాట్లాడించి, కరెంటు సరఫరా పైన, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ పైన వారితో మాట్లాడించిన కారణంగా విసిగి పోయి, చివరికి ఆ పార్టీని వదిలిపెట్టి, సత్యం చెప్పే కాంగ్రెస్ పార్టీలో చేరి, మరల శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. శ్రీ సుబ్బరాయుడు గారు సభకు రాగానే వారి కాలంలో ఆయన విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సరఫరా గురించి వారినే అడగండి. వారే సత్యాలు చెబుతారు. శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారే విద్యుత్ సరఫరా గురించి మాట్లాడితే ఎట్లా?

రెండవ అంశమైన దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్లల్లో బాధితులకు చెల్లించిన ఎక్స్‌గ్రేషియా గురించి శ్రీ మోత్కుపల్లి నర్సింహులు ప్రస్తావించారు. కానీ, శాంతి భద్రతల విషయంలో గానీ, బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపు విషయంలో గానీ ప్రభుత్వం ఎక్కడా అలసత్వం ప్రదర్శించలేదు. తీసుకోవాల్సిన అన్ని చర్యలను ప్రభుత్వం సకాలంలో తీసుకుంటోంది.

మూడవ అంశం "మన బియ్యం" గురించి శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు ప్రస్తావించారు. "మన బియ్యం" అనే కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఒక క్రొత్త కాన్సెప్ట్‌ను తీసుకువచ్చింది. ఆ కాన్సెప్ట్ ప్రకారం, పండించిన దాన్యాన్ని సేకరించి, మిల్లింగ్ చేసి ఆ పేద రైతుకే తిరిగి తన దాన్యాన్ని పి.డి.ఎస్.రూపేణ ఇచ్చిన కార్యక్రమమే "మన బియ్యం" అనే కార్యక్రమమనే విషయాన్ని గౌరవ సభ్యులు గుర్తు పెట్టుకోవాల్సిందిగా నేను మీ ద్వారా కోరుతున్నాను. రెండవ అంశమేమిటంటే, "మన బియ్యం" కార్యక్రమం రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో మాత్రమే అమలు జరుగుతోంది. కావాలంటే, ఏడు జిల్లాల్లో పర్యటించి ఆ కార్యక్రమం క్రింద ఇస్తున్నటువంటి బియ్యం క్వాలిటీని పరిశీలించుకోండి. అదే విధంగా చింతపండు, వంట నూనెలు, ఉల్లిగడ్డ, ఉప్పు, పప్పు గురించి కూడా శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు చాలా విషయాలు ప్రస్తావించారు.

సా.5.50

మా డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి "మనబియ్యం'' గురించి మాట్లాడారు. కాదనట్లేదు. మనం పండించిన ధాన్యాన్ని సేకరించి మిల్లింగ్ చేసి తిరిగి ఆపేద రైతుకే "పిడిఎస్'' ద్వారా అందిస్తున్నాము. ఆ కార్యక్రమమే ' మన బియ్యం ' దాన్ని గుర్తుపెట్టుకోవాలని కోరుతున్నాను. రెండవది ఇప్పటికే ఏడు జిల్లాల్లో మన బియ్యం ఇస్తున్నాం మీరు వెళ్లి బియ్యం క్వాలిటీ చెక్ చేసుకోవచ్చు. చింతపండు, పసుపు, ఉప్పు, కారం గురించి, ఆలోచన చేస్తున్నారు. వారికి ఆ ఆలోచన రాకముందే అంతర్జాతీయ స్థాయిలో కొన్ని వస్తువుల ధరల పెరుగుదల మన చేతుల్లో లేదు కనుక, వాటి గురించే మన రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో ఆలోచించి ఉగాది పండుగ సందర్భంగా ఆంధ్ర రాష్ట్రంలో ''పిడిఎస్ " ద్వారా నిత్యావసర సరుకుల సరఫరాను ప్రారంభించబోతోంది. పేద ప్రజానీకానికి సంబంధించి 9 రకాల నిత్యావసర సరుకులు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించడం జరగింది. పేద ప్రజలు తినే బియ్యాన్ని హేళనగా చేసి మాట్లాడటం మంచిది కాదని గౌరవ సభ్యులకు తమద్వారా మనవి చేస్తున్నాను.

( అధికార పక్ష సభ్యులచే అంతరాయం. )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: నర్సింహులుగారు,

(ట్రెజరీ బెంచెస్ నుంచి అంతరాయం. )

శ్రీ ఎం. నర్సింహులు: అధ్యక్షా, నేనేమన్నా, అన్నానా? మన బియ్యం సంగతి చెబుతా ఒక్కనిమిషం. అధ్యక్షా, మన బియ్యం నాలుగు కిలోలు ఇస్తారంటున్నారు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: please conclude,

శ్రీ ఎం. నర్సింహులు: ఇదేందీ సార్ అంతా ఐపోయింది.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: విశాలమైన సభలో చాలా మంది మాట్లాడాల్సి ఉంది.

శ్రీ ఎం. నర్సింహులు: ఓకే, ఓకే, సార్ నా టైమంతా పోయింది కదా. చివరికి మైకుల కాడికెళ్లి పేదవాణ్ని నామీద విసిరితే ఏమొస్తది, ఏమీ రాదు. చివరికి పేద ప్రజలంతా కలిసి ఏమి చెయ్యాల్నో అది చేస్తారు. అది గమనించుకోవాల్సి ఉంది. నేనేమీ, మామూలు మనిషిని కానూ, మీరు బెదిరిస్తూ మాట్లాడితే నేను భయపడే టోణ్ని కాదు. అది గమనించుకోవాలి. ఈవేళ దళిత వర్గాలనుంచి రావటమే కాదు. 30 సంవత్సరాలుగా రాజకీయ దుర్మార్గులకు వ్యతిరేకంగా పోరాటం చేసి బ్రతికి నోణ్ని. ఆ,

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరిచారు.)

మన బియ్యం గురించి ఈవేళ ఉన్నమాట చెబుతున్నా.

( అధికార పక్ష సభ్యులచే అంతరాయం. )

2004వ సంవత్సరం వరకు కిలో బియ్యం ధర రూ.13/- ఉంటే 2013వ సంవత్సరంలో రూ.45/- ఉంది అధ్యక్షా, ఈ మనబియ్యం. బయట మార్కెట్ రేటు ఉంది.

(సభలో నవ్వులు)

నాలుగు కిలోలు నెలంతా తిని పేదవారు బ్రతక గలరా, రూ.45X6 పెట్టుకో, ఎంతైంది.

(సభలో నవ్వులు)

రూ.270/ రూ.275/- ఐనా, కొనుక్కోని తినాలి. ఒక్క కిలో మనబియ్యానికి కడుపు నిండుతుందా? అధ్యక్షా కష్టం చేసేటోన్కి కడుపు నిండుతదా. నాలుక్కిలోలు అంటారు మీరు.

మీరు ఎన్నికల్లో 6 కిలోల ఇస్తామని చెప్పారు కదా. మీరు కనీసం రాజశేఖర్‌రెడ్డిగారి మీద ఏమన్నా ప్రేముంటే అదన్నా ఇంప్లిమెంట్ చేసుకోలేరా ? ఇటూ, అటూ, మనస్సెంత లాగుతుంతో చూస్తున్నా.

(సభలో నవ్వులు)

పాపం మంచిదే, కలిసి బ్రతికారు , కలిసి సంపాదించుకున్నారు.

(సభలో నవ్వులు)

మీరా విధంగా వుంటే నేనేమీ అనడం లేదు. సభ్యులు వెంకటరెడ్డి గారైతే బ్రహ్మాండమైన సూచనలిచ్చినారు నాకు. విషయమేమంటే మన బియ్యం విషయంలో, అదిగో ముఖ్యమంత్రి గారొచ్చారు. చాలాసేపాయ నే మొత్తుకుంటున్నా, మీరొత్తలేదు, వచ్చారు.

(సభలో నవ్వులు)

యువనాయకులు మీరు నవ్వితే ఏదో ఇస్తారనుకుంటున్నాను. మీ రిస్తలేదు. ఏదీ ఇచ్చిన సందర్భాలు లేదు.

(సభలో నవ్వులు)

భవిష్యత్‌లో నన్నా ఇవ్వండి కనీసం.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: please conclude.

శ్రీ ఎం.నర్సింహులు : ఏంది సార్ జర మంచిగా మాట్లాడుకునే సందర్భం కూడా రానీయండి. అధ్యక్షా ఎప్పుడూ సీరియస్ వద్దు.

(సభలో నవ్వులు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: please conclude, మిగిలిన సభ్యులు కూడా మాట్లాడాలి కదా, మరీ. మనొక్కళ్లమే కాదు.

(సభలో నవ్వులు)

శ్రీ ఎం.నర్సింహులు :అధ్యక్షా ఎప్పుడూ సీరియస్ వద్దు. మన బియ్యం 2004 వ సంవత్సరంలో రూ.12/- ఉంటే 2013వ సంవత్సరంలో ఫైన్ బియ్యం రూ.40/- ఉన్నవి. కందిపప్పు కిలో ధర ఆనాడు రూ.20/- ఉండగా మీరు, మేమెందుకు పెంచకూడదన్నట్లుగా ప్రస్తుతం రూ.76/-లుకు పెంచారు. మినపప్పు(మనపప్పు) రూ.22/- ల నుంచి 75/-లకు పెంచారు. పెసరపప్పు (మన పెసర పప్పు) రూ.24/- నుండి 75/-లకు పెంచారు. శనగపప్పు రూ.22/- నుండి రూ.72కు పెంచారు. ఇకపోతే, చింతపండు నిత్యం పేదవాడు ఏమీ లేకపోతే చింతపండు పిసుక్కొని కారం కలుపుకొని (నేను హాసళ్లలో తినేటోణ్ని) వామ్మో , ఈ ప్రభుత్వంలో పేదవాడు తినే చింతపండు కిలో ధర రూ.80/-లకు చేరింది. 'మన చింతపండు'.

(సభలో నవ్వులు)

'మన ఎండుమిర్చి' కిలో 24/- నుండి రూ.90/-కు పెరిగింది. (కారం కూడా తినేటందుకు వీలులేదు) ఉల్లిపాయలు ('మన ఉల్లిపాయలు') రూ.4/- 2004 వ సంవత్సరంలో ఉండగా, ఈ రోజు రూ 20/- లకు వచ్చి చేరింది, కిరణ్‌కుమార్ రెడ్డిగారి గవర్నమెంట్‌లో.

(అధికార పార్టీ సభ్యులచే అంతరాయం, మైకు లేకుండా )

ఏమయ్యా , చెప్పనీయండి. ముఖ్యమంత్రిగారు జర మీరన్నా నన్నాదుకోండి.

(సభలో నవ్వులు)

'మనబెల్లం' రూ.11/- నుండి 50/-లకు పెరిగింది. మన పంచదార రూ.13/- 2004 వ సంవత్సరంలో ఉండగా ఈ రోజు రూ.40/-లు గా ఉంది. ఇప్పుడున్న ముఖ్యమంత్రిగారికి మన బియ్యంలో ఉన్న పొరపాట్లు కూడా చెబుతున్నా. అది నేను చెప్పేది. దాంట్లో, అధ్యక్షా పేదవాడికి కనీసం. ఒకప్పుడు జేబులో డబ్బులుంచుకొని వెళ్లి సంచుల్లో సరుకులు తెచ్చుకునే పరిస్థితి ఉండగా ప్రస్తుతం సంచుల్లో డబ్బులు తీసుకెళ్లి జోబుల్లో సరుకులు తెచ్చుకునే పరిస్థితి వచ్చింది.

(సభలో నవ్వులు)

ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు గమనించాలి. ఉదారమైన స్వభావంతో ఉంటూ, పేద ప్రజల పొట్ట కొట్టొద్దని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. ఈ విషయాన్ని గమనించాలని మీ ద్వారా కోరుతున్నాను.

చిన్న చిన్న ఆటో, మోటర్ వాహనాలు నడిపే వారంతా పెట్రోల్ ధరలు పెరిగినందున వారందరూ వాహనాలను వదలే పరిస్థితి ఉందని ప్రభుత్వం గమనించాలి. కేంద్రంలో మీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున రాష్ట్ర పేద ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వంతో చర్చించి (రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా) సబ్సిడీ తెచ్చి ఆదుకోవల్సిన బాధ్యత మీకు ఉందా, లేదాని మీద్వారా కోరుతున్నాను. సేల్స్ టాక్స్, వ్యాట్ లను తగ్గించాలి. వ్యాట్ ద్వారా వస్త్రవ్యాపారులు ఈరోజు కనీసం ఒక్కపూట భోజనం చేసే పరిస్థితుల్లో లేరు. గత నెలరోజులుగా రాష్ట్రంలో సమ్మెలు తలపెడుతున్న వస్త్ర వ్యాపారుల గురించి మీరేమాలోచిస్తున్నారో తెలియ జేయాల్సిన అవసరముందని మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

గృహానికి సంవత్సరానికి ఆరు సిలిండర్స్‌ను మాత్రమే వినియోగించాలనీ ఆపై వాడకానికి ఒక్కో సిలిండర్ ధర రూ.905/- లు చెల్లించాల్సిందని ఈ ప్రభుత్వం చెబుతోంది.

(అధికార పక్ష సభ్యులచే అంతరాయం)

నీకెంతుందో,నీవెన్ని సిలెండర్లు వాడుతున్నావో ఆలోచించుకో, పేద ప్రజలకు సంబంధించిన విషయంలో పేద ప్రజల్ని అవమాన పరచవద్దని ఈ సందర్భంగా తెలియ పరుస్తున్నాను. కాకపోతే మీరు తప్పులు చేస్తే సరిచేసుకోమని చెబుతున్నాను. సమర్థత ఉంటే చెయ్యండి లేకపోతే ప్రజల ముందు తలవంచుకోండి. అంతకంటే మీరు మాట్లాడటానికే లేదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: please conclude.

శ్రీ ఎం.నర్సింహులు : ఇప్పటికి 29 సార్లు పెట్రోలు డీజల్ ధరలు పెంచారు. కేంద్రంలో, రాష్ట్రంలో మీ ప్రభుత్వమే ఉంది, ఇవన్నీ మీ చేతుల్లోనే ఉంది. కనుక ఖచ్చితంగా ఈ ధరలను తగ్గించి పేద ప్రజలను ఆదుకోగలరని కోరుతున్నాను.

రాష్ట్రంలో కరువు ప్రభావంతో పంటలు ఎండిపోయాయి, కరెంట్ లేదు. పండించిన పంటకు గిట్టుబాటు ధరల్లేవు. ఆ కారణంచే సుమారుగా 22,000. మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: దయచేసి ముగించండి, మరొక సభ్యునికి మైకు ఇవ్వాలి.

సా.6.00

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : అధ్యక్షా, ఎరువుల ధరలు పెరిగాయి, రైతులకు విత్తనాలు లభించడం లేదు, సబ్సిడీలు ఇవ్వటం లేదు. 'నీలం తుఫాను' వచ్చినా, కరవు సంభవించినా, తెలంగాణా ప్రాంతానికి సహాయం అందడం లేదు. మహారాష్ట్ర రూ.1200 కోట్లకు పైగా కరవు సహాయం పొందిందని తెలిసింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మాత్రం కరవుకు సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వకుండా కరవు సహాయాన్ని పొందలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. మీ పాపాలలో భాగస్వాములం కాకూడదనేది మా పార్టీ అభిప్రాయం. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం పైన అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాం, ప్రస్తుత ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం పైన, అదే విధంగా స్పీకర్ పైన అవిశ్వాస తీర్మానం పెట్టాం. మరొకసారి ఖచ్చితంగా సరియైన సమయంలో అవిశ్వాసం తీర్మానం పెడతామని తెలియజేస్తున్నాను. అంతేకానీ, ప్రజలను దారి మళ్లించి ఇతరులతో కుమ్మక్కయ్యామనేది సరికాదు. టీఆర్‌యస్ పార్టీ సోదరులకు కూడా మనవి చేస్తున్నాను, వారు వాస్తవంగా అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఇతర పార్టీలతో సంప్రదించారు, కానీ వారు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేముందు ప్రతిపక్ష నాయకుడైన, మెజారిటీ సంఖ్య కలిగిన మా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడైన చంద్రబాబు గారిని సంప్రదించాల్సి ఉండేది. రాష్ట్ర ప్రగతి కోసం, భవిష్యత్తు కోసం, మా పార్టీ నాయకుడు 63 సంవత్సరాల వయసులో కూడా పాదయాత్ర చేస్తూ, జరుగుతున్న అన్యాయాల్ని ఎండకట్టి రానున్న ఆరు నెలల్లో ప్రజా కోర్టులోనే ప్రజలతోనే అవిశ్వాస తీర్మానం పెట్టించి శాశ్వతంగా ప్రభుత్వాన్ని పడద్రోసే ప్రయత్నంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని తెలియజేస్తున్నాను.

( తెలుగుదేశం సభ్యులు బల్లలు చరిచారు.)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : దయ చేసి కూర్చోండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : టీఆర్‌యస్ పార్టీ వాళ్లు మమ్మల్ని ఏమీ అనలేదు, మేము వాళ్లను ఏమీ అనలేదు. సభలో ముందు స్థానంలో నిలబడి మాట్లాడే అవకాశం వచ్చినందుకు, ఖచ్చితంగా కొన్ని విషయాలు మాట్లాడ వలసిన బాధ్యత నాకు ఉంది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక మాదిరిగానే బిసి ఉప ప్రణాళిక కూడా పెట్టాలని మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒక వేళ ప్రభుత్వం బిసి ఉప ప్రణాళిక పెట్టకపోతే ప్రభుత్వం పడిపోతుంది, ఖచ్చితంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మా పార్టీ బిసి ఉప ప్రణాళిక పెడుతుంది. అదే విధంగా రైతుల రుణ మాఫీని ఎట్టి పరిస్థితుల్లోనైనా, ఎటువంటి అవాంతారాలు వచ్చినా, ఎవరేమనుకున్నా రైతులకు రుణ మాఫీ చేస్తుందని తెలియజేస్తున్నాను. ప్రభుత్వానికి ధైర్యముంటే ఈ సభలో ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. సాగు నీటి కోసం చేసిన 'జల యజ్ఞం' కార్యక్రమాన్ని 'ధన యజ్ఞం'గా మార్చి రూ.80,000 కోట్లు బ్రహ్మాండంగా దండుకున్నారు, దాచుకున్నారు, ఉంచుకున్నారు. ముఖ్యమంత్రి గారూ, మీరు బాధ్యత తీసుకొని, వ్యాన్‌పిక్, యం.ఆర్, పవర్ ప్లాంట్స్, ఓబులాపురం మైనింగ్‌లో ఉన్న రూ.30,000 కోట్లు, భారతి సిమెంటు, సాక్షి పేపర్ మొదలైన స్కాంలన్నింటినిలోని డబ్బు బయటకు తీస్తేనే మీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది, లేక పోతే ఈ పాపాలన్నింటిలో మీరు భాగస్వాములు అవుతారని తెలియజేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : నర్సింహులు గారూ, దయ చేసి కూర్చోండి.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు : స్కాములన్నింటినీ బయటకు తీయడం ద్వారా వచ్చే మొత్తంతో రైతుల రుణ మాఫీ చేయడం పెద్ద కష్టమేమీ కాదు. మీరు చేయలేక పోతే, చంద్రబాబు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేసి తీరుతుందని, ఎటువంటి దోపిడీ దారులతో, కుమ్మక్కు కావలసిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని సభా ముఖంగా తెలియజేస్తున్నాను.

శ్రీ కె. కన్నబాబు : అధ్యక్షా, సుమారు సంవత్సర కాలం తరువాత రెండవ సారి అవిశ్వాస తీర్మానానికి ప్రతి పక్షాలు నోటీసు ఇవ్వడంతో మనం చర్చించుకుంటున్నాం. 2009వ సంత్సరంలో కాంగ్రెస్ పార్టీ రెండవ సారి అధికారంలోకి వచ్చి సుమారు మూడున్నర సంవత్సరాలు అవుతున్నది. ఈ కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చారిత్రాత్మకమైన పథకాలను, ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయగలిగింది. ఇన్ని పథకాలు అమలు చేయడం సాధ్యమా అని ఇతరులు ఆశ్చర్యపోయే స్థాయిలో కాంగ్రెస్ పార్టీ చాలా విజయవంతంగా పని చేసింది. చిత్త శుద్ధితో లక్ష్యాన్ని చేరుకోడానికి ఈ ప్రభుత్వం చాలా కష్టపడి పని చేస్తోంది. ఎన్ని ఇబ్బందులున్నా మొక్కవోని ధైర్యంతో ప్రజా సంక్షేమం కోసం చాలా చిత్తశుద్ధితో పని చేస్తోంది. గతేడాది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపైన అవిశ్వాస తీర్మానం పెట్టేనాటికీ, ప్రస్తుతం పెట్టిన అవిశ్వాస తీర్మానం నాటికీ ఈ ప్రభుత్వం ఏమి చేసింది, ఎలా పని చేసింది అవే విషయాన్ని మీకు చెప్పదలచుకున్నాను. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను చేయడమనేది, చారిత్రాత్మకమైనది. కేవలం కాంగ్రెస్ పార్టీలు మాత్రమే సృష్టించగలిగే చరిత్ర. గతంలోని ప్రభుత్వాలు ఇలాంటి ఆలోచన చేయలేకపోయాయి. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక గురించి మాట్లాడాలంటే, గౌరవ ముఖ్య మంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు నవంబరు 30వ తేది 2012 సంవత్సరంలో శాసన సభలో బిల్లు ప్రవేశ పెట్టగా, డిసెంబరు 2వ తేదిన బిల్లు చట్టంగా ఆమోదం పొందింది. గౌరవ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ గారి అధ్యక్షతన ఒక ఉప సంఘం దానికోసం కసరత్తు చేసింది. దేశంలోనే ఇలాంటి ఒక చట్టం తేవాలనే ఆలోచన రాకపోతే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక అమలులో దేశానికే ఆదర్శవంతంగా నిలిచింది. కనుక ఇలాంటి ఒక గొప్ప చట్టం చేసిన సమయంలో భాగస్వాములైన సభలోని సభ్యులందరూ గర్వపడాలి. ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. నేను ఈ విషయాన్ని ఎందుకు ముందుగా చెప్పానంటే, ఇలాంటి ఎన్నో విజయాలను నమోదు చేయగలిగిన సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉంది కనుక.

గతంలోని అవిశ్వాస తీర్మానానికి ప్రస్తుత అవిశ్వాస తీర్మానానికి మధ్య ఉన్న సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైన కార్యక్రమాలను చేసిందో తెలియజేస్తాను. రైతులకు వడ్డీలేని రుణాలు, గతంలో ఎప్పుడూ లేని విధంగా రాయితీలు, ఇన్‌పుట్ సబ్సిడీలు అంటే విపత్తులు సంభవించినప్పుడు వాటిల్లే నష్టాలకు హెక్టారుకు రూ.10,000 చెల్లించే విధంగా ముఖ్య మంత్రి గారు నిర్ణయం తీసుకున్నారు. ఇది సాధ్యమా అని రైతులు సైతం ఆశ్చర్యపోయే స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. హాస్టల్ మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లను ఎవరో డిమాండ్ చేస్తేనో, ప్రతిపక్షాలు పట్టుపడితేనో పెంచలేదు. మరొకరెవరైనా మరి కొంత పెంచండీ అని అడగలేని స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కమిట్‌మెంట్‌తో పెంచింది. పేదలకు మాత్రమే వర్తించే ఆరోగ్యశ్రీ పథకాన్ని ఉద్యోగులందరికీ వర్తించే విధంగా చేయడం జరిగింది. ఉద్యోగులకు పీఆర్‌సిని నియమించడం జరిగింది. రూ.1000 కోట్ల మూలధనంతో స్త్రీనిధి బ్యాంకును ఏర్పాటు చేశారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఇలాంటి బ్యాంకును జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయాలని సంకల్పించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమే ప్రేరణ. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలోని యూనిట్ కాస్ట్ గతంలో ఎంత ఉన్నదీ, ప్రస్తుతం ఎంత ఉన్నదీ సభ్యులందరూ దృ ష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నాను.

ఎస్సీలు, ఎస్టీలు గృహాలు నిర్మించుకోలేకపోతే వారికి అదనంగా మరొక రూ.20,000 సహాయం చేయాలని ప్రభుత్వం గతేడాది నిర్ణయం తీసుకోవడం జరిగింది. పేద గర్భిణీ స్త్రీలు, తల్లి, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం 'ఇందిరమ్మ అమృత హస్తం' పథకం అమలుకు ఏడాది కాలంలోనే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ప్రపంచం మొత్తం గర్వంగా చెప్పుకునే స్థాయిలో తెలుగు మహాసభలను, అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులను గతేడాది విజయవంతంగా నిర్వహించింది. ఓ వైపు ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు పూనుకుంటుంటే మరొక వైపు ప్రతిపక్షాలు బురద చల్లడానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. అధ్యక్షా, ఈ సందర్భంలో శ్రీ శ్రీ గారు చెప్పిన వాక్యం ఒకటి చెప్పాలనిపిస్తుంది. "వేళకాని వేళల్లో, లేనిపోని వాంఛల్లో, దారి కాని దారుల్లో, కానరాని కాంక్షలతో దేనికొరకు పదే పదే దేవులాడుతావు" అని శ్రీ శ్రీ గారు అడుగుతారు. అధికార వాంఛతో మీకు ఏ దారి కనిపించడం లేదు. అధికారం కొరకు పదే పదే పాకులాడుతున్నారు అధ్యక్షా. కేవలం అధికార కాంక్షతో, అధికార దాహంతో, ఒకే ఒక ఎజెండాతో వైయస్ఆర్ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలు ఈ రోజున సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. ఆ రెండు పార్టీలు చక్కటి సారూప్యతని నిరూపించుకున్నాయి. ఏ తప్పు జరిగిందని, ప్రభుత్వం విశ్వాసం కోల్పోయిందని ఈ రోజున పై రెండు పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారని అడుగుతున్నాను. ప్రభుత్వం చేస్తున్న పనులు, ప్రవేశపెడుతున్న పథకాలు మీకు నచ్చకనా, కంటగింపుగా ఉందనా అని అడుగుతున్నాను. ఏం లాభం ఆశించి ఈ రోజున ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చారు. ప్రధాన ప్రతిపక్షం మద్దతు ఇచ్చి, ప్రభుత్వం పడిపోతే ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలిచి, త్వరత్వరగా వారి నాయకుడు జైల్లో నుంచి బయటకి వస్తాడని వారికొక నమ్మకం, ఆ నమ్మకంతో మీ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను.

అధ్యక్షా, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే హక్కు ప్రతిపక్షాలది. కానీ ఆ హక్కుని దుర్వినియోగం చేసే హక్కు మాత్రం వారికి లేదు. ఈ రోజు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఖచ్చితంగా దుర్వినియోగమే. ఏ మాత్రం సారూప్యత లేని పార్టీలు ఈ రోజు ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని ప్రయత్నం చేసి భంగపడబోతున్నాయి.

అధ్యక్షా, గతేడాది తెలుగుదేశం పార్టీని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం ప్రవేశపెట్టమన్నప్పుడు అవిశ్వాసం ప్రవేశపెట్టి, సదరు పార్టీలు భంగపడ్డాయి. మళ్లీ మరొక్కసారి భంగపడటానికి వైయస్ఆర్ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలు సిద్ధపడుతున్నాయి. పై రెండు పార్టీలు రెచ్చగొట్టినా కూడా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు సంయమనంతో, విజ్ఞతతో ప్రభుత్వాన్ని కూలదోయమని అనడం కొంత సబబుగా ఉంది. బహుశా నారా చంద్రబాబునాయుడుగారు పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లడం వలన, ప్రజానాడి తెలిసి ఆయన మైండ్ సెట్ మారిందని నేననుకుంటున్నాను. ప్రజల అభీష్టం మేరకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని కూలదోయడం చేయకూడదనిపించిందని నాకు అర్థమవుతోంది అధ్యక్షా.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

ఈ మధ్య రాజకీయాల్లో పదే పదే 'విశ్వసనీయత' అనే పదం వినిపిస్తోంది అధ్యక్షా. విశ్వసనీయత గురించి జైలుకు వెళ్లే ముందు కూడా శ్రీ వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి సభలో మాట్లాడుతూ ఉండేవారు. అందుకనే వారు ఇప్పుడు లేకపోయినా, జైల్లో ఉన్నా నేనొక విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులకు నిజంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి మీద అభిమానం ఉంటే నేను ఒక స్టేట్‌మెంట్ వినిపిస్తాను, దయచేసి వినవలసినదిగా కోరుతున్నాను.

2009వ సంవత్సరం జూన్ 10వ తేదీ పదమూడవ శాసనసభ మొదటి సమావేశంలో గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డిగారు మాట్లాడిన మాటల్లో నుంచి 'విశ్వసనీయత' అనే పదాన్ని కోట్ చేస్తున్నాను అధ్యక్షా. "శ్రీమతి సోనియా గాంధీ గారికి ఉన్నటువంటి విశ్వసనీయత మరియు భారతదేశ ప్రధాని అయిన డా. మన్మోహన్ సింగ్ గారికి ఉన్న విశ్వసనీయత, దేశ ప్రజలు బాగా గుర్తించి అటువంటి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడం చాలా అవసరం అని దేశంలోని ప్రజలందరూ గుర్తించారు. మరీ ముఖ్యంగా మా కంటిన్యుటీకి కూడా దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఒక మంచి వారసత్వ లక్షణం ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ గారి నుంచి వస్తున్న వారసత్వం. ఇప్పుడది రాహుల్ గాంధీ గారిపై ఉంది. రాహుల్ గాంధీ గారిని భారతదేశ ప్రజలు భావి భారత ప్రధాని అని కూడా అనుకుంటున్నారు. విశ్వసనీయతతో నేనంటున్నాను నెహ్రూ, ఇందిరా గాంధీ గారి కుటుంబం కంటే ఈ దేశంలో మరొక రాజకీయ విశ్వసనీయత కలిగిన కుటుంబం లేదని అంటున్నాను." ఈ దేశం కోసం ఇందిరా గాంధీ ఆత్మ బలిదానం చేశారు. ఈ దేశం కోసం రాజీవ్ గాంధీ ఆత్మ బలిదానం చేశారు. అలాంటి ఆత్మ బలిదానాలను కొన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రతినిధులు గుర్తించనంత మాత్రాన నష్టం లేదు. ఏదో నా కోడి కూయకపోతే తెల్లవారదని ఒక ముసలమ్మ అనుకున్న విధంగా ఉంటుంది. ఈ రోజున పై రెండు పార్టీల పరిస్థితి అలానే ఉంది.

అధ్యక్షా, రాజశేఖర్ రెడ్డి గారిని నిత్యం పూజించే, వారి పేరుని తలచే విధంగా పార్టీని పెట్టుకున్న నాయకులు, రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో తప్ప మరొక ఎజెండా లేకుండా ఈ రోజున పార్టీ పెట్టిన నాయకులు, వారు చెప్పిన 'విశ్వసనీయత' అనే విషయంపై మీరేమి చెప్పగలరు. విశ్వసనీయత అంటే కాంగ్రెస్ పార్టీ. రాజశేఖర్ రెడ్డి గారు ఇచ్చిన సర్టిఫికేట్ కంటే మరొక సర్టిఫికేట్ ఉంటుందని పై రెండు పార్టీల సభ్యులు నమ్మితే లేక వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిగారిచ్చే సర్టిఫికేట్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి గారిచ్చిన సర్టిఫికేట్ కంటే గొప్పదని భావిస్తే పై రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయత లేదని చెప్పండి. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గారిచ్చే సర్టిఫికేట్ గొప్పదా, వైయస్ రాజశేఖర్‌రెడ్డి గారిచ్చిన సర్టిఫికేట్ గొప్పదా అని నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఈ రోజున మీకు ఏర్పడింది.

అధ్యక్షా, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అంటే వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి పార్టీ కాదు. జగన్ మోహన్‌రెడ్డి గారి పార్టీ. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అంటే యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీయే తప్ప, అది వైయస్ఆర్ పార్టీ కాదు. వైయస్ఆర్ పేరుని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మార్కెటింగ్ చేసుకోవడం కోసం, దానికి సమానంగా అర్థం వచ్చేలా, వైయస్ఆర్ గుర్తు వచ్చే విధంగా వారు ఆ పార్టీకి పేరు పెట్టుకున్నారు.

(మిస్టర్ స్పీకర్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

సా.6.20

ఈ రోజు ఆ పార్టీ అధ్యక్షులు విశ్వసనీయత గురించి మాట్లాడుతూ, మాట్లాడుతూ జైలుకి వెళ్లారు. ఈ ప్రపంచంలో, దేశంలో ఏ పార్టీ అయినా, ఒక రాజకీయ పార్టీలోకి ఒక వ్యక్తికానీ, కార్యకర్తకానీ చేరాలంటే

ఎక్కడికి వెళ్లాలి, పార్టీ కార్యాలయానికి వెళ్లాలి. కానీ జగన్ పార్టీలో చేరాలంటే, జైలుకి వెళ్లాలి. ఆ పార్టీలో చేరాలంటే, జైలుకి వెళ్లే దౌర్భాగ్యం ఈ రోజు కనబడుతోంది. జైలుకి, బెయిలుకి మధ్యన ఊగిసలాడుతున్న పార్టీ వారిది. అటువంటి పార్టీ అవిశ్వాస తీర్మానం పెడితే ఎలా? జనం నవ్వుకుంటున్నారు. హాస్యాస్పదంగా ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనే కన్నా యువజన శ్రామిక రైతు చెంచల్‌గూడ పార్టీ అని బయట చెప్పుకుంటున్నారు. అటువంటి పార్టీ అవిశ్వాస తీర్మానం పెట్టుకుంటే జనం నవ్వుకుంటున్నారు.

ఈ సందర్భంగా ఒక్క విషయం చెప్పదలచాను. ఊపిరి ఉన్నంతవరకూ రాజశేఖర రెడ్డిగారు కాంగ్రెస్ పార్టీ నాయకుడు. ఈ రోజు ఆయన కాంగ్రెస్ పార్టీకి నాయకుడు కాదు. వైఎస్ఆర్‌సిపికి మాత్రమే నాయకుడిగా వర్తిస్తుందట. ఇప్పుడు వై.ఎస్. విజయమ్మ సభలో లేరు. విజయమ్మగారిని చూస్తే భర్త ఆశయాలకు, కొడుకు అధికార కాంక్షకు మధ్యన నలిగిపోతున్న కన్నతల్లి గుర్తుకు వస్తుంది. నిజంగా ఆమెను చూస్తూ ఉంటే అలా కనబడుతోంది. ఎందుకు ఈ మాట చెబుతున్నానంటే, ఈ మధ్య కొద్ది రోజుల క్రిందట ఆమె ఎకనామిక్ టైమ్స్‌లో ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. దానిలో ఉన్న ఒక చిన్న విషయాన్ని చదివి వినిపిస్తాను.

MR.SPEAKER: Please do not read newspaper items attributing something about a Member.

శ్రీ కె. కన్నబాబు : పేపర్ కటింగ్స్‌కి సంబంధించి చాలా కాలం నుండి సభలో చెప్పడం ఆనవాయితీగా వస్తోంది. ఒక పార్టీ గౌరవాధ్యక్షురాలు చెప్పినది చెప్పాలనుకుంటున్నాను. "Have you felt for compromising with Congress party over the last few months" అని ప్రశ్న అడిగారు. ఎప్పుడైనాసరే, కాంగ్రెస్ పార్టీతో కాంప్రమైజ్ కావాలనుకుంటున్నారా అని ఒక విలేఖరి అడిగితే, విజయమ్మ గారు చెప్పిన సమాధానం, ఇప్పుడు అనుకోవడం లేదు, 2010వ సంవత్సరంలో సోనియాగాంధి గారిని కలవడానికి నేనూ, జగన్ వెళ్లాము. ఈ పార్టీని విడిచి వెళ్లవద్దని చెప్పాను. అప్పుడు, నా కుమారుడు ఒక విషయం చెప్పాడు. ''నా తల రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది కానీ పబ్లిక్‌లో కొంత సానుభూతి ఉంటే దానితో బయటకు వెళతానని చెప్పాడట'' అని ఆమె స్పష్టంగా చెప్పినట్లు ఇంటర్వ్యూలో ఉంది. తండ్రి చివరి వరకూ ఈ పార్టీలో ఉన్నారు అనీ, విడిచిపెట్టి వెళ్లవద్దని ఆమె అన్న మాటల్లో తెలుస్తోంది. భర్త ఆశయాలకు, కొడుకు అధికార కాంక్షకి కన్నతల్లి నలిగిపోయినట్లు కనబడుతోంది. వైఎస్ఆర్ అంటే కాంగ్రెస్ పార్టీకి నాయకుడు. కానీ వైఎస్ఆర్ అంటే ఇప్పుడు ఒక ప్రజా అస్త్రం. దానిని వాడుకోవాలనే ప్రయత్నం చేస్తూ, అడుగడుగునా అవిశ్వాస తీర్మానం పెట్టి కాంగ్రెస్ పార్టీని కూల్చి వేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. నాకొక సామెత గుర్తుకు వస్తోంది. నువ్వు వంట వండుతూ ఉంటే వాంతి వస్తుందని పక్కవారు అంటే, ఉండు తిని వెళ్లు అన్నట్లు ఉంది అధ్యక్షా. అధికారం లేకుంటేనే జైలులో అవినీతితో ఉన్నారు. ఇక అధికారం వస్తే రాష్ట్రాన్ని ఎలా దోచుకుంటారనే ప్రశ్న ప్రజల ముందుకు వస్తోంది. అధికారం కట్టబెడితే పరిస్థితి ఏమవుతుంది? ఏ రాజకీయ పార్టీ అయినా ఒక ఆశయం కోసం పుడుతుంది ఆదర్శం కోసం పుడుతుంది. ఇక్కడ అవిశ్వాస తీర్మానం ఇచ్చిన టిఆర్ఎస్ ఒక ఆశయం కోసం , ఒక ఆదర్శం కోసం నమ్మిన సిద్ధాంతం కోసం పుట్టింది. వైఎస్ఆర్‌సిపి దేనికోసం పుట్టింది, ముఖ్యమంత్రి పదవి కోసం పుట్టింది, వారికి అధికార కాంక్ష వల్ల పుట్టింది. ప్రజల మీద అభిమానంతో పుట్టింది కాదు. అధికార కాంక్షతో పుట్టింది. అలకలతో పుట్టింది. జగన్ అడిగినా ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదనే అలకలోంచి పుట్టింది. తండ్రి ఆకస్మిక మరణం తరువాత వెంటనే ముఖ్యమంత్రి పదవి కావాలనుకున్నాడు. శవాన్ని పెట్టుకొని సియం పదవి కోసం సంతకాలు సేకరించిన వారసత్వం ఉన్న పార్టీ. అటువంటి ఘనత వహించిన పార్టీ వారిది. వారు అవిశ్వాస తీర్మానం పెడతారా?

(వైఎస్ఆర్‌సిపి నుండి తీవ్ర అంతరాయం)

జగన్ పార్టీ పెట్టినప్పటి నుండి, నేను ఈ ప్రభుత్వాన్ని పడగొడతాను అనడం తప్ప ఏమయినా చేశారా? నువ్వు నిలబెట్టకపోతే, నేను నిలబెడతానని మా ప్రజారాజ్యం పార్టీ నాయకులు చిరంజీవిగారు ప్రభుత్వాన్ని నిలబెట్టి చూపించారు. అంత సంపాదించుకొని జైల్లో కూర్చోవడం కాదు. ఈ రోజు టిఆర్ఎస్ పార్టీ కూడా అవిశ్వాస తీర్మానం పెట్టింది. ఈ పార్టీ కూడా అలకలతో పుట్టింది. హోదా ఉన్నంతకాలం ప్రాంతీయ వాదం గుర్తుకు రాలేదు. ఆ తరువాత జరిగిన పరిణామాలు అందరికి తెలుసు. ఈ రోజు టిఆర్ఎస్ పార్టీతోబాటు వైఎస్ఆర్సిపి ఈ ఇద్దరూ కలిసి ప్రభుత్వాన్ని కూలద్రోయాలనే ఒక ఆలోచనతో ఉన్నారు. రాజశేఖర రెడ్డిగారు జూన్ నెల, 2010వ సంవత్సరంలో టిఆర్ఎస్ పార్టీ గురించి చాలా స్పష్టంగా చెప్పారు. 1999లో చంద్రబాబునాయుడుగారు రెండవ సారి ముఖ్యమంత్రి అయినప్పుడు కెసిఆర్‌గారిని మంత్రి వర్గంలో తీసుకొనిఉంటే, టిఆర్ఎస్ పార్టీ వచ్చేదా అని అన్నారు. కేవలం రాజకీయ లబ్ది కోసం పార్టీని వాడుకున్నారని అన్నారు. తెలంగాణా పట్ల చిత్తశుద్ధి మీకు కాదు, మాకు ఉంది. తెలంగాణాపైన, తెలంగాణా ప్రజలపైన మీకు విశ్వసనీయత ఉన్నదా రాజేందర్ అని అన్నారు. ఎన్ని సీట్లు పోటీ చేశారు? 50 సీట్లు పోటీ చేస్తే, ఎన్నికల్లో గెలిచిన సీట్లు 10 మాత్రమే. ఎక్కడ తల పెట్టుకోవాలి? తెలంగాణాపట్ల మీకు విశ్వసనీయత ఉన్నదా, మాకు ఉన్నదా అని ఆ రోజు రాజశేఖర రెడ్డిగారు చేసిన స్టేట్‌మెంట్.

సా.6.30

''1999వ సంవత్సరంలో చంద్రబాబునాయుడు గారు రెండవ సారి ముఖ్యమంత్రి అయినప్పుడు, శ్రీ కె. చంద్రశేఖర రావుని మంత్రి వర్గంలో తీసుకొని ఉండి ఉంటే, అసలు అయన టి.ఆర్.ఎస్. పార్టీ పెట్టి ఉండేవారా? ఈ ఒక్క దానికి జవాబు చెప్పవయ్యా నీవు. తెలంగాణాను రాజకీయాలకు వాడుకొంటున్నారు. తెలంగాణా పట్ల మీకంటే మాకే చిత్తశుద్ధి ఉంది. తెలంగాణా పట్ల, తెలంగాణా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉండి ఉంటే రాజేంద్రా ఎన్నిసీట్లు పోటీ చేశారయ్యా మీరు, 50సీట్లకు పోటీ చేసి ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలిచారు. పట్టుమని పది సీట్లు కూడా గెలవలేదు. 50 సీట్లలో తల ఎక్కడ పెట్టుకోవాలయ్యా అర్థమౌతోందా రాజేంద్రా. తెలంగాణా పట్ల మీకు విశ్వసనీయత ఉందా? 50 సీట్లకు పోటీ చేసి పది సీట్లు గెలిస్తే, సిగ్గుపడాల్సిన అవసరం ఉందా, లేదా? చెప్పు'' అని డా. రాజశేఖర రెడ్డి గారు ఆరోజు ఇదే నిండు సభలో ప్రశ్నించిన విషయాన్ని నేను ఇప్పుడు చెప్పాను. నేను ఎవర్నీ విమర్శించడం లేదు.

(అంతరాయం)

ఆ రెండు పార్టీలు ఏవిధంగా కలిసి ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారని నేను అడుగుతున్నాను. దానికి హరీష్‌రావు గారు కూడా ఒక కౌంటర్ చెప్పారు. హరీష్‌రావు చెప్పిన కౌంటర్ ఏమంటే, 'నీవు రాయలసీమకు ముఖ్యమంత్రివా? లేక కడపకు ముఖ్యమంత్రివా?' అని ఆయన అడిగారు. నేను అసెంబ్లీలో జరిగిన ప్రస్తావనల గురించే చెపుతున్నాను. నా సొంత కవిత్వం అస్సలు కాదు. నేను మాట్లాడేవన్నీ అసెంబ్లీ రికార్డులే. వాస్తవాలే తప్ప మరొకటి కాదు.

(అంతరాయం)

Y.S.R.Congress party is accused of not making its stand clear on Telangana State అని అన్నప్పుడు it is clear that the Y.S.R.Congress party is accused of not making its stand clear on Telangana State.

MR.SPEAKER : Kanna Babu garu, I have already advised you, please do not do that.

శ్రీ కె. కన్నబాబు: నేను కేవలం దాని అర్థం చెపుతాను. అధ్యక్షా, తెలంగాణాపై మాకు అండర్‌స్టాండింగ్ ఉంది. కానీ, మా అండర్‌స్టాడింగ్ టి.ఆర్.ఎస్. వారికి అర్థం కావడం లేదని విజయమ్మ గారు ఈ ఇంటర్వ్యూలో చెప్పారు. తెలంగాణా పట్ల మా స్టాండ్ మాకు ఉంది, మా స్టాండ్ టి.ఆర్.ఎస్. వారికి అర్థం కావడం లేదని ఎకనామిక్ టైమ్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. కానీ, ఈనాడు ఆ రెండు పార్టీలు ఒకటిగా అవిశ్వాస తీర్మానం పెట్టడమనేది విడ్డూరంగా ఉంది. ప్రజలు బయట చూస్తున్నారు. వారు అర్థం చేసుకొంటారని నేను చాలా స్పష్టంగా చెపుతున్నాను.

(అంతరాయం)

అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ 2009వ సంవత్సరంలో తిరిగి అధికారంలోకి వచ్చాక, ఎన్నో ఒడిదుడుకులను, సవాళ్లను ఎదుర్కొంది. అయినా ఒక్క రోజూ కూడా ప్రజా సంక్షేమాన్ని, ప్రజా పథకాలను అమలు చేయడంలో రాజీ పడలేదు. డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు మరణించిన తరువాత, రోశయ్య గారు ముఖ్యమంత్రి అయ్యారు. కొద్ది కాలం తరువాత కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించారు.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ : (టి.ఆర్.ఎస్. సభ్యులను ఉద్దేశించి) దయచేసి కూర్చోండి. మీకు కూడా అవకాశం ఇస్తాను.

శ్రీ కె. కన్నబాబు : నేను ఎవరిపైనా ఏమీ మాట్లాడలేదు. రికార్డ్స్‌లో ఉన్న అంశాలే చెప్పాను. ఇవి నా సొంత విమర్శలు కావు. అసెంబ్లీలో జరిగిన చర్చల విషయాలను ప్రస్తావించడమన్నది ఇక్కడ ఆనవాయితీగా ఉంది. నేను అవే మాట్లాడాను. 2009వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదుర్కొంది. అయినా ఒక్క రోజూ కూడా ప్రజా సంక్షేమాన్ని, ప్రజాపథకాలను అమలు చేయడంలో రాజీ పడలేదు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు మరణించిన తరువాత, రోశయ్య గారు ముఖ్యమంత్రి అయ్యారు. కొద్ది కాలం తరువాత కిరణ్ కుమార్ రెడ్డి గారు మా నాయకుడిగా ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు. ఎన్ని అవరోధాలు వచ్చినా, ఆటంకాలు వచ్చినా వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళుతున్నాడు. ప్రచారం కోసం కాకుండా ప్రజల కోసం పరితపిస్తున్నాడు. జనాలకు భ్రమలు కల్పించాలన్న భావన ఏ కోశానా లేని వాడు. ప్రజలు ఇచ్చిన అధికారంతో వేల కోట్లు అల్లుడికో, కొడుక్కో ధారాదత్తం చేయాలని ఏ కోశానా అనుకోవడం లేదు. నేను గతంలో కూడా చెప్పాను. 2009 తరువాత 'స్కీమ్స్' తప్ప 'స్కామ్స్' లేవని గత అవిశ్వాస తీర్మానం సందర్భంగా కూడా చెప్పాను. అటువంటి క్లీన్ గవర్నమెంట్‌ని ఇస్తుంటే, పడగొట్టేస్తాం, పడగొట్టేస్తాం అంటూ ప్రతి రోజూ పాట పాడేస్తున్నారు. అంటే, ప్రభుత్వాలు క్లీన్‌గా, పారదర్శకతతో వీరు ఉండరాదని అనుకొంటున్నారా? వీరికి ప్రభుత్వం అవినీతి రహితంగా ఉండకూడదు. అలా ఉంటే వీరికి నచ్చదు. అందుకే పడగొట్టేస్తాం అంటున్నారు.

అధ్యక్షా, కేంద్రంలో సోనియా గాంధీ గారు, మన్మోహన్ సింగ్ గారు, రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో, అదే విధంగా రాష్ట్రంలో కిరణ్‌కుమార్ గారి నాయకత్వంలో మా పార్టీ అధ్యక్షులు బొత్స సత్యనారాయణ గారు, ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ గారు, ఇటువంటి నాయకులంతా

నిరంతరం ఈ ప్రభుత్వంలో ప్రజల కోసం కష్టపడి పనిచేయాలని చాలా తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను తూచా తప్పకుండ అమలు చేయడానికి, వారిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసి, పది మందికి ఉపయోగించడానికి ప్రతి రోజు ఈ పార్టీ, ప్రభుత్వాలు కష్టపడుతుంటే చూడలేని కొంత మంది, జైలు నుండి వచ్చిన ఆదేశాలను అమలు చేయడానికి ప్రతి రోజూ ప్రయత్నం చేస్తుంటే, దానికి మరి కొన్ని పార్టీలు వంత పాడుతుండడం విడ్డూరంగా ఉంది. అధ్యక్షా, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఏమీ లేదు. ఈ అవిశ్వాస తీర్మానం రావడానికి కేవలం పర్సనల్ ఎజండానే కారణం.

ఇందిరమ్మబాట, ప్రజా పథం, రచ్చ బండ, ఇళ్ల నిర్మాణంలో యూనిట్ కాస్ట్ పెంపు, రైతులకు వడ్డీ లేని ఋణాలు, ఇందిర జల ప్రభ, మీ సేవ, పారదర్శక పాలన, గ్రీన్ ఛానల్, మిల్క్ మిషన్, ఆరోగ్య శ్రీ, రూపాయికి కిలో బియ్యం, హైదరాబాద్ నగరాభివృద్ధి, ఇందిరమ్మ అమృత హస్తం, పాఠశాలల కోసం వేల కోట్ల రూపాయల నిధుల కేటాయింపు, ఫీజు రీఇంబర్స్‌మెంట్, రాజీవ్ యువ కిరణాలు, రాజీవ్ విద్యా దీవెన, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, జల యజ్ఞం వంటి అనేక కార్యక్రమాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇవే కాక మా పి.సి.సి. అధ్యక్షులు, రవాణా శాఖ మంత్రి గారు చెప్పారు. ఆర్.టి.సి.లో ప్రమాద వశాత్తు ఎవరేనీ కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలను అనాథలుగా వదిలేసిన పరిస్థితులు గత 14 సంవత్సరాలుగా ఉండేవి. కానీ, మా ముఖ్యమంత్రి గారు, మా రవాణా శాఖ మంత్రి గారు కలిసి ఒక నిర్ణయం గైకొని ఆర్.టి.సి.లో కూడా కారుణ్య నియామకాలను చేయాలని నిర్ణయించి 1500 మందిని తీసుకొంటున్నారు. గతంలో పాలించిన వారు ఎందుకు చేయలేక పోయారు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఇదే ఫైల్‌ని వద్దులే అని ప్రక్కన పెట్టారు. కానీ, ఈరోజు కిరణ్ కుమార్ రెడ్డి గారు వారి నాయకత్వంలో ఇలాంటి ఎన్నో కార్య క్రమాలను చేపడుతున్నారు. అంటే, ప్రజా సంక్షేమం, ఉద్యోగుల సంక్షేమం, యువత సంక్షేమం, మహిళా సంక్షేమం, రైతు సంక్షేమం, వీటిలో ముందడుగు చూసి ఏమిటి మనం ఇన్ని అవరోధాలు కల్గిస్తున్నా, ఇబ్బందులను కల్గిస్తున్నా, కిరణ్ కుమార్ రెడ్డి గారు ముందుకెళ్లిపోతున్నారని వారికి బాధేమో నాకు అర్థం కావడం లేదు. వై.ఎస్.ఆర్., ఇక్కడ వై.ఎస్.ఆర్ అంటే కన్‌ఫ్యూజన్ వస్తోంది. యువజన శ్రామిక రైతు పార్టీనా లేక వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారా! రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన అమలు చేసిన కార్యక్రమాలన్నింటినీ ఎత్తేస్తున్నారు, ఎత్తేస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఇప్పుడు నేను చదివిన పథకాల్లో రాజశేఖర రెడ్డి గారు ఉన్నప్పుడు అమలు చేసిన పథకాలెన్ని? ఆ తరువాత కిరణ్ కుమార్ రెడ్డి గారు గానీ, రోశయ్య గారు కానీ ఉన్నప్పుడు పెరిగిన పథకాలెన్ని? కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, ఎన్ని లక్షల కుటుంబాలకు అదనపు ప్రయోజనం చేకూరింది అన్న లెక్కలన్నీ మీకు తెలియాలి. మీకు సమయం ఉంటే వాటి లెక్కలన్నీ తెచ్చాను. ఎన్ని కుటుంబాలు ఎక్కడ, ఏ విధంగా లబ్ది పొందుతున్నాయో ఆ వివరాలన్నీ ఉన్నాయి. ప్రతిపక్షాలు గాలిలో మేడలు కడుతున్నాయి. ఈ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, ఏదో ఇప్పుడు ఎన్నికలు వచ్చేస్తే ఏదో గెలిచేద్దామని వారు అనుకొంటున్నారు. మొన్న స్థానిక ఎన్నికలు జరిగినప్పుడు వచ్చిన ఫలితాలను చూశాం కదా. సహకార ఎన్నికల్లో ఏమైంది అధ్యక్షా?

**సా.6.40**

సహకార ఎన్నికలలో ఓటర్లు ఎవరు అధ్యక్షా ? రైతులు. నూటికి నూరు శాతం రైతులు ఇవ్వాళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతో వున్నారని చాలా ఘంటాపథంగా మ్యాండేట్ వచ్చింది.

(అధికార పక్ష సభ్యుల నుంచి హర్షధ్వానాలు)

రైతులు కాంగ్రెస్ పార్టీ వైపున్నారు. అంతే కాని మీరు ఊహిస్తున్నట్లుగా అంతా తారుమారై జైలుకెళ్తొస్తే ఒక్కరాత్రిలో అధికారం వస్తుందనుకోవటం పొరపాటు. నిజం గుమ్మం దాటే లోపు అబద్ధం వూరంతా చుట్టొస్తుందనే సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని అన్నీ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి, పథకాల గురించి గుండెల మీద చేయి వేసుకొని నిజం చెప్పమనండి. ఎన్ఆర్ఈజిఎస్ వచ్చిన తరువాత ఇవ్వాళ గ్రామీణుల జీవన పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడ్డాయో లేదో చెప్పమనండి. ఇవ్వాళ శాంతి భద్రతల పరిస్థితులు ఎంతో మెరుగయ్యాయి. చాలా మంది యువత పట్టెడన్నం కూడా దొరకని పరిస్థితుల్లో ఇదివరకు కడుపు మండి హింస వైపు మళ్లేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని చెప్పవచ్చు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు బ్రహ్మాండమైన రిజల్ట్స్ వస్తున్నాయన్న దానికి దీనిని నిదర్శనంగా చెప్పుకోవచ్చు. లా అండ్ ఆర్డర్ గురించి ప్రస్తావించారు. ఇటీవల దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబు పేలుళ్ల దుర్ఘటన నిజంగా దురదృష్టకరం. ఐదేళ్ల తరువాత హైదరాబాదు నగరం మళ్లీ తీవ్రంగా చలించింది. బాంబు దుర్ఘటన జరిగినట్లు తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న మొట్టమొదటి వ్యక్తి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు. డీజీపీ తదితర పోలీసు అధికారులెవ్వరూ అక్కడికి వెళ్లక ముందే నేనున్నాను...... మీ కోసం తీసుకోవలసిన చర్యలన్నీ తీసుకుంటానన్న ఆత్మస్థైర్యం బాధితులకు కల్పించడానికి ముఖ్యమంత్రి గారు ముందుగా వెళ్లారు. కాని సమాచారం అందినా పట్టించుకోలేదని గాలి ప్రచారం చేస్తున్నారు. చిరంజీవి గారు కూడా అక్కడికి వెళ్లారు. హాస్పిటల్స్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. మీ నాయకుడు కూడా జైలు అధికారుల నుంచి పర్మిషన్ తీసుకొని వెళ్లి పరామర్శించవలసి వుండేది. దిల్‌సుఖ్ నగర్ సంఘటన జరగడం దురదృష్టకరం. అలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా మనందరం చర్యలు తీసుకోవలసిన బాధ్యత వుంది. ఇవ్వాళ తెలంగాణాలో నక్సలిజం తగ్గలేదా? తెలంగాణా నాయకులనే గుండెల మీద చేయి వేసుకొని చెప్పమండి. నేను కూడా తెలంగాణా గడ్డ అయిన వరంగల్ జిల్లాలో ఒక జర్నలిస్టుగా పని చేసి వచ్చిన వాణ్ణి. ఎప్పుడు ఎక్కడ ఏరోజు ఎన్‌కౌంటర్ జరుగుతుందోనన్న టెన్షన్‌తో మేం అక్కడ పని చేశాం. ఇవ్వాళ అలాంటి పరిస్థితులున్నాయా? ఈ రాష్ట్రంలో టెర్రరిజం, నక్సలిజం తగ్గిపోయి శాంతిభద్రతలు అదుపులో వున్నాయంటే దానికి కారణం ఈ ప్రభుత్వం కాదా అని నేను ప్రశ్నిస్తున్నాను. విద్యుత్ సమస్య గురించి అందరూ మాట్లాడుతున్నారు. నిజమే అది వంద శాతం కరెక్ట్. అయితే విద్యుత్ సమస్యను మన రాష్ట్రం ఒక్కటే ఎదుర్కోవటం లేదు. దేశంలోని చాలా రాష్ట్రాలలో కూడా ఈ సమస్య వుంది. ముంబై వంటి మహానగరాల్లోనే గంటల కొద్దీ కోతలు విధిస్తున్నారు. ఈ షార్టేజ్ ఎందుకొచ్చిందంటే గ్యాస్ లభ్యత లేకపోవటం వల్ల. ఇవ్వాళ మనకు 9.16 ఎమ్ఎమ్ఎస్‌సిఎమ్‌డిల మేరకు గ్యాస్ రావలసివుండేది. అది వచ్చివుంటే 2700 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగి అది మన అవసరాలకు సరిపోవటంతో పాటు ఇంకా విద్యుత్ మిగులు వుండేది. కాని దురదృష్టవశాత్తూ మార్చి నెల నుంచి కనీసం ఒక్క యూనిట్ కూడా గ్యాస్ రాని పరిస్థితి వుంది. అదే కాదు. నీళ్లు కూడా లేవు. ఇంకా హైడ్రో ఉత్పత్తి తదితర చాలా సమస్యలున్నాయి. అయినప్పటికీ విద్యుత్ కొనుగోలు కోసం ప్రభుత్వం ఎంత ఖర్చయినా సరే పెట్టి కొనడానికి సిద్ధంగా వుంది.

2009లో 185 మిలియన్ యూనిట్ల పీక్ డిమాండ్ వస్తే అది రికార్డు బ్రేక్ అని మేం అప్పట్లో వార్తలు రాసేవాళ్లం. కాని ఇవ్వాళ పీక్ డిమాండ్ అనేది 300 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. మన వినియోగం పెరిగింది కాని దురదృష్టవశాత్తూ మనం ప్లాన్ చేసుకున్న విద్యుదుత్పత్తి అందుబాటులోకి రాలేదు. దానితో చాలా గ్యాప్ ఏర్పడింది. అయినప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లకు గాని, సబ్సిడీలు చెల్లించటానికి కాని నెలకు రూ.7,300 కోట్లు ఖర్చు చేస్తున్నది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు నిజమే. కాని మనం ప్రజా ప్రతినిధులం. మనందరికీ ఆ సమస్య గురించి తెలుసు. కాని ప్రభుత్వం ఆ సమస్యలను అధిగమించటానికి చేస్తున్న కృషిని మనం గుర్తించాలి. అభినందించాలి. పవర్ కట్స్..... పవర్

కట్స్..... అంటూ పదే పదే మాట్లాడుతున్నారు పవర్ కట్స్ వున్నాయి కాబట్టి ఈ ప్రభుత్వం పడిపోవాలి..... పడిపోవాలి........ అంటున్నారు. పవర్ కట్‌కి రోడ్ యాక్సిడెంట్స్‌కి ప్రభుత్వం పడిపోవాలి అంటే ఏమిటిది అధ్యక్షా? పవర్ కట్స్ సాకు చూపించి ప్రతి రోజూ వారు ఇలాగే నడిపిస్తుంటారు. మా సహచర శాసన సభ్యులు పంతం గాంధీ మోహన్ గారు మనలో కొంత మంది శాసనసభ్యులు లోపల ఒకటి బయట ఒకటి మాట్లాడుతుంటారు కాబట్టి వారికి నార్కో అనాలిసిస్ టెస్ట్ చేయించాలని అంటుంటారు.

కాబట్టి అధ్యక్షా, సమస్య వుందని మనందరికీ తెలుసు. సమస్యకు కారణమెవరు? సమస్యలను అధిగమించటానికి ప్రభుత్వం ఖచ్చితంగా చిత్తశుద్ధితో డీల్ చేస్తున్నది. అలా చేయకుండా పలాయనం చిత్తగిస్తే అప్పుడు మీరు మాట్లాడాలి. సమస్యలను గాలికొదిలేసి మా ముఖ్యమంత్రి గారేమైనా పాద యాత్రలు చేస్తున్నారా?

అధ్యక్షా, ఏదైనా సరే సమస్యను ధైర్యంగా ఢీ కొనడమనేది మా కాంగ్రెస్ పార్టీకి అలవాటైన విద్యే. అంతే కాని పారిపోవాలని ఎవరూ అనుకోవటం లేదు.

ఇక తెలంగాణా గురించి చెప్పాలంటే అది చాలా సున్నితమైన సమస్య. ఈ సమస్యకు పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారు. తప్పకుండా పరిష్కారం కావలసిందే. తెలంగాణాలోని అసమానతలను తొలగించటం కోసం సాధ్యమైనంత వరకు మా ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు చాలా కీలకమైన మరియు ముఖ్యమైన నిర్ణయాల కోసం ప్రయత్నం చేస్తున్నారు. 14 ఎఫ్ నిబంధనలను కేంద్రాన్ని ఒప్పించి రద్దు చేయించారు. క్యాబినెట్ కమిటీ ఆన్ పొలిటికల్ అఫేర్స్ సిసిపిఎ కేంద్రంలో అత్యున్నత కమిటి. కేంద్రంలో అంతకుముందు జరిగిన నిర్ణయాలను తిరగదోడి రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు 14 ఎఫ్ నిబంధనలను సిసిపిఎ రద్దు చేసిన మాట వాస్తవం కాదా? అది ఈ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు చేసింది కాదా? ఇది విజయం కాదా? అది మీకు కనిపించటం లేదా అని నేను ప్రశ్నిస్తున్నాను. 1956 తరువాత ఈ రాష్ట్రంలో తెలంగాణా ప్రాంతం నుండి అడ్వొకేట్ జనరల్ నియమింపబడ్డారా? ఇప్పుడు కిరణ్ కుమార్ రెడ్డి గారు ఈ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చాక నియమించారు. (అధికార పక్షం వైపు సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, 610 జీవో అమలులో ఇబ్బందులొస్తున్నాయని విజ్ఞప్తులొచ్చినప్పుడు ఆ ఇబ్బందులను తొలగించటానికి రిటైర్డ్ జడ్జ్‌తో ఇంకా ఎంత బెటర్‌గా చేయగలుగుతామన్న ప్రయత్నాన్ని ఈ ప్రభుత్వం చేయటం వాస్తవం కాదా అని నేను ప్రశ్నిస్తున్నాను. అదే విధంగా గవర్నమెంటు ప్లీడర్ల నియామకంలో కూడా 40 శాతం మేరకు తెలంగాణా ప్రాంతం వారిని నియమించటం జరిగింది. ఎక్కడ అసమానత వుందన్నా, ఎక్కడ ఇబ్బంది వుందన్నా వాటిని తొలగించటం కోసం ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఈ ముఖ్యమంత్రి గారు ప్రయత్నాలు చేస్తున్నారని నేను చాలా స్పష్టంగా చెప్పగలుగుతున్నాను. ఇంతకుముందు పెద్దలు హరీశ్ రావు గారు మాట్లాడుతూ వరంగల్‌లో సహకార మెడికల్ కాలేజీని సహకార వ్యవస్థలో రైతులు స్థాపించుకున్నారు కాని ప్రభుత్వం స్థాపించిన కాలేజీ కాదని, అదే ఆంధ్ర ప్రాంతంలో ప్రభుత్వమే మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిందనే మాట చెప్పారు. కాకినాడ లోని రంగారాయ మెడికల్ కాలేజీ కూడా ప్రైవేటుగా ఏర్పాటైన కాలేజీయే. అయితే ఆ తరువాత ప్రభుత్వం తీసుకున్నది. ఇప్పుడు దానిని ప్రభుత్వ కాలేజీయే అని మనం చెబుతాము. అంతే కాని ఇక్కడొక న్యాయం, అక్కడొక న్యాయం వుండదు. అట్లాగే ఇక్కడొక లెక్క అక్కడొక లెక్క వుండదు. ఇందాకా ఆయనే ముఖ్యమంత్రుల గురించి మాట్లాడుతూ జలగం వెంగళరావు గారి విషయాన్ని పక్కన బెట్టాలన్నారు. ఎందుకు పక్కన పెట్టాలి అధ్యక్షా, ఆయనా తెలంగాణాకు చెందిన వ్యక్తే కదా? ఇంకొక విషయంపై మాట్లాడుతూ హైదరాబాదు విషయాన్ని మినహాయిస్తే అన్నారు. హైదరాబాదును ఎందుకు వినహాయించాలి అధ్యక్షా,

ఈ రాష్ట్ర చరిత్రలో పప్పు బెల్లాల లాగా ప్రభుత్వ భూములను పంచిన చరిత్రనే చూశారు కాని పంచిన భూములను తిరిగి తీసుకున్న చరిత్ర ఎక్కడైనా వుందా?

సా.6.50

కాని ఆ భూములు ఇచ్చిన తరువాత సద్వినియోగం కావడం లేదని, వాటిలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తుంటే ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిగారు చాలా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది కాలంలో సద్వినియోగం చేయని వేల ఎకరాల ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రిగారు వెనుకకు తీసుకున్నారు. అందులో కొన్ని వివరాలు చెబుతాను. బ్రాహ్మణి స్టీల్స్‌కు సంబంధించి జమ్మలమడుగులో 10000 ఎకరాలు, కాకినాడలోని వాకలపూడిలో ఎయిర్ లిక్విడ్ ఇండియా నుండి 30000 ఎకరాలు, నాయుడుపేటలో కపేరో ఇంజనీరింగ్ ఇండియా నుండి 1800 ఎకరాలు, శంషాబాద్‌లో శాల్స్ ఇండియా టెక్స్‌టైల్స్ నుండి 151 ఎకరాలు, వరంగల్‌లో సూర్య వంశీ స్పిన్నింగ్ మిల్సు నుండి 100 ఎకరాలు, మామిడిపల్లిలో బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్ నుండి 250 ఎకరాలు వెనుకకు తీసుకున్నారు. ఇంకా చాలా పెద్ద లిస్టు ఉంది. వాటిని ప్రభుత్వపరం చేయించి కోట్లాది రూపాయల విలువ చేసే భూములను కాపాడిన ఘనత కిరణ్ కుమార్‌రెడ్డిగారికే దక్కింది. మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ అక్రమంగా ఇచ్చిన భూములను వెనుకకు తీసుకోగలుగుతారా అని అడిగారు. వెనుకకు తీసుకున్నారనే విషయం చెబుతున్నాను. ఏదో తప్పు జరిగితే పోతేపోనీ అని అనుకునే ముఖ్యమంత్రి కాదు అధ్యక్షా.

(అంతరాయం)

దయచేసి సభ్యులు ఓపిక పట్టండి. విలువైన భూములు అక్రమంగా తరలిపోకుండా ముఖ్యమంత్రిగారు వెనుకకు తీసుకున్నారని చెబితే ఎందుకు బాధపడతారు ? మా రెవిన్యూ మంత్రిగారు చాలా కృషి చేసి, ముఖ్యమంత్రిగారితో సమీక్షలు నిర్వహించి ఆ భూములను వెనుకకు తీసుకుంటే ప్రతిపక్షాలు అభినందించవలసింది పోయి శాపాలు పెడతారా? మోత్కుపల్లిగారు బయ్యారం గనుల గురించి ప్రస్తావించారు. బయ్యారం ఐరన్ ఓర్ మైన్స్ రక్షణ స్టీల్స్ 55 వేల హెక్టార్సులో ఉంది. 1.37 లక్షల ఎకరాల బయ్యారం భూములను ముఖ్యమంత్రిగారు వెనుకకు తీసుకున్నారు. హిస్టరీ అది. పొరపాటు జరిగితే సరిదిద్దుకుంటారు. ఈ ప్రభుత్వం తప్పులు జరిగితే చూస్తూ ఊరుకోదు. అది బ్రదర్ అనిల్ కుమార్‌కు సంబందించినదని అన్నారు. అది ఎవరిదో నాకు తెలియదు అధ్యక్షా.

శ్రీ ఈటెల రాజేందర్(హుజూరాబాద్): 2009 కంటే ముందున్న ప్రభుత్వం ఎవరి ప్రభుత్వం అధికారంలో ఉంది? ఆయన భ్రమలో ఉన్నట్టున్నాడు. పిఆర్‌పి ప్రభుత్వం అని అనుకుంటున్నాడు. ఆ పక్షాన మాట్లాడుతున్నాడా? తెలంగాణా రాష్ట్ర సమితి నిరుద్యోగం నుండి పుట్టింది. అంటే పదవులు లేని నిరుద్యోగుల నుండి పుట్టిన పార్టీ అని అన్నారు. మీకు ఈ బుక్ పంపిస్తాను ఒకసారి పరిశీలించండి. 2000 సంవత్సరంలో ఆరుగురు మంత్రులు అధికారంలో ఉన్న వారు సోనియాగాంధీకి ఉత్తరాలు ఇచ్చిన పార్టీ మీది. టిఆర్ఎస్ పోరాటంతో మా తెలంగాణా పుట్టలేదు. తెలంగాణా ఉద్యమం 1952లో పుట్టింది. 1969లో అనేక మంది ఉద్యమాలు చేసిన విషయం గురించి మరచిపోకండి. ప్రజల కోరిక మేరకు ప్రజల పక్షాల పుట్టిన పార్టీ టిఆర్ఎస్ పార్టీ అని తెలియ చేస్తున్నాను. ఆనాడు మీరు తీసుకున్న భూములు రక్షణ స్టీల్స్ కాదు, ఇచ్చిన భూములు హిందూజాకు ఇచ్చిన భూములను తాత జాగీర్లను తెలంగాణాలో విలువైన భూములను , దర్గాలకు సంబంధించిన భూములను కట్టపెట్టిన వారు మీపార్టీ వాళ్లు కాదా? వారు ప్రభుత్వంలో ఉన్నవారు మీ పార్టీకి చెందిన వారు కాదా? ఆరోజు మా ప్రభుత్వమే అన్యాయంగా దుర్మార్గంగా వ్యవహరించిందా చెప్పండి.

సంతోషపడతాము. ఆ ప్రభుత్వం వేరు, ఈ ప్రభుత్వం వేరు అనడం మంచిది కాదు. మీ ప్రభుత్వానికి నిజంగా దమ్ముంటే సిబిఐ కేసులో ఎంతమంది మంత్రులు, ఎంత మంది ఐఎఎస్‌లు ఉన్నారో ........

శ్రీ కె. కన్నబాబుః మేము కూడా అదే చెబుతున్నాము. తెలంగాణా ఉద్యమం టిఆర్ఎస్‌తో పుట్టలేదని మాకు కూడా తెలుసు. 1952 నుండి ఉంది. 1965 నుండి ఉంది. తెలంగాణా ఉద్యమాన్ని ఆయన మంత్రి పదవి పోయిన తరువాత చేపట్టారని చెబుతున్నాము. ఆ సెంటిమెంట్ ఎప్పటి నుండో ఉంది. చంద్రబాబుగారు రెండవ సారి మంత్రి పదవి ఇవ్వనప్పుడు కెసిఆర్‌కి గుర్తు వచ్చిందని వైఎస్ఆర్‌గారు సభలో చెప్పారు.

శ్రీ టి. హరీష్‌రావుః దయచేసి ఏమి అనుకోవద్దు. నేను మాట్లాడేటప్పుడు పది సార్లు మధ్యలో వారు ఇంటర్‌వీన్ అయ్యారు. నేను ఈల్డ్ అవ్వనని అన్నా కూడా వారికి అవకాశం ఇచ్చారు. పదే పదే వాళ్లు మా గురించి మాట్లాడుతున్నా మాకు మాత్రం మైకు ఇవ్వడం లేదు. కెసిఆర్‌గారు మంత్రి పదవి ఇవ్వలేదని తెలంగాణా ఉద్యమం ప్రారంభించారని పదే పదే చెబుతున్నారు. కెసిఆర్‌గారు ఆ రోజు మంత్రి పదవితో సమానమైన డిప్యూటీ స్పీకర్ హోదాలో (అధ్యక్ష స్థానంలో) కూర్చున్నారు. ఆ రోజు వారికి పదవి లేక కాదు. దాదాపు 12 నెలలు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. మీరు రెండుసార్లు తెలుగుదేశం పార్టీ చేతిలో చావుదెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీ ఆ రోజు 42 మంది ఎమ్ఎల్ఎలు పదవి కోసం ఢిల్లీకి వెళ్లారని మేము అన్నామా? మాకు విజ్ఞత ఉంది. మేము అలా అనము.

రా.7.00

మమ్మల్ని విమర్శించలేక ఈవిధంగా మాట్లాడుతున్నారు. కన్నబాబు గారు బాగా చదువుకున్నారు, జర్నలిస్ట్‌గా పనిచేశారు. వాస్తవాలకు దగ్గరగా మాట్లాడతారనుకున్నాను. ఈ రకంగా ఆయన దిగజారిపోయి మాట్లాడతారని అనుకోలేదు. కెసిఆర్ కేవలం డిప్యూటి స్పీకర్ పదవినే కాదు, ఎన్నో సార్లు పదవీత్యాగాలకు పాల్పడ్డారు. కేంద్ర మంత్రి పదవి, ఎం.పి పదవి, డెప్యూటి స్పీకర్ పదవి, ఎం.ఎల్.ఏ పదవి ఇలా అన్ని పదవులను గడ్డిపోచలాగ తీసివేసి, పదవీ త్యాగాలకు పాల్పడ్డారు. ప్రజా రాజ్యం పార్టీ లాగ రెండు నెలల్లోనే పార్టీని ఎత్తేసిన నాయకుడు కాదు. 13 ఏళ్లుగా ఎన్ని ఇబ్బందులొచ్చినా, కష్టాలొచ్చినా పార్టీని నడిపిన నాయకుడు కెసిఆర్. "తెలంగాణా వచ్చుడో, కేసిఆర్ చచ్చుడో" అని తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి పోరాడిన వ్యక్తి కెసిఆర్. పెద్ద నాయకుడిని విమర్శించినంతమాత్రాన పెద్దవాళ్లు కారు. 14(f) ను రద్దు చేయించిందెవరని అంటున్నారు. దానిని తెచ్చింది ఈ ప్రభుత్వం కాదా? 14(f) రద్దైయ్యిందంటే దాని వెనుక ఉద్యోగుల, ఉపాధ్యాయుల పోరాటం ఉంది. సబ్ ఇన్స్‌పెక్టర్ ఉద్యోగాలకు సంబంధించి ఎల్లుండి ఎగ్జామ్ ఉందని, అడ్డుకొని తీరతామంటే, రాత్రి పూట అప్పటికప్పుడు, తెలంగాణా ఉద్యమం ప్రభావం వల్ల, ఉద్యోగులు, విద్యార్థుల పోరాటం వల్ల 14(f) ను రద్దు చేశారు. అడ్వొకేట్ జనరల్ గురించి చెప్పారు. హైకోర్టులో 36 మంది గవర్నమెంట్ ప్లీడర్స్ ఉంటే, తెలంగాణా నుండి 12 మంది, సీమాంధ్రా నుండి 24 మంది ఉన్నారు. కావాలంటే డిస్కషన్ పెట్టండి. జీ.ఓ.నం. 610 గురించి మాట్లాడుతూ మా నాయకుడు రిటైర్డ్ జడ్జితో కమిటీ వేశారన్నారు. జీ.ఓ.నం. 610 ను అమలు చేయమని అడిగితే నాటి నుండి నేటి వరకూ కమిటీలు దక్కాయి తప్ప ఏమీ చేయలేదు. చంద్రబాబు నాయుడు గారు, గిర్‌గ్లానీ కమీషన్, రేవూరి ప్రకాశ్ రెడ్డి కమిటీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీ, ఆఫీసర్స్ కమిటీ, కేబినెట్ సబ్‌కమిటీ అన్నారు. మళ్లీ నేడు రిటైర్డ్ జడ్జితో కమిటీ అంటున్నారు. జీవో అమలయ్యింది లేదు, తెలంగాణా వారికి ఉద్యోగాలిచ్చింది లేదు. కమిటీలు వేసి కాలయాపన చేశారు.

శ్రీ కె. కన్నబాబు : అధ్యక్షా, హరీష్‌రావు గారంటే నాకు గౌరవం. నేను దిగజారి మాట్లాడుతున్నానన్నారు. వాస్తవాలు అందరికీ తెలుసు. వారి నాయకుడిని అన్నప్పుడు ఆమాత్రం బాధ ఉంటుంది. మేము ప్రజారాజ్యం పార్టీ లాగ వెంటనే విలీనం చేసుకోము అని అన్నారు. కండీషనల్‌గా విలీనం చేస్తానన్నారు. వాళ్లు కూడా కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తామన్నారు, వాళ్లు విలీనం చేయమని చెప్పలేదు. విడిగా ఉంటామని అన్నారా? మొట్టమొదట జనరల్ ఎలక్షన్స్ అప్పుడు ఏ పార్టీతో కలిసారో చెప్పమనండి. గెలిచిన తరువాత ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యారా లేదా? అందరికీ తెలిసిన విషయాలే. హరీష్‌రావు గారు ఎం.ఎల్.ఏ కాకుండానే యువజన సర్వీసుల శాఖా మంత్రయ్యారు. వారు తరువాత మహాకూటమిలోకి వెళ్లారు. చిరంజీవి గారు చేసిన విలీనాన్ని తప్పు పట్టే హక్కు ఎవరికీ లేదు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినప్పుడు, అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించుకొని, ప్రభుత్వాన్ని కూలుస్తామని అవినీతి సొమ్ముతో విర్రవీగుతున్నప్పుడు, రాష్ట్రాన్ని కాపాడతామని ఆయన ముందుకు వచ్చారు. ఆయన రియల్ హీరో. నువ్వు పడగొడితే, నేను నిలబెడతానని ముందుకు వచ్చారు. ఆ విధంగా చిరంజీవి గారు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారు. మా నాయకుడి గొప్పతనం అది. ప్రతి నాయకుడికి ఒక చరిత్ర ఉంది. అవన్నీ మనం చెప్పుకోనవసరం లేదు. పదే పదే అసత్యాలు చెబితే అవి నిజాలైపోతాయనే భ్రమలో వారున్నారు. ఒకప్పుడు నాయకత్వం అంటే కండబలం, ఇప్పుడు నాయకత్వమంటే జనంతో మమేకమవడం అని అంబేద్కర్ ఒక మాటన్నారు. జనంతో మమేకమై, జనం సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం కోసం, ఏ రోజుకారోజు పారదర్శక పాలనను అందించడం కోసం కిరణ్‌కుమార్ రెడ్డి నాయకత్వం పనిచేస్తుంది. గతంలో పెన్షన్, రేషన్ కార్డులివ్వాలంటే ఎంత కష్టసాధ్యమో మీకు తెలుసు. ఈరోజు ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదని, ప్రభుత్వమిచ్చే ప్రతి రూపాయి పేదవాడికి చేరాలని ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. "మీ సేవ " గురించి వాళ్లకేమి తెలుసు, వాళ్లు వేరే సేవలో మునిగితేలుతున్నారు. అలాంటి ఎన్నో కార్యక్రమాలను పెట్టి పారదర్శక పాలనను అందించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ప్రాణహితచేవళ్ల ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో కిరణ్‌కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం, మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకుంది. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా చూసి ముందుగా యం.ఓ.యు చేసుకున్న పరిస్థితిని గత ముప్పై సంవత్సరాలలో చూడలేదు. ప్రాణహిత చేవెళ్లకి జాతీయ హోదా ప్రకటించాలని కోరుకుంటున్నాము. పోలవరం ప్రాజెక్టు ఇప్పటి ప్రాజెక్టు కాదు. 1942 లోనే స్వాతంత్ర్యానికి పూర్వమే దాని గురించి సర్వే చేశారు. పోలవరం ప్రాజెక్టు టెండర్ విషయంలో అంతకు ముందు 12.61 శాతం తక్కువకు కోట్ చేస్తే, ఇప్పుడు 14.05 శాతం తక్కువకు కోట్ చేయడం వల్ల కొన్ని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాపాడగలిగారు. పోలవరం ప్రాజెక్టు బహుళార్థసాధక ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును రాజకీయ కోణంలో చూడొద్దని, అడ్డుకోవద్దని మా ప్రాంత రైతాంగం తరఫున కోరుతున్నాను. ఇది చాలా ముఖ్యమైన ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టు వల్ల కృష్ణా డెల్టాకి అదనపు నీరు వస్తుంది. ఇటు తెలంగాణా, రాయలసీమలకు మేలు జరుగుతుంది. సుమారు ముప్పై లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ జరగడమే కాకుండా ఏడున్నర లక్షల ఎకరాలకు అదనపు నీరు అందుతుంది. గ్రీన్ ఛానెల్ గురించి చెప్పుకోవాలి. గతంలో కాస్మోటిక్ ఛార్జెస్, మెస్ ఛార్జెస్ విడుదల కావాలంటే బిల్లుల కోసం నెలల తరబడి వేచి ఉండవలసి వచ్చేది.

రా.7.10

కానీ ఈ మధ్య కాలంలో నిరంతరం జరగాల్సిన అన్ని విధాల సంక్షేమానికి సంబంధించిన వ్యవహారాలన్నీ వాటంతట అవే ఆటోమేటిక్‌గా జరిగే విధంగా గ్రీన్ ఛానల్ పేరుతో ఎన్నో కార్యక్రమాలు ఆర్థిక శాఖామాత్యులు రామనారాయణ రెడ్డి గారి నేతృత్వంలో జరుగుతున్నాయి. నిన్ననే సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గారు కూడా చెప్పారు. సాంఘిక సంక్షేమానికి సంబంధించిన పలు పథకాలను గ్రీన్ ఛానల్‌లో చేర్పించామని చెప్పారు. ఈ

విధంగా వినూత్నమైన ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే, ప్రతిపక్ష పార్టీలకు తెలియడం లేదో, తెలిసి పట్టించుకోవడం లేదో, బాగా చేస్తున్నారనే కంగారుతో రాజకీయ కోణంలో చూస్తున్నారు తప్ప ప్రతిసారీ అవిశ్వాస తీర్మానమని ఉరకలు వేస్తున్నారు. నిన్ననే ఒక సభ్యుడు మాట్లాడుతున్నప్పుడు అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టారని అడిగితే చర్చ కోసం పెట్టామని చెప్పారు. మేం కొత్తగా శాసనసభకు ఎన్నికైనపుడు మేం మా ప్రాంత సమస్యలకు సంబంధించిన ప్రశ్న ఎపుడు వస్తుందా, ఎపుడు మాట్లాడదామా అని ఎదురుచూశాం. ఆ విషయాలు కూడా మీ దృష్టికి పలుమార్లు తీసుకొచ్చాం. సభ సజావుగా జరిగితే జీరో అవర్‌లో అయినా సమస్యలు ప్రస్తావిస్తే బాగుంటుందని ఎదురుచూశాం. అప్పుడు సభను సజావుగా జరగనివ్వకుండా అవిశ్వాస తీర్మానం పెడితే మాత్రం చర్చ జరుగుతుందనే భావనలో ప్రతిపక్ష పార్టీలు ఉండడం ఎంతవరకు సహేతుకం?

నేను చాలా విషయాలు మాట్లాడదామనుకున్నాను. యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీ నుంచి రైతులుంటే నేను మాట్లాడదామని అనుకున్నాను. పరిశ్రమలు రావడం లేదు, వచ్చిన పరిశ్రమలు వెనక్కి వెళ్లాయని ఆ పార్టీ గౌరవాధ్యక్షులు విజయలక్ష్మి గారు చెప్పారు. కానీ ముఖ్యమంత్రి గారు ఈ రోజు ఉదయం ఈ సభలో మాట్లాడుతూ రూ.1500 కోట్ల పరిశ్రమ స్థాపించడానికి ఎంఓయూ చేసుకోవడం కోసం వెళుతున్నానని చెప్పారు. అది కూడా ఒకే పరిశ్రమ. తరవాత పరిశ్రమలు శంకుస్థాపన చేయడం గాని, ఎపుడు వస్తాయో తెలియని పరిస్థితి నుంచి రెండేళ్లలో ట్రాక్టర్ల తయారీ పరిశ్రమ వచ్చిందని చెప్పారు. ఇన్ని ఒడిదుడుకులు, సమస్యలు వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం సమగ్రమైన అభివృద్ధి కోసం పనిచేస్తోంది. అలాంటి సమగ్రాభివృద్ధిని మీరందరూ కూడా ఆమోదించి ప్రజలు మీ మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోమని కోరుతున్నాను. ప్రజలు మనల్ని వారి సమస్యలు తీరుస్తామని ఈ సభకు ఎన్నుకున్నారు. కానీ మీరు ప్రతి రోజూ ఒక సమస్యగా తయారయ్యారు.

ఇంతకు ముందు మోత్కుపల్లి నర్సింహులు గారు మాట్లాడుతున్నప్పుడు వారి మీద ఒక సభ్యుడు హెడ్‌ఫోన్ విసిరివేశారు. అలా విసిరివేయడం చాలా దారుణం. సంయమనం లేక రోజులు లెక్కపెట్టుకుంటున్నారు. తొందరగా ఎన్నికలు రావాలని వారి కోరిక. తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కు అయ్యాయని వైఎస్సార్‌సీపీ నుంచి ఆరోపణ. గత ఏడాది ఇదే సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి ఆ రోజు కుమ్మక్కు అయిన పార్టీ వైఎస్సార్‌సీపీ కాదా? అప్పుడు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చినట్లు కాదా? మీకు నచ్చినట్లుగా ఉంటే వ్యవస్థ అంతా బాగున్నట్లు, కళకళలాడుతున్నట్లు, అంతా బాగున్నట్లుగా చెబుతున్నారు. చాలా మంది వారి పార్టీ నాయకులు మాట్లాడుతున్నప్పుడు ఏమి చెప్పారంటే, మాకు ఇష్టం లేకపోయినా మా నాయకుడు అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు కాబట్టి మేమందరం కూర్చున్నామని చెప్పారు.

(అంతరాయం)

ఇన్నర్ లాబీల్లో చెప్పారు. పేర్లు చెప్పడం సక్రమం కాదు కాబట్టి చెప్పడం లేదు. చివరిగా ఇంకొక ముఖ్యమైన విషయం ఈ సందర్భంగా ప్రస్తావిస్తాను. యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి మీద ఈ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేస్తోందని ప్రతి రోజూ ఒక ప్రచారం జరుగుతున్నది. మీరు పత్రికలు శాసనసభలో చదవవద్దు అన్నారు కాబట్టి చదవడం లేదు. పయనీర్ పత్రికలో మధు కోడా గురించి ఒక ఆర్టికల్ వచ్చింది. మనీ లాండరింగ్ కింద మధు కోడా 2009 సెప్టెంబర్‌లో అరెస్ట్ చేస్తే అప్పటినుంచి కేసు నడుస్తోంది. విచారణ కూడా ఇంకా జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వానికి చట్టం ముందు అందరూ సమానులే. అందువలనే రాజా, కనిమొళి, సురేశ్ కల్మాడీల లాగా ఎవరైనా ఒకేలాగా చూస్తున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది అన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం ఉంది తప్ప మీరు చెప్పినట్లుగా మా పార్టీలో ఉంటే వదిలివేసి ఉండేవారు, లోపల వేసి

ఉండేవారు కాదు అంటున్నారు. ఇంతకు ముందు తెలుగుదేశం పార్టీ సభ్యులు చెబుతున్నారు. సిబిఐ రిపోర్టు మా దగ్గర లేదు. కొన్ని పత్రికల్లో వచ్చిన విషయాలను చూస్తే...............

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

అదే చెబుతున్నా ను. మంత్రుల సంగతి తర్వాత. ముందు జైలులో ఉన్న మీ నాయకుడి సంగతి చూడండి. నేను ఇంకా మాట్లాడాలి కానీ కాంట్రవర్సీ వద్దని నేను వాటి జోలికి వెళ్లడం లేదు. చివరిగా ఒక విషయం చెబుతున్నాను. ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఒక ఫార్స్‌గా చేసే ప్రయత్నం మరొకటి లేదు. వారు ఒక రాయి వేసి చూశారు. తెలుగుదేశం పార్టీ సభ్యులు మద్దతు ఇస్తారేమోనని, కొంత మంది సభ్యులు వారి పార్టీకి మద్దతు ఇస్తారని, వెంటనే ఎన్నికలు వస్తే మాకేమైనా అవకాశాలు వస్తాయేమోనని ఒక రాయి వేశారు. ప్రజలలో నెమ్మది నెమ్మదిగా పరపతి తగ్గిపోతోంది. సాధారణంగా త్వరగా ఎన్నికలు వస్తే బాగుండని ఆ దిశలో ప్రయత్నం చేశారు. వారి పార్టీలో ఉన్నవారిని నిలుపుకోవడం కోసం ఎప్పటికప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి డ్రామాలు, రాజీనామాల ప్రయత్నం చేస్తున్నారు. కానీ నేను చెపుతున్నదొకటే. పూర్తి విశ్వాసంతో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, సమస్యలు ఎదురైనా ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుంది. మంత్రివర్గంపై అవిశ్వాసం పెట్టామని చెబుతున్నారు. ప్రతి శాఖలో ఈ రోజు గతంలోకన్నా మెరుగైన పరిస్థితుల్లో పనులు జరుగుతున్నాయి. పూర్తిగా ప్రజల విశ్వాసాన్ని చూరగొని ప్రభుత్వం పనిచేస్తుంది. మీ రాజకీయావసరాల కోసం రాజకీయ ఫార్స్ అనే అజెండాతో, వ్యక్తిగత అజెండాతో పెట్టిన అవిశ్వాస తీర్మానాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను ఏమీ చేయలేవు. ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం చివరి రోజు వరకు బాధ్యత వహించిన తర్వాత మాత్రమే ఎన్నికలు వస్తాయని తెలియజేస్తున్నాను. చాలా పార్టీలు ప్రతిపక్ష పార్టీల బాధ్యతగా చేస్తున్నామన్నారు. దాని గురించి నేను పెద్దగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు. నేను చెప్పేదొకటే, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉన్న తరుణంలో ఇంకో అవిశ్వాస తీర్మానం వచ్చినా కూడా మొక్కవోని ధైర్యంతో ఇంకా మంచి పథకాలు పెద్దఎత్తున ప్రవేశపెట్టి ప్రజలకు చేరువ కావడానికి నిరంతరం ప్రభుత్వం పనిచేస్తుందని చెబుతున్నాను.

గవర్నర్ గారి ప్రసంగంలో ఒక విషయం చెప్పారు. ప్రజాప్రతినిధులందరూ జనంలోకి వెళ్లి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లండని, బాగా పనిచేయండని చెప్పారు. మీరందరూ ప్రభుత్వ పథకాలను అర్హత ఉన్న లబ్ధిదారులకు చేర్చడానికి నిరంతరం పని చేయండని చెప్పారు. అవిశ్వాస తీర్మానం వలన ప్రభుత్వానికి పెద్దగా నష్టం జరగడంలేదని తెలియజేస్తున్నాను. మంచి నడవడికతో ప్రయత్నం చేయాలని, మరలా ఒక సంవత్సరంపాటు పని చేయాలని కోరుతున్నాను. మోత్కుపల్లి నర్సింహులు గారు ఇందాక చెప్పారు. మేం అవిశ్వాస తీర్మానం పెట్టడం కొత్త కాదు, గతంలో రాజశేఖర రెడ్డి గారి మీద, సభాపతి మీద, గత సంవత్సరం కిరణ్‌కుమార్ రెడ్డి గారి మీద పెట్టామని, 2014 తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మీద కూడా అవిశ్వాసం పెడతామని చెప్పారు. కాబట్టి వారికి ఆ అవకాశాలు వస్తాయి. తప్పకుండా 2014 తర్వాత కూడా ప్రజల విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మరలా వస్తుందని తెలియజేస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు: 2014లో అవిశ్వాస తీర్మానం పెడతామని శ్రీ మోత్కుపల్లి నర్సింహులు చెప్పలేదు, అవసరమైనపుడు పెడతామని చెప్పారు.

శ్రీ జి.మల్లేశ్ః అధ్యక్షా, 13వ శాసనసభలో ఇప్పటివరకు రెండు సార్లు అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది. ఇది కేవలం రాజకీయ లాభాలు గడించాలనో, మేం అటువైపు వెళితే వారు ఇటువైపు వస్తారనే నమ్మకంతో అవిశ్వాస తీర్మానాన్ని సమర్థించడం లేదు. ప్రభుత్వ విధానాలలోని లోపభూయిష్టమైన విధానాలను ఎత్తి చూపడానికి, ఈ ప్రభుత్వం సక్రమమైన మార్గంలో పనిచేయడానికి, తప్పులుంటే సవరణ చేసుకోవడానికి అవిశ్వాస తీర్మానాన్ని వినియోగించి శాసనసభలో అనేక సందర్భాలలో మా గళం విప్పుతున్నాం. మా మనసులో ఉన్న విషయాలను తెలుపుతున్నాను.

రా.7.20

అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడమనేది ప్రజాస్వామ్య సాంప్రదాయం. ఇది మన కంటే ముందు అనేక మంది చేసిన సాంప్రదాయం. అందువలన దానిని ఆ రకంగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది. నేను ప్రధానంగా అధికార పక్షానికి చెప్పేదేమంటే మీరు ప్రతిపక్షాలలో ఉండే అనైక్యతను ఆధారం చేసుకుని ఆక్సిజన్ మీద బ్రతుకుతున్నారు. ప్రతిపక్షాలు నిజంగానే ఒకటిగా ఉండి ఉంటే మీరు ఇప్పటికి అక్కడ ఉండే వారు కారనే విషయాన్ని ఈ సందర్భంగా చెబుతున్నాను. అందువలన ఈ రాష్ట్రానికి ముగ్గురు ముఖ్యమంత్రులు మారినా జరిగింది, ఒరిగింది ఏమీ లేదని చరిత్ర రుజువు చేస్తున్నది.

అధ్యక్షా, తమరికి తెలుసు. మీరు కూడా చాలా బాధపడ్డారు. మేము కూడా బాధ పడ్డాం. ఈ శాసన సభను నడుపుకునే పరిస్థితే లేదు. మూడేళ్ల పాటు కాలం వృథా అయిపోయింది. గుండెలు ఆవేదన చెందాయి. ప్రజలు ఆందోళన పడ్డారు. ఇక ఈ శాసన సభను నడిపే స్థితి ఈ కాంగ్రెస్ పార్టీకి లేదని నిర్ధారణ చేశారు. ఇటువంటి పరిస్థితిలో శాసన సభ ఆక్సిజన్ స్థితి నుంచి లేచి వచ్చింది. అలాంటి మీరు ఇప్పుడు వాపును చూసి బలం అనుకుంటున్నారు. నిన్న జరిగిన సహకార సంఘాల ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన అది కేవలం వాపు. ఆ వాపును చూసి మా బలం పెరిగిందని మీరు పూగిపోతున్నారు. కానీ అది సరైనది కాదు. ఇవాళ అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ధనం విలువ పెరిగిపోయింది. ఇవాళ ఎన్ని సంస్కరణలున్నప్పటికీ ఒక ఎంఎల్ఏగా ఎన్నిక అవ్వాలంటే ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే సంస్కృతి వచ్చింది. సహకార సంఘాల్లో అసలు ఎన్నడూ లేనంత అవినీతి జరిగింది. ఈ అవినీతి పద్ధతుల్లో అధికారంలోకి వస్తే మొత్తం అంతా బ్రహ్మాండంగా వెలిగిపోతుందని చెప్పవచ్చా? అందువలన దానిని చూసి మీరు ఉబ్బి పోవలసిన అవసరం లేదు. మీరు చేసిన అభివృద్ధి శూన్యం. అవినీతి పరిపాలనే కొనసాగుతున్నది. అది కేంద్రం నుంచి రాష్ట్రం దాకా పై నుంచి క్రింది దాకా ఉందనే విషయాన్ని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, అందులో భాగంగా నేను రెండు మాటలు చెబుతున్నాను. భూగర్భంలో ఉండే బొగ్గు గనుల్లో అవినీతి కుంభకోణం జరిగింది అనే విషయం మన దృష్టికి వచ్చింది. ఆకాశంలో నడిచే విమానాల కొనుగోలులో అవినీతి జరిగిందనే విషయం మన దృష్టిలో ఉంది. అదే రకంగా భారత దేశంలోనే మన రాష్ట్రం అవినీతిలో మొదటి స్థానంలో ఉంది. దీనికి ఐఏఎస్ ఆఫీసర్లు, కొంత మంది మంత్రుల మీద అభియోగాలువచ్చి, పరిపాలన అంతా స్తంభించి పోయే వాతావరణం ఏర్పడింది. ఇలాంటి వాతావరణం మనం మరచి పోవడానికి వీలు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ రాష్ట్రం ఉన్నది. ప్రధానంగా ధరలు అధికంగా పెరుగుతున్నాయి. హద్దు లేకుండా ధరలు పెరుగుతున్నాయి. మాట్లేడితే మా మంత్రి గారు రూపాయికే కిలో బియ్యం చొప్పున నాలుగు కిలోలు ఇస్తున్నామని చెబుతారు. మన మంత్రులను నాలుగు కిలోల బియ్యం ఇచ్చి ఒక రూములోకి పంపి తాళం వేసి నెల రోజుల తరువాత తాళం తీద్దాం. బ్రతకగలుగుతారా? ఉప్పు, పప్పు, నూనెల ధరలు ఏ విధంగా ఉన్నాయి? మిగతా జీవితావసర వస్తువుల ధరలు ఏ విధంగా పెరిగిపోతున్నాయి, మీకు తెలియకపోతే మీ ఇళ్లలో ఉన్న వారిని

అడిగి తెలుసుకోండి. వాళ్లకు బాగా తెలుస్తుంది. ఈ రకమైన ధరల పెరుగుదలతో అసంఖ్యాకమైన సామాన్య ప్రజలు జీవించే వాతావరణం లేని పరిస్థితులున్నాయి. ఆహార భద్రత లేని పరిస్థితి ఉన్నది. మన దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు కూడా చెప్పింది, ఒక వైపు మన ఆహార ధాన్యాల ఉత్పత్తి అంతా గోదాముల్లో ధాన్యం మక్కిపోతుంటే మన ప్రజలు ఆహారం కోసం ఆందోళన చెందే పరిస్థితి ఉన్నది. ఆహారం లేక చనిపోయే పరిస్థితి ఉన్నది. అవసరమైతే మీరు ఉచితంగా పంపిణీ చేయండని సుప్రీం కోర్టు ప్రభుత్వానికి చివాట్లు పెట్టిన సందర్భాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవలసిన అవసరం ఉన్నది. అందువలన ఇవాళ ఆహార భద్రతకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం మరింత మెలకువగా మెలగవలసిన అవసరం ఉన్నది. అధ్యక్షా, కేరళ రాష్ట్రంలో 18 వస్తువులను ఫెయిర్ ప్రైస్ షాపుల ద్వారా సామాన్య ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కానీ మన రాష్ట్రంలో 9 రకాల వస్తువులని చెబుతున్నారు. అవి చాలీ చాలని పద్ధతుల్లో చేయడం జరుగుతున్నది. అందువలన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు అవసరమైన వస్తువులన్నీ పంపిణీ చేయాలి. బ్లాక్ మార్కెట్‌లో ఇష్టమొచ్చినట్లు దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం ఉండి కూడా ప్రేక్షక పాత్ర వహిస్తున్నది. ఒక్క బ్లాక్ మార్కెటర్‌ని కూడా ఈ ప్రభుత్వం అరెస్టు చేసి జైలుకి పంపిన దాఖలాలు లేవు. ఈ రకమైన పరిస్థితి ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది.

నిరుద్యోగం కూడా చాలా భారీయెత్తున పెరిగిపోయింది. ఇవాళ నేను మనవి చేస్తున్నాను, రాజీవ్ యువ కిరణాల పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్ల దగ్గరకి పంపించి వాళ్లకు కొద్ది మందికి రూ.7,000 లేదా రూ.8,000 ల జీతంతో ఉద్యోగాలు ఇప్పించిన మాట వాస్తవమే. కానీ అది ప్రభుత్వ ఉద్యోగమా? వాళ్లకు అది పర్మినెంట్ ఉద్యోగమా, వాళ్లకు గ్యారెంటీ లేని పరిస్థితి ఉన్నది. అసలు మన మంత్రి గారిని ఆ ఉద్యోగానికి పంపితే గానీ ఆయనకు అందులో ఉండే కష్టమేమిటో తెలియదు. అసంఘటితమైన కార్మికులు లక్షల మంది కనీస వేతనాలు లేక మౌలిక సదుపాయాలు లేక ట్రేడ్ యూనియన్ చట్టాలు అమలు జరపక అనేకమైన ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్నది. వాళ్లను రెగ్యులర్ చేయాలని ఏళ్ల తరబడి ఆందోళన చేసే పరిస్థితి ఉన్నది. కాంట్రాక్టీకరణ అదే రకంగా ప్రైవేటీకరణ పేరుతో ప్రజలను మోసం చేయడమనేది జరుగుతున్నది. ఇలాంటి పరిస్థితులను చట్టపరంగా చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద లేదా? అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మెడికల్ ఎంప్లాయిస్, ఆర్టీసీ ఎంప్లాయిస్ రకరకాల ఉద్యోగులు అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. వీళ్లను రెగ్యులర్ చేయక పోవడం వలన వాళ్లు ఆందోళన చెందే పరిస్థితి ఉన్నది. కనీస వేతనాలకు సంబంధించి నిర్ణీతమైన సమయంలో జీఓలు కూడా రావడం లేదు. వచ్చిన జీఓలను అమలు జరిపే దాఖలాలు లేవు. లేబర్ డిపార్ట్‌మెంటు పూర్తిగా నిద్దర పోయింది. మంత్రి గారు యాక్టివ్‌గా ఉన్నారు గానీ వాళ్లు మాత్రం శవాల్లాగా నిద్రపోతున్నారు. ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణమనే విషయాన్ని నేను మనవి చేస్తున్నాను.

ఇవాళ భూమి సమస్యలు పరిష్కారం చేయడం లేదు. కోనేరు రంగారావు గారి నాయకత్వంలో ఏర్పడిన కమిటీ బ్రహ్మాండమైన సిఫారసులు చేసింది. కానీ ఆ కమిటీ సిఫారసులను అమలు జరిపే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదు. అటవీ హక్కుల చట్టం వంటి చట్టాన్ని అమలు జరిపే యంత్రాంగం వాళ్ల దగ్గర లేదు. ఇప్పటికే అనేక మంది అర్హత కలిగిన అడవుల్లో ఉండే గిరిజనులకు భూములు పంపిణీ చేయడంలో ఈ ప్రభుత్వం విఫలం చెందడం జరుగుతున్నది. అందువలన ఈ సమస్యలన్నీ ఒక భాగమైతే అన్నింటి కంటే ప్రధానంగా తెలంగాణా సమస్య అతి ముఖ్యమైనది. ఈ సమస్య పట్ల మన రాష్ట్ర ప్రభుత్వానికి గానీ కేంద్ర ప్రభుత్వానికి గానీ సరియైన దృష్టి లేదు. తెలంగాణా ఇచ్చేది మేమే, తెలంగాణా తెచ్చేది మేమే అన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణాకు ద్రోహం చేస్తున్నది. అనేక పోరాటాల ఫలితంగా అనేక కమిటీలు ఏర్పడ్డా అవి కాలయాపనకే సరిపోయాయి. సుశీల్ కుమార్ షిండే గారు నెల రోజుల్లో తెలంగాణా ఇస్తామని చెప్పి మాట తప్పడం జరిగింది. మాట తప్పిన ప్రభుత్వం ఆ మాటను ఏ విధంగా నెరవేరుస్తుందో చెప్పే పరిస్థితి లేదు. అప్పుడూ, ఇప్పుడూ అనే

కాలయాపన తప్ప ఈ సమస్యను పరిష్కారం చేసే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వెయ్యి మంది యువజన విద్యార్థులు తమ అమూల్యమైన ప్రాణాలను బలి దానం చేసుకున్నారు, ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంత ముఖ్యమైన సమస్య పైన మీ విధానమేమిటో స్పష్టంగా తెలిపే పరిస్థితి లేదు. దీని వలన ప్రజల్లో అశాంతి ఏర్పడింది. అందువలన తెలంగాణా సమస్య పరిష్కారం చేయవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం పైన ఉన్నది.

ప్రభుత్వం అనేక రకాల పన్నులు వేసి ప్రజలు గోళ్లు ఊడగొడుతున్నారు. పన్నులు వేయడమే కార్యక్రమంగా పెట్టుకున్నారు. వస్త్ర వ్యాపారులకు సంబంధించి వస్త్రాల పైన వ్యాట్ వేస్తున్నారు. వ్యాట్ పన్నులు వేస్తుంటే చిన్న చిన్న వర్తకులు తీవ్రమైన ఆందోళన చేస్తున్నారు. షాపులు బంద్ అయ్యాయి. అల్లకల్లోలమైన పరిస్థితి ఉన్నది. ఎవరి ప్రయోజనాల కోసం మీరు చేస్తున్నారు? కేవలం కాకులను గొట్టి గద్దలకు వేసే పాలసీ చేస్తున్నారు.

రా.7.30

ఇవాళ ఏదైతే ఎఫ్‌డిఐలనే పెట్టుబడులను, ఇక్కడ చిల్లర వ్యాపారాలకు వినియోగించే చట్టాన్ని తీసుకువచ్చారు. బహుళ జాతి సంస్థలు, బడా కార్పోరేషన్ సంస్థలు, విదేశీ సంస్థలు మన దేశంలోని చిన్న వ్యాపారులను దోచుకునేందుకు ఉపయోగపడే విధంగా ఈ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించడం జరిగింది. ఇలాంటి చట్టం రావడం వల్ల చిన్న వ్యాపారులు కూడా దివాళా తీసే పరిస్థితులు వున్నాయి. ఇవాళ మన అసెంబ్లీ విద్యుత్ కాంతులతో తళతళా మెరిసిపోతోంది. కానీ, గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ విద్యుత్ కొరత వుంది. వ్యవసాయానికి విద్యుత్ అందని పరిస్థితి వుంది. ఇవాళ రాత్రుల్లో వ్యవసాయానికి మూడు, నాలుగు గంటలు కరెంటు ఇస్తామన్నా, కనీసం రెండు గంటలు కూడా కరెంటు ఇవ్వలేని పరిస్థితులున్నాయి. ఇళ్లలో విద్యుత్ లేక చదువుకునే విద్యార్థులకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి వుంది. అది మీరు కూడా సూత్రబద్ధంగా అంగీకరించినా, దానికి ప్రత్యామ్నాయాలు మాత్రం ఆలోచన చేసే పరిస్థితిలో లేనటువంటి వాతావరణం వుంది. అందువల్ల ఈ విద్యుత్ సమస్యను, విద్యుత్ కోతను ఎత్తివేయడానికి, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి అదనపు విద్యుత్‌ని కొనుగోలు చేసేందుకు పూనుకోవాలి. ఇవాళ మన రాష్ట్రంలో పెద్ద, పెద్ద ప్రైవేటు విద్యుత్ సంస్థలు ల్యాంకో వంటివి వున్నాయి. ఇంకా అనేక కంపెనీలు వున్నాయి. ఇష్టమొచ్చినట్లు వేరే రాష్ట్రాలకు వాళ్లు విద్యుత్‌ని అమ్ముకుంటున్నారు. ముఖ్యమంత్రి గారు కూడా ఇక్కడే వున్నారు కాబట్టి వారిని డైరెక్టుగా అడుగుతున్నాను. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలను క్రమబద్ధీకరించే బాధ్యత మీకు లేదా? ఆ విద్యుత్‌ని మన అవసరాలకు వాడుకున్న తరువాతనే ఇతరులకు అమ్మాలనే నిబంధనను రూపొందించాల్సిన అవసరం లేదా? ఇవన్నీ కూడా మీరు అశాస్త్రీయంగా చేయడం వల్లనే సమస్యలనేవి వస్తున్నాయి. అందువల్ల ఆ విద్యుత్ కొరతలు నివారించి, విద్యుత్ కోతలు ఎత్తివేయాలని కోరుతున్నాను.

ఏప్రిల్, 1 వ తేదీ నుండి విద్యుత్ చార్జీలు పెంచి, రూ.13000 కోట్లు అదనపు భారం ప్రజల మీద మోపబోతున్నారు. దానికి ముఖ్యమంత్రి గారు ఏమంటున్నారంటే – విద్యుత్ చార్జీలు నేను పెంచడం లేదు. రెగ్యులేటరీ అథారిటీ కమిటీ వారు పెంచుతున్నారంటున్నారు. రెగ్యులేటరీ అథారిటీ కమిటీ ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నదా, లేక ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం పరిపాలిస్తున్నదా? నాకు తెలిసినంతవరకు కిరణ్ కుమార్ రెడ్డిగారి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలిస్తోందని అంటున్నాను. విశాల ప్రయోజనాల దృష్టితో ఈ రెగ్యులేటరీ అథారిటీ కమిటీ నిర్ణయాలను ప్రభుత్వం నిలుపుదల చేయించి, ప్రజల మీద రూ.13000 కోట్ల భారం ఏదైతే వేయబోతున్నారో, దాన్ని తగ్గించమని ఈ ప్రభుత్వాన్ని మేము ప్రధానంగా

డిమాండ్ చేస్తున్నాము. ఇవాళ మమ్మల్ని అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా బలవంతంగా నెట్టింది మీరేనని ఈ సందర్భంగా చెబుతున్నాను. మీరు అన్నీ మంచి పనులు చేసుంటే మేము ఎందుకు అవిశ్వాస తీర్మానం పెడతాము? ఈ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా టీడీపీ నుండి చంద్రబాబు నాయుడు గారు కూడా ముందుకు వస్తే మేము ఇంకా సంతోషంగా వుండే వాళ్లం. వాళ్లు ఇవ్వాళ కాకున్నా రేపు అయినా రావాల్సిన వాళ్లే. మ్యాచ్ ఫిక్సింగ్ వుందని అంటున్నా దాన్ని మేం నమ్మం. వీళ్లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కొట్లాడే వాళ్లే. కానీ ఎందుకో వెనుకబడి పోతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఇప్పుడు మిమ్మల్ని ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేకుండా చేసుకోవద్దని మనవి చేస్తున్నాను. మీరు ఈ విద్యుత్ పోరాటంలో, అవిశ్వాస తీర్మానంలో బలపరిచి.. పునరాలోచన చేసి ఈ ఉద్యమానికి సహకరించాలనే విషయాన్ని నేను వారికి విజ్ఞప్తి చేయడం జరుగుతోంది.

ప్రధానంగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయానికి వస్తే... ఇది వరకు తెలుగు దేశం వాళ్లు మా మిత్రులే. మా మిత్రపక్షం వారే. అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు మేం హృదయపూర్వకంగా వారికి మద్దతిచ్చాము. ఆ రకంగా మీరు కూడా మద్దతివ్వడం న్యాయమైంది. దీని మీద కాంట్రవర్సీ అవసరం లేదనే విషయాన్ని ఈ సందర్భంగా మనవి చేయడం జరుగుతోంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయానికి వస్తే దీన్ని సూత్రబద్ధంగా అందరం జాతీయ హోదా కల్పించాలని అంటున్నాము. మేము అంటున్నాము. అధికార పక్షం వాళ్లు కూడా సూత్రబద్ధంగా జాతీయహోదా కావాలంటున్నారు. జాతీయ హోదా కలుగకుండా, ఆ ప్రాజెక్టు పూర్తి కాగలదా సార్? తెలంగాణా ప్రజలకు గుండెకాయ వంటిది ఈ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు. తెలంగాణాకు గుండెకాయ వంటి ఈ ప్రాజెక్టు పట్ల పై పై పెదవుల ప్రేమ వద్దు. హృదయం నుండి ప్రేమ రావాల్సిన అవసరముంది. తెలంగాణా పది జిల్లాలకు ఉపయోగపడే ప్రాజెక్టుపైన మీరు ఇది వరకు వాగ్దానం చేశారు సార్. తమక్కూడా తెలుసు. ఒక అఖిల పక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానమంత్రి గారితోనూ, సంబంధిత యంత్రాంగంతో మాట్లాడతామని చెప్పారు. కానీ, అది జరగలేదు. ఆ సమస్యను పరిష్కరించే విషయంలో కూడా మీరు సంపూర్ణంగా పట్టింపు లేనట్టుగా అప్పుడప్పుడు స్టేట్‌మెంట్‌లు పంపుతూ వస్తున్నారు.

అయితే, నేను ప్రధానంగా మనవి చేసేదేమంటే... ఈ ప్రాణహిత-చేవెళ్లకు సంబంధించి జాతీయ హోదా కల్పించాలనే దాని మీద ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. దీని మీద మరింత పట్టుదలతో తమ మాటను నిలబెట్టుకోవాల్సిన అవసరముంది. అందువల్ల నేను మనవి చేసేదేమంటే.. ఆ రకమైనటువంటి ప్రయత్నం ఏమీ చేయనందువల్ల ఇవాళ ప్రత్యేకమైన పరిస్థితి వచ్చింది. ఇవాళ ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వున్నది. ఏవో మొన్న ఎలక్షన్స్ వచ్చాయి కాబట్టి, అన్నింటికీ ఎలక్షన్సే కొలబద్ధగా చూడడానికి వీల్లేదు. సహకార ఎన్నికల్లో గెలిచాము కాబట్టి మేం సాధారణ ఎన్నికల్లో కూడా మళ్లీ గెలుస్తామనే వాతావరణం వుండదు. రాజకీయాల్లో ఇవాళ్టి శత్రువులు, రేపటి మిత్రులు. ఇవాళ్టి మిత్రులు, రేపటి శత్రువులు. కానీ, మీకందరికీ మనవి చేసేదేమంటే మా అవిశ్వాస తీర్మానంలో మీరు ఓడిపోకపోయినా, 2014 ఎన్నికల్లో ప్రజలంతా మిమ్మల్ని ఓడించక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే మాత్రం, ఎవ్వరూ మిమ్మల్ని కొన సాగనిచ్చే పరిస్థితి లేదు. ఇదివరకు అనేక అవిశ్వాస తీర్మానాలు చూశాం. అందువల్ల మీరు ఈ ప్రజా సమస్యలను పరిష్కరించడంలోనూ, తెలంగాణా సమస్యను పరిష్కరించడంలోనూ, అవినీతి పరిపాలన సాగించడంలోనూ అగ్రభాగాన ఉన్నందువల్ల మీ ప్రభుత్వంపైన పెట్టిన ఈ అవిశ్వాస తీర్మానానికి మద్ధతు ఇస్తున్నాం, దీన్ని సమర్థిస్తున్నాం. అంతే తప్ప మరొకటి కాదనే విషయాన్ని చెబుతున్నాను.

శ్రీ ఇ. లక్ష్మీనారాయణ (నిజామాబాద్ - అర్బన్): అధ్యక్షా, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు ప్రభుత్వాలు వ్యవహరించవలసిన అవసరముంది. 2004, 2009 ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్ర సమితితో పొత్తు పెట్టుకుని, తెలంగాణా ఇస్తామని చెప్పి ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలోకి

వచ్చింది ఇదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. అధికారంలోకి వచ్చి, మళ్లీ 2009లో తెలంగాణా ఇస్తామని నమ్మబలికి తెలంగాణా అంశాన్ని ముందుపెట్టుకుని మళ్లీ అధికారంలోకి వచ్చి తెలంగాణా ప్రజలను నిలువునా మోసం చేసింది కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే. అధ్యక్షా, తెలంగాణా అంశం ఇవ్వాల్టిది కాదు. ఈ పోరాటం ఇవ్వాల్టిది కాదు. జవహర్ లాల్ నెహ్రూ గారు నాగార్జున సాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చినప్పుడు రాష్ట్రాల విలీనం ప్రస్తావన వచ్చినప్పుడు, తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాల విలీనం ద్వారా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన వచ్చినప్పుడు ఆ రోజే అక్కడ నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఆ రోజు జవహర్‌లాల్ నెహ్రూ

یہ معصوم بچی کا نکاح ہو رہا ہے، کبھی بھی طلاق لے سکتے ہیں۔

విడాకులు తీసుకోవచ్చు అని చెప్పడం జరిగింది. ఆ రోజున జవహర్‌లాల్ నెహ్రూ గారి నుండి, ఈ రోజు సోనియాగాంధీ గారి వరకు కూడా ప్రజలు పోరాటం చేస్తూనే వున్నారు. ఈ పార్టీ ప్రభుత్వాలు ఇంకా ఈ అంశాన్ని తేల్చక పోవడం వల్ల వెయ్యి మంది యువతీ యువకులు తెలంగాణా కోసం ప్రాణ త్యాగాలు చేశారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు. ఒక శ్రీకాంతాచారితో మొదలుపెట్టి, ఒక పోలీసు కృష్ణన్నతో మొదలుపెడితే, ఢిల్లీలో యాదవరెడ్డి వరకు బలిదానాలు చేశారు. అదే విధంగా తెలంగాణా కోసం ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే, ఉప ఎన్నికల్లో తెలంగాణా గెలవాలని, గెలిస్తే ప్రాణాలు బలిస్తానని చెప్పిన మెదక్ జిల్లా నాల్కల్ మండలం బసాపూర్ గ్రామానికి సంబంధించిన ఇషాంత్ రెడ్డి విషయానికి వస్తే ఉప ఎన్నికల్లో తెలంగాణా వాదం గెలిచిందనే ఆనందంతో తెలంగాణా ప్రజలు సంబరాలు చేసుకుంటున్న తరుణంలో, మైసమ్మ తల్లికి మొక్కుకున్న ఒక సోదరుడు, యువకుడు, విద్యార్థి ఇషాంత్ రెడ్డి తన ప్రాణాలను తెలంగాణా కోసం బలిపెట్టడం జరిగింది. నేను ఒక్కటే విషయాన్ని చెబుతున్నాను.

రా.7.40

నేను ఒక్కటే విషయం చెబుతున్నాను. తెలంగాణా వాదం గెలిస్తే ఆ తల్లి మైసమ్మకు తన ప్రాణాలను బలి ఇచ్చుకుంటానని చెప్పి తృణ ప్రాయంగా ప్రాణాలు అర్పించిన ఆ ఇషాంత్‌రెడ్డికి ఉన్న మాట మీద నిలబడే విధానంలో ఒక్క శాతం ఈ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు ఉంటే, తెలంగాణా కోసం ఈ వెయ్యి మంది యువతీయువకుల ప్రాణాలను బలి పెట్టాల్సిన అవసరం ఉండేది కాదు.

తెలంగాణా రాష్ట్రాన్ని ఎందుకు అడుగుతున్నామంటే, తెలంగాణా రాష్ట్రం వస్తే ఈ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది. రెండు రాష్ట్రాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతాయనే ఆలోచనతో ఆకాంక్షతో అడుగుతున్నాం. తెలంగాణా కోసం తీర్మానాన్ని పెట్టమని ప్రతి రోజు పోరాటాలను చేసినా కూడా, ఇచ్చిన మాటకు కట్టుబడి కనీసం తీర్మానం చేసి కూడా ఢిల్లీకి పంపించేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా లేదు. రాష్ట్రం పరిధిలో లేని ఎన్నో అంశాల పైన తీర్మానాన్ని చేసి ఢిల్లీకి పంపించలేదా? శాసన మండలికి సంబంధించి, దళిత క్రైస్తవులకు సంబంధించి, వర్గీకరణ విషయంలో తీర్మానం చేసి పంపించలేదా? అటువంటప్పుడు ఇక్కడ తీర్మానం చేసి ఎందుకు పంపించరని అడుగుతున్నాను? ప్రజలను నిలువునా మోసం చేసి, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కినట్లు వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి కొనసాగే నైతిక హక్కు లేదు.

మూడు చిన్న రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. ఒకచోట కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఒక దగ్గర ములాయంసింగ్ యాదవ్ గారి సమాజ్‌వాది పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఒక దగ్గర లాలుప్రసాద్ యాదవ్ గారి ప్రభుత్వం అధికారంలో ఉంది. వాళ్లు ఎన్నికల్లో హామీని ఇవ్వకపోయినా తీర్మానం చేసి పంపించడం

జరిగింది. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి ఒక్క బిల్లుతో మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ యొక్క రాష్ట్రాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న పరిస్థితి ఉంది. ఇక్కడ మనం కరెంటు కోసం కొట్టుమిట్టాడుతున్నాం. రాష్ట్రం అంధకారంలో సంక్షోభంలో మునిగిపోయే పరిస్థితి ఉంది. కానీ, ప్రక్కన ఉన్న చిన్న రాష్ట్రం చత్తీస్‌ఘడ్‌లో ఇరవై నాలుగు గంటలు కరెంటు ఇస్తున్నారు. ఆ ప్రక్కన ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మే నెల నుంచి పూర్తి స్థాయిలో ఇరవై నాలుగు గంటలు కరెంటును ఇచ్చే స్థితికి ఈరోజు ఎదిగారు.

చిన్న రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత అభివృద్ధి పథంలో ఎట్లా ముందుకు వెళుతున్నాయంటే, పౌరసరఫరాల విధానం క్రింద రూపాయికి కిలో బియ్యం పథకం ద్వారా నెలకు నాలుగు కిలోల బియ్యాన్ని ఇక్కడ మనం ఇస్తుంటే, నిన్న మొన్న చిన్న రాష్ట్రంగా ఏర్పడిన చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఎంత మంది కుటుంబంలో ఉన్నారనే విధంగా కాకుండా, ప్రతి కుటుంబానికి 35 కిలోల బియ్యాన్ని ఇస్తున్నారు. అలాగే వివిధ సరకులను కూడా సరఫరా చేస్తున్న స్థితిలో ఉన్నారు. చిన్న రాష్ట్రాలుగా ఉంటే అభివృద్ధి క్రమంలో ముందుకు వెళతామనే దానికి ఇది సంకేతం. సరకులను సరఫరా చేయడమే కాదు ఏటిఎం కార్డుల ద్వారా డబ్బును ఏ విధంగా తీసుకుంటామో అదే విధంగా రేషన్‌కార్డు ద్వారా సరకులను రేషన్ షాపుల నుండి తీసుకునే స్థితికి ఆ రాష్ట్రం ఏదిగింది.

విద్యుత్ విషయంలో అనేక ప్రతిపాదిత విద్యుత్ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. 2001వ సంవత్సరంలో రూ.2500 కోట్ల డెఫిసిట్‌లో ఉన్న గుజరాత్ రాష్ట్రం ఈరోజున రూ.700 కోట్ల లాభాల్లో ఉన్నది. ఇరవై నాలుగు గంటలు విద్యుత్‌ను సరఫరా చేసే స్థితికి ఎదిగింది. లక్ష కిలో మీటర్ల వైరింగ్‌ని వెయ్యి రోజుల్లో పూర్తి చేసే స్థితికి ఎదిగింది. సమర్థత కలిగిన పరిపాలన ఉండటం వలన పన్నెండేళ్ల కాలంలో యూనిట్ మీద ఒక్క పైసా కూడా పెంచకుండా గుజరాత్ రాష్ట్రంలో పూర్తి స్థాయిలో విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా లాభాలను కూడా ఆర్జించే స్థాయికి వారు ఎదిగారు. మన దగ్గర ఇంతకు ముందు కాల్చిన కరెంట్‌కు కూడా ఇప్పుడు సర్‌ఛార్జీల పేరుతో భారాన్ని మోపుతున్నారు. ఇప్పుడు ప్రతిపాదిత బిల్లులతో కలిపి మూడేళ్ల కాలంలో రూ.35000 కోట్ల భారాన్ని మోపుతున్నారు.

ఆ రాష్ట్రంలో రేటును పెంచకుండా సమృద్ధిగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. మన దగ్గర భారం మీద భారం మోపి విద్యుత్‌ను సక్రమంగా అందించలేని పరిస్థితి కొనసాగుతోంది. మొన్న శివరాత్రి పండుగ రోజున కరెంటు లేకపోవడం వలన నాలుగు గంటలకు మహిళలు దేవాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు అందిస్తున్న విద్యుత్ రెండు మూడు గంటలు కూడా సరఫరా చేయకపోవడం వలన వారు అనేక అవస్థలు పడుతూ, పంటలు ఎండిపోయి ప్రాణాలను తీసుకుంటున్న దుస్థితి దాపురించింది. ఇది సంపూర్ణంగా ప్రభుత్వం యొక్క పరిపాలనా వైఫల్యమే.

ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో తొమ్మిది గంటలు కరెంట్‌ని ఇస్తామని చెప్పారు. కరెంట్ సంక్షోభం రాత్రికి రాత్రి ఈ రోజున వచ్చింది కాదు. తొమ్మిది గంటలు విద్యుత్‌ని ఇస్తామని హామీనిచ్చినప్పుడు, ఆ హామీని నెరవేర్చుకోవడానికి అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసే విషయంలో, ఏ విధంగా ప్రాజెక్ట్‌లను పెట్టి ఆ విద్యుత్‌ను ఏ విధంగా ఉత్పత్తి చేయాలనే విషయంలో ఎందుకు ఆలోచన చేయలేదని అడుగుతున్నాను? శంకర్‌పల్లి విద్యుత్ ప్రాజెక్ట్ 1400 మెగావాట్లది, ఆ ప్రాజెక్ట్ 10 సంవత్సరాల నుండి ప్రక్కన పెట్టారు. 2100 మెగావాట్లకు సంబంధించిన నేదునూరు ప్రాజెక్ట్‌ను కూడా ప్రక్కన పెట్టారు. భూపాల్‌పల్లిలో ఉన్న విద్యుత్ ప్రాజెక్ట్ విస్తరణ పనులను కూడా ప్రక్కన పెట్టారు. ఈ విధంగా జెన్‌కోకు సంబంధించిన ప్రాజెక్ట్‌లన్నింటినీ ప్రక్కన పెట్టి, ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తున్నారు. జెన్‌కోకు సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం, నిర్వీర్యం చేస్తూ ఈ విధమైన సమస్యలకు కారణమైన ఈ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కు లేదు.

ఇంతకు ముందు జరిగిన చర్చలో గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ మెదక్ జిల్లాకు అనేక రకాలైన నిధులు వచ్చాయి అభివృద్ధి జరిగిందని చెప్పారు. నిజాం షుగర్స్ రూ.300 కోట్ల విలువైన ఫ్యాక్టరీని, 17000 ఎకరాల్లో ఉన్న ఫ్యాక్టరీని రూ.63 కోట్లకు అంటగట్టారు. 2400 మంది పని చేస్తుండగా 2000 మందిని ఆ ఫ్యాక్టరీలో నుండి పంపించేశారు. 2004 వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దానిని అక్రమంగా అమ్మేశారని 2006వ సంవత్సరంలో సభా సంఘాన్ని నియమించారు. ఆ సభా సంఘం వారు కొన్ని సిఫార్సులను కూడా చేశారు. ఆ సిఫార్సులు ఎటు పోయాయి? ఆ సిఫార్సుల అమలు కోసం కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా కూడా, ఆ సిఫార్సులు అమలుకు ఎందుకు నోచుకోవడం లేదు? ఆ ఫ్యాక్టరీని రూ.63 కోట్లకు అప్పగిస్తే కోర్టు అనుమతి లేకుండా రూ.270 కోట్లకు తాకట్టు పెట్టి అప్పులు తీసుకున్న పరిస్థితి ఉన్నది. ఆ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికులకు సంబంధించిన అయిదు కోట్ల రూపాయలను విత్‌హెల్డ్ పేరు మీద డిపాజిట్ చేసుకున్న డబ్బులను కూడా మెక్కేశారు. ఆ రోజు ఎకరం ధర రూ.5,00,000 ఉంటే 170 ఎకరాల భూమిని రూ.50,000 చొప్పున ధారదత్తం చేశారు. ఇప్పుడు ఆ భూమి ధర ఎకరం రూ.50,00,000 ఉంది.

రా.7.50

పేదవాడికేమో డబ్బులివ్వరు. విత్‌హెల్డ్ పేరు మీద డిపాజిట్ చేసుకున్న డబ్బును కూడా మెక్కేశారు. 170 ఎకరాల భూమికి సంబంధించి ఆరోజు అక్కడ ఎకరం రూ.5,00,000/- విలువ ఉంటే కేవలం రూ.50,000/-లకే ఎకరం చొప్పున బడా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి కరవు ప్రాంతానికి నీరు తరలిస్తే మాకు అభ్యంతరం లేదు. 280 కిలో మీటర్ల కృష్ణానది తీరమున్న మహబూబ్‌నగర్ జిల్లాకు గానీ, నల్గొండ జిల్లాకు కాని తాగునీరు కూడా అందించలేని దుస్థితి ఉన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో సారవంతమైన భూములున్నప్పటికీ సాగునీరు లేక బీడు భూములుగా మారడం మూలంగా ఆ జిల్లా ప్రజలు వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తున్నది. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో కూడా ప్రమాదం జరిగి కూలీలు మరణించారంటే వారు కూడా మహబూబ్‌నగర్ జిల్లా వాసులే అని చెప్పడానికి నేను బాధ పడుతున్నాను. ఈ జిల్లాకు నీరు అందుబాటులో ఉన్నప్పటికీ నీరు అందకపోవడం చాలా బాధాకరమైన విషయం.

అప్పర్ కృష్ణా ప్రాజెక్టును ఇప్పుడు ఆల్‌మట్టి ప్రాజెక్టుగా పిలుస్తున్నారు. ఆ ప్రాజెక్టు నుంచి పాలమూరు జిల్లాకు సాగునీరు వచ్చే యోగ్యముండగా ఎందుకు రాలేదనే విషయం మనందరం ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. అప్పర్ కృష్ణా ప్రాజెక్టునుంచి సింగూర్ డ్యాంకు నీరు వస్తే సింగూర్ డ్యాం నుంచి మెదక్ జిల్లాకు, నిజామాబాద్ జిల్లాలకు తాగునీరు అందించే అవకాశముండేది. ఈ విషయంలో ప్రభుత్వం సంపూర్ణమైన వివక్షతతో వ్యవహరిస్తున్నది.

కరెంట్‌కు సంబంధించి తెలంగాణ ప్రాంతంలోని రైతుల విషయంలో 60% పంపుసెట్లకు, బోరు బావులకు ఏడు గంటలకంటే తక్కువ కరెంట్ సప్లై చేస్తున్నారు. ప్రాంతాల మధ్య వివక్ష చూపకుండా రాష్ట్రమంతా ఒకే విధంగా చూడాలని నేను మీద్వారా కోరుతున్నాను. మిగతా ప్రాంతాలలో 3% పంపుసెట్లకే ఏడు గంటల కరెంట్ సప్లై చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఆత్మహత్యల నిరోధానికి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. పేద ప్రజలు రూ.3/- వడ్డీ చొప్పున రూ.1,25,000/-లను వెచ్చించి గల్ఫ్ దేశాలకు వెడితే అక్కడ వారికి ఉద్యోగం దొరకక అప్పులబారిన పడి వారు స్వదేశానికి తిరిగొచ్చి పునరావాసం లేని స్థితిలో ఉంటే వారికి పునరావాసం కల్పించే విషయంలో ఈ ప్రభుత్వం సంపూర్ణంగా వైఫల్యం చెందడమే కాకుండా అన్ని రంగాలలోనూ వైఫల్యం చెందిందని తెలియజేస్తున్నాను.

ఈ మధ్యనే దిల్‌సుఖ్‌నగర్‌లో జంట బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ రకమైన ఘటనలు మొదటిసారిగా జరిగినవి కావు. గతంలో జరిగిన సంఘటనలకు ప్రమేయం ఉన్న వారి విషయంలో ఇప్పటివరకు ఎంత మందిని అరెస్టు చేశారని అడుగుతున్నాను. ఇతర రాష్ట్రాల పోలీసులు మన రాష్ట్రానికొచ్చి ఉగ్రవాద సంబంధాలున్నవారిని అరెస్టు చేయాల్సిందే తప్ప ఇక్కడ సమర్థవంతమైన పోలీసు యంత్రాంగం ఉన్నప్పటికీ ఎందుకు వారిని సమర్థవంతంగా వినియోగించుకోవడం లేదని అడుగుతున్నాను. ప్రజా జీవితంలో ఉన్న వారు ఉగ్రవాదంతో సంబంధాలు ఉన్న వారితో వారి ఇళ్లలోకి వెళ్లిన దాఖలాలు లేవా అని అడుగుతున్నాను. శాంతిభద్రతలకు సవాలుగా పరిణమించిన విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండి సంపూర్ణంగా వైఫల్యం చెందినందుకే ఈ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానానికి మా పార్టీ సంపూర్ణమైన మద్ధతు తెలియజేస్తున్నది.

శ్రీ జె.రంగారెడ్డి (మిర్యాలగూడ)ః అధ్యక్షా, ఈ ప్రభుత్వంపైన రెండవసారి అవిశ్వాస తీర్మానం పెట్టే పరిస్థితి రావడం చాలా దురదృష్టకరం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో, వాటిని అమలు చేయడంలో విఫలం అవుతున్నది. అధిక ధరలను అదుపు చేసే విషయంలో, రైతులు, ప్రజలకు అవసరమయ్యే కరెంట్ సరఫరా చేసే విషయంలో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచడం, ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కారం చేసే విషయంలో ఈ ప్రభుత్వం విఫలమయింది కాబట్టే అవిశ్వాసాన్ని మేం బలపర్చడం జరిగింది. ముఖ్యంగా నిత్యావసరాల ధరలను అడ్డూ అదుపూ లేకుండా ఒకసారి కేంద్ర ప్రభుత్వం మరొకసారి రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్నది. దీనివల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువులు కొనుక్కోలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆదాయం మాత్రం పెరగడంలేదు కానీ నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం పెరుగుతున్నాయి. విద్య, వైద్యం, కరెంట్ మొదలైన వాటి మీద చార్జీలు విపరీతంగా పెరుగుతున్నందున సామాన్య మానవుడు జీవనం కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజల ఆదాయం పెరగకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న ధరలను అదుపు చేసే విషయంలో ప్రభుత్వం ఏ రకమైన చర్యలు తీసుకోలేకపోతున్నందున మేం నిరసన వ్యక్తం చేస్తున్నాం.

విద్యుత్ చార్జీల విషయానికొస్తే, ముందు విద్యుత్ కోత, తర్వాత చార్జీల మోత. 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్‌ను ఇస్తామని చెప్పారు కానీ తొమ్మిది గంటలు కాదు కదా కనీసం ఏడు గంటల కరెంట్ కూడా ఇచ్చే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులలో కేవలం మూడు, నాలుగు గంటలకంటే ఎక్కువ కరెంట్ సప్లై చేయలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నది. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో అర్థం కాని విధంగా ఉన్నది. రాత్రి పూట రైతులు పొలాల దగ్గర కాపలా పడుకునే పరిస్థితులలో పాము కాటుకు గురవుతున్నారు, ఒక్కొక్క సారి కరెంట్ ఒకేసారి హైఓల్టేజీ రావడం మూలంగా ఎంతో మంది రైతులు చనిపోతున్నారు. చెరువుల్లో, డ్యాముల్లో నీరు లేక కొద్దో గొప్పో పంటలు వేసుకుంటే కరెంట్ కోత వల్ల అవి కూడా ఎండిపోతున్నాయి. కరెంట్ గురించి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గృహాలకు కూడా కరెంట్ సరిగా సరఫరా చేయలేకపోతున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు కరెంట్ లేక కిరసనాయిల్ దీపాలు, క్యాండిల్స్ పెట్టుకొని చదువుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. కరెంట్ కోత ఒకవైపైతే చార్జీల మోత ఇంకొకవైపు. ఇప్పటివరకు చార్జీల రూపంలో పెంచినవి, పెంచబోయేవి సుమారు రూ.35,000 కోట్లు సర్దుబాటు పేరుతో ప్రజల మీద భారం వేయడానికి ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. కరెంట్ చార్జీలు పెంచొద్దు, మేం ఇప్పటికే భారం మోయలేని పరిస్థితిలో ఉన్నామని ప్రజలు, పార్టీలు ఉద్యమాలు చేస్తుంటే మీరెన్ని ఉద్యమాలు చేసుకోండి, మాకు సంబంధం లేదన్నట్లుగా ఈ

ప్రభుత్వం దఫ దపాలుగా కరెంట్ చార్జీలను పెంచడానికి సిద్ధంగా ఉన్నది. ఇప్పటికే సుమారుగా రూ.35,000 కోట్లు కరెంట్ చార్జీల రూపకంగా పెంచడానికి ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటికే కొంత అమలు చేశారు, మిగతాది కూడా అమలు చేయడానికి పూనుకుంటున్నారు. ఈ ప్రభుత్వం ప్రజల మీద భారం వేయడానికి ఏ మాత్రం వెనుకాడకుండా వ్యవహరించడం సరైన పద్ధతి కాదు కాబట్టే ఈ అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం.

రా.8.00

అనేక పార్టీలు, ప్రజలు ఉద్యమాలను కరెంటు చార్జీల పెంపు విషయంలో నడిపిస్తుంటే, మీరు ఏ ఉద్యమాలైనా నడిపించుకోండి, ప్రజలు ఎన్ని కష్టాల్లో ఉన్నా ప్రభుత్వానికి ఏమీ పర్వాలేదు కానీ కరెంటు చార్జీలు మాత్రం పెంచి తీరుతుందీ ప్రభుత్వం అనే దోరణిలో ప్రభుత్వం ఆ అంశాన్ని ఒక చాలెంజ్‌గా తీసుకొని మరీ బరితెగించి దఫా దఫాలుగా కరెంటు చార్జీలు పెంచేందుకు గాను ఇప్పటికే సుమారుగా రూ.35,000.00 కోట్ల మేరకు కరెంటు చార్జీల పెంపుదల చేసే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే కరెంటు చార్జీల పెంపును కొంత మేరకు అమలుచేయడం జరిగింది. మిగిలిన కొంచెం కూడా పెంచుతూ ప్రజలపైన భారం మోపే ప్రయతాన్ని కూడా ఈ ప్రభుత్వం చేస్తోంది. ప్రజలకు అనుకూలమైన ఆలోచనను ఈ ప్రభుత్వం చేస్తోందని భావించాలా, లేక ప్రజలకు వ్యతిరేకమైన ఆలోచనను ప్రభుత్వం చేస్తున్నట్టుగా మనం భావించాలా? ప్రజల పైన భారం మోపడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ప్రజలపైన భారం వేయడానికి ఏ మాత్రం ఈ ప్రభుత్వం వెనకాడే పరిస్థితి కనబడకుండా పోతోంది. అందుకనే, ప్రభుత్వ విధానం సరైనది కాదని భావించే, మేం ఈ యొక్క అవిశ్వాస తీర్మానాన్ని బలపర్చడమనేది జరుగుతోంది.

అదే విధంగా కరువు విషయానికొస్తే, రాష్ట్రంలోని అనేక జిల్లాల్లోని అనేక మండలాల్లో కరువు ఉంది. కానీ, ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లోని మండలాలనే, కొన్ని ప్రాంతాలనే కరువు ప్రాంతాలుగా గుర్తించింది. మా నల్లగొండ జిల్లా విషయానికొస్తే, కేవలం 13, 14 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కానీ, జిల్లా మొత్తం కరువు పరిస్థితిని ఎదుర్కొంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా కరువు ప్రాంతాలు ఎక్కడెక్కడున్నాయో, ఆ ప్రాంతాలను సరైన పద్ధతిలో ఐడెంటిఫై చేసి, ఆ యా ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించాలి. ఆ విధంగా ప్రకటించడంతో పాటు కరువు సహాయక చర్యలను కూడా చేపట్టాల్సిన ఆవసరం ప్రభుత్వానికి ఉంది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నుండి కరువు నిధులను రాబట్టే ప్రయతాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చేయాలి. కేంద్ర ప్రభుత్వం పైన బలమైన ఒత్తిడిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలి. అట్లాగే, రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా కొంత మేరకు నిధుల్ని కేటాయించి, కరువు ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకొనేందుకు అవసరమైన కరువు సహాయక చర్యలను చేపట్టాలి. కానీ, కరువుకు గురైనటువంటి ప్రజలను ఆదుకునే విషయంలో గానీ, కేంద్ర ప్రభుత్వం నుండి కరువు సహాయక నిధుల్ని రాబట్టే విషయంలో గానీ, రాష్ట్ర ప్రభుత్వం నుండి కొన్ని నిధుల్ని కేటాయించి, కరువు బాధితులకు సహాయాన్ని అందించే విషయంలో కూడా ప్రభుత్వం సరైన పద్ధతుల్లో వ్యవహరించడం లేదనే మేము భావిస్తున్నాం. ప్రజల్లో కూడా ఆ రకమైనటువంటి అభిప్రాయమే ఉంది.

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ప్రజలు సుమారుగా 80 శాతం మంది ఉన్నారు. వెనుకబడిన వర్గాలు రాష్ట్రంలో రెండు కోట్ల మంది ఉన్నారు. చేతి వృత్తిదారులు కూడా ఉన్నారు. వారి అభ్యున్నతికి గాను బడ్జెట్‌లో రూ.229.00 కోట్లు కేటాయించి, ఇప్పటి వరకు ఒక పైసా కూడా ఖర్చు చేయనటువంటి పరిస్థితి ఉంది. రెండు కోట్ల జనాభా ఉన్నటువంటి ఈ బలహీన వర్గాలకు సంబంధించి, చేతి వృత్తిదారుల సంక్షేమం గురించి ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.229.00 కోట్లే తక్కువ. ఆ మొత్తం ఇంతవరకు ఎందుకు ఖర్చు చేయలేదో

ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఆ యా వర్గాల ప్రజలు ఏ రకంగా ప్రభుత్వాన్ని ఆదరిస్తారో కూడా ఒకసారి ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. అందుకే రెండు కోట్ల మంది వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కొరకు నిష్పత్తి ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించి, సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్‌లో కేటాయించినటువంటి మొత్తాన్ని వేరే ఇతర అవసరాలకు వాడుకోకుండా, వారి సంక్షేమం కొరకే ఖర్చు చేసేటటువంటి పద్ధతుల్లో ఈ ప్రభుత్వం వ్యవహరించడం లేదు. అందుకొరకే మేం ఈ అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తున్నాం.

అదే విధంగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేసేటటువంటి ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5.25 శాతం వరకు ఉన్నారు. సుమారు ఐదున్నర లక్షల మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఈనాడు సుమారుగా నాలుగున్న లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం ఉంది. కానీ, కాంట్రాక్ట్ పద్ధతిన, ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఐదున్నర సంవత్సరాల కాలం నుండి, పది, పదహేను సంవత్సరాల కాలం నుండి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనాలు లభించడం లేదు, ఇ.ఎస్.ఐ. సదుపాయం లేదు, చట్టపరమైనటువంటి హక్కులు వారికి వర్తించవు. వారికి మామూలు వేతనాలు చెల్లించడం జరుగుతోంది. గ్రామ పంచాయతీల్లో, మునిసిపాలిటీల్లో, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో మిగితా అన్ని ప్రభుత్వ శాఖల్లో వారి సేవలను వినియోగించుకుంటూ, ఆ యా వర్గ ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి నాలుగున్నర లక్షల ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేసే ఉద్యోగులతో భర్తీ చేసినట్లైతే, అందరికీ న్యాయం జరుగుతుంది. ఆ విషయంలో కొన్ని సంవత్సరాల నుండి పోరాటం చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారు. ప్రతి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయడం జరుగుతుందనే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేసి న్యాయం చేస్తామనే హామీని ఇచ్చింది కానీ, ఇంతవరకు ఆ యా ఉద్యోగులను పర్మనెంట్ చేయలేదు. ఆ విధంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నటువంటి ఐదున్నర లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉద్యోగులు పర్మనెంట్ కాకపోవడంతో, అరకొర వేతనంతో విధులు నిర్వర్తిస్తూ ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి కనబడుతోంది. ఆ విషయంలో కూడా ప్రభుత్వం వారికి ఇచ్చినటువంటి వాగ్దానాన్ని నిర్వర్తించలేకపోతోంది. అదే విధంగా పట్టణ ప్రాంతంలో గానీ, గ్రామీణ ప్రాంతంలో గానీ పేద ప్రజలు ఇళ్ల స్థలాలు లేనందువల్ల, ఇండ్లు లేక మరుగుదొడ్ల సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి కనబడుతోంది. ప్రభుత్వం అమలుచేస్తోన్న రచ్చబండ అనే కార్యక్రమం ద్వారా ప్రజానీకం మౌలిక వసతి సదుపాయల నిమిత్తం కుప్పలు కుప్పలుగా దరఖాస్తు చేసుకోవడం జరిగింది. రచ్చబండ కార్యక్రమంలోనే గాకుండా ఇంకా ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ప్రజానీకం దరఖాస్తు చేసుకోవడం జరిగింది. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో గానీ, పట్టణ ప్రాంతాల్లో గానీ నివసిస్తోన్న పేద ప్రజానీకానికి అవసరమైన ఇళ్ల స్థలాలు గానీ, పక్కా గృహాలు గానీ, దళిత వాడల్లో నివసిస్తోన్న పేద ప్రజానీకానికి అవసరమైన మౌలిక సదుపాయలను కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయింది.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు: సార్, రచ్చబండ కార్యక్రమంలో పేద ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు ప్రభుత్వం వద్ద నిల్వలో ఏమి లేవు. ఎప్పటికప్పుడు దరఖాస్తులు పరిష్కరించబడినవి.

శ్రీ జూలకంటి రంగారెడ్డి: అన్ని విషయాలను గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రస్తావిస్తారు. సమాధానం వారే చెబుతారు. దయచేసి తమరు కూర్చోండి సార్. పేద ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో కుప్పలు

కుప్పలుగా ప్రభుత్వంలో నిల్వలో ఉన్నాయని నేను ఘంటాపథంగా చెబుతున్నాను. అవసరమనుకుంటే జిల్లా కలెక్టర్ వారి కార్యాలయాల్లో విచారించండి. వాస్తవం మాకు తెలుసు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అనేక మంది పేద ప్రజలు వేలాది, లక్షలాది దరఖాస్తులు ప్రభుత్వాధికారులకు వివిధ సమస్యలపైన సమర్పించారు. ఇళ్ల స్థలాల గురించి, పక్కా గృహాల గురించి, నివాస స్థలాల్లో మౌలిక సదుపాయాలు లేక, మరుగుదొడ్లు గానీ, కరెంటు గానీ, మంచి నీరు గానీ, రోడ్ల సౌకర్యం గానీ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నట్టుగా అనేక పర్యాయాలు ప్రభుత్వాధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ, ప్రభుత్వ స్పందన కరువైంది. అక్కడక్కడ కొన్ని సమస్యలను పరిష్కరించవచ్చు. కానీ, అర్హులైన పేదల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడం జరుగుతోంది. అనేక పర్యాయాలు గతంలో పేదల సమస్యలను గురించి సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగింది. కానీ, ఈ సమస్యలు సమస్యలుగానే మిగిలి పోతున్నదే తప్ప, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించిన దాఖలాలు కనిపించడం లేదు. పేద వాడు కనీసం ఈ భూమి మీద, ఈ గడ్డ మీద పుట్టినందుకు గాను ఒక గుడిసె వేసుకునేందుకు,ఒక గది నిర్మించుకోవడానికి అవసరమైన ఏడు గజాల స్థలాన్ని ఇవ్వడం ప్రభుత్వానికి చేత కాదు. అదే విధంగా పేద వాడు చనిపోయిన తరువాతనైనా పూడ్చి పెట్టడానికి కనీసం ఏడు అడుగుల స్థలాన్ని ఇవ్వడానికి కూడా ఈ ప్రభుత్వానికి చేత కాదు. బతికినంత కాలం గుడిసె వేసుకోవడానికి పేద వాడికి ఏడు గజాల స్థలం గానీ, చనిపోయిన తరువాత ఏడు అడుగుల స్థలాన్ని కూడా ఇవ్వలేనటువంటి పరిస్థితి నెలకొని ఉంది. పేదవాడు చనిపోతే, ఎక్కడ పూడ్చి పెట్టాలనే విధంగా శవాన్ని ముందుంచుకొని ఒకరోజంతా కూడా ఆలోచన చేసే పరిస్థితి పేద ప్రజానీకానికి ఉంది. నేను వాస్తవ పరిస్థితిని చెబుతున్నాను. కావాలంటే, జిల్లా కలెక్టర్ల ద్వారా ఆ విషయమై నివేదికలు తెప్పించుకొని పరిశీలించండి. వాస్తవం తెలుస్తుంది. ప్రభుత్వం ఆ విషయంలో సరైన శ్రద్ధ వహించడం లేదు కాబట్టే, చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించే ఆలోచనను చేయడం లేదు కాబట్టే, ఆ యా వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అదే విధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్. ఆ అంశంలో ఆ యా వర్గాల ప్రజలు అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిపిన ఫలితంగానే ప్రభుత్వం ముందుకు వచ్చింది, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. ఆ ఉప ప్రణాళిక అమలుకు అవసరమైన నిధుల్ని బడ్జెట్ నందు కేటాయించి, పటిష్టంగా అమలుపర్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరముంది. చ ట్టబద్ధత కల్పన తరువాత ఇంతవరకు ఆ దిశగా ప్రభుత్వం పయనించిన దాఖలాలు కనబడడం లే దు. తద్వారా ఆ యా వర్గాల ప్రజలు కూడా ఆందోళనకరంగా ఉన్నారనే విషయాన్ని ప్రభుత్వం గమనించాలి.

అదే విధంగా జలయజ్ఞం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి ఎకరాలకు సాగునీటిని అందిస్తామని చెప్పింది. ఇప్పటి వరకు సుమారు రూ.70,000 కోట్లు ఖర్చు చేసింది. రూ.70,000 కోట్లు కూడా ప్రజా ధనమే. ప్రజల మీద పన్నులు వేసి, అప్పులు తీసుకొచ్చినటువంటి డబ్బు అది. ఆ విధమైన ప్రజా ధనాన్ని ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమంగా ఖర్చు చేసి, ప్రజా ధనం దుర్వినియోగం జరిగిందనే విషయాల్ని గురించి సభలో, బయట మనం అనేక పర్యాయాలు మాట్లాడుకోవడం జరిగింది. కోటి ఎకరాలకు గాను ఇప్పటి వరకు ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు, ప్రాజెక్టుల ద్వారా తాగు నీటిని ఎన్ని కోట్ల మందికి అందించారనే విషయాల్ని ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. వాస్తవాన్ని దాచిపెట్టి, గౌరవ సంబంధిత శాఖ మంత్రి సాగునీటిని ఇన్ని లక్షల ఎకరాలకు అందించాలనే ప్రయత్నం చేశాం, అందిస్తున్నామనే విధంగా చెబుతున్నారు. కానీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి వేరే విధంగా ఉంది. రూ.70,000 కోట్లు ప్రజా ధనం సాగునీటి ప్రాజెక్టుల

నిర్మాణంలో ప్రభుత్వం ఖర్చు చేసి, కనీసం ఏడు లక్షల ఎకరాలకైనా సాగునీరు అందించే పరిస్థితి లేదనేదే మా భావన. ఎక్కడ కూడా ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా సంపూర్ణంగా పూర్తయినటువంటి పరిస్థితి లేదు. కొన్ని ప్రాజెక్టులు సగంలో, మరి కొన్ని ప్రాజెక్టులు పది, ఇరవై, నలభై, యాభై, అరవై శాతం మేరకు ఎక్కడికక్కడే పనులు జరిగి, నిలిచి పోయినాయి తప్ప, కేవలం ఒకటో, రెండో, మూడో ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో పనులు పూర్తికాబడినాయి. కానీ, సంపూర్ణంగా పూర్తి స్థాయిలో సాగుకు నీరు అందించే పరిస్థితి కనబడడం లేదు. జల యజ్ఞం పేరుతో సాగిస్తున్న ప్రాజెక్టులు వెనుకబడినటువంటి ప్రాంతాల్లో, ప్రాధాన్యతా క్రమంలో ఎక్కడైతే సాగునీరు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో, ఆ ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి, అవసరమైన మేరకు నిధుల్ని కేటాయించి, సత్వరమే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినట్లైతే, ప్రజలకు న్యాయం చేకూరుతుంది తప్ప, గొప్పకు పోయి కోటి ఎకరాలకు సాగునీటిని అందిస్తామని, లక్ష కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని చెబుతున్నటువంటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదనే వాస్తవాన్ని గమనించాలి. రూ.1,00,000 కోట్లు ప్రజా ధనమైతే ఖర్చు అయిపోతోంది కానీ, సాగునీరు అందించే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. నల్లగొండ జిల్లా విషయంలోనైతే పదహేను సంవత్సరాల నుంచి పెండింగ్ ప్రాజెక్టుల పేరుతో నిర్మాణం మందపాడిగా సాగుతోంది. పెండింగ్ ప్రాజెక్టులనే పేరుతో ఆ ప్రాజెక్టులు నల్లగొండ జిల్లాలో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో శ్రీరాంసాగర్ సెకండ్ స్టేజి పనులు పూర్తికావడం లేదు, అదే విధంగా ఎస్.ఎల్.బి.సి. ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టు పూర్తికాదు, తరువాత వరద కాలువ పూర్తికాదు, ఆధునీకీకరణ పేరుతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కెనాల్స్ అన్ని కూడా మాడ్రనైజేషన్ పేరుతో పనులు అసంపూర్ణంగా జరుగుతున్నాయి. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులుగా అవి మిగిలిపోతున్నాయి. వేల కోట్ల రూపాయల ఖర్చుతో పాటు అప్పు పెరిగిపోతోంది, వడ్డీలు పెరిగిపోతున్న పరిస్థితి కనబడుతోంది. అందుకనే, జలయజ్ఞం పేరుతో జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత శాఖ మంత్రి గారు రివ్యూ చేయడం జరుగుతోంది. ముఖ్యమంత్రి గారు కూడా అవసరమైన మేరకు తగినంత శ్రద్ధ పెట్టి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోతున్నారు. కాబట్టే, ఆ ప్రాజెక్టుల క్రింద ఉన్నటువంటి ప్రజలు, రైతాంగం ఎప్పుడు ఆ యా ప్రాజెక్టులు పూర్తయితాయని ఎదురుచూస్తున్నటువంటి పరిస్థితి కనబడుతోంది. అందుకే ఈ ప్రభుత్వం పైన ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని మేం బలపరుస్తున్నాం.

రా.8.10

ప్రాజెక్టుల పేరుతో జరిగే కార్యక్రమాలపై తగిన శ్రద్ధపెట్టి ముఖ్యమంత్రిగారు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నప్పటికీ రైతాంగం అంతా ఎప్పుడెప్పుడు ప్రాజెక్టులు పూర్తి చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయనందుకు మేము అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తున్నాము.

గతంలో ఎన్నడూ లేని రాజకీయ అనిశ్చిత పరిస్థితి నేడు నెలకొని ఉంది. నెలరోజుల పాటు ఒక ప్రాంతానికి చెందిన మంత్రులు విధులకు హాజరు కాలేదు, 42 రోజులపాటు ఒక ప్రాంతానికి చెందిన ప్రభుత్వోద్యోగులు వారి విధులకు హాజరు కాలేదు. ప్రస్తుతం కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా నేడీ పరిస్థితులు నెలకొనటానికి కారణాలు ఏమిటనీ ఈ రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రాంతాలవారిగా ఎంఎల్ఏలు, మంత్రులు విడిపోయి రాష్ట్ర అభివృద్ధి మరచి, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నందున అనేక రంగాల్లో ఈ రాష్ట్రం వెనుకబడిపోతోంది. ప్రతిరోజూ వందల, వేల మంది పోలీసుల పహారాలో సచివాలయం, శాసనసభా సచివాలయ, కార్యాలయాలు జరుపుకొనే పరిస్థితి నెలకొని ఉంది. ఈ నష్టం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరి లేకుండా నాన్పుడు ధోరణితో వ్యవహరిస్తోందన్న కారణంగా మేము ఈ అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తున్నాము.

ఇటీవలి కాలంలో హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబు బ్లాస్టింగ్‌లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు, మరికొందరు కాళ్లు ,చేతులు కోల్పోయి వికలాంగులైనందున, రాష్ట్రంలో ఇంటెలిజన్స్ నిఘా పోలీసుల సంఖ్యా మరింతగా పెంచి అత్యధిక రద్దీ కూడళ్లలో సిసి/నిఘా కెమోరాలు ఏర్పాటు చేసి భవిష్యత్‌లో అలా జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడే విషయంలో, ఉగ్రవాద చర్యలు అరికట్టుటలో ప్రభుత్వం విఫలమైనందున మేము ఈ రోజు అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నాము. భూ ఆక్రమణలను అరికట్టడం, రాష్ట్ర ఖనిజ సంపదను/గనులను కాపాడానికి ప్రత్యేకించి కమిటీ ఏర్పాటు చేస్తామని గత శాసనసభలో ముఖ్యమంత్రిగారు చెప్పారు, కానీ ఇంత వరకు అమలు కాలేదు.

బడ్జెట్ కేటాయింపులు మేరకు ముఖ్యంగా పేదలకు కేటాయిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిధులు దారి మళ్లుతున్నందున మేము అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తున్నామని ఈ సందర్భంగా తెలియపర్చుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: స్థాయి సంఘాలు ఏర్పాటు చేసింది అందుకోసమే రంగారెడ్డిగారు.

డా. జయప్రకాష్ నారాయణ్: ఈ సభ తీవ్రమైన సంక్షోభంలో, ఒక అసాధారణ సందర్భంలో, ఈ చర్చ జరుపుకుంటున్నది. ప్రభుత్వ సంఖ్యా బలానికి లోటు లేదు, కానీ రెండేళ్లుగా ఈ అంశం మీద సమర్థవంత మైన చర్చ జరగలేదు. కేవలం సంఖ్యా బలంతో స్థిరత్వం రాదు. ఈ వేళ అస్థిరత్వం జరగడానికి కారణం గతంలో జరిగిన కొనసాగుతున్న తప్పిదాలు. ఈ ప్రభుత్వానికి సంఖ్యా బలం ఉన్నప్పటికీ పెత్తనం చేస్తున్నది తప్ప పరిపాలన చేయలేక పోతున్నది. అధికారం కోసం ప్రాకులాడుతున్నారు. అధికారమనేది మార్గం కాకుండా లక్ష్యమై పోయింది. ప్రజా సంక్షేమం లక్ష్యంగా ఉండటం లేదు. ఈ సంక్షోభానికి వెనుక ఉన్న ప్రధాన కారణమే అది. ప్రజలను పౌరులుగా గాక కేవలం ఓటువేసే యంత్రాలుగా మనం చూస్తున్నాం. సమాజాన్ని మొత్తం సమన్వయం చేసి కులం, మతం, భాషా, ప్రాంతం, సంకుచితత్వం లేకుండా అందరికీ న్యాయం చేస్తామన్న విశ్వాసాన్ని కలిగించలేకపోతున్నాం. అందుచేతనే ఎన్నోరకాల ఉద్యమాలు, ఆందోళనలు, అశాంతి ప్రబలి పోతుంది. ఈ కారణాలుగా మన రాజకీయలు కానీ, చట్ట సభలు కానీ, ప్రభుత్వం కానీ, ప్రజల దృష్టిలో నగుబాటైపోతున్నాయి. ప్రజాస్వామ్యం ఒక అపురూపమైన, అత్యంత సంక్లిష్ట మైన వ్యవస్థ. అధ్యక్షా మీ వెనుక జాతిపిత బాపూజీ చిత్రపటం ఉంది. ఆయన తరం నాయకులంతా కూడా అచంచలమైన విశ్వాసంతో ప్రపంచంలో ఎవరు చేయని సాహసానికి ఒడికట్టారు. స్వతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లోఆడ, మగ, కుల, మత, ధనిక, పేద తేడా లేకుండా, నిరక్ష్యరాశ్యులకు సైతం ఓటు హక్కు ఇచ్చిన మొట్టమొదట దేశం భారతదేశం. ఆనాటి వారి ఆశయం నమ్మకం ఈ స్వపరిపాలన సార్థకమౌతుందని.

రాష్ట్రంలో గత 57 సంవత్సరాల్లో 40 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ రాజ్యమేలింది. దేశంలో గత 65 సంవత్సరాలో 54 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ రాజ్యమేలింది. ప్రజాస్వామ్యాన్ని ఏమి సార్థకం చేశాం. ఆంధ్రప్రదేశ్‌లో ఈవేళ చట్టసభలో ఉన్న సంక్షోభం పూర్తిగా గతంలో మనం చేసిన పాపాలవల్ల వచ్చిందని గుర్తించకపోతే, గతకాలపు విధానాలు,పద్ధతులు, చర్చలు/అలవాట్లే కొనసాగినట్లైతే ఎన్ని ప్రభుత్వాలొచ్చినా ఈ సంక్షోభం పెరుగుతుంది, ఈ జాతికే ముప్పుగా పరిణమిస్తుంది. గొప్ప ఆదర్శంతో ఆశతో ఆనాడు మన జాతి నిర్మాతలు వివక్ష లేని సమాజాన్నందిస్తామని, పేదరికాన్ని అంతం చేస్తామనీ, ఎదిగే అవకాశాన్ని అందరికి కల్పిస్తామని ప్రజలిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేస్తామని కోరుకొని ప్రజాస్వామ్యాన్ని మనకిస్తే అధికార కాంక్షతో ప్రజాప్రతినిధులున్నారు.

సగటున మన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఒక్కో ప్రధాన పార్టీ అభ్యర్థి ఐదు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. కొందరు పది/ పదిహేను కోట్లు ఖర్చుపెడుతున్నారు.

రా.8.20

సంక్షోభానికి మూలమైన కారణాలున్నాయి. మన రాష్ట్ర బడ్జెటును పరిశీలిస్తే సగటున రోజుకు రూ.400 కోట్లు ఖర్చుపెడుతున్నాం. బహుశా రాబోయే రెండు రోజులలో ఆర్థిక మంత్రి గారు ప్రవేశ పెట్టబోయే బడ్జెటులో ఈ అంకె ఇంకా పెరుగుతుంది. సామాన్యుడికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే గౌరవం ఇస్తారు, నాకు సేవలు అందుతాయి, పది సార్లు పనుల కోసం తిరగక్కర్లేదు, లంచం ఇవ్వక్కర్లేదు, ఎవరి సిఫార్సులు అవసరంలేదు, యం.ఎల్.ఏ గారి కాళ్లు పట్టుకోనవసరంలేదు అని పార్టీలకు అతీతంగా ఏ ఒక్క పౌరుడికీ కూడా అలాంటి భరోసా లేదు. రూ.400 కోట్లు ఖర్చు పెడుతున్నా వస్తున్న ఫలితమిది. మనం 21 శతాబ్దంలో ఉన్నాం, శాసన సభలో అరుదుగా చర్చ జరుగుతుంటే, చివరికి సభలో కూడా కొద్ది సమయం విద్యుత్తు పోయింది, ఇది సిగ్గు పడాల్సిన విషయం. పరిశ్రమలు పెడితే, ఉత్పత్తి చేస్తే, ఉపాధి కల్పిస్తే, ఎందుకు విద్యుత్తు ఇంతవరకు ఇవ్వలేదని, పెనాల్టీ వేస్తాం అనే పరిస్థితి 2013వ సంవత్సరంలో రాబోతుందని చెప్పాల్సి వస్తోందంటే మనం ఇన్నేళ్లుగా చేసిన పాపాల భారం ప్రస్తుతం జాతి మొత్తం మోస్తున్నది. ఇక అవినీతి విషయానికి వస్తే సభలో ఇరు పార్టీల మధ్య వాగ్యుద్ధాలు జరిగాయి, గత మూడు సంవత్సరాలనుంచి కూడా జరుగుతున్నాయి.

నేను ప్రధానంగా మనవి చేయదలుచుకున్నది ఏమిటంటే 'past sins cast long shadows' గత కాలపు పాపాల నీడ ప్రస్తుత సమాజాన్ని, తరాన్ని ఖచ్చితంగా ప్రభావితం చేస్తుంది. విష బీజాల నుండి అమృత ఫలాలు రావు. మనం నాటే విత్తనాలు మంచివి కాకుంటే, మంచి ఫలాలు రావు. ఇవాళ విద్యుత్తు కొరత ఉందన్నా, సంఖ్యా బలమున్నా రాజకీయ అస్థిరత్వం ఉందన్నా, అవినీతి కొనసాగుతుందన్నా, ప్రజలకు కనీస పనులు జరగటం లేదన్నా, చట్టబద్ధ పాలన కరువైందన్నా, గూండాలు స్వైర విహారం చేస్తున్నారన్నా, ఇవన్నీ గతకాలపు పాపాల పర్యవసానమే. ఇప్పటికైనా ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే నిజాయితీగా చర్చ జరగాలి. సంక్షోభం ఏర్పడిన సమయంలో ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యంలో ప్రజలు తీర్పు ఇస్తారన్న నమ్మకం ఉండేది, ఆ విశ్వాసం కూడా ప్రస్తుతం లేదు. అందుకే ఈ పరిస్థితులు మారకుంటే ఈ సభలో ఉన్న మనం కానీ, ప్రభుత్వం కానీ, పార్టీలు కానీ తీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో సంక్షోభం మరింత ముదురుతుంది, సంక్షోభం నుంచి గట్టెక్కే పరిస్థితులు లేకుండా, వచ్చే శాసన సభ మరింత గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటుంది. లోతుగా, నిజాయితీగా మనం చర్చించుకోవాలి. ఈ రోజు అవిశ్వాసంపై తప్ప మిగతా విషయాలలో చర్చ జరగడంలేదు. గవర్నర్ ప్రసంగం మీద కానీ, బడ్జెటు మీద కానీ చర్చకు అవకాశమే లేని విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. విధానాల మీద విపులంగా, లోతైన అవగాహనతో ఒక సమగ్రమైన చర్చ జరుగుతుందని, పరిష్కారం అన్వేషిస్తామని నేను నిజంగా ఆశించాను. కానీ ఈ రోజు చర్చలో నాకనిపించింది ఏమిటంటే, వేడి బాగా తాకింది వెలుతురు తగ్గింది.

ప్రభుత్వం పాత్ర పన్ను డబ్బును సద్వినియోగం చేయాలి, ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రజలకు సేవలందించాలి, చట్టాలను సమగ్రంగా ఏర్పాటు చేయాలి. విధానాలను సరిగ్గా రూపొందించాలి. ఈ నాలుగింటిలో కూడా ప్రభుత్వాలు విఫలమయ్యాయి, ఈ ప్రభుత్వం కూడా విఫలంతో ఇంకా కొనసాగుతూనే ఉంది. అసలు ప్రభుత్వ పాత్ర ఏమిటి? ప్రభుత్వం పాత్ర గూర్చిన అవగాహన సభలో లేకపోతే ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోతే, ఇప్పుడు ఉన్నట్టుగానే ప్రజలను బిచ్చగాళ్లుగా చూసే సంస్కృతి, తాత్కాలిక తాయిలాలిచ్చి రాష్ట్ర భవిష్యత్తును ప్రమాదంలో పడేసే సంస్కృతిగా తయారవుతుంది. ప్రజలను ముక్కలు,

ముక్కలు చేసి కులాల పేరుతో, మతాల పేరుతో, ప్రాంతాల పేరుతో, భాష పేరుతో, సమాజాన్ని నిట్ట నిలువునా చీల్చే సంస్కృతి ఏర్పడగలదు. ఓటును కొనుగోలు చేసి రాజకీయ వ్యాపారం చేసే సంస్కృతి కొనసాగినంత కాలం సంక్షోభం తగ్గదు, అస్థిరత్వం పోదు. ప్రభుత్వం ప్రధానంగా చేయవలసింది చట్టబద్ధ పాలన. ప్రస్తుతం "బడితె ఉన్న వాడిదే బర్రె అయిపోయింది" అన్నట్టుంది.

ఎప్పటి నుండో స్థానికంగా కోర్టులను ఏర్పాటు చేయండి డబ్బులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని చెపితే కూడా, మూడు సంవత్సరాలుగా కేసులు త్వరగా పరిష్కారం అవడానికి కోర్టులను ఏర్పాటు చేసే సమర్థత కూడా ప్రభుత్వానికి లేకపోయింది. ఇక పరిపాలన ఎక్కడ ఉంది? పెత్తనముందా, పాలన ఉందా? పోలీసు యంత్రాంగం పూర్తిగా ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తడానికి తప్ప, నిజాయితీగా, నిష్పక్షికంగా నేర పరిశోధన జరుగుతుంది, ధైర్యంగా చర్య తీసుకుంటుందనే విశ్వాసం పొరపాటున కూడా కలుగడం లేదు. ఉన్న పోలీసు యంత్రాంగం చాలదు, ఉన్న కొద్దిపాటి పోలీసు యంత్రాంగం కూడా నేర పరిశోధన, ప్రజల రక్షణపై దృష్టి సారించకుండా ఇతర పనులపై నిమగ్నమైనారు. ఉన్న వారికి స్వయం ప్రతిపత్తి లేదు, వనరులూ లేవు.

మౌలిక సదుపాయాలలో విద్యుత్తు రంగం లేనిదే పారిశ్రామీకీరణ, ఆధుకీకరణ, ఆర్థికాభివృద్ధి లేదు. రాష్ట్రాన్ని అంధకారంలో ముంచాం. మూడున్నర సంవత్సరాల క్రితం ఇదే శాసన సభలో రాజశేఖర రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, సభాపతిగా ప్రస్తుత ముఖ్యమంత్రిగారు ఉన్నప్పుడు, తమరు ఉప సభాపతిగా ఉన్నప్పుడు నేను చాలా స్పష్టంగా చెప్పాను, కావాలంటే మీరు నోట్ చేసుకోండి. ఇప్పటి మూర్ఖపు విధానాలు, అసంబద్ధ విధానాలు కొనసాగితే రాష్ట్రం మూడు సంవత్సరాలలో అంధకారమవుతుందని చెప్పాను. ఇవాళ అధికార పక్షం వారు చాలా అకస్మాత్తుగా, అశ్చర్యకరంగా అనుకోని రీతిలో వచ్చిన ఉపద్రవాల వల్ల మేం సమస్యలలో చిక్కుకున్నామని చెపుతున్నారు. మెడమీద తల ఉన్న ప్రతి ఒక్కరికి, చిత్తశుద్ధి ఉన్న ప్రతి ఒక్కరికి, ఎన్నికల గాలం వేయకుండా రేపటి భవిష్యత్తును కాపాడలాన్న కోరిక ఉన్న ప్రతి ఒక్కరికి, ఈ రాష్ట్రం మీద మమకారం కలిగి, వచ్చే తరం వారినైనా కాపాడాలని కోరుకునే ప్రతి ఒక్కరికి అర్థమయ్యేదేమిటంటే, ఇది ఈ రోజు వచ్చిన సమస్య కాదని, ఏళ్ల తరబడి సమస్యను సృష్టించారు. దానికి మీరు బలైపోతున్నారు, రాష్ట్రాన్ని బలి చేస్తున్నారు.

మంచి విద్యను అందిచకపోతే పేదవారు అనుభవిస్తున్న పేదరికం పోదు, ఏమిచ్చి వారి పేదరికం తొలగిస్తారు? 30 సంవత్సరాల క్రితం ఒక ప్రభుత్వం కిలో బియ్యం మూడు రూపాయలకి ఇస్తామని చెప్పింది. కిలో బియ్యం ఒక్క రూపాయికి ఇస్తామని మరొక ప్రభుత్వం చెప్పి, పార్టీలకు అతీతంగా ప్రజలను నిరంతరం బిచ్చగాళ్లుగా, అడుక్కుతినే వారిగా ప్రయత్నం చేస్తున్నారు. తలెత్తుకొని బ్రతికే అవకాశాలు లేకుండా చేసి, సరైన సంపాదన లేకుండా చేసి, మేము గొప్పంటే, మేము గొప్పని చెపుతున్నారు. వారు సంపాదించిన దాంట్లో కొంచెమే పంచి పెట్టి, మిగతాది దోచుకొనే ప్రయత్నం చేసి, వారు ఎదిగే అవకాశం లేకుండా చేయడం పరిపాలనా? నా గుండె మండుతుంది. అన్ని పార్టీలు ఈ పాపంలో భాగస్వాములయ్యాయి. ఈ సమాజాన్ని ఎంత కాలం మోసం చేస్తాం, ఇలా చేస్తే సంక్షోభం ఎందుకు రాదు? తాత్కాలికమైన తాయిలాల నుంచి బయటపడతామా? ఈ సమాజం భవిష్యత్తు కోసం, అందరికి ఎదిగే అవకాశాల కోసం, వివక్షలేని సమాజం కోసం, చట్టబద్ధ పాలన కోసం, మౌలిక సదుపాయాల కోసం, ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తామా అనేది తేల్చుకోవాలి.

ఇవాళ రాజకీయంలో మూడే అంశాలున్నాయి. అయితే ఓట్ల కొనుగోలు, ఓట్ల కొనుగోలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరితేరింది. దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ విషయంలో భారత దేశానికే మార్గం చూపెడుతోంది. దురదృష్టవశాత్తు మిగతా రాష్ట్రాలు కూడా దాన్ని చాలా వేగంగా అందుకుంటున్నాయి. ఈ

విధమైన చర్చలు లేకుండా దీర్ఘకాలిక అంశాలను ప్రస్తావించి, బీదలను ఆదుకోవడం కోసం తాత్కాలికంగా కొన్ని పనులు చేస్తామని అంటారేమోనని ఆశించాను. పేదరికాన్ని శాశ్వతంగా పెంచే, తాత్కాలికమైన తాయిలాలను గూర్చి తప్ప, దీర్ఘకాలిక పథకాలను గూర్చికానీ, విద్యను గూర్చికానీ, విద్యుత్తును గురించి గానీ, మౌలిక సదుపాయాలను గురించి కానీ, ఉపాధి కల్పనను గూర్చి కానీ, ఆర్థికాభివృద్ధి గూర్చి కానీ పొరపాటున ఒక్క మాట అనే సాహసంలేదు ఈ సభలో. అదీ చెల్లక పోతే, సమాజంలో విభజన. అంత్యంత సంక్లిష్టమైన సమాజం కాబట్టి, కులాల పేరుతో, మతాల పేరుతో, భాషల పేరుతో, ప్రాంతాల పేరుతో, ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి వైవిధ్యమైన సమాజం కాబట్టి దాన్ని సమన్వయం చేసే విధంగా కాకుండా, సామరస్యంగా అందరికి ఆమోదాన్నిచ్చే పరిష్కారం కాకుండా ఈ పూట ఎన్నికల్లో ఎలాగోలా మేము నెగ్గితే చాలు, సమాజం స్మశానమైనా పరవాలేదనే దుర్మార్గపు సంస్కృతి వల్ల ఈ వేళ ఈ పరిస్థితి దాపురించింది.

రా.8.30

రాష్ట్రంలో తెలంగాణ సమస్య ఒక కీలకమైన సమస్యగా మారింది. చరిత్ర ముందు కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా దోషిగా నిలబడి తీరుతుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు. దేశంలో 54 ఏళ్ల పాటు అధికారంలో ఉండి, 40 ఏళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉండి ఇంత కాలం ఎందుకు ఉపేక్షించవలసి వచ్చింది. తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను ఎందుకు బలి చేశారని అడగుతున్నాను. భవిష్యత్తు తరాల వారికి ప్రస్తుత ప్రభుత్వం ఏం చేయబోతుంది. ప్రభుత్వానికి సంఖ్యా బలం ఉన్నా కనీసం చర్చ కూడా చేపట్టలేకపోయారు. సభలో గవర్నర్ ప్రసంగం కూడా జరగనీయకుండా, బడ్జెట్‌ని సభలో ప్రవేశపెట్టడానికి మార్షల్స్ సహాయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని అడుగుతున్నాను. సభలో బడ్జెట్ మీద చర్చను జరిపించలేని పరిస్థితులను తీసుకువచ్చిందెవరు.

శ్రీ ద్రోణం రాజు శ్రీనివాసరాజు: అందుకు కారణం ప్రభుత్వమంటారా?

డా. జయప్రకాశ్ నారయణ్: ఖచ్చితంగా మీ ప్రభుత్వమే కారణం. శ్రీనివాస్ గారు. చరిత్ర ముందు కాంగ్రెస్ పార్టీ దోషిగా నిలబడి తీరుతుంది. నేను ఏది కూడా నిరాధారంగా, ద్వేషంగా మాట్లాడను. ఆలోచనతో మాట్లాడుతున్నాను. దేశ సమగ్రత కోసం పోరాడవలసిన పార్టీ, ఆంధ్రప్రదేశ్‌ని సమన్వయం చేయవలసిన పార్టీ, ఈ దేశంలో గొప్ప ఫెడరల్ వ్యవస్థను నిర్మాణం చేసిన పార్టీ, ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన పార్టీ, గొప్ప రాజ్యాంగాన్నిచ్చిన పార్టీ మీ ఓట్ల బేరం కోసం, తాత్కాలిక ప్రయోజనాల కోసం, ఏ పద్ధతైనా ఫరవాలేదు, ఇవాళ ఒక మాట – రేపు ఒక మాట, ఈ రోజు ఒక కులం – రేపు ఒక కులం, ఈ ప్రాంతంలో ఒక మాట – ఆ ప్రాంతంలో ఒక మాట, ఈ ప్రాంతంలో సభ్యులొక మాట – ఆ ప్రాంతంలో సభ్యులొక మాట, ఈ విధమైన మూర్ఖపు విధానాలను అవలంభిస్తూ, రేపు అన్నది లేకుండా చేయడం వలన ఈ రోజున ఈ సమస్య వచ్చింది. మిమ్మల్ని అనుకరించి, కొంతమంది తప్పులు చేశారు. కానీ ఈ దేశానికి పెద్దన్న కాంగ్రెస్ పార్టీయే కదా.

అధ్యక్షా, About the Dove, రెండవ ప్రపంచ యుద్ధం నాటి మాట. హిట్లర్ దురాగతాల తర్వాత ప్రపంచమంతా నిశ్చేష్టమైతే డౌవ్ ఒక మాట అన్నాడు. 10 కమాండమెంట్స్ కాదు, 3 కమాండమెంట్స్ కావాలి. Dove shall not be a perpetrator. దుర్మార్గాన్ని నేను చేయను. Dove shall not be a victim. దుర్మార్గానికి నేను బలి పశువుని కాను. Above all Dove shall not be a bye-stander. అన్నింటిని మించి నేను మౌన ప్రేక్షకుడిగా కూర్చోను.

అధ్యక్షా, ఈ రోజున సభని నిర్వీర్యం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? అధికారం కొంత మంది చేతుల్లో పెత్తనంగా మార్చేసి, ఏం చేస్తున్నారో, ఎవరికీ తెలియకుండా, అంతా రహస్యంగా చేస్తూ, ఒక జాతి భవిష్యత్ నిర్ణయం ప్రజల చేతుల్లో కాకుండా, ప్రజల చేత ఎన్నుకోబడిన సభ చేతుల్లో కాకుండా, నిజాయితీ అనే చర్చ లేకుండా, రోజుకో మాట, గంటకో మాట తప్ప, అసలు ఈ రాష్ట్ర భవిష్యత్ ఎమిటి? ఫెడరల్ వ్యవస్థ భవిష్యత్ ఎమిటి? రాజ్యాంగ భవిష్యత్ లేకుండా చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? స్వార్థ ప్రయోజనాలను ఆశించి, ప్రస్తుతం పరిస్థితులు బాగున్నాయి కదా అని అనుకోవచ్చు, పదవులను చూసుకొనో, తల్లిదండ్రుల కృషి వలనో, అధికారం వలనో, తెలివితేటల వలనో, మన శ్రమ వలనో మనం డబ్బులు సంపాదించుకున్నాం, సమాజం ఏమైపోయినా ఫరవాలేదని అనుకోవచ్చు. 'నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష' అనుకుంటే అది ఎల్లవేళలా కొనసాగదు. ప్రజాస్వామ్య సమాజంలో ఎక్కడ ఏ గుండె మండినా, ఎక్కడైనా ఎవరికైనా అన్యాయం జరిగినా, నేడో, రేపో దాని ప్రభావం ఖచ్చితంగా అందరి మీద ఉంటుంది. అందుకే అధ్యక్షా, వ్యవస్థే నాశనం అయితే, రాష్ట్రమే సర్వనాశనమైతే, సమాజమే శ్మశానమైతే, చివరకు మనలను కాపాడే వారు ఎవరూ ఉండరని పాస్టర్ నీమోలర్ చెప్పాడు. మన సంపద, అధికారం, పోలీసులు, ఎవరూ కూడా మనలను రక్షించలేరు. దాని పర్యవసానం మనమే అనుభవిస్తాం. అందుకనే ఇప్పటికైనా మనం కళ్లు తెరవాలి. పరిష్కారాలు లేకుండా లోక్‌సత్తా ఒక్కటీ ప్రస్తావించదు. తొమ్మిది, పదేళ్ల క్రితమే విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు జరిపి ఫలితాలను చూపించాం. ప్రభుత్వంతో పోరాడి పశ్చిమ గోదావరి జిల్లాలో కళ్ల చెరువులో ఒక సబ్ స్టేషన్‌ను ఫ్రాంచైసింగ్‌గా తీసుకుని అధికారం లేకున్నా, అధికారంలో ఉన్న అవినీతిపరులు అడుగడుగునా అడ్డుపడినా నిజాయితీగా అక్కడ ఏం చేయగలమో చేసి విద్యుత్ డిస్ట్రిబ్యూషన్‌లో 18 శాతం విద్యుత్‌ను ఆదా చేయగలిగాం. ప్రతి కనెక్షన్‌కి మీటర్ ఇప్పించగలిగాం. నూరు శాతం ఎనర్జీ ఆడిటింగ్ చేశాం. విద్యుత్ ఒడిదుడుకులు రాకుండా ఒక్క మోటార్ కూడా కాలిపోకుండా చేశాం. ప్రజలకు సేవలు త్వరితగతిన అందించగలిగాం. అవినీతిని నిర్మూలించగలిగాం. మంచి విధానాలను రాష్ట్రమంతా అమలు చేయండి, పంపిణీ వ్యవస్థను అభివృద్ధి పరచండని చెప్పాం. అగ్రికల్చరల్ ట్రాన్స్‌ఫార్మర్‌లను వేరు చేయాలి. గ్రామాల్లో సైతం వ్యవసాయేతర విద్యుత్‌ను 24 గంటలు ఇవ్వగలగాలి. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం చేయగలిగింది, మన రాష్ట్రంలో చేయలేమా? విద్యుత్ సరఫరా లేక లక్షలాది మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యుత్ విషయంలో వినియోగదారుడి మీద వేస్తున్న, సర్ చార్జీలు, పెనాల్టీలు, ఇతర రేట్లు కలిపితే ఈ రోజున యూనిట్ ఎనిమిది, తొమ్మిది రూపాయలకు తగ్గటం లేదు అధ్యక్షా. "No power is costlier than no power". విద్యుత్‌ను అధిక ధరకు వెచ్చించి కొనుగోలు చేసే కంటే విద్యుత్ లేకపోవడమే మంచిది. యూనిట్ విద్యుత్ రూ.9/-లు అవుతుందనే సాకుతో విద్యుత్ కోతలతో ప్రజలకు నరకం చూపెడుతున్నారు, రాతియుగంలోకి తీసుకుని వెళుతున్నారు. 2004వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చినప్పుడు విద్యుత్ మీటర్లు పెట్టమని వారికి సూచించాను. ఎనర్జీ ఆడిటింగ్ చేయమని చెప్పాను. పొదుపు మార్గాలను అన్వేషించమని సూచించాను.

MR. SPEAKER: Please conclude.

డా. జయప్రకాశ్ నారయణ్: పార్టీలు చేసిన దుర్మార్గం వలన, పొరపాటు విధానాల వలన ఈ రోజున రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షోభంలో కూరుకుపోయింది. ఎంతో చరిత్ర ఉన్న పార్టీ, పటిష్టమైన పునాదులున్న పార్టీ సంక్షోభంలో ఎందుకు పడవలసి వచ్చింది? మీరు ఎప్పుడైతే తాత్కాలిక ప్రయోజనాల కోసం, జాతి ప్రయోజనాలను పణంగా పెట్టారో, ఈ రోజున ఏకు మేకై కూర్చున్నది. గతంలో మీరు చేసిన పాపాలు ఈ రోజున మీకు శాపాలుగా మారాయి. ఉత్తరప్రదేశ్‌లో, బీహార్‌లో, బెంగాల్‌లో, తమిళనాడులలో రెండు జాతీయ పార్టీలు అంతర్థానమైపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాల వలన ఆ పార్టీ మనుగడకే ముప్పు వాటిల్లబోతోంది. నేను జాతీయ పార్టీలు బలంగా ఉండాలని కోరుకునే వాడిని. పార్టీలకతీతంగా జాతీయభావం లేకపోతే, జాతీయ పార్టీ లేకపోతే దేశం విచ్ఛిన్నమవుతుందని భయపడేవాడిని. మంచి

మనసుతో తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియచేస్తున్నా మీ పరిపాలనపై ఆత్మావలోకనం చేసుకోండి. ఇప్పటికైనా చిత్తశుద్ధితో పరిపాలన చేయమని, చేసిన తప్పులను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను కనుగొని, ప్రజల ముందుకు వెళ్లండి. అలా కాదని అధికారమే లక్ష్యంగా కొనసాగినట్లైతే రాష్ట్రం, దేశం అధోగతిపాలవుతుందని తెలియచేస్తున్నాను.

రా.8.40

విద్యుత్ రంగంలో చూసినట్లయితే, అసంబద్ధమైన పథకాలు కనబడుతున్నాయి. దాదాపు 8,000 మెగావాట్ల విద్యుత్తు వ్యవసాయానికి అదనంగా ఇస్తారట. ఉట్టికెక్కలేనిది స్వర్గానికి ఎక్కిందట. విద్యుత్‌ని రేపు నాశనం చేద్దామనే ఉన్నారు. ఎక్కడి నుండి ఇస్తారు? ఎంత ఖర్చు అవుతుందో మాట్లాడారా? ఏ విధంగా ఇస్తారనే ప్రత్యామ్నాయాన్ని ఆలోచించారా? ఏదో విధంగా ప్రజల నమ్మకాన్ని ఆసరాగా తీసుకొన్నారు. ప్రజలకి మాట్లాడే శక్తి లేదు, ఈ రోజుకి డబ్బులు, బ్రాంది తీసుకొని ఈ పూట గడిచిందని అనుకుంటున్నారు. దాదాపు 10 సంవత్సరాల క్రిందట నేను చెప్పాను, మూడు సంవత్సరాల క్రిందట కూడా నేను చెప్పాను. చెబుతూ ఉన్నాను. ఇలాగే కొనసాగితే 10 సంవత్సరాల తరువాత రాష్ట్రంలో ఇదే జరుగుతుంది, ఈ రాష్ట్రం పూర్తిగా అంధకారం అవుతుంది. ఇప్పటికయినా కళ్లు తెరవమనండి.

వ్యవసాయం గురించి బోలెడు చెబుతున్నారు. గత సంవత్సరం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు నేను, వ్యవసాయ రంగంలోని కొందరు నిపుణులు, లోక్‌సత్తా పార్టీకి సంబంధించిన వారు, ఇతర మిత్రులు కలిసి పక్క రాష్ట్రంలో రేటు ఉందని చెప్పాము. అక్కడ వెళ్లి అమ్ముకునే హక్కు లేకుండా చేసిన రైతుని ఇక్కడే ఉంచి బిచ్చగాడిలాగా మారుస్తుంటే, దమ్ముంటే పక్క రాష్ట్రాలకు వెళ్లి అమ్ముకోండని, కర్నూలు నుండి కర్ణాటకకి, నిజామాబాద్ నుండి నాందేడ్‌కి పంపించండని చెప్పాము. కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఎసెన్షియల్ కామాడిటీస్ ఆక్ట్ క్రింద ఆహారధాన్యాలను ఎక్కడయినా అమ్ముకోవచ్చునని చెప్పి ఏ రకమైన ఆంక్షలు లేకుండా చేసినప్పుడు, వీధి రౌడీలుగా ఈ ప్రభుత్వం వ్యవహరించిందని ఈ సభలో చెబుతున్నాను.

శ్రీ ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి : అధ్యక్షా, ప్రజలను కించపరచే విధంగా డబ్బులతో ఓట్లు వేశారు. బ్రాందీ త్రాగి ఓట్లు వేశారని అంటున్నారు. ప్రజలకి విలువ లేదా? వీరికి ఒక్కరికే తెలివి ఉందా? ఈ రాష్ట్రంలో వీరొక్కరే మేధావా? ఈ ప్రవర్తన, మాటలు ఏమిటి? మనమంతా ప్రజలచే ఎన్నుకోబడుతున్నాము. వారిని గౌరవించడం నేర్చుకోవాలి. శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్ వరకూ ఉన్న ప్రజలు అందరూ ఒకే విధంగా ఉన్నారని ఎలా ఆలోచన చేస్తాము. ప్రజలు అమ్ముడు పోయేవారా? ప్రజలు ఏమయినా వస్తువా? ఈ విధంగా కించపరచడం మంచిది కాదు. ప్రజాస్వామ్యంలో ఈ విధంగా ప్రజలను కించపరచ రాదు.

MR.SPEAKER: You have to conclude. I am giving the mike to please conclude. There are others also to speak.

డా. జయప్రకాష్ నారాయణ్ : ప్రజాస్వామ్యాన్ని గురించి, జనహితాన్ని గురించి, ప్రజల హక్కులను గురించి వారు చెప్పారు. సంతోషం. నిజంగా ప్రజలంటే అంత గౌరవం, నమ్మకం ఉంటే ఎందుకు ఇంకా పేదరికాన్ని పోగొట్టే కార్యక్రమాలు చేయడం లేదు.

( అంతరాయం )

ఉన్న మాటంటే ఎందుకు ఉలిక్కి పడుతున్నారు. విద్యుత్ విషయంలో స్పష్టంగా చెప్పాను. ఓట్ల కోసం డబ్బులు ఖర్చు పెడుతున్నారు, వాస్తవం కాదా? ప్రజలను మోసం చేస్తున్నారు. నేనేమైనా అబద్దాలు సృష్టించానా?

( అంతరాయం )

నేను దేనిని జనరలైజ్ చేయను. పరిష్కారం లేకుండా విమర్శించడం లేదు. ఆనాడు ఒక్క పంటకు ఒక సీజన్‌లో రేటు కోసం పోరాడడం అందరం చూసాము. రూ.750 ధాన్యం బస్తాకి ధర ఉన్నప్పుడు ఏమి జరిగిందో అందరికి బాగా తెలుసు. ఈ రాష్ట్ర ప్రభుత్వం పంటలకు రేటు తెచ్చే విధానం కాకుండా ఒక పంటకు వేలాది రూపాయల నష్టాన్ని తెచ్చిపెడుతోంది.

( అంతరాయం )

MR.SPEAKER: You have to regulate your time. I have been repeatedly advising you to please conclude.

శ్రీ డి నాగేందర్ : అధ్యక్షా, జయప్రకాష్ నారాయణ్ గారు మేధావి. కాదని చెప్పడం లేదు. విద్యుత్ సంక్షోభం మీద చెప్పారు. దాని ఉత్పత్తి గురించి మాట్లాడారు. దీనికి బీజం ఎక్కడ పడిందో చెప్పాలి. ఈ విద్యుత్ సంక్షోభం విషయంలో విమర్శించారు. ముఖ్యమంత్రి గారు పూర్తి సమాచారం ఇచ్చారు. మేము ఏమనుకున్నామంటే, మిగతావారు రాజకీయంగా మాట్లాడుతున్నారు. వీరు బాగా మాట్లాడతారని భావించాము. అయితే వీరు కూడ మాట్లాడుతూ, ఈఈఈ *** అని అన్నారు. We never expected this kind of comments from him. రెండవ విషయం, ప్రజలను బిచ్చగాళ్లలాగా భావిస్తూ మాట్లాడారు. అది చాలా దురదృష్టకరం. పలు అంశాలకు సంబంధించి ఈ విధమైన పరిష్కారం చేయాలని సూచిస్తారని ఆశించాము. రైతులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి ఈ విధంగా చేయాలని చెప్పాలని ఆశపడ్డాము. అలా సూచించడం లేదు. వారు కొద్దిగా హుందాగా మాట్లాడితే బాగుంటుంది.

( అంతరాయం )

MR.SPEAKER: What is this? Please relax. Jayaprakash Narayan Garu, please conclude. I have to regulate time.

డా. జయప్రకాష్ నారాయణ్ : అధికారం లేకుండానే చేసి చూపించాము. నాగేందర్‌గారిని వినాలని తమద్వారా కోరుతున్నాను. వ్యవసాయంలో రేటు రాకుండా చేస్తే ఎలా అని చేసి చూపించాము. మార్కెటింగ్ సెస్ వందల కోట్లు వసూలు చేస్తున్నాము. శాసన సభ్యులను, రాజకీయాలలోని కొందరు సభ్యులను మార్కెటింగ్ కమిటి ఛైర్మన్లుగా పెడుతున్నాము. రాష్ట్రంలో ఎక్కడైనా పత్తి, పసుపు, మిర్చిలకు సంబంధించి గోడౌన్లలో నిలువ ఉంచడానికి వీలుందా? రేటు రాని సమయంలో అమ్మవలసిన అవసరం ఏమిటి? స్టోరేజ్ కెపాసిటి ఉంటే రైతుకు లాభం చేకూరుతుంది. మార్కెట్లు స్మశానవాటికల్లా ఉన్నాయి. పందికొక్కులు తిరుగుతూ ఉన్నాయి. అక్కడి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఆడపిల్లలు వారం రోజులపాటు బాత్‌రూమ్‌లు లేకుండా అక్కడే ఉంటున్నారు. అంతా బాగుందని ముఖ్యమంత్రిగారు అంటున్నారు. అంతా బాగుంటే రైతుల పరిస్థితి ఈ విధంగా ఉంటుందా? రైతులను ఎందుకు మోసం చేస్తున్నాము. నేను పరిష్కారాలు చెబుతున్నాను. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఏ ప్రభుత్వాన్ని నిందించము. 1990లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చెన్నారెడ్డిగారి

*** Expunged as ordered by the Chair

సమయంలో, డెల్టా ప్రాంతంలో డ్రైనేజ్ సిస్టంని అభివృద్ధి చేయడం జరిగింది.

రా.8.50

ఒక గొప్ప పని చేసింది. రీ కన్‌స్ట్రక్షన్. జిల్లా కలెక్టర్‌గా నేను ప్రతిపాదిస్తే వారు చేశారు. నేను గర్వించాను, హర్షించాను. పబ్లిక్‌గా ఎన్నో సార్లు చెప్పాను. ప్రాంతాలకు అతీతంగా, ఒక తెలంగాణా ముఖ్యమంత్రి కోస్తా ఆంధ్రాకి న్యాయం జరగాలని, అక్కడ వర్షాలు, వరదలు, తుఫానులు వచ్చినప్పుడు తట్టుకోవాలని ఏర్పాటు చేశారు. గత 25 సంవత్సరాలుగా మీరు దాన్ని ఎందుకని బాగు చేయలేదని అడుగుతున్నాను. తుఫానులు వచ్చే కోస్తా ప్రాంతంలో వంద మిల్లీమీటర్ల వర్షపాతం అసాధారణమైందా? 100 , 150 మిల్లీ మీటర్ల వర్షపాతానికి లక్షలాది ఎకరాలు నాశనమై పోవడమేంటి? రూ.350 కోట్లు నష్టమని మళ్లీ మనం కేంద్రాన్ని అడుక్కోవడమేంటి? మరమ్మత్తులను మనం ఎందుకు చేయలేకపోయాం? ఎప్పటికప్పుడు, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్న చందంగా దీర్ఘ కాలికంగా మీరేం న్యాయం చేశారు. 2009లో ప్రకృతి వైపరీత్యం సంభవించింది. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల్లో బోలెడంత నష్టం జరిగింది. గుంటూరు జిల్లాలో గండ్లు పడ్డాయి. మరో మారు కృష్ణానదికి వరద వచ్చినట్లైతే 11 లక్షల క్యూసెక్కులు దాటితే, ఆ గట్లను పెంచే ఏర్పాట్లు చేసి గోదాములను రక్షించకపోతే జిల్లాలు నాశనమైపోతాయని చెపితే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా సమాధానం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే సహాయం చేస్తామని కేంద్రం వారు చెప్పారు. ప్రతి ముఖ్య మంత్రికి సంబంధిత విషయమై నేను వివరాలు పంపిస్తున్నాను. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. అంటే తుఫానులు వచ్చిన తరువాత చేస్తారా? తుఫానులకు ఆస్తి నష్టం వాటిల్లాల్సిందేనా? ప్రభుత్వాలు అసలెందుకున్నాయి? రాబోయే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేసుకోక, ఇబ్బంది వచ్చిన తరువాత మేము ఎక్స్‌గ్రేషియా ఇస్తామంటారు. ఎకరానికి వంద రూపాయలు ఇస్తామంటారు. అంటే శాశ్వత చర్యలు మీరు తీసుకోరా? ప్రభుత్వం ఉన్నది ఈ దేశం కోసం కాదా? ఓటు బ్యాంకు మాత్రమే మీకు కావాలా?

మిస్టర్ స్పీకర్ : కేవలం ఒక్క నిమిషం మాత్రమే మీకు మాట్లాడ్డానికి అవకాశం ఇస్తున్నాను. దయచేసి ముగించండి.

డా. జయప్రకాష్ నారాయణ్ : అధ్యక్షా, ప్రతి సంవత్సరం ఉపాధి గ్యారెంటీ పథకానికి రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఆ డబ్బుని నిజంగా సద్వినియోగం చేసి, పడ్డ ప్రతి వర్షపు చుక్కను సద్వినియోగం చేస్తే, తెలంగాణాలోని మెట్ట ప్రాంతాలు కానీ, రాయలసీమలో కానీ, ఉత్తరాంధ్రలో మెట్ట ప్రాంతాలకుగానీ ఎంతో మేలు జరుగుతుంది. దుర్భిక్షం ఎందుకింత భయానకంగా ఉంది? కేవలం డబ్బులు పందారం చేసి ఓట్లు కొంటే సరిపోతుందా? వనరులు పెంచక్కరలేదా? రైతులు బాగుపడక్కరలేదా? గ్రామీణాభివృద్ధి అక్కర లేదా?

(అంతరాయం)

సహకార సంఘాల ఎన్నికల గురించి మాట్లాడతాను. కేంద్రంలో ఇదే పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వం ఒక రాజ్యాంగ సవరణను తెచ్చింది. మన ప్రభుత్వం, ఈ విషయం తెలియకుండా ఎంత జాగ్రత్తగా ఇక్కడ బ్రతుకుతున్నారంటే, కేంద్ర ప్రభుత్వంలో ఈ పార్టీ వారే చేసిన 97వ రాజ్యాంగ సవరణ గురించి వీరికి తెలియదు. సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి ఇచ్చారు. దాంట్లో పార్టీల ప్రమేయం ఏమిటి? మీ పార్టీలన్నీ అకస్మాత్తుగా ఆ సంఘాలతో సంబంధం లేని సభ్యులను రాత్రికి రాత్రి చేర్చుకోవడమేంటి? వారందరితో జనరల్ ఎలక్షన్స్‌లో ఎటువంటి అక్రమాలకు పాల్పడుతున్నామో అదే రీతిన లక్షలు కోట్లు ఖర్చు చేయడమేంటి? నా

విజ్ఞతను పరిశీలించ వచ్చు కానీ ప్రజల విజ్ఞతను పరిశీలించకండి. ప్రజల తెలివితేటలను కించపరచబోకండి. చివరకు రెండు లక్షల రూపాయలు కూడా డబ్బు లేని సహకార సంఘాలకు 30 లక్షల రూపాయల ఖర్చా?

(అంతరాయం)

నాగేందర్ గారు, గుండె మీద చెయ్యి వేసుకొని చెపుతున్నాను. నాలుగు లక్షల యాభైవేల రూపాయలకు ఒక్క పైసా కూడా నేను ఎక్కువగా ఖర్చు చేయలేదు. నా నోటి నుండి ప్రజా జీవనంలో అనంత దోషం ఉండదు. ఇప్పటివరకు లేదు. ఇక ముందు కూడా ఉండదు. మీకు ఆ సంగతి తెలుసు.

(అంతరాయం)

ఒక్కళ్లకు ఒక్క రూపాయి నేను ఇచ్చినట్లు గనుక ఉన్నట్లైతే, ఈ క్షణమే నేను రాజీనామా చేస్తాను. ఒక్క ఓటు కోసం ఒక్క రూపాయి ఇచ్చానని చెపితే నేను ఈ క్షణాన్నే రాజీనామా చేస్తాను. ఒక్క చుక్క బ్రాందీ పోయించానని చూపిస్తే ఈ క్షణమే రాజీనామా చేస్తాను. అనవసరంగా సూర్యుడి మీద ఉమ్మేయద్దు. మీరు ఇప్పటికైనా మీ విధానం మార్చు కొంటారని నేను వాస్తవాలు చెపుతున్నాను. మీపైన కోపంతో చెప్పడం లేదు. మీ కంటే ఎక్కువగా నాకు జాతీయ పార్టీల అవసరం ఉందని చెపుతున్నాను.

విద్య విషయానికి వస్తే, ప్రపంచం మొత్తంలో 74 దేశాల మధ్య 15 సంవత్సరాల లోపు పిల్లల చదువు ఎట్లా ఉందని ఒక సర్వే జరిగితే, సిగ్గుచేటైన విషయమేమిటంటే, మన దేశం 73వ స్థానంలో ఉంది. దేశంలో చూస్తే మన రాష్ట్రం అట్టడుగు స్థానంలో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో సంవత్సరానికి రూ.15,000 కోట్లు పాఠశాల విద్య క్రింద మనం ఖర్చు చేస్తున్నాం. ఆ బిడ్డల విద్యా ప్రమాణాలు చూడండి. కలెక్టర్ కొడుకుతో, మంత్రి కూతురుతో బిడ్డలు పోటీపడాలన్న వ్యవస్థ కావాలన్న పోరాటం మనం ఎప్పుడైనా చేశామా అధ్యక్షా. ఒక్క రోజే మార్చాలని నేను అనడం లేదు. కనీసం సమస్యనైనా గుర్తించామా? ఆ సమస్యకు పరిష్కారమైనా గుర్తించామా? విధానాలను చేపట్టామా? అమెరికా, బ్రిటన్‌లలో ఈ పనులు చేస్తుంటే, భారత దేశం అంతకంటే గొప్ప దేశమైందా? చైనా బీద దేశమైనా విద్యలో నెంబర్ వన్‌గా ఉంటే, మనం అంత అధ్వాహ్నంగా ఉండాల్సి వచ్చిందా? అధ్యక్షా, స్థానిక ప్రభుత్వాలకు నిధులు ఇచ్చినట్లైతే, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇచ్చినట్లైతే, జిల్లా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లైతే, ఏ పంచాయితీకి ఆ పంచాయితీకి తలసరి వెయ్యి రూపాయలు ఇచ్చినట్లైతే, రాష్ట్రంలో నక్సలిజం ఉండేది కాదు. రాష్ట్రంలో ప్రాంతీయ తత్వం ఉండేది కాదు. అధికారాన్ని కేంద్రీకరించి అన్నిటికీ ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి. ఎందుకు అధ్యక్షా. ఒక మండలం నుండి మరో మండలానికి ఒక బడి పంతులు బదిలీ కోసం ముఖ్యమంత్రికి ఫైల్ వెళ్లాలా? ఇది పరిపాలనా అధ్యక్షా. అధికారాన్ని కేంద్రీకరించి పెట్టింది ఎవరు అధ్యక్షా. ప్రజల్లో అసంతృప్తి ఎందుకు పెరిగింది అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్ : దయచేసి ముగించండి.

డా. జయప్రకాష్ నారాయణ్ : ముగిస్తాను అధ్యక్షా. అయ్యా మద్యాన్ని అదుపు చేయండి. అక్రమ మద్యాన్ని కానీ, బెల్ట్ షాపులను కానీ, లేదా అక్రమ ధరని కానీ అరికట్టండి. అప్పుడు చాలా మార్పు వచ్చేది. రూ.19000 కోట్ల ఆదాయాన్ని తీసుకొంటున్నాం. ప్రజల్ని విశ్వాసంలోకి తీసుకోం. చివరగా రెండు డిమాండ్స్ చెప్పి ప్రసంగాన్ని ముగిస్తాను. సర్వీస్ గ్యారెంటీ యాక్ట్, మీ సేవ కార్యక్రమం మంచి ప్రయోగం. కానీ అది చాలదు. కేంద్రంలో మీ పార్టీనే ఆ చట్టం తీసుకువస్తోంది. ప్రతి పనికి గడువు పెట్టి, ఆలస్యమైతే, రోజుకు

రూ.250ల చొప్పున పరిహారంతో చట్టం తెస్తోంది. పార్లమెంటరీ కమిటీ కోరిక మేరకు ఆ చట్టాన్ని లోక్‌సత్తా సమగ్రంగా తయారు చేసి పంపించింది. ఆ చట్టాన్ని తెస్తున్నారు. మీరు చేసిన మంచి పనులను కూడా రాష్ట్రంలో పెట్టరా? జాతీయ స్థాయిలో లోక్‌పాల్ చట్టం తీసుకువచ్చారు. దురదృష్ట వశాత్తు అక్కడ బాధ్యత మీది కాదు ప్రతిపక్షాలది. దేశ భవిష్యత్తును మర్చేపోయి, రాష్ట్రాల హక్కులనే మాట చెప్పి జాతీయస్థాయిలో లోకాయుక్త లేకుండా చేసిన పాపం పౌర సమాజానిది, ప్రతిపక్షాలది. జాతీయ స్థాయిలో లోక్‌పాల్ తీసుకువస్తే, రాష్ట్ర స్థాయిలో లోకాయుక్త తీసుకురాదా? రంగు, రుచి వాసన లేని లోకాయుక్తా మీకు కావాల్సింది. వారికి ఏ అధికారం లేకుండా ఉండాలా? ఎ.సి.బి. మీ అడుగులకు మడుగులు వత్తాలా? మీకు ఇష్టం లేకపోతే వారిని ట్రాన్స్‌ఫర్ చేస్తారా? 23 మంది ఐ.ఏ.ఎస్. అధికారులపై కంప్లైంట్స్ వస్తే, ఎంక్వైరీ చేసి, ప్రాసిక్యూషన్‌కి అనుమతి కోరితే, అవన్నీ మీ క్రింద వేసుకొని మీ కుర్చీ భద్రంగా ఉంచుకోవాలా? స్వతంత్ర ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయరా? లోకాయుక్తను బలమైన సంస్థగా ఏర్పాటు చేయరా? ఆస్థి హక్కుల కోసం బలమైన చట్టాన్ని చేయరా? మీ పార్టీ ప్రభుత్వం కేంద్రంలో చేస్తున్న పనిని మీరు రాష్ట్రంలో చేయరా? అంటే మీ పార్టీ పక్షానికే మీరు ప్రతిపక్షమా? కనీసం ఆ పనులైనా చేయండి.

విద్యుత్, వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాలు, విద్య, రైట్ టు సర్వీసెస్ యాక్ట్, అవినీతి నిరోధం కోసం సమగ్రమైన చట్టాన్ని చేయండి. ఈ చట్టం గురించి మీకు ఇచ్చాను. ముఖ్యమంత్రి గారు స్పీకర్‌గా ఉన్నప్పుడు ఇచ్చాను. ఆనాడు ఉన్న ప్రభుత్వానికి ఇచ్చాను. ఇప్పటి వరకు దాని విషయమై మాట్లాడనే లేదు. అవినీతిని నిజంగా మనం అదుపు చేయాలంటే, చట్టం చేయడానికి చేతులురావు. దాని గురించి మాట్లాడాలంటే నోరు రాదు. అంటే అవినీతి మీరు చేస్తున్నంత కాలం కొనసాగాలి. ప్రక్క వాడు చేస్తే వ్యతిరేకించాలి. ఇదేమి ధర్మం అధ్యక్షా.

రా. 9.00

అధ్యక్షా, నేను ఆవేశంగా మాట్లాడుతున్నానని కొంత మంది బాధపడుతుండొచ్చు. ఆవేశం అనేది ధర్మానుగ్రహం. వ్యక్తిగతంగా నిజంగా నాకు ఎవరిపైనా కోపం లేదు. కొన్ని ప్రయత్నాలను మీరు చేస్తున్నారు గానీ, ఇప్పటికి కూడా మీరు నిజాయితీగా అవినీతిని మార్చాలనే దిశగా ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే భయం. ఈ భయం గుప్పిట్లోనే ప్రభుత్వాలు కాలం గడుపుతున్నాయి. కానీ, భయం గుప్పిట్లో ఏ ప్రభుత్వాలు కూడా విజయాలు సాధించలేవు. ఒకవేళ ఎన్నికల్లో నెగ్గినప్పటికీ ప్రజలకు మంచి చేయలేరు. నాకు భయం లేదనే మాటను గౌరవ ముఖ్యమంత్రి గారు పదే పదే చెబుతున్నారు. భయం లేకపోవడమనేది అవతలి వారి మాట ఖాతరు చేయకపోవడమే. రేప్పొద్దున మంచి చేస్తే ఎన్నికల్లో ఓట్లు వస్తాయో లేదో అనే భయం నాకు లేదు. కానీ ప్రజల భవిష్యత్తే ముఖ్యం అనేటటువంటి నిర్భయం కావాలి. నేను మంచి చేస్తే చరిత్ర నన్ను క్షమిస్తుంది, మంచి చేయకపోతే అధికారంలో ఉన్నా చరిత్ర క్షమించదనే భయం కావాలి. చరిత్ర పట్ల భయం కావాలి. అంతే గాని ఓట్ల పట్ల భయం కాదు. నిర్భయంగా ఆ మంచి పనులు చేస్తారని ఆశిస్తూ మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు నా ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: నాగం జనార్ధన్ రెడ్డి గారూ మాట్లాడండి.

డా. నాగం జనార్ధన్‌రెడ్డి: అందరికీ నమస్కారం, I am not feeling well. Please cooperate.

అధ్యక్షా, కొన్ని విషయాలను స్పష్టంగా గౌరవ ముఖ్యమంత్రి గారిని అడగదలచాను. ఈ అసెంబ్లీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని పట్టించుకోదా? ప్రజలు ఆశ నిరాశల మధ్య నలుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉండే మంత్రులు తెలంగాణ అంశంపైన చేస్తున్నటువంటి ప్రకటనల వల్ల తెలంగాణ బిడ్డలు సుమారు వెయ్యి మందికి పైగా తెలంగాణ రాదేమోనని నిరాశకు గురై ఆత్మ బలిదానాలు చేసుకుంటే నిమ్మకు నీరెత్తినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం కాలం గడుపుతోంది. తెలంగాణ అంశాన్ని కూడా ఈ రాష్ట్ర అసెంబ్లీ పట్టించుకోవడం లేదు. నేను ప్రభుత్వాన్ని ఒకటే అడుగుతున్నాను. సత్వరమే తెలంగాణ అంశాన్ని తేల్చండి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మీరు తోడ్పడండి. అప్పుడే చరిత్రలో మీకు ఒక స్థానం ఉంటుంది.

(అంతరాయం)

నేను అసెంబ్లీలో మొదటి వరుస క్రమంలో ఉండేవాడిని, ఇప్పుడు చివరి బెంచ్‌కు రావడం జరిగింది. కానీ, మీరు కూడా రేపటి ఎన్నికల్లో మీ స్థానాలు ఎక్కడుంటాయో ప్రజలే తేలుస్తారు. మీ స్థానాలు ఎక్కడనే విషయాన్ని ప్రజలే తేలుస్తారు. ఎందుకు నన్ను రెచ్చగొడతారు. రెచ్చగొట్టకండి.

MR.SPEAKER: Nagam Janardhan Reddy garu, you concentrate on the public issues.

డా.నాగం జనార్ధన్ రెడ్డి: అధ్యక్షా, తెలంగాణ ప్రాంతంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ నిలిచిపోయినాయి. ఏ ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు నుండి కూడా విద్యుత్ ఉత్పత్తి కావడం లేదు. గౌరవ ముఖ్యమంత్రి గారు తెలంగాణ ప్రాంతం పట్ల పక్షపాత దోరణితో వ్యవహరిస్తున్నారు.

(అంతరాయం)

నేను ఒక విషయం గురించి అడుగుతున్నాను. విద్యుత్ జనరేషన్ పైన ప్రభుత్వం దృష్టి సారించకపోయినట్లైతే, తెలంగాణ ప్రాంతంలోని ప్రాజెక్టులన్నీ నిరూపయోగమవుతాయి.

అధ్యక్షా, నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. అదే విధంగా 2004 వ సంవత్సరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 33/- లు ఉండేది. ప్రస్తుతం రూ. 75/- లకు పెరిగింది. ఈరోజేదో లీటర్ పెట్రోల్‌పై ఒక రూపాయి తగ్గిస్తున్నట్టుగా దినపత్రికల్లో వచ్చింది. నాకు ఆరోగ్యం బాగోలేదు. ఆరోగ్యం బాగున్నట్లైతే, ప్రభుత్వాన్ని అన్ని అంశాల్లో నిలదీసేవాడిని. నిత్యావసర వస్తువుల ధరలు పెద్ద యెత్తున పెరిగిన కారణంగా పేద,మధ్య తరగతికి చెందిన సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అదే విధంగా విద్యుత్ చార్జీలు పెరిగిన కారణంగా మళ్లీ సర్ చార్జీ విధింపు వంటి కారణాలతో, సక్రమ విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల రైతాంగం కూడా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. గ్రామాల్లో రోజుకు మూడు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయలేనటువంటి పరిస్థితికి ఈ ప్రభుత్వం వచ్చింది. రైతులు చాలా ఆందోళనలో ఉన్నారు. ఈరోజు నాకు ఆరోగ్యం బాగా లేకపోవడం వల్ల ఎక్కువ సమయం నేను మాట్లాడలేకపోతున్నాను. మాట్లాడే పరిస్థితిలో నేను లేను. అయితే, ప్రభుత్వం పైన పెట్టిన అవిశ్వాస తీర్మానం పైన మాట్లాడకపోతే, నా మద్ధతు తెలుపకపోయినట్లైతే, నేను తప్పుచేసినవాడినవుతానని భావిస్తూ, నా పూర్తి సహకారాన్ని, నా మద్ధతును ఈ అవిశ్వాస తీర్మానం పట్ల తెలియజేస్తున్నాను. జై తెలంగాణ.

శ్రీ సోమారపు సత్యనారాయణ (రామగుండం): అధ్యక్షా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఒక సంవత్సర కాలానికి మన రాష్ట్రానికి స్వాతంత్ర్యం వచ్చింది. అయినప్పటికీ వచ్చిన స్వాతంత్ర్యం 1957 వ సంవత్సరంలో మళ్లీ పోయిందని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు. తెలంగాణ ప్రాంతం వివక్షకు గురైంది. అందు నిమిత్తమే ఈనాడు తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి గాను ముందుకు రావడం జరిగింది.

అధ్యక్షా, రామగుండం నందు బొగ్గు గనులున్నాయి. స్వాతంత్ర్యం రాకముందే ఆ బొగ్గుగనుల్లో పవర్ జనరేషన్ జరిగేది. రామగుండమంటేనే పవర్ జనరేషన్‌కు ప్రసిద్ధి అనే గుర్తింపు దేశంలో ఉంది. అక్కడ స్వాతంత్ర్యం రాకముందే 30 మెగావాట్ల పవర్ జనరేషన్ ప్లాంట్ పెట్టిన కారణంగా పవర్ జనరేషన్‌కు ఎటువంటి ఆటంకం లేకుండా ఉత్పత్తి జరిగేది. ఆ తరువాత ఎ.పి.ఎస్.ఇ.బి. సంస్థ 62 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ జనరేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు రామగుండం నందు ఉత్పత్తి అవుతున్న బొగ్గును దేశం నలుమూలలకు తీసుకుపోవడం జరుగుతోంది కానీ, పవర్ జనరేషన్ ఉత్పత్తి చేయాలనే ఆలోచనను ప్రభుత్వం చేయడం లేదు. పవర్ స్టేషన్ కూడా రామగుండానికి ఇంత వరకు రాలేదు. రామగుండం నుండి కోల్, నీళ్లు రాయలసీమకు తరలివెళ్లడం జరుగుతోంది. తద్వారా పవర్ జనరేషన్ రాయలసీమలో జరుగుతుంటుంది. పవర్ స్టెబిలైజేషన్ వల్ల అన్ని ప్రదేశాల్లో పవర్ జనరేషన్ జరగదనే విషయాన్ని కొంత మంది ఇంజనీర్లు చెబుతున్నారు. ఆ విషయాన్ని నేను కూడా ఒప్పుకుంటున్నాను. కానీ, జరుగుతున్న వాస్తవ పరిస్థితి ఏమిటంటే, 62% పవర్ కంజమ్షన్ తెలంగాణ ప్రాంతంలో ఉంటే, కేవలం 26% మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. పవర్ ప్రాజెక్టులు ఎప్పటికైనా పవర్ కంజమ్షన్ వచ్చే ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలి. కనీసం ఇప్పటికైనా సరే, ప్రభుత్వం ఆ దిశగా పయనించాల్సిన అవసరముంది. ఆ విషయమై మేం ఎ.పి. జెన్కో సి.ఎం.డి. గారిని మరియు గౌరవ ముఖ్యమంత్రి గారిని కలవడం జరిగింది. కనీసం ఇప్పటికైనా పవర్ జనరేషన్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయమని కోరడం జరిగింది. ఈమధ్య కూడా క్రొత్తగా పవర్ జనరేషన్ ప్రాజెక్టులను విజయవాడ, కృష్ణ పట్నం మరియు కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రామగుండంలో పవర్ జనరేషన్ ప్లాంట్‌ను ఎందుకు ఏర్పాటు చేయడంలేదనే విషయం మేం ప్రభుత్వాన్ని, అధికారులను అడిగితే, వారు చెబుతున్నదేమిటంటే, భూమి దొరకకపోవడం కారణమని చెబుతున్నారు. విజయవాడ నందు ఇరవై ఎకరాల స్థలంలో 120 మెగా వాట్ల సామర్థ్యం గల గ్యాస్ ప్లాంట్‌తో పాటు అదే ఇరవై ఎకరాల స్థలంలో 800 మెగా వాట్ల సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ వచ్చింది. అదే రామగుండం ప్రాంతానికి వచ్చినప్పుడు అక్కడ 126 ఎకరాల భూమి ప్లాంట్ నిమిత్తం ఏర్పాటు చేసినప్పటికీ ఇంతవరకు ఏ ప్లాంట్ రాలేదు. ఆ విషయంలో ప్రభుత్వం చొరవ చూపలేదు. తెలంగాణ ప్రాంతం విషయంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో వివక్ష చూపుతోంది.

అదే విధంగా రామగుండంలో అండర్ మైన్ సిస్టమ్ బొగ్గు గనులుండేవి. కానీ, ప్రస్తుతం అక్కడ ఉన్న బొగ్గునంతా కూడా ఓపెన్ కాస్ట్ మైన్స్ పేరుతో లభ్యమవుతున్న బొగ్గునంతా కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోంది. తద్వారా ఆ ప్రాంతమంతా బొందెలగడ్డగా మారుతున్న పరిస్థితి నెలకొంది. అదే విధంగా రామగుండం నందు బి.పి.ఎల్. ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం 1,500 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించడం జరిగింది. భూమిని సేకరించిన తరువాత సకాలంలో ప్రాజెక్ట్ ఏర్పాటు కాకపోయినట్లైతే, ఆ సేకరించిన భూమిని వాపస్ తీసుకునే విధానం ఉంటుంది. ఆ విధంగా ప్రాజెక్టులు ఏర్పాటు కాకుండా ఉండినట్లైతే, అటువంటి భూములను ప్రభుత్వం వాపస్ తీసుకుంటోందనే మాటలు కూడా మా దృష్టికి రావడం జరిగింది. మేం కూడా ప్రభుత్వాన్ని కోరుతున్నదేమిటంటే, బి.పి.ఎల్. ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం సేకరించిన 1,500 ఎకరాల భూమి, ఆ ప్రాజెక్ట్ ఏర్పాటు కాకపోవడమనేది జరుగుతోంది కాబట్టి ఆ స్థలంలోనే ఎ.పి.జెన్కో సారథ్యంలో పవర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు

చేయవల్సిందిగా కోరడం జరిగింది. ఆ విషయంలో కూడా ప్రభుత్వ స్పందన కరువైంది. అదే విధంగా ఎన్.టి.పి.సి.కి రెగ్యులేటరీ కమీషన్ ద్వారా కూడా 4,500 ఎకరాల భూమి ఇవ్వాల్సి ఉంది. కానీ, వాళ్లకు 9,500 ఎకరాల భూ సేకరణ జరిగిన కారణంగా మేం అవసరానికి మించి ఉన్న భూమిని వాపస్ తీసుకొని తద్వారా వచ్చే నిధుల్ని ప్రజల అవసరాలకు వినియోగించమని కోరడం జరిగింది. కానీ, ఆ విషయంలో కూడా ప్రభుత్వం ఏ విధంగా స్పందించడం లేదు. ప్రభుత్వం తెలంగాణ ప్రాంతం పట్ల ఎటువంటి వివక్షను చూపుతోందనడానికే, అంశాలను మీ దృష్టికి నేను తీసుకురావడం జరుగుతోంది.

అదే విధంగా తాగునీటికి కూడా తెలంగాణ ప్రాంతం ఇబ్బందులకు గురౌతోంది. ఎల్లంపల్లి డ్యాం వచ్చిన తరువాత ఒక టి.ఎం.సి. నీరు రామగుండానికి అందించాలని కూడా మేం ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఒక టి.ఎం.సి. వాటర్ కొరకు వంద కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉంది. డబ్బు వెచ్చించే పరిస్థితి లేదు కాబట్టి ఎల్లంపల్లి ప్రాజెక్టు వచ్చిన తరువాత రామగుండానికి సబ్ సర్ఫేస్ వాటర్ రాదు కనుక ఎన్.టి.పి.సి.కి సరఫరా అవుతున్న పైప్ ద్వారా నాలుగు టి.ఎం.సి.ల నీటిలో ఒక టి.ఎం.సి. వాటర్‌ను తాగునీటి కొరకు అందించవల్సిందిగా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. 2011 వ సంవత్సరంలో తాగునీటి సౌకర్యం గురించి రామగుండానికి రూ. 14.00 కోట్ల రూపాయలు మంజూరు చేయవల్సిందిగా కూడా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. చిత్తూరు జిల్లాకు తాగునీటి అవసరాలకు గాను రూ. 7,000.00 కోట్లు ప్రభుత్వం ఈమధ్యే విడుదల చేసింది. తెలంగాణ ప్రాంతమైన రామగుండానికి పద్నాలుగు కోట్ల రూపాయలు ఇవ్వలేని ప్రభుత్వం, చిత్తూరు జిల్లాకు మాత్రం వేల కోట్ల రూపాయలు తాగునీటి అవసరాలకు వెచ్చించడం శోచనీయం. తాగునీటి అవసరాల కొరకు దినదినగండంగా కాలం గడపాల్సిన ఆగత్యం ఏర్పడుతోంది. రామగుండం నందు వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బంది ఉన్న కారణంగా గోదావరి నదిలో వర్టికల్ ఫిల్టర్స్ వేసుకొని, 5 హెచ్.పి. మోటర్‌తో నీటిని ప్రజలకు అందించడం జరుగుతోంది. తాగునీటికే అంతటి వివక్షను తెలంగాణ ప్రాంతం పట్ల ప్రభుత్వం చూపుతోంది. హైదరాబాద్ నగరానికి కృష్ణా బేసిన్ నుంచి తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. కృష్ణా బేసిన్ నుండి నగరానికి మంచి నీరు తీసుకురాకుండా, ప్రభుత్వం గోదావరి నుంచి నీరును తెచ్చే ప్రయత్నం చేస్తోంది. గోదావరి నుంచి నీరును నగరానికి తీసుకురావడానికి గాను పది టి.ఎం.సి.ల నీటికి రూ. 3,375.00 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, రామగుండం ప్రాంతాన్ని ప్రభుత్వం తాగునీరు అందించే విషయంలో కూడా విస్మరించింది.

రా.9.10

అదే రామగుండం ప్రాంతంలో మాకు రూ.14 కోట్లు ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడో ఇవ్వవలసిన థర్డ్ ఫేజ్ కృష్ణా జలాలకు జాప్యం చేసి 5 టిఎమ్‌సిలు ఇవ్వడానికి రూ.1600 కోట్లు శాంక్షన్ చేశారు. తెలంగాణా ప్రాంతంలో త్రాగునీటికి కూడా వివక్ష సాగుతోంది. సాగునీటికి సంబంధించి ఎల్లంపల్లి ప్రాజెక్టు నా నియోజక వర్గంలోకి వస్తుంది. దానివల్ల 6 గ్రామాలు, 7000 ఎకరాల భూమి పూర్తిగా మునిగిపోతాయి. నా నియోజక వర్గంలో 25000 ఎకరాలకు నీరు కావాలని అడుగుతున్నాము. ఎకరానికి రూ.30000 చొప్పున రూ.63000 కోట్లు ఖర్చు పెడితే నీళ్లు వస్తాయి. రూ.5 లక్షలు ఖర్చు పెడితే 2000 ఎకరాలకు నీళ్లు వస్తాయి. దాని గురించి మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వం వెనుక తిరుగుతున్నాము అయినా ఇవ్వడం లేదు. మా ఇరిగేషన్ మంత్రిగారు కొత్త ప్రాజెక్టులకు డబ్బులు లేవని అంటున్నారు. ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టులో జి.ఒ. నెం .59, తేది.31.8.2012 ద్వారా 13000 ఎకరాలకు రూ.231 కోట్లు శాంక్షన్ చేశారు. అంటే ఎకరానికి రూ.2 లక్షలు ఖర్చు పెడుతూ వారికి డబ్బులు శాంక్షన్ చేశారు. సోమశిల ప్రాజెక్టు ద్వారా 90000 ఎకరాలకు రూ.800 కోట్లు అంటే ఎకరానికి లక్ష రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఆంధ్రప్రాంతానికి ఎకరానికి సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు పెడతారు, కాని తెలంగాణా ప్రాంతంలో రూ.30000

ఒక ఎకరానికి ఖర్చు పెట్టడానికి వెనుకకు పోతున్నారు. మా మంత్రిగారు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నారు.

తెల్ల కార్డులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పెన్షన్ రావాలంటే వారికి తెల్లకార్డులుండాలి. తెల్ల కార్డుల కోసం ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగి పెన్షన్ రాక చనిపోయే పరిస్థితి ఏర్పడింది. మంత్రిగారు మా ప్రాంతానికి వస్తే చూపిస్తాను.

తెలంగాణా ప్రాంతానికి చెందిన వారికి ఇరిగేషన్ మంత్రి పదవి, హోమ్ మంత్రి పదవి ఇస్తారు ఎందుకంటే ఆంధ్రప్రాంతానికి, రాయలసీమ ప్రాంతానికి నీళ్లు తీసుకురావడానికి డబ్బులు కేటాయించడానికి మా ప్రాంత మంత్రిని పెడతారు. తెలంగాణా గురించి మాట్లాడితే కొట్టడానికి తెలంగాణా ప్రాంతానికి చెందిన వారిని హోమ్ మంత్రిగా పెడతారు. స్వాతంత్ర్య పోరాటంలో మా డెస్టినీ మేము నిర్ణయించుకునే హక్కు మాకు కావాలని పోరాడాము. అలాగే మా తెలంగాణా ప్రాంత ప్రజలు కూడా మా డెస్టినీ మాకు కావాలని పోరాటం చేస్తున్నారు. స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలోని వనరులను ఇంగ్లండుకు తీసుకువెళ్లవద్దని పోరాటం చేశాము. అదేవిధంగా ఈ రోజు మా ఆదాయాలు మాకు కావాలని అంటున్నాము. బ్రిటిష్ వాళ్లు మేము పాలించి మీకు సహకరిస్తామని అన్నారు. మీరు పాలించుకుంటే ఎక్స్ట్రీమిస్టులతో , ముస్లింలతో కొట్లాడతారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 60 సంవత్సరాలుగా కలిసి ఉంటున్నాము. మేము పాలించి మీకు సహకరిస్తామని అంటున్నారు. స్వాతంత్ర్యానికి ముందున్న పరిస్థితులు ఎలా ఉన్నాయో, ఈ రోజు కూడా అలాగే పోరాటాలు సాగుతున్నాయి. తెలంగాణా ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. ఈ వివక్ష గురించి మేము అవిశ్వాస తీర్మానం పెట్టామని తెలియ చేస్తున్నాను.

శ్రీ బి. కరుణాకర్ రెడ్డి: అధ్యక్షా, ఈ సభలో మొదటిసారి మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

కారే రాజుల్ రాజ్యముల్ వారేరి సిరి మూటగట్టుకొని పోవున్
జాలరే భూమిపై పేరైనన్ గలదే శిబి ప్రముఖులన్
యుశఃకాములై ఏరే కోర్కెల్ వారన్ మరచిరే ఇక్కాలమున్ భార్గవా

అని పోతనామాత్యుడు 600 సంవత్సరాల క్రితం అన్నమాటను ఈ సభకు గుర్తు చేస్తున్నాను. ఎవరు మంచి పనులు చేస్తారో వారు కీర్తికాముకులై అనేక సంవత్సరాలు ప్రజల మధ్యన జీవించే ఉంటారు. ఎంతగా రాజ్యాన్ని పరిపాలించినా పేరు ప్రతిష్టలు లేకుండా, చరిత్ర కాలగర్భంలో కొంతమంది కలసిపోతారు. ఈ ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాలుగా ప్రజల ఆకాంక్షలను, కోరికలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలిస్తున్నందుకు అడుగడుగునా ప్రజా తిరస్కారానికి గురవుతున్నారు. మూడున్నర సంవత్సరాల కాలంలో వచ్చిన అనేక ఉప ఎన్నికలలో ప్రతిసారీ భంగపడుతూ ప్రజా తిరస్కారానికి గురవుతున్నారు. అంటే ప్రజలకు అనుగుణమైన పాలనను తీసుకురావడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గుర్తు చేస్తున్నాను. వైఎస్.రాజశేఖర్ రెడ్డిగారి మరణానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకోకుండా, ప్రజలకు మేలైన ఏ ఒక్క చర్య చేయక పోవడం వల్ల ప్రజలు ఈ రోజు మీ మీద కోపోద్రిక్తులయ్యారని గ్రహించమని కోరుతున్నాను. మీరు శ్రోత్కర్షగా ఎన్నైనా చెప్పవచ్చు. మీరు రూపొందించిన పథకాలకు మంచి మంచి పేర్లు పెట్టినంత మాత్రాన, మీ విష్వక్సేనుడు అనేక మాటలు మాట్లాడిన విషయాలన్నిటినీ ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా కోర్టుకు వెళితే అడుగడుగునా ప్రజలు వ్యతిరేకించే

విధంగా మీరు ప్రవర్తిస్తున్నారు. 2009 ఎన్నికలకు ముందు ప్రకటించిన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విషయాలను కొనసాగిస్తున్నామని చెబుతున్నారు. కాని ఆచరణలో ఏ ఒక్క పథకాన్ని కూడా మీరు సమర్థవంతంగా కొనసాగించలేకపోయారనే మాట నిజం కాదా? అది నిజమైతే ప్రజలు మీకు ఈ రోజు జేజేలు పలికేవారు. కాని మీరు వైఎస్ఆర్ చేసిన పథకాలను పూర్తిగా తీసివేయలేకపోవచ్చు గాక ఆ పథకాలను నిర్వీర్యం చేసినందుకే ప్రజల ఆగ్రహానికి గురవుతున్నారు.

ఈ రోజు సంక్షేమ హాస్టల్సులో ఉన్న విద్యార్థులు చాలా దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. వారు చదువుకోవడానికి అనేక రకాల అవస్థలు పడుతున్నారు. కేవలం రూ.18ల భత్యం ఇచ్చినంతమాత్రాన వారు చదువుకోవడానికి అనువైన పరిస్థితులున్నాయా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. ఈ ప్రభుత్వం ఫీజు రీఇంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల గురించి చాలా గొప్పగా చెబుతోంది. కాని ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టిన ఆ రెండు సంవత్సరాల కాలంలో 11 లక్షల మందికి ఆపరేషన్ చేస్తే, ఈ ప్రభుత్వం మూడున్నర సంవత్సరాల కాలంలో కేవలం 5 లక్షల మందికి మాత్రమే ఆపరేషన్సు చేసిన విషయాన్ని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. 2009లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజశేఖర్ రెడ్డిగారు ప్రమాణం చేసిన రోజున మాట్లాడిన తొలి మాట ఏమిటంటే నా ప్రభుత్వం 9 గంటల పాటు నిరాటంకంగా వ్యవసాయదారులకు విద్యుత్‌ను ఇస్తుందని, గృహ వినియోగదారులకు 24 గంటలపాటు విద్యుత్ ఇస్తుందని, ఐదు సంవత్సరాల కాలంలో విద్యుత్ ఛార్జీలు ఒక్క రూపాయికూడా ఈ ప్రభుత్వం పెంచదని చెప్పడం జరిగింది. ఆయన నాయకత్వాన్ని ఇంకా అనుసరిస్తున్నామని చెబుతూ మూడున్నర సంవత్సరాల కాలంలో ఈ ప్రభుత్వం దాదాపు రూ.32,000 కోట్లు అదనపు విద్యుచ్ఛక్తి భారాన్ని ప్రజల మీద మోపిన విషయం వాస్తవం కాదా?

రా.9.20

ఏడు గంటల పాటు కరెంటు ఇవ్వడం కాదు కదా కనీసం రెండు గంటల పాటు కూడా రైతాంగానికి కరెంట్ లేకుండా అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని మీతోబాటు ప్రజలందరికీ తెలుసు. మీకు అందరి కంటె బాగా తెలుసు. అయినా మీరు ఈ సభలోని సభ్యులను, ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రయత్నించడానికి ఉపయోగించుకుంటున్నారు తప్ప నిజంగా ఈ ప్రభుత్వం మంచి పనులు చేసి ఉంటే ఈ ప్రభుత్వం మంచికే కట్టుబడి ఉంటే ప్రజలు మొన్న జరిగిన ఉప ఎన్నికల్లో మిమ్మల్ని తిరస్కరించే అవకాశం ఏ రకంగానూ ఉండి ఉండేది కాదు. ఈ ప్రభుత్వాన్ని, మిమ్మల్ని ప్రజానీకం అడుగడుగునా తిరస్కరిస్తోందంటే రాజశేఖర రెడ్డి గారు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలకు మీరు తూట్లు పొడుస్తున్నారనే వాస్తవాన్ని గ్రహించారు. కాబట్టే ఆ సంక్షేమ పథకాలను కొనసాగించగలిగే సత్తా, ధైర్యం ఎవరికి ఉందని వారు ఆలోచించారు కాబట్టే ఈ రోజున జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వారు భుజాల మీద వేసుకొని తిరుగుతున్నారని మీ ద్వారా ఈ ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. సహకార ఎన్నికల్లో మీరు పెద్దఎత్తున గెలిచారట. కొత్తగా ఒక్క ఓటరును కూడా నమోదు చేయకుండా, నమోదు చేయడానికి అవకాశం కల్పించకుండా పాత ఓటర్లను పెట్టుకొని వారికి డబ్బులు ఇచ్చి గెలిచారు.

(అంతరాయం)

కొన్ని సొసైటీలకు ఎన్నికలు కూడా జరగనీయకుండా చేసి సొసైటీ ఎన్నికలు గెలిచారట మీరు. చివరకు ముఖ్యమంత్రి గారి సొంత జిల్లాలో దాదాపు 17 సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి జిల్లాల్లో కూడా కనీసం 5 నుంచి 10 సొసైటీలకు ఎన్నికలు

లేకుండా చేసి మేం గెలిచామంటున్నారు. గెలుస్తామనే నమ్మకమున్న సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి అవి గెలిచి మాకు ప్రజాభిమానం, ప్రజల ఆమోదం ఉందని చెప్పుకుంటుంటే మీ గొప్పలు నమ్మడానికి మీరు సిద్ధంగా ఉన్నారేమో గానీ ఈ రాష్ట్రంలోని 9 కోట్ల మంది ప్రజలందరికీ వాస్తవాలు తెలుసు. ఈ ప్రభుత్వం ...............

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుః అధ్యక్షా, కరుణాకర్ రెడ్డి గారు మొట్టమొదటిసారి మాట్లాడుతున్నారని మీరు చెప్పారు కనుక వేచి చూస్తున్నాం. వారు సత్యదూరమైన మాటలు చెబుతూ ఈ ప్రభుత్వం మీద ఆయనకు నచ్చిన రీతిలో ఆరోపణలు చేస్తూ ఈ ప్రభుత్వం పూర్తిగా సంక్షేమాన్ని వదలిపెట్టిందని, అసలు రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన పథకాలు తుంగలో తొక్కారన్న రీతిలో, తీసివేశారన్న పద్ధతిలో మాట్లాడుతున్నారు. పెన్షన్లు ఇవ్వడం లేదని, రేషన్ కార్డులు ఇవ్వడం లేదని, ఆరోగ్యశ్రీ వర్తింపచేయడంలేదని, ఈ కార్యక్రమాలు..................

(అంతరాయం)

దయచేసి వినండి. మీరు మాట్లాడుతున్నప్పుడు నేను మాట్లాడలేదు. గడచిన కాలంలో ముఖ్యమంత్రిగా పరిపాలన చేసిన రాజశేఖర రెడ్డి గారి గురించి ఈ నిండు సభలో మోత్కుపల్లి నర్సింహులు గారు మాట్లాడుతున్నప్పుడు, వారు ఆ రకంగా పోస్ట్‌మార్టం చేస్తూ మాట్లాడుతుంటే మీరు ఏ రకమైన పరిస్థితులు తీసుకొచ్చారో ఈ సభలోని సభ్యులే కాదు రాష్ట్ర ప్రజలందరూ కూడా చూశారు. రాజశేఖరరెడ్డి గారి గురించి ఇపుడు మీరు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 5 సంవత్సరాల కాలంలో శ్రీమతి సోనియా గాంధీ గారి నేతృత్వంలో పనిచేస్తున్నాం. గతంలో శ్రీమతి ఇందిరా గాంధీ గారు గరీబీ హటావో అన్న నినాదంతో పేదరికాన్ని నిర్మూలించేందుకు నినాదమిచ్చారో, ఇరవై సూత్రాల పథకం పెట్టారో అవన్నీ అయిదు సంవత్సరాల కాలంలో అమలుచేసి మరలా 2009లో ఎన్నికలు వస్తే వాటి గురించి మోత్కుపల్లి నర్సింహులు గారు చేస్తున్న ఆరోపణలకు మీరు జవాబు చెప్పరా? దానికి మేం జవాబు చెప్పాలా? లబ్ధి మీరు పొందాలా? శిక్ష మాకా? రకరకాలుగా శిక్షలు మేమనుభవించాలా? మీ గురించి మేం అడ్వకేటింగ్ చేయాలా? రాజశేఖర రెడ్డి గారి గురించి మీకు మాత్రమే ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఏమి ప్రేమ ఉంది మీకు? నడి బజార్లలో నిలదీసినట్లు నర్సింహులు గారు వారి నోటికి వచ్చినట్లు మాట్లాడుతుంటే మీరు చేసిన పని ఏమిటి? స్వార్థంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను పడగొట్టాలని, కూలదోయాలని మీరు చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలు ప్రజలు గమనించడం లేదా అని అడుగుతున్నాను. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్ రెడ్డి గారు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. మీ పార్టీకి సిద్ధాంతం లేదు, కార్యక్రమాలు లేవు.

శ్రీ భూమన కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, మీరు ఎన్ని చెప్పుకున్నా, ఎన్ని ఆరోపణలు చేసినా, అరచి గీకొట్టుకున్నా మిమ్మల్ని ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరు. అది అడుగడుగునా ప్రతి క్షణం ప్రజలు నిరూపిస్తున్నారు.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుః నర్సింహులు గారికి సమాధానం చెప్పండి.

శ్రీ భూమన కరుణాకర్ రెడ్డిః ఖచ్చితంగా చెబుతాను. వినండి.

(అంతరాయం)

ఇంకా పూర్తి కాలేదు.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్: మీరు కూర్చోండి.

రా. 9.30

శ్రీ భూమన కరుణాకర్ రెడ్డి: మీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయం గురించి చర్చించిన తరవాత ఖచ్చితంగా ఆ విషయాన్ని కూడా మాట్లాడడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి వెళ్లం. ఈ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయింది. ఈ ప్రభుత్వానికి పరిపాలనార్హత ఏ మాత్రం లేదు. ఈ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను కాపాడడంలో పూర్తిగా విఫలమైంది. ఏ హామీలతో అయితే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో ఆ హామీలను పూర్తిగా నెరవేర్చడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసింది, నిరాదరణ చూపింది. కర్కశ హృదయంతో పరిపాలించిన కారణంగా ప్రజలందరూ తీవ్రమైన ఆగ్రహంతో ఈ ప్రభుత్వం మీద ఉన్నారనే వాస్తవాన్ని గుర్తు చేస్తున్నాను. ఈ ప్రభుత్వ పాలనలో పసిపిల్లలు ప్రతి రోజూ కనీసం పది నుంచి ఇరవై మంది చనిపోతుంటే ఆసుపత్రులకు నిధులు కేటాయించేందుకు కనీస జ్ఞానం కూడా లేనటువంటి ప్రభుత్వం ఈ ప్రభుత్వం. ఈ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు కనీసం సంవత్సరానికి 3000 మంది పసిపిల్లలు చనిపోయారు. అవన్నీ ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హత్యలే తప్ప ఇంకొకటి కాదని ప్రజలు అనుకుంటున్నారు. ఈ ప్రజలకు మేలు చేయకుండా.................

©శ్రీ కొండ్రు మురళి మోహన్ (వైద్య విద్య శాఖా మంత్రి): అధ్యక్షా, కరుణాకర్ రెడ్డి గారు మాట్లాడుతున్న మాటలు సత్యదూరం. రాజశేఖర రెడ్డి గారి పేరు చెప్పి బతకాలని చూస్తున్నారు. చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకోవాలని చూస్తున్నారు తప్పించి, గ్రాందికంగా మాట్లాడడం తప్పించి వారి మాటల్లో విషయం లేదు. నేనొక విషయం స్పష్టంగా చెప్పగలను. కరుణాకర్ రెడ్డి గారికి ఆరోగ్యశ్రీ మీద ఏ మాత్రం అవగావహన లేదు, ఆసుపత్రుల మీద అవగాహన లేదు. ధర్నాలు చేయడం, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడం తప్ప ఆయన ఏ విధమైన డేటాతో నిజాయతీగా మాట్లాడడం లేదు. ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను. ఆరోగ్యశ్రీ పథకం కోసం 2007-08లో రూ.143 కోట్లు కేటాయించి 23,000 మందికి వర్తింప జేయడం జరిగింది. 2008లో 2,24,000 మందికి, 2009-10లో 3,26,000 మందికి, 2011-12లో 4,34,000 మందికి రూ.1125 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఈ సంవత్సరం రమారమి రూ.1450 కోట్లు ఖర్చు పెడితే ఆరోగ్యశ్రీ పథకం బాగా లేదని అంటున్నారు. మీకు కనీస ఇంగిత జ్ఞానం ఉందా? ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి గారు సంవత్సరానికి రూ.6500 కోట్లు వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో కేటాయిస్తుంటే మీరు ఈ విధంగా మాట్లాడతారా? ఈ సంవత్సరం రూ.280 కోట్లు ప్రభుత్వాసుపత్రులలో పరికరాల కోసం ఖర్చు పెడుతున్నాం. ప్రతి సంవత్సరం కూడా ముఖ్యమంత్రి గారు సంవత్సరానికి రెండు వైద్య కళాశాలలు రాష్ట్రంలో స్థాపించాలని నిర్ణయించడం జరిగింది. అందులో నిజామాబాద్, నెల్లూరులో వైద్య కళాశాలలు ఇచ్చాం. ఈ రోజు 108, 104 సర్వీసులలో చాలా ఇంప్రూవ్‌మెంట్ చేశాం. అత్యవసర సర్వీసులకు వెంటనే ఇవ్వడానికి అన్ని విధాలుగా ప్రతి సంవత్సరం 280 వాహనాలు కొత్తవి తీసుకొంటాం. ఇలా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంటే, ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కరుణాకర్ రెడ్డి గారు మాట్లాడుతున్నందుకు వారి మాటలను ఖండిస్తున్నాను. రాజశేఖర రెడ్డిగారి పేరు చెప్పుకొని, వారి బొమ్మ పెట్టుకొని ప్రజల్లోకి వెళితే ఏ విధమైన ప్రయోజనం ఉండదని వారికి మీద్వారా తెలియజేస్తున్నాను.

© An asterisk before the name indicates confirmation by the Minister

శ్రీ భూమన కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, నాకు లెక్కలు తెలియవు, ఆయనకేమో లెక్కలు తెలుసు. ఆయన లెక్కలను ఈ రోజు రాష్ట్రంలోని ఎవరూ నమ్మరు. ఎందుకంటే ఈ రోజు ఆరోగ్యశ్రీ పథకం సామాన్యులకు చాలా దూరంగా ఉంది కనుక ఎవరూ నమ్మేందుకు సిద్ధంగా లేరు. నేను ధర్నాలు చేస్తానట, రాస్తారోకోలు చేస్తానట. అవును, మీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరంతరం ధర్నాలు చేస్తా, రాస్తారోకోలు చేస్తూనే ఉంటాను. రాజశేఖర రెడ్డి గారి పేరు చెప్పుకొని రాజకీయం చేస్తాం. రాజశేఖర రెడ్డిగారి పేరుతో ప్రజల్లోకి వెళతాం. వారి బొమ్మ పెట్టుకొని ప్రజల దగ్గరకు వెళ్లి రేపు మీ పార్టీని పూర్తిగా భూస్థాపితం చేసి అధికారంలోకి వస్తాం. అందుకే మా దగ్గరకు రావడానికి మీ దగ్గరున్న వారు సగం మంది సిద్ధంగా ఉన్నారు. మేం సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని మీద్వారా గుర్తు చేసున్నాను.

(అంతరాయం)

కొత్తగా ఈ రోజున ఒక పెద్ద ఫ్యాక్టరీ కోసం రూ.1500 కోట్లతో అగ్రిమెంట్ చేసుకున్నారట. మూడున్నర సంవత్సరాల క్రితం చిత్తూరు జిల్లాలో వెంకటగిరి దగ్గర మన్నవరంలో ఏర్పాటుచేయ తలపెట్టిన మన్నవరం ప్రాజెక్టు ఇప్పటివరకు ఏమైందో ఒకసారి ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. దానికి అతీగతీ లేకుండా పోయింది. మూడు సంవత్సరాల కాలంలో రాజశేఖర రెడ్డిగారి ఆశయాలకు, ఆశలకు అనుగుణంగా ఆ ప్రాజెక్టు వస్తే 25,000 మందికి ఉద్యోగం వచ్చేది. అప్పుడు వారు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఆ ప్రాజెక్టును మన్నవరానికి తీసుకురావడం జరిగింది. మన్నవరం ప్రాజెక్టును కొనసాగించడంలో ఏమాత్రం చిత్తశుద్ధి ఇప్పటి ముఖ్యమంత్రి చూపించలేదు. 2009లో ప్రాణహిత-చేవెళ్ల, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొస్తానని రాజశేఖర రెడ్డిగారు శపథం చేస్తే మరలా 2013లో గవర్నర్ గారి ప్రసంగంలో కూడా ప్రాణహిత-చేవెళ్ల, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకు రావడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెపుతున్నారంటే కొత్తగా ఈ ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమిటని మీద్వారా ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ఈ ప్రభుత్వం ఏ రకంగా కూడా ప్రజాప్రతినిధులను కాపాడలేకపోయింది. ఈ ప్రభుత్వానికి పాలనార్హత పూర్తిగా లేదు కనుకనే ఈ అవిశ్వాస తీర్మానాన్ని బలపరచడానికి మేమందరం కూడా సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాను. ప్రభుత్వం పెద్ద ఎత్తున విఫలమైంది. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో ఏ మాత్రం శ్రద్ధ పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తుంటే ప్రధాన ప్రతిపక్షం ముందుండి అవిశ్వాస తీర్మానం పెడుతుందనే ఆశతో మేం ఉన్నాం. ప్రజాసమస్యల్ని చూపించి ప్రభుత్వాన్ని ఎండగట్టవలసిన ప్రధాన ప్రతిపక్షం పూర్తిగా ప్రభుత్వానికి కొమ్ము కాసే విధంగా, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, మేం అవిశ్వాస తీర్మానం పెడితే మేం ఈ ప్రభుత్వంతో రాయబారాలు చేసుకోవడానికి..........

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR.SPEAKER: Let him complete his speech. After that I will give you an opportunity.

శ్రీ భూమన కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, అవిశ్వాస తీర్మానం పెట్టమని పలుమార్లు అడిగాను. అయ్యా నర్సింహులు గారూ.........

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ డి.నరేంద్ర కుమార్ నుంచి అంతరాయం)

MR.SPEAKER: Let him first complete his speech. After that I will certainly give you an opportunity.

శ్రీ భూమన కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, నర్సింహులు గారు రాజశేఖర రెడ్డి గారి మీద, వారి కుటుంబం మీద అత్యంత దుర్మార్గంగా, అత్యంత అవమానకరమైన రీతిలో మాట్లాడారు. మీ నాయకుడు చంద్రబాబు నాయుడు గారి గురించి మాట్లాడాలంటే పేజీలు పేజీలు మాట్లాడగలను.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ పి.కేశవ్, జి.రామానాయుడు, శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి, శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు పోడియం వద్దకు వెళ్లారు)

(అంతరాయం)

(తెలుగుదేశం పార్టీ సభ్యులు తిరిగి తమ సీట్లకు వెళ్లారు)

శ్రీ పయ్యావుల కేశవ్ః అధ్యక్షా, కరుణాకర్ రెడ్డి గారి పార్టీ కిరణ్‌కుమార్‌రెడ్డి గారి మీద అవిశ్వాస తీర్మానం పెట్టి ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకుడి గురించి, తెలుగుదేశం పార్టీ గురించి స్వీపింగ్ రిమార్క్స్ చేస్తున్నారు. పొద్దున రాజశేఖర్ రెడ్డి గారి గురించి తెలుగుదేశం పార్టీ సభ్యులు మాట్లాడారంటే, ఇది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వారసులుగా ఆ రోజు రాజశేఖర్ రెడ్డి గారున్నారు, గతంలో కొంత కాలం రోశయ్య గారున్నారు, ప్రస్తుతం కిరణ్‌కుమార్ రెడ్డి గారున్నారు. ఈ రోజు ఈ ప్రభుత్వం చేసిన పాపాలకు ఆ రోజు రాజశేఖర్ రెడ్డి గారి నుంచి ఈ రోజు కిరణ్‌కుమార్ రెడ్డి గారి వరకు అందరూ బాధ్యులే. ఆ మూలాలలోకి వెళ్లి మేం మాట్లాడాం. ఈ రోజు కొత్తగా ఒక విషయం చెప్పాలి. 2004 నుంచి ఏయే అవినీతి, అక్రమాల మీద తెలుగుదేశం పార్టీ మాట్లాడుతూ వచ్చిందో ఆ అవినీతి అక్రమాల ఆరోపణల మీద కోర్టులు తేల్చేవరకు వచ్చింది. వాటిని మేం ప్రస్తావించాం తప్ప మేం కొత్తగా ఇతర ఆరోపణలు ఏమీ చేయలేదు.

రా.9.40

సార్, వాళ్లేమి మాట్లాడుతున్నారు? You have to expunge from the records. ఆయన (శ్రీ బి.కరుణాకర్ రెడ్డి నుద్దేశించి) తెలుగుదేశం పార్టీ బేరాలు చేసుకుంది అని మాట్లాడుతున్నారు. తెలుగుదేశం పార్టీని కొనగలిగినటు వంటి లేదా బేరాలు చేసుకోగలిగినటు వంటి సత్తా ఉన్న పార్టీ గానీ, నాయకులు గానీ ఈ భూ ప్రపంచం మీద ఉన్నారేమో చూపించమని నేను వాళ్లను అడుగుతున్నాను. ఇవాళ వాళ్లకి తెలిసిన మాట బేరాలు. బెయిల్ కోసం బేరాలు వాళ్లు పెట్టుకుంటారు, పనిచేసే లక్ష్మీ నారాయణ, జె.డి.ని ట్రాన్స్‌ఫర్ చేయమని వైఎస్ఆర్‌సిపి లెటర్ హెడ్ మీద భారత రాష్ట్రపతికి రిప్రజెంటేషన్ ఇస్తారు. ఇది ఏ రకంగా సమర్థనీయమని నేను అడుగుతున్నాను.

(శ్రీమతి భూమా శోభా నాగిరెడ్డిచే అంతరాయం)

MR.SPEAKER: Let him conclude. I will give you an opportunity. దయచేసి కూర్చోండి.

శ్రీ పి.కేశవ్ః సార్, భారత రాష్ట్రపతికి ఓటు వేస్తారు. ఉప రాష్ట్రపతికి ఓటు వేయరు. 17 సీట్లను పెట్టుకుని ఎంఎల్‌సీలకు కంటెస్ట్ చేస్తారు. ఏ రకంగా గెలుద్దామని? ఇది కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కు కాదా, బేరాలు

కాదా? మీరు కుమ్మక్కై, మీరు బేరాలు చేసుకుని తెలుగు దేశం పార్టీని అనే సాహసం చేయవద్దని తెలియచేస్తున్నాను.

MR.SPEAKER: Karunakar Reddy garu, please conclude.

శ్రీ బి.కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, మా నాయకుడు 2000 కిలోమీటర్లు ముందుకు నడుస్తుంటే, ఆ పార్టీకి సంబంధించిన శాసన మండలి నాయకుడు, మా పార్టీ 3000 కిలోమీటర్లు వెనక్కు పోతున్నదని అని మూడు రోజులు కాలేదు. మీరు అవిశ్వాస తీర్మానం మీద మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి గారి మీద అత్యంత అవమానకరంగా మాట్లాడినందుకు సమాధానం చెప్పవలసిన బాధ్యత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద ఉంది కాబట్టి ఆ విధంగా సమాధానం చెప్పవలసిన పరిస్థితి వచ్చింది. రాజశేఖర్ రెడ్డి గారు అవినీతిని గురించి మాట్లాడుతున్నారు. చంద్రబాబు నాయుడు గారి గురించి, ఆయన అవినీతి గురించి, ఆయన పాలన గురించి చెప్పాలంటే రోజుల తరబడి చెప్పవచ్చు.

(ఈ సందర్భంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు తమ స్థానాల ముందు నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

(అంతరాయం)

శ్రీ డి.నరేంద్ర కుమార్ ః అధ్యక్షా,

MR.SPEAKER: Please wait. Let him conclude.

(Interruptions)

మీరు ఒక్క నిమిషం కూర్చోండి. మీకు అవకాశం ఇస్తాను.

శ్రీ బి.కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, అడుగడుగునా రాజశేఖర్ రెడ్డి గారిని గురించి, రాజశేఖర్ రెడ్డి గారి కుటుంబాన్ని గురించి అత్యంత నీచంగా, అవమానంగా మాట్లాడినందుకు సమాధానం ఇవ్వవలసిన బాధ్యత రాజశేఖర్ రెడ్డి గారి అభిమానిగా నా మీద ఉంది.

MR.SPEAKER: Please conclude.

శ్రీ బి.కరుణాకర్ రెడ్డిః అయ్యా, రాజశేఖర్ రెడ్డి గారికి శత్రుపక్షంగా ఉన్నటు వంటి  మీరు (టిడిపి నుద్దేశించి) "రాజా ఆఫ్ కరప్షన్" అని ఒక పుస్తకాన్ని వేశారు. అది పదే పదే చూపిస్తున్నారు. మీకు మిత్రపక్షంగా ఉన్నటు వంటి కమ్యూనిస్టులు "బాబు జమానా – అవినీతి ఖజానా"  అని ప్రచురించిన పుస్తకాలను ఊరు వాడా పంచిన విషయాన్ని మీరు మరచి పోతున్నారు. అది మీకు మిత్రపక్షమైనటు వంటి కమ్యూనిస్టు పార్టీలు వేసిన పుస్తకం. మీ పాలన అంతా అవినీతిమయమని మీతోపాటు కలిసి పోటీ చేసినటు వంటి మీ మిత్రపక్షాలు చేసిన ఆరోపణ. మీరు మమ్మల్ని ప్రత్యర్థులుగా కాదు, శత్రువులుగా భావిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థి పార్టీలుంటాయే తప్ప శత్రువులు ఉండరు. కానీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మీరు శత్రువులుగా భావించి, శత్రు పార్టీగా పరిగణించి అడుగడుగునా మమ్మల్ని శత్రువులుగా చూస్తున్నారు.

MR.SPEAKER: Karunakar Reddy garu, please conclude.

శ్రీ బి.కరుణాకర్ రెడ్డిః రాజశేఖర్ రెడ్డి గారిని చూస్తే, రాజశేఖర్ రెడ్డి గారి పేరంటే ఎందుకు మీకంత భయం, ఎందుకంత బెరుకు? ఎందుకంటే రాజశేఖర్ రెడ్డి గారి బొమ్మ పెట్టుకుని, రాజశేఖర్ రెడ్డి గారి పేరు చెప్పుకుని, రాజశేఖర్ రెడ్డి గారి పార్టీ పేరుతో మేము రేపు ఎన్నికల్లో మీకు అధికారం రాకుండా చేస్తున్నామనే భయం. అందుకు రాజశేఖర్ రెడ్డి గారి పేరంటేనే భయపడి వణికి పోతున్నారు మీరు.

MR.SPEAKER: Karunakar Reddy garu, that's enough. Please sit down. I have given you an opportunity but you have not utilized it.

శ్రీ బి.కరుణాకర్ రెడ్డిః అధ్యక్షా, అవిశ్వాస తీర్మానం మీద చర్చ జరిగితే అధికార పక్షము, ప్రతి పక్షమూ ఇవి రెండూ దాదాపు మూడు గంటల సేపు మాట్లాడితే రెండు గంటల పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని కేంద్రీకరించి మాట్లాడటం జరిగింది. మీరన్నారు(అధికార పక్షాన్ని ఉద్దేశించి), రాజశేఖర్ రెడ్డి గారి పేరు చెప్పుకుని మేము ఎన్నికల్లో నిలబడతామని. రాజశేఖర్ రెడ్డి గారి పేరు చెప్పుకునే మేము ప్రజల్లోకి వెళతాం. మీకు అధికారం పోతుందని, వీళ్లకు అధికారం రాదని, మీరిద్దరూ ఒక్కటే. ఈరోజున ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేసి, ప్రజా సమస్యల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించ కుండా విఫలమవుతున్నటు వంటి మిమ్మల్ని ఎండగట్టటంలో పూర్తిగా బాధ్యతను మరచినటువంటి ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ విధానాలను ఖండిస్తూ అన్ని రంగాల్లో విఫలమైన ఈ ప్రభుత్వం పాలించడానికి ఏ మాత్రం అర్హత లేదని కోట్ల గొంతులు ఒక్కసారి గర్జిస్తాయి. సీట్ల మీద కూర్చున్న మంత్రులారా, ఖబడ్దార్. ప్రజాస్వామ్యమనే ముసుగు తగిలించుకున్న మీ పైన సజావుగా పరిసమాప్తి జరుగు రోజులు వచ్చాయి.

(మైకు కట్ చేయబడింది).

రా.9.50

శ్రీ ద్రోణం రాజు శ్రీనివాసరావుః అధ్యక్షా, మైకివ్వండి...

మిస్టర్ స్పీకర్ః అవకాశం ఇస్తానండీ. శ్రీనివాస రావు గారూ... ఎందుకంత ఆవేశం. కొద్ది సేపు ఉండండి. దయచేసి కూర్చోండి. I will give you an opportunity. Please resume your seat. Yes.. Narendrakumar garu...

శ్రీ డి. నరేంద్రకుమార్ః అధ్యక్షా, కరుణాకర్ రెడ్డి గారిది మేడ్ ఇన్ స్పీచ్ అని చెప్పారు. ఆయన కొత్తగా మాట్లాడుతున్నాడు. ఏదో మాట్లాడతాడని మేం అందరం ఎదురు చూశాం. కానీ ఆయనేం చేశారు. చంద్రబాబు నాయుడి గారి మీద విమర్శలు చేశారు. రాజశేఖర్ రెడ్డి గారు అపోజిషన్ లీడర్గా ఇక్కడ కూర్చుని, అధికారంలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి గారి మీద అప్పట్లో విమర్శలు చేశారు. 2004 నుండి రాజశేఖర్ రెడ్డి గారు చనిపోయేంత వరకు ముఖ్యమంత్రిగా వున్నారు. చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో రాజశేఖర్ రెడ్డిగారు అపోజిషన్లో ఇక్కడ ఉండి విమర్శలు చేశారే... మరి చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా వుండగా తీసుకున్న ఒక్క నిర్ణయం కూడా తప్పని, రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో నిరూపించలేదు కదా అని నేను ప్రశ్నిస్తున్నాను.

చంద్రబాబు నాయుడు గారి మీద 24 కమిటీలు వేశారు. 16 కోర్టు కేసులు వేశారు. ఎవరు వేశారు? కాంగ్రెస్ పార్టీ అసోసియేటెడ్ మెంబర్లు ఈ కేసులు వేశారు. అలాగే ఇందాకే చెప్పారు. వై.ఎస్.విజయ గారు... అనాడు రాజశేఖర్ రెడ్డి గారు బ్రతికున్నప్పుడు చంద్రబాబు నాయుడి గారి మీద కోర్టు కేసు వేసి ఆయన

విత్‌డ్రా చేసుకుంటే, మొన్న వై.ఎస్. విజయ గారు లేనిపోని అభూత కల్పనలన్నీ పోగుచేసి పిటీషన్ వేస్తే నిన్నగాక మొన్న కోర్టులో కొట్టివేసిన విషయం వాళ్లకి తెలియదా? ఏ కంపెనీలైతే ఆ కేసుల్లో వాళ్లు ప్రస్తావించారో, ఆ కంపెనీలన్నింటికీ రాజశేఖర్ రెడ్డి గారు బ్రతికున్న కాలంలో మేమిచ్చిన దానికంటే అదనపు ఎగ్జంప్షన్స్ ఇవ్వలేదని వాళ్ల గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పమనండి. ఎవర్ని మభ్యపెట్టడానికి ఇదంతా అని మేము అడుగుతున్నాము. చంద్రబాబు నాయుడి గారి హయాంలో తీసుకున్న ప్రాజెక్టులు దాదాపు 70, 80 మెగా ప్రాజెక్టులు. వాళ్లు చెప్పారు. రాజశేఖర్ రెడ్డి గారు ఇక్కడ ప్రతిపక్ష నాయకుడిగా పిపిఏల సమీక్ష అని చెప్పి, మేము పిపిఏలకు దోచిపెట్టామని చెప్పి ఇక్కడ మాట్లాడారే! ముఖ్యమంత్రి అయిన తరువాత రోశయ్య అధ్యక్షతన ఒక క్యాబినెట్ సబ్‌కమిటీ వేసి మేం చేసిన పిపిఏల్లో తప్పు జరిగిందనే మాట ఎక్కడన్నా నిరూపించారా? మీరు సొమ్ము చేసుకుని, మా మీద విమర్శలు చేస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వుండగా, క్యాబినెట్ సబ్‌కమిటీలు వేశారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలి.

MR.SPEAKER: Whatever he said is clarified.

శ్రీ డి. నరేంద్ర కుమార్: కంక్లూడ్ చేస్తాను అధ్యక్షా. క్యాబినెట్ సబ్‌కమిటీని వేశారు. మేము ఈ రాష్ట్రంలో 70, 80 మెగా ప్రాజెక్టులిచ్చాము. ఒక్క ఐఎంజీ భారత్ తప్పితే, మేము తీసుకున్న ఏ నిర్ణయమైనా సరైంది కాదని, రాజశేఖర్ రెడ్డి గారితో సహా, వారి క్యాబినెట్లో వున్న వాళ్లు ఎవరైనా సరే మేం వేసిన దానికి రాజముద్రలు వేశారు కదా అధ్యక్షా. మేము అవినీతి చేశామా? కేవలం ప్రజల్ని మభ్యపెట్టడానికి మా మీద చేస్తోన్న ఆరోపణలు. అవిశ్వాసం గురించి ఒక్కమాట. మా పార్టీ గుర్తు మీద మా మెంబర్లకి మేము ఇప్పించాము. మా పార్టీ గుర్తు మీద గెలిచిన మెంబర్లు. మా పార్టీ మెంబర్లకు మేమిస్తే వాళ్లకు కడుపునొప్పి ఎందుకు? మా పార్టీలో సైకిల్ గుర్తు మీద గెలిచిన మెంబర్లను, ఇవాళ ఈ ఫ్లోర్ మీదకు తీసుకువచ్చి అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయించుకునే స్థితికి మీరు దిగజారారంటే ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని మనవి చేస్తున్నాను. ఏమిటి అధ్యక్షా వీళ్లు మాట్లాడేది. నీతులు చెప్పడానికేనా, ఆచరణలో చూపించరా......

(మైకు కట్ చేయబడింది.)

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు కరుణాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గురించి, అప్పటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి గురించి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి గారు మా సొత్తు, ఆయన పేరు మీదుగా మేము ఎన్నికలకు వెళ్లాం, మళ్లీ మా పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటామన్నారు. 2004 ఎన్నికల్లో రాజశేఖర్ రెడ్డి గారి నాయకత్వంలో ఎన్నికల్లోకి వెళ్లాము. ఆ రోజున కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించి ఇదిగో ఇక్కడున్న నాయకులు అందరూ కూడా... బొత్స సత్యనారాయణ, కన్నా లక్ష్మీ నారాయణ, రఘువీరా రెడ్డి, దానం నాగేందర్, రామిరెడ్డి గారు, కిరణ్ కుమార్ రెడ్డి గారు 2004లో తయారైన సరుకు కాదు. 1989 నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా తయారయ్యి 2004 లో రాజశేఖర్ రెడ్డి అనే ఒక నాయకుడు కాంగ్రెస్ పార్టీకి పని చేస్తాడని, ఆయన వెన్నంటి వుండి కాంగ్రెస్ పార్టీని శ్రీమతి సోనియా గాంధీ గారి నాయకత్వంలో బలోపేతం చేసుకుని కష్టపడి అధికారంలోకి తెచ్చుకున్నారు. ఆ రోజు మా తండ్రి గారు కాంగ్రెస్ పార్టీలో వున్నారు. 1991 నుండి 2004 ఎన్నికల్లో పోటీ చేసి ఆయన శాసన సభ్యుడయ్యాడు. ఆయన కష్టాల్లో, ఆయన అడుగు వేస్తే ముళ్లు గుచ్చుకుంటే బాధపడ్డ వాళ్లు వీళ్లు. వీళ్లు కూడా ముళ్లు గుచ్చుకున్నారు. ఎందుకు?

కాంగ్రెస్ పార్టీ 2009లో తిరిగి ఎన్నికలకు వెళ్లింది. అప్పుడు ఎన్ని సీట్లు వచ్చాయి? శాసన సభలో 156 సీట్లు వచ్చాయి. పార్లమెంటుకు 33 సీట్లు వచ్చాయి. ఇదే ఫ్లోర్‌లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.

రాజశేఖర్ రెడ్డి గారు.. that is on record. రికార్డు అయ్యింది. నేను 200 సీట్లు వస్తాయనుకున్నాను కానీ రాలేదు. ఎక్కడో తప్పు జరిగింది. ఈ ప్రభుత్వానికి డిస్టింక్షన్ వస్తుంది అనుకున్నాను. కానీ, 156 సీట్లు వచ్చి, ప్రజలు 35 మార్కులు వేశారు. అంటే మన పరిపాలనలో ఎక్కడో తప్పు జరిగింది. ఎక్కడో లోటు జరిగింది. మన పేరు చెప్పుకుని ఎవరో తప్పు చేశారు. ఆ తప్పు మన మీద జరిగింది. మన పార్టీకి, మన జెండాకు మరక పట్టింది అని రచ్చబండకు వెళ్లారు. ఆ రచ్చబండ కార్యక్రమానికి వెళుతూ వారు చనిపోయారు.

అధ్యక్షా, ఇవాళ కిరణ్ కుమార్ రెడ్డి గారు ఏ పథకాన్ని ఆపేశారని అడుగుతున్నాను. రాజశేఖర్ రెడ్డి గారి మీద నీళ్లకేదో ప్రేమ వున్నట్లు, రాజశేఖర్ రెడ్డి గారు లేకపోతే బ్రతకలేమన్నట్లు ఓదార్పుల పేరుతో చనిపోయిన వారి కుటుంబాలను ఓదారుస్తూ మీరు చేస్తున్న స్వార్థపూరితమైన రాజకీయాలకు ఎవరిని బలిస్తారండీ? వీరందరూ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు (అధికార పక్ష సభ్యులను ఉద్దేశించి). రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలని, 25, 29 ఏళ్ల వయస్సులో వారు వ్యాపారాలను వదిలి, ఉద్యోగాలు మాని, సర్వం త్యాగం చేసి శాసన సభలో అడుగుపెడితే, కాంగ్రెస్ సిద్ధాంతాలు నమ్మి, ఆశయాలు నమ్మి, అప్పటి నాయకుడిగా పని చేస్తున్న రాజశేఖర్ రెడ్డి గారిని నమ్మి రాజకీయాల్లోకి వచ్చారు. ఇవాళ మీరు చేస్తున్న దురాగతాలన్నీ రాజశేఖర్ రెడ్డి గారి శవాన్ని....

(మైకు కట్ చేయబడింది)

శ్రీ ఏ. రేవంత్ రెడ్డి (కొడంగల్): అధ్యక్షా, ఆలస్యంగానైనా అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. " అన్నపు రాశులు ఒకచోట-ఆకలి మంటలు ఇంకొక చోట, పెత్తనమంతా ఒక చోట-సత్తువంతా ఇంకొక చోట, అనుభవమంతా ఒక చోట-అధికారంబనునది ఇంకొక చోట, సత్తా రాగానే కన్నులు నెత్తికెక్కిపోతాయని... త్యాగులు సైతం ఘడియలో భోగులై పోతారని.. త్రివర్ణ పతాక ఛాయలో త్రిశంకు స్వర్గం కలదని, తెల్లకాగి తెరచాటున నల్లబజారు నాటకమని... కాంగ్రెస్ వాదుల చేతనే సరుకులు కనపడకుండా మాయమౌతాయని.. నిండిన గోదాముల ముందు తిండి లేక చస్తామని... ఎవరనుకున్నారు ఇట్లవుతుందని! ఎవరనుకున్నారు! " ఇలా తెలంగాణా వైతాళికుడు, ప్రజాకవి శ్రీ కాళోజీ గారు ఎప్పుడో ఈనాటి పరిస్థితులను గమనించే, కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏం జరుగుతుందనేది ప్రజలకు కళ్లకు కట్టినట్లు కవిత్వంగా వ్రాశాడు.

రా.10.00

ఆనాడు దీనిని చదివిన వాళ్లకు ఇది అవుతుందో లేదో అనిపించి ఉండొచ్చు. కానీ ఈనాడు ఇది నిజమై ప్రజల జీవితాలు కకావికలం అయిపోయాయి. ప్రజాప్రభుత్వం అంటే సంక్షేమం, అభివృద్ధి అనే రెండు పట్టాల మీద నడిచేది. మొట్టమొదట సంక్షేమానికి వద్దాం. ఏ రాష్ట్రానికైనా దేశానికైనా అభివృద్ధికి కొలబద్ధ విద్యుత్. ఏ రాష్ట్రంలోనైతే 24 గంటలు 365 రోజులపాటు విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయగలుగుతుందో అప్పుడు ఆ దేశం లేక ఆ రాష్ట్రం అభివృద్ధి చెందిందని ప్రపంచ పటంలో చూపిస్తున్నారు. 1947వ సంవత్సరం అంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 1994వ సంవత్సరం వరకు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని సంవత్సరాలు, ఈ రాష్ట్రానికి జరిగిన విద్యుత్ కేటాయింపుల మొత్తం 5,634 మెగావాట్లు. 1994వ సంవత్సరం నుండి మా పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిది సంవత్సరాల్లో దానిని 10,635 మెగావాట్లకు పెంచిన ఘనత మా తెలుగుదేశం పార్టీది.

ఆ నాడు మా నాయకుడు విద్యుత్ సంస్కరణలను తీసుకొచ్చి, ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ఈ రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులు రావాలన్నా, పేద రైతులు బాగు పడాలన్నా, చిన్నాచితకా కుటుంబాలు

అభివృద్ధి పథం వైపు పయనించాలన్నా, విద్యుత్‌ను సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో ఆనాడు విద్యుత్ సంస్కరణలను తీసుకురావడం జరిగింది. దాని మీద 2003-04 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో కేటాయించింది రూ.48,555 కోట్లయితే, మేము ఆనాడు రూ.3072 కోట్లను అంటే 7.89 శాతం నిధులను కేటాయించి, విద్యుత్ సంస్కరణలను, విద్యుత్‌లో నికర పెట్టుబడులను పెట్టి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించడానికి మా అధ్యక్షుడు ఆనాటి ముఖ్యమంత్రి ప్రయత్నం చేశారు. అయితే ఈ సంస్కరణల్లో భాగంగా 2003వ సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కి రూ.40 పైసలు పెంచితే ఆ మొత్తం కలిపి రూ.200 కోట్లు కూడా కాదు. ఆనాడు పెంచినటువంటి విద్యుత్ ఛార్జీలకు నిరసనగా బషీర్‌బాగ్‌లో ఇక్కడున్న మా కమ్యూనిస్ట్ పార్టీ సోదరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ వారు ధర్నా చేశారు. ఆ ధర్నాను హింస వైపు మరలించి ఆనాడు కాల్పులకు కారణమయ్యారు. పోలీసుల మీద కూడా దాడులు చేశారు. ఆ రోజు మా ప్రభుత్వాన్ని కుప్పకూల్చే విధంగా ప్రయత్నం చేసి, అధికారంలోకి రావడానికి కుట్ర చేసిన కాంగ్రెస్ పార్టీ ఈ రోజు అధికారంలో కొనసాగుతోంది.

ఆనాడు కమ్యూనిస్ట్ సోదరులు ఏదైతే ఉద్యమం చేశారో ఆ ఉద్యమం నేపథ్యంలో మీకు అధికారం వచ్చింది. అయితే మీరు 2014వ సంవత్సరం వరకు ఒక్క పైసా కూడా విద్యుత్ ఛార్జీలను పెంచమని చెప్పి అధికారంలోకి రావడం జరిగింది. కానీ ఈ రోజు ఏమి జరిగింది అధ్యక్షా? గత మూడు సంవత్సరాల కాలంలో రూ.31000 కోట్ల భారాన్ని ప్రజల పైన మోపారు. సర్ ఛార్జీల పేరిట విద్యుత్ ఛార్జీలను పెంచడం పేరిట, ఈ రోజు రాష్ట్రంలో ఉన్న రైతులను, పేదలను, దళితులను, గిరిజనులను, ఎవరినీ కూడా వదలకుండా పన్ను మోతలతో వెన్ను విరిచారు. ఇంతకంటే దుర్మార్గం మరెక్కడైనా ఉంటుందా?

అదే విధంగా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ రాష్ట్రంలోని రైతులు మూడు సంవత్సరాలపాటు కరువు కాటకాలతో అల్లలాడుతుంటే, తొమ్మిది గంటలు నిఖార్సైన విద్యుత్‌ను అందించి ఆదుకున్న చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉన్నది. అదే విధంగా, గ్రామాల్లోని ఇళ్లకు ఇరవైనాలుగు గంటలు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి మా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు గారికి ఉన్నది. కానీ ఈ రోజు ఒక్క సంవత్సరం కూడా కరువు వచ్చిందో లేదో, మీరు చేతులెత్తేశారు. మొన్న ముఖ్యమంత్రి గారు ఏమి చెబుతున్నారు అధ్యక్ష? శ్రీశైలం డ్యామ్‌లో నీళ్లు లేవు, నాగార్జున సాగర్‌లో నీళ్లు లేవు, నేను భారమంతా దేవుడి మీద వేశానని చెబుతున్నారు. అంతా దేవుడే చూసుకుంటే మీరెందుకు మరి కుర్చీలో కూర్చున్నారు? ఆ కుర్చీలో కూడా దేవుడే కూర్చుంటాడు కదా! మీరు కూర్చొని ఏమి చేస్తున్నారు?

అదే విధంగా, ఈ రాష్ట్రానికి సంబంధించి ఈ దేశంలో కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌ను 2008వ సంవత్సరంలో ప్రణబ్ ముఖర్జీ గారి నాయకత్వంలోని మంత్రుల బృందం 2008వ సంవత్సరంలో సమావేశమై 2012వ సంవత్సరంలో 80 ఎంఎంఎస్‌సిఎండి ఉత్పత్తి అవుతుంది. అందులో నుండి 3.5 ఎంఎంఎస్‌సిఎండిని రత్నగిరి ప్రాజెక్ట్ మహారాష్ట్రా ప్రభుత్వానికి కేటాయించమని ఆ నాడు నిర్ణయం తీసుకున్నారు. కానీ ఈ రాష్ట్రానికి కోత విధించి ఈ మధ్య కాలంలో మహారాష్ట్రాకి గ్యాస్‌ను మళ్లింపజేస్తే, రాష్ట్ర పార్లమెంటు సభ్యులు, ముఖ్యమంత్రి గారు, ఇక్కడ ఉన్న వాళ్లందరూ పోయి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేసి ఆ గ్యాస్‌ను తిరిగి తీసుకువచ్చి ల్యాంకోకు, జిఎంఆర్‌కు, జివికేకు కేటాయిస్తే, బాగుండేది. అట్లాకాకుండా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ప్రక్క రాష్ట్రాలకు వారు అమ్ముకుంటుంటే మన ప్రభత్వం కళ్లప్పగించి చూస్తోంది. ఈనాడు రాష్ట్ర ప్రభుత్వానికి, ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో డిస్కాంలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి. ఆ విద్యుత్ సంస్థలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.18,000 కోట్లను బకాయి పడింది. ఈ దుర్మార్గం ఈ రోజుది కాదు. 2004వ సంవత్సరంలో రూ.1250 కోట్ల రైతుల విద్యుత్ ఛార్జీలను మాఫీ చేస్తున్నానని మొదటి సంతకం పెట్టిన రాజశేఖర రెడ్డి గారు, విద్యుత్ సంస్థలను కుప్ప కూల్చడానికి ఆనాడే పునాదులను వేశాడు. ఆనాటి నుండి ఈనాటి వరకు

విద్యుత్ సంస్థలకు కేటాయించాల్సిన బకాయి పడ్డ పన్నులను ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదో ఈ రోజు ఆయన గురించి గొప్పలు చెప్పుకుంటున్న ప్రతి ఒక్కరూ.. సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

మేము సంస్కరణల పేరుతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డును ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జన్‌కో డిస్కాంల పేరు మీద విభజన చేసి, నిరంతరంగా సరఫరా చేస్తున్న ఈ సరఫరాలో 37 శాతం నుండి 22 శాతానికి వేస్టేజ్‌ని తగ్గించడం జరిగింది. అంటే 17 శాతం వేస్టేజ్‌ని మేము తగ్గించగలిగాము. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత 22 శాతాన్ని కాస్తా 15 శాతానికి తగ్గించారు. అంటే 5 శాతాన్ని మాత్రమే మీరు తగ్గించగలిగారు. వాస్తవాలు ఈ విధంగా ఉంటే కరెంటు కోసం ధర్నాలు చేసినా రైతులను కాల్చి చంపాడని బషీర్‌బాగ్‌లో ఒక స్తూపాన్ని కట్టి, ఈరోజు కూడా నిస్సిగ్గుగా రైతాంగం నడ్డి విరిచిన వాళ్లు అక్కడ నుంచి ఇక్కడకు నడుచుకుంటూ వచ్చారు. అంటే ఇప్పటికీ కూడా ఆనాడు చనిపోయిన పోరాట యోధుల శవాల మీద ఓట్లు అడుక్కోవాలని కొంత మంది ఇంకా ఆశపడుతున్నారు. ఈనాడు ఇలాంటి విద్యుత్ సంక్షోభానికి కారణం ఆనాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు కదా అని అడుగుతున్నాను.

అలాగే ఈ రాష్ట్రంలో హాలిడేల పరంపర కొనసాగుతోంది. క్రాప్ హాలిడే – కరెంట్ హాలిడే –కాలేజీలకు హాలిడే – ముఖ్యమంత్రి గారి క్యాంప్ ఆఫీసుకు హాలిడే. హాలిడే లేనిది ఒకే ఒక్కదానికి అధ్యక్షా. కరప్షన్‌కు హాలిడే లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరప్షన్‌ని నిరంతరం ఇరవై నాలుగు గంటలు 365 రోజులు ఆన్‌లైన్ చేసింది. రాజశేఖరరెడ్డి గారు ఈ ప్రజలకు అందించిన ఫలాలు ఈ రాష్ట్రంలో ఏమైనా ఉన్నాయా అంటే నిరంతరం కరప్షన్‌ని ఆన్‌లైన్ చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.

రా.10.10

అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లు ఎనభై లక్షలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు 66 లక్షల ఇళ్లు ఇచ్చామని చెబుతున్నారు. కట్టింది మాత్రం 39 లక్షలని ప్రభుత్వం చెబుతున్నది. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రూ.17,000 కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారు. రాష్ట్రం మొత్తం చూసినా పది, పదిహేను లక్షల ఇళ్లకు మించి కట్టలేదు. మరి ముప్పై తొమ్మిది లక్షలు ఎట్లా వచ్చాయని మీరు అడగొచ్చు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరు పది ఇండ్లు పేదవారి పేరు మీద రాసుకొని పేదల పేరు మీద ఇంద్ర భవనాలు కట్టుకున్నారు. ఈ విధంగా కట్టుకున్న భవనాలకు రూ.39 లక్షలు ఖర్చు అయ్యాయి తప్ప అవి ఎక్కడ కూడా పేదలకు చెందలేదు.

MR.DY.SPEAKER: Yes, Legislative Affairs Minister Garu.

శ్రీ డి.శ్రీధర్‌బాబుః అధ్యక్షా, రేవంత్‌రెడ్డి గారు మాట్లాడుతూ రిఫామ్స్ గురించి చెప్పారు. రైతులకు, పేద ప్రజలకు ఉపయోగపడే భాగంలోనే రిఫామ్స్ తీసుకురావాలి. మేం చేసిన రిఫామ్స్ reforms with human face. తెలుగుదేశం పార్టీ మొదలు పెట్టిన రిఫామ్స్ reforms for world bank అనేది మీరు దృష్టిలో పెట్టుకోవలసిన అవసరమున్నది. మేం రిఫామ్స్‌ను పేద ప్రజల కోసం చేసే అంశంలో ఎ.పి.ఇ.ఆర్.సి.లో భాగంగా మీరు తీసుకొచ్చినంత మేం తీసుకురాలేకపోయాం. హ్యూమన్ ఫేస్‌తో మేం ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టాం. ఇందిరమ్మ కార్యక్రమంలో కూడా రిఫామ్స్‌లో భాగంగానే పేదవాడికి కేవలం వంద రూపాయలకే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిది సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా పేదవారికి ఇండ్లు కట్టిద్దామనే ఆలోచన వచ్చిందా అని అడుగుతున్నాను. మా ప్రభుత్వం పేదలకు ఎనభై లక్షల ఇండ్లను కట్టించే కార్యక్రమంలో భాగంగా లక్షలాది మంది పేదలకు ఇండ్లు కట్టిస్తుంటే అవి పెద్ద భవంతులనే

విధంగా చులకన భావంతో మాట్లాడటం రేవంత్‌రెడ్డి గారికి సరైన పద్ధతి కాదు. మేం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి IAY పథకం కింద కాని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలలో అదనంగా గ్రాంట్ ఏ విధంగా ఇస్తున్నాం, లోను ఏ విధంగా టై అప్ చేశామనేది వారికి తెలుసు. వారి నియోజకవర్గంలోనే ఎన్ని వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామో చెప్పమనండి. వ్యవస్థలో చిన్న చిన్న ఇబ్బందులున్నప్పటికీ వాటిని అధిగమించుకొని ఎనభైలక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలనే కార్యక్రమాన్ని మొదలుపెట్టి అమలు చేస్తున్నాం. రేవంత్ రెడ్డి గారిని వాస్తవాలు మాట్లాడమని కోరుతున్నాను. ఎందుకంటే వారు కొంచెం స్టడీ చేస్తారని తెలుసు కాని దానిని వక్రీకరించకుండా నేరుగా చెప్పమని మా సోదరుడిని కోరుతున్నాను.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు : అధ్యక్షా, ఒక్క నిమిషం మైకు ఇవ్వండి.................

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: దయాకర్ రావు గారూ, ఇప్పటికే చాలా ఆలస్యమైంది. Yes, Dayakar Rao Garu.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు: అధ్యక్షా, శ్రీధర్ బాబు గారు హౌసింగ్ గురించి చాలా గొప్పగా చెప్పారు. హౌసింగ్‌లో జరుగుతున్న అవకతవకల గురించి చేసిన ఛాలెంజ్‌లో భాగంగా ఎవరిది తప్పైతే వారు రాజీనామా చేయాలి. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన నిధులు మొత్తం బినామీ పేర్లతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఉపయోగించుకున్నారని నేను నిరూపించలేకపోతే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను. మీరు చెప్పింది తప్పని తేలితే మీరు రాజీనామా చేస్తారా అని అడుగుతున్నాను. వరంగల్ జిల్లాకు రేపు ఉదయమే టూర్ పెట్టుకొని యాభై గ్రామాలలో వెరిఫై చేద్దాం.

శ్రీ డి. శ్రీధర్‌బాబు: అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మా పార్టీ జెండాను నమ్ముకొని పనిచేసే వ్యక్తి. పేదవారికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన వారే కాంగ్రెస్ కార్యకర్తలు. వారికి ఇండ్లు ఇస్తే తెలుగుదేశం సభ్యులకెందుకు అంత కోపం? తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు భవంతులుంటాయి కాబట్టి వారికి ఇందిరమ్మ ఇండ్లు అవసరం లేదు. మా పార్టీ కార్యకర్తలు పేద వర్గానికి సంబంధించిన కార్యకర్తలు. వారికి ఇండ్లు ఇస్తే అంత కోపమెందుకో నాకు అర్థం కావడం లేదు.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు: అధ్యక్షా, ఒక్క నిమిషం మైకు ఇవ్వండి.

MR.DY.SPEAKER: Yes Revanth Reddy Garu. Dayakar Rao Garu please sit down. మీ సభ్యుడు మాట్లాడుతున్నాడు, వారు సమాధానం చెప్పగలరు కాబట్టి దయచేసి కూర్చోండి.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు: అధ్యక్షా, ఒక్క నిమిషం మైకు ఇవ్వండి.

MR.DY.SPEAKER: Yes, Dayakar Rao Garu.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు: అధ్యక్షా, వరంగల్ జిల్లాలోని యాభై గ్రామాలకు నేను తీసుకెళతాను. మీ పార్టీకి చెందిన ఒక పెద్ద లీడరే 500 ఇందిరమ్మ ఇండ్లను బినామీ పేర్లతో తీసుకున్న సంఘటనలు ఉన్నాయి. నేను నిరూపించకపోతే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను.

MR.DY.SPEAKER: Yes Revanth Reddy Garu.

శ్రీ ఎ.రేవంత్ రెడ్డిః అధ్యక్షా, 2000 సంవత్సరంలోనే ఈ దే శంలోనే ఆదర్శంగా ఉండే విధంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీని మా నాయకుడు చంద్రబాబునాయుడు గారు ఏర్పాటు చేసి విద్యుత్ సంస్థలు ప్రభుత్వం చేతిలో ఉంటే దుర్వినియోగం అవుతాయనే ఉద్దేశంతో దానిని అటానమస్ బాడీగా ఏర్పాటుచేసి తద్వారా విద్యుత్ చార్జీలను పెంచాలా వద్దా అనేది ప్రజలందరికీ భాగస్వామ్యం కల్పించే విధంగా ఆనాడు సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల అభిప్రాయం మేరకే విద్యుత్ చార్జీలను చెల్లించే రిఫామ్స్‌ను తీసుకు రావడం జరిగింది. కానీ 2003 సంవత్సరంలో ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా తీసుకున్నది. నాలుగు సంవత్సరాల ముందే ప్రజల పక్షాన ఆలోచించి ఇలాంటి నిర్ణయం తీసుకున్నది మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మా నాయకుడు తీసుకున్నారనే విషయం మంత్రిగారు తెలుసుకోవాలి. చంద్రబాబునాయుడు గారు అధికారంలో ఉన్నప్పుడు కరవు వచ్చినా కూడా రైతులకు తొమ్మిది గంటల కరెంట్ ఇచ్చారు. రాజశేఖర్ రెడ్డి గారిని ప్రజలు ఎన్నుకున్నందుకు రైతులకిచ్చే తొమ్మిది గంటల కరెంటును కాస్త ఏడు గంటలకు కుదించారు ఇది నిజం కాదనుకుంటే ఒక్కసారి రికార్డులను తిరగేయండి. రాజశేఖర్ రెడ్డి గారి తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన రోశయ్య గారు ఏడు గంటల విద్యుత్ సరఫరాను అయిదు గంటలకు కుదించారు. ఆ తర్వాత ఆయన వారసుడుగా వచ్చిన పెద్దలు కిరణ్ కుమార్ రెడ్డి గారు అయిదు గంటల విద్యుత్ సరఫరాను మూడు గంటలకు కుదించారు. మేం తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాతో మొదలుపెడితే మూడవ ముఖ్యమంత్రి వచ్చేసరికి మూడు గంటల సరఫరా అయింది. మీ ప్రభుత్వం చేస్తున్న సంస్కరణల ఫలితాలు పేద ప్రజల కర్మల కింద అనుభవిస్తున్నారనే సంగతి మంత్రిగారు తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాటాకులతో గుడిసె వేసుకోవడానికి ఇచ్చేవారు. మహానుభావుడు ఎన్.టి.రామారావు గారు అధికారంలోకి వచ్చిన తర్వాత పేదవారు గుడిసెల్లో ఉండకూడదు, వారికి పక్కా ఇండ్లు కట్టించాలని ఆనాడు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రణాళిక పక్కాగా చేసి పేద ప్రజలకు శాశ్వత గృహ నిర్మాణం చేసిన వారు ఎవరైనా ఈ దేశంలో ఉన్నారా అంటే అది నందమూరి తారకరామారావు గారే అన్న సంగతి కూడా మంత్రి గారు తెలుసుకోవాలి.

రా.10.20

ఎన్టీ రామారావు గారి నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పేదవాడు గుడిసెల్లో ఉండొద్దనే ఉద్దేశంతో, పక్కా ఇండ్ల నిర్మాణం పేద వారికోసం చేపట్టాలనే ఉద్దేశంతో ఆనాడు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రణాళికాబద్ధంగా, పేదల కొరకు శాశ్వత గృహ నిర్మాణాన్ని చేసిన వారెవరైనా దేశంలో ఉన్నారంటే, ఆ ఘనత కేవలం ఒక్క నందమూరి తారకరామారావు గారికే దక్కుతుంది. ఆ సంగతి కూడా గౌరవ మంత్రి వర్యులు తెలుసుకోవాల్సిన అవసరముంది.

MR.DEPUTY SPEAKER: Revanth Reddy garu, please conclude.

శ్రీ ఎ.రేవంత్ రెడ్డి: అధ్యక్షా, మంత్రి గారు గత వాస్తవాలను మరచిపోయారనే ఉద్దేశంతో, వాటిని మరొకసారి గుర్తుచేయాల్సిన అవసరమొచ్చింది కాబట్టే మాట్లాడుతున్నాను. ఒకసారి గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రస్తుత పరిస్థితి గురించి మీకు ఒకసారి చెబుతాను. మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే ప్రయత్నం నేను చేస్తాను. ఇంటి స్థలం గురించి నమోదు చేసే అధికారికి కమీషన్, ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లులు తయారుచేసి మంజూరు చేసే అధికారికి కూడా కమీషన్ రూపేణా డబ్బు చెల్లించుకోవాల్సిన పరిస్థితి కనబడుతోంది. ఆ విధంగా కమీషన్ రూపంలో డబ్బు చెల్లించుకున్న పేదోడికి నెత్తి మీద అప్పు మిగులుతుంది, చేతిలో చిప్ప మిగులుతుంది. ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటి వల్ల పేదోడికి వచ్చిన ఫలితమది. మంత్రి గారి నియోజకవర్గంలో కూడా అదే తంతు జరుగుతోంది కానీ మభ్యపెట్టే ప్రయత్నం

చేస్తున్నారు. ప్రభుత్వంలో బాధ్యత గల మంత్రిగా విధులు నిర్వర్తిస్తున్నారు కాబట్టి నేను కూడా వారి గురించి ఎక్కువగా మాట్లాడలేకపోతున్నాను. ఇంకో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, 91 ఇండ్లను ఒకే వ్యక్తి తీసుకొని ఆ స్థలంలో బంగళా కట్టుకున్నటువంటి విషయం కూడా మన దృష్టికి వచ్చింది. నల్ల సొమ్మును రెగ్యులరైజ్ చేసుకోవడానికి వి.డి.ఎస్. స్కీమును కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేస్తే, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను అక్రమంగా దోచుకున్నటువంటి వారికి కూడా వి.డి..ఎస్. స్కీమును తీసుకువచ్చినటువంటి గొప్ప ఘనత ఈ ప్రభుత్వానికి వచ్చింది. ఆ ఘనతను కూడా వారి ఖాతాలోనే వ్రాసుకోమని నేనంటున్నాను. నేనేమి కాదనడం లేదు. మంత్రి గారి కీర్తి కిరీటంలో అదొక కలికితురాయిగా పెట్టుకోమని నేను మీ ద్వారా వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రధానంగా ప్రస్తావించుకోవాల్సిన అంశం జలయజ్ఞం. ప్రధానంగా అధికారం వెలగబెట్టి పోయిన వారు ఇచ్చిన ఫలితమే జలయజ్ఞం. జలయజ్ఞం ప్రాజెక్టుల నిర్మాణానికి గాను ప్రభుత్వానికి ఇంకా సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలు అవసరం ఉంది. రూ.80,000 కోట్లు ఇప్పటి వరకు జలయజ్ఞం కార్యక్రమంలో ఖర్చు చేయడం జరిగిందని ప్రభుత్వం చెబుతోంది. కానీ, నా దగ్గర ఉన్నటువంటి సమాచారం మేరకు ఇప్పటి వరకు బడ్జెట్‌లో రూ.1,13,000.00 కోట్లు జలయజ్ఞం కార్యక్రమానికి ప్రభుత్వం కేటాయిస్తే, ఇప్పటి వరకు నిధులు విడుదలైంది రూ.75,000.00 కోట్ల చిల్లర మాత్రమే. నాకేమి బాధ లేదు. రైతులను ఆదుకోవడానికి, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం నిజంగానే కేటాయించిన నిధులను ఖర్చుచేసి ఉంటే, నిజంగా అందరం ప్రభుత్వాన్ని అభినందించి ఉండేవాళ్లం. ఇదే సభలో ప్రతిపక్షపార్టీ నాయకుడిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆనాటి ముఖ్యమంత్రి గారైన డా.వైఎస్. రాజశేఖర్‌రెడ్డి గారికి చెప్పారు. ఏమిటంటే, మీరేదైతే జలయజ్ఞం కార్యక్రమం క్రింద సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తారో, ఇదే సభలో మీకు సింహాసనం వేసి సన్మానం చేస్తాను, కానీ, నూటికి నూరు శాతం జలయజ్ఞం కార్యక్రమంలో అవినీతి ఉందనే విషయాన్ని శ్రీ చంద్రబాబు నాయుడు గారు ఆన్ రికార్డ్ చెప్పడం జరిగింది. కానీ, ఆనాడు శ్రీ చంద్రబాబు నాయుడు గారిని ప్రభుత్వం దూషించింది. నీవు చెబుతున్నది శుద్ధ అబద్ధం, అభివృద్ధికి అడ్డం కల్గిస్తూ, ఆటంకం కల్గిస్తున్నావనే విధంగా వారిపైన బురదజల్లే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేసింది. కానీ, ఈనాడు రాష్ట్రంలో జరుగుతున్నటువంటి విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా నేను ఒకే ఒక ఉదాహరణ చెప్పదలిచాను. రాష్ట్రంలో ఏ విధంగా జలయజ్ఞం పేరుతో దోపిడి జరిగిందో నేను ఉదహరిస్తాను. 2008-09వ సంవత్సరం నాటి బడ్జెట్ ప్రసంగం ఇది. డా. కె. రోశయ్య గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసినటువంటి ప్రసంగం. "ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు'' నిర్మాణానికి గాను రూ.17,875.00 కోట్లు వెచ్చించి, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆనాటి ఫిబ్రవరి, మార్చి బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం చెప్పడం జరిగింది. కానీ, ఈ ప్రాజెక్టు నిర్మాణం విషయమై కరెక్టుగా నాలుగైదు నెలల్లో టెండర్లు పిలిచే సమయానికి ఎంత మొత్తానికి పెరిగిందంటే, చెబితే ఆశ్చర్యపోతారు. ఏ ప్రాజెక్టు నిర్మాణంలోనైనా సరే పది శాతం ప్లస్ గానీ, మైనస్ గానీ ఉంటుంది. ఎవరైనా సరే గుడిసె వేసుకున్నా గానీ, ఇంటి నిర్మాణం చేపట్టినా గానీ, ఆ నిమిత్తం మనం వేసుకున్న అంచనా వ్యయం పది శాతం ప్లస్ గానీ, మైనస్ గానీ వ్యత్యాసం ఉంటుంది. ఆ విషయం అందరికీ అర్థమవుతుంది. కానీ, ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకునే సమయం లోపలే వెచ్చించిన మొత్తం రూ.38,500.00 కోట్లకు పెరిగిందంటే, తద్వారా 20,000.00 కోట్ల రూపాయల అవినీతి సొమ్ము ప్రాజెక్టు ఎస్టిమేట్స్‌లో పెట్టి దోచుకున్నారంటే, జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం జరిగిందనే విషయాన్ని ఆనాడు మేం చెబితే, మమ్మల్ని ఎందుకు దూషించారనే విషయాన్ని నేను ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. పోనీ విషయం అక్కడితో ఆగిందా అంటే, అదీ లేదు. కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు పంపేనాటికి అనుకున్న మొత్తం రూ.38,500.00 కోట్లు కాస్తా రూ.40,300.00 కోట్లకు ప్రాజెక్టు వ్యయం పెరిగింది. 2008వ సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేటప్పుడు, నాలుగు సంవత్సరాల్లో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టి, 160

టి.ఎం.సి.ల నీటిలో, 80 టి.ఎం.సి. నీటిని వ్యవసాయానికి, మిగిలిన 80 టి.ఎం.సి. నీటిని పారిశ్రామికీకరణకు కేటాయించి తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఆనాడు ప్రభుత్వం చెప్పడం జరిగింది. కానీ, ఇప్పటికీ నాలుగు కాదు, ఐదు సంవత్సరాల కాలం పూర్తయింది, దాదాపు రూ.4,000.00 కోట్లు ఆ ప్రాజెక్టు నిర్మాణానికి గాను ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగింది. కానీ, ఇప్పటి వరకు తట్టెడు మట్టిని ప్రాజెక్టులో తీయలేదు, ఎకరం భూమికి సాగునీరు ఇవ్వలేదంటే, జలయజ్ఞం కార్యక్రమం అనేది ఎంత ఫార్స్, ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు ప్రజల పాలిట ఒక గుదిబండగా మారి తెలంగాణ ప్రాంతాన్ని ఏ రకంగా ముంచుతుందో ఒకసారి మీరు అర్థం చేసుకోండి. ఈ ప్రభుత్వాన్ని నిలదీయండి అధ్యక్షా. ఆ చైర్ నుండి ఈ ప్రభుత్వం చేస్తోన్న తప్పిదాల పైన విచారణకు మీరు ఆదేశిస్తే, చరిత్రలో మీరు మిగిలిపోతారు. ఈ చరిత్రలో మీరు మిగిలిపోయే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రేవంత్ రెడ్డి గారూ దయచేసి ముగించండి. కేటాయించిన సమయం కంటే మీరు ఎక్కువగా సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. Please conclude.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి: నేను ముఖ్యమైన పాయింట్స్‌పైనే మాట్లాడుతున్నాను. సమయాన్ని ఎక్కడ కూడా నేను దుర్వినియోగం చేయలేదు.

అధ్యక్షా, జలయజ్ఞం కార్యక్రమం క్రింద సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలంటే ప్రభుత్వానికి ఇంకా రెండు లక్షల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం ఎక్స్‌కవేషన్స్ 10 నుండి 15 శాతం వరకు పెరుగుతాయి. అంటే, రూ.2 లక్షల కోట్ల మీద 10 to 15% పెరిగితే, ప్రతి సంవత్సరం రూ.20,000 నుండి 30,000 కోట్ల మేరకు అదనంగా ప్రాజెక్టు వ్యయం పెరుగుతుంది. ప్రభుత్వం కేటాయిస్తున్న మొత్తం ఎంతంటే రూ.10,000 కోట్లు నుండి రూ.11,000 కోట్లు మాత్రమే. అది కూడా ప్రభుత్వ ఆదాయం ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే, బాగా ప్రభుత్వ ఆదాయం ఉన్నప్పుడు మాత్రమే ఆ విధంగా జరుగుతోంది. ఆ సమయంలోనే ప్రభుత్వం అత్యధికంగా రూ.15,000 కోట్లు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కేటాయించడం జరిగింది. కానీ, ఖర్చు మాత్రం అంతగా కాలేదు. ఈ రోజు రాష్ట్ర ఆదాయం కూడా అంతగా లేదు, సంక్షేమ పథకాలను వేటిని తొలగించాలనే విధంగా ముఖ్యమంత్రి గారు అడుగుతున్న సందర్భంలో ప్రతి సంవత్సరం రూ.30,000 కోట్లుకు పైగా ప్రాజెక్టు వ్యయం పెరిగిపోతుంటే, మీరు ఖర్చు చేసే రూ.10,000 కోట్లో, రూ.12,000 కోట్లో పెరిగిన వ్యయంలో కూడా సగం కేటాయింపులు లేనప్పుడు ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టును ఏ రకంగా పూర్తిచేస్తుందో, ఏ రకంగా ప్రజలను మోసం చేస్తున్నారో, ఏ రకంగా ఒక కోటి ఎకరాలకు సాగునీటిని ప్రాజెక్టుల ద్వారా అందిస్తారనే విషయంలో రాష్ట్ర ప్రజలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత మీపైన ఉంది. ఎక్కడైనా రాష్ట్ర ప్రజలు ఓట్లు వేసి, మనకు అధికారం కట్టబెట్టేది ఐదు సంవత్సరాల కాలానికి మాత్రమే. ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆదాయమెంత, ఖర్చు ఎంత, ఏ యే ప్రాజెక్టులను చేపడితే ఎప్పుడు పూర్తవుతాయనే విధంగా లెక్కలు వేసుకొని మనం ప్రాజెక్టులను ప్రారంభించాల్సింది. కేవలం కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్ల కొరకు కక్కుర్తి పడి, టెండర్లు పిలిచి, అగ్రిమెంట్లు చేసి, కమీషన్లు తీసుకొని మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చి ఈ రకంగా చేయడమనేది సమంజసం కాదనే విషయాన్ని మీ ద్వారా నేను ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

ఇంకో విషయం అధ్యక్షా. ముఖ్యంగా జలయజ్ఞం గురించి నేను ఎక్కువగా ప్రస్తావించదలచుకోలేదు ఎందుకంటే, ముఖ్యమంత్రి గారు నా వైపు అసహనంగా చూస్తున్నారు. కాబట్టి జలయజ్ఞం గురించి చెప్పదలచుకున్నదంతా చెప్పడం జరిగింది.

దిల్‌సుఖ్‌నగర్‌లో ఇటీవల జరిగిన జంట బాంబు పేలుళ్లు. అధ్యక్ష, కేంద్ర ప్రభుత్వం ముందస్తుగానే రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. పేద ప్రజలకు గానీ, ఈ రాష్ట్ర ప్రజలకు గానీ, రక్షణ కల్పించి, ప్రాణాలను కాపాడవల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా, ప్రభుత్వపరంగా మన బాధ్యత. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగానే హెచ్చరికలు జారీచేసినప్పటికీ, అదే విధంగా కొంత మంది తీవ్రవాదులను పూణేలో జరిగిన బాంబు పేలుళ్ల సందర్భంగా ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు, స్పష్టంగా వారు కేంద్ర హోం శాఖకు చెప్పడమే గాకుండా తప్పును ఒప్పుకోవడం కూడా జరిగింది. మేం దిల్‌సుఖ్‌నగర్‌లో, బేగంబజారులో, సుల్తాన్‌బజారులో రెక్కి నిర్వహించడం జరిగిందని, బాంబులు పేలుస్తామనే విధంగా 2012 వ సంవత్సరం అక్టోబర్, నవంబర్ మాసంలో జరిగిన పోలీస్ విచారణలో కన్‌ఫెస్‌కేషన్స్ స్టేట్‌మెంట్‌లో ఉండి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది. కేంద్ర హోం శాఖామాత్యులు విస్పష్టంగా చెబుతూ, కేంద్రం ముందస్తుగానే రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తామని చెప్పడం జరిగింది. కానీ ఆ విషయంలో మన ముఖ్యమంత్రి గారు చెప్పినదేమిటంటే, ప్రభుత్వం కేంద్ర హెచ్చరికలను చాలా రొటీన్‌గా, క్యాజువల్‌గా, చాలా యధాలాపంగా తీసుకున్నామని వారు చెప్పినట్టుగా దినపత్రికల్లో కథనాలను మనమంతా కూడా చూడడం జరిగింది. అంటే, ప్రజల ప్రాణాలు మనకు అధికారం కట్టబెట్టే యంత్రాలుగా వారు భావిస్తున్నట్టుగా ఊహించుకోవాల్సిన పరిస్థితి కల్పుతోంది. మనం ఈరోజున ఇక్కడ ఉన్నామంటే, ఆ ప్రజలు ఓటు వేస్తేనే మనం ఇక్కడ కూర్చున్నామనే సంగతిని మర్చిపోకూడదు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన, ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నదనే విధంగా కేంద్ర ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలను రాష్ట్ర ప్రభుత్వానికి జారీ చేస్తే, ఆ విషయాన్ని యధాలాపంగా ప్రభుత్వం భావిస్తే, అది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కాదా అని ఒకసారి మీరు మనసుపెట్టి ఆలోచన చేయాల్సిన అవసరముందని నేను తెలియజేస్తున్నాను. ఆ సంఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. 120 నుండి 130 మంది దాక ఆ బాంబు పేలుళ్ల సందర్భంగా క్షతగాత్రులైనారు. అందులో కొంత మందికి కాళ్లు పోయి, చేతులు పోయి, రకరకాలుగా ఇతర శరీర అవయవాలు కోల్పోయి నానా హింసకు గురైనారు. అలాంటి కుటుంబాలను కూడా సరైన విధంగా ఆదుకున్నట్టుగా మనకు కనిపించడం లేదు. ఆ సందర్భంగా దేశ ప్రధాన మంత్రి గారు రాష్ట్ర పర్యటన చేస్తే, ప్రభుత్వ ఆసుపత్రి అయినటువంటి, నిజాం నవాబు నిర్మించిన ఉస్మానియా ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులను పరామర్శించకుండా, కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఉన్న క్షతగాత్రులను సందర్శించడం జరిగింది. కేవలం మొక్కుబడిగా ప్రధాన మంత్రి పర్యటన పైపైన రాష్ట్రంలో సాగిందంటే, ఏ దౌర్భాగ్యపరిస్థితుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందో మీరు ఒకసారి అర్థం చేసుకోండి. ప్రధాన మంత్రి రాష్ట్ర పర్యటనకు వస్తే, ప్రభుత్వ ఆసుపత్రుల పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ఆ విషయమై ధర్నా చేయడం జరిగింది. ఉస్మానియా ఆసుపత్రిని, అందులో ఉన్న క్షతగాత్రులను పరామర్శించకుండా ప్రధాని పర్యటన జరిగిందంటూ తీవ్ర ఆవేదన ఆ ఆసుపత్రి డాక్టర్లు వ్యక్తం చేయడం జరిగింది. కేవలం కార్పోరేట్ ఆసుపత్రులను సందర్శించి ప్రధాని ఢిల్లీకి వెళ్లారంటే, ప్రభుత్వానికి కార్పోరేట్ ఆసుపత్రుల మీద ఉన్న ప్రేమ ప్రభుత్వ ఆసుపత్రుల మీద లేదని చెప్పక తప్పదు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయచేసి కంక్లూడ్ చేయండి రేవంత్ రెడ్డి గారు.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి: చేస్తున్నాను సార్. అధ్యక్షా, ఈనాటి ప్రభుత్వ వైఫల్యాలను చర్చించాలంటే ఎప్పుడైనా గానీ 2004వ సంవత్సరం నాటి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ మూలాల నుంచి చర్చించుకోవాలి. ఈనాటి ప్రభుత్వ వైఫల్యాలకు కారణం ఆనాడు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని ప్రజలు కట్టబెట్టడమే. ఈనాడు ఉండే పరిస్థితుల గురించి అదే శ్రీ కాళోజీ గారు చెప్పారు. ఏమిటంటే, "గుండె పగిలి పోతుంటే, కడుపు మండిపోతుంటే, గుండాలు లీడర్లవుతుంటే, జెండాలు దిగజారుతుంటే, బతుకు చితికిపోతుంటే, దాదాగిరి మెరుస్తుంటే, దగాకోరు మురుస్తుంటే, నల్లబజారు పిలుస్తుంటే, తెల్లటోపి

వలుస్తుంటే, బతుకు చితికిపోతుంటే శాంతి, శాంతట, శాంతి" అని శ్రీ కాళోజీ గారు చెప్పడం జరిగింది. అంటే ఈ రోజున ఈ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు 2004వ సంవత్సరంలో ఆయన వేసిన పునాదులకు ఈరోజున క్రొత్తగా ఒక పార్టీ పుట్టుకొచ్చింది.

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ స్పీకర్: రేవంత్ రెడ్డి గారు, మీరు ఒక నిమిషంలో కంక్లూడ్ చేయాల్సి ఉంది. Only one minute, you have to conclude.

శ్రీ ఎ.రేవంత్ రెడ్డి: క్రొత్తగా పుట్టుకొచ్చిన పార్టీ గురించి మాట్లాడాలంటే చాలా విషయాలున్నాయి. అధ్యక్షా, ఆ బాబు 73 కంపెనీల ద్వారా ఆదాయం, వ్యాపారాలు, సంపదను సంపాదించుకోవడానికి బలపనూరులో ఇల్లు లేకపోయినా కూడా బెంగుళూరులో ప్యాలెస్‌లు కట్టుకోవడానికి గాను 73 సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్గింది.

రా.10.30

ఈ రాష్ట్రంలో ఒక కొత్త పార్టీ పుట్టుకొచ్చింది. ఆ పార్టీ గురించి చెప్పాలంటే ఆ బాబు 73 కంపినీల ద్వారా ఆదాయం, వ్యాపార, సంపదలు సంపాదించుకోడానికి బలపనూరులో ఇల్లు లేకపోయినా, బెంగుళూరులో ప్యాలస్‌లను కట్టుకోడానికే 73 సంస్థలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకున్నాడు. ఆ వ్యాపారాల్లో వచ్చిన ఆదాయం సరిపోదని చెప్పి 74వ సంస్థను ఏర్పాటు చేశారు. దానిపేరే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.

(వైఎస్ఆర్‌పార్టీ సభ్యులచే అంతరాయం )

తండ్రి అధికారంలో ఉండి అక్రమంగా సంపాదించి పెడితే, ఆ సంపదను వ్యాపారాలకు ఉపయోగించుకున్నవాళ్లను చూశాం, బంగళాలు కట్టుకొన్నవాళ్లను చూశాం, బంగారం కొనుక్కున్నవాళ్లను చూశాం. కానీ, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం ఆడే విధంగా ఒక పార్టీని పెట్టి ఆ పార్టీ ద్వారా వ్యాపారం చేయాలని చూసినవాళ్లను ఈ రాష్ట్రంలోనే చూశాం .

ఆ బాబు స్వంత పార్టీ పెట్టినప్పుడు ఒక మాట చెప్పాడు, ఈ ప్రభుత్వం రాజశేఖరరెడ్డి గారి రెక్కల కష్టం. 2014 వ సంవత్సరం వరకు పడగొట్టను అని చెప్పారు. ఈ ప్రభుత్వం నా కనుచూపుతో నడుస్తోంది, నేను కన్ను తెరిస్తే పడిపోతుందని చెప్పారు. వారు ఇప్పటి వరకు చెప్పిన మాటలు, మాట తప్పని మడమ తిప్పని వంశమని, రాజశేఖరరెడ్డిగారి రెక్కల కష్టమనే ప్రభుత్వమైతే ప్రతి ఆరునెలలకొకసారి వాళ్లకాళ్లు వీళ్లకాళ్లు ఎందుకు పట్టుకొంటున్నారో చెప్పాలి.

(వైఎస్ఆర్‌పార్టీ సభ్యులచే అంతరాయం )

ఈ మాటనే కాకుండా అదే బాబు ఎన్‌డి టివీలో, నేను రాష్ట్రంలో 35 మంది పార్లమెంట్ సభ్యులను గెలిపించుకొని కేంద్రంలో యుపిఏ ప్రభుత్వానికి సోనియాగాంధి గారి నాయకత్వానికి మద్దతిచ్చి వ్యవసాయశాఖ లేదా రైల్వేశాఖ మంత్రిపదవులు తీసుకుంటానని చెప్పారు. సంతోషం, రాష్ట్ర బాగోగుల కోరి గెలిచినా మంత్రిపదవులు తీసుకున్నా మంచిదే, మాకు అభ్యంతరం లేదు. కానీ అదే నోరుతో మరో మాట చెప్పారు. రాజశేఖరరెడ్డి గారి మరణానికి

వాళ్లే కారణం, వారు జైలుకు పోవడానికీ వాళ్లే కారకులని ఉపఎన్నికల్లో ఊరూరా తిరిగి తల్లీ , చెల్లీ కన్నీరు పెట్టి ఈ రోజు ఇక్కడ మాట్లాడే వారందిరినీ గెలిపించుకున్నారు.

ఇప్పుడు ఈ ప్రభుత్వాన్ని పడగొడతాము అంటున్నారు. మళ్లీ గెలవగానే వీళ్లకే మద్దతిస్తాము అంటున్నారు. ఇదెక్కడి విచిత్రం. అంటే ఈ ప్రభుత్వం వైఫల్యం చెందితే, లేదా వాళ్లు పడగొట్ట తల్చుకుంటే పడగొట్టిన వెంటనే మళ్లీ వాళ్లకే మద్దతు తెలుపుతామంటే ఇందులో ఉన్న కుట్ర, కుతంత్రం, చీకటి ఒప్పందం గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఆనాడు రాజశేఖరరెడ్డి గారి మరణానికి కారణమైన వాళ్లు ఈ బాబు జైలుకి వెళ్లడానికి కారణమైన వాళ్లు సడన్‌గా ఎందుకు మంచివాళ్లు అవుతున్నారో ఎందుకు మద్దతు పలుకుతున్నారో చెప్పాల్సిన అవసరం ఉంది.

(వైఎస్ఆర్‌పార్టీ సభ్యులచే అంతరాయం )

అదే విధంగా ఈ రాష్ట్రంలో ఉన్న పరిస్థితికి ఆ దివంగత నేతే కారణం. తెలంగాణా ప్రాంతంలో ఎన్నికలు ముగిసిన మరుక్షణం కర్నూలు జిల్లా నంధ్యాల పర్యటనకు వెళ్లి తెలంగాణా ప్రాంతం, సమైక్యాంధ్ర నుండి విడిపోతే, హైదరాబాద్‌లో మనందరం విదేశీయులమౌతామన్నారు. ప్రజాస్వామిక దేశంలో ఒక బాధ్యత కలిగిన ముఖ్యమంత్రిగా ఉండి విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రెండు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలు పెరిగే విధంగా, ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా? మేము ఆనాడు గానీ, ఈనాడుగానీ, ప్రాంతాలు వారీగా విడిపోయి ప్రజలుగా అందరం కలిసి ఉందామని చెపితే, మీరు మాత్రం ప్రజలుగా విడిపోవాలి, ఒకే ప్రాంతంగా కలిసి ఉండాలి, మేమే అధికారంలో కూర్చోవాలి అంటున్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు రెండు ప్రాంతాల మధ్య సంబంధం తెగిపోయే విధంగా వ్యవహరించిన వ్యక్తి ఆనేత కాదా ? ఆ నేత వారసులు వీళ్లు కాదా అని నేనడుగుతున్నాను.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యులచే అంతరాయం )

ఇదే సభలో చర్చ జరుగుతున్నప్పుడు, మా సోదరుడు ఈటెల రాజేందర్ గారిని చర్చలు సందర్భంగా, రాజేందర్: 50 సీట్లకు పోటీచేసి 10 సీట్లు గెలిచావు. తలకాయెక్కడ పెట్టుకుంటావు అని సభా మర్యాదలను కూడా మరచి ధూషించిన సంఘటన ఈ సభలోనే జరిగింది. ఐతే మా తెలంగాణా సోదరులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను, మీరు ఇలాంటి వ్యక్తులతో జట్టుకట్టి ఈ రకమైన పరిస్థితులకు గురి చేస్తే తెలంగాణా ప్రజల ఆగ్రహానికి గురి కారా? అని నేనడుగుతున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో బెయిళ్ల కోసమో, బేర–సారాల కోసమో, మేము మద్దతు పలకలేదని, మమ్మల్ని ధూషిస్తున్నారు. పాలక పక్షంతో మేము ఒప్పందాలు చేసుకుంటున్నాము అంటున్నారు, మాకు ఒప్పందాలు చేసుకోవల్సిన అవసరం లేదు. వారు చెపుతున్నారు. మా బాబు వస్తాడు మీ కష్టాలు తీరుస్తాడని ,

(వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యులచే అంతరాయం మైకు లేకుండా )

అసలు ఆ,బాబు ఎందుకు జైలుకు వెళ్లాడు, ఎందుకు కష్టాల్లో ఉన్నాడనే విషయం ప్రజలకు చెప్పాలి కదా? కార్గిల్లో యుద్ధం చేసి జైలుకు వెళ్లాడా? బడుగు బలహీన వర్గాల పక్షాన గానీ, ముదిగొండ కాల్పుల్లో బాధితుల పక్షాన ఉద్యమం చేస్తూ అరెస్ట్ అయ్యి జైలుకెళ్లాడా? లక్షకోట్ల రూపాయలు పేద ప్రజల సొమ్ము దోచుకున్నందుకు సుప్రీంకోర్టు నిర్ధారించి, జైల్లో నిర్బంధిస్తే, ఆ కష్టాలలో ఉన్న బాబట పేద ప్రజల కష్టాలు తీరుస్తారట. ఏ రకంగా ఇట్లా చెప్పుకుంటారు.

(వైఎస్ఆర్‌పార్టీ సభ్యులచే అంతరాయం)

దయచేసి మా మిత్రులకు విజ్ఞప్తి ఏమనగా, మంచివారి కలయిక కొని తెచ్చుకోమని, చెడువారి కలయికను వారికి కొంత సొమ్మిచ్చి వదలించుకోమని తెలియ పరుస్తున్నాను.

(వైఎస్ఆర్‌పార్టీ సభ్యులచే అంతరాయం)

ఈ అవిశ్వాస తీర్మానం సందర్భంగా మా బాధ్యతను నిర్వహించాల్సి ఉంది.

మిస్టర్ స్పీకర్: దయచేసి కూర్చోండి. మరొక సభ్యునికి మాట్లాడే అవకాశం ఇవ్వాలి. ముగించండి. ఇచ్చిన సమయంలో మీరు ముగించాలి. ఇంకా ముగించక పోతే సబబు కాదు.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి: రాష్ట్రంలో ఈ రోజు అనిశ్చితి, ఆ బాబుకు ఎంతకాలం శిక్ష పడుతుందో అనిశ్చితి, కిరణ్ బాబుగారు ఎంతకాలం కుర్చీలో ఉంటరో అనిశ్చితి, సత్తిబాబుగారు ఎప్పుడేమి మాట్లాడుతారో అనిశ్చితి, మంత్రులు ఎప్పుడు జైలుకు వెళతారో, ముఖ్యమంత్రిగారి సమావేశం ఎప్పుడు ఏ జైల్లో జరుపుకోవాలో అనిశ్చితి. విద్యార్థులకు బడులు/బందులు ఉంటాయో అనిశ్చితి. కరెంట ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో అనిశ్చితి. ఇవన్నీ పోనీ, ఈరోజు రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రికి సహకరించిన మంత్రి వర్గ సహచరులందరూ, కేసులను ఎదుర్కొని జైళ్లలో మ్రగ్గుతున్నారు. అంటే ప్రజా ప్రతినిధులుగా సహకరించినందుకు శిక్షను అనుభవిస్తున్నారు. అక్కడ మా సబితక్క ఉన్నది, తెలంగాణాలో ఇంద్రన్న పేరంటే ప్రతి ఒక్కరికీ తెలుసు. చేవెళ్ల చెల్లెమ్మ పేరుమీద ఆయనను నమ్మి సంతకాలు పెడితే కేసులలో ఇరుక్కొని ఈరోజు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. ఆనాడు ఇంద్రన్న చనిపోతే ఒక పెద్దన్నలా వచ్చి కేసులలో ఇరికించి, ప్రస్తుతం ఆ తల్లికి కంటనీరు పెట్టిస్తున్నారు అధ్యక్షా.

రా.10.40

ఆనాటి ముఖ్యమంత్రికి సహకరించిన ప్రజా ప్రతినిధులందరూ జైళ్లల్లో మగ్గుతున్నారు. ఇంద్రా రెడ్డి గారు మరణించిన తరువాత మా సబితక్కను చేవెళ్ల చెల్లెమ్మ అని పిలిస్తే, ఒక అన్న లాగా ఆధారపడినందుకు, ఫైళ్లలో సంతకాలు పెట్టినందుకు ఆమె అనుభవిస్తున్న బాధ ఎవరికీ చెప్పుకోలేనిది. అలాగే గీతా రెడ్డి గారు. ఇలా మా తెలంగాణా సోదరీమణులందరినీ కేసుల్లో ఇరికించిన వారిని ఈ సభలో గొప్ప వ్యక్తులుగా కీర్తిస్తుంటే, ఇది సబబా అని అడుగుతున్నాను.

MR. SPEAKER : You are crossing your limits.

శ్రీ ఏ. రేవంత్ రెడ్డి : దీంట్లో ఏమాత్రం డీవియేషన్ లేదు సార్. పాలక పక్షానికి వ్యతిరేకంగా ఉండే వారందరూ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం మెడలు వంచి ప్రజా సమస్యలను తీర్చే విధంగా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉంది. ద్రవ్య వినిమయ బిల్లులో కూడా ఈ ప్రభుత్వాన్ని ఎండగట్టే పరిస్థితి ఉంది, ఆ అవకాశాలలో వేటినీ నేను ఉపయోగించుకోలేదు. ఈ సందర్భంగా ఒక సామెత చెప్పడానికి మీరు అనుమతించాలి. "వెనకటికెవరో కాశీలో దొంగతనాలు చేయాలంటే, కన్యా కుమారి నుంచి వంగొనిపోయినారంట. చివరికి అక్కడికి పోయిన తరువాత దొంగతనం చేయలేదు కానీ, గూని వచ్చిందట." ఈనాడు పంచాయితీ సభ్యులు కాని వారు కూడా, ఆరు నెలల నుంచి చంద్రబాబు గారు ఎందుకు అవిశ్వాస

తీర్మానం పెట్టలేదని అడుగుతున్నారు. గతంలో మేము ఒకసారి అవిశ్వాస తీర్మానం పెడితే, మాకు 50 మంది సభ్యుల బలముందన్నారు, ఇంటికి వెళ్లిన తరువాత 29 మంది అన్నారు, చివరికి ఓటు వేసేటప్పటికి 17 మందే ఉన్నారు. ఇలాంటి తోక పార్టీలను నమ్ముకొని మేము అవిశ్వాస తీర్మానం పెట్టాలట, వీళ్లకు సహకరించాలట, వాళ్ల బెయిళ్ల కోసం బేరసారాలు చేసుకుంటారట! ఈ సభలో మమ్మల్ని వాళ్ల అవసరాల కోసం, బెయిళ్ల కోసం, దోపిడీ కోసం సహకరించమని కోరడం, లేదంటే దూషించడం ఎంతవరకు సరైనది? బడ్జెట్ మీద, గవర్నర్ ప్రసంగం మీద, ద్రవ్య వినిమయ బిల్లు మీద ప్రభుత్వాన్ని నిలదీస్తాం, ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తాం. ఒక వేళ ప్రభుత్వం దిగిరాకపోతే, అప్పుడు ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెడతాం గానీ, ఇలాంటి బేరసారాల కోసం మేం మద్దతు పలకం.

MR. SPEAKER: Yes, please resume your seat.

శ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి : అధ్యక్షా, అవిశ్వాస తీర్మానం పెట్టి 8, 9 గంటల పాటు చర్చ అయిన తరువాత కూడా ఎందుకు వీళ్లు అవిశ్వాస తీర్మానం పెట్టారో, దీంతో ఏమి సాధించారో అన్న ప్రశ్న నాకు ఉత్పన్నమౌతోంది. ఈ సభ ఏర్పాటైన తరువాత కేవలం ఒక్క తెలుగుదేశం పార్టీనే అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అవిశ్వాస తీర్మానం పెట్టలేదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావాలని ఎప్పుడూ తొందర లేదు. ఆ రికార్డును బద్దలు కొట్టడానికే, తెలుగుదేశం, టీఆర్ఎస్ పార్టీలు మా ప్రభుత్వం మీద అవిశ్వాసం పెట్టినట్లుంది. ఆ కారణం తప్ప అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టారో నాకైతే తెలియడం లేదు. ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకించడానికి ఏమి తక్కువ చేశాం, ఏ విధమైన తప్పులు చేశాం అని చూసుకుంటే, మేము ఏ విధమైన పొరపాట్లూ చేయలేదని నాకనిపిస్తుంది. మేము చేసిందంతా ఒక్కటే... ప్రభుత్వం పరిపాలనలో ప్రజలకు జవాబుదారితనం కలిగి ఉండాలని, వారికి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంకా వేగంగా వారికి చేరే విధంగా, మేలు చేకూరే విధంగా, మెరుగ్గా అమలు చేసే విధంగా తపన పడటం ఒక్కటే మా కాంగ్రెస్ పార్టీకి తెలిసింది. అదేమైనా పొరపాటేమో అని నాకు అర్థం కావడం లేదు. మీరు గమనించినట్లయితే దేశంలో ఏ రాష్ట్రంలో జరుగనన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే జరుగుతున్నాయి.

(ఈ దశలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు బల్లలు చరిచి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.)

సుమారు రూ.26,000 కోట్లు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మేం ఖర్చు పెడుతున్నాం. సుమారు 8.50 కోట్ల కుటుంబాలకు అంటే ఒక్కో కుటుంబానికి మూడు, నాలుగు సంక్షేమ కార్యక్రమాల క్రింద, పథకాల క్రింద లబ్ది చేకూరుతోంది. ఇవన్నీ ఒక్క రోజుతో వచ్చినవి కాదు. నిరంతరం ఎన్నో మార్పులు చేస్తూ, మెరుగైన సేవలు ప్రజలకు అందించే క్రమంలో జరిగింది.

ఆహార భద్రత కోసం పేద ప్రజలకు రూపాయికే కిలో బియ్యం అనే పథకం పెడితే, వారిని భిక్షగాళ్లు చేస్తున్నామని కొందరు అన్నారు. ఇది చాలా అభ్యంతరకరమైన పదజాలం. సుమారు 2.25 కోట్ల కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడానికి, పెద్ద ఎత్తున ఒక పద్ధతి ప్రకారం కనీసం బియ్యమైనా తక్కువ ధరకు వారికి అందించగలిగితే మెరుగైన జీవితం ఉంటుందనే భావనతో కేవలం అంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే సుమారు 7.50 లక్షల మంది జనాభాకు ఈ పథకం ద్వారా బియ్యాన్ని అందించడం జరుగుతోంది. ఇక్కడ మాట్లాతున్న వారందరికీ మా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు అర్థం కావు, కనీసం అర్థం చేసుకోవడానికి కూడా వాళ్లు ప్రయత్నం చేయరు. రూ.25/-కి కిలో బియ్యం బయట దొరుకుతుంటే, ఒక్క రూపాయికే కిలో బియ్యం ఇవ్వాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. బియ్యం ఒక్కటే ఇస్తే సరిపోదని, బియ్యంతోబాటు నిత్యావసర

వస్తువులను కూడా ఇవ్వాలని, రానున్న ఉగాది పండుగ నుండి 9,10 నిత్యావసర వస్తువులను చౌక ధరల దుకాణాల్లో అందుబాటులో వుండేలా మేం ప్రవేశ పెట్టబోయే బడ్జెటు ప్రజెంటేషన్‌లో, దానిపై జరిగే ఖర్చు విషయమై ఇదే సభలో చర్చ జరుపుకోవడం జరుగుతుంది. పేదవారికి ఆహార భద్రత కల్పించాలని, జవాబుదారీ తనం కలిగి ఉండాలని మా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

ఈ మధ్యనే కో–ఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికలు జరిగాయి. సుమారు 40, 50 లక్షల మంది వివిధ రంగాల నుంచి ఆ ఎన్నికల్లో పాల్గొనడం జరిగింది. కొన్ని చోట్ల అక్రమాలు జరిగాయని కోర్టు స్టేలు ఇచ్చిన మాట కూడా వాస్తవమే. త్వరలో స్థానిక సంస్థలకు, జెడ్‌పిటిసి, యంపిటిసి మరియు మున్సిపాలిటీలకు ఎన్నికలను నిర్వహించబోతున్నాము. ఇక్కడ ఒక అంశం గమనించాలి. ఈ ఎన్నికలు నిర్వహించడంలో రిజర్వేషన్స్‌పై కోర్టు ఉత్తర్వుల మేరకు 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్స్ ఇవ్వరాదనే విషయంపై హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో సవాలు చేసినందు వల్ల కొంత జాప్యం జరిగింది. గత మూడు సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో 60 శాతానికి పైబడి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్స్ కల్పిస్తూ వస్తున్నాం. మహిళలకు గతంలో రిజర్వేషన్స్ 33 శాతం ఉంటే, దాన్ని ప్రస్తుతం 50 శాతానికి పెంచడం జరిగింది. ఈ రిజర్వేషన్స్‌పై సుప్రీం కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత ఎన్నికలు త్వరగా నిర్వహించడానికి మేం ప్రయత్నం చేస్తాం. అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఈ విషయమేమన్నా కారణమయిందా? బీసీలు ఎక్కువ రిజర్వేషన్లు సాధిస్తున్నందుకేమైనా ప్రభుత్వంపై వీళ్లు అవిశ్వాస తీర్మానం పెట్టారేమోనని నాకు సందేహంగా ఉంది. లేకపోతే స్థానిక సంస్థలకు జరగబోయే ఎన్నికల్లో వీరి అడ్రస్ గల్లంతు అవుతుందేమోనని భయపడి, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నారేమోనని నాకు సందేహం కలుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే సత్తా వారికి లేదు. ఏది ఏమైనప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసే తరుణంలో మొట్టమొదటగా ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతోందని గర్వంగా చెప్పుకుంటున్నాం.

రా.10.50

రైతులకు ఎంతో ముఖ్యమైన అంశం పెట్టుబడి. తక్కువ వడ్డీతో వారికి పెట్టుబడి కల్పించే సదుపాయం. కాంగ్రెస్ ప్రభుత్వం 2004వ సంవత్సరం నుంచి బ్యాంకుల ద్వారా రైతులకు ఉపయోగకరమైన పథకాలు తీసుకురావడానికి కృషి చేస్తూనే ఉంది. 2004వ సంవత్సరంలో రైతులకు కేటాయించిన బడ్జెట్ కేవలం రూ.10,000 వేల కోట్లు మాత్రమే. ప్రస్తుత సంవత్సరానికి సదరు బడ్జెట్‌ను రూ.52,000 వేల కోట్లు కేటాయించి బ్యాంకుల ద్వారా రైతులకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. అందులో నుంచి పంట రుణాల క్రింద దగ్గర దగ్గర రూ.42,000 వేల కోట్లు ఈ సంవత్సరం రైతులకు అందేలా చర్యలు తీసుకున్నాం. కేంద్ర ప్రభుత్వం గతేడాదికి ముందుటేడాది రైతులకు కేటాయించిన బడ్జెట్ రూ.4,75,000 వేల కోట్లు కాగా, గతేడాది ఆ కేటాయింపులు రూ.5,75,000 వేల కోట్లు పెంచడం జరిగింది. ప్రస్తుత సంవత్సరానికి సదరు కేటాయింపులను గత సంవత్సరం కేటాయింపుల కంటే రూ.1,25,000 వేల కోట్లు పెంచి బడ్జెట్‌ను రూ.7,00,000 లక్షల కోట్లు చేశారు.

రైతులకు కేటాయించే బడ్జెట్ ఎన్‌డిఏ హయాంలో వారికి ఇచ్చే రుణంపై వడ్డీ 9 శాతం నుండి 11 శాతం వరకు ఉండేది. యూపిఏ ప్రభుత్వం సదరు వడ్డీని క్రమంగా తగ్గిస్తూ ఈ రోజుకు 7 శాతానికి తీసుకు రాగలిగింది. తీసుకున్న రుణం ఒక సంవత్సరం లోపల చెల్లించినట్లైతే సదరు రుణం పై వడ్డీని 3 శాతానికి తగ్గించడం జరిగింది. రైతులు వారు తీసుకున్న రుణం ఒక సంవత్సరంలోపు చెల్లించినట్లైతే మిగిలిన ఆ నాలుగు శాతం వడ్డీని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకుంటుందని తెలియచేస్తున్నాను. ఆ విధంగా రైతులకు ఉపయోగకరమైన సంస్కరణలు మా ప్రభుత్వం చేసింది. అలా చేయటం కొన్ని పార్టీల

సభ్యులకు నేరంగాను, పాపంగాను అర్థమయ్యి, ఈ రోజున సభలో అవిశ్వాసం పెట్టారేమో, రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వడం వలన అవిశ్వాసం పెట్టారా అని అడుగుతున్నాను.

దురదృష్టవశాత్తు మన రాష్ట్రంలో రెండు, మూడు సంవత్సరముల నుండి ఒక వైపు వరదలు, మరొక వైపు కరవు రావడం వలన రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆ పరిస్థితిని అధిగమించేందుకై ప్రభుత్వం ఎక్కువ శాతం 'ఇన్‌పుట్ సబ్సిడీ' రైతులకు ఇవ్వాలని నిశ్చయించిందని తెలియచేస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వంలో సదరు ఇన్‌పుట్ సబ్సిడి హెక్టారుకు రూ.1,500 ఉండేది. ఆ సబ్సిడీని క్రమ క్రమంగా 2010వ సంవత్సరానికి రూ.4,500 చేశాం. ఇటీవలే ఆ సబ్సిడీని హెక్టారుకు రూ.10,000 లకు పెంచాం. ఆ విధంగా చేయడం మా ప్రభుత్వ పొరబాటు తనమా? ఆ విధంగా చేయడం వైయస్‌ఆర్ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలకు నచ్చడం లేదా? ఆ రెండు పార్టీల సిద్ధాంతాలు, ఆశలు, ఆశయాలు, వారు పార్టీలను స్థాపించిన కారణాలు కూడా వేరే ఉన్నాయి. సదరు రెండు పార్టీలు కలిసి ఈ రోజున సభలో అవిశ్వాసం ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదు. అంతే కాకుండా తక్కువ ధరకే బియ్యం, వంట సామానులు సరఫరా చేసి, రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియచేస్తున్నాను.

(వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యుల నుంచి అంతరాయం)

1999-2004 సంవత్సరాల మధ్య ఎన్‌డిఏ ప్రభుత్వ హయాంలో క్వింటాలు వరికి రూ.520 ల నుంచి రూ.590 లు మాత్రమే ఇవ్వడం జరిగింది. అయిదు సంవత్సరాలకు గాను కేవలం రూ.70 లు మాత్రమే పెంచారు. యూపిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు క్వింటాలు ధరను రూ.590 ల నుంచి రూ.1280 లకు పెంచడం జరిగింది. రైతులకు ఇంకా మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వమే వారి నుంచి ధాన్యాన్ని సేకరించి ప్రయోగాత్మకంగా 7 జిల్లాల్లో ఎగుమతి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. తద్వారా రైతుకు మంచి గిట్టుబాటు ధర వచ్చిందని తెలియజేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మన రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి వలన రైతు పండించిన ధాన్యానికి మంచి ధర పలికి రైతు లాభపడ్డాడని తెలియచేస్తున్నాను. ఆ విధంగా రైతులను ఆదుకోవడం మా ప్రభుత్వం చేసిన పొరబాటు తనమా?

ఇంచుమించు కోటి మంది రైతులకు లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు మా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను. సదరు రుణం పై వడ్డీని రైతుల తరపున రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలియజేస్తున్నాను. రుణం రీ సెటిల్‌మెంట్ విషయంలో ఆర్‌బిఐ వడ్డీని 12 శాతం నుంచి 14 శాతం వరకు వారికున్న నిబంధనల ప్రకారంగా వసూలు చేస్తున్నారు. ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వ అనుమతితో రీ సెటిల్‌మెంట్ అయిన తర్వాత ఎవరైనా రైతు తను తీసుకున్న రుణాన్ని ఒక సంవత్సరం లోపల చెల్లించిన పక్షంలో సదరు రుణం పైన వడ్డీని 12-14 శాతం నుంచి 7 శాతానికి తగ్గించేందుకు, రైతులకు అనుకూలమైన విధంగా ఆదేశాలు జారీ చేయడంలో కృషి చేశామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఆ విధంగా ఒక వైపు ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం రైతులకు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నది. దగ్గర దగ్గర 25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌ల నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల ద్వారా సంప్రదింపులు జరిపి, ప్రైవేటు భాగస్వామ్యంతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని తెలియజేస్తున్నాను.

మరొక వైపు రైతుకు, రైతు కూలీలకు పెద్ద ఎత్తున 'ఉపాధి హామీ' పథకం అమలుచేస్తున్నాం. దీంతోబాటు రైతు అంటే కేవలం వ్యవసాయం చేసే వారే కాదు, రైతుకు అనుబంధ రంగాలైన డెయిరీ, హార్టికల్చర్, ఫిషరీస్, పౌల్ట్రీలను కూడా ప్రోత్సహించి, వారికి మేలు చేసేందుకై సదరు రంగాలన్నింటికి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాం. రూ.5,500 కోట్లతో మిల్క్ మిషన్‌ల అభివృద్ధికి మూడు, నాలుగు సంవత్సరాలకు సంబంధించిన కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను.

రా.11.00

నాలా ఛార్జీలకు సంబంధించి చూసినట్లయితే, చేపలు, రొయ్యల చెరువుల మీద బ్రతుకుతున్న రైతులకు నాలా ఛార్జీలు రూ.450 కోట్లు బకాయి ఉంటే దానిని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. బడ్జెట్‌లో ఉండేది రూ.50 కోట్లు మాత్రమే. మొత్తం రూ.11,000 కోట్లకు సంబంధించినవి ఉత్పత్తి చేస్తున్నారని వారిని ప్రోత్సహించాలని ఈ బడ్జెట్‌ని పెంచడం జరిగింది. పోయిన సంవత్సరం రూ.200 కోట్ల పైచిలుకు బడ్జెట్‌ని పెంచడం కాకుండా నాలా ఛార్జీల బకాయిలు తీసివేయడం జరిగింది. రూ.450 కోట్ల బకాయిలతోబాటు ప్రతి సంవత్సరం వారు కట్టవలసిన రూ.120 కోట్లు కూడా రద్దు చేయడం జరిగింది. ఈ అనుబంధ రంగాలను ప్రోత్సహించడానికి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేయడం జరిగింది. గుడ్ల మీద మార్కెట్ సెస్‌ను తీసివేయడం జరిగింది. ఆయిల్ పామ్ మీద వ్యాట్ రూ.80.00 కోట్లు రద్దు చేయడం జరిగింది. వీటితోబాటు అన్ని రంగాలకు బడ్జెట్‌ను పెంచి వాటిని వ్యవసాయంతోబాటు గిట్టుబాటు అయ్యే విధంగా ప్రయత్నం చేస్తూ వస్తున్నాము.

నేను ముఖ్యమంత్రి అయిన తరువాత, క్యాబినెట్ కూర్చొని నేరుగా ప్రజల దగ్గరకు వెళ్లాలని నిర్ణయించి వారికి పరిష్కార మార్గాలు చూపించాలని ఒకవైపు చాలా మందికి ప్రభుత్వం నుండి లభిస్తున్న మేలు జరుగుతూ ఉంటే, మరొక వైపు ఇంకా చాలా మందికి మేలు జరగడం లేదని రచ్చబండ కార్యక్రమాలు పెట్టాము. రెండు సార్లు అయింది. మూడవసారికి సంబంధించి తేదీ పెట్టుకొని అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్‌కి సంబంధించి ఇవ్వడం జరుగుతుంది. మొదటి రెండు రచ్చబండ కార్యక్రమాలలో మొత్తం 30 లక్షల రేషన్ కార్డులు అదనంగా ఇచ్చాము. పెన్షన్స్ అదనంగా 8 లక్షల మందికి ఇచ్చాము. హౌజింగ్‌కి సంబంధించి రూ.12.30 కోట్లతో 50 లక్షల మందికి ఇచ్చాము. రచ్చబండ మూడవ దశ త్వరలో తీసుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వైఎస్ఆర్‌సిపి వారికి ఇవేమీ నచ్చడం లేదేమో? మేము 50 లక్షల మందికి అదనంగా ఇచ్చాము. మేము ఏమీ చేయడం లేదా? తగ్గిస్తున్నామా ? వైఎస్ఆర్‌సిపికి కనబడలేదా?

ఒకవైపు సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్‌ని ప్రజలకు దగ్గరగా తీసుకురావాలని మరొక వైపు ఆధార్ కార్డులు ఇస్తున్నాము. రేషన్ కార్డులు సీలింగ్ చేయడం వల్ల రాష్ట్రంలో వారు ఎక్కడ ఉన్నా వారికి నిత్యావసర వస్తువులు తీసుకొనే విధంగా చేయడం జరుగుతోంది. రెండు కార్డులు ఎవరికీ ఉండవు. దేశంలో అతి ఎక్కువ ఆధార్ కార్డ్స్ మన రాష్ట్రంలోనే పూర్తి అయ్యాయి. మొత్తం పూర్తి చేయడానికి ఇంకా కొన్ని రోజులు అవుతుంది. దాదాపు 6 కోట్ల వరకూ పూర్తయ్యాయి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు మేలు జరగాలన్నదే మా ధ్యేయం. ఉగాదికి కొత్త కార్యక్రమం పెట్టి నిత్యావసర వస్తువులు రూ.292 విలువ గల వాటిని కేవలం రూ.155 కే

ప్రతి నెల అందించే విధంగా, ముఖ్యంగా తూకం సక్రమంగా ఉండి వారికి చేరే విధంగా ప్రయత్నం చేస్తున్నాము. ఇది ఒక పెద్ద ప్రయత్నము.

దీనితోబాటు నిన్న మొన్న రెవెన్యూ సదస్సులు మొదలు పెట్టాము. గ్రామ స్థాయిలో పోయిన సంవత్సరం 68,000 కు గ్రామాలను రెవెన్యూ సదస్సులో పెట్టాము. వాటిలో వచ్చిన పిటీషన్స్ 6,90,000 కాగా అందులో 6,80,000 పిటీషన్స్ పైన అంటే 99 శాతం పిటీషన్స్‌కి పరిష్కార మార్గం చూపించింది రెవెన్యూ శాఖ. ఇప్పుడు 28,000 రెవెన్యూ గ్రామాలలో ఈ రెవెన్యూ సదుస్సులు మొదలుపెట్టాము. ఒక నెల పాటు ప్రజల దగ్గర వారికి ఉన్న భూమికి సంబంధించి ఇబ్బందులను తెలుసుకొని పరిష్కార మార్గం చూపిస్తాము. పదే పదే రైతులే కార్యాలయాలకు వెళ్లకుండా అధికారులే వారి ఇళ్లకు వెళ్లి పరిష్కార మార్గం చూపించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. 90 రోజుల్లో పరిష్కార మార్గం చూపించాలని ప్రజల వద్దకు వెళ్లడం జరుగుతోంది. ఇది ఖచ్చితంగా ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తున్నాను.

ఒక వైపు ఈ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నాము. మహిళలకు సంబంధించి ఈ సంవత్సరం రూ.11,000 కోట్లు బ్యాంకు రుణాలు ఇవ్వడం, దానికిగాను కొత్త కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మైక్రో ఫైనాన్స్ ఇబ్బందికరంగా ఉందని అంటే ' శ్రీనిధి ' కార్యక్రమం ద్వారా రూ.1,500 కోట్లు ఈ సంవత్సరం రెండవసారి రుణం తీసుకోవడానికి ఏర్పాటు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం కూడా మహిళల కోసం కొత్త కార్యక్రమాన్ని రూ.1,000 కోట్లతో ఈ సంవత్సరం మొదలు పెడుతోంది. ఇది గర్వ కారణం.

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ దేశంలో పెద్ద ఎత్తున తేవాలని ప్రయత్నం చేస్తున్నారు. మహిళలకు సంబంధించి చెబుతాను. నేను ముఖ్యమంత్రి అయిన రోజుకు రెండు, మూడు సంవత్సరాల నుండి మహిళలకు పావలా వడ్డీ రాలేదు. ఈ రోజు పూర్తిగా అసలు కడితే వడ్డీ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆ మహిళల తరఫున కడుతుంది. 1,46,000 మహిళలకు ఈ వడ్డీలేని రుణాలు, అసలు కడితే చాలు, వడ్డీ ప్రభుత్వమే చెల్లించడం జరుగుతోంది. మేము ఈ కార్యక్రమం అమలు చేయడం లేదని వారన్నారు. అయితే ఈ రుణాలన్నీ చేరే వారికి నేరుగా చేరుతోంది. మధ్యవర్తులకు చేరడం లేదు. అందుకే వారు అవిశ్వాస తీర్మానం పెట్టారేమో నాకు అర్థం కావడం లేదు.

దేశంలో, ఏ రాష్ట్రంలో అయినా ఇన్ని మంచి కార్యక్రమాలు ఉన్నాయా? దేశంలో ఎవరయినా, ఏ రాష్ట్రమయినా ఈ విధమైన కార్యక్రమాలు చేస్తున్నదా అని ఒకసారి ఆలోచించాలి. కళ్లు ఉన్నా కనబడదు, చెవులున్నా వినబడదు, నోరు ఉన్నా మాట్లాడను అంటే వారిని మనం ఏమీ చేయలేము. వారి పాపాన వారు పోతారు. వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. ప్రతీ మండల హెడ్ క్వార్టర్స్‌లో ఒక కార్యాలయం ఉండాలని రూ.25.00 లక్షలతో మహిళలకు ' శ్రీశక్తి భవన్'అని ప్రతి మండల హెడ్ క్వార్టర్స్‌లో మొదలు పెట్టాము. 550 భవనాలకుగాను ఈ ఉగాది రోజున ప్రారంభోత్సవం చేయాలని ప్రయత్నం చేస్తున్నాము. ఈ ఉగాదికి పూర్తి చేస్తారని నాకు నమ్మకం ఉంది. 3,000 పంచాయితీలకు భవనాలు కూడా పూర్తి చేస్తున్నారు. అవి కూడా ఉగాది రోజు ప్రారంభోత్సవం చేయాలనీ, ఆ విధంగా చేస్తామనీ, ఆ ఘనత కూడా ఈ ప్రభుత్వానికే దక్కుతుందని తెలియచేస్తున్నాను.

రా.11.10

మహిళలకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. ఒక ప్రక్క ధాన్యాన్ని ప్రొక్యూర్ చేస్తున్నారు. ముఖ్యంగా చెప్పాల్సింది జండర్ డిస్క్రిమినేషన్. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తిగారు ఒక కార్యక్రమంలో

పాల్గొనడం జరిగింది. రాష్ట్రంలో ఆరు వేల కేసులను మీడియేషన్ ద్వారా పరిష్కరించినట్లు ఆయన తెలుసుకొని చాలా సంతోషించారు. ఇందిరా క్రాంతి పథం ద్వారా ఈ మహిళలు కుటుంబాల్లో ఉండే తగాదాలను తీసుకొని దాదాపు 46,000 కేసులను పరిష్కరించారు. దాదాపు 39 కోట్ల మంది ఎవరైతే బాధితులు ఉన్నారో వారికి వసూలు చేసి ఇవ్వడం జరిగింది. మహిళలను అభినందించి ప్రోత్సహించాల్సిన అవసరం ఇంకా ఎంతో ఉంది. ఈ రాష్ట్ర ప్రభుత్వం వీరిని అన్నిట్లో ప్రోత్సహిస్తుందని తెలియజేస్తున్నాను. అభయహస్తం కార్యక్రమం ద్వారా వికలాంగులకు రూ.600 కోట్లు కేటాయించి, వారిని గ్రూపులుగా చేసి, వారికి ఆర్థిక సహాయం చేయాలని ఈ సంవత్సరం మనం అనుకొన్నాం. కానీ వారికి రూ. 300 కోట్లు మాత్రమే ఈ సంవత్సరం ఇవ్వడం జరుగుతోంది. ఇటువంటి కార్యక్రమాలన్నీ పెద్దఎత్తున చేయడం జరుగుతోంది. ఇదా మీకు కడుపు మంట. మహిళలకు మేము సహాయం చేయడం మీకు ఇష్టం లేదా? మేము చేస్తున్న కార్యక్రమాలు లబ్ధిదారులకు చేరడం లేదని చెప్పడానికి మీకు నోరెలా వస్తోందో నాకైతే అర్థం కావడం లేదు.

చదువుకి మేము పెద్ద ఎత్తున ప్రాధాన్యతను ఇస్తున్నాం. ఈ రాష్ట్రంలో విద్య నిమిత్తం దాదాపు రూ.28,000 కోట్లను ఖర్చు చేయడం జరుగుతోంది. చదువుకి ఇది మేమిస్తున్న ప్రాధాన్యత అని గర్వంగా తెలియజేస్తున్నాను. పేదవారి తలరాతను చదువు ఒక్కటే మార్చగలదు. అందుకే చదువు విషయమై పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. ప్రైమరీ ఎడ్యుకేషన్ నిమత్తం రూ.3,000 కోట్లను ఖర్చు పెట్టడం జరిగింది. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంత పెద్ద ఎత్తున చేస్తున్నాం. 'ఇందిరమ్మ బాట' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, మూడు రోజుల పాటు ఒక్కో జిల్లాలో ఉండి ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తున్నాం. ఇందిరమ్మ బాట కార్యక్రమాన్ని 12 జిల్లాల్లో పూర్తి చేశాం. వెళ్లిన జిల్లాల్లో కనీసం ఒక్క హాస్టల్లో అయినా రాత్రి బస చేసి, అక్కడున్న పేద విద్యార్థులతో ఎస్.సి., ఎస్.టి., బి.సి.లతో మాట్లాడి వారికి ఉన్న సమస్యలు, వారి భవిష్యత్ ఆశయాల గురించి అడిగి తెలుసుకొంటున్నాం. పిల్లలతో రెండు మూడు గంటలు ఇంటరాక్ట్ కావడంతో వారు వారి జీవితాన్ని ఏ విధంగా మలచుకోదలచుకొంటున్నారో తెలుసుకోవడం జరుగుతోంది. అక్కడ వారితో కలసి భోజనం చేసి ప్రభుత్వం వారికి అండగా ఉంటోందనే భరోసా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఉదయాన్నే లేచి వారితో నేను క్రికెట్ ఆడితే, దానిపైనా కామెంట్స్ చేస్తున్నారు. పిల్లలతో ఆడుకోడానికి ముఖ్యమంత్రి వెళ్లారని అన్నారు. పాఠశాలలో ఉన్న నాలుగైదు వందల మంది పిల్లలతో, ముఖ్యమంత్రి గారు నేరుగా వెళ్లి వారితో ఆటలాడుకొంటున్నారంటే వారి సంతోషం వారి కళ్లలోనే చూడాలే తప్ప మీకర్థం కాదు. పేద వారి గురించి మీకు తెలియదు. అందుకే మీకు అర్థం కాదు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏ విధంగా మేలు చేయాలా అన్న తపన మా అందరిలో ఉంది. అందువల్లే మొన్న పెద్ద ఎత్తున డైట్ ఛార్జీలను పెంచాం. నా 20 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఈ సభలో మీరంతా కలిసి అభినందించినది ఈ డైట్ ఛార్జీలను పెంచినందుకే అని తెలియజేస్తున్నాను. డైట్ ఛార్జీలను దాదాపు 72% పెంచాం. దీని వల్ల 9 లక్షల మందికి ఉపయోగం కలుగుతుంది. దాదాపు రూ. 200 కోట్లు ఖర్చు అయినప్పటికీ, పిల్లలకు పౌష్టికాహారం ఉంటేనే బాగుంటుందని పెద్ద ఎత్తున విద్యార్థుల్లో మార్పు తేవాలని ఈ కార్యక్రమం చేయడం జరిగింది.

గత సమావేశంలో ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ విషయమై చర్చించాం. ఆ సందర్భంలో కూడా సభలో ఈ అంశంపై చర్చ జరుగరాదని, చర్చ జరిగితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, ఎక్కడో ఒక దగ్గర లిటిగేషన్ పెట్టి కోర్టుకు తీసుకువెళ్లే విధంగా ప్రయత్నం చేశారు. ఈ విషయం శోచనీయమైంది. నేను బాధ పడుతున్నాను. ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ విషయమై ప్రతిపక్షాల నుండి పూర్తి సహకారం వస్తుందని మేము అనుకొన్నాం. మన వాకింగ్ ఫ్రెండ్ ఆనాడు సమావేశానికి రాలేదు. ఆయన వాకింగ్ చేస్తూనే పోతున్నాడు. ఎస్.సి. ఎస్.టి.ల కోసం ఒక రోజైనా ఈ సభకు హాజరై వారి మద్దతు తెలుపుతారని నేను ఆశించాను. ఆనాడు, నా ఆశ నిరాశే

అయింది. ఆయన తనకు ఎస్.సి. ఎస్.టిల కంటే వాకింగే ముఖ్యమనుకొన్నారు. ఎవరి ప్రయారిటీలు వారికి ఉంటాయి.

(అంతరాయం)

మాకు మాత్రం ఎస్.సి. ఎస్.టిల విషయాలు ప్రయారిటీ. ఆయనకు వాకింగ్ ప్రయారిటీ. నేనేం చేసేది.

(అంతరాయం)

ఆ రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో నర్సింహులు గారు ఉన్నారు. ఒరిస్సాలో వరదలు వచ్చాయి. మన రాష్ట్ర యంత్రాంగమే ముందుగా అక్కడకు వెళ్లి సహాయం చేసింది. ఆనాడు ఉన్న ముఖ్యమంత్రి గారు సభలో మాట్లాడుతూ, 'ఒరిస్సా ప్రజలు కూడా నన్నే ముఖ్యమంత్రిగా ఉండమంటున్నారు' అని ఈ సభలో చెప్పారు. నాకు గుర్తు ఉంది. ఎన్నికలు రెండు మాసాల్లో వస్తున్నాయంటే ఆ సమయంలో ఈయన ఒరిస్సాకి వెళతాడేమో అన్న అమనూనం నాకు వస్తోంది. ఈ సభలోజరిగిన విషయాన్నే నేను చెపుతున్నాను కానీ వేరే విషయాలు చెప్పడం లేదు.

ఎస్.సి. ఎస్టి.లకు అందాల్సిన నిధుల్లో 16.23% నిధులు, ఎస్.సి.లకు, 6.6.% ఎస్.టి.లకు ఖచ్చితంగా ఖర్చు అయ్యే విధంగానూ వారిని అభివృద్ధి చేయడానికి ప్రపంచంలోని అన్ని విషయాల్లో వారు పోటీలో నిలిచే విధంగా, ముఖ్యంగా యువతను మనం తయారు చేయడానికి ఈ ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ బిల్‌ని తీసుకురావడం జరిగింది. ఇది వీరికి నచ్చలేదేమో! దీన్ని చేయడం వీరికి ఇష్టం లేదేమో! అందుకనే ఈ అవిశ్వాస తీర్మానం పెట్టారని నేను అనుకొంటున్నాను. మన రాష్ట్రాన్ని చూసి చాలా రాష్ట్రాలు ఈ ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్‌ని తయారు చేస్తున్నాయి. చాలా రాష్ట్రాల వారు మనం తయారుచేసిన బిల్‌ని తీసుకువెళ్లారు. ఈ రాష్ట్రాలే కాదు, కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఎస్.సి. ఎస్.టి.లకు సంబంధించిన బడ్జెట్‌ను చాలా ఎక్కువగా పెంచింది. ఇది కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అనుకొంటున్నాను.

**రా. 11.20**

బీ.సి.ల గురించి కూడా వాళ్లు మాట్లాడుతున్నారు. మా పార్టీ బీ.సి.ల పార్టీ అనే విధంగా గొప్పగా చెప్పుకుంటున్నారు. బీ.సి. వర్గాలకు మా పార్టీ పెద్ద పీట వేస్తుందనే విధంగా కూడా చెబుతున్నారు. సరే, పెద్ద పేట బీ.సి. వర్గాలకు వేసినట్లైతే బడ్జెట్‌లో కనబడాలి. కానీ, 1994 వ సంవత్సరం నుంచి 2004 వ సంవత్సరం వరకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో తొమ్మిది సంవత్సరాల కాలంలో బీ.సి. వర్గాలకు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.1,580.00 కోట్లు. ఆ మొత్తం పది సంవత్సరాల కాలానికి సుమా!

(తెలుగుదేశం పార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

ఉన్నది ఉన్నట్టుగా చెబుతుంటే ఎందుకు ఉలికి పడుతున్నారు? దయచేసి కొంచెం ఓపిక పట్టండి. అన్ని విషయాలను నేను చెబుతాను.

బీ.సి.ల గురించి మీరు మాట్లాడుతూ బీ.సి.ల విషయంలో మేమే చాంపియన్‌లం, మేమే ఖర్చు పెడతాం, మేమే వారి అభ్యున్నతికి పాటుపడతామనే దోరణితో, మేమే ఆ యా వర్గాలకు పెద్ద పీట వేశామనే రీతిలో గొప్పగా మాట్లాడుతున్నారు. ఆ విధంగా మాట్లాడుతున్న మీరు 1994 వ సంవత్సరం నుంచి 2004

వ సంవత్సరం వరకు సగటున సంవత్సరానికి బీ.సి. వర్గాల అభ్యున్నతికి గాను మీ ప్రభుత్వ హయాంలో రూ. 158.00 కోట్లు ఖర్చు చేశారు. 2004 వ సంవత్సరం నుంచి 2010 వ సంవత్సరం వరకు సగటున రూ. 1,000.00 కోట్లు మా పార్టీ ప్రభుత్వం బీ.సి. వర్గాల అభ్యున్నతికి గాను ఖర్చుచేయడం జరిగింది. కానీ, 2011-12 వ సంవత్సరానికి గాను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీ.సి.ల అభ్యున్నతికి గాను బడ్జెట్‌లో రూ. 2,000.00 కోట్లకు పైగా పైచిలుకు మొత్తాన్ని కేటాయించడం జరిగింది. 2012-13 వ సవంత్సరంలో కూడా బీ.సి.లకు గాను రూ. 3,017.00 కోట్లను బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. నేను గత సంవత్సరం బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడుతున్నాను. ప్రస్తుత సంవత్సరమైన 2013-14 సంవత్సరానికి గాను బీ.సి.లకు కేటాయించే బడ్జెట్ గురించి ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు సోమవారం నాడు సభ ముందు ఉంచుతారు. ఏ మేరకు బీ.సి.లకు బడ్జెట్ కేటాయించామనే విషయం మీకు తెలుస్తుంది. గత కేటాయింపులకు 142 శాతం ఎక్కువగా ఉండే విధంగా బీ.సి.ల కొరకు బడ్జెట్‌ను కేటాయించడమనేది జరుగుతోంది. గతంలో పది సంవత్సరాల కాలంలో మీ ప్రభుత్వ హయాంలో బీ.సి.ల సంక్షేమం కొరకు ఖర్చు చేసినదానికంటే మేం మా ప్రభుత్వ హయాంలో ఒక సంవత్సరం రెట్టింపు చేయడం జరిగింది. ఇక రాబోయే సంవత్సరంలో బడ్జెట్ రూపకల్పన ఏ విధంగా ఉంటుందనే విషయాన్ని మీరే త్వరలో చూస్తారు.

అదే విధంగా కోఆపరేటివ్ ఫెడరేషన్స్‌కు గత సంవత్సరం బడ్జెట్‌లో సుమారుగా రూ. 2,008.00 కోట్లు అంటే దగ్గర దగ్గరగా రెండు వేల శాతం మేరకు పోయిన సంవత్సరం కంటే పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదనే విషయాన్ని నేను స్పష్టం చేస్తున్నాను. కావాలనుకుంటే పర్సెంటేజ్ విషయాలను బడ్జెట్ నందు మాట్లాడుకోవచ్చు.

(అంతరాయం)

మైనారిటీస్ సంక్షేమం కొరకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి సంవత్సరం అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలో అంటే 2004-05 వ సంవత్సరానికి గాను బడ్జెట్‌లో రూ.30.00 కోట్లు కేటాయించింది. అంతకంటే ముందు కేవలం రూ. 15.00 కోట్లే మైనారిటీస్ సంక్షేమం కొరకు ప్రభుత్వం బడ్జెట్ ను కేటాయించే పరిస్థితి ఉండేది. 2008-09 వ సంవత్సరం మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ. 180.00 కోట్లు బడ్జెట్ నందు కేటాయించడం జరిగింది. 2011-12 వ సంవత్సరానికి గాను మైనారిటీల సంక్షేమం కొరకు బడ్జెట్‌లో రూ. 300.00 కోట్లు కేటాయించడం జరిగింది. గత సంవత్సరం అంటే 2012-13 వ సంవత్సరానికి గాను మైనారిటీల సంక్షేమం కొరకు రూ. 489.00 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిన ఘనత మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని నేను విస్పష్టంగా తెలియజేస్తున్నాను. మైనారిటీల సంక్షేమం కొరకు ఏ ప్రభుత్వమైనా పనిచేసిందా అంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేననే విషయాన్ని కూడా సభకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

(అంతరాయం)

అధ్యక్షా, నేను చెప్పేది వివరంగా వింటే కొంచెం అర్థమవుతుంది. మైనారిటీల సంక్షేమంలో భాగంగా మైనారిటీ విద్యార్థులకు గతంలో 17,000 మందికి గాను రెండు కోట్ల రూపాయలు స్కాలర్‌షిప్పుల క్రింద ఇచ్చే విధానం ఉండేది. నేను 2004-05 వ సంవత్సరంలో మీ ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టిన మొత్తం. రెండు కోట్ల రూపాయలు 17,000 మంది మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల రూపంలో ఇవ్వడం జరిగింది. గత సంవత్సరం అంటే 2011-12 వ సంవత్సరంలో మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మైనారిటీల స్కాలర్‌షిప్పుల నిమిత్తం సుమారు లక్షా యాభై వేల మందికి రూ. 230.00 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి నిధుల్ని విడుదల

చేయడం జరిగింది. మైనారిటీ విద్యార్థుల విషయంలో ముఖ్యంగా ఉన్నత చదువులు అభ్యసించే విషయంలో వెనుకబాటుతనం ఉందనే విషయాన్ని గమనించి 2,886 మంది విద్యా వ్యాలెంటీర్స్‌ను మదరసాలలో నియమించి ప్రభుత్వం వారికి జీతభత్యాలివ్వడం జరిగిందనే విషయాన్ని కూడా తెలియజేస్తున్నాను. హైదరాబాద్ నగరంలోని పాతపట్నం (ఓల్డ్ సిటీ) నందు చదువునభ్యసించని వారి సంఖ్య ఎక్కువ ఉందనే విషయాన్ని గ్రహించి వారి విషయంలో కూడా ప్రభుత్వం చొరవ చూపి 355 మందిని మోటివేటర్స్‌గా నియమించడం జరిగిందనే విషయాన్ని కూడా నేను సగర్వంగా చెబుతున్నాను. మోటివేటర్స్ ప్రత్యేక శ్రద్ధ కనబరచి మైనారిటీస్ పిల్లలను పాఠశాలలకు వెళ్లేటట్టుగా చూడడం జరుగుతోంది. మైనారిటీకి చెందిన ఆడపిల్లల చదువు కూడా మధ్యలో నిలిచిపోకుండా పాఠశాలల్లో వారి విద్య కొనసాగించేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 26,000 పైచిలుకు సైకిళ్లను పది కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం వారికి తోడ్పాటు అందించింది. మైనారిటీల సంక్షేమం కొరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందనే భరోసా కూడా ఆ యా వర్గాలకు ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, మైనారిటీలకు రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి అమలుపరుస్తున్నది కూడా మా ప్రభుత్వమే. నాలుగు శాతం రిజర్వేషన్ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 30,000 లకు పైగా ప్రభుత్వ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లుగా మైనారిటీ విద్యావంతులు పనిచేస్తున్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దగ్గరదగ్గరగా 1,000 మందికి పైగా డాక్టర్ల నియామకం కూడా మా ప్రభుత్వ హయాంలో జరిగింది. ఈమధ్యే జరిగిన ఎస్.ఐ. రిక్రూట్‌మెంట్‌లో కూడా సుమారు 60 మందికి పైగా ముస్లిం విద్యావంతులు, యువకులు ఎస్.ఐ.లుగా అర్హత సాధించడం ద్వారా ఉద్యోగాలు పొందారు. ఇదంతా మా ప్రభుత్వ ఘనత కాదా అని నేను అడుగుతున్నాను.

స్కాలర్‌షిప్స్ క్రింద 2004-05 వ సంవత్సరంలో సంక్షేమ శాఖల్లో మొత్తం 8.25 లక్షల మంది విద్యార్థులకు ఇచ్చే విధానం ఉండేది. ఎక్స్‌పెండీచర్ అంతా కలిపి రూ. 380.00 కోట్లు. అటువంటిది ఈ సంవత్సరం దగ్గరదగ్గరగా 25 లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్పుల రూపంలో రూ. 3,500.00 కోట్లు ఖర్చు చేయడం జరుగుతోంది. ముఖ్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెప్పాల్సిన విషయం అది. ఎందుకంటే, స్కాలర్‌షిప్పులను ఈ ప్రభుత్వం మంజూరుచేయడం లేదనే విషయంగా ప్రచారం చేయడం జరుగుతోంది. 2008-09 వ సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్పుల క్రింద చెల్లించాల్సిన రూ. 31.00 కోట్ల బకాయి ఉంటే నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆ బకాయి మొత్తం చెల్లించడం జరిగింది. 2009-10 వ సంవత్సరంలో స్కాలర్‌షిప్పుల క్రింద బకాయి మొత్తం రూ. 2,176.00 కోట్లు ఉండగా ఆ మొత్తాన్ని కూడా మా ప్రభుత్వమే చెల్లించింది. 2010-11 వ సంవత్సరానికి గాను రూ. 2,438.00 కోట్లు స్కాలర్‌షిప్పుల క్రింద బకాయి ఉండగా ఒకేసారి మొత్తం రెండు సంవత్సరాలకు కలిపి రూ. 4,645.00 కోట్లు పాత బకాయిల క్రింద విద్యార్థులకు చెల్లించడం జరిగింది. పేద విద్యార్థులకు చదువు చెప్పించాలనేదే మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ చిత్తశుద్ధి.

(అంతరాయం)

స్కాలర్ షిప్పుల క్రింద ఉన్న బకాయి కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోదే. విద్యార్థులకు స్కాలర్‌షిప్పు అందడం లేదనే ప్రచారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్నారు కాబట్టే వారికి వివరంగా చెప్పడం జరుగుతోంది. కేవలం పేద విద్యార్థుల స్కాలర్‌షిప్పుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చెల్లించిన మొత్తం రూ. 11,000.00 కోట్లు. మా ప్రభుత్వం పైన మీరు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఇప్పుడు నేను చెప్పిన వన్నీ కారణమా అని నేను అడుగుతున్నాను. అన్నింటినీ ఒకసారి ఆలోచన చేసుకోవాల్సిన అవసరముంది.

రాష్ట్రంలోని చిన్న పిల్లలకు కంటిచూపు సమస్యలొస్తున్నాయనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, ముఖ్యంగా చిన్న పిల్లలు కంటి చూపులేక సక్రమంగా పాఠశాలలకు వెళ్లడం లేదనే విషయాన్ని గ్రహించి, పెద్ద యెత్తున రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచిత కంటి వైద్య చికిత్స చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. తద్వారా రాష్ట్ర.వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది విద్యార్థులకు ఉచిత కంటి వైద్య చికిత్సను ప్రభుత్వం చేయించడం జరిగింది. ఆ వైద్యానికి, ఆ కార్యక్రమానికి "చిన్నారి చూపు" అనే పేరు పెట్టడం జరిగింది. కంటి పరీక్షలో సమస్యలు బయటపడిన వెంటనే అవసరమైన చికిత్స చేసి, ఆపరేషన్లు చేసి, మందులను పంపిణీ చేయడం, అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందించడం తదితర కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ ఖర్చుతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 4.70 లక్షల మంది విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు జరిపి, బాధితులకు చికిత్స జరిపి, అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించడం జరుగుతోంది. ఇటువంటి కార్యక్రమాలను మా ప్రభుత్వం చేస్తుందనే అక్కసుతో మాత్రమే మీరు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టినట్టుగా నాకు అర్థమవుతోంది.

రా.11.30

చిన్న పిల్లలు చనిపోవడం గురించి మాట్లాడారు. ఈ రాష్ట్రంలో ఐఎమ్ఆర్, ఎమ్ఎమ్ఆర్కు సంబంధించి సదరన్ స్టేట్స్‌తో కంపేర్ చేస్తే మన రాష్ట్రంలో తల్లులు, పిల్లలు చనిపోయే వారు ఎక్కువ శాతం మంది ఉన్నారు. దానిని మార్చడానికి పెద్దయెత్తున ప్రయత్నం చేస్తూ వస్తున్నాము. చిన్న పిల్లలకు నియోనాటల్ సెంటర్స్, అడిషనల్ బెడ్స్ , ఇన్‌క్యుబేటర్సు కాని 1956 నుండి మొన్నటి వరకు వరకు 800 పడకలు మాత్రమే ఉండేవి. ఇంకొక 800 పడకలు ఈ రెండు సంవత్సరాలలో పెంచడం జరిగింది. ప్రతి సంవత్సరం 65000 మంది పిల్లలు చనిపోతున్నారు. ఈ ప్రభుత్వం 15000 మంది పిల్లల ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేస్తోంది. మీ దృష్టి అటువైపు వెళ్లిందా అనే ఆలోచన చేయమని కోరుతున్నాను. పిల్లలకు పౌష్టికాహారం లేక తక్కువ బరువుతో పుడితే వారు హాస్పిటల్‌లో ఇన్‌క్యుబేటర్‌లో ఉంటే, ఆ తల్లి పని చేయకుండా ఆసుపత్రిలో ఉంటుంది కాబట్టి హాస్పిటల్‌లో చేరినప్పటి నుండి ఉపాధి హామీ పథకం క్రింద ఆమె కూలికి పోకపోయినా రూ.150లు నెలకు ఇవ్వడం జరుగుతోందని మీకు తెలుసు. వారికి ఆ విధంగా హాస్పిటల్‌లో ఉన్నన్ని రోజులు ఇవ్వడం జరుగుతుంది. అందువల్లనే అవిశ్వాస తీర్మానం పెట్టారా? నాకు అర్థం కావడం లేదు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఇందిరమ్మ అమృత హస్తం అనే పథకం వర్తింప చేస్తున్నాము. తల్లి కాబోయే స్త్రీలకు పౌష్టికాహారం లేక ఆరోగ్యం పాడయ్యే పరిస్థితి వచ్చి, పుట్టబోయే పిల్లలు సరైన బరువుతో పుట్టడం లేదు. అటువంటి వారికోసం ఒక కొత్త కార్యక్రమం మొదలు పెట్టాము. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ద్వారా 27000 అంగన్‌వాడీ సెంటర్స్‌లో తల్లులకు మిడ్ డే మీల్స్, హాట్ మీల్ ద్వారా రోజుకు 40 శాతం పౌష్టికాహారం సరిపోయేలా ఈ ప్రభుత్వం పెడుతుందని సభ దృష్టికి తెస్తున్నాను. 3.04 లక్షల మంది కాబోయే తల్లులకు ఈ పథకం ఉపయోగకరంగా తీర్చిదిద్దడం జరిగింది. మీరు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అదే కారణమా?

ఆరోగ్యశ్రీలో ఇప్పటి వరకు 17 లక్షల ఆపరేషన్స్ అయ్యాయి. వైఎస్ఆర్‌సిపి మిత్రుడు 2009లో 12 లక్షల ఆపరేషన్స్ జరిగాయని అన్నాడు. నిజం చెప్పే వానికి నేరుగా కళ్లలో కారం కొట్టినట్లుగా చెప్పాడు. 12లక్షల ఆపరేషన్స్ ఒకటే సంవత్సరంలో చేశాము, ఇంకా 17 లక్షల ఆపరేషన్స్ అంటే వీళ్లు ఏమి చేసినట్టు అనే విధంగా ఆ మిత్రుడు నాతో చెప్పడం జరిగింది. కొత్త శాసనసభ్యులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి, అవాస్తవాలు మాట్లాడకూడదు. అవాస్తవాలు మాట్లాడితే ప్రజలలో నమ్మకం పోతుంది. ఆ విధంగా చేస్తే వారు మరల శాసనసభ్యులు కాలేరు. తప్పు జరిగితే ఈ పొరపాటు చేశామని ఒప్పించి ముందుకు పోవాలి తప్ప ప్రజలకు

అసత్యాలు చెప్పడం మంచిది కాదని కొత్త శాసనసభ్యులకు స్పష్టంగా తెలియ చేస్తున్నాను . 2007-08లో 23000 థెరపీలు, 2008-09లో 224000, 2009-10లో 326000, 2010-11లో 403000, 2011-12లో 434000 ఆపరేషన్స్ జరిగాయి. ఈ రెండు సంవత్సరాలలో 8 లక్షల ఆపరేషన్స్ చేయడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రులలో 26 శాతం ఆపరేషన్స్ జరిగే విధంగా తీర్చిదిద్దడం జరిగింది. 40 శాతం ఆపరేషన్స్ ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగే విధంగా ప్రయత్నం చేస్తున్నాము. అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రులు మెరుగ్గా ఉంటాయి. డాక్టర్సుకు కూడా అదనపు ఇన్‌కమ్ వస్తుంది. రూ.65 కోట్లు ఆరోగ్యశ్రీ డాక్టర్లకు పోగా మిగిలిన డబ్బు ఎక్విప్‌మెంట్ కోసం ఆరోగ్యశ్రీ ఇన్స్యూరెన్స్‌లో వచ్చి ఉండేది. కొత్త బిల్డింగ్ కడుతున్నాము దాని ఫౌండేషన్‌కు పిలుస్తాము. ఆరోగ్యశ్రీలో 2007-08లో రూ.143కోట్లు, 2008-09లో రూ.606 కోట్లు, 2009-10లో రూ.1,014కోట్లు, 2010-11లో రూ.1031కోట్లు, 2011-12లో రూ.1375కోట్ల ఖర్చు పెట్టడం జరిగింది. అంటే అంత ఖర్చు పెట్టినా ఆపరేషన్స్ జరగడం లేదని అర్థమా? వీటిలో థెరపీల పద్ధతి కూడా అమలులోకి తేవాలని చూస్తున్నాము. ఆరోగ్యశ్రీ కార్డులు 2.33 కోట్ల మందికి ఇవ్వడం జరిగింది. గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కు కూడా కొత్త స్కీమ్ తీసుకువస్తున్నాము. దాని తరువాత చాలా కొద్దిమంది మాత్రమే మిగులుతారు. దానిని కూడా యూనివర్సల్ చేద్దామనే విధంగా ఆలోచన చేస్తున్నాము.

108 సర్వీస్ పని చేయడం లేదని అన్నారు. 108కు సంబంధించి తేది.31.5.2008లో అగ్రిమెంట్ అయ్యాము. దాని ప్రకారం నెలకు ఒక వెహికిల్‌కు అప్పుడున్న రేటు 1.18 లక్షలు అంటే 95 శాతం చెల్లించడం జరుగుతుంది. 5 శాతం సత్యం కంప్యూటర్సు వాళ్లు చెల్లించే పరిస్థితి ఆ రోజున ఉంది. తరువాత ఒక వెహికిల్‌కు నెలకు రూ.1.12 లక్షలు 95 శాతం చెల్లించడం జరిగింది. మొత్తం 822 వెహికిల్సుకుగాను 770 వెహికిల్సు కాన్‌స్టాంట్‌గా వర్క్ చేయాలి. 2012లో ఫిక్స్ చేసిన రేటు నెలకు రూ.95000, వచ్చే సంవత్సరం రూ.1.05లక్షలు చెల్లించాలి. ఇది వంద శాతం మనం ఇస్తున్న రేటు తగ్గించి ఇవ్వడం జరుగుతుంది. డీజిల్ ధర పెరిగినా అందరికీ ఉపయోగకరంగా ఉండాలనే ఉద్దేశ్యముతో కొత్త వెహికిల్సు తీసుకువచ్చి మనం ఇవ్వడం జరుగుతుంది.

రా.11.40

అప్పుడు దాంట్లో పారామీటర్సుగా ముందు సగటున 2800 ఎమర్జెన్సీలు ప్రతి రోజూ అటెండ్ అయ్యేది. కానీ ప్రస్తుతం 3200 ఎమర్జెన్సీలు ప్రతి రోజూ అటెండ్ అవుతున్నాం. మునుపటి కంటె 488 ఎమర్జెన్సీలు ఎక్కువ. అదే విధంగా ఒక నెలకు సగటున ఒక్కో వాహనం 3800 కి.మీ. వెళ్లాలి. అటువంటిది ప్రస్తుతం నెలకు 4500 కి.మీ.లకు పెంచాం. ఎమర్జెన్సీలు పెంచాం, పేషెంట్లు పెరిగారు. Average number of pregnancies to be attended was 22,000 previously. ప్రస్తుతం దానిని 25,000లకు పెంచాం. అదే గాక మరలా తిరిగి వారిని వారి ఇళ్ల వద్ద డ్రాప్ చేస్తున్నాం. ఈ విధంగా తీర్చిదిద్దాం. 108 సక్రమంగా పనిచేస్తోంది. దురదృష్టవశాత్తు ఇటీవల దిల్‌సుక్‌నగర్‌లో బాంబు పేలుళ్లు జరిగినపుడు 15 నిమిషాలలోనే 108 వాహనాలలో ఆసుపత్రులకు క్షతగాత్రులను తరలించారు. అంత సమర్థవంతంగా 108 పనిచేస్తుందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే.

ఆరోగ్య శాఖ సక్రమంగా పనిచేయడం లేదని కొందరు చెప్పారు. ప్రస్తుతం 752 మంది డాక్టర్లను అదనంగా నియమించాం. దీంట్లో మనకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏమిటంటే, 400 మంది డాక్టర్లు ప్రతి సంవత్సరం పిజి చేస్తున్నారు. వారి వేతనాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనో లేదంటే వైద్య విధాన పరిషత్‌లోనో తీసుకుంటున్నారు. కానీ పోస్టు భర్తీ అయి ఉంటుంది కానీ వాస్తవంగా డాక్టరు అందుబాటులో లేని పరిస్థితి

ఉంది. దానిని మార్చి 400 మంది డాక్టర్లను ఒక పూల్‌గా చేసి అదనంగా డాక్టర్లను నియమించి ఆ ఖాళీలలో చూపించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానిని మార్పు చేశాం. ఇక ప్రభుత్వాసుపత్రుల్లో మందుల విషయానికి వస్తే మందుల కోసం బడ్జెట్‌ను పెంచాం. సుమారుగా 2010-11లో రూ.4140 కోట్లు ఉంటే 2012-13 సంవత్సరానికి రూ.5790 కోట్లకు పెంచాం. ప్రభుత్వాసుపత్రుల విషయంలో ఎక్కువ దృష్టి కేంద్రీకరించి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. 104 సర్వీసుల విషయాన్ని గురించి కూడా వివరించాల్సి వస్తే ఇంకొక గంటన్నర సమయం పడుతుంది. ప్రస్తుతం 475 వాహనాలు ఇపుడున్నాయి. గతంలో 440 వాహనాలు ఉన్నాయి. సెంటర్లు కూడా పెంచడం జరిగింది. గతంలో మందులకు రూ.30,000 ఇచ్చేవారు, ప్రస్తుతం రూ.40,000 ఇస్తున్నాం. ఇంతకు ముందు 104 వాహనాలలో డాక్టర్లు ఉండేవారు కాదు. ప్రస్తుతం డాక్టర్లు 104 వాహనాలలో రోగుల సేవలకు వెళుతున్నారు.

జలయజ్ఞం విషయానికొస్తే మనం 22 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును స్థిరీకరించడం జరిగింది. 34 లక్షల ఎకరాలకు ఈ సంవత్సరంలో సాగునీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రూ.16,000 కోట్ల రూపాయలు ఖర్చు చేయగలిగితే 2014 వరకు ఇంకొక 34 లక్షల ఎకరాలకు నీరందించగలమనేది వాస్తవం. దీంట్లో కొన్ని ఇబ్బందులున్నాయి. ప్రతి ప్రాజెక్టుకు కొన్ని ప్రత్యేక సమస్యలున్నాయి. ఒక్కొక్క ప్రాజెక్టు ఒక్కో విధంగా చేసి సమస్యలు అధిగమించి మనం ఈ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరముంది. చాలావరకు కరవు ప్రాంతాలలో పెద్దఎత్తున వేగవంతంగా నీరందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. మనం చిన్న ఇల్లు కట్టాలంటే, గ్రామంలో చిన్న వాటర్ స్కీం పెట్టాలంటే ఎన్నో సమస్యలు వస్తాయి. పెద్ద ప్రాజెక్టుల విషయంలో ఎన్ని ఇబ్బందులెదురైనా మనం ముందుకు వెళ్లాల్సిన అవసరముంది. ప్రాధాన్యతలు పెట్టుకొని పద్ధతి ప్రకారం నిధులు వెచ్చించి శాస్త్రీయ పద్ధతిలో రైతుకు త్వరగా నీరందించేందుకు ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ప్రకారం చేయడం జరుగుతుంది. కొన్ని మేజర్ ప్రాజెక్టుల గురించి కొందరు సభ్యులు మాట్లాడారు. గోదావరి డెల్టా ఆధునీకరణ గురించి కూడా శాస్త్రీయ పద్ధతుల్లో పనులను వేగవంతం చేయడానికి రూ.5000 కోట్లు మంజూరు చేసినా కేవలం 160, 170 కోట్ల రూపాయలు మాత్రమే సంవత్సరానికి ఖర్చు చేయగలుగుతాం. అందుకోసం సరైన ప్రణాళిక తయారుచేసి నిధులను సక్రమంగా ఖర్చు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీనితోబాటు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి మహరాష్ట్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. గత 30 సంవత్సరాల చరిత్రలో ఏ రాష్ట్రం కూడా మరో రాష్ట్రంతో అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో ఒప్పందాలు కుదుర్చుకోలేదు. అటువంటిది మనం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి వారితో ఒప్పందం చేసుకున్నాం. ఆ ప్రాజెక్టులో మనం 150 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుంది. అందులో 20 టీఎంసీలు ఇచ్చంపల్లికి, 160 టీఎంసీలు ప్రాణహిత-చేవెళ్లకు కేటాయించాలి. 30 టీఎంసీలు హైదరాబాదు నగరానికి తాగునీరు, 10 టిఎంసీల నీరు పరిసర గ్రామాలకు, 16 టిఎంసీలు పరిశ్రమలకు కేటాయించాం. ఈ ప్రాజెక్టు ప్రారంభమైంది, పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో ఇంకా కొన్ని అనుమతులు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అందుకు కొన్ని ఇబ్బందులున్నాయి. ఆ ఇబ్బందులను అధిగమించి జాతీయ ప్రాజెక్టుగా చేసినచో 16,000 ఎకరాలకు తెలంగాణ ప్రాంతంలో తాగునీటితోబాటు సాగునీరు ఇచ్చేందుకు ఎక్కువ ఖర్చు అయినా కూడా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రాజెక్టుకు అవసరమైన కరెంట్‌తోబాటు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టవలసి ఉంటుంది. మిత్రులు చెప్పినట్లు పెద్దఎత్తున రూ.20,000 కోట్లు ప్రాజెక్టులలో పెంచడానికి వీలు లేదు. టెక్నికల్ కమిటీ ఉంటుంది, కేంద్ర జలసంఘం ఉంటుంది. టెక్నికల్ కమిటీ స్క్రూటినైజ్ చేసిన తర్వాతనే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. ఒక్క రూపాయి కూడా టెక్నికల్ కమిటీ స్క్రూటినీ చేయకుండా రాష్ట్రానికి నిధులు రావు. టెక్నికల్ కమిటీ ఆమోదం తర్వాత కేంద్ర జలసంఘానికి పోతుంది. ప్రస్తుత పథకం ప్రధాన మంత్రి ప్యాకేజిలో ఉంది కాబట్టి 57 శాతం నిధులు కేంద్రం నుంచి వస్తాయి.

అయితే దానిని జాతీయ ప్రాజెక్టుగా చేపడితే 90 శాతం నిధులు కేంద్రం నుంచి వచ్చే ఆస్కారముంది. మేం ఆ ప్రయత్నంలోనే ఉన్నాం. తెలంగాణ సభ్యులు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులందరూ అందుకు మద్దతు తెలుపుతారని నేను ఆశిస్తున్నాను.

పోలవరం ప్రాజెక్టుకు కొందరు ఎందుకు వ్యతిరేకంగా ఉన్నారో నాకు అర్థం కావడం లేదు. పోలవరం చరిత్ర తీసుకొంటే 1942లోనే దానిని చేపట్టాలని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 1946, 1947లోనే అమెరికా, బ్రిటన్‌ల నుంచి ఇంజనీర్లు వచ్చి ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి ఇటువంటి మంచి ప్రాజెక్టు ఎక్కడా ఉండదని చెప్పారు. అప్పుడే ప్రాజెక్టు నిర్మాణానికి రూ.129 కోట్లు అవుతుందని అంచనా వేశారు. తరవాత గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటైన తరవాత మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో ఒప్పందం అయిన తరవాత ఈ ప్రాజెక్టు చేపడతామని, 150 అడుగుల ఎత్తుతో నిర్మిస్తామని ఒప్పందం కూడా చేసుకున్నారు. చివరికి కొందరు ఫిర్యాదు చేయడంతో సుప్రీంకోర్టు ఒక నిపుణుల బృందాన్ని పంపించి పరిశీలించిన తరవాత ఒప్పందం మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంగా సుప్రీం కోర్టుకు రిపోర్టు ఇచ్చింది. సుప్రీం కోర్టు దానిని పరిశీలించాలని చాలా స్పష్టంగా తీర్పు చెప్పింది. 80 టీఎంసీలలో 21 టీఎంసీలు కర్ణాటకకు, 14 టీఎంసీలు మహారాష్ట్రకు పోతుంది. 45 టీఎంసీలు గోదావరి నుంచి కృష్ణా నదికి వెళుతుంది. మిగిలిన జలాలు కరవు ప్రాంతమైన తెలంగాణ, రాయలసీమలో వినియోగించుకొనేందుకు ఆస్కారముంది. ఈ విషయం మరచిపోవద్దని కోరుతున్నాను. ఈ ప్రాజెక్టు గ్రావిటీతో ఏర్పాటయ్యే ప్రాజెక్టు. సుమారు 7,20,000 ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. 23 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ వస్తుంది. ఈ ప్రాజెక్టు గొప్పతనమేమంటే ఈ ప్రాజెక్టులో నీరు నిల్వ చేసుకొని జూన్ 1వ తేదీ నాటికి ఆయకట్టుకు నీరందించగలిగితే.........

(సిపిఐ సభ్యులు శ్రీ కూనంనేని సాంబశివరావుచే అంతరాయం)

రా.11.50

కూర్చోండి. నేను అన్ని విషయాలు మాట్లాడతాను. I will come next. మీరెందుకు బాధ పడుతున్నారో కూడా నాకు తెలుసు. భూములు కోల్పోయేవారు ఎందుకు బాధపడుతున్నారో కూడా నాకు తెలుసు. ఎక్కువ శాతం గిరిజనులు అక్కడ లేరు. గిరిజనేతరులు ఆ భూములు సాగుచేసుకుంటున్నారు కాబట్టి వారికి నష్టపరిహారం రాదు కాబట్టి నష్టపరిహారం గిరిజనులకు పోతుంది కాబట్టి వారు బాధ పడుతున్నారు. నేను ఆ విషయంలో పూర్తి సర్వే చేయించాను. ఎంతమంది అసలైన గిరిజనులు అక్కడ ఉన్నారో మా దగ్గర రికార్డు ఉంది. దాంట్లో 45 టిఎంసీల నీటిని జూన్ 1వ తేదీకి ఆయకట్టుకు అందించగలిగితే అక్టోబరు 15 నాటికి మొదటి పంట చేతికి వస్తుంది. తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో అక్టోబర్ తర్వాత తుపాన్లు వచ్చినా కూడా నష్టం జరగదు. ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు తుపాన్లు వచ్చి కోస్తా జిల్లాల్లో సుమారు రూ.34 వేల కోట్ల వరి పంట పూర్తిగా నష్టపోతుంది. పులిచింతల ప్రాజెక్టు, పోలవరం ప్రాజెక్టులు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌కు తుపాన్లు వచ్చినా కోస్తా జిల్లాల్లో పంట నష్టం జరగదు. రైతులకు నష్టం జరగదు. అదే ఈ ప్రాజెక్టుల గొప్పతనం. కాబట్టి సభ్యులందరూ సహకరించండి. రెండు లక్షల ఎకరాలకు ఖమ్మం జిల్లాలో నీటిసౌకర్యం కలుగుతుంది. ఇంద్రావతి ప్రాజెక్టులో రెండు లక్షల ఎకరాలకు నీరందించవచ్చు.

కంతనపల్లి ప్రాజెక్టుకు టెండర్ తేదీ కూడా ఇచ్చాం. త్వరలో టెండర్లు పిలుస్తాం. I think this is an important project. We are committed towards it. ఈ ప్రభుత్వం ఏ ప్రాజెక్టు కూడా వ్యతిరేకం కాదు.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఇ.దయాకరరావుచే అంతరాయం)

ఆ విషయం నాకు తెలుసు. ఇబ్బందులున్నాయి, టెండర్లు రాలేదు, వచ్చినవి రద్దయ్యాయి. ఈ ప్రాజెక్టు కూడా ముఖ్యమైన ప్రాజెక్టు కాబట్టి పూర్తి చేయాల్సిన అవసరముంది.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఇ.దయాకరరావు బాబ్లీ ప్రాజెక్టు గురించి ప్రస్తావించసాగారు)

నీవు కూడా ఆ కేసులో పిటీషనర్‌వి కదా! ఈ ప్రాజెక్టు గురించి మీరు పోరాడారు కదా! మీరు వకీలును పెట్టారు, ఫెయిలయ్యారా? మీ లాయరు సక్రమంగా వాదించలేదా?

(మా వకీలు సక్రమంగా వాదించారు, మీరే అడ్డుపడ్డారు అని శ్రీ ఇ.దయాకర రావు అన్నారు)

మంత్రిగారికి ఇదివరకే చెప్పాను. వారిచ్చిన అగ్రిమెంట్‌లో, జడ్జిమెంట్‌లో 60 టిఎంసీల కేటాయింపు ఉండగా, దానిలో 2.24 టీఎంసీల జలాలను కూడా అందులో భాగమైతేనే వాడుకోవాలి. అంతకు మించి వాడుకోవడానికి లేదని సుప్రీం కోర్టు చెప్పింది. ఒక వేళ ఎటువంటి అభ్యంతరాలున్నా కూడా మీరు మంత్రి గారితో మాట్లాడండి, లేకపోతే నా దగ్గరకు వస్తే మంత్రి గారితోబాటు ఇంజనీరింగ్ అధికారులను పిలిచి మాట్లాడి ఎటువంటి నష్టం జరిగే అవకాశముంటే దానిపైన ఖచ్చితంగా అప్పీలుకు వెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలియజేసున్నాను.

(అయిదు జిల్లాల శాసనసభ్యులను పిలవాలని శ్రీ ఇ.దయాకర రావు అన్నారు)

నీవు వింటే సరిపోతుంది. అన్ని పార్టీల సభ్యులను పిలుస్తాను.

శ్రీ ఇ.దయాకర రావుః (మైక్ లేకుండా) సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రానికి అనుకూలంగా వచ్చిందని చెబుతున్నారు. ఆ తీర్పు మనకు అనుకూలంగా రాలేదు.

శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డిః ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయాలో సభ్యులు సూచనలు చేస్తే పరిశీలించి రాష్ట్రానికి రావలసిన జలాలలో ఒక చుక్క నీటికి ఇబ్బందిగా ఉన్నా కూడా ఖచ్చితంగా దానిపైన అప్పీలుకు వెళ్లి మన రాష్ట్రం తరపు నుంచి మంచి న్యాయవాదిని నియమించడం జరుగుతుంది. మీకు ఎటువంటి అభ్యంతరాలున్నాయో దయచేసి తెలియజేయండి. సంబంధిత మంత్రి గారితో మాట్లాడండి, లేదా నా వద్దకు మీరు బృందంగా వస్తే మనం చర్చించుకొని రాష్ట్ర రైతాంగాన్ని ముఖ్యంగా తెలంగాణ రైతాంగాన్ని కాపాడేందుకు ఈ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని మీకు హామీ ఇస్తున్నాను.

శ్రీ ఇ.దయాకర రావుః (మైక్ లేకుండా) ఒకసారి వినండి సార్. ఒక్క నిమిషం అవకాశం ఇవ్వండి.

MR.SPEAKER: The Hon'ble Chief Minister has already told that he will call for an All Party Meeting. అందరినీ ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి గారు చెప్పారు కదా! కూర్చోండి.

శ్రీ ఎస్.కిరణ్‌కుమార్ రెడ్డిః ఆయన కూడా ఒక పిటీషనర్. ఆయన కూడా వకాల్తా వేశారు. నా దగ్గర సమాచారముంది.

(శ్రీ ఇ.దయాకర రావుచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః దయాకరరావు గారూ, ఒక్క నిమిషం వినండి. ఇపుడు అఖిలపక్షానికి అందరినీ ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి గారు చెప్పారు కదా!

శ్రీ ఇ.దయాకర రావుః (మైక్ లేకుండా) ముఖ్యమంత్రి గారు ఒప్పుకొన్న తరవాత మీకు అభ్యంతరర ఏమిటి? సుప్రీంకోర్టులో కేసు ఉందంటే ఆ పాపం రాజశేఖర రెడ్డి గారిదే. నేను పదే పదే చెబుతున్నా. అన్ని సాక్ష్యాలతో నిరూపించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నేను ముఖ్యమంత్రి గారిని కోరేదొకటే. సుప్రీంకోర్టులో కేసు మన రాష్ట్రానికి అనుకూలంగా వచ్చిందంటే బాధపడుతున్నాను. కేసు మనకు అనుకూలంగా రాలేదు, మనకు వ్యతిరేకంగా వచ్చింది. దయచేసి ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకోండి. మూడు టీఎంసీలు కాదు, నాలుగు టీఎంసీలు వారు వాడుకున్నా మనకు నష్టం లేదు. కానీ ప్రాజెక్టు వారి ఆధీనంలో ఉన్నంత కాలం వారు 60 టీఎంసీలు వాడుకొనే అవకాశముంది. ముఖ్యమంత్రిగారు అయిదు జిల్లాల శాసనసభ్యులందరితో కమిటీ వేసి చర్చించాలి. చాలా రాష్ట్రాలలో ఆఫీసర్లు, ఇంజనీర్లతో నియమించిన కమిటీలు సరిగా పనిచేయలేదు. కేంద్రప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టును తన ఆధీనంలోకి తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నియంత్రణలోకి వచ్చేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రితో మాట్లాడాలి, కాబట్టి అఖిల పక్ష సమావేశం నిర్వహించండి.

ఉ.12.00

అఖిలపక్షం మీటింగు పెట్టండి. ఇదే కాదు, బాబ్లీ అంతటా 13 ప్రాజెక్టులున్నాయి. అవి పూర్తవుతున్నాయి. సుప్రీం కోర్టులో మీరు కేసు వేయలేదు. అది కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్నది. దానికి సిడబ్ల్యూసీ అనుమతి కూడా తీసుకోలేదు. మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా 13 ప్రాజెక్టులు కడుతున్నది. ఆ 13 ప్రాజెక్టులు పూర్తయితే మనం నిండా మునుగుతాం. దయచేసి ప్రధానమంత్రి గారితో అఖిల పక్షం మీటింగు పెట్టమని నేను రిక్వెస్ట్ చేస్తున్నాను.

శ్రీ ఎస్.కిరణ్ కుమార్ రెడ్డిః సార్, ఆ ప్రాజెక్టులన్ని కూడా 60 టిఎంసీల లోపు ఉన్నాయి. వారికున్న అభ్యంతరాలేమిటో తెలియచేయమనండి. ఖచ్చితంగా అన్నింటినీ ప్రొటెక్ట్ చేసే ప్రయత్నం చేయడం జరుగుతుంది.

శ్రీ ఇ.దయాకరరావు ః అధ్యక్షా,

MR. SPEAKER: He will study by calling an All Party Meeting. కూర్చోండి.

శ్రీ ఎస్.కిరణ్ కుమార్ రెడ్డిః గవర్నమెంటులో రిక్రూట్‌మెంటుకు పెద్ద యెత్తున.....

(శ్రీ ఇ.దయాకరరావుచే అంతరాయం)

We will call for an All Party Meeting. ఆ మీటింగులో మీరు సజెషన్స్ ఇవ్వండి. This is not the forum to decide that.

MR. SPEAKER: Dayakara Rao garu, please sit down.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః అధ్యక్షా, 2010-11 సంవత్సరం నుంచి దాదాపు 1,23,897 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత మా ప్రభుత్వానిది. ఈ సంవత్సరం 1,52,000 ఉద్యోగాల కొరకు నోటిఫై చేస్తే ఇంత వరకూ 63,600 ఉద్యోగాలు ఈ సంవత్సరంలో నింపిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానిది. ఆ ఉద్యోగాల కోసం 50 లక్షల మందికి పైగా అప్లై చేయడం జరిగింది.

14(ఎఫ్) వల్ల ఏమి లాభం ఉందో నాకైతే తెలియదు. 14(ఎఫ్) వల్ల కొన్ని జిల్లాలకు లాభం జరుగుతుందని మీరు ప్రజల్లో ఒక ఉద్యమం తెచ్చే ప్రయత్నం చేశారు. ప్రజల్లో అపోహలు కల్పించే ప్రయత్నం చేశారు. ఏది ఏమైనా అది ప్రభుత్వం ఇచ్చినది కాదు, కోర్టు ఆదేశాల మేరకు 14(ఎఫ్) వస్తే దాని మీద ప్రజల్లో అపోహ కల్గించి 14(ఎఫ్)ను రద్దు చేయించాలి నష్టం జరుగుతుందని చెబితే, 14(ఎఫ్) తొలగించాలని ఈ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తరువాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 14(ఎఫ్) వలన యువకులకు అన్యాయం జరుగుతుందని చెప్పి రద్దు చేయించిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టంగా తెలియచేస్తున్నాను.

శ్రీ టి.హరీష్ రావు(మైకు లేకుండా)ః అధ్యక్షా, అపోహలు మాకు లేవు. మీకేమన్నా ఉంటే మైకు ఇవ్వండి. మేము క్లారిఫై చేస్తాం.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః మీ కోరిక మేరకు 14(ఎఫ్)ను రద్దు చేయించడం జరిగింది. రెండు, మూడు రిక్రూట్‌మెంట్స్ జరిగితే ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో మీకే తెలుస్తుంది. 1200 మంది ఎస్సై ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో వారు ఎస్సైలుగా విధులకు హాజరు కాబోతున్నారు. వారిలో సగ భాగం తెలంగాణా నుంచి వచ్చారు. మీరు పరీక్షలు పెట్టకూడదు, రిక్రూట్‌మెంటు జరగకూడదు అని ఉద్యమం చేస్తున్నారు. పరీక్షలు పెట్టకుండా ఉంటే యువకులకు ఉద్యోగాలు ఏ విధంగా వస్తాయి? ఇంత మంది ఉద్యోగాల కోసం కాచుకుని ఉంటే పరీక్షలు పెట్టకపోతే ఈ రాష్ట్రం ఏ విధంగా ముందుకు పోతుంది? యువకుల భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందో ఒక్కసారి ఆలోచన చేయాలని నేను కోరుతున్నాను. ఎన్నిసార్లు వాయిదా వడినా, ఎన్నిసార్లు పరీక్షలు పెట్టకూడదన్నా గానీ ఖచ్చితంగా యువకుల కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం, ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందనే విషయాన్ని స్పష్టంగా తెలియచేస్తున్నాను.

సకల జనుల సమ్మె జరిగేటప్పుడు కూడా గ్రూపు.2 ఉద్యోగాల కోసం తెలంగాణా అంతటా 11,000 మంది ఇన్విజిలేటర్లుగా పనిచేసి దాదాపు ముప్పై, నలభై వేల మంది పరీక్షలు రాసి పాసైన యువకులున్నారని స్పష్టంగా తెలియచేస్తున్నాను.

శ్రీ టి.హరీష్‌రావుః అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డర్.

మిస్టర్ స్పీకర్ః దయచేసి కూర్చోండి. మీకు మరలా మాట్లాడటానికి అవకాశం ఇస్తాను.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః ఎవరైతే అవిశ్వాస తీర్మానం మూవ్ చేసారో వాళ్లకు రైట్ ఆఫ్ రిప్లై ఉంటుంది. నేను మాట్లాడిన తరువాత మరలా మాట్లాడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గత పిఆర్‌సీలో ఏమన్నా ఇబ్బందులుంటే తీర్చడానికి అనామలీస్ కమిటీ వేసాం. ఈ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్ణీత గడువుకి సంవత్సరం, రెండు సంవత్సరాల తరువాత వేసే పే రివిజన్ కమీషన్‌ను నిర్ణీత గడువు కంటే

అయిదు మాసముల ముందరే వేసిన ఘనత మా ప్రభుత్వానిది. ఉద్యోగులు మా ప్రభుత్వంలో భాగస్వాములు, వారికి మేలు చేయాలని మేము అది చేయడం జరిగింది.

శ్రీ టి.హరీష్ రావుః అధ్యక్షా,

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః మీకంటే మాకే ఉద్యోగుల పైన ప్రేమ ఉంది. మీరు ఉద్యమాలకు వాడుకుంటున్నారు. మేము ప్రజలకు మేలు చేయడానికి ఉద్యోగులను వాడుకుంటున్నాం. గుర్తు పెట్టుకోండి. హెల్తు కార్డుల ద్వారా వారికి మేలు జరుగుతుందని భావించి కేబినెట్ సబ్ కమిటీ ద్వారా తొందరలో హెల్తు కార్డుల ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. త్వరలో వారికి మేలైన విధానం ద్వారా హెల్తు కార్డులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములని భావించి వారికి ఇవన్నీ చేయడం జరుగుతుందని స్పష్టం చేస్తున్నాను.

తెలంగాణాకు సంబంధించి మొట్ట మొదటి అడ్వకేట్ జనరల్‌ని నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదే. లోకాయుక్తలో ఉన్న ఆరేడు మెంబర్లలో తెలంగాణాకు చెందిన వ్యక్తి ఒక్కరే ఉన్నారని అంటే తెలంగాణాకు చెందిన రెండవ వ్యక్తిని కూడా ఈ ప్రభుత్వమే నియమించడం జరిగింది. తెలంగాణా ప్రాంత అభివృద్ధి కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణా ప్రాంతంలో పెద్ద యెత్తున ఎస్సీ, ఎస్టీలున్నారు కాబట్టి ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో పెద్ద యెత్తున ప్రణాళికను తయారు చేసి ముందరకు పోయే ప్రయత్నం చేస్తున్నాం.

"మీసేవ" ను పెట్టాం. "మీసేవ" లో రోజుకు 70,000 పై చిలుకు పిటీషన్లు వస్తున్నాయి. కేవలం 15 నిమిషాల్లో పిటీషన్లలో చాలా వరకూ పరిష్కారం వస్తున్నాయి. ఈ ప్రక్రియను తేదీ. 04.11.2011న రెండు, మూడు జిల్లాల్లో మొదలు పెట్టాం. ఇప్పటికి కోటి ముప్పై లక్షల ట్రాన్సాక్షన్స్ నమోదయ్యాయి. పేదవాళ్లకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగకుండా, మధ్యవర్తులకు లంచాలు ఇవ్వకుండా చేసే ప్రయత్నమే ఈ "మీసేవ". పారదర్శకత ఉండాలి, సులభంగా, వేగంగా, పదిసార్లు ఆఫీసుల చుట్టూ తిరగకుండా అన్ని పనులూ ఒకే ఆఫీసులో జరిగే విధంగా 170 – 180 "మీసేవ" సర్వీసులను తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం 60 సర్వీసులున్నాయి. లక్ష పిటీషన్లు రోజుకు రాగలిగితే రూ.4,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్లు సామాన్య ప్రజలకు ఖర్చు కాకుండా మిగిలే పరిస్థితిని ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. దేశంలో ఎక్కడైనా ఇది ఉందా అని ఒకసారి ఆలోచన చేయమని స్పష్టంగా కోరుతున్నాను. మీసేవ అంటే ఈసేవ అని కొందరు అంటున్నారు. ఈసేవకు, మీ సేవకు తేడా తెలియకపోతే నేనేమి చేయాలి?

ఉ.12.10

ఈ–సేవా అంటే బిల్లులు కట్టుకుంటుంటారు. ఇది సర్వీస్ చేసేందుకు పెద్ద ఎత్తున ఉపయోగకరంగా వుండాలని పెట్టాము. ఇదే కాదు. పవర్‌కు సంబంధించి ఇబ్బందికరమైన పరిస్థితి ప్రస్తుతం వుంది. అది వాస్తవమే. ఇబ్బంది ఎందుకు వుంది అనంటే... నేను అబద్ధాలు చెప్పే వాడిని కాదు. వాస్తవాలను ప్రజల ముందు పెట్టి, ప్రజల ఆమోదంతోనే ముందుకు పోయేవాడిని. విద్యుత్ ఉత్పత్తి కష్టంగా వుంది కాబట్టే ఇబ్బందికరమైన

పరిస్థితి అని చెబుతున్నాను. మరి ఎందుకు ఇబ్బంది వచ్చింది? ఎందుకు ఈ పరిస్థితి వచ్చిందనేది ఒక్కసారి ఆలోచన చేసుకోవాలి. ఇందుకు రెండు ప్రధాన కారణాలున్నాయి. ఒకటేమంటే మన దగ్గర ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఎక్కువ శాతం నీటి నుండి వస్తుంది. ఇంకా గ్యాస్ నుండి ఉత్పత్తి అవుతుంది. గ్యాస్ ద్వారా 2800 మెగావాట్లు విద్యుత్ పోయిన సంవత్సరం వస్తే, ఈ సంవత్సరం మార్చి నాటికి ఒక్క చుక్క గ్యాస్ కూడా రావడం జరగలేదు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఈ విద్యుత్ యూనిట్లలో ఉత్పత్తి అయ్యే పరిస్థితి లేదు. మనకు గ్యాస్ నుండి ఎలక్ట్రిసిటీ వస్తే, రూ.3.50 పైసల నుండి రూ.3.60 పైసలకు మనకు అప్రాక్సిమేట్‌గా వస్తుంది. అట్లాంటిది డి-6. డి-6 నుండి మనకు వస్తే రూ.3.50 పైసల నుండి రూ.3.60 పైసలు అవుతుంది. అటువంటిది డి-6 పూర్తిగా ఎండిపోయింది. గత 15 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా వర్షపాతం తక్కువగా వుండి హైడ్రో ఎలక్ట్రిసిటీ కూడా తక్కువైన పరిస్థితి మన దగ్గర వుంది.

ఈ సంవత్సరం వున్నంత తక్కువ ఉత్పత్తి మనకు ఎప్పుడూ లేదనేది స్పష్టంగా తెలియజేయడం జరుగుతోంది. మనకు ఈ రోజు గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే మర్చండ్ ప్లాంట్స్ వచ్చాయి. 7200 మెగావాట్లకు సరిపోయే కెపాసిటీ నీటి ద్వారా వుంది. కానీ గ్యాస్ లేదు. మనం ఆర్ఎల్ఎన్‌జి స్టోరేజీ పెట్టుకోలేదు. ఎందుకంటే వెల్స్ ఇక్కడ వున్నాయి కాబట్టి, మనం దానిపైన ఆధారపడలేదు. ఇప్పుడు ఆర్ఎల్ఎన్‌జి కావాలంటే మనకు వెస్ట్ కోస్ట్ నుండి తీసుకుని ఈస్ట్ కోస్ట్‌కు రావాలి. ఆ విధంగా కొనుగోలు చేయాలంటే ఇప్పుడున్న రేట్లో ఒక యూనిట్ ధర రూ.12 పడుతోంది. ఆ విధంగా కొనుగోలు చేస్తున్నాం కూడా. అటువంటిది మనకు హైడ్రో ఎలక్ట్రిసిటీలోనే 2011-2012 కు గాను 6,256 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ని జనరేట్ చేస్తే, ఈ సంవత్సరం కేవలం 2,797 మిలియన్ యూనిట్లు మాత్రమే జనరేట్ చేయగలిగాం. అంటే సగానికి సగం పడిపోయింది. ఇది మన రాష్ట్రంలో విద్యుత్ కొరతకు ముఖ్యకారణం.

దీనితోబాటు, నార్త్ ఈస్టన్ స్టేట్స్ నుండి పవర్ కారిడార్ లేదు. సదరన్ స్టేట్స్ అంటే తమిళనాడు, కర్నాటక, కేరళ గాని, మనం గాని ఒకే గ్రిడ్ నుండి విద్యుత్‌ని కొనుగోలు చేయాల్సిన అవసరముంది. 1300, 1400 మెగావాట్లు మాత్రమే తెచ్చుకునే వీలుంది. ముందే బుక్ చేసుకున్నా కూడా మనకు ఎక్కువ శాతం రావడం లేదు. కాబట్టి, పవర్ గ్రిడ్ ఇబ్బంది వుంది. రానున్న నవంబర్, డిసెంబరు నాటికి ఈ గ్రిడ్‌తో కనెక్టివిటీ పెంచుతున్నారు. పవర్ జనరేషన్ కార్పోరేషన్ వారిని ఆ పనిని వేగవంతం చేయాలని కూడా మేం కోరడం జరిగింది. ఆ క్రమంలో రాష్ట్రాన్ని గ్రిడ్‌కు అనుసంధానించే పని వేగంగా చేయడం కూడా జరుగుతోందని తెలియజేయడం జరుగుతోంది.

పోయిన సంవత్సరం చూస్తే కేవలం 1370 మెగావాట్లు మాత్రమే.. అంటే 33 మిలియన్ యూనిట్లు రోజూ కొంటున్నాము. అటువంటిది ఈ రోజున 1670 మెగావాట్లు అంటే 40 మిలియన్ యూనిట్లు రోజూ కొనుగోలు చేయగలుగుతున్నాం, ఎక్కువ రేటు అయినా కూడా. ఇదేకాకుండా మినిస్ట్రీ ఆఫ్ పవర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అలొకేషన్‌లో అన్ అలొకేటెడ్ పవర్‌లో 306 మెగావాట్ల విద్యుత్‌ని మనం తీసుకోవడం జరుగుతోంది. ఇది కాకుండా నాఫ్తా ద్వారా 200 మెగావాట్లు, ఆర్ఎల్ఎన్‌జి ద్వారా మరో 200 మెగావాట్లు ఇప్పుడు ప్రొడ్యూస్ చేయడం జరుగుతోంది. యావరేజ్‌గా చూసినా నాఫ్తా ద్వారా రూ.12.50 పైసలు ఒక్క యూనిట్‌కు ఖర్చవుతోంది. ఆర్ఎల్ఎన్‌జి ద్వారా రూ.12.30 పైసలు అవుతోంది. వచ్చే వారం, పది రోజుల్లో ఇంకా పెంచమని కోరడం జరిగింది. ఇప్పటివరకు 200, 250 మెగావాట్ల పవర్ జనరేట్ అయ్యేది. ఇప్పుడు 400 మెగావాట్లు చేయమన్నాం, ఇంకా 200 మెగావాట్లకు పెంచమని చెప్పాం. దానితో అగ్రికల్చర్‌కు లోటు తగ్గుతుందనినేది మా ఆలోచన. ఇదంతా కూడా గమనించాలి. యూనిట్‌కు రూ.12 ఖర్చుపెట్టినా కూడా

రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామనే విషయాన్ని దయచేసి గమనించమని కోరుతున్నాను. చాలా మంది ఈ ప్రభుత్వానికి ప్లానింగ్ లేదని అంటున్నారు.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

ఒక్క నిమిషం వుండండి. ఎందుకు అంత ఇదైపోతారు. దీన్ని ఏవిధంగా అధిగమించాలి, ఏ విధంగా ముందుకు పోవాలన్న ఆలోచన చేసి, వచ్చే సంవత్సరానికి 2013-2014లో మొదలుపెట్టిన ప్రాజెక్టుల్లో కోల్ ద్వారా దాదాపు 4255 మెగావాట్ల ప్రొడక్షన్‌ని అదనంగా నవంబర్ నాటికి తెచ్చే ప్రయత్నం చేయడం జరుగుతోందని ఈ సభకు తెలియజేయడం జరుగుతోంది. ఇదే కాకుండా, జెన్కోతోబాటు, ప్రైవేటు కంపెనీల నుండి 520 మెగావాట్ల విద్యుత్‌ని కమిట్‌మెంట్‌తో మనకు ఇచ్చేవిధంగా డెడికేటెడ్‌గా తీసుకోవడం జరిగింది. ఇది గాక దాదాపు వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్‌కు సంబంధించిన టెండర్లు కూడా పిలిచాము. అది ఫైనలైజేషన్ దశలో వుంది. సంవత్సరాంతానికి ఇది కూడా పూర్తి చేసే ప్రయత్నం జరుగుతోంది.

ఇది కాకుండా విండ్ పవర్ రేటు పెంచడం జరిగింది. 600 మెగావాట్ల విండ్ పవర్ కూడా తెచ్చే ప్రయత్నం చేయడం జరుగుతోందని స్పష్టంగా తెలియజేయడం జరుగుతోంది. ఇది కాకుండా, బయోమాస్, విండ్ పవర్, మిని హైడల్ మొదలైనవి కూడా ఉత్పత్తిలోకి తీసుకుని రావాలని ఒక పక్క ప్రయత్నం చేస్తున్నాం. ఇంకొకపక్క Floating Storage Re-gasification Unit (FSRU) ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీనికి సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. సంవత్సరాంతానికి ఇది కూడా రావడం జరుగుతుంది. గ్యాస్ డైరెక్టుగా వెస్టర్న్ కోస్ట్‌కు వచ్చి అక్కడ నుండి అన్ని రాష్ట్రాలకు ట్యాక్స్ కట్టుకుని ఇక్కడకి వచ్చే బదులు, ఈ గ్యాస్ ఆర్ఎల్ఎన్‌జికి తీసుకునివచ్చి ఇక్కడ నుండే మనం ఉపయోగించే దానికి ప్రయత్నం చేస్తున్నాం. ఒకటి పర్మనెంట్ స్ట్రక్చర్, మరొకటి ఫ్లోటింగ్ స్ట్రక్చర్ కూడా రావడం జరుగుతోందని స్పష్టంగా తెలియజేయడం జరుగుతోంది.

పెద్ద ఎత్తున విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది కాబట్టే రేటు కూడా పెరిగింది. హైడ్రో ఎలక్ట్రిసిటీ మామూలుగా అయితే ఫుల్ కెపాసిటీ వస్తే 80 పైసలు యూనిట్‌కు పడుతుంది. హాఫ్ కెపాసిటీ అయితే రూ.1.30 పైసలు, రూ.1.40 పైసలు పడుతుంది. ఇది బాగా తగ్గింది కాబట్టే మనకు ఇబ్బందికరమైన పరిస్థితులు వచ్చాయి. వర్షపాతం ఈ సంవత్సరం మెరుగ్గా వుండి వుంటే అన్ని ఇబ్బందులు వచ్చేవి కాదని అనుకుంటున్నాను. ఇలాంటి ఒక సైకిల్ 12, 13 సంవత్సరాలకు ఒకసారి వస్తోంది. ఒక్కసారి స్టడీ చేస్తే ఆవిధంగా అనిపించింది. దేవుని దయవల్ల ఈ సారి మంచి వర్షాలు వస్తాయని నేను ఆశిస్తున్నాను. మీరందరూ కూడా అదే విధంగా ఆశిస్తున్నారని, ఈ అవిశ్వాస తీర్మానం పెట్టిన వాళ్లు కూడా మంచి వానలు రావాలని ఆశిస్తారని నేను కోరుతున్నాను.

ఉ.12.20

వీటితో పాటు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటుకు 2004-05 సంవత్సరం నుండి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని చూస్తే, అప్పట్లో పన్నెండు పదమూడు వందల కోట్లను ఇచ్చే వాళ్లం. అటువంటిది 2009-10వ సంవత్సరానికి వచ్చేసరికి ఆ సబ్సిడీ రూ.3500 కోట్లు అయ్యింది. 2010-11వ సంవత్సరానికి రూ.3600 కోట్లు,

2011-12వ సంవత్సరానికి రూ.4200 కోట్లు, 2012-13వ సంవత్సరానికి రూ.5500 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం ఇవ్వడం జరుగుతోంది. ఇదికాకుండా నెలకు రూ.300 కోట్లు అదనంగా ఖర్చయ్యే పరిస్థితి ఉంది. ఆ రూ.300 కోట్లను కూడా భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాను. రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయి కాబట్టి, దానిని అధిగమించడానికి మనం ప్రయత్నం చేస్తున్నామని తెలియజేస్తున్నాను.

పెరిగిన, పెరగబోయే రేట్ల విషయంలో ప్రభుత్వం నుంచి ఏ విధంగా తగ్గించగలమో పరిశీలన చేసి, మా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌కి ఆల్‌రెడీ అవగాహన ఉంది, కాబట్టి దాని పైన పూర్తిగా విశ్లేషణ చేసి, ఎంత వరకు తగ్గించగలమో అంత వరకు తగ్గించే ప్రయత్నం చేస్తాము. ఎక్కడా కూడా ఈ ప్రభుత్వానికి వీలుండి సబ్సిడీలను ఇవ్వకుండా పోయే పరిస్థితి ఉండదు. వీలున్నంత వరకు పెద్దఎత్తున సబ్సిడీలను ఇచ్చి, మేలు చేసే ప్రభుత్వం ఈ ప్రభుత్వమని గుర్తు పెట్టుకోవాల్సిందిగా కోరుతున్నాను.

అంతేకాదు ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, మన ప్రభుత్వం టాప్-11 బైయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌ని చాలా విజయవంతంగా జరిపించుకోగలిగింది. 174 దేశాల నుండి 8000 మంది డెలిగేట్స్ వచ్చి 19 రోజుల పాటు ఇక్కడే ఉన్నారు. చాలా బాగా ఆ కాన్ఫరెన్స్‌ని నిర్వహించుకోగలిగాము. ప్రపంచ వ్యాప్తంగా మన దేశానికి మన రాష్ట్రానికి మంచి పేరు వచ్చిందంటే నిజంగా గర్వకారణం. అప్పుడు ఉద్యమం చేసే వారు కూడా సహకరించారు. ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ అయినందున ఆ సమయంలో సహకరించిన వారందరికీ నిజంగా కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను. అంతేకాదు హైదరాబాద్ డెస్టినేషన్‌గా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే అన్ని రకాల కాన్ఫరెన్స్‌లను ఇక్కడే నిర్వహించే విధంగా ప్రయత్నం చేస్తున్నాం. మొన్ననే వరల్డ్ ఎలర్జీ కాన్ఫరెన్స్ కూడా ఇక్కడే జరిగింది. ఈ సంవత్సరం నవంబర్‌లో వరల్డ్ అగ్రికల్చర్ కాంగ్రెస్, మొదటిసారి భారతదేశానికి, అది కూడా హైదరాబాద్‌కి వస్తోంది. అది నిజంగా గర్వకారణం. దానికి కూడా మీ అందరి సహకారం కావాలని కోరుతున్నాను.

ప్రపంచ తెలుగు మహాసభలను 37 ఏళ్ల తర్వాత చాలా పెద్దఎత్తున విజయవంతంగా నిర్వహించుకోగలిగాము. ఎంత మంది సహకరించకపోయినా, పెద్దఎత్తున మద్దతునిచ్చి మూడు రోజుల్లో అయిదు లక్షల మంది నలుమూలల నుంచి తెలుగు వారు వచ్చి ఆ సభలో పార్టిసిపేట్ చేశారు. ఆ తెలుగు మహాసభలను కూడా బహిష్కరించి, దాని వల్ల ఏమైనా ఈ అవిశ్వాస తీర్మానం పెట్టారేమో అని నాకు డౌట్ వస్తోంది. కొందరు బహిష్కరించినా, రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున కళాకారులు, రచయితలు అందరూ ఆ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలియజేస్తున్నాను. అన్ని విధాలా అన్ని రంగాల్లో దేశంలోనే ఈ ప్రభుత్వం ఆదర్శవంతమైన ప్రభుత్వంగా ఉంటుందని, ఇదే విధంగా ముందుకు పోతుందని తెలియజేస్తున్నాను.

స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి, తర్వాత 2014 ఎన్నికలు కూడా రాబోతున్నాయి. పూర్తి నమ్మకంతో ప్రజల్లో ముమ్మేకమై మేము తిరుగుతున్నాం. ఈ కాంగ్రెస్ పార్టీ మరలా అధికారంలోకి ఖచ్చితంగా వస్తుందని తెలియజేస్తూ ఇటువంటి అవిశ్వాస తీర్మానాల వల్ల మాకు ఏమి కాదు. ప్రజల్లో ఇంకా మా పైన విశ్వసనీయత పెరుగుతుంది. మేము ఇంకా కష్టపడి పని చేసి ఈ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీని గట్టెకించే ప్రయత్నం చేస్తామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఈటెల రాజేందర్ : అధ్యక్షా ముఖ్యమంత్రి గారు చాలా గొప్పగా మాట్లాడారు. సలహాదారుడిగా ఎవరున్నారోగానీ మంచి సలహాలను ఇచ్చినట్లు కనిపిస్తోంది. అవిశ్వాస తీర్మానాన్ని పెట్టిన వారు.. కమ్యూనిస్ట్

పార్టీ ఆఫ్ ఇండియా, భారతీయ జనతాపార్టీ, నాగం జనార్ధన్ రెడ్డిగారు, తెలంగాణా రాష్ట్ర సమితి, వారితో పాటు సిపిఎం పార్టీ కూడా మేము ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటామని చెప్పడం, జయప్రకాష్ నారాయణ్ గారు కూడా కలిసి వస్తామని చెప్పడం వలన, మేము మొట్టమొదటసారిగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ఏదో ఉత్తర దక్షిణ ధృవాలు కలిసి అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాయి – పద్ధతి లేకుండా అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాయనే పద్ధతి తప్పు, గౌరవ మంత్రులకు కూడా తెలియాలి. అవిశ్వాస తీర్మానాన్ని పెట్టేటప్పుడు ప్రొసీజర్స్ ఉంటాయి. రాజీనామాలు చేసినప్పుడు గానీ, అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టినప్పుడు గానీ స్పష్టంగా రూల్ ప్రకారం పెడితేనే చెల్లుతుందనే విషయాన్ని వారు మర్చిపోయారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా స్పందించాలని నిర్ణయించుకున్నాం కాబట్టి, ఈ అవిశ్వాస తీర్మానాన్ని మూవ్ చేశాము. ఇంతకు ముందు మా సభ్యులు హరీష్‌రావు గారు చెప్పినట్లు, తెలంగాణా రాష్ట్ర సమితికి ప్రజా సమస్యలు ఎంత ముఖ్యమో.. ప్రజా సమస్యలతో పాటు తెలంగాణా అంశం కూడా అంతకంటే ఎక్కువ ముఖ్యమనే విషయాన్ని తమరు గత పది సంవత్సరాల కాలంలో చూశారు.

మా పార్టీ రాజకీయ పార్టీ కాదు. మా పార్టీ ఎవరికీ వ్యతిరేకం కాదు. ఎవరినో విమర్శించడం మా పార్టీ ఫిలాసఫీ కాదనే సత్యం ఇక్కడున్న గౌరవ సభ్యులందరికీ తెలుసు. మా బాధల్లా ఏమంటే, మీరు ఏ కాంగ్రెస్ ప్రభుత్వాన్నైతే కొనసాగిస్తున్నారో, మీరు ఇప్పటివరకు చెప్పినట్లు, శ్రీమతి సోనియా గాంధీ గారి నాయకత్వంలో ఈ దేశ ప్రజానీకానికి ఈ రాష్ట్ర ప్రజానీకానికి సేవ చేసే కార్యక్రమాలు చేస్తున్నామని మీరు మాట్లాడారో, మేము ప్రజల విశ్వాసంతో మరింత కాలం వర్ధిల్లుతామని చెప్పారో, త్యాగంతో కూడిన కుటుంబమని మీరు మాట్లాడుతున్నారో, మరి మా విషయంలో అది ఎందుకు అమలు కావడం లేదు? మా విషయంలో అది ఎందుకు ఆచరణలో లేదనేదే మా బాధ తప్ప మరొకటి కాదు.

2004వ సంవత్సరంలో మీరు స్వయంగా మీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడమే కాదు, శ్రీమతి సోనియా గాంధీ గారు స్వయంగా తెలంగాణా ప్రాంతానికి వచ్చినప్పుడు రెండే మాటలు చెప్పారు. తెలంగాణా ప్రాంత ప్రజల గుండెల్లో ఏముందో నాకు తెలుసు, ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత నాదే అని చెప్పారు. రాష్ట్రంలో, కేంద్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా అమలు చేసి తీరుతామని చెప్పిన వ్యక్తి, దేశానికి నాయకత్వం వహిస్తున్న యుపిఎ ఛైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారనే విషయం అందరికీ తెలుసు.

అనేకసార్లు చెప్పాము మరొక్కసారి గుర్తు చేస్తున్నాం. దానికి అనుగుణంగానే కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెట్టిన మాట వాస్తవం కాదా! దానికి అనుగుణంగానే ప్రణబ్ ముఖర్జీ గారి కమిటీ వేసిన మాట వాస్తవం కాదా! దానికి అనుగుణంగానే ఎనిమిది వారాల్లో ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా! దానికి అనుగుణంగానే ఆనాటి ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అబ్దుల్ కలాం గారి చేత ఉభయసభల్లో ఈ సమస్యను ప్రస్తావించిన మాట వాస్తవం కాదా! అనేది మా బాధ. అనేక సంఘటనలు జరిగాయి. ఆ సందర్భంలో తెలంగాణ రాష్ట్ర సమితి మీతో జత కట్టడమే కాదు, మీ ప్రభుత్వంలో భాగస్వాములం కూడా అయ్యాము. మా సాక్షిగా మా ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తున్నప్పుడు, మాకు మా ప్రాంత ప్రజలకంటే, మా ప్రాంత ప్రజల సమస్యల కంటే, మా తెలంగాణ అంశానికంటే ఈ మంత్రి పదవులు గొప్పవి కావని, సంవత్సరం తిరగకుండానే రాజీనామాలు చేసిన సత్యాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలి.

ఉ.12.30

కేంద్రంలో ఉన్న కె.సిఆర్ గారు ఆనాడు డి.ఎం.కె. పోర్టుల పోర్ట్‌ఫోలియో మీద గట్టిగా పట్టుబట్టినపుడు ఆనాడు కె.సి.ఆర్ గారు నాకు కావలసింది తెలంగాణ పోర్ట్‌ఫోలియో తప్ప పోర్టుల పోర్ట్‌ఫోలియో కాదని స్పష్టంగా ప్రకటించి ఏ ఒక్క పోర్ట్‌ఫోలియో లేకుండా కేవలం మంత్రిగానే కొనసాగిన చరిత్ర టి.ఆర్.ఎస్ పార్టీది. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన అనేక మంది కేంద్ర మంత్రులయ్యారు. కె.సి.ఆర్ గారు చివరికి కేంద్ర మంత్రి పదవిని కూడా లెక్కచేయకుండా గడ్డిపోచలా తీసివేసి మంత్రి పదవికి రాజీనామా చేశాడు. 2009 సంవత్సరంలోపే తెలంగాణ అంశాన్ని మళ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. తెలంగాణ సమస్య పరిష్కారం కోసం ఇదే శాసనసభలో రోశయ్య గారి నాయకత్వంలో కమిటీ వేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ అంశాన్ని రెండు సార్లు పెట్టారు. ఇన్ని చేసిన తర్వాత చివరికి గత్యంతరం లేని పరిస్థితులలో కె.సి.ఆర్ గారు "కె.సి.ఆర్ చచ్చుడో, తెలంగాణ వచ్చుడో" అనే ఒక పిలుపునిచ్చి పదకొండు రోజులపాటు దీక్ష చేసి మరణం అంచుకు వెళితే కేంద్ర ప్రభుత్వం స్పందించి చిదంబరం గారు అర్ధరాత్రి పదకొండు గంటల ముప్పై నిమిషాలకు తెలంగాణ ప్రాంత ప్రజలు కోరినట్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సత్యం అందరికీ తెలిసిందే.

కాంగ్రెస్ పార్టీనే స్వయంగా ఉభయసభలలో భారతీయ జనతా పార్టీ ఈ సమస్యను లేవనెత్తినప్పుడు జబ్బలు చరుచుకొని ఈ సమస్యను పరిష్కరించామని సంబరపడ్డారు. కానీ కేంద్రం ఇచ్చిన మాటను నిలుపుకోక పవిత్ర చట్ట సభల సాక్షిగా, కేంద్ర ప్రభుత్వం సాక్షిగా చిదంబరం గారు ఇచ్చిన మాట అమలుచేయకపోవడం మూలంగా యావత్ తెలంగాణ జాతి కంటికి కునుకు లేకుండా మా రైతాంగం వారి పంటలు ఎండిపోయినా పరవాలేదు కానీ మా తెలంగాణ మాకు కావాలని కోరుతున్నారు. విద్యార్థులు కూడా వారి చదువులు అవసరమైతే పణంగా పెట్టుకుంటాం కాని మా ఆత్మ గౌరవం నెగ్గాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వోద్యోగులు కూడా ముందుగా తెలంగాణ గడ్డ బిడ్డలం కాబట్టి ఈ గడ్డకు విముక్తి కావాలని కోరుతున్నారు. నల్లకోటు వేసుకునే న్యాయవాదులు దేశ సంగ్రామంలో ఎలాగైతే నల్లకోట్లు వేసుకొని స్వతంత్రం కోసం ఉద్యమించారో తెలంగాణ అంశం గురించి కూడా అదే విధంగా ఉద్యమిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అటెండర్ ఉద్యోగం నుంచి ఐ.ఏ.ఎస్ స్థాయి వరకు వారి హోదాలను కూడా లెక్కచేయకుండా తెలంగాణ ఉద్యమం ముఖ్యమైందని ఉద్యమించారు.

ఈ సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వమే శ్రీకృష్ణ కమిటీ, ఇంకొన్ని కమిటీలు వేసి కాలయాపన చేసి కళ్లల్లో మట్టి కొట్టి చివరికి మా ఉద్యమాన్ని, మా ఉద్యమకారులను,తెలంగాణ ప్రజానీకాన్ని అవమానపరిచే పద్ధతిలో తెలంగాణ అంశం ఇన్‌స్టాంట్ కాఫీలాంటిది, ఇడ్లీ, దోశ లాటివి కావని అవమానించడమే కాకుండా అనేకసార్లు వాయిదాలు పెడితే చివరికి గుండె పగిలి, బావురుమని తెలంగాణ ప్రాంత విముక్తి కోసం వెయ్యి మంది బిడ్డలు ఆత్మబలిదానం చేసుకున్న చరిత్ర మన కళ్లముందున్నది.

కాంగ్రెస్ పార్టీ సభ్యులను గొప్ప మానవతా వాదులనుకుంటాం. వాళ్లు గొప్పగా స్పందిస్తారని అనుకుంటాం. ఈ మధ్య దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన జంట బాంబు పేలుళ్లలో పదిహేడు మంది మరణిస్తే మానవతా కోణంతో వారికి నివాళులర్పించే ప్రయత్నం చేశాం. బాధితుల కుటుంబాలను ఆదుకుంటామని సభ వారికి భరోసా ఇచ్చింది. కానీ ఒక్కనాడైనా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఈ శాసనసభలోని అన్ని పక్షాల వాళ్లు తెలంగాణ బిడ్డల్లారా మీరు ఆత్మహత్యలు చేసుకోకండి, రాజకీయ పార్టీలకు చెందిన సభ్యులం మేమున్నామని సంతాపం చెప్పే సంస్కారం కూడా ఈ చట్ట సభలకు లేకపోతే మాకు ఎంత బాధ ఉంటుంది. ఈ ప్రభుత్వం మీద, ఈ చట్ట సభల మీద మాకు ఎందుకు విశ్వాసముండాలో చెప్పాలని మీ ద్వారా ప్రశ్నిస్తున్నాను. ఒక్కరిద్దరు రైలు యాక్సిడెంట్‌లో చనిపోతే సంతాపం తెలుపుతాం. ఒక్కరిద్దరు కల్తీ సారా తాగి చనిపోతే సంతాపం

తెలుపుతాం కానీ భవిష్యత్తు ఉన్న బిడ్డలు, విద్యావంతులు, రేపటి దేశ భవిష్యత్ కోసం వారి సత్తాను ప్రదర్శించే బిడ్డలు తెలంగాణ ఉద్యమంలో చనిపోతుంటే కనీసం ఆ అమరవీరులను కన్న తల్లిదండ్రులకైనా భరోసా ఇచ్చిన పాపాన పోలేదు, కనీసం వారిని ఆదుకుంటామని చెప్పడంతోబాటు మీ ఆశయాన్ని త్వరలోనే సాధించే ప్రయత్నం చేస్తామనే భరోసా ఇవ్వడానికి కూడా ప్రయత్నం చేయకపోతే ఈ ప్రభుత్వాలకు, ఈ చట్ట సభలకు ఎంత పవిత్రత ఉందో అర్థమవుతున్న సందర్భంలో మిమ్మల్ని, మీ చట్ట సభలను ఎందుకు గౌరవించాలని మా యావత్ తెలంగాణ జాతి ప్రశ్నిస్తున్నది.

నాకు ఇంకా చాలా విషయాలు చెప్పాలని ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి గారి ప్రసంగం విన్న తర్వాత 75% కట్ చేసుకున్నాను. నేను గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నదేమిటంటే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ గురించి పెట్టిన తర్వాత, 10 సంవత్సరాలుగా మా చరిత్ర చూసిన తర్వాత ముఖ్యమంత్రిగా నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజానీకం ఆకాంక్షను నెరవేర్చడానికి మీకెందుకు చేతులు రావడం లేదని అడుగుతున్నాను.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః అధ్యక్షా, తెలంగాణ అంశం గురించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన నిర్ణయం తీసుకోలేదు. వారు కోరినట్లుగా తీర్మానం పెట్టినా ఇక్కడున్న సంఖ్యాబలం మేరకు ఇబ్బంది ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి అనుగుణంగా తీర్మానం చేయడం జరుగుతుంది కనుక దాని గురించి ఇక్కడ భూషించి ప్రయోజనం లేదు. తెలంగాణ అంశం గురించి మా పార్టీ శాసనసభ్యులు, ఎంపీలు కూడా పోరాడుతున్నారు కాబట్టి ఇక్కడ ఎక్కువ చర్చించాల్సిన అవసరం లేదని మీ ద్వారా వారికి తెలియజేస్తున్నాను.

శ్రీ టి. హరీశ్ రావు (మైకు లేకుండా)ః అధ్యక్షా, ఒక్క నిమిషం ...................

MR.SPEAKER: Harish Rao Garu, let him finish his speech.

శ్రీ టి. హరీశ్ రావు (మైకు లేకుండా)ః అధ్యక్షా, ఒకటే క్లారిఫికేషన్ చెబుతాను.

MR.SPEAKER: Harish Rao Garu, that will be the only clarification you will get from your party. Yes, Harish Rao Garu.

శ్రీ టి.హరీశ్ రావుః అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ తెలంగాణ అంశం గురించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఈ సభలోనే కదా రాజీనామాల డ్రామా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకునే విధంగా చేసింది ఈ సభనే కదా ముఖ్యమంత్రి గారూ. తెలంగాణ అంశం గురించి ఈ సభలో తీర్మానం పెడితే నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి గారు అన్నారు. నష్టం ఎందుకు జరుగుతుందండీ? పార్టీలు తాము ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాటకు కట్టుబడి ఉంటే నష్టం జరగదు. గతంలో కొత్తగా ఏర్పడిన ఉత్తరాంచల్, జార్ఖండ్ కొత్త రాష్ట్రాలుగా ఏర్పడినప్పుడు ఆయా రాష్ట్ర శాసనసభలలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం ద్వారా నిర్ణయం వేగంగా తీసుకోవడానికి అవకాశం లభించింది కాబట్టి మీరు మీ కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బందులు తొలగించాలనుకుంటే మీ కాంగ్రెస్ హైకమాండ్ మీద గౌరవం ఉంటే ఈ సభలో తీర్మానం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఒక నిర్ణయం తీసుకోవడానికి వెసులుబాటు కల్పించినవారవుతారు.

ఉ.12.40

శ్రీ టి.హరీష్ రావు: దయచేసి ముఖ్యమంత్రి గారిని నేను ఒకటే కోరుతున్నాను. ముఖ్యమంత్రి గారు అంటున్నదేమిటంటే ఈ సభలో తెలంగాణ అంశంపైన తీర్మానం పెడితే మీకు నష్టం జరుగుతుందనే విధంగా మాట్లాడుతున్నారు. కానీ, అలా ఎందుకు జరుగుతుంది సార్. పార్టీలు తమంతటతామే ఎన్నికల మ్యానిఫెస్టోలో ఏ మాటలైతే చెప్పాయో, ఆ మాట ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉంటే నష్టం జరగదు.

మిస్టర్ స్పీకర్: హరీష్ రావు గారు, ఒక నిమిషం అంటూ, ఇలా ప్రసంగం చేస్తే ఎట్లా? మీ పార్టీ తరఫున రాజేందర్ గారు మాట్లాడుతున్నారు కదా! దయచేసి మీరు కూర్చోండి.

శ్రీ టి.హరీష్ రావు: మరీ అన్యాయం సార్ ఇది. ఒక నిమిషం సమయం ఇవ్వండి. రాజకీయ పార్టీలు సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన మాటకు కట్టుబడి ఉంటే ఎటువంటి ఇబ్బంది జరగదు. గతంలో క్రొత్తగా ఏర్పడినటువంటి రాష్ట్రాలైన ఉత్తరాంచల్, జార్ఖండ్ రాష్ట్రాలు ఏర్పడినప్పుడే కనుక మన రాష్ట్రంలో కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో సభలో ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లైతే ప్రయోజనం ఉండేది. కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్రం ద్వారా ఉన్నటువంటి ఇబ్బందిని తొలగించాలనుకుంటే, యు.పి.ఏ. ప్రభుత్వ మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండాలంటే, మీ కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ మీద మీకు గౌరవం ఉంటే, ఈ సభలో మరొకసారి తీర్మానం చేసి, కేంద్రానికి పంపడం ద్వారా యు.పి.ఏ. ప్రభుత్వానికి అదే విధంగా మీ కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు గానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ఒక నిర్ణయం తీసుకోవడానికి అందరం కలిసి వెసులుబాటును కల్గించినటువంటి వాళ్లమవుతాం.

మిస్టర్ స్పీకర్: రాజేందర్ గారు, మీరు మాట్లాడండి.

శ్రీ టి.హరీష్ రావు: ఇది అన్యాయం సార్, ఒక నిమిషం టైమ్ ఇవ్వండి సార్, కంక్లూడ్ చేస్తాను.

MR.SPEAKER: I have accommodated you fairly. Please, don't say like that. రాజేందర్ గారు మాట్లాడండి. అవకాశం రాజేందర్ గారికి ఇచ్చాను. ఎందుకంటే అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనను సభలో ప్రవేశపెట్టారు కాబట్టి. దయచేసి కూర్చోండి హరీష్ రావు గారు. మాట్లాడండి రాజేందర్ గారు.

శ్రీ ఈటెల రాజేందర్: సార్, నేను మాట్లాడేటప్పుడు చాలా డిస్టర్బెన్స్ ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడేటప్పుడు మేం ఏమి డిస్టర్బ్ చేయలేదు.

శ్రీ గాదె వెంకట రెడ్డి: స్పీకర్ సార్.........

మిస్టర్ స్పీకర్: వెంకట రెడ్డి గారు, మీకు మాట్లాడే అవకాశం ఇస్తాను. రాజేందర్ గారు మాట్లాడుతున్నారు. ఆ తరువాత మీకు అవకాశం ఇస్తాను. దయచేసి కూర్చోండి. Right of reply అయిన తరువాత మీకు అవకాశం ఇస్తాను. దయచేసి సహకరించండి. Please sit down Venkata Reddy garu.

శ్రీ ఈటెల రాజేందర్: సార్, 1992వ సంవత్సరంలో మా పార్టీ పుట్టలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఆనాడు అధికారంలో ఉందని అనుకుంటున్నాను. బాధ్యత కల్గినటువంటి ఆనాటి తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులు మరియు శాసనసభ్యులు వ్రాసినటువంటి ఉత్తరం నేను చదివి వినిపించదలచాను. రెండు లైన్లు

మాత్రమే చదివి వినిపిస్తాను. ఆనాడు The Two men Agreement గానీ, 1969వ సంవత్సరం నాటి All Party agreement నందు గానీ, ముల్కీ రూల్స్ గానీ, Eight Point Formula గానీ, Five Point Formula గానీ అన్నింటినీ ఉదహరించుకుంటూ ఉన్నటువంటి ఉత్తరాన్ని చదివి వినిపిస్తాను. "But the safeguards and guarantees given to the people of the Telangana were consciously and deliberately violated by the Andhra Rulers, to the detriment of Telangana people". ఆ మాటలను చెప్పింది మేం కాదు, బాధ్యత కల్గినటువంటి కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు మరియు శాసనసభ్యులు. అదే ఉత్తరంలో మళ్లీ ఏం చెప్పారంటే, "in 1992, all the Ms.P., and Ms.L.A. elected from Telangana submitted memorandum to the Prime Minister with all details of violations and safeguards and injustice". ప్రస్తుతం నేను చదివిన డాక్యుమెంట్ 1992వ సంవత్సరానిది.

ఇంతకుముందే శ్రీ కె.కన్నబాబు గారు మీ పార్టీ తరఫున మాట్లాడుతూ ఒకమాట అన్నారు. ఏమిటంటే, మా పార్టీ పుట్టిన తరువాతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చిందని చెప్పారు. అందుకే నేను ఉత్తరం చదివి వినిపిస్తున్నాను. మా పార్టీ పుట్టకముందే, 1992వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ కొంత వరకు జరిగిందనే విషయాన్ని నేను ఉటంకిస్తున్నాను. మరొక ఉత్తరం కూడా చదివి వినిపిస్తాను. "We are therefore convinced and maintain of status quo will cause further unrest among the people. Past experience has shown the negligence and lapses in the implementation of safeguards". ఈ ఉత్తరంలో బాధ్యత కలిగిన తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులు మరియు శాసనసభ్యులు కలిసి సంతకాలు చేసినటువంటి ఉత్తరం ఇది. సంతకాలు చేసిన వాళ్లలో ప్రస్తుతం మంత్రి వర్గంలో కొనసాగుతున్న వారి పేర్లను కూడా చదువుతాను.

MR.SPEAKER: That is not correct. You don't have to read that. That is not a document of this House.

శ్రీ ఈటెల రాజేందర్: శ్రీమతి పి.సబితా ఇంద్రా రెడ్డి గారు, శ్రీమతి వి.సునీతా లక్ష్మారెడ్డి గారు, శ్రీ దానం నాగేందర్ గారు, శ్రీ పి.సుదర్శన్ రెడ్డి గారు.........

అధ్యక్షా, ఇదేమి సీక్రెట్ డాక్యుమెంట్ కాదు. బాజాప్తా 45 మంది బాధ్యత కల్గినటువంటి ప్రజాప్రతినిధులు కలిసి సంతకాలు చేసి ఆనాడు శ్రీమతి సోనియాగాంధీ గారికి సమర్పించినటువంటి ఉత్తరం ఇది. ఆనాడు సంతకాలు చేసినటువంటి వారిలో ప్రస్తుతం ఉన్నటువంటి మంత్రి వర్గ సహచరులు పది మంది దాక ఉన్నారు. మా బాధేమిటంటే, ఆనాడు మీరే వ్రాసి, సంతకాలు చేసినటువంటి ఉత్తరంలోని విషయంపై ఈనాడు ఎందుకు దాటవేసే దోరణిని, నాన్చివేసే దోరణిని అవలంభిస్తున్నారనేదే. ఇది కేవలం ఏ ఒక పార్టీకో సంబంధించిన అంశం కాదు. అన్ని పార్టీలకు సంబంధించిన అంశం. అన్నింటినీ ప్రక్కన పెట్టి నేను ఒకటే చెబుతాను. ఏమిటంటే, ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై మేం మా పార్టీ తరఫున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి కారణం ఏమిటంటే, మా ప్రాంత ప్రజానీకం అంతా కూడా మమ్మల్ని గుర్తించడం లేదు, మా మొర ఆలకించడం లేదు, మమ్మల్ని గుర్తించడం లేదు, మాకిచ్చిన హామీని నిలుపుకోవడం లేదు, అన్నిటికంటే మించి, మా ప్రాంత నిధుల్ని దోచుకుపోతున్నారు, మా ప్రాంత నీళ్లను దోచుకుపోతున్నారు, మా ప్రాంత ఉద్యోగాలను దోచుకుపోతున్నారు కాబట్టే ఈ రాష్ట్ర ప్రభుత్వం పైన విశ్వాసం లేదని మా తెలంగాణ ప్రాంత ప్రజానీకం భావిస్తున్నారు. అందుకే మా తెలంగాణ ప్రజానీకం పక్షాన ప్రభుత్వం పైన అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది.

అధ్యక్షా, అనేక మంది తెలంగాణ ప్రజలపైన, తెలంగాణ వాదాన్ని వినిపించేటటువంటి వారిపైన లాఠీచార్జీ జరిగింది ప్రస్తుతం కూడా జరుగుతున్నాయి. అక్రమంగా అనేక మంది తెలంగాణ బిడ్డల పైన కేసులు నమోదు చేసిందీ ప్రభుత్వం. ప్రభుత్వం అనేక మందిని జైళ్ల పాలు చేసింది. ఈ సభ సాక్షిగా మేమంతా ఎన్ని సార్లు మొత్తుకున్నా, ఎన్ని సార్లు నివేదించినా కూడా ఆ వివక్ష కొనసాగింది, అణిచివేత కొనసాగింది కాబట్టే ఆ అణిచివేతకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని ప్రభుత్వం చెప్పింది, కానీ, కేసులు ఎత్తివేసిన దాఖలాలు కనిపించడం లేదు. కేవలం తూతూ మంత్రంగా పర్సనల్ బాండ్ మీదనే కేసులను ప్రభుత్వం ఎత్తివేసింది తప్ప మాలాంటి వారిపైన పెట్టిన పెద్ద పెద్ద కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అటెంప్ట్ మర్డర్ కేసులు, రైళ్లు, వంతెనలు కూల్చివేస్తామన్నట్టుగా కేసులను అక్రమంగా మాపైన పెట్టడం జరిగింది. ఆ కేసులు ఎత్తివేయకుండా ఇప్పటికీ మమ్మల్ని అణిచివేస్తున్న కారణంగా ప్రభుత్వం పైన మేం అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడం జరిగింది.

అంతేకాదు, అనేక మంది కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఇప్పటికీ మా ఆత్మ గౌరవాన్ని కించపర్చే విధంగా మాట్లాడుతున్న సందర్భంగా మా గుండెలు పగిలి ఇవాళ వారి వెకిలి చేష్టలకు, ఆ వెకిలి మాటలకు వ్యతిరేకంగా మేం ప్రభుత్వం పైన అవిశ్వాస తీర్మానం పెట్టాం. కామన్ మినిమం ప్రోగ్రామ్‌లో తెలంగాణ అంశాన్ని పెట్టి ఇవాళ మోసం చేసినందుకు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అజెండాలో తెలంగాణ అంశాన్ని పెట్టి, నాయకులతో మాట్లాడించి మరొక సారి మోసం చేసినందుకు గాను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేం అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాం. అన్నిటికంటే ప్రధానమైన అంశం మరొకటి ఉంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయమై అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఉమ్మడిగా సకల జనుల సమ్మెలో పాల్గొంటే, అందుకు వారిని బాధ్యులుగా చేసి ఇప్పటి వరకు చేసిన ఆ సమ్మె కాలానికి జీతభత్యాలు చెల్లించకపోవడం ఈ ప్రభుత్వం చేస్తున్న నిర్వాకం. అణిచివేత దోరణిని ఈ ప్రభుత్వం ప్రదర్శిస్తోంది. అందుకే ఇవాళ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని తక్షణమే తేల్చకుండా నాన్చుడు దోరణిని అవలంభిస్తున్న కారణంగా ఈ ప్రభుత్వానికి పాలించే హక్కు ఏ మాత్రం లేదనేదే మా భావన కాబట్టి, ఇవాళ ప్రభుత్వం పైన అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది.

MR.SPEAKER: Leave it at that. That is enough. I have been very liberal and allowed very substantial time to you. రాజేందర్ గారు త్వరగా ముగించండి.

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, ఇవాళ సంక్షేమం గురించి కూడా ప్రభుత్వం మాట్లాడింది. ఆ అంశాలను నేను కూడా ప్రస్తావించదలచాను. ముఖ్యంగా విద్యుత్‌కు సంబంధించిన అంశం చర్చించే నిమిత్తం తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులం అంతా కలిసి ఒకసారి గౌరవ ముఖ్యమంత్రి గారి వద్దకు పోవడం జరిగింది. "అయ్యా, ముఖ్యమంత్రి గారు, ఆదినిష్టూరమే ఇంపార్టెంట్, వర్షా కాలంలోనే మనం అందరం కరెంటు కష్టాలను చూశాం, అవసరమైతే క్రాప్ హాలిడే ప్రకటిద్దాం, ఏమి నష్టం లేదనే విషయాన్ని" వారి దృష్టికి తీసుకుపోయాం. విద్యుత్‌ను ఒకేరోజు ప్రొడ్యూస్ చేయలేం కాబట్టి విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లాం. కేవలం రాజకీయమే కాదు కావల్సింది, వాస్తవిక పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలి కాబట్టి విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లాం. విద్యుత్ సరఫరా లేని కారణంగా రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని, పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందనే విషయాన్ని వారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. కరెంటు విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవం కాదు. ఒకే రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యుత్ సంస్థలు, సి.పి.డి.సి.ఎల్. గానీ, ఎన్.పి.డి.సి.ఎల్. గానీ, ఇ.పి.డి.సి.ఎల్.గానీ పనిచేస్తున్నాయి. నిజంగానే రాష్ట్రంలో కరెంట్ షార్టేజ్ ఉంటే, విశాఖపట్టణం జిల్లా రైతులకు, పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు ఏడు గంటల విద్యుత్ ఏ విధంగా అందుతోంది, అదే తెలంగాణ ప్రాంతంలో ఉన్నటువంటి ఎన్.పి.డి.సి.ఎల్. విద్యుత్ సరఫరా సంస్థ క్రింద ఉన్నటువంటి రైతులకు ఎందుకు ఐదు గంటలకు తక్కువగానే

కరెంటు సరఫరా అవుతుందనే విషయంలో ఒకసారి ప్రభుత్వాన్ని సమాధానం చెప్పమని మీరు చెప్పండి. పేరుకు మాత్రమే ప్రభుత్వం ఏడు గంటలు విద్యుత్‌ను ఇస్తోందని చెబుతోంది. ముఖ్యమంత్రి గారు కూడా అదే విషయాన్ని హైదరాబాద్‌లో మాట్లాడతారు. ఎ.పి.ట్రాన్స్‌కో సి.ఎం.డి. శ్రీ హీరాలాల్ సమారియా గారు కూడా అదే విషయాన్ని మాట్లాడతారు. మాట్లాడడమే గాకుండా విద్యుత్‌సౌధకు మేం పోయిన అనేకసార్లు లిఖితపూర్వకంగా కూడా అధికారులు ఇవ్వడం జరిగింది. కానీ, వారు చెప్పినట్టుగా, హామీ ఇచ్చినట్టుగా ఏనాడు కూడా తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి, రైతాంగానికి ఏడు గంటల కరెంటు సరఫరా చేయలేదు. ఇచ్చే ఆ ఐదు గంటల కరెంటు కూడా అష్టకష్టాలు పడి తెచ్చుకోవడం జరిగింది.

MR.SPEAKER: Rajender garu, leave it at that. No further clarification, Please sit down. In right to reply, you have given enough time. దయచేసి కూర్చోండి.

(అంతరాయం)

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా.........

మిస్టర్ స్పీకర్: రాజేందర్ గారు దయచేసి కూర్చోండి. గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడతారు. ముఖ్యమంత్రి గారు మాట్లాడండి.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి: సార్, ఎలక్ట్రిసిటీ సబ్జెక్ట్ పైన ఒక రోజు సపరేట్‌గా సభలో డిస్కషన్‌కు పెట్టుకుందాం. ప్రాధాన్యత కల్గిన సబ్జెక్టు కాబట్టి సభ్యులు మాట్లాడొచ్చు. ప్రభుత్వం కూడా సమాధానం చెబుతుంది. విద్యుత్‌కు సంబంధించిన అంశాన్ని అవిశ్వాస తీర్మానంలో ఒక భాగంగా కాకుండా ప్రత్యేకంగా ఒక రోజు సభలో చర్చిద్దాం. ఏమి ఇబ్బంది లేదు. చర్చలో అందరం పాల్గొందాం.

ఉ.12.50

శ్రీ ఈటెల రాజేందర్ : వ్యవసాయాన్ని గురించి ముఖ్యమంత్రిగారు అనేక గణాంకాలు చెప్పారు. కానీ ఈ నాటికి కూడా ఆశించిన స్థాయిలో రైతులు సంతోషంగా లేరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ నాటికీ కూడా రైతుల ఆత్మహత్యలు ఆగలేదు, మీరు వడ్డీలేని రుణాలివ్వచ్చుగాక, ప్రతి పంటకు ఎక్కడ కూడా గిట్టుబాటు ధర అమలు కాలేదు. మేము తప్పుడు గణాంకాలు చెప్పడం లేదు, ప్రజా క్షేత్రంలో తిరిగి చెబుతున్నాము. ఈ మధ్య కాలంలో పంటల కొరత ఉన్నందున కొంత మేరకు ధరలు పెరగొచ్చునేమో గానీ ప్రత్యేకించి నీలం తుఫాను ప్రభావిత ప్రాంతంలో ఆంధ్రా ప్రాంతానికి మాత్రం నష్ట పరిహారపు మొత్తాలు చెల్లించి వరంగల్ కమ్మం , కరీంనగర్ జిల్లాలకు చెందిన తుఫాను బాధితులకు ఇప్పటి వరకు చెల్లింపులు అందలేదు.

తెలంగాణా రైతాంగం విషయంలో ఎందుకు వివక్షత ఉందని నేను మీద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. 56 సంవత్సరాల చరిత్రలో హైకోర్టు అడ్వకేట్ జనరల్/పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తెలంగాణా ప్రాంతానికి చెందిన వారిని మొట్టమొదటి సారిగా ఇటీవలి కాలంలో నియమిస్తున్నారు, సంతోషదాయకమే ఐనా, ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, వ్యవసాయానికి సాగునీరు అందించుటకు 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామని అంటున్నారు. ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు 60 సంవత్సరాల క్రితం నిర్మించబడితే, ఆ స్థిరీకరణ కేవలం కరీంనగర్ జిల్లాకే పరిమితం అయ్యిందే తప్ప సెకండ్ ఫేస్(రెండవ దశ) కింద వరంగల్ ,నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఒక్క

ఎకరానికైనా నీరు అందలేదు. నీరందించినట్లు ఈ ప్రభుత్వం చెప్పే గణాంకాల్లో వాస్తవం ఏమాత్రం లేదని సభాముఖంగా తెలియపరుచుకుంటున్నాను.

దేవాదుల ప్రాజెక్టు కింద మూడు లక్షల ఎకరాలకు నీరందిస్తామన్నారు, మూడు లక్షలు కాదుకదా, ముప్పై ఎకరాలకైనా, నీరు అందించలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొని ఉంది. సంవత్సరానికి రెండు పంటలు పండించుకొని మూడవ పంట కూడా పండించుకోవాలనుకునే ఆంధ్రాప్రాంతం వారికి నీరిస్తారా, నీరులేక బోర్లు వేసుకొని బోర్లతో నీరందక, పంటలు ఎండిపోయి, రైతులు ఆత్మహత్య చేసుకుంటున్న తెలంగాణా ప్రాంత రైతాంగానికి నీరందిస్తారాని అడుగుతున్నాను. అటువంటి వారిపై కనికరం లేని ఈ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నాము .

అదే విధంగా ఈ రోజు తెలంగాణా వెనుకబాటు తనానికి కారణాలు నిరక్షరాశ్యతేనని తెలుసుకున్న తర్వాత కూడా, డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు తెలంగాణా ప్రాంతంలో ఏర్పాటుచేయడానికి ఎందుకు ప్రభుత్వం నిధుల కేటాయించడంలేదని ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ఈ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలతో సమానంగా విద్యాసంస్థలు ఎందుకు నెలకొల్పడంలేదంటున్నాను. మా తెలంగాణా ప్రాంతానికి న్యాయం జరగలేదని ప్రశ్నించి , ప్రశ్నించి, అలసి పోయి ఉన్నాము. తెలంగాణా ప్రాంత వాసులు భార్య పిల్లలను ఇక్కడే వదలి వేసి గల్ఫ్ దేశాలకు పొట్టకూటి కోసం, వలస పోతున్నారు. విధి వశాత్తు అచట మరణించిన వారి మృత దేహాలు కూడా ఇక్కడున్న వారి బంధువులకు చేరటం లేదు.

వారి పట్ల ఒక పద్ధతి ప్రకారం రూ.500/- కోట్లు కేటాయించి ఒక కమిటీ ఏర్పాటు చేయమని కోరగా, అది కూడా చేయనందుకు నిరసనగా, తెలంగాణా ప్రాంత బీడీ కార్మికులు కనీస వేతన చట్టానికి కూడా నోచుకోనందుకు నిరసనగా, తెలంగాణా ప్రాంతానికి ప్రాణ ప్రధాయిని అయినది ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు. అలాంటి ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు గర్భం లోనే, బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణం జరిపి దానిపై 12 ప్రాజెక్టులు నిర్మించుకొని సుమారు 64 టిఎంసీల నీరును దొంగిలించుకొని పోయే ప్రయత్నం చేస్తున్నారని ఆవిషయంపై ఈ ప్రభుత్వంతో వందల సార్లు మొరపెట్టుకున్నా ఆలకించ నందుకు నిరసనగా, ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకై సకల జనుల సమ్మెలో పాల్గొన్న ప్రభుత్వోద్యోగులకు జీతభత్యాలు ఇవ్వనందుకు, వారిపై నమోదైన కేసులు ఎత్తి వేయనందుకు, అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, గ్రామ కార్యదర్శులు, విఆర్ఓలు, వివిధ రకాల తాత్కాలిక ఉద్యోగులందరినీ శాశ్వత ప్రభుత్యోగులుగా గుర్తించ నందుకు, తెలంగాణా ప్రాంత విదార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలు పెంచనందుకు, హాస్టల్ విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించనందుకు, నిరసనగా ఈ రోజు అవిశ్వాస తీర్మానం పెడుతున్నాము.

ఉ.1.00

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలో, పొమ్మనలేక పొగపెట్టినట్లుగా దాదాపు 20 షరతులను పెట్టి డబ్బు తక్కువ వెచ్చించే ప్రయత్నం చేస్తున్నారు. షరతులు విధించి విద్యార్థులకు విద్యను దూరం చేసే పరిస్థితులను కల్పిస్తున్నారు. విద్య వికసించకుండా అణగారిన వర్గాల వారు, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడలేరు. వారికి కావలసింది తెల్ల బియ్యం కార్డో, ఆరోగ్యశ్రీ కార్డో కాదు, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడడానికి వారికి విద్య కావాలి. అలాంటి విద్యను అందించలేక పోతున్నందుకు నిరసన తెలుపుతున్నాం. దేశంలో నాలుగు రాష్ట్రాల్లో వ్యాట్ అమలులో ఉండగా దాన్ని తొలగించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇంకా వ్యాట్‌ను అమలు చేస్తున్నారు. అందుకు నిరసనగా వస్త్రవ్యారులు అర్థ నగ్నంగా ప్రదర్శనలు చేసినా ప్రభుత్వ

స్పందించకుండా నిర్లక్ష్య వైఖరిని అనుసరించినందుననే తెలంగాణా రాష్ట్ర సమితి ఈ రోజు అవిశ్వాస తీర్మానం పెడుతుంది.

## అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్

MR. SPEAKER: Now, the No-Confidence Motion given notice of Sri E. Rajender Garu, under Rule-75 of the Rules of Procedures and Conduct of Business of Andhra Pradesh Legislative Assembly is before the House.

Now, the question is:

"That the House expresses No-Confidence in the Council of Ministers"

SRI T. HARISH RAO: Sir, we insist for Division Vote.

MR. SPEAKER: Yes, we will decide the motion by Division Vote. I request all the Members to kindly resume their respective seats. Except those Members who have been exempted, I would like to ask rest of the Members to kindly occupy their their seats.

(On the instructions of Hon'ble the Speaker, immediately the Division Bells were rung by the Legislature Secretariat Officials for Three and Half Minutes, enabling the Members in the Corridors and Lobbies of the House to enter into the Chambers to take part in the Division Vote. Then the doors were closed and the physical count was taken by the Legislature Secretariat Officials.

When the vote for Neutrals was called for, Smt. Suman Rathode, Member from Telugu Desam Party, tried to be on her legs, which attracted the attention of the Hon'ble Speaker)

MR. SPEAKER: Suman Rathode Garu, kindly resume your seat. You are exempted from voting.

(The physical count information obtained was then passed on to the Hon'ble Speaker by the Secretary to Legislature)

**MR. SPEAKER: I am now going to announce the result of the Division Vote.**

| | | |
|---|---|---|
| **1) Ayes** | **-** | **58** |
| **2) Noes** | **-** | **142** |
| **3) Neutrals** | **-** | **64** |

**The motion was negatived and the No-Confidence Motion was lost.**

MR. SPEAKER: Now, the House is adjourned to meet again at 9-00 AM

today.

**(The House then adjourned at 1-39 AM on Saturday, the 16th of March 2010, to meet again at 9-00 AM on the same day)**